వ్యాస
మహాభారతం

(తెలుగు వచనం)

ద్రోణ పర్వం -2



డాక్టర్ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి

డాక్టర్ సూరం శ్రీనివాసులు

శ్రీ లలితా త్రిపుర సుందరీ ధార్మిక పరిషత్

విజయవాడ - 12.

వ్యాస
మహాభారతం

(తెలుగు వచనం)

ద్రోణ పర్వం - 2

డాక్టర్ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి
డాక్టర్ సూరం శ్రీనివాసులు

894.827781
రామ మహా

వ్యాస

మహాభారతం (తెలుగు వచనం)

ద్రోణ పర్వం - 2

ప్రథమ ముద్రణ : వినాయకచవితి (సెప్టెంబరు 2010)

20 సంపుటాల వెల : రూ. 720/-

C 27473
సుందరయ్య గ్రంథాలయ వ్యాసం
A C.No. 96361
గచ్చిబౌలి, హైదరాబాద్-500032

ప్రతులకు :
డాక్టర్ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి
శివాలయం వెనుక, **పోలకంపాడు,**
తాడేపల్లి పోస్టు, గుంటూరు జిల్లా - 522501,
ఫోన్ : 08645-272093, సెల్ : 9491727611

ప్రచురణ & ప్రతులకు :
శ్రీ లలితా త్రిపుర సుందరీ ధార్మిక పరిషత్
డోర్ నెం. 76-8/1-28, లలితానగర్,
భవానీపురం, విజయవాడ - 520 012.
ఫోన్ : 0866-2414322, సెల్ : 9440346287

క్రీ।శే। కరెడ్ల గోపాలకృష్ణమూర్తి గారి స్మృత్యర్థం

వారి ధర్మపత్ని కమలమ్మ

కుమారులు - కోడళ్లు :

వెంకట సీతారామశాస్త్రి - అనంతలక్ష్మి

సుందరశర్మ - లలితా రాజేశ్వరి, శ్రీనివాస్ - రోజామీనాక్షి

టైటిల్ ముద్రణకు సహకరించినవారు

శ్రీ కమ్ముల వెంకటేశ్వరరావు దంపతులు

శ్రీనివాస ఆఫ్‌సెట్ ప్రింటర్స్, విజయవాడ.



కీ॥శే॥ మోచర్ల రామకృష్ణ శర్మ గారు

వారి స్మృత్యర్థం

ట్రైటిల్ బోర్డు ఇచ్చినవారు

వారి ధర్మపత్ని వరలక్ష్మి

కుమారుడు :

పూర్ణ వెంకట రామశర్మ



కీ॥శే॥ కోడిదాసు సోమేశ్వరరావు

వారి స్మృత్యర్థం

ప్రింటింగ్ ఖర్చులు ఇచ్చినవారు

వారి ధర్మపత్ని సుభద్ర

కుమారులు - కోడళ్లు :

శ్రీయుతులు శ్రీనివాస్ - సౌభాగ్యలక్ష్మి

సత్యనారాయణ (చినబాబు) - యామినీలక్ష్మి

కుమార్తెలు :

భవాని, విశాలాక్షి

రచయిత :

డాక్టర్ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి,
వారి ధర్మపత్ని శ్రీమతి సీత

రచయిత :

డాక్టర్ సూరం శ్రీనివాసులు,

వారి ధర్మపత్ని శ్రీమతి సులోచన

ఎందరో మహానుభావులు

ద్రోణ పర్వం ఇలా సర్వాంగసుందరంగా సకల జనహితంగా తీర్చిదిద్దడానికి ప్రత్యక్షంగాను, పరోక్షంగాను మాకు సహకరించిన డాక్టర్ కాళ్లకూరి అన్నపూర్ణ, శ్రీ జన్నాభట్ల వీరేశ్వరశాస్త్రి, శ్రీ వెలంపల్లి దాశరథి, డాక్టర్ పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ గార్లకు మా హృదయపూర్వక కృతాజ్ఞతాంజలులు సమర్పిస్తున్నాము.

ఏ పనికైనా భగవంతుని ఆశీస్సులతో పాటు మానుషదైవముల సహాయ సహకారాలు కూడా అవసరమే. కొంతమంది అవ్యక్తముగా వెనక వుండి సత్ కార్యక్రమ నిర్వహణం చేయడంలో సిద్ధహస్తులై ఉంటారు. వారు భగవదాదేశాన్ని పాటిస్తున్నట్లు తమంత తామే దైవం మానుషరూపేణా అన్నట్లు వచ్చి అవ్యక్తముగా సహకరిస్తారు. అది అభిగమ్యకృతే దానం అన్నట్లుగా నిర్వహింపబడుతుంది. అటువంటి అవ్యక్త సుందరులు మా కరెడ్ల సుందరశర్మ గారు. వారు దీనివెనుక వెన్నెముకలా వుండి సర్వం తానే అయి వ్యవహరించారు. ఈ విషయంలో మేము వారికి కృతాజ్ఞతాబద్ధులమై నిలుస్తున్నాము. అటువంటి పెద్దల సహకారంతో **శ్రీ లలితా త్రిపుర సుందరీ ధార్మిక పరిషత్** ఏర్పడినది.

పంచమవేదమూ, సకలశాస్త్రసారమూ, భారతీయ సంస్కృతికి మూలకందమూ అయిన వ్యాసభారతం మొత్తం పద్దెనిమిది పర్వాలు యథాతథంగా, ఉన్నదిఉన్నట్లుగా సరళమైన తెలుగు వ్యావహారిక భాషలో సామాన్యపాఠకులకు కూడా అర్థమయ్యేటట్లు **తక్కువ వెలలో** అందించాలని మా సంకల్పం.

ఈ ఆశయాలతో భారతీయ తత్త్వానికి, ఆధ్యాత్మిక తత్త్వానికి, సాహిత్య వైభవానికి సంబంధించిన గ్రంథాలను ముద్రించి తక్కువ వెలలో ప్రజలకు అందివ్వాలని మా ఆకాంక్ష. దీనిని ఆదరించే అభిమానులందరు మా కృతజ్ఞతకు పాత్రులు. ఈ సంస్థ వివిధ పదవులలో పాలుపంచుకొంటున్న పెద్దలు...

1.	గౌరవాధ్యక్షులు	శ్రీ కరెడ్ల సుందరశర్మ
2.	అధ్యక్షులు	డా॥ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి
3.	ఉపాధ్యక్షులు	డా॥ సూరం శ్రీనివాసులు
4.	కార్యదర్శి	డా॥ పాలపర్తి శ్యామలానందప్రసాద్
5.	కోశాధికారి	డా॥ ధూళిపాళ రామకృష్ణ
6.	సహాయకార్యదర్శి	డా ఉపద్రష్ట వెంకట రమణమూర్తి
7.	కార్యవర్గసభ్యులు	శ్రీ యండూరి గోవిందరావు
8.	॥	శ్రీ మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి
9.	॥	శ్రీ జన్నాభట్ల వీరేశ్వరశాస్త్రి

వీటిని అందంగా డి.టి.పి. తయారుచేసిన బెవర వెంకటరమణ, ఎ.యస్.గ్రాఫిక్స్ వారికి మా కృతజ్ఞతాభివందనములు.

అందరికీ వందనాలు

కార్యదర్శి
శ్రీ లలితా త్రిపుర సుందరీ ధార్మిక పరిషత్

చదివి ముందుకు సాగండి

మనిషికి కోరికలు సహజాతాలు. కోరికలు తీర్చుకొనే ప్రయత్నం సహజాతం. కోరికలు తీరినా, తీరకున్నా ఏదో ఒక దశలో ఏదో ఒక కారణం వల్ల కోరికలు దూరం కావాలన్న ఆలోచనా సహజం. ఈ ప్రవృత్తిని అధ్యయనం చేసి, ఆనుపానులు గ్రహించి మహర్షులే మార్గదర్శనం చేశారో, వారి బోధనలు గ్రహించి మనిషే అలా మారాడో కానీ భారతీయులు ఆ ప్రవృత్తికి అద్భుతంగా స్పష్టంగా రూపకల్పన చేసికొన్నారు. ఆ ప్రవృత్తినే నాలుగుగా విభజించి పురుషార్థాలని పేరు పెట్టుకొన్నారు. అవే ధర్మ - అర్థ - కామ - మోక్షాలు. వాఙ్మయమంతా ఏదో ఒక కోణంలో ఈ అంశాలనే ప్రస్తావిస్తుంది, ప్రస్తుతిస్తుంది. వాటిలో తలమానికం, ఆ వాఙ్మయానికి మూలకందం శ్రీమహాభారతం. దానికి స్రష్ట, ద్రష్ట, కర్త అన్నీ వ్యాసమహర్షియే. పురుషార్థాలకు సంబంధించి భారతంలో ఉన్నదే మరెక్కడయినా ఉంటుందని, ఇక్కడ లేనిది మరెక్కడ ఉండదని ఘంటాపథంగా చెప్పగలిగాడు వ్యాసమహర్షి.

వేదశాస్త్రాలు దేవఋణం, పితృఋణం, ఋషిఋణ మని మూడు ఋణాలతో మనిషి జన్మిస్తాడని చెప్తే వ్యాసమహర్షి మనుమార్గంలో మనుష్యఋణాన్ని కూడా చెప్పారు. సామాజికదృష్టిలో ఇది చాలా అద్భుతమూ, ఆదరణీయమూ, ఆచరణీయమూ అయిన అంశం. ఆ మనుష్యఋణాన్ని తీర్చుకొనే మార్గంలో ఆనృశంస్యాన్ని (భూతదయ) ఉద్బోధించారు వ్యాసమహర్షి. ప్రాణులన్నింటిపై కరుణ చూపగలగటమే మనుష్య ఋణవిముక్తికి మార్గం. ఆ విలువను ప్రతిపాదించటానికి తనవారినే భీష్మ, ధర్మరాజు; ధృతరాష్ట్ర, దుర్యోధనులను ప్రతినిధులుగా స్వీకరించి భారతాన్ని నిర్మించాడు. తానూ ఆ మహానిర్మాణంలో పాత్ర అయి, తన వారిలోని గుణదోషాలనే హేతుబద్ధంగా ప్రస్తావిస్తూ మనిషి ఎలా ఉండాలో, ఎలా ఉండకూడదో **స్పష్టారుంధతీన్యాయంగా** భారతంలో ప్రదర్శించాడు వ్యాసమహర్షి. అన్నమాటకు ఒదిగి ఉండటంతో పాటు అమ్మమాటకు విలువనివ్వటాన్ని కూడా మానవజాతికి నేర్పాడు. దానికి ఇబ్బంది కలుగుతున్న స్థితిలో తానే స్వయంగా వచ్చి పరిష్కరించాడు (పాండవులందరూ ద్రౌపదిని పెళ్ళి చేసికొనే విషయంలో ద్రుపదుని ఒప్పించి). అమ్మమాటమేరకు తనకవసరం లేకున్నా బిడ్డలను కన్నాడు. తలచుకొంటే చాలు ప్రత్యక్షమవుతానని

అమ్మకు మాట ఇచ్చి దాన్ని నిలబెట్టుకొన్నాడు. మానవుడు సంపాదించవలసిన వాటిల్లో ధనం ముఖ్యం అనుకొంటాం. అంతకన్న ముఖ్యం తపస్సు. లోకకళ్యాణంకోసం ఆ తపస్సును కూడా ఖర్చుచేయటానికి వెనుదీయనివాడు వ్యాసుడు. అందుకే అందరికీ కనువిప్పు కల్గించటానికి భారతమ్మతవీరులను కూడా చూపించాడు.

మహాభారతం మానవజీవనగమనంలో కరదీపిక. ధర్మాధర్మనిర్ణయంలో ఒరపిడిరాయి. కర్తవ్యాకర్తవ్యజ్ఞానాన్ని ఉపదేశించడంలో ఒక ఉత్తమగురువు. నిరాశకు లోను కాకుండా మనిషి బ్రతకటానికి ఒక ఒరవడి. అదుపులేని, అలవిమాలిన ఆశలను తెంచుకోవటానికి ఒక కొడవలి. తనను తాను సజీవశిల్పంగా తీర్చిదిద్దుకొవటానికి ఒక ఉలి.

అయినా భాషకారణంగా దానిని ప్రేమించే వారు, సంశయించే వారు కూడా చాలామంది దానిని చదవలేకపోతున్నారు. అందుకే తెలుగు వారికి ఆ వ్యాసభావాలను యథాతథంగా అందించేందుకే ఈ ప్రయత్నం – వ్యాస మహాభారతం (తెలుగు వచనం).★

రామాయణ మహాభారతాలను ఆధ్యాత్మికవాదులు నెత్తికెత్తుకొని మోయటం ప్రారంభమైన తరువాత ఇవి ముసలివాళ్ళకు సంబంధించినవి అన్న భావం లోకంలో ప్రబలింది. ఇది దురదృష్టకరం. యౌవనంలోనే వీటిని చదువగలిగితే జీవితాన్ని సరిగా నడుపుకొనే జవజీవాలు గలుగుతాయి. సర్వమానవసౌభ్రాత్రం, సర్వప్రాణిసమత్వం మనస్సులో మెదిలి నిష్కల్మషంగా నడువగల ప్రవృత్తి కలుగుతుంది. ఇహలోకానికి ఇంతకంటే ఏం కావాలి...?

శ్రీవాణీగిరిజా శ్చిరాయ దధతో వక్షోముఖాబ్జేషు యే
లోకానాం స్థితి మావహన్త్యవిహతాం స్త్రీపుంసయోగోద్భవాం
తే వేదత్రయమూర్తయ స్త్రిపురుషా స్సంపూజితా వ స్సురై
ర్భూయాసుః పురుషోత్తమామ్బుజభవ శ్రీకన్దరా శ్శ్రేయసే

ఇట్లు
అనువక్తలు

★ మహాభారతం యథాతథంగా అనగా అధికపాఠాలతో సహా ఇచ్చాం. అధికపాఠాలు చిన్నసైజులో, బ్రాకెట్లలో ఇచ్చాం.

విషయసూచిక

అధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య
115.	జలసంధ వధ (61+1$\frac{1}{2}$)★	17
116.	దుర్యోధన కృతవర్మల పరాజయము. (46)	19
117.	సాత్యకి పరాక్రమము – ద్రోణపరాజయము (36)	21
118.	సాత్యకి సుదర్శనుని చంపుట. (18)	23
119.	యవన పరాజయము. (55)	24
120.	సాత్యకి దుర్యోధన యుద్ధము. దుర్యోధన పలాయనము. (47+1$\frac{1}{2}$)	26
121.	సాత్యకి ప్రవేశము – దుశ్శాసన పలాయనము (58+5)	29
122.	ద్రోణపరాక్రమము. (73+$\frac{1}{2}$)	32
123.	దుశ్శాసన పరాజయము (37)	35
124.	సంకుల యుద్ధము (47+2)	37
125.	ద్రోణపరాక్రమము (78+$\frac{1}{2}$)	39
126.	యుధిష్ఠిరుని చింత. (49+3)	43
127.	భీమసేన పరాక్రమము. (74)	46
128.	యుధిష్ఠిర హర్షము. (56)	50
129.	భీమకర్ణుల యుద్ధము – కర్ణపరాజయము (39+3$\frac{1}{2}$)	52
130.	దుర్యోధన యుద్ధము (44)	54
131.	భీమసేనుడు కర్ణుని ఓడించుట (58)	56
132.	కర్ణభీమసేనుల భీకర యుద్ధము (43+$\frac{1}{2}$)	59
133.	భీమ కర్ణ యుద్ధము – దుర్జయవధ (45)	61
134.	కర్ణభీమసేన యుద్ధము, దుర్ముఖవధ, కర్ణపలాయనము. (35)	64
135.	భీమసేనుడు దుర్మర్షణుడు మొదలైన ధార్తరాష్ట్రులను చంపుట. (40)	65
136.	కర్ణపలాయనము – భీముడు ఏడుగురు ధార్తరాష్ట్రులను చంపుట. (40)	67
137.	భీమకర్ణ యుద్ధము – ఏడుగురు ధార్తరాష్ట్రుల వధ. (53)	69
138.	భీమ కర్ణుల భీకర యుద్ధము (28$\frac{1}{2}$)	71
139.	భీమకర్ణ యుద్ధము – అర్జునుని ధాటికి కర్ణాశ్వత్థామల పలాయనము. (125+$\frac{1}{2}$)	72

★ బ్రాకెట్లలోని మొదటి సంఖ్య సంస్కృతంలో ఆ అధ్యాయంలోని శ్లోక సంఖ్య. రెండవ సంఖ్య ఆధికపాఠశ్లోక సంఖ్య

అధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య
140.	సాత్యకి అలంబుషుని వధించుట (25)	78
141.	సాత్యకి రాకతో అర్జునుడు చింతించుట (37)	80
142.	సాత్యకి భూరిశ్రవుల యుద్ధము (72+1$\frac{1}{2}$)	81
143.	అర్జున భూరిశ్రవుల సంవాదము - సాత్యకి భూరిశ్రవుని వధించుట. (72+8$\frac{1}{2}$)	84
144.	భూరిశ్రవుడు సాత్యకిని అవమానించుటకు కారణము చెప్పుట (29+3$\frac{1}{2}$)	88
145.	సంకుల యుద్ధము. (98)	90
146.	అర్జున పరాక్రమము - సైంధవవధ (144)	95
147.	అర్జున కృపాచార్య యుద్ధము - కర్ణసాత్యకి యుద్ధము. (92)	101
148.	అర్జునుని శ్రీకృష్ణుడు యుధిష్ఠిరుని దగ్గరకు కొనిపోవుట. (59+6)	106
149.	యుధిష్ఠిర హర్షము. (62)	109
150.	దుర్యోధనుడు బాధతో ద్రోణుని నిందించుట. (36)	112
151.	ద్రోణుని సమాధానము. (41)	114
152.	కర్ణదుర్యోధన సంభాషణము - మరల యుద్ధప్రారంభము. (36+4)	117
	6. ఘటోత్కచవధ పర్వము - 31	
153.	దుర్యోధనయుధిష్ఠిర సంగ్రామము - దుర్యోధన పరాజయము (44+7)	119
154.	రాత్రి యుద్ధములో పాండవసేనలు ద్రోణుని ఆక్రమించుట - ద్రోణుడు వారిని సంహరించుట. (41)	121
155.	భీముని పరాక్రమము. (46+1)	123
156.	సోమదత్త పరాజయము - పాండవసేన పరాజయము. (190)	126
157.	ద్రోణ యుధిష్ఠిరయుద్ధము (49)	135
158.	కృప కర్ణసంవాదము (70)	138
159.	దుర్యోధన వచనము (100)	141
160.	సంకులయుద్ధము. (60)	146
161.	భీమార్జునులపరాక్రమము - కౌరవసేనా పలాయనము. (19)	149
162.	రాత్రి యుద్ధము (55)	150
163.	కౌరవపాండవుల ప్రదీపప్రకాశము. (38)	152
164.	సంకులయుద్ధము (36)	155
165.	యుధిష్ఠిర పరాజయము (41)	157

అధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య
166.	దుర్యోధన పలాయనము (64)	159
167.	అలంబుష పరాభవము (50)	162
168.	శతానీకాది యుద్ధము. (47)	164
169.	నకులుడు శకునిని ఓడించుట - శిఖండి కృపుల యుద్ధము. (50)	167
170.	సంకులయుద్ధము. (70)	169
171.	సాత్యకిచే దుర్యోధనునికి, అర్జునునిచే శకుని ఉలూకులకు, ధృష్టద్యుమ్ననిచే కౌవరసేనకు ఓటమి. (54)	173
172.	రాత్రి సంకులసమరము భీమార్జునులు ఎదిరించుట. (41)	176
173.	కర్ణుడు ధృష్టద్యుమ్ను ఓడించుట. ఘటోత్కచుని యుద్ధమునకు పంపుట. (68+1)	178
174.	అలంబుష వధ. (45)	181
175.	ఘటోత్కచుని రథాదుల వర్ణన, కర్ణఘటోత్కచుల ఘోరయుద్ధము. (115)	184
176.	అలాయుధుడు యుద్ధభూమిలో ప్రవేశించుట, ఆతని రూప, రధాదుల వర్ణన. (22)	190
177.	భీమ అలాయుధయుద్ధం. (47+1)	191
178.	ఘటోత్కచుడు అలాయుధుని వధించుట. (40)	194
179.	కర్ణుడు శక్త్యాయుధముతో ఘటోత్కచుని వధించుట. (64)	196
180.	ఘటోత్కచవధ వల్ల పాండవ శోకం, శ్రీకృష్ణ హర్షము. (33)	201
181.	ధర్మద్రోహులయిన జరాసంధాదులవధ కారణము. (33)	202
182.	అర్జునుని మీద కర్ణుడు శక్తిని ప్రయోగించకపోవుటకు హేతువు. (47)	204
183.	ధృతరాష్ట్రుని పశ్చాత్తాపము, సంజయుని సమాధానము, యుధిష్ఠిరుని దుఃఖము, శ్రీకృష్ణవ్యాసులు నివారించుట. (67)	207

7. ద్రోణవధ పర్వము - 10

184.	ఇరుపక్షాల సైనికులు నిద్రించుట, చంద్రోదయము తరువాత మరల యుద్ధము చేయుట. (56)	211
185.	దుర్యోధనుని నింద - ద్రోణుని వ్యంగ్యోక్తి. ($37+\frac{1}{2}$)	214
186.	ద్రుపద విరాటాదుల వధ, ధృష్టద్యుమ్న ప్రతిజ్ఞ. (60)	216
187.	భీకరయుద్ధవర్ణన. నకులుని చేతిలో దుర్యోధన పరాజయము. (55)	219

అధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య
188.	దుఃశాసన సహదేవుల, కర్ణభీముల, ద్రోణార్జునుల ఘోరయుద్ధం. (54+2)	222
189.	దుర్యోధన సాత్యకి సంవాదము. కర్ణభీముల ఘోరయుద్ధము. అర్జునుని విజృంభణము. (66)	225
190.	ద్రోణధృష్టద్యుమ్నుల యుద్ధము – సాత్యకి శౌర్య ప్రశంస. (59+$\frac{1}{2}$)	229
191.	ద్రోణధృష్టద్యుమ్నుల యుద్ధము. సాత్యకి పరాక్రమము. (53)	233
192.	ద్రోణుని బ్రహ్మలోకగమనము. ధృష్టద్యుమ్నుడు ఆయన శిరస్సును ఖండించుట. (84)	236
	8. నారాయణాస్త్రమోక్ష పర్వము - 10	
193.	కౌరవ సేనాపతుల పలాయనము. అశ్వత్థామకు కృపాచార్యులు ద్రోణవధ వృత్తాంతము చెప్పుట. (70)	240
194.	సంజయుని ధృతరాష్ట్రుడు ప్రశ్నించుట. (15)	244
195.	రోషముతో అశ్వత్థామ నారాయణాస్త్రమును ప్రయోగించుట. (50)	245
196.	శత్రుసేనల సింహనాదము విని యుధిష్ఠిరుడు అర్జునుని ప్రశ్నించుట, అర్జునుడు అశ్వత్థామ కోప ఫలితము చెప్పుట. (53+1)	248
197.	భీముని రోష ప్రకటన, ధృష్టద్యుమ్నుడు స్వకృత్యమును సమర్థించుట. (44)	251
198.	సాత్యకి ధృష్టద్యుమ్నుల వాగ్యుద్ధము. కృష్ణాదులు అందరు కలిసి దానిని ఆపుట. (68)	254
199.	అశ్వత్థామ నారాయణాస్త్రప్రయోగము, దాని భీషణ విజృంభణము. (63+4 $\frac{1}{2}$)	258
200.	భీముని శ్రీకృష్ణుడు రథము మీది నుండి దించుట, నారాయణాస్త్రము ఉపశమించుట. (132)	262
201.	అశ్వత్థామ ఆగ్నేయాస్త్రముతో ఒక అక్షౌహిణి పాండవ సేనను సంహరించుట. వ్యాసుడు శివశ్రీకృష్ణుల మహిమను చెప్పుట. (100+2 $\frac{1}{2}$)	268
202.	వ్యాసమహర్షి శివమహిమ వర్ణించుట. ద్రోణపర్వశ్రవణ ఫలము. (158)	275

॥ శ్రీమాత్రే నమః ॥

వ్యాస
మహాభారతం
(తెలుగు వచనం)
ద్రోణ పర్వం - 2

115. జలసంధ వధ

సంజయుడిలా చెప్తున్నాడు. "రాజా! నీవు నన్ను అడిగిన విషయాన్ని సావధానంగా విను. కృతవర్మ పాండవసేనను తరిమితే వారు సిగ్గుతో తలదించుకొన్నారు. నీ వారు ఆనందించారు. రాజా! ఆ మహాసంగ్రామంలో సాత్యకి త్వరపడుతూ కృతవర్మ మీదకు వచ్చాడు. క్రోధంతో, అమర్షంతో కూడుకొని "సారధీ! కృతవర్మవైపు మన ఉత్తమ రథాన్ని నడిపించు" అని సారథితో అన్నాడు. సాత్యకి అలా అనగానే రథసారథి రెప్పపాటు కాలంలో కృతవర్మ దగ్గరకు తీసికొనిపోయాడు. కృతవర్మ తీవ్రకోపంతో, పదునైన బాణాలను సాత్యకిపై కురిపించాడు. దానితో సాత్యకికి కోపం వచ్చింది. సాత్యకి పదునైన భల్లాన్ని కృతవర్మ మీదకు విసిరి, మరల నాలుగు బాణాలను కృతవర్మపై ప్రయోగించాడు. ఆ బాణాలు కృతవర్మ గుర్రాలను చంపాయి. సాత్యకి భల్లంతో ధనుస్సును ఖండించాడు. పదునైన బాణాలతో పృష్ఠ రక్షకునీ, సారథినీ గాయపరిచాడు. సాత్యకి కృతవర్మను విరథుని చేసి, ఆతని సేనను వంగిన కణుపులు గల బాణాలతో పీడించాడు. సాత్యకి బాణాల తాకిడితో కృతవర్మ సైన్యం చెదరిపోయింది. తరువాత సాత్యకి వేగంగా ముందుకు పోయాడు. సాత్యకి ద్రోణసేన అనే మహాసముద్రాన్ని దాటి నీ సేనలో ప్రదర్శించిన పరాక్రమాన్ని విను. ఆ సాత్యకి కృతవర్మను ఓడించి, ఆనందించి, మెల్లగా "కంగారుపడకుండా పద" అని సారథితో అన్నాడు." సూతా! ద్రోణుని సేనకు కుడివైపుగా గొప్ప గజసేన మేఘసమూహంలా కనిపిస్తోంది గదా! రుక్మరథుడు దానిముందు నిలచియున్నాడు. వారిలో చాలామందిని రణభూమిలో నిరోధించటం కష్టం. దుర్యోధనుని మాట మేరకు నాతో పోరాడటానికి ప్రాణాలనైనా వీడగలవారు.

వీరిని ఓడించకుండా జయద్రథుని దగ్గరకు వెళ్ళటం కుదరదు. సూతా! నేను ఏ రీతిగానూ

అర్జునుని దగ్గరకు కూడా వెళ్ళలేను. సర్వవిద్యానిపుణులైన వీరు ఒక్కటిగా కలిసి నిలిచియున్నారు.

వీరంతా త్రిగర్తులలో గొప్పరథికులు. సారథీ! వీరంతా నావైపే చూస్తూ యుద్ధానికి సిద్ధమై ఉన్నారు. నన్ను అక్కడకు తీసికొనిపో, గుర్రాలను నడిపించు. ద్రోణుడు చూస్తుండగానే త్రిగర్తులతో పోరాడుతాను." రథసారథి రథాన్ని మెల్లగా ముందుకు నడిపాడు. శంఖవర్ణంగల గుర్రాలతో మీదకు వస్తున్న ఆ సాత్యకిని త్రిగర్తశూరులు తీక్ష్ణబాణాలను కురిపిస్తూ గజసేనతో అన్నివైపుల నుండి చుట్టుముట్టారు. సాత్యకి పదునైన బాణాలతో గజసేనతో పోరాడసాగాడు. సాత్యకి విడిచిన బాణాలు ఏనుగులను తాకాయి. వాటిచే హింసకు గురి అయిన ఆ ఏనుగులు రణభూమిని వీడి పరుగుపెట్టాయి. ఆ ఏనుగుల దంతాలు విరిగిపోయాయి. అవి నెత్తురోడుతున్నాయి. ఆ రీతిగా ఆ గజసమూహం నిహతం కాగా మహాబలుడైన జలసంధుడు సంసిద్ధుడై సాత్యకి రథంమీదకు తన ఏనుగును నడిపించాడు. ఏనుగుపై కూర్చొని స్వర్ణమయమైన తన చాపాన్ని ఝుళిపిస్తూ జలసంధుడు మెరుపుతో కూడిన మేఘంవలె ప్రకాశించాడు. వేగంగా మీదకువస్తున్న ఆ మాగధుని ఏనుగును సాత్యకి నివారించాడు. ఆపై క్రుద్ధుడైన ఆ జలసంధుడు బాణాలతో సాత్యకిని గాయపరిచాడు. ఆపై పదునైన మరొక భల్లంతో బాణాలు విడుస్తున్న సాత్యకి ధనుస్సును ఖండించాడు. భారతా! విల్లు విరుగగొట్టుకొన్న సాత్యకిని హేళన చేస్తూ ఆ మాగధవీరుడు జలసంధుడు అయిదు పదునైన బాణాలతో సాత్యకిని గాయపరిచాడు. సాత్యకి తనను జలసంధుడు అనేక బాణాలతో పీడించినా చలించలేదు. అది అద్భుతమనిపించింది. మరొకవింటిని చేతబట్టి "నిలు! నిలు!" అని అరిచాడు. అలా పలికి సాత్యకి నవ్వుతూ అరవై బాణాలతో జలసంధుని విశాలమైన రొమ్ముపై గాయపరిచాడు. జలసంధుని వింటిని తీక్ష్ణమైన క్షురప్రంతో మధ్యకు ఖండించాడు. మూడు బాణాలతో జలసంధుని గాయపరిచాడు. జలసంధుడు ఆ ధనుర్బాణాలను విడిచి, వెంటనే సాత్యకిపై తోమరాన్ని విసిరాడు. ఆ మహాసంగ్రామంలో ఆ భీకర తోమరం సాత్యకి ఎడమభుజాన్ని ఛేదించి, బుసకొడుతున్న పాములవలె నేలబడింది.

భుజం బ్రద్దలు కాగా సాత్యకి మూడు తీక్ష్ణబాణాలతో జలంధరుని కొట్టాడు. అప్పుడు జలసంధుడు కత్తిని, వృషభచర్మంతో తయారయి శతచంద్ర చిహ్నాలు గల డాలునూ చేతబట్టి, ఆ కత్తిని త్రిప్పి, సాత్యకి మీదకు విసిరాడు. ఆ కత్తి, సాత్యకి ధనుస్సును ఖండించి నేలపై బడింది. నేలగూలి ఆలాత (కొరివి) చక్రంవలె ప్రకాశించింది. అప్పుడు సాత్యకి మరొకవింటిని తీసికొన్నాడు. దానిని లాగి, కోపంతో బాణంతో జలసంధుని కొట్టాడు. ఆపై సాత్యకి రెండుక్షురాలతో ఆభరణాలతో సహా జలసంధుని రెండు బాహువులనూ నవ్వుతూ ఖండించాడు. ఆ తరువాత జలసంధుని పెద్దతలను, మరొక క్షురాన్ని ప్రయోగించి సాత్యకి ఖండించాడు. శిరస్సు, బాహువులు తెగిపోగా భయంకరంగా కనిపిస్తున్న ఆ

జలసంధుని మొండెం ఆ ఏనుగును నెత్తుటితో అభిషేకించింది. సాత్యకి బాణాల దెబ్బతిని, తనసేననే త్రొక్కుతూ, తీవ్రంగా ఆర్తనాదం చేసి ఆ మహాగజం పారిపోయింది. నీ సేనలో తీవ్రంగా హాహాకారం చెలరేగింది. నీ యోధులు యుద్ధవిముఖులై పారిపోసాగారు. ద్రోణుడు సాత్యకి మీదకు వచ్చాడు. రాజా! అప్పుడు రణభూమిలో సాత్యకితో, ద్రోణునకూ కౌరవులకూ దేవాసుర సంగ్రామంవలె ఘోరయుద్ధం ప్రారంభమైంది."

116. దుర్యోధన కృతవర్మల పరాజయము.

సంజయుడిలా చెప్తున్నాడు. "మహారాజా! దెబ్బతీయటంలో నేర్పుగల ఆ వీరులంతా సంసిద్ధులై బాణసమూహాలను కురిపిస్తూ త్వరపడుతూ సాత్యకితో పోరాడసాగారు. ద్రోణాచార్యుడు ఆ సాత్యకిని డెబ్భయిఏడు పదునైన బాణాలతో కొట్టాడు. దుర్మర్షణుడు పన్నెండింటితో, దుస్సహుడు పది బాణాలతో కొట్టారు. ఆలాగే వికర్ణుడు కూడా గ్రద్ద ఈకలు కలిగి వాడియైన ముప్పది బాణాలతో కుడిప్రక్కన, ఛాతీమీదా కొట్టాడు. దుర్ముఖుడు పది, దుశ్శాసనుడు ఎనిమిది, చిత్రసేనుడు రెండు బాణాలతో సాత్యకిని గాయపరిచారు. దుర్యోధనుడు మహాబాణవృష్టితో, ఇతర శూరులు, మహారథులు కూడా (యథాశక్తిగా) రణభూమిలో సాత్యకిని పీడించారు. మహారథులైన నీ కుమారులు అన్నివైపుల నుండి గాయపరచగా సాత్యకి సూటిగా వెళ్ళే బాణాలతో వారిని విడివిడిగా గాయపరిచాడు. ద్రోణుని మూడు బాణాలతో, దుస్సహుని తొమ్మిది బాణాలతో, వికర్ణుని ఇరవై అయిదు బాణాలతో, చిత్రసేనుని ఏడింటితో, దుర్మర్షణుని పండ్రెండింటితో, వివింశతిని ఎనిమిదింటితో, సత్యవ్రతుని తొమ్మిదింటితో, విజయుని పదిబాణాలతో గాయపరిచాడు.

ఆపై మహారథుడైన సాత్యకి బంగారు అంగదాలతో అలంకరింపబడిన తన ధనుస్సును రుళిపిస్తూ వేగంగా దుర్యోధనుని మీదకు వచ్చాడు. బాణాలతో దుర్యోధనుని తీవ్రంగా గాయపరిచాడు. అప్పుడు ఆ ఇద్దరూ పోరాడారు. ఆ మహారథులిద్దరూ తీక్ష్ణ శరాలను కురిపిస్తూ, ఒకరినొకరు కనిపించకుండా కప్పివేశారు. దుర్యోధనునిచే గాఢంగా గాయపడిన సాత్యకి ఎంతో శోభించాడు. చందన వృక్షం నుండి పాలు కారినట్లు ఎంతో నెత్తురు కారింది. సాత్యకి బాణ సమూహాలతో గాయపడిన నీ కొడుకు స్వర్ణకిరీటాన్ని ధరించిన ఉన్నతమైన యూపస్తంభంవలె ప్రకాశించాడు. రాజా! రణభూమిలో సాత్యకి మేటివిలుకాడైన సుయోధనుని ధనుస్సును ఒక క్షురప్రంతో నవ్వుతూ ఖండించాడు. ఆ తరువాత సాత్యకి ఆ సుయోధనుని శరీరంపై గ్రుచ్చుకొనేటట్లు అనేక బాణాలు విసిరాడు. శత్రువు శరీరాన్ని తూట్లు పొడవగా శత్రువుయొక్క విజయ లక్షణాన్ని దుర్యోధనుడు సహించలేకపోయాడు. ఆపై మరొక వింటిని తీసికొని, వేగంగా వంద బాణాలతో సాత్యకిని

గాయపరిచాడు. సాత్యకి అసహనానికి గురి అయి నీ కుమారుని పీడించాడు. రాజు బాధపడటాన్ని చూసి మహారథులైన నీ కుమారులు శరవృష్టితో సాత్యకిని కప్పివేశారు. వెంటనే సాత్యకి ఒక్కొక్కరిని అయిదు బాణాలతో, మరల ఏడు బాణాలతో గాయపరిచాడు.

వేగంగా దుర్యోధనుని ఎనిమిది బాణాలతో గాయపరిచి దుర్యోధన ధనుస్సును ఖండించాడు. మణిమయమైన నాగచిహ్నం గల ధ్వజాన్ని బాణాలతో పడగొట్టాడు. సాత్యకి నాలుగు పదునైన బాణాలతో నాలుగు గుర్రాలను చంపి, క్షురప్రంతో సారథిని పడగొట్టాడు. దుర్యోధనునిపై మర్మభేదకాలయిన అనేక బాణాలను ఉల్లాసంగా కురిపించాడు. సాత్యకి బాణాలచే బాధింపబడుతూ దుర్యోధనుడు రణభూమిలో వేగంగా పారిపోయి విలుకాడైన చిత్రసేనుని రథంమీదకు ఎక్కాడు. సాత్యకి దుర్యోధనుని కబళిస్తుండగా రాజు పరిస్థితిని చూసి, నీ సేనలో తీవ్ర హాహాకారాలు రేగాయి. అప్పుడు ఆ శబ్దాన్ని విని, మేటి వింటిని ఝుళిపిస్తూ, గుర్రాలను అదిలిస్తూ, పద! త్వరగా పద! అని సారథిని త్వరపెడుతూ కృతవర్మ వచ్చాడు. నోరుతెరిచిన మృత్యువు వలె మీదకు వస్తున్న కృతవర్మను చూసి సాత్యకి సారథితో ఇలా అన్నాడు. 'ఈ కృతవర్మ బాణాలు పట్టి వేగంగా ఇటే వస్తున్నాడు. సర్వధానుష్కులలో శ్రేష్ఠుడైన ఇతనికి ఎదురు పద.' ఆపై సాత్యకి వేగశాలులయిన గుర్రాలను పూన్చి, యథావిధిగా సిద్ధం చేయబడ్డ రథంతో విలుకాండ్రకు ఆదర్శప్రాయుడైన భోజుని రణభూమిలో సమీపించాడు. అప్పుడు ఆ నరోత్తము లిద్దరూ వేగశీలంగల పులులవలె కలబడ్డారు. కృతవర్మ తీక్ష్ణమై, పదును గల ఇరవై ఆరు బాణాలతో సాత్యకిని హింసించాడు. అతని రథసారథిని అయిదు బాణాలతో గాయపరిచాడు. ఆపై నాలుగు గొప్ప బాణాలను ప్రయోగించి, సాత్యకి రథాశ్వాలను నాలుగింటిని గాయపరిచాడు. రుక్మరథుడైన కృతవర్మ బంగారు అంగదాలు, బంగారు కవచం ధరించినవాడు. బంగారు వెన్నుగల తన పెద్దవింటిని లాగి, బంగారు రెక్కలు గల బాణాలతో సాత్యకిని నివారించాడు. ఆ తరువాత సాత్యకి అర్జునుని చూడాలన్న తహతహతో వేగంగా కృతవర్మపై ఎనభై బాణాలను ప్రయోగించాడు. కృతవర్మ సాత్యకిచే తీవ్రంగా గాయపడి, భూకంపం వచ్చినప్పుడు చలించే పర్వతంవలె వణికాడు.

సాత్యకి అరవైమూడు బాణాలతో నాలుగు గుర్రాలను, ఏడు పదునైన బాణాలతో కృతవర్మ రథ సారథిని వేగంగా గాయపరిచాడు. ఆపై సాత్యకి బంగారు రెక్కలు గల బాణాన్ని సంధించి, కృతవర్మపైకి విసిరాడు. అది మహా జ్వాలలతో కోపించిన పాములవలె ఉన్నది. యమదండం వలె భీకరమైన ఆ బాణం కృతవర్మను గాయపరిచింది. కవచాన్ని ఛేదించి, నెత్తుటితో తడిసి, నేలలో గ్రుచ్చుకొన్నది. కృతవర్మ సాత్యకి బాణాల పీడనకు గురి అయి నెత్తురోడుతూ, ధనుర్బాణాలను వీడి తన శ్రేష్ఠరథం మీద పడిపోయాడు.

సింహందంతాల వంటి దంతాలు గలవాడు కృతవర్మ. అమిత పరాక్రమశాలి, నరశ్రేష్ఠుడు (అయిన) ఆ కృతవర్మ సాత్యకి బాణాల పీడనతో మోకాళ్ళతో రథాసనంపై కూర్చున్నాడు. కార్తవీర్యునివలె (సహస్రబాహువు) దుర్జయుడు, సముద్రంవలె అక్షోభ్యుడు (క్షోభింపజేయలేనివాడు) అయిన కృతవర్మను అలా నివారించి, సాత్యకి అక్కడ నుండి వెళ్ళిపోయాడు. ఇంద్రుడు రాక్షససేనను అతిక్రమించి వెళ్ళినట్లు సాత్యకి సర్వసేనలు చూస్తుండగానే వాటిమధ్య నుండి దారి చేసికొని వెళ్ళాడు. ఆ సేనలో వందలకొలది క్షత్రియశ్రేష్ఠులు నెత్తురు కారుస్తున్నారు. భీకరంగా కనిపిస్తున్నారు. అక్కడ కత్తులు, శక్తులు, విండ్లు వ్యాపించి ఉన్నాయి. ఏనుగులు, గుర్రాలు, రథాలు గుంపులుగా కలిసిపోయి ఉన్నాయి. బలశాలి అయిన కృతవర్మ ఊరట చెంది, మరొక మహాధనుస్సును స్వీకరించి, రణభూమిలో పాండవులను నివారిస్తూ అక్కడే నిలిచాడు."

117. సాత్యకి పరాక్రమము - ద్రోణపరాజయము

సంజయుడిలా చెప్తున్నాడు. "సాత్యకి సేనలను సంహరిస్తున్న అన్ని తావులకు ద్రోణుడు వెళ్ళి మహాశర సమూహాలను అతనిపై కురిపించసాగాడు. సర్వసేనలు చూస్తుండగా ద్రోణసాత్యకుల మధ్య పోరు భీకరంగా ఉంది. ఆపై ద్రోణుడు మూడు విచిత్ర బాణాలతో సాత్యకి నుదుట గాయం చేశాడు. సరళంగా సాగే ఆ మూడు బాణాలు తన నుదుట గ్రుచ్చుకోవటంలో సాత్యకి మూడు శిఖరాలు గల పర్వతం వలె రాజిల్లాడు. ఆపై ద్రోణుడు అవకాశం చూసికొని ఇంద్రుని వజ్రాయుధం వలె ధ్వనిస్తున్న వేరే బాణాలను సాత్యకిపై ప్రయోగించాడు. సాత్యకి ద్రోణుని వింటినుండి వెలువడి మీదకు వస్తున్న ఆ బాణాలను మంచి రెక్కలు గల రెండు, రెండు బాణాలతో ఖండించాడు. రాజా! ద్రోణుడు ఆ సాత్యకి లాఘవాన్ని గమనించి, చిరునవ్వు నవ్వి, వెంటనే ముప్పయి బాణాలతో సాత్యకిని గాయపరిచాడు. మరల తన నేర్పుతో, సాత్యకి నైపుణ్యాన్ని తక్కువ జేస్తూ ఏబయి పదునైన బాణాలతో సాత్యకిని పీడించాడు. రాజా! ద్రోణ రథం నుండి శరీరాన్ని చీల్చగల బాణాలు వెలువడుతున్నాయి. అదే రీతిగా సాత్యకి విడిచిన వందల వేల బాణాలు, రక్తాన్ని ఆస్వాదిస్తూ ద్రోణుని రథంపై కురుస్తున్నాయి. ద్రోణునిలో, సాత్యకిలో ఉన్న నైపుణ్యం వలన ఆ ఇద్దరి మధ్య తేడా తెలియటం లేదు.

ఆపై సాత్యకి తొమ్మిది పదునైన బాణాలతో ద్రోణుని, ఆయన ధ్వజాన్ని కొట్టాడు. ద్రోణుడు చూస్తుండగానే సారథిని వంద బాణాలతో కొట్టాడు. ద్రోణుడు సాత్యకి నైపుణ్యాన్ని చూసి, డెబ్భయి బాణాలతో అతని రథసారథిని గాయపరిచి, మూడు

మూడు బాణాలతో గుర్రాలను, ఒక బాణంతో సాత్యకి రథంపై నున్న ధ్వజాన్ని కొట్టాడు. ఆ తరువాత ఒక భల్లంతో సాత్యకి వింటిని ఖండించాడు. దానికి కోపించిన సాత్యకి వింటిని విడిచి, గదను చేబట్టి, ద్రోణునిపైకి విసిరాడు. ఆ లోహగద వేగంగా మీదకు వస్తుంటే, ద్రోణుడు అనేక రూపాలు గల అనేక బాణాలతో దానిని నివారించాడు. ఆపై సత్యవిక్రముడైన సాత్యకి మరొకధనస్సు చేతబట్టి, సానబెట్టిన అనేక బాణాలతో ద్రోణుని గాయపరిచాడు. ఆ రీతిగా ద్రోణుని గాయపరిచి, సాత్యకి సింహనాదం చేశాడు. సర్వశస్త్రధారులలో శ్రేష్ముడైన ద్రోణుడు దానిని సహించలేకపోయాడు. లోహశక్తిని తీసి, వేగంగా సాత్యకి రథం మీదకు విసిరాడు. మృత్యువు వంటి ఆ శక్తి సాత్యకి దగ్గరకు చేరకుండా రథాన్ని ఛేదించి, భీకరశబ్దం చేస్తూ నేలపై బడింది. సాత్యకి రెక్కలు గల బాణంతో ద్రోణుని కుడిభుజాన్ని పీడిస్తూ, ఆయనను గాయపరిచాడు. రాజా! ద్రోణుడు రణభూమిలో సాత్యకి విశాలధనస్సును అర్ధచంద్ర బాణంతో ఖండించాడు. రథశక్తితో సారథిని గాయపరిచాడు. ఆ రథశక్తి దెబ్బతిని సాత్యకి సారథి మోహానికి గురి అయ్యాడు.

రథాసనాన్ని సమీపించి ముహూర్తకాలం అక్కడే కూర్చున్నాడు. రాజా! సాత్యకి లోకోత్తరమైన రీతిగా ద్రోణాచార్యునితో యుద్ధం చేస్తూనే, స్వయంగా పగ్గాలు పట్టి, వంద బాణాలతో ద్రోణుని గాయపరిచాడు. అతనిపై ద్రోణుడు అయిదు బాణాలు ప్రయోగించాడు. అవి భీకరంగా సాత్యకి కవచాన్ని చీల్చి, నెత్తురు త్రాగాయి. భీకర బాణాలతో గాయపడిన సాత్యకి తీవ్ర కోపంతో రుక్మరథుని రథంమీదకు బాణాలు విడిచాడు. ఆపై ద్రోణుని రథసారథిని ఒక బాణంతో నేలకు పడగొట్టి, సారథిలేని ఆ గుర్రాలను బాణాలువేసి, పరుగెత్తించాడు. ఆ రథం రణభూమిలో పరుగెత్తుతూ వేలకొలదిగ చుట్లు తిరిగింది. ప్రజ్వలించే సూర్యునివలె ప్రకాశించింది. "పరుగెత్తండి. ఉరకండి. ద్రోణుని గుర్రాలను పట్టుకోండి" అంటూ రాజులు. రాజకుమారులు అందరూ అరవసాగారు. ఆ మహారథులు రణభూమిలో సాత్యకిని వీడి, ద్రోణుడున్న వైపుకు వేగంగా పరుగెత్తారు. సాత్యకి బాణాల దెబ్బతిని, గాలిలా ఉరుకులు పరుగులు పెడుతున్న ఆ గుర్రాలు ద్రోణుని మరల వ్యూహద్వారం దగ్గరకే తీసికొని పోయి, నిలిపాయి. ద్రోణుడు పాండు పాంచాలసేనలచే భంగపరచబడిన వ్యూహాన్ని చూసి, సాత్యకిని వెన్నాడే ప్రయత్నాన్ని విరమించాడు. వ్యూహరక్షణలోనే నిమగ్నమయ్యాడు. ద్రోణు డనే అగ్ని క్రోధమనే సమిధలతో మండుతూ, పాండు పాంచాలసేనలను నివారించి, ఉదయించిన ప్రళయకాల సూర్యునివలె నిలిచింది."

118. సాత్యకి సుదర్శనుని చంపుట.

సంజయుడిలా చెప్తున్నాడు. "కురుశ్రేష్ఠా ! ద్రోణుని, కృతవర్మ మొదలైన నీవారిని జయించి, సాత్యకి ఒక నవ్వు నవ్వి సూతునితో ఇలా అన్నాడు. 'సూతా! మనం నిమిత్తమాత్రులం. శత్రువులను చంపినది కృష్ణార్జునులే. అర్జునుడు చంపినవారినే తిరిగి మనం చంపాం.' అప్పుడు సారథితో అలా పలికి సాత్యకి అంతటా బాణాలను కురిపిస్తూ డేగ మాంసంమీద పడ్డట్టు వేగంగా సేనపై పడ్డాడు. సాత్యకి శశిశంఖవర్ణంగల గుర్రాలతో సేనలోనికి చొచ్చుకొని రావటాన్ని చూసి, నీవారు అందరూ కలిసి కూడా నివారించలేకపోయారు. సుదర్శనుడు బలపూర్వకంగా సాత్యకిని నివారించాడు. వారిద్దరి మధ్య దారుణయుద్ధం జరిగింది. నీ యోధులూ, సోమకులూ ఆ యుద్ధాన్ని ప్రశంసించారు. సుదర్శనుడు బాగా తీక్ష్ణమైన వందల బాణాలతో సాత్యకిని గాయపరిచాడు. ఆ బాణాలు తన దగ్గరకు రాకముందే సాత్యకి వాటిని ఖండించాడు. అలాగే దేవేంద్ర సమానుడైన సాత్యకి సుదర్శనునిపై ప్రయోగిస్తున్న బాణాలను, సుదర్శనుడు రెండుమూడు ముక్కలుగా చేశాడు. సాత్యకి బాణవేగాలతో తన బాణాలు నిర్వీర్యమై పోవటం చూసి సుదర్శనుడు కోపంతో దగ్ధం చేస్తున్న అగ్నివలె బాణాలను వదలాడు. మరల మంచి రెక్కలు గల పదునైన, అగ్ని సమానమైన మూడు బాణాలను చెవిదాకా లాగి, సాత్యకిని గాయపరిచాడు. అవి సాత్యకి కవచాన్ని ఖండించి, వేగంగా శరీరంలో గ్రుచ్చుకొన్నాయి.

అలాగే రాజకుమారుడైన సుదర్శనుడు ప్రజ్వలిస్తున్న మరో నాలుగు బాణాలను సంధించి, నాలుగు గుర్రాలను గట్టిగా కొట్టాడు. సాత్యకి బాగా తీక్ష్ణమైన బాణ సమూహాలతో సుదర్శనుని గుర్రాలను చంపి, సింహనాదం చేశాడు. భల్లంతో సుదర్శనుని సూతుని తలను ఖండించి, ప్రళయకాలాగ్ని వంటి మరొక భల్లంతో కుండలాలతో పూర్ణచంద్రునివలె వెలుగొందుతున్న సుదర్శనుని తలను శరీరం నుండి ఖండించాడు. ఆ సుదర్శనుని చంపి, సాత్యకి పరమానందంతో ప్రకాశించాడు. సాత్యకి లోకాన్ని ఆశ్చర్యచకితం చేయదలచి, బాణ సమూహాలతో నీ సేనను నివారించి, మేలు గుర్రాలు గల తన రథంపై అర్జునుడు వెళ్ళిన బాటలోనే బయలుదేరాడు. బాణాలకంటికి కనిపించిన శత్రువులను అగ్నివలె దహించిన ఆ సాత్యకి యొక్క ఆశ్చర్యకరమైన పరాక్రమాన్ని యోధవరు లందరూ ప్రస్తుతించారు."

119. యవన పరాజయము.

సంజయుడిలా చెప్తున్నాడు. "సాత్యకి రణభూమిలో సుదర్శనుని చంపి, సారథితో మరలా ఇలా అన్నాడు. "నాయనా! ద్రోణుని సేన సముద్రం వంటిది. యోధులకు దానిని తాకటం కూడా కష్టమే ! జలసంధుని సేన రాక్షసులవలె దానిని చుట్టుముట్టింది. దానినిప్పుడు మనం దాటాం. ఇక మిగిలినసేన చిన్న నదివంటి దనుకొంటున్నాను. నీళ్ళు తక్కువ. దాటటం తేలిక. ఇక నిర్భయంగా గుర్రాలను నడిపించు. దుర్ధర్షవీరుడైన ద్రోణుని ఓడించిన తరువాత ఇప్పుడు అర్జునుడు మన దగ్గరకు వచ్చినట్లే భావిస్తున్నాను. యోధశ్రేష్ఠుడైన హార్దిక్యుని కూడా ఓడించిన తరువాత అర్జునుడు మనకు దగ్గరైనట్లే అనుకొంటున్నాను. ఎంత సైన్యాన్ని చూసినా నాకు భయం కలగటం లేదు. అరణ్యంలో ఎండుగడ్డిని తగులబెడుతూ ప్రజ్వరిల్లే అగ్నివలె నేను నిశ్చింతగా ఉన్నాను. అర్జునుడు కడచివెళ్ళిన దారిని చూడు. పడిపోయిన కాల్బలం, గుర్రాలు, రథాలు, ఏనుగుల సమూహాలతో విషమంగా ఉంది. సారథీ! ఆ మహాత్ముడు చెదరగొట్టగా సేన అటు - ఇటూ పరుగెత్తింది. పరుగెత్తుతున్న రథాలు, ఏనుగులు, గుర్రాలు రేగగొట్టిన దుమ్మును చూడు. ఎర్రని కాంతివలె వ్యాపించి ఉంది. మహాతేజస్సు గల గాండీవశబ్దం వినిపిస్తోంది. కృష్ణసారథి అయిన అర్జునుడు దగ్గరలోనే ఉన్నాడని భావిస్తున్నా. ఇప్పుడు నా ఎదుట కనిపిస్తున్న ఈ కారణాలను చూస్తుంటే సూర్యుడు అస్తమించేలోగా అర్జునుడు సైంధవుని తప్పక చంపగలడు అనిపిస్తోంది.

మెల్లమెల్లగా గుర్రాలకు సేదదీరే అవకాశమిస్తూ, చేతితొడుగులు ధరించిన సుయోధనాది శత్రుసేనలున్న చోటికి పద. యుద్ధదుర్మదులై క్రూరకర్ములయిన కాంబోజులు కవచాలు ధరించిఉన్నారు. దెబ్బతీయగల యవనులు ధనుర్బాణాలు ధరించిఉన్నారు. శకులు, కిరాతులు, దరదులు, బర్బరులు, తామ్రలిప్తులు - ఇతర మ్లేచ్ఛులు ఎందరో వివిధాయుధాలను చేతబట్టిఉన్నారు. వీరంతా చేతితొడుగులు ధరించి, సుయోధనుని ముందు నిలుపుకొని యుద్ధాభిలాషులై నాకోసం ఎదురు చూస్తున్నారు. వారున్న చోటికి పద. రథాలు, ఏనుగులు, గుర్రాలు, కాల్బలంతో పాటు వీరినందరినీ చంపి, మహాఘోరమైన ఈ దుర్గమస్థితి నుండి బయటపడినట్లే భావించు." సూతుడిలా అన్నాడు! "వార్ష్ణేయా! సత్యవిక్రమా! కోపించిన పరశురాముడే నీ ఎదుట నిలిచినా నాకు తడబాటు లేదు. ద్రోణుడు, కృపుడు, శల్యుడు నీ ఎదుట నిలిచినా నిన్ను ఆశ్రయించి, ఉన్న నాకు తడబాటులేదు. శత్రుసూదనా! నీవు ఇంతకుముందే ఎందరినో యుద్ధంలో జయించావు. యుద్ధదుర్మదులై, క్రూరకర్ములై కవచాలు ధరించి, నిలిచిన కాంబోజులను, దెబ్బతీసే

స్వభావం గల యవనులను, శకులను, కిరాతులను, దరదులను, బర్బరులను, తామ్రలిప్తకులను, వివిధాయుధాలు ధరించి నిలిచిన ఇతర మ్లేచ్ఛులను ఎందరినో ఓడించావు. అప్పుడెప్పుడూ నాకు సంభ్రమం కలుగలేదు. ఇక ఈ రణభూమి ఎంత? గోష్పదమంత! ఇక భయపడే దేముంది? చిరంజీవీ! ఇప్పుడు ఏదారిలో అర్జునుని దగ్గరకు వెళ్ళాలో చెప్పు. వార్ష్ణేయా! ఎవరిపై కోపించావు? ఎవరికి చావు మూడింది ? ఎవరి మనస్సులు ఈరోజు యమపురికి వెళ్ళటానికి సిద్ధపడుతున్నాయి ? రణభూమిలో కాలునివలె, విక్రమసంపదతో పరాక్రమిస్తున్న నిన్ను చూసి ఈరోజు ఎవరు పారిపోవలసియుంది ? యముడు ఈనాడు ఎవరిని తలచుకొంటున్నాడు ?"

సాత్యకి ఇలా అన్నాడు. "తలలు గొరిగించుకొన్న ఈ కాంబోజులను చంపుతాను. ప్రతిజ్ఞను పూర్తి చేసికొంటాను. నన్ను వారిదగ్గరకే నడిపించు. నేడు వీరితో యుద్ధం చేసి, అర్జునుని దగ్గరకు వెళ్తాను. నేడు దుర్యోధనునితో సహా కౌరవులందరూ నా పరాక్రమాన్ని చూస్తారు. సూతా! ముండితమైన ఆ సేన నశించి, ఇతర సేనలన్నీ పదేపదే వినాశానికి గురి అయితే, రణభూమిలో ఛిన్నాభిన్నమైన కౌరవసేన చేసే ఆర్తనాదాలను విని, సుయోధనుడు అనేక విధాలుగా విలపిస్తాడు. నేడు రణభూమిలో నాకు గురువు అయిన అర్జునుని మార్గాన్ని ప్రదర్శిస్తాను. ఈరోజు వేలకొలది ప్రముఖయోధులు నా బాణాలదెబ్బకు చస్తుంటే చూసి, దుర్యోధన నరపాలుడు పశ్చాత్తాపాన్ని పొందుతాడు. నేడు వేగంగా గొప్పగొప్ప బాణాలను ప్రయోగిస్తుంటే కొరివి చక్రంలా కనిపించే నా ధనుస్సును కౌరవులు చూస్తారు. నా బాణాలు శరీరమంతా గ్రుచ్చుకొని అదే పనిగా నెత్తురోడుతున్న సైనికుల మరణాన్ని చూసి, సుయోధనుడు సంతాపాన్ని పొందుతాడు. నేడు నేను కోపరూపాన్ని ధరించి గొప్ప గొప్ప వారిని చంపుతుంటే చూసి, సుయోధనుడు లోకంలో ఇద్దరు అర్జును లున్నారని భావిస్తాడు. ఈ మహాసంగ్రామంలో వేలకొలది రాజులను నేను చంపగా చూసి, దుర్యోధనుడు రణభూమిలోనే పరితపిస్తాడు. నేడు వేలకొలది రాజులను చంపి, మహాత్ములైన పాండవులపై నాకున్న భక్తినీ, స్నేహాన్నీ ప్రదర్శిస్తాను. కౌరవులు నా బలాన్నీ, పరాక్రమాన్నీ, కృతజ్ఞతను తెలిసికొంటారు.

సంజయుడిలా చెప్తున్నాడు. "సాత్యకి అలా చెప్పగానే సూతుడు గుర్రాలను త్వరత్వరగా నడిపించాడు. మనోవేగంతో ఆ గుర్రాలు ఆకాశాన్ని త్రాగుతున్నట్లుగా యవనుల దగ్గరకు సాత్యకిని కొనిపోయాయి. సేనాముఖభాగంలో తిరుగుతున్న సాత్యకిని చూసి, చాలామంది హస్తలాఘవంతో అతనిపై శరవృష్టిని కురిపించారు. సాత్యకి వంగిన కణుపులు గల బాణాలతో వారి బాణాలను, అస్త్రాలను ఛేదించాడు. వారి బాణాలు సాత్యకి దగ్గరకు కూడా రాలేదు. పదునైన బాణాలతో సాత్యకి యవనుల శిరస్సులను,

భుజాలను, ఉక్కుతో, కంచుతో చేసిన కవచాలను పూర్తిగా ఖండించాడు. బాణాలు వారి దేహాలను ఖండించి, నేలగూలాయి. వీరుడైన సాత్యకి సంహారానికి గురి అయి, వందలకొలది మ్లేచ్ఛులు ప్రాణాలు కోల్పోయి, నేలగూలారు. పూర్తిగా లాగి విడిచిన బాణాలు ఒకదానితో ఒకటి కలిసి, అవిచ్ఛిన్నంగా సాగి ఐదు, ఆరు, ఏడు, ఎనిమిది మంది యవనులను బ్రద్దలు చేశాయి. రాజా! సాత్యకి వేలకొలదిగ కాంబోజులు, శకులు, శబరులు, కిరాతులు, బర్బరులను సంహరించి, నీ సేనను నశింపజేస్తూ రణభూమిని మాంసంతో నెత్తుటితో ఏర్పడిన బురదతో నింపి కనబడకుండా చేశాడు. ఆదస్యులు (దొంగల) తలలపై వెంట్రుకలు లేవు. పొడవైన గడ్డాలున్నాయి. శిరస్త్రాణాలతో కూడిన ఆ తలలు నేలగూలగా రెక్కలు లేని పక్షులతో నిండినట్లుంది భూమి. అవయవాలన్నీ నెత్తుటితో తడిసిన ఆ మొండెములతో రణభూమి మొత్తం నిండిపోయింది. అది ఎర్రటి మేఘాలతో నిండిన ఆకాశం వలె ఉంది. వజ్రంవంటి బాణాలతో సాత్యకి సంహరించగా వారు నేలను ఆవరించారు. మహారాజా! కొందరు యవనులు మిగిలారు. వారు ప్రాణాలు నిలుపుకొనే ఇబ్బందిలో పడ్డారు. సేననుండి చెదరిపోయారు. స్పృహ తప్పుతున్నారు. కవచధారులయిన ఆ యవనులందరినీ సాత్యకి జయించాడు. వారు మడమలతో, కొరడాలతో గుర్రాలను కొడుతూ తీవ్ర వేగంతో, భయంతో అన్నివైపులకూ పారిపోయారు. భారతా! కాంబోజసైన్యాన్ని, యవనసేనను, యవన మహాసేనను పారద్రోలి, గెలిచి ఆపై ఆ సాత్యకి నీ సేనలో ప్రవేశించి "ముందుకు పద" అని సారథితో అన్నాడు. గతంలో ఎవ్వరూ ప్రదర్శించని ఆ సాత్యకి పరాక్రమాన్ని చూసి చారణులు, గంధర్వులు ఎంతో ప్రశంసించారు. రాజా! అర్జునుని వెన్నంటి రక్షిస్తున్న సాత్యకి వెళ్ళటాన్ని చూసి, చారణులు, నీ సేనలు కూడా అభినందించారు."

120. సాత్యకి దుర్యోధన యుద్ధము. దుర్యోధన పలాయనము.

సంజయుడిలా చెప్తున్నాడు. "యవనకాంబోజులను జయించి రథికశ్రేష్ఠుడైన సాత్యకి నీ సేనలోంచి అర్జునుని దగ్గరకు చేరాడు. సాత్యకి విచిత్ర కవచాన్నీ, ధ్వజాన్నీ ధరించి పులి జింకను భయపెట్టినట్టు నీ సేనను చెదరగొట్టాడు. సాత్యకి రథంపై వివిధ మార్గాలలో సంచరిస్తూ బంగారువెన్ను, సువర్ణచంద్ర చిహ్నాలు గల తన వేగవంతమైన ధనుస్సును ఉల్లాసంగా త్రిప్పసాగాడు. బంగారు అంగదాలు, శిరస్త్రాణం, బంగారు కవచం ధరించి, బంగారు ధ్వజం, ధనుస్సు స్వీకరించి ఆ శూరుడు మేరుపర్వత శిఖరంవలె భాసించాడు. రణభూమిలో మండలాకృతిలో ధనుస్సును పట్టి, తేజస్సు అనే సూర్యరశ్మితో ప్రకాశిస్తూ, మానవ సూర్యుడైన సాత్యకి శరత్కాలంలోని ఉదయభానునివలె భాసించాడు.

ఎద్దువంటి భుజం, పరాక్రమం, కళ్ళు గల ఆ నరోత్తముడు ఆవుల మధ్య ఆబోతువలె నీ సేనలమధ్య వెలుగొందాడు. మదించిన ఏనుగువలె ప్రకాశిస్తూ, మదపు టేనుగువలె నడుస్తూ, మదజలాన్ని కురిపిస్తున్న ఏనుగువలె నీ సేనల మధ్యలో నిలిచిన సాత్యకిని చంపగోరి, నీవారంతా ఆకలి గొన్న పులులవలె అతనిపై దాడిచేశారు. దుస్తరమైన ద్రోణసేనను, కాంబోజసేనను అతిక్రమించి, జలసంధుడనే సముద్రాన్ని, కాంబోజసేనను దాటి, కృతవర్మ అనే మొసలిపట్టు నుండి బయటపడి, సైన్యసాగరాన్ని లంఘించి వచ్చిన సాత్యకిని నీ రథికులు తీవ్రకోపంతో చుట్టుముట్టారు. దుర్యోధనుడు, చిత్రసేనుడు, దుశ్శాసనుడు, వివింశతి, శకుని, దుస్సహుడు, క్రథుడు - ఇంకా ఎందరో శూరులు శస్త్రధారులై, దురాసదులై అసహనంతో సాత్యకివెన్నంటి నడిచారు. ఆ తరువాత నీ సేనలో మహా కోలాహలం ఏర్పడింది.

తన వెంటపడుతున్న అందరినీ గమనించి, శిని శ్రేష్ఠుడైన సాత్యకి నవ్వుతూ "మెల్లగా పద" అని రథసారథితో ఇలా అన్నాడు. 'సారథీ ! ఈ ధార్తరాష్ట్రబలం చెలరేగి, వేగంగా నాకెదురు నిలుస్తోంది. సూతా ! పూర్ణిమరోజు ఉప్పొంగిన సముద్రాన్ని చెలియలికట్ట నివారించినట్లు, ఈ సేనా సాగరాన్ని నిరోధిస్తాను. సూతా! ఈ మహాసంగ్రామంలో నా పరాక్రమాన్ని చూడు. ఈ శత్రుసేనలను పదునైన బాణాలతో చితకగొడతాను. అగ్నివంటి నా బాణాలతో తనువులు బ్రద్దలై మరణించిన వేలకొలది కాల్బలాన్ని, గుర్రాలను, రథాలను, ఏనుగులను చూడు!' ఈ రీతిగా సాత్యకి మాటాడుతుంటే నీ సైనికులు యుద్ధాభిలాషతో వేగంగా సమీపానికి వచ్చారు. వారు "పరుగెత్తండి! చంపండి! నిలవండి! చూడండి! చూడండి"! అంటూ అరుస్తున్నారు. వారలా మాటాడుతుంటే చిత్రయోధి, వేగంగా బాణాలు ప్రయోగించగల సాత్యకి పదునైన బాణాలతో మూడువందల గుర్రాలను, నాలుగువందల ఏనుగులను చంపాడు. సాత్యకికి, ఆ విలుకాండ్రకు మధ్య భీకరయుద్ధం జరిగింది. జన వినాశనం జరిగింది. మేఘసమూహం వలె ప్రకాశిస్తున్న నీ సేనను సాత్యకి పాములవంటి బాణాలతో ఎదిరించాడు. మహారాజా! రణభూమిలో బాణసమూహం కప్పివేసినా ఆ పరాక్రమశాలి తడబడకుండా నీ వారినెందరినో చంపాడు. అక్కడ మహాశ్చర్యకరమైన సన్నివేశాన్ని నేను చూశాను. సాత్యకి బాణాలలో ఒక్కటీ వ్యర్థం కాలేదు. కౌరవసేనా మహాసాగరం సాత్యకి అనే చెలియలి కట్టను చేరి నిలిచింది. సాత్యకి బాణాలతో ఆ సేనను అన్నివైపులనుండి వధిస్తుంటే సైనికులు, ఏనుగులు, గుర్రాలు పదేపదే దిక్కుతోచక పరుగిడుతున్నాయి. చలికి వణుకుతున్న ఆవులవలె నీసేన అక్కడక్కడే తిరుగసాగింది. అక్కడ సాత్యకి బాణాలతో గాయపడని సైనికుడు కానీ, రథం కానీ, ఏనుగు కానీ, ఆశ్వికుడు కానీ, గుర్రం కానీ నాకు కనిపించలేదు. రాజా! నీ సేనను నశింపజేస్తూ

సాత్యకి చేసిన యుద్ధం వంటి యుద్ధాన్ని అర్జునుడు కూడా చేయలేదు. సాత్యకి నిర్భయంగా హస్తలాఘవాన్ని ప్రదర్శిస్తూ, సాహల్యాన్ని ప్రదర్శిస్తూ అర్జునుని మించి యుద్ధం చేశాడు.

ఆ తరువాత దుర్యోధన నరపాలుడు మూడు బాణాలతో సాత్యకి రథసారథిని గాయపరిచాడు. పదునైన నాలుగు బాణాలతో నాలుగు గుర్రాలను గాయపరిచాడు. ముందు మూడింటితో, మరల ఎనిమిదింటితో సాత్యకిని గాయపరిచాడు. దుశ్శాసనుడు పదహారింటితో, శకుని ఇరవై అయిదింటితో, చిత్రసేనుడు అయిదింటితో సాత్యకిని గాయపరిచాడు. దుస్సహుడు పదిహేను బాణాలతో సాత్యకి రొమ్ముపై కొట్టాడు. ఆ బాణాలతో గాయపడి సాత్యకి వారినందరినీ మూడు మూడు బాణాలతో గాయపరిచారు. సాత్యకి అత్యంతమూ తేజస్సు గల బాణాలతో శత్రువులను తీవ్రంగా గాయపరిచి, రణభూమిలో డేగవలె సంచరించాడు. సాత్యకి శకుని ధనుస్సును ఖండించి, చేతి తొడుగును కత్తిరించి, మూడు బాణాలతో దుర్యోధనుని రొమ్ముమీద గాయపరిచాడు. అదే రీతిగా సాత్యకి చిత్రసేనుని వంద బాణాలతో, దుస్సహుని పదిబాణాలతో, దుశ్శాసనుని ఇరవై బాణాలతో గాయపరిచాడు. రాజా! ఆపై శకుని మరొక ధనుస్సును చేతబట్టి, ముందు ఎనిమిది బాణాలతో, ఆ తరువాత అయిదు బాణాలతో దుశ్శాసనుడు పది బాణాలతో, దుస్సహుడు మూడు బాణాలతో సాత్యకిని గాయపరిచారు. రాజా! దుర్ముఖుడు పన్నెండింటితో సాత్యకిని గాయపరిచాడు. దుర్యోధనుడు డెబ్బయి మూడింటితో సాత్యకిని గాయపరిచి, ఆపై పదునైన బాణాలతో అతని సారథిని గాయపరిచాడు. అంతా కలిసి తనను బాధించే ప్రయత్నం చేస్తున్న ఆ శూరమహారథులను సాత్యకి మరల అయిదయిదు బాణాలతో గాయపరిచాడు. ఆ తరువాత సాత్యకి నీ కుమారుని రథసారథిపై ఒక భల్లాన్ని ప్రయోగించాడు. సారథి చచ్చి, నేలపై పడిపోయాడు. రాజా! ఆ సారథి మరణించగా గాలిలా పరుగెత్తే గుర్రాలు నీ కుమారుని రథాన్ని రణభూమి నుండి తప్పించాయి. నీ కుమారులు సైనికులు వందలకొలదిగ దుర్యోధనుని రథాన్ని గమనించి పారిపోసాగారు. భారతా! పారిపోతున్న ఆ సేనను చూసి, సాత్యకి తీక్ష్ణబాణాలను వారిపై కురిపించాడు. నీ సేనల నన్నింటినీ పారద్రోలి సాత్యకి అర్జునుని రథం దగ్గరకు వెళ్ళిపోయాడు.

వెళ్ళిపోతున్న ఆ మహాబాహువును చూసి నీ సేనలు ఆ దృశ్యాన్ని చూడనట్లు భావించి వేరే పనిలో పడిపోయారు.

సాత్యకి సారథిని, తనను తాను రక్షించుకోవటం చూసి నీ వారంతా అభినందించారు."

121. సాత్యకి ప్రవేశము - దుశ్శాసన పలాయనము

ధృతరాష్ట్రుడిలా అడిగాడు. "సంజయా! ఆ మహాసైన్యాన్ని మర్దన చేసి సాత్యకి అర్జునుని దగ్గరకు వెళుతుంటే సిగ్గులేని నా కొడుకులు ఏం చేశారు ? యుద్ధంలో అర్జునుని వంటి సాత్యకి పరాక్రమాన్ని చూసిన నా కొడుకులు ఎలా ధైర్యంగా ఉన్నారు? అందరూ చావదలచినట్లుంది. సేనలో మధ్యలో ఓడిపోయినవారు తమ క్షాత్రాన్ని గురించి ఏం చెప్పగలరు? సాత్యకి సేనను దాటి ఎలా వెళ్ళగలిగాడు ? సంజయా! రణభూమిలో నా కొడుకులు బ్రతికియుండగానే సాత్యకి ఎలా ముందుకు పోగలిగాడు ? నాకది చెప్పు. నాయనా! నీవు చెప్తున్నది నాకు అద్భుతంగా కనిపిస్తోంది. మహారథులైన అనేక శత్రువులతో సాత్యకి ఒంటరిగా ఎలా పోరాడాడు ? రణరంగంలో మహారథులయిన నా వారిని సాత్యకి సంహరించాడంటే - దురదృష్టశాలి అయిన నా కుమారునకు అంతా విపరీతంగా ఉందని నేననుకొంటున్నాను. సంజయా! నా కొడుకుసైన్యం కోపించిన సాత్యకిని ఒక్కడిని నిలవరించటానికే సరిపోలేదు. ఇక పాండవులందరూ కలిసి వస్తే చెప్పేదేముంది ? విచిత్రరీతిలో పోరాడే ద్రోణుని జయించి, పశుగణాలను సింహం చంపినట్లు నా కొడుకులను సాత్యకి చంపి వేశాడు. కృతవర్మాది శూరులు ఎందరో ప్రయత్నించినా సాత్యకిని చంపలేకపోయారు. సాత్యకి పోరాడినట్లుగా అర్జునుడు కూడా ఎప్పుడూ పోరాడలేదు."

సంజయుడిలా చెప్తున్నాడు. "రాజా! ఇదంతా నీ దురాలోచన, దుర్యోధనుని దుశ్చేష్టల ఫలితం. సావధానంగా విను చెప్తున్నాను. ఆ పారిపోయిన యోధులందరూ నీ కుమారుని ఆదేశం మేరకు మరలా పరస్పరం ప్రతిజ్ఞలు చేసికొని తీవ్రంగా పోరాడటానికి వచ్చారు. రాజేంద్రా! దుర్యోధనుని ముందు నిలుపుకొని మూడువేల మంది ఆశ్వికులు, శకులు, కాంబోజులు, బాహ్లీకులు, యవనులు, పారదులు, కులిందులు, తంగణులు, అంబష్ఠులు, పైశాచులు, బర్బరులు, పర్వతీయులు అందరూ కోపంతో రాళ్ళను చేతబుచ్చుకొని మిడతలు అగ్నిపై కురికినట్లు సాత్యకిపై దాడిచేశారు. రాళ్ళతో యుద్ధంచేసే పర్వతీయులు - అయిదు వందలమంది శూరరథికులు సంసిద్ధులై సాత్యకిపై దాడిచేశారు. ఆపై వేయి రథాలతో, వందమంది మహారథులతో రెండువేల ఏనుగులతో, రెండువేల గుర్రాలతో మహారథులు లెక్కలేనంతమంది సైనికులు వివిధ శరాలను కురిపిస్తూ సాత్యకిపై దాడిచేశారు. 'ఇతనిని చంపండి' అని ఆ సేనలనన్నింటినీ ప్రోత్సహిస్తూ, దుశ్శాసనుడు సాత్యకిని చుట్టుముట్టాడు.

అక్కడ సాత్యకి పరాక్రమం మహాద్భుతంగా కనిపించింది. ఒక్కడే అనేకులతో తడబాటు లేకుండా పోరాడగలిగాడు. ఆ రథసేనను, గజబలాన్ని, ఆశ్వికులను, దస్యుల నందరినీ కూడా సంహరించాడు. ఆ యుద్ధంలో ముక్కలయిన చక్రాలతో, బ్రద్దలైన

మహాయుధాలతో, అనేక రీతులుగా విరిగిన ఇరుసులతో, కట్టుకొయ్యలతో, కిరీటాలతో, మధింపబడిన ఏనుగులతో, పడిపోయిన ధ్వజాలతో, కవచాలతో, సైనికులతో భూమి నిండిపోయింది. భారతా! హారాలతో, నగలతో, వస్త్రాలతో, మోపుడుకొయ్యలతో నిండిపోయిన రణభూమి గ్రహాలతో నిండిన ఆకాశం వలె కనిపించింది. భారతా! అంజన వంశంలోనూ, వామన వంశంలోనూ పుట్టిన గొప్ప ఏనుగులు పర్వతాలవలె పడిపోయాయి. సుప్రతీక వంశంలో, మహాపద్మవంశంలో, ఐరావత వంశంలో, ఇతర వంశాలలోనూ పుట్టిన గొప్ప గొప్ప ఏనుగులు ఎన్నో చచ్చిపడి ఉన్నాయి. రాజా! వనాయుజ, పర్వతీయ, కాంబోజ, బాహ్లీక దేశాలలో పుట్టిన గొప్పగొప్ప గుర్రాలను సాత్యకి రణభూమిలో చంపివేశాడు. నానాదేశాలలో పుట్టిన వివిధ జాతులకు చెందిన ఏనుగులను వందలు, వేలుగా సాత్యకి రణభూమిలో చంపివేశాడు. వారలా సంహరింపబడుతుంటే దుశ్శాసనుడు ఆ మ్లేచ్ఛులతో "ధర్మం తెలియక పారిపోకండి. పోరాడండి. పారిపోతే లాభం లేదు. మీరు రాళ్ళతో యుద్ధం చేయటంలో నేర్పరులు, సాత్యకికి అది తెలియదు. రాళ్ళపోరు తెలియని ఈ యుద్ధకాముని చంపండి. అలాగే కౌరవులందరూ కూడా రాళ్ళ యుద్ధంలో నేర్పరులు కారు. వెనక్కురండి. భయపడకండి సాత్యకి మిమ్ములను చేరలేడు." అన్నాడు. రాళ్ళతో పోరాడే ఆ పర్వతీయ రాజులందరూ సాత్యకి మీదకు వచ్చారు. ఆ ఏనుగు తలలంత పెద్ద రాళ్ళను ఎత్తి పట్టి, పర్వతీయులు రణభూమిలో సాత్యకి ముందు నిలిచారు. నీ కుమారుని ప్రేరణతో ఆ పర్వతీయులందరూ సాత్యకిని చంపగోరి, వడిసెలలతో అన్నిదిక్కులనుండీ నిరోధించారు.

శిలాయుద్ధం చేయగోరి వారు మీదకు వస్తున్నంతలోనే సాత్యకి పదునైన బాణాలను సంధించి, విడిచాడు. పర్వతీయులు కురిపించిన ఆ భీకరమైన రాళ్ళవానను సాత్యకి పాములవంటి బాణాలతో ఛిన్నాభిన్నం చేశాడు. మిణుగురు పురుగుల సమూహాల వలె ప్రకాశిస్తున్న ఆ రాళ్ళపొడి దాదాపు సేనలనన్నింటినీ దెబ్బతీసింది. సేనలు హాహాకారాలు చేయసాగాయి. రాజా! ఆపై అయిదువందల మంది శూరులు మహాశిలలను పైకెత్తి వేయబోయారు. అయితే బాహువులు తెగి, నేలబడిపోయారు. మరల మరొకవేయిమంది, మరొక లక్షమంది రాళ్ళు పైకెత్తి, చేతులు తెగిపోగా ఆ రాళ్ళతోపాటు ఆలాగే పడిపోయారు. అసలు సాత్యకి దగ్గరకు రాలేకపోయారు.

సాత్యకి భల్లంతోనూ, ఆ కొండలతోనూ పిండి పిండి చేయబడిన మ్లేచ్ఛులు ప్రాణాలుపోయి అక్కడే పడిపోయారు. మహాత్ముడైన సాత్యకి వారిని సంహరిస్తుండగా వారు సాత్యకిపై మహాఘోరమైన రాళ్ళవానను కురిపించసాగారు.

వేలకొలది పర్వతీయ శూరులను సాత్యకి సంహరించాడు. అది అద్భుతంగా కనిపించింది. ఆపై దరదులు, తంగణులు, ఖసులు, లంపాకులు, కులిందులు మరల లోహపు గుళ్ళనూ, శూలాలనూ చేతబట్టి, నోళ్ళు తెరిచి అన్నివైపుల వాటిని విసురుతూ రాళ్ళవానను కురిపించారు. ఎదురు దెబ్బతీయటంలో నేర్పుగల సాత్యకి బాణాలతో వాటిని ఖండించాడు. పదునైన బాణాలతో ఆకాశంలో కొండలు బ్రద్దలవుతుంటే, ఆ చప్పుడుతో రణభూమి నుండి రథాలు, గుర్రాలు, ఏనుగులు, సైనికులు పరుగెత్తిపోయారు. రాళ్ళపాడి తమను నింపివేయగా సైనికులు, ఏనుగులు, గుర్రాలు తుమ్మెదలు కుట్టినట్లుగా అక్కడ నిలవలేకపోయారు.

రాజా! చనిపోగా మిగిలిన ఏనుగులు కూడా నెత్తురోడుతున్నాయి. వాటి కుంభస్థలాలు బ్రద్దలైఉన్నాయి. తలలు చీలిపోయాయి. దంతాలు విరిగిపోయాయి. తొండాలు తెగిపోయాయి. వందలకొలది ఏనుగుల శరీరావయవాలు భగ్నమయ్యాయి. వెంటనే సాత్యకి అయిదు వందలమంది యోధులను ఎంతో నేర్పుతో క్షణకాలంలోనే చంపి సేనలమధ్య సంచరించసాగాడు. అలా గాయపడిన ఏనుగులు సాత్యకి రథానికి దూరంగా పోయాయి. బాణాలతో రాళ్ళు బ్రద్దలవుతుంటే ఆ ధ్వని తామరాకులపై పడుతున్న జలధారల చప్పుడువలె వినిపిస్తోంది.

పర్వదినాన ఉప్పొంగిన సముద్రఘోషవలె నీ సేనలలో కలకలం చెలరేగింది. ఆ భీకరధ్వనిని విని, ద్రోణుడు సారథితో ఇలా అన్నాడు - 'సూతా! సాత్యకి కోపంతో రణభూమిలో అనేకవిధాలుగా సేనను సంహరిస్తూ మృత్యువువలె సంచరిస్తున్నాడు. ఆ భీకర శబ్దం వినిపించిన వైపు రథాన్ని నడుపు. సాత్యకి తప్పక పాషాణయోధులైన పర్వతీయులతో కలబడి ఉంటాడు. పరుగెత్తుతున్న ఈ గుర్రాలు రథికులనందరినీ రణభూమినుండి తప్పిస్తున్నాయి. రథికులలో కొందరు శస్త్రాలనూ, కవచాలనూ కోలుపోయి, గాయపడి అక్కడక్కడ పడిపోతున్నారు. సారథులు ఆ భీకరయుద్ధంలో గుర్రాలను నియంత్రించ లేకపోతున్నారు." ద్రోణుని ఆ మాట విని, సారథి సర్వశస్త్రధారులలో శ్రేష్ఠుడైన ద్రోణునితో ఇలా అన్నాడు - "చిరంజీవీ! కౌరవసేన అన్నివైపులకూ పారిపోతోంది. చూడు! రణభూమిలో వ్యూహం భంగపడి యోధులందరూ ఇటు - అటూ పారిపోతున్నారు. ఇరుగో! ఈ పాంచాలశూరులు పాండవులతో కలిసి నిన్నే చంపగోరి, అన్నివైపుల నుండి దాడి చేస్తున్నారు. ఇప్పటికి తగిన పని ఏమిటో చెప్పు. నిలవడమో. వెళ్ళడమో నిర్ణయించు. సాత్యకి దూరం వెళ్ళిపోతున్నాడు." ద్రోణుని సారథి అలా అంటుండగా సాత్యకి వివిధ రథికులను సంహరిస్తూ కనిపించాడు. సాత్యకిచే సంహరింపబడుతున్న నీ సేనలు సాత్యకి రథాన్ని వీడి, ద్రోణసేనవైపు పరుగుతీశారు. అంతకుముందే దుశ్శాసనునితో కూడా మరలి వచ్చిన రథికులు అందరూ భయపడి ద్రోణరథం వైపు పరుగుతీయసాగారు."

122. ద్రోణపరాక్రమము.

సంజయుడిలా చెప్తున్నాడు. "తనసమీపంలోనే తిరుగుతున్న దుశ్శాసన రథాన్ని చూసి ద్రోణుడు అతనితో ఇలా అన్నాడు. "దుశ్శాసనా! ఈ రథికులందరూ ఎక్కడకు పారిపోతున్నారు? ఎందుకు పారిపోతున్నారు ? దుర్యోధనుడు క్షేమమే కదా! సైంధవుడు బ్రతికిఉన్నాడు కదా! యువరాజువై యుండి నీవు రణభూమి నుండి పారిపోవటమెందుకు ? 'దాసీ! నిన్ను జూదంలో గెలుచుకొన్నాం. స్వేచ్ఛగా సంచరించవచ్చు. నాకూ, మా అన్నకూ వస్త్రవాహికవు కమ్ము! నీకిప్పుడు భర్తలు లేరు. వారంతా మొలకెత్తని నువ్వులవంటివారు.' గతంలో అలా మాటాడి ఇప్పుడెందుకు పారిపోతావు. స్వయంగా పంచాలురతో పాండవులతో తీవ్రవైరాన్ని కల్పించుకొని, ఒక్కసాత్యకితో పోరాడ వలసివస్తేనే భయంతో యుద్ధంనుండి పారిపోతావెందుకు ? గతంలో జూదంలో పాచికలు పట్టుకొన్నప్పుడు భవిష్యత్తులో ఇవి భీకర సర్పాలవంటి బాణా లవుతాయని నీవెరుగవు. గతంలో అప్రియవచనాలు ప్రత్యేకించి యుధిష్ఠిరుని విషయంలో వినిపించటానికి, ద్రౌపది కష్టాల ననుభవించటానికి నీవే మూలం. నీ అభిమానం, దర్పం, నీ బలం, నీ అరుపులు ఎక్కడకు పోయాయి ? పాములవంటి పాండవులకు కోపం తెప్పించి ఎక్కడకు వెళ్తావు ? క్రూరుడవు, పలాయన పరాయణుడవైన నీవంటి సోదరుని పొంది సుయోధనుడు, రాజ్యం, కౌరవసేన అంతా దయనీయస్థితికి లోనయ్యారు. వీరుడా! భయపీడతో చెదరిపోతున్న ఈ సేనను బాహుబలంతో నీవే రక్షించాలి. కానీ నీవు భయంతో ఇప్పుడు రణభూమిని వీడి, శత్రువులకు ఆనందాన్ని కలిగిస్తున్నావు.

సేనానాయకుడవైన నీవే పారిపోతే రణభూమిలో మరెవరు మిగులుతారు. వారు కూడా భయపడతారు గదా! ఒక్క సాత్యకితో పోరాడవలసివస్తేనే రణభూమి నుండి పారిపోదామన్న ఆలోచన నీకు కలిగింది. కౌరవా! ఇక అర్జునునీ, భీమునీ, నకుల సహదేవులను రణరంగంలో చూస్తే అప్పుడేం చేస్తావు ? రణరంగంలో అర్జునుని బాణాలు సూర్యునివలె, అగ్నివలె తేజస్సంపన్నాలు. సాత్యకి బాణాలు వాటితో సమానం కావు. వీరా! త్వరగా వెళ్ళు. గాంధారిగర్భంలో ప్రవేశించు. పారిపోయే నీకు అంతకన్నా సురక్షితప్రదేశం మరొకటి లేదు. పారిపోవటం మీదనే మనస్సుపడితే సంధిమార్గంలోనే ధర్మరాజుకు రాజ్యాన్ని ఇవ్వండి. కుబుసం విడిచిన పాములవంటి అర్జునుని బాణాలు నీ శరీరంలోనికి ప్రవేశించకముందే పాండవులతో సంధి చేసికోండి. ఆ పాండవులు రణభూమిలో మీ సోదరులను వందమందినీ చంపి, రాజ్యాన్ని లాక్కొనేలోపుగానే పాండవులతో సంధి చేసికోండి. యుధిష్ఠిర నరపాలుడూ, యుద్ధాన్ని శ్లాఘించే కృష్ణుడూ కోపానికి లోనుకాకముందే పాండవులతో సంధి చేసికోండి. భీముడు మహాసేనలో ప్రవేశించి నీ సోదరులను

కబళించకముందే పాండవులతో సంధి చేసికోండి. గతంలోనే భీష్ముడు నీ అన్నకు "సౌమ్యా! పాండవులను యుద్ధంలో గెలవటం కష్టం. వారితో సంధి చేసికో" అని చెప్పాడు. కానీ మూర్ఖుడైన నీ అన్న సుయోధనుడు ఆ మాట వినలేదు. కాబట్టి అటువంటి నీవు రణభూమిలో ధైర్యాన్ని కూడగట్టుకొని, సంసిద్ధుడవై పాండవులతో పోరాడు. భీముడు నీ నెత్తురు త్రాగుతాడని నేను విన్నాను. భీముడు వ్యర్థప్రతిజ్ఞలు చేయడు. అది ఆలా జరుగుతుందనే నేను అనుకొంటున్నాను. పరమమూర్ఖుడా! భీముని పరాక్రమాన్ని నీవెరుగవా? ఆ భీముడితో వైరాన్ని ప్రారంభించావు, ఇప్పుడేమో పారిపోతున్నావు. వెంటనే రథంమీద సాత్యకి ఉన్నచోటికే వెళ్ళు. భారతా!నీవు లేకపోతే సేన అంతా పారిపోతుంది. మీ ప్రయోజనం కోసమే రణభూమిలో సత్యవిక్రముడైన సాత్యకితో పోరాడు!

ద్రోణుడు అలా అనగానే దుశ్శాసనుడు ఏమీ చెప్పలేదు. వినికూడా విననట్లు నటిస్తూ సాత్యకి వెళ్ళిన దారిలో వెళ్ళిపోయాడు. వెనుకంజవేయని మహోత్సేచ్ఛసేనతో కూడి రణభూమిలో సాత్యకిని సమీపించి, ప్రయత్న పూర్వకంగా అతనితో పోరాడసాగాడు. ద్రోణుడు కూడా తీవ్ర కోపంతో, మధ్యమవేగంతో పాంచాలురపై, పాండవులపై దాడిచేశాడు. రణభూమిలో ద్రోణుడు పాండవసేనలో ప్రవేశించి వందల, వేలకొలది సైనికులను సంహరించాడు. ఆ తరువాత ద్రోణుడు రణరంగంలో తనపేరు చెప్పి, పాండు పాంచాలమత్స్యదేశీయ సేనలను పెద్దపెట్టున సంహరించసాగాడు. అటు - ఇటూ సేనలను ఓడిస్తున్న ద్రోణుని చూసి, తేజస్వి అయిన పాంచాల రాజకుమారుడు - వీరకేతువు ఆయనను ఎదిరించాడు. ఆ వీరకేతువు అయిదు బాణాలతో ద్రోణుని గాయపరిచి, ఒక బాణంతో ధ్వజాన్ని ఖండించి, ఏడు బాణాలతో సారథిని గాయపరిచాడు. మహారాజా! రణరంగంలో అక్కడ ఒక అద్భుతాన్ని చూశాను. ద్రోణుడు వేగశాలి అయిన పాంచాల రాజకుమారుని మీదకు వెళ్ళలేకపోయాడు. ద్రోణుడు యుద్ధభూమిలో నిలువరింపబడటాన్ని చూసి, పాంచాలసేనలు ధర్మరాజు విజయాన్ని కోరుతూ ద్రోణుని చుట్టుముట్టారు. రాజా! వారు అగ్నిసమానమైన బాణాలతో, గొప్ప విలువ గల తోమరాలతో, వివిధశస్త్రాలతో ద్రోణునిపై వాన కురిపించారు. రాజా! ద్రోణుడు వారినందరినీ బాణ సమూహాలతో చంపి, ఆకాశంలో పెద్దపెద్ద మేఘాలను చెదరగొట్టిన గాలివలె ప్రకాశించాడు. ఆపై ద్రోణుడు సూర్యునితో, అగ్నితో సమానమైన బాణాన్ని సంధించి, వీరకేతువు రథంపై ప్రయోగించాడు. రాజా! ఆ బాణం ప్రజ్వలిస్తూ వీరకేతువును చీల్చి, నెత్తుటితో తడిసి వెంటనే నేలగూలింది. ఆపై వీరకేతువు రథంనుండి వేగంగా పడ్డాడు.

మహాబలుడు, మేటివిలుకాడు అయిన ఆ రాజకుమారుడు మరణించగానే పాంచాలురు త్వరపడుతూ ద్రోణుని అన్నివైపులనుండి నిరోధించారు. భారతా! సోదరుని

మరణంతో బాధపడుతూ చిత్రకేతువు, సుధన్వుడు, చిత్రవర్మ, చిత్రరథుడు ద్రోణుని నాలుగు వైపుల నుండి చుట్టుముట్టారు. వర్షాకాలంలోని మేఘాలవలె శరవర్షం కురిపిస్తూ, ద్రోణునితో పోరాడదలచి ఒక్కుమ్మడిగా వారు ద్రోణునిపై దాడిచేశారు. ఆ రాజపుత్రులు అనేకరీతులలో ద్రోణుని హింసిస్తుండగా ఆ ద్విజశ్రేష్ఠుడు వారిని నశింపజేయాలని తీవ్రకోపాన్ని ప్రదర్శించాడు. రాజసత్తమా ! ఆ పై ద్రోణుడు వారిమీద శరమయమైన వలను సృష్టించాడు. చెవిదాకా లాగి ద్రోణుడు విడిచిన ఆ బాణాలచే హింసింపబడుతూ ఆ పాంచాల రాజకుమారులు కింకర్తవ్యతామూఢులయ్యారు. ఆ కుమారులను చూసి ద్రోణుడు నవ్వుతూ, కోపంతో వారి గుర్రాలను, సారథులను, రథాలను విరుగగొట్టాడు. ఆపై ఆ ద్రోణుడు మరీ పదునైన భల్లాలతో వారి శిరస్సులను పూలుకోసినట్లు పడగొట్టాడు. రాజా! తేజస్వులయిన వారు రథాలమీద నుండి నేలగూలారు. ద్రోణుడు వారిని చంపి, బంగారువెన్నుతో బలిష్ఠమైన తన వింటిని త్రిప్పాడు. మహారథులు, దేవసమానులు అయిన పాంచాల యోధులు మరణించటం చూసి, ధృష్టద్యుమ్నుడు తీవ్రమైన ఉద్వేగంతో కన్నులనుండి నీరుకార్చుతూ, కోపంగా ద్రోణరథంపై దాడిచేశాడు.

ధృష్టద్యుమ్నుడు బాణాలతో ద్రోణుని నిరోధించటాన్ని చూసి, వెంటనే హాహాకారాలు చెలరేగాయి. ధృష్టద్యుమ్నుడు అనేకవిధాలుగా ద్రోణుని ఆవరించినా ద్రోణుడు బాధపడలేదు. నవ్వుతూనే పోరాడసాగాడు. క్రోధమూర్ఛితుడైన ధృష్టద్యుమ్నుడు తొంబది బాణాలతో కోపంగా ద్రోణుని రొమ్ముపై కొట్టాడు. ధృష్టద్యుమ్నుడు తీవ్రంగా గాయపరచగా భారద్వాజుడు రథం వెనుకవైపుకు వెళ్ళి కూర్చొని, సొమ్మసిల్లాడు. ధృష్టద్యుమ్నుడు ఆ స్థితిలో నున్న ద్రోణుని చూసి, ధనుస్సును వదలి, వెంటనే కత్తిని చేపట్టాడు. మారిషా! ఆ మహారథుడు త్వరితంగా తన రథం మీదనుండి దూకి, వెంటనే ద్రోణుని రథంమీదకు ఎక్కాడు. రాజా! క్రోధంతో ఎర్రబడ్డ కన్నులతో ధృష్టద్యుమ్నుడు ద్రోణుని శరీరం నుండి తలను వేరు చేయదలచాడు. అంతలో ద్రోణుడు తెప్పరిల్లి, మహాటంకారం చేయగల ధనుస్సును తీసికొని, తనను చంపదలచి దగ్గరకు వచ్చిన ధృష్టద్యుమ్నుని చూసి, సమీప లక్ష్యాన్ని ఛేదించగల జానెడు బాణాలతో అతనిని గాయపరిచాడు. ధృష్టద్యుమ్నునితో ద్రోణుడు యుద్ధం చేయనారంభించాడు. సమీప లక్ష్యాన్ని ఛేదించే ఆ జానెడు బాణాలను ద్రోణుడు ప్రయోగిస్తే అవి ధృష్టద్యుమ్నుని క్షీణింపజేశాయి. ధృష్టద్యుమ్నుడు అనేక బాణాలచే పీడింపబడుతూ, తన ఆ వేగం భంగపడగా, వేగంగా రథం నుండి దూకి, తన రథాన్ని ఎక్కి ద్రోణుని గాయపరిచాడు. ద్రోణుడు కూడా బాణాలతో ధృష్టద్యుమ్నుని గాయపరిచాడు. అప్పుడు త్రిలోకాధిపత్యాన్ని కోరుతున్న ఇంద్ర ప్రహ్లాదుల పోరువలె ఆ ద్రోణధృష్టద్యుమ్నుల మధ్య అద్భుతయుద్ధం జరిగింది.

యమకం, మరెన్నో విచిత్రమండలాకృతులను ప్రదర్శిస్తూ యుద్ధమార్గమెరిగిన ఆ ఇద్దరూ బాణాలతో పరస్పరం శిథిలం చేసికొనసాగారు. వర్షాకాలమేఘాలవలె శరవృష్టులను కురిపిస్తూ, రణభూమిలో యోధుల మనస్సులను మోహింపజేస్తూ, ద్రోణధృష్టద్యుమ్నులు పోరాడసాగారు. ఆ మహాత్ములిద్దరూ బాణాలతో ఆకాశాన్నీ, దిక్కులనూ, భూమిని కప్పివేశారు. ఆ అద్భుత యుద్ధాన్ని ప్రాణులన్నీ ప్రశంసించాయి. క్షత్రియులందరూ, నీ ఇతర సైనికులు యుద్ధాన్ని ప్రశంసించారు. 'ద్రోణుడు రణభూమిలో ధృష్టద్యుమ్ననితో కలబడ్డాడు. తప్పక మనకు లొంగిపోతాడు' అని పాంచాలురు అరవసాగారు. ద్రోణుడు త్వరపడుతూ రణరంగంలో ధృష్టద్యుమ్ను సారధి తలను శరీరంనుండి వేరుచేశాడు. ఆ తరువాత ఆ మహాత్ముని గుర్రాలు పారిపోసాగాయి. అవి పరుగెత్తుతుంటే పరాక్రమశాలి అయిన ద్రోణుడు పంచాలురతో, సృంజయులతో ఎక్కడికక్కడ పోరాడసాగాడు. ద్రోణుడు పాండవులను, పాంచాలురను ఓడించి, మరల తన వ్యూహం వద్దకు వచ్చి నిలిచాడు. రాజా! ఇక అప్పుడు పాండవసేనలు రణ రంగంలో ద్రోణునితో తలపడటానికి ఉత్సాహపడలేదు."

123. దుశ్శాసన పరాజయము

సంజయుడిలా చెప్తున్నాడు. "దుశ్శాసనుడు వర్షించే మేఘంవలె లక్షబాణాలను కురిపిస్తూ, సాత్యకిపై దాడిచేశాడు. దుశ్శాసనుడు ముందు అరవై బాణాలతో, ఆపై పదహారు బాణాలతో సాత్యకిని గాయపరిచాడు. కానీ మైనాక పర్వతంవలె ఉన్న అతనిని కదిలించలేకపోయాడు. దుశ్శాసనుడు నానా ప్రదేశాలనుండి వచ్చిన మహారథ సమూహంతో సాత్యకిని పూర్తిగా ఆవరించాడు. భరతశ్రేష్ఠా! అన్నివైపుల నుండి అనేక బాణాలను కురిపిస్తూ - గర్జిస్తున్న మేఘంవలె పదిదిక్కులనూ ప్రతిధ్వనింపజేయసాగాడు. అలా రణభూమిలో మీదకు వస్తున్న దుశ్శాసనుని చూసి, మహాబాహువైన సాత్యకి అతనిపై దాడిచేసి, బాణాలతో కప్పివేశాడు. బాణసమూహాలచే కప్పబడుతున్న ఆ దుశ్శాసనాది యోధులు భయపడి, నీ సేనలు చూస్తుండగానే పారిపోయారు. అపుడు దుశ్శాసనుడు నిర్భయంగా సాత్యకిని బాణాలతో పీడిస్తూ నిలిచాడు. ఆ దుశ్శాసనుడు నాలుగు బాణాలతో సాత్యకి గుర్రాలను, మూడు బాణాలతో సారథిని, వంద బాణాలతో సాత్యకిని గాయపరచి సింహనాదం చేశాడు. దానితో సాత్యకి దుశ్శాసనునిపై కోపించి అతని రథాన్ని, సారథిని, ధ్వజాన్ని సూటిగా వెళ్ళే బాణాలతో కనబడనంతగా కప్పివేశాడు. ఆ సాత్యకి శూరుడైన దుశ్శాసనుని బాణాలతో పూర్తిగా ఆవరించాడు.

వందలకొలదీ బాణాలు గ్రుచ్చుకొన్న దుశ్శాసనుని చూసి, దుర్యోధనుడు

త్రిగర్తులను సాత్యకి రథంమీదకు పంపించాడు. క్రూరకర్ములు, యుద్ధవిశారదులు అయిన మూడువేల మంది త్రిగర్తమహారథులు సాత్యకి రథం దగ్గరకు వెళ్ళారు. వారు యుద్ధం చేయాలని స్థిరనిశ్చయానికి వచ్చి, రణభూమిలో ఒకరికొకరు మాట ఇచ్చి, మహారథ సమూహంతో సాత్యకిని సాత్యకి నిరోధించారు. శరవర్షాన్ని కురిపిస్తూ మీదకు వస్తున్న వారిలో అయిదువందల మంది ప్రముఖయోధులను సేనాముఖంలో చంపివేశాడు. సాత్యకి యొక్క బాణాలదెబ్బతిని, వారు వెంటనే పెనుగాలికి కూలి కొండమీద పడిన చెట్లవలె నేలబడిపోయారు. రాజా! అనేకవిధాలుగా ముక్కలయిన ఏనుగులతో, ధ్వజాలతో, నేలగూలిన బంగారు పగ్గాల గుర్రాలతో, సాత్యకి బాణాలతో తెగిన శరీరాల నుండి కారుతున్న రక్త ప్రవాహాలతో నిండిన భూమి కింశుకాలు (మోదుగపూలు) పుష్పించినట్లు శోభిల్లింది. సాత్యకిచే చంపబడుతున్న నీ వారు బురదలో కూరుకొన్న ఏనుగులవలె రక్షకుని పొందలేకపోయారు. అప్పుడు గరుడుని చూసి, భయపడిన మహాసర్పాలు గుంటలో పడినట్లు నీవారంతా ద్రోణరథం చుట్టూ పడిపోయారు. విషసర్పాలవంటి బాణాలతో అయిదువందల మంది యోధులను చంపి, ఆ వీరసాత్యకి మెల్లగా అర్జునుని రథం వైపు వెళ్ళాడు. అలా వెళ్ళిపోతున్న ఆ నరోత్తముని నీ కుమారుడు – దుశ్శాసనుడు వంగిన కణుపులు గల తొమ్మిది బాణాలతో గాయపరిచాడు. ఆ సాత్యకి అయిదు పదునైన బాణాలతో దుశ్శాసనుని తిరిగి గాయపరిచి బదులు తీర్చాడు. దుశ్శాసనుడు నవ్వుతూ ముందు మూడు బాణాలతో, ఆపై అయిదు బాణాలతో సాత్యకిని గాయపరిచాడు.

కానీ సాత్యకి అయిదు బాణాలతో నీ కొడుకును బాధించి, అతనిని ధనుస్సును ఖండించి, నవ్వుతూ అర్జునుని వైపు వెళ్ళిపోయాడు. ఆపై దుశ్శాసనుడు కోపించి, వెళ్ళిపోతున్న సాత్యకిని చంపగోరి పూర్తిగా లోహమయమైన శక్తిని విసిరాడు. రాజా! నీ కుమారుడు ప్రయోగించిన ఆ శక్తిని సాత్యకి గ్రద్ద ఈకలుగల పదునైన బాణాలతో వందముక్కలు చేశాడు. నీ కుమారుడు మరొకవింటిని తీసికొని, సాత్యకిని గాయపరిచి సింహనాదం చేశాడు. సాత్యకి కోపించి నీ కుమారుని మోహపరిచి, అగ్ని శిఖలవలె ప్రజ్వలిస్తున్న మూడు బాణాలతో దుశ్శాసనుని రొమ్ముపై కొట్టాడు. పూర్తిగా లోహమయమైన ఎనిమిది బాణాలతో, మరల ఇరవై బాణాలతో దుశ్శాసనుడు సాత్యకిని గాయపరిచాడు. సాత్యకి వంగిన కణుపులు గల మూడు బాణాలతో దుశ్శాసనుని రొమ్ముపై కొట్టాడు. ఆ తరువాత మహారథుడైన సాత్యకి తీవ్రకోపంతో దుశ్శాసనుని గుర్రాలను పదునైన బాణాలతో కొట్టాడు. వంగిన కణుపులు గల బాణాలతో సారథిని కొట్టాడు. ఒక భల్లంతో ధనుస్సును, అయిదింటితో చేతి తొడుగును, రెండు భల్లాలతో ధ్వజాన్నీ, రథశక్తినీ, తీక్ష్ణబాణాలతో పార్శ్వరక్షకులనూ, సారథినీ కూడా సంహరించాడు. ధనుస్సు విరిగిపోగా, రథమూ, గుర్రాలు, సారధి నశించగా

దుశ్శాసనుని త్రిగర్తసేనాపతి తన రథంమీదకు తప్పించి తీసికొనిపోయాడు. భారతా! మహాబాహువైన సాత్యకి ముహూర్తకాలం దుశ్శాసనుని వెంటబడ్డాడు. కానీ భీముని ప్రతిజ్ఞను స్మరించి అతనిని చంపలేదు. భారతా! భీమసేనుడు సభామధ్యంలో నీకుమారుల నందరినీ రణభూమిలో చంపుతానని ప్రతిజ్ఞ చేశాడు. రాజా! అలా సాత్యకి రణభూమిలో దుశ్శాసనుని జయించి, త్వరితంగా అర్జునుని బాటలోనే వెళ్ళాడు."

124. సంకుల యుద్ధము

ధృతరాష్ట్రుడిలా అడిగాడు. "అలా వెళ్తున్న సాత్యకిని నివారించటానికి కానీ, చంపటానికి కానీ తగిన మహారథులెవ్వరూ నా సేనలో లేరా? సత్యవిక్రముడైన సాత్యకి ఒక్కడే రణభూమిలో పరాక్రమించాడు. అతడు ఇంద్రునివలె బలవంతుడు. ఇంద్రు డొక్కడే దానవులపై విక్రమించినట్లు విక్రమించాడు. కాకపోతే సాత్యకి వెళ్తున్న దారి సైనిక శూన్యమైందా? లేక అక్కడందరూ చనిపోయారా? సంజయా! వృష్ణివీరుడైన సాత్యకి రణభూమిలో ప్రదర్శించిన పరాక్రమాన్ని గురించి చెప్తున్నావు. ఇంద్రుడు కూడా అటువంటి పనిచేయటానికి ఉత్సాహపడడు. సాత్యకి పరాక్రమం ఊహకందనిదీ, నమ్మలేనిదీ కూడా. అది విని నా మనస్సు వ్యధచెందుతోంది. సాత్యకి ఒక్కడే అంతమంది సైనికులను మట్టిగరిపించాడంటే నా కుమారులు బ్రతికిలేనట్లే భావిస్తున్నాను. సంజయా! మహాత్ములెందరో యుద్ధం చేస్తుండగానే సాత్యకి ఒక్కడే అందరినీ ఓడించి, ఎలా తప్పుకొని పోగలిగాడు? అది నాకు చెప్పు." సంజయుడిలా చెప్తున్నాడు. "రాజా! రథాలు, ఏనుగులు, గుర్రాలు, కాల్బలంతో నిండిన నీ సేనల ప్రయత్నం గొప్పదే. నీ సేనాసమూహం ప్రళయకాలంవలె భయంకరంగా కనిపిస్తోంది. మానదా! నీ సేనాసమూహాలు అన్ని ప్రాంతాలనుండి ఆహ్వానింపబడినవి. లోకంలో ఇంతపెద్ద సమూహం ఇంతవరకు ఒక్కచోట చేరలేదని నా నమ్మకం. అక్కడ చేరిన దేవతలు, చారణులు కూడా ఈలోకంలో ఇదే పెద్ద సమూహంగా నిలిచిపోతుందని మాటాడుకొన్నారు. రాజా! జయద్రథవధ సమయంలో ద్రోణుడు పన్నిన వ్యూహం వంటి వ్యూహాన్ని మరెవ్వరూ నిర్మించలేదు. రణభూమిలో సేనా సమూహాలు ఒకరిమీదకు మరొకరు ఉరుకుతుంటే ఆ ధ్వని ప్రచండవాయువుతో కలతపడిన సముద్రఘోషవలె ఉంది. నరోత్తమా! ఆ నీ సేనలో, పాండవసేనలో కూడా, అన్నివైపుల నుండి వచ్చి చేరిన వందల, వేలదళాలు ఉన్నాయి. రణభూమిలో దృఢకర్ములైన మేటివీరులు రోషంతో పరాక్రమిస్తుంటే అక్కడ రోమాంచజనకంగా మహాభీకరశబ్దం చెలరేగింది.

ఒకరిపై ఒకరు గర్జిస్తున్న కౌరవపాండవుల సింహనాదాలు, కిలకిలారావాలు వేలసార్లు

వినిపించాయి. భారతా! సైనికులు పరస్పరం చంపుకొంటుంటే భీకరమైన భేరీధ్వనులు, బాణశబ్దాలు వినిపిస్తున్నాయి.

మారిషా! ఆ తరువాత భీమసేనుడు, ధృష్టద్యుమ్నుడు, నకులుడు, సహదేవుడు, ధర్మరాజు తమసేనలతో ఇలా అన్నారు. "రండి! కొట్టండి! వేగంగా కలబడండి! వీరులైన అర్జున సాత్యకులు శత్రుసేనలో ప్రవేశించారు. జయద్రధుని చంపటానికి వారు సుఖంగా ముందుకు పోయేటట్లు వెంటనే ప్రయత్నం చేయండి" అంటూ సేనలను ప్రోత్సహించారు. "వారిద్దరూ లేకపోతే కౌరవులు కృతార్థులవుతారు. మనం ఓడిపోతాం. కాబట్టి మీరంతా ఒక్కటై వేగంగా కౌరవసేనా సముద్రాన్ని మహావేగంతో గాలి కడలిని కలతపెట్టినట్టు క్షోభింపజేయండి." రాజా! భీమసేనుడు, ధృష్టద్యుమ్నుడు వారినలా ప్రోత్సహిస్తే రణభూమిలో తమకిష్టమైన ప్రాణాలపై ప్రీతినికూడా విడనాడి, వారు కౌరవులను సంహరించసాగారు. వారు రణభూమిలో మిత్రకార్యంకోసం తమ ప్రాణాలు పోయినా ఫరవాలే దనుకొన్నారు. రాజా! అలాగే నీ సేనలు కూడా మహాకీర్తిని అభిలషిస్తూ, యుద్ధాన్ని గౌరవంగా భావించి, యుద్ధంకోసమే నిలిచారు. అలా ఘోరయుద్ధం కొనసాగుతుండగా సాత్యకి సర్వసేనలను జయించి, అర్జునునివైపుకు సాగిపోయాడు. పాండవులు అలా ప్రయత్నిస్తుండగా దుర్యోధనుడు ఆ మహాసేనలో ప్రవేశించాడు. కౌరవపాండవసేనల మధ్య జరుగుతున్న ఆ భీకర సంగ్రామం సర్వప్రాణులకు మహావినాశకరంగా పరిణమించింది.

ధృతరాష్ట్రుడిలా అడిగాడు. "సూతా! అలా సైనికులందరూ పారిపోగా, తానుకూడా సంకటస్థితికి లోనైన దుర్యోధనుడు యుద్ధభూమిలో వెన్నుచూపలేదు గదా! మహారణభూమిలో ఒకడు అనేకులతో పోరాడటం, విశేషించి దుర్యోధనునకు అది విషమస్థితి అని నేను భావిస్తున్నాను. దుర్యోధనుడు సుఖంగా పెరిగినవాడు. సంపదకూ, రాజ్యానికీ ప్రభువు. అటువంటివాడు ఒంటరిగా అందరితో పోరాడవలసిన స్థితిలో వెనుదిరిగిపోలేదు గదా!" సంజయుడిలా అన్నాడు. "రాజా! నీ కుమారుడు ఒంటరిగా చాలామంది శత్రువులతో ఆశ్చర్యకరంగా పోరాడాడు. అది చెపుతున్నా విను. రణభూమిలో దుర్యోధనుడు పాండవ సేనను ఏనుగు తామరకొలనును కలచివేసినట్లు పూర్తిగా మధించాడు. రాజా! ఆపై నీ కుమారునిచేత పంపబడిన ఆ సేనను చూసి, భీమసేనుని ముందుంచుకొని, పంచాలురు దుర్యోధనుని ఆక్రమించారు. ఆ దుర్యోధనుడు పదిబాణాలతో పాండుసుతుడైన భీముని గాయపరిచాడు. వీరులైన నకుల సహదేవులను మూడు మూడు బాణాలతో ధర్మరాజును ఏడుబాణాలతో కొట్టాడు. ఆరింటితో విరాటద్రుపదులను, నూరింటితో శిఖండిని, ఇరవై బాణాలతో ధృష్టద్యుమ్నుని, మూడు మూడింటితో ద్రౌపదికొడుకులను గాయపరిచాడు. ఆ తరువాత రణభూమిలో వందలకొలదిగ ఇతర యోధులను, ఏనుగులను, రథాలను

తీక్ష్ణమైన బాణాలతో ఖండించాడు. ఆ దుర్యోధనుడు ధనుస్సును మండలాకృతిగానే ఉంచాడు. బాణాలను సంధించటం కానీ, విడవటం కానీ కనిపించటం లేదు. శిక్షణ, అస్త్రబలం అక్కడ పనిచేస్తున్నాయి.

కౌరవ్యా! విజయానికై ప్రయత్నిస్తున్న నీ కుమారుని వింటిని యుధిష్ఠిర నరపాలుడు రెండు భల్లాలతో ఖండించాడు. చక్కగా ప్రయోగించిన పది బాణాలతో దుర్యోధనుని గాయపరిచాడు. అవి కవచాన్ని కూడా ఛేదించి, వేగంగా నేలగూలాయి. పాండవులందరూ ఆనందంతో యుధిష్ఠిరుని చుట్టూ నిలిచారు. ఆపై దుర్యోధనుడు మరొక వింటిని చేతబట్టి "నిలు! నిలు!" అంటూ ధర్మరాజుపై దాడిచేశాడు. మీదకు వస్తున్న నీ కుమారుని గమనించి, జయాభిలాషగల పంచాలురు ఉల్లాసంగా ఎదురువెళ్ళారు. అయితే యుద్ధంలో ధర్మజుని బంధింపదలచిన ద్రోణుడు, మేఘాలను పర్వతం నివారించినట్లు నిరోధించాడు. రాజా! అక్కడ రుద్రక్రీడవలె సర్వప్రాణులను సంహరిస్తూ నీవారికీ, పాండవులకూ మధ్య రోమాంచజనకమైన మహాసంగ్రామం జరిగింది. ఆ తరువాత అర్జునుడు వెళ్ళిన దారిలోనుండి సర్వశబ్దాలనూ అతిక్రమిస్తూ రోమాంచజనకమైన మహాశబ్దం వినిపించింది. మహాబాహూ! భారతసేనల మధ్యలో ఆ మహాసంగ్రామంలో అర్జునుడు, నీ విలుకాండ్రు, సాత్యకి గర్జనలు చేయసాగారు. ద్రోణుడు కూడా వ్యూహ ద్వారం దగ్గర నిలిచి శత్రువులతో పాటు సింహనాదాలు చేయసాగాడు. రాజా! ఈ రీతిగా అర్జునుడు, ద్రోణుడు, మహారథుడైన సాత్యకి కోపించిన ఫలితంగా లోకంలో వినాశనం జరిగింది."

125. ద్రోణపరాక్రమము

సంజయుడిలా చెప్తున్నాడు. "మహారాజా! అహరాహ్ణకాలంలో మరల ద్రోణునకు సోమకులతో మేఘగర్జనలవంటి శబ్దంతో మహాసంగ్రామం జరిగింది. ద్రోణుడు ఎర్రని గుర్రాలరథాన్నెక్కి రణభూమిలో మధ్యమవేగంతో పాండవులపై దాడిచేశాడు. ద్రోణుడు నీకు ప్రియాన్నీ, హితాన్నీ కల్గించాలని చిత్రమైన రెక్కలుగల పదునైన బాణాలతో సోమకులను, సృంజయులను, కేకయులను సంహరించసాగాడు. రాజా! యోధులలో గొప్ప గొప్ప వారిని వెతుకుతూ, ప్రతాపవంతుడైన ద్రోణుడు రణభూమిలో ఆడుకొనసాగాడు. సోదరులయిదుగురిలో శ్రేష్ఠుడు, కేకయమహారథుడు అయిన బృహత్క్షత్రుడు ద్రోణుని ఎదిరించాడు. గంధమాదన పర్వతంపై మహామేఘం వర్షించినట్లు బృహత్ క్షత్రుడు తీక్ష్ణబాణాలను విడుస్తూ, ద్రోణాచార్యుని తీవ్రంగా పీడించాడు. మహారాజా! ద్రోణుడు తీవ్రకోపంతో బంగారు రెక్కలు గలిగి సానబెట్టిన పదిహేనుబాణాలను బృహత్క్షత్రునిపై ప్రయోగించాడు. ద్రోణుడు విడిచిన కుపిత సర్పాలవంటి ఆ బాణాలను బృహత్క్షత్రుడు

ఒక్కొక్కదానిని అయిదు బాణాలతో విరిచి, ఉల్లాసంతో నిలిచాడు. ద్విజశ్రేష్ఠుడైన ద్రోణుడు బృహత్క్షత్రుని నేర్పును చూసి , నవ్వి, వంగిన కణుపులు గల ఎనిమిది బాణాలను అతనిపై ప్రయోగించాడు. ద్రోణుని వింటినుండి వెలువడి వేగంగా మీద పడబోతున్న ఆ బాణాలను బృహత్క్షత్రుడు అదే సంఖ్యగల పదునైన బాణాలతో రణభూమిలో వారించాడు. మహారాజా! బృహత్క్షత్రుడు మరీక్లిష్టమైన ఆ పని చేయటాన్ని చూసి, నీ సైన్యం విస్మయానికి లోనైంది. ఆపై ద్రోణుడు బృహత్క్షత్రుని మించిపోతూ రణభూమిలో దివ్యమూ, దుర్జయమూ అయిన బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించాడు.

రాజేంద్రా! కేకయ రాజు ఆ బ్రహ్మాస్త్రాన్ని చూచి బ్రహ్మాస్త్రంతోనే దానిని ఉపశమింపచేశాడు. భారతా! బ్రహ్మాస్త్రం శమించగానే బృహత్క్షత్రుడు సానబెట్టిన అరవై బాణాలతో బ్రాహ్మణు డయిన ద్రోణుని గాయపరిచాడు. నరోత్తముడైన ద్రోణుడు ఒక బాణంతో బృహత్క్షత్రుని గాయపరిచాడు. అది అతని కవచాన్ని ఛేదించి, నేలదూరింది. రాజశ్రేష్ఠా! నాగుపాము పుట్టలోనికి దూరినట్లు రణభూమిలో ద్రోణుడు విడిచిన బాణం బృహత్క్షత్రుని చీల్చి నేలలోనికి చొచ్చుకొనిపోయింది. ద్రోణబాణాలచే తీవ్రంగా గాయపడిన బృహత్క్షత్రుడు అందమైన కనులను గుండ్రంగా త్రిప్పి, తీవ్రకోపాన్ని ప్రదర్శించాడు. బృహత్క్షత్రుడు బంగారు రెక్కలు గలిగి సానబెట్టిన డెబ్బయి బాణాలతో ద్రోణుని గాయపరిచాడు. ద్రోణుని సారథిని ఒక బాణంతో మర్మస్థానాలలో తీవ్రంగా గాయపరిచాడు. బృహత్క్షత్రుడు తీవ్రంగా గాయపరచగా ద్రోణుడు తీక్ష్ణబాణాలను అతని రథంమీదకు విడిచాడు. బృహత్క్షత్రుని ద్రోణుడు కలతపెట్టి, నాలుగు బాణాలతో అతని నాలుగు గుర్రాలను చంపివేశాడు. ఒక బాణంతో సారథిని రథాసనం నుండి పడగొట్టాడు. రెండు బాణాలతో ధ్వజాన్ని, గొడుగును, ఖండించి, నేలకు పడగొట్టాడు. ఆపై చక్కగా లాగివిడిచిన బాణంతో ద్రోణుడు బృహత్క్షత్రుని రొమ్ముపై కొట్టాడు. గుండె బ్రద్దలై అతడు నేలబడ్డాడు. బృహత్క్షత్రుడు మరణించగానే శిశుపాలుని కొడుకు (ధృష్టకేతువు) తన సారథితో ఇలా అన్నాడు. 'సారథీ! కవచాన్ని ధరించి, కేకయులనూ, పాంచాలసేననూ సంహరిస్తున్న ద్రోణుడున్న చోటికి రథాన్ని నడుపు'. ధృష్టకేతుని మాట విని సారధి ఆ రథిక శ్రేష్ఠుని కాంబోజదేశపు గుర్రాలతో ద్రోణుని దగ్గరకు కొనిపోయాడు. ధృష్టకేతువు మిడత నిప్పులో పడ్డట్టు ద్రోణుని చంపగోరి, ఆయనమీదకు వెళ్ళాడు. అప్పుడు అరవై బాణాలతో అశ్వరథధ్వజాలతో పాటు ద్రోణుని గాయపరిచాడు. నిదురిస్తున్న పులిని రెచ్చగొట్టినట్లు మరల తీక్ష్ణబాణాలతో ఆయనను కొట్టాడు. విజయాన్ని అభిలషిస్తున్న ఆపరాక్రమశాలి ధృష్టకేతువు ధనుస్సును ద్రోణుడు గ్రద్దయీకలు గల పదునైన క్షురప్రంతో మధ్యకు

ఖండించాడు. ఆపై మహారథుడైన ధృష్టకేతువు మరొక వింటిని చేతబట్టి డేగ, నెమలి ఈకలు గల బాణాలతో ద్రోణుని గాయపరిచాడు. ద్రోణుడు నాలుగు బాణాలతో ధృష్టకేతుని నాలుగు గుర్రాలను చంపి, అతని సారథి శిరస్సును నవ్వుతూ శరీరంనుండి ఖండించాడు. ఆపై ఇరవై అయిదు బాణాలతో ధృష్టకేతువును బాధించాడు. ధృష్టకేతువు రథంమీదనుండి దూకి, గదను చేతబట్టి, కోపించిన త్రాచుపామును కొట్టినట్లు ద్రోణునిపైకి విసిరాడు. లోహమయమై, సువర్ణభూషితమైన ఆ పెద్దగద ఉద్యమించిన కాళరాత్రివలె మీదకు రావటాన్ని చూసి, ద్రోణుడు ఎన్నో వేల పదునైన బాణాలతో దానిని ఖండించాడు. ద్రోణుడు అనేక బాణాలను ప్రయోగించాడు. ముక్కలై భూతలాన్ని ధ్వనింపజేస్తూ ఆ గద పడిపోయింది. గద బ్రద్దలు కావటాన్ని చూసి, వీరుడు అసహనశీలుడైన ధృష్టకేతువు అసహనంతో తోమరాన్ని, సువర్ణకాంతిగల శక్తిని విసిరాడు. తోమరాన్ని అయిదింటితో, శక్తిని అయిదింటితో ద్రోణుడు ఖండించాడు. అవి గరుత్మంతుడు ఖండించిన రెండు పాములవలె నేలగూలాయి. ఆపై ప్రతాపశాలి అయిన ద్రోణుడు ధృష్టకేతువును చంపదలచి, రణభూమిలో తీక్ష్ణమైన బాణాన్ని అతనిపైకి ప్రయోగించాడు. అది అమితతేజస్వి అయిన ధృష్టకేతువు కవచాన్ని, హృదయాన్ని బ్రద్దలు చేసి హంస తామరకొలనులో దిగినట్లు నేలలో గ్రుచ్చుకొన్నది. ఆకలిగొన్న నెమలి క్షుద్రపక్షులను కబలించినట్లు శూరుడైన ద్రోణుడు మహాసంగ్రామంలో ధృష్టకేతువును కబళించాడు. చేదిరాజైన ధృష్టకేతువు మరణించగానే పరమాస్త్రవేత్త అయిన అతని కొడుకు అమర్షానికి లోనయి తండ్రి స్థానానికి వచ్చి నిలిచాడు. బలశాలి అయిన పెద్దపులి మహారణ్యంలో జింకపిల్లను చంపినట్లు ద్రోణుడు ధృష్టకేతువు కొడుకును కూడా నవ్వుతూ, బాణాలతో యమసదనానికి పంపించాడు. భారతా! ఆ పాండవపక్షసేనలు నశిస్తుండగా వీరుడైన జరాసంధసుతుడు స్వయంగా ద్రోణుని మీదకు వచ్చాడు. ఆ జరాసంధసుతుడు రణభూమిలో శరధారలతో మేఘం సూర్యుని కప్పినట్లు ద్రోణుని వేగంగా కనిపించకుండా చేశాడు. జరాసంధకుమారుని ఆ నైపుణ్యాన్ని చూసి, ద్రోణుడు వేగంగా వందల వేలకొలదిగ బాణాలను విడిచాడు. రణభూమిలో ద్రోణుడు జరాసంధసుతుడు రథంమీద ఉండగానే విలుకాండ్రు అందరూ చూస్తుండగానే వేగంగా కొట్టాడు. మృత్యువు వలె నున్న ద్రోణుడు తన దగ్గరకు వచ్చిన అందరినీ కాలం సమీపించినప్పుడు యముడు కబళించినట్లు కబళించసాగాడు. ద్రోణుడు రణభూమిలో తనపేరు వినిపించి, అనేక సహస్ర బాణాలతో పాండవసేనలను ఆవరించాడు. ద్రోణుని పేర వెలువడుతున్న సానబెట్టిన ఆ బాణాలు రణభూమిలో వంధ్యలకొలది సైనికులను, ఏనుగులను, గుర్రాలను, చంపివేశాయి. ఇంద్రుడు మహాసురులను చంపినట్టు ద్రోణునిచే చంపబడుతున్న ఆ పాంచాలసేనలు చలిబాధతో గోవులు వణికినట్లు కంపించసాగారు.

భరతర్షభా! ద్రోణుడు సైన్యాలను సంహరిస్తుండగా పాండవసేనలలో భీకరమైన ఆర్తనాదం పెల్లుబికింది. సూర్యుడు తపింపజేస్తుంటే, బాణాలు సంహరిస్తుంటే పంచాలురు భీతమనస్కులై కలతజెందారు. రణభూమిలో ద్రోణుని బాణాలచే మోహానికి లోనైన పంచాల మహారథుల తొడలు నిశ్చలంగా నిలిచిపోయాయి. మహారాజా! చేదులు, సృంజయులు, కాశులు, కోసలులు యుద్ధాభిలాషతో ఉల్లాసంగా ద్రోణునిపై దాడిచేశారు. చేది పాంచాల సృంజయులు రణభూమిలో "ద్రోణుని చంపండి! ద్రోణుని చంపండి!" అని ఒకరితో ఒకరు చెప్పుకొంటూ ద్రోణునిపై దాడిచేశారు. ఆ పురుషశ్రేష్ఠులందరూ సర్వశక్తులను ఒడ్డి, మహాతేజస్వి అయిన ద్రోణుని యమసదనానికి పంపించదలచి, ప్రయత్నించసాగారు. అలా ప్రయత్నిస్తున్న ఆ వీరులను, ప్రత్యేకించి చేదివంశప్రముఖులను ద్రోణుడు బాణాలతో యమసదనానికి పంపించాడు. చేది వంశప్రముఖులందరూ నశిస్తుండగా ద్రోణబాణాల పీడనకు గురియై, పాంచాలురు కంపించిపోయారు. ద్రోణ పరాక్రమాన్ని చూసి, వారంతా భీమసేనుని కోసం, ధృష్టద్యుమ్నునికోసం అరవసాగారు. "ఆ బ్రాహ్మణుడు తప్పక ఇతరుల కసాధ్యమైన మహాతపస్సు చేసి వుంటాడు. అందుకే రణభూమిలో తీవ్రకోపంతో క్షత్రియశ్రేష్ఠులను దహిస్తున్నాడు. **క్షత్రియునకు యుద్ధమే ధర్మం. బ్రాహ్మణునకు మహాతపస్సే ధర్మం. తపస్వియై ధనుర్విద్యను వేర్చినవాడు చూపులతోనే దహించగలడు.*** భారతా! క్షత్రియశ్రేష్ఠులు ఎందరో రణభూమిలో అస్త్రా లనే ఉష్ణస్పర్శగల ద్రోణాగ్నిలో ప్రవేశించారు. అది ఘోరమైనది. దాటరానిది. దానిలో తగలబడిపోతున్నారు. యథాబలంగా, యథోత్సాహంగా, యథాశక్తిగా మహాతేజస్వి అయిన ద్రోణుడు సర్వప్రాణులనూ మోహింపజేస్తూ మనసేనలను సంహరిస్తున్నాడు" అని పాంచాలురు అనుకోసాగారు. అలా మాటాడుతున్న వారి మాటలను విని, క్షత్రధర్ముడు యుద్ధాసక్తితో ద్రోణుని ఎదుట నిలిచాడు. ఆ మహాబలుడు క్రోధంతో ఉద్విగ్నమైన మనస్సుతో, అర్ధచంద్రాకార బాణంతో ద్రోణుని ధనుర్బాణాలు ఖండించాడు. ద్రోణుడు మరీ తీవ్రంగా కోపించి, వేగశాలి అయిన మరొక వింటిని తీసికొని, తీక్ష్ణబాణాన్ని వింటిపై సంధించి, చెవిదాకా లాగి, విడిచాడు. అది క్షత్రధర్ముని సంహరించి నేలగూలింది. ధృష్టద్యుమ్నుని కుమారుడు అలా మరణించగానే సైన్యాలు వణికిపోయాయి.

ఆపై చేకితానుడు ద్రోణుని మీదకు వచ్చాడు. అతడు పదిబాణాలతో ద్రోణుని కొట్టి, రొమ్ముపై గాయపరిచాడు. నాలుగు బాణాలతో రథసారథిని, మరో నాలుగు

---

* **ధర్మో యుద్ధం క్షత్రియస్య బ్రాహ్మణస్య పరం తపః ।**
తపస్వీ కృత విద్యశ్చ ప్రేక్షితేనాపి నిర్దహేత్ ॥ 60

బాణాలతో నాలుగు గుర్రాలను కూడా గాయపరిచాడు. ద్రోణాచార్యుడు మూడుబాణాలతో అతని బాహువులమీద, రొమ్ముమీద కొట్టాడు. ఏడు బాణాలతో ధ్వజాన్ని ముక్కలు చేసి, మూడు బాణాలతో సారథిని సంహరించాడు. అతని రథసారథి మరణించగానే ఆ గుర్రాలు రథాన్ని లాగుకొంటూ పారిపోయాయి. ద్రోణుడు రణభూమిలోవాటి శరీరాలను బాణాలతో నింపివేశాడు. మారిషా! గుర్రాలు, సారథిలేని చేకితాన రథాన్ని చూసి ద్రోణుడు అక్కడ రణభూమిలో గుమిగూడిన చేది, పంచాల, స్పంజయులను అన్నివైపులకు పారద్రోలుతూ ఎంతో శోభించాడు. చెవిదాకా వెంట్రుకలు నెరసియుండగా, శరీరకాంతి శ్యామలవర్ణానికి మారగా నాలుగు వందల సంవత్సరాల వయస్సు గల ద్రోణుడు వృద్ధుడై కూడా పదహారు సంవత్సరాల యువకునివలె రణభూమిలో సంచరించాడు. ద్రోణుడు అలా నిర్భయంగా సంచరిస్తుంటే శత్రువులు ఆయనను దేవేంద్రునిగా భావించారు. అప్పుడు ద్రుపదుడు ఇలా అన్నాడు - "పులి క్షుద్రమృగాలను చంపినట్లు బోయవానివంటి ఈ ద్రోణుడు క్షత్రియులను చంపుతున్నాడు. రణభూమిలో క్షత్రియశ్రేష్ఠులంతా దుర్యోధనుని లోభం వలన మరణిస్తున్నారు. ఈ దుర్బుద్ధి తీవ్ర కష్టాలకు నిలయాలైన లోకాలను పొందుతాడు. వందలకొలది యోధులు నెత్తురోడుతూ నరకబడిన ఆవులవలె, ఎద్దులవలె నేలపై పడి ఉన్నారు. కుక్కలకు, నక్కలకు ఆహారమై ఉన్నారు" మహారాజా! ఆ రీతిగా పలికి అక్షౌహిణీపతి అయిన ద్రుపదుడు రణభూమిలో పాండవులను ముందుంచుకొని, వేగంగా ద్రోణునిపై దాడి చేశాడు."

126. యుధిష్ఠిరుని చింత.

సంజయుడిలా చెప్తున్నాడు. "పాండవ వ్యూహాలను ద్రోణుడు ఎక్కడికక్కడ శిధిలం చేస్తుండగా పాండవులు, పంచాల, సోమక వీరులు దూరంగా పారిపోయారు. భారతా! రౌద్రంగా, రోమాంచజనకంగా యుద్ధం జరుగుతోంది. ప్రళయకాలంలోవలె ప్రపంచానికి తీవ్రవినాశనం జరుగుతోంది. ద్రోణుడు రణభూమిలో పరాక్రమిస్తూ మాటిమాటికీ సింహనాదాలు చేస్తున్నాడు. పాంచాలురు నశిస్తున్నారు. పాండవసేనలు చంపబడుతున్నాయి. ఆ సమయంలో యుధిష్ఠిరుడైన ధర్మరాజుకు రక్షకు డెవ్వడూ కనిపించలేదు. ఇక ఏం జరుగుతుందో అని ఆలోచించసాగాడు. ఆపై అర్జునుడు కనిపిస్తాడేమో అని అన్నిదిక్కులలో చూడసాగాడు ధర్మరాజు. కానీ అర్జునుడు కానీ, కృష్ణుడు కానీ కనిపించలేదు. కపిధ్వజం గల అర్జునుడు కనిపించక, గాండివధ్వని వినిపించక ధర్మరాజు ఇంద్రియాలన్నీ వ్యథకు లోనయ్యాయి. సాత్యకి కూడా కనిపించకపోవటంతో యుధిష్ఠిరుడైన ధర్మరాజును చింత

కలచివేసింది. ధర్మరాజు లోకనిందకు భయపడుతూ, అర్జునసాత్యకులు కనిపించకపోవటంతో శాంతిపొందలేకపోయాడు. యుధిష్ఠిరుడు సాత్యకి రథ విషయంలో ఇలా ఆలోచించాడు.-

"సత్యవాది, మిత్రులకు అభయదాత అయిన సాత్యకిని నేనే అర్జునుని బాటలో వెళ్ళమని పంపాను. కాబట్టి అంతకుముందు ఒక్క అర్జునుని గురించియే చింత. ఇప్పుడది రెండు అయింది. ఇప్పుడు సాత్యకి ఎక్కడున్నాడో తెలియాలి. పాండుసుతుడైన అర్జునుడు ఎక్కడున్నాడో తెలియాలి. అర్జునుని వెనుక వెళ్ళమని సాత్యకిని పంపాను. ఇప్పుడు రణభూమిలో సాత్యకి వెనుక ఎవరిని పంపగలను ? ఇప్పుడు అర్జునుని వెతకటానికి మాత్రమే ప్రయత్నించి, సాత్యకిని వెతికించకపోతే లోకం నన్ను నిందిస్తుంది. యుధిష్ఠిరుడు సోదరుని వెదికించి, సాత్యకిని విడిచిపెట్టాడని అంటారు. లోకాపవాద భయంతో మహోత్ముడైన సాత్యకిని వెదకటానికి భీముని పంపిస్తాను. అర్జునుడంటే నాకెలా ఇష్టమో, సాత్యకి అన్నా అలాగే ఇష్టం. సాత్యకిపై నేను పెద్దభారాన్ని పెట్టాను. ఆ సాత్యకి మిత్రుని ఒత్తిడితో, దానిని తనకు గౌరవంగా భావించి, మొసలి సముద్రంలో ప్రవేశించినట్లు కౌరవసేనలో ప్రవేశించాడు. వృష్ణివీరుడు, ధీమంతుడైన సాత్యకితో కలిసి పోరాడుతున్న శూరుల కోలాహలం వినిపిస్తూనే ఉంది. వారు వెనుకంజ వేసేవారు కాదు. ఇప్పుడు కర్తవ్యాన్ని గురించి తీవ్రంగా అనేకరీతులుగా ఆలోచించాను. మహారథులయిన అర్జున సాత్యకులు వెళ్ళిన వైపు, పాండుకుమారుడు విలుకాడు అయిన భీమసేనుని పంపటం నాకు ఉచిత మనిపిస్తోంది. భీమసేనుడు సహింపలేనిది లోకంలో ఏదీ లేదు. ఇతడు రణరంగంలో సంసిద్ధుడై, లోకంలోని విలుకాండ్రు అందరూ ఎదిరించినా తన బాహుబలాన్ని ఆశ్రయించి వెంటనే దెబ్బతీయగలడు. ఆ భీముని బాహుబలాన్ని ఆశ్రయించియే మేమంతా వనవాసం నుండి తిరిగి రాగలిగాం. ఎప్పుడూ ఓడిపోలేదు. ఇక్కడ నుండి భీముడు సాత్యకి దగ్గరకు వెళితే రణభూమిలో అర్జున సాత్యకులు ఇద్దరూ సనాధు లవుతారు. వాస్తవానికి రణభూమిలో అర్జున సాత్యకులను గురించి చింతించనవసరం లేదు. వారు స్వయంగా శస్త్రవిశారదులు. ఆపై వాసుదేవుని రక్షణలో ఉన్నారు. కానీ ముందు నా మనోవ్యథను తొలగించుకోవాలి. కాబట్టి సాత్యకి మార్గాన్ని అనుసరించి వెళ్ళమని భీముని నియోగిస్తాను. అప్పుడు సాత్యకి విషయంలో నేను తగిన రీతిగా ప్రవర్తించినట్లు భావిస్తాను" అని మనసా నిర్ణయించుకొని యుధిష్ఠిరుడు "భీముడున్న చోటికి నన్ను తీసికొనిపో" అని సారథిని ఆదేశించాడు. ధర్మరాజు మాట విని అశ్వవేత్త అయిన సారథి బంగారు అలంకరణలుగల ఆ రథాన్ని భీముని దగ్గరకు నడిపించాడు. భీమసేనుని దగ్గరకు వచ్చి కర్తవ్యాన్ని గురించి ఆలోచిస్తూ ధర్మజుడు ఏవేవో విషయాలు చెపుతూ మైకం క్రమ్మినట్లయ్యాడు.

రాజా! అలా ఆందోళనకు గురి అయిన యుధిష్ఠిరుడు భీముని పిలిచి ఇలా

అన్నాడు. "భీమసేనా! నీ తమ్ముడు అర్జునుడు దేవతలను, గంధర్వులను, దైత్యులను ఒంటి రథంతో గెలిచినవాడు. కానీ ఇప్పుడు ఎక్కడున్నదీ తెలియటం లేదు". అప్పుడు భీముడు ఆ స్థితిలోనున్న ధర్మజుని చూసి ఇలా బదులిస్తున్నాడు. " నీలో ఇటువంటి ఆందోళనను నేనెప్పుడూ చూడలేదు. వినలేదు కూడా. రాజేంద్రా! గతంలో అతిదుఃఖంతో బ్రద్దలవుతున్న మాకు నీవే గతిగా ఉన్నావు. లే! లే! ఆదేశించు. ఏం చేయమంటావు? మానదా! కురుశ్రేష్ఠా! నాకు అసాధ్యమైన పని కానీ, చేయదగిన పనికానీ ఏదీ లేదు. ఆజ్ఞాపించు! మనస్సులో మధనపడవద్దు!" అప్పుడు ధర్మరాజు కన్నీరు నింపుకొని, త్రాచుపాములె బుసకొడుతూ, వాడిన వదనంతో భీమసేనునితో ఇలా అన్నాడు. "అదిగో ! పాంచజన్య శంఖ ఘోష వినిపిస్తోంది. యశస్వి అయిన వాసుదేవుడు కోపంతో దానిని పూరిస్తున్నాడు. దానిని బట్టి నీ సోదరుడు తప్పక మరణించి ఉంటాడనిపిస్తోంది. అర్జునుడు మరణించినందువలన జనార్దనుడు యుద్ధం చేస్తున్నట్లుంది. పాండవులందరూ ఆ బలశాలి పరాక్రమంతోనే జీవిస్తున్నారు. అటువంటి శూరుడు ఈరోజు జయద్రధుని లొంగదీసికోవటానికి కౌరవసేనలో ప్రవేశించాడు. భీమా! అర్జునుడు వెళ్ళటమే తెలుసుకానీ, మరల వచ్చినట్లు తెలియదు. అర్జునుడు శ్యామవర్ణుడు, యువకుడు, నిద్రను జయించినవాడు. చూడచక్కని మహారథుడు. విశాలమైన వక్షస్థలం గలవాడు, మహాబాహువు, మదపుటేనుగువలె పరాక్రమించగలవాడు. చకోరనేత్రుడు, ఎర్రని ముఖం, పెదవులు గలవాడు. శత్రువులకు భయవర్ధనుడు.

నాకు ప్రియాన్నీ, హితాన్నీ కలిగించాలని స్వర్గలోకం నుండి ఇక్కడకు వచ్చినవాడు. వృద్ధులను సేవించేవాడు, ధీరుడు. కృతజ్ఞుడు, సత్యసంగరుడు. ఆ అర్జునుడు హద్దులెరుగని ఈ కౌరవసేనలో ప్రవేశించాడు. శత్రునాశకుడైన అర్జునుడు ఆ దారుణసేనలో ప్రవేశించగానే అతనినిమనసరించి వెళ్ళమని వీరుడైన సాత్యకిని పంపించాను. భీమా! అతడు వెళ్ళటమే తెలుసుకానీ తిరిగి వచ్చినట్లు తెలియదు.

అరిందమా! ఇదే నా శోకానికి కారణం. నీకు శుభమగుగాక. మహాబాహూ! అర్జునుని కోసం, సాత్యకి కారణంగా దుఃఖిస్తున్నాను. మరల మరల ఆజ్యం పోస్తుంటే అగ్ని జ్వలించినట్లు నా శోకం పెరుగుతోంది. వారి జాడ తెలియటం లేదు. అందుకే ఆందోళన పడుతున్నాను. ఆ సాత్యకి జాడ తెలుసుకో. ఆ మహారధుడు నీ తమ్ముని అనుసరించి వెళ్ళాడు. ఆ మహాబాహువు - సాత్యకి కనిపించనందువలన ఆందోళన పడుతున్నాను. అర్జునుడు మరణించినందువలన ముందు నిలిచి, సాత్యకి పోరాడుతుండవచ్చు. ఆ సాత్యకికి సహాయకులు ఎవ్వరూలేరు. అందుకే ఆందోళన పడుతున్నాను. ఆ సాత్యకి కూడా మరణించినందువలన కృష్ణుడు పోరాడుతుండవచ్చు. పరంతపా! ఆ ఇద్దరి విషయంలో

నా మనస్సు ప్రశాంతంగా లేదు. కౌంతేయా! అర్జునుడు, మహావీరుడైన సాత్యకి వెళ్ళిన చోటికే వెళ్ళు. అది కర్తవ్యంగా భావించు. నేను నీ అన్నను. నా మాటను పాటించు. అర్జునుని గురించి అన్వేషించటం కన్న ఎక్కువగా సాత్యకిని వెతుకు. పార్థా! నాకు ప్రియం చేయాలని సాత్యకి అర్జునుని అనుసరించి. వెళ్ళాడు. ఆ దారి దుర్గమమైనది. ఘోరమైనది. తమనుతాము అదుపు చేసికొనలేనివారు వెళ్ళలేనిది. పాండవా! కృష్ణార్జునులు, సాత్యకి క్షేమంగా ఉండటాన్ని చూడగానే ఆ విషయాన్ని నాకు సూచిస్తూ, పెద్దగా సింహనాదం చేయాలి?"

127. భీమసేన పరాక్రమము.

భీమసేనుడిలా అన్నాడు. "గతంలో బ్రహ్మను, ఈశానుని, ఇంద్రుని, వరుణుని వహించిన రథంమీదనే కృష్ణార్జునులు వెళ్ళారు. వారికి భయం లేదు. నీ ఆజ్ఞను శిరసావహించి ఇదిగో ఇప్పుడే వెళ్తున్నాను. ఆ నరోత్తములను సమీపించి, నీకు సంకేతాన్ని ఇస్తాను". అలాచెప్పి బలిశాలి అయిన భీమసేనుడు యుధిష్ఠిరుని ధృష్టద్యుమ్ననకు ఇతర మిత్రులకు పలుమార్లుగా అప్పగించి, బయలుదేరాడు. భీమసేనుడు ధృష్టద్యుమ్ననితో ఇలా అన్నాడు "మహాబాహూ! ద్రోణుడు అన్ని ఉపాయాలను వినియోగించి ధర్మరాజును బంధించా లనుకోవటం నీకు తెలుసు. ధర్మరాజును మనం రక్షించటం ఎంత అవసరమో అంత అవసరమైన పనిమీదనే నేను వెళ్ళవలసివస్తోంది. ధర్మజుడు నన్ను అలా ఆదేశించాడు. కాదనటానికి మనసొప్పదు. చావదలచిన సైంధవుడున్న చోటికే వెళతాను. ధర్మరాజు ఆదేశాన్ని నిశ్శంకంగా పాటించాలి. నా సోదరుడైన అర్జునుడు, ధీశాలి అయిన సాత్యకి వెళ్ళినవైపే వెళతాను. నీవు నేడు ప్రయత్న పూర్వకంగా యుధిష్ఠిరుని రక్షించు. ఇప్పుడు రణభూమిలో ఇదియే అన్ని పనులకన్నా గొప్పపని." మహారాజా! అప్పుడు ధృష్టద్యుమ్నుడు వృకోదరునితో ఇలా అన్నాడు - "పార్థా! నీ అభీష్టాన్ని నెరవేరుస్తాను. నిశ్చింతగా వెళ్ళు. ద్రోణుడు రణభూమిలో ధృష్టద్యుమ్నుని చంపకుండా ఏ రీతిగానూ ధర్మరాజును బంధించలేడు.' ఆ రీతిగా పాండుసుతుడైన ధర్మరాజును ధృష్టద్యుమ్నుని రక్షణలో నిలిపి, అన్నకు నమస్కరించి, అర్జునుడు వెళ్ళిన దారిలో బయలుదేరాడు.

ధర్మరాజు భీముని కౌగిలించుకొని, శిరస్సు నాఘ్రాణించి, శుభాశీస్సులనిచ్చాడు. భీముడు విప్రులను అర్చించి, సంతృప్తి పరచి, వారికి ప్రదక్షిణం చేసి, మంగళవస్తువులను ఎనిమిదింటిని స్పృశించి, కైరాతక మధువును త్రాగాడు. కైపుతో కన్నులు ఎర్రబడ్డాయి. బలం రెట్టింపు అయింది. విప్రులు స్వస్తివాక్యాలు పలికారు. విజయసిద్ధికి అనుకూలంగా

శకునాలు కనిపించాయి. విజయానందాన్ని కలిగించే బుద్ధిని తనలో సంభావించుకొన్నాడు. గాలి అనుకూలంగా వీచి, విజయాన్ని సూచించింది. భీమసేనుడు కవచాన్నీ, కుండలాలనూ, అంగదాలను, చేతితొడుగులను ధరించి రథంమీదికెక్కాడు. భీముని కవచం లోహనిర్మితం. స్వర్ణాలంకృతం. ఎంతో విలువైనది. అది శరీరమంతా కప్పి మెరుపుతో కూడిన మేఘంవలె భాసించింది. పచ్చని, ఎర్రని, నల్లని, తెల్లని వస్త్రాలతో శరీరాన్ని కప్పుకొని, కంఠరక్షణను ధరించి, ఇంద్రధనుస్సుతో కూడిన మేఘంవలె వెలుగొందాడు. రాజా! భీమసేనుడు యుద్ధాభిలాషతో తనసేనవైపు బయలుదేరగా మరలా ఘోరంగా పాంచజన్యశంఖధ్వని వినిపించింది. మూడులోకాలనూ భయపెట్టే ఆ మహాఘోరధ్వనిని విని, ధర్మరాజు భీమునితో మరలా ఇలా అన్నాడు. "ఈ వృష్ణివీరుడు - కృష్ణుడు శంఖాన్ని గట్టిగా ఊదాడు. ఆ శంఖం భూమ్యాకాశాలను ప్రతిధ్వనింపజేస్తోంది. తప్పక అర్జునుడు తీవ్రమైన ఇబ్బందికి లోనుకాగా కృష్ణుడే కౌరవులందరితో పోరాడుతున్నాడు. పూజ్యురాలైన కుంతి నేడు ఏదో అపశకునాన్ని గురించి ఆలోచిస్తూనే ఉంటుంది. ద్రౌపది, సుభద్రకూడా బంధువులతో కూడి ఏదో అపశకునాన్ని చూస్తూనే ఉంటారు. కాబట్టి భీమా! నీవు వెంటనే అర్జునుడున్న తావుకు వెళ్ళు. అర్జునుని చూడాలన్న కోరికతో నాకు దిక్కు తెలియటంలేదు. సాత్యకి కారణంగా దిక్కులు, మూలలు అన్నీ చీకటి క్రమ్మినట్టున్నాయి. వెళ్ళు! వెళ్ళు!" అని అన్న ఆదేశించగానే భీమసేనుడు ఉడుముచర్మంతో చేసిన చేతితొడుగులు ధరించి, ధనుస్సును చేతబట్టి సిద్ధమయ్యాడు. సోదరులకు ప్రియాన్ని కల్గించే భీముడు అన్న ఆదేశంమేరకు ప్రయాణానికి సిద్ధమయ్యాడు. భీముడు దుందుభిని మ్రోగించి, పదేపదే శంఖాన్ని పూరించి, సింహనాదాలు చేసి, మాటిమాటికి ధనుస్సును ఝుళిపిస్తూ బయలుదేరాడు. ఆ శబ్దంతో వీరుల మనస్సులను క్రుంగదీస్తూ తన ఘోరరూపాన్ని ప్రదర్శిస్తూ వేగంగా శత్రువుల మీదకు వెళ్ళాడు. మనోవేగం, వాయువేగం గల ఉత్తమాశ్వాలు ఉల్లాసంగా సకిలిస్తూ, విశోకుడు పగ్గాలు పట్టగా, సంయమనంతో భీముని కొనిపోసాగాయి. భీముడు చేతితో వింటిని వంచి అల్లెత్రాటిని బిగించి, చెవిదాకా లాగుతూ బాణాలను కురిపిస్తూ శత్రువులను గాయపరుస్తూ, శిథిలపరుస్తూ సేనాముఖంలో కలియదిరిగాడు. ఆ మహాబాహువు బయలుదేరగా, పంచాల సోమక శూరులు దేవేంద్రుని దేవతలు అనుసరించినట్లు అతని వెనుక వెళ్ళారు.

మహారాజా! నీవారంతా ఒక్కటై భీముని నిరోధించారు. దుశ్శలుడు, చిత్రసేనుడు, కుండభేది, వివింశతి, దుర్ముఖుడు, దుస్సహుడు, వికర్ణుడు, శలుడు, విందుడు, అనువిందుడు, సుముఖుడు, దీర్ఘబాహువు, సుదర్శనుడు, బృందారకుడు, సుహస్తుడు, సుషేణుడు, దీర్ఘలోచనుడు, అభయుడు, రౌద్రకర్మ, సువర్మ, దుర్విమోచనుడు - ఈ రథికశ్రేష్ఠులంతా

సేనలతో, అనుచరులతో కలిసి, సంసిద్ధులై రణభూమిలో భీమసేనునిపై దాడిచేశారు. రణభూమిలో వారంతా చుట్టుముట్టగా భీమసేనుడు వారిని చూసి, సింహం క్షుద్రమృగాలపై కురికినట్లు వేగంగా వారిమీదకు వచ్చాడు. ఆ వీరులు అక్కడ మహాదివ్యాస్త్రాలను ప్రదర్శించారు. ఉదయిస్తున్న సూర్యుని మేఘాలవలె భీముని బాణాలతో కప్పివేశారు. భీముడు వాటిని అతిక్రమించి, వేగంగా ద్రోణసేనపై దాడిచేశాడు. ఎదురుగానున్న గజసేనపై శరవృష్టిని కురిపించసాగాడు. ఆ పవనసుతుడు స్వల్పవ్యవధిలోనే సర్వదిక్కులలోనూ బాణాలను కురిపిస్తూ, గజసేనను సంహరించాడు. అరణ్యంలో శరభగర్జనతో భయపడిన మృగాలవలె ఏమగులు అన్నీ భీకరంగా ఘీంకారాలు చేస్తూ, పారిపోయాయి. మరలా తీవ్రవేగంతో ద్రోణసేనపై దాడిచేశాడు. ఉప్పొంగే సముద్రాన్ని చెలియలికట్ట ఆపినట్టు ద్రోణుడు భీమసేనుని నివారించాడు. నవ్వుతూ బాణంతో భీముని నుదుటిపై కొట్టాడు. దానితో భీముడు కిరణాలు పైకి ప్రసరిస్తున్న సూర్యునివలె భాసించాడు. ఈ భీముడు కూడా అర్జునునివలె నన్ను గౌరవించేవాడే అని భావించి ఆచార్యుడు వృకోదరునితో ఇలా అన్నాడు.

"భీమసేనా! రణభూమిలో నేడు నేను నీకు శత్రువును. నన్ను ఓడించకుండా ఈ శత్రుసేనలో ప్రవేశించలేవు. నీ తమ్ముడు అర్జునుడు నా అనుమతితోనే ఈ సేనలో ప్రవేశించాడు. నీవు కూడా అలాగే చేయవచ్చు. లేకపోతే నీవు నా సేనలో ప్రవేశించలేవు." ఆపై భీముడు గురువచనాలను విని, క్రోధంతో కళ్ళెర్రబడగా నిర్భయంగా, వేగంగా ద్రోణునితో ఇలా అన్నాడు. "బ్రహ్మబంధూ! అర్జునుడు తమ అనుమతితో రణభూమిలో ప్రవేశించలేదు. అతడు ఎదురులేని వాడు. ఇంద్రుని సేనలోనైనా ప్రవేశిస్తాడు. ద్రోణా! ఆ అర్జునుడు తమరిని అర్చించాలన్న దృష్టితోనే గౌరవించాడు. కానీ నేను అర్జునుణ్ణి కాను భీమసేనుణ్ణి. తమకు శత్రువును. తమరు మాకు తండ్రి, గురువు, బంధువు కూడా అలాగే మేము తమరికి పుత్రసమానులం. ఆ భావనతోనే మేము అందరమూ తమరిదగ్గర వినయంతో ప్రవర్తిస్తాం. నేటి తమమాటలలో దానికి విపరీతమైన భావం కనిపిస్తోంది. మాకు శత్రువని తమరు భావిస్తే అలాగే కానివ్వండి. ఈ భీమసేనుడు శత్రుత్వానికి తగిన పని చేసి, చూపిస్తాడు." రాజా! ఆపై భీముడు గదను త్రిప్పి యముడు కాలదండాన్ని విసిరినట్లు ద్రోణునిపై విసిరాడు. ద్రోణుడు వెంటనే రథం నుండి దిగాడు. అప్పుడు భీముడు గుర్రాలు, సారథి, ధ్వజాలతో సహా ద్రోణుని రథాన్ని ముక్కలు ముక్కలు చేసి వాయువు వేగంతో చెట్లను పడగొట్టినట్టు యోధులనెందరినో ధూళిలో కలిపాడు.

అప్పుడు నీ కొడుకులు మరల రథికశ్రేష్ఠుడైన ద్రోణుని చుట్టూ నిలిచారు. శ్రేష్ఠయోధుడైన ద్రోణుడు మరొక రథాన్ని ఎక్కి, వ్యూహద్వారం దగ్గరకు వచ్చి, యుద్ధానికి సిద్ధమై నిలిచాడు. భీముడు కోపంతో ఎదురుగా ఉన్న రథసేనపై శరవృష్టిని కురిపించాడు. నీ కొడుకులు రణభూమిలో హింసింపబడుతూ జయకాంక్షతో భీమునితో పోరాడసాగారు. ఆపై క్రుద్ధుడైన దుశ్శాసనుడు భీముని చంపదలచి పూర్తిగా లోహంతో తయారయి, తీక్ష్ణమైన రథశక్తి భీమునిపై విసిరాడు. నీ కుమారుడు విసిరిన ఆ మహాశక్తి మీదపడుతుంటే భీముడు దానిని రెండుగా ఖండించాడు. అది అద్భుతంగా కనిపించింది. ఆపై తీవ్రకోపంతో బలశాలి అయిన భీముడు మరో మూడు మూడు పదునైన బాణాలతో కుండభేదిని, సుషేణుని, దీర్ఘనేత్రుని చంపివేశాడు. ఆపై వీరులైన నీ కుమారులు యుద్ధం చేస్తుండగానే భీముడు వారిలో కురువంశ కీర్తి వర్ధనుడైన బృందారకుని చంపాడు. భీముడు మరల మూడు బాణాలతో నీ కుమారులైన అభయుని, రౌద్రకర్ముని, దుర్విమోచనుని సంహరించాడు. భీముడు సంహరిస్తుండగా నీ కుమారులు శ్రేష్ఠయోధుడైన భీముని అన్నివైపుల నుండి చుట్టుముట్టసాగారు. వారంతా భీమునిపై బాణవృష్టిని కురిపించారు. రాళ్ళవాన కురుస్తుంటే పర్వతం చలించనట్లు భీముడు ఆ బాణవృష్టిని సహించి, వ్యధ చెందక నిలిచాడు. భీముడు నవ్వుతూనే విందానువిందులను, నీ కొడుకైన సువర్మను బాణాలతో యమసదనానికి పంపించాడు.

భరతర్షభా ! ఆ తరువాత వీరుడు నీ కుమారుడైన సుదర్శనుని వేగంగా రణభూమిలో గాయపరిచాడు. సుదర్శనుడు పడి, చనిపోయాడు. ఆ పాండుకుమారుడు స్వల్ప వ్యవధిలోనే దిక్కులనన్నింటినీ పరికించి బాణాలతో ఆ రథసేనను సంహరించాడు. రాజా! సింహగర్జనతో మృగాలు చెదరిపోయినట్లు నీ కుమారులు రణభూమిలో రథఘోషతో చెదరిపోయారు. భీమసేనుని చూసి భయపడి, కలతపడి అందరూ వేగంగా పారిపోయారు. భీముడు నీ కుమారుల మహాసేనను వెంటబడి తరిమాడు. రాజా! భీముడు కౌరవులను అన్నివైపుల నుండి గాయపరిచాడు. భీమసేనుని హింసకు గురి అయిన వీరు భీముని వీడి, తమ మేలుజాతి గుర్రాలను అదిలిస్తూ రణభూమి నుండి పారిపోయారు. భీమసేనుడు యుద్ధంలో వారిని జయించి, సింహనాదం చేశాడు. బాహువులు అప్పళించాడు. భీముడు పెద్దగా కరతలధ్వనులు కూడా చేసి, రథసేనను భయపెట్టి, గొప్పగొప్ప యోధులను సంహరించి, రథికులను కూడా అతిక్రమించి, ద్రోణసేనపై దాడిచేశాడు."

128. యుధిష్ఠిర హర్షము.

సంజయుడిలా చెప్తున్నాడు. "రణభూమిలో రధసేనను దాటివస్తున్న భీముని చూసి నవ్వుతూ, ద్రోణుడు, అతనిని నివారింపదలచి బాణవృష్టిని కురిపించాడు. ద్రోణుని వింటినుండి వెలువడిన ఆ బాణసమూహాన్ని త్రాగుతున్నట్లు భీముడు తన బలం మాయతో కౌరవబంధువుల నందరినీ మోహానికి గురిచేస్తూ, వారిపై దాడిచేశాడు. మేటివిలుకాండ్రైన కౌరవసేనలోని రాజులు నీ కుమారుల ప్రేరణతో రణభూమిలో వేగంగా ఆ భీమసేనుని అన్నివైపులనుండి నివారించారు. భారతా! వారలా చుట్టుముట్టగా భీమసేనుడు సింహనాదం చేస్తూ తన గదను ఎత్తి, వేగంగా దాన్ని వారిపై విసిరాడు. ఇంద్రుడు తన వజ్రాయుధాన్ని ప్రయోగించినట్లు ఆ గద రణభూమిలో నీ సైనికులను మథించింది. రాజా! ఆ గద మహాఘోషతో భూమండలాన్ని నింపుతూ, భయంకరంగా నీ కొడుకులను భయపెట్టింది. మహావేగం, మహాతేజస్సు గల ఆ గద మీదపడుతుంటే నీవారందరూ భీకరంగా అరుస్తూ, ఆక్రోశిస్తూ పారిపోయారు. అసహ్యమైన ఆ గదాశబ్దాన్ని విని, ఆ రణభూమిలో అనేక రథికులు రథాలనుండి పడిపోయారు. భీముడు అలా సంహరిస్తుంటే నీ సేనలు భయపడి, పులి వాసన పసిగట్టిన మృగాలవలె పారిపోసాగాయి. భీముడు రణభూమిలో దుర్జయులైన శత్రువులను పారద్రోలి, పక్షిరాజైన గరుత్మంతునివలె వేగంగా సేనను దాటిపోయాడు. భీమసేనుడు అలా సేనాసంహారం చేస్తుండగా ద్రోణుడు భీముని ఎదిరించాడు. ద్రోణుడు భీముని నివారించి, పాండవులకు భయం కలిగిస్తూ వెంటనే సింహనాదం చేశాడు. మహారాజా! మహాత్ముడైన భీమునకు, ద్రోణునకూ మధ్య జరిగిన ఆ యుద్ధం దేవాసుర సంగ్రామంవలె మహాఘోరంగా ఉంది.

రాజా! అప్పుడు ద్రోణుని చాపం నుండి వెలువడుతున్న తీక్ష్ణ బాణాలతో రణభూమిలో వందలు, వేలకొలదిగ వీరులు మరణిస్తుంటే, భీముడు వేగంగా రథంనుండి దూకి, కన్నులు మూసికొని, నడుస్తూ ద్రోణునిపై దాడిచేశాడు. తలను భుజంపై వాల్చి, చేతులను రొమ్ముపై స్థిరంగా నిలిపి, మనోవాయుగరుడ వేగాన్ని అందుకొని ఆ బలశాలి ద్రోణుని మీదకు వచ్చాడు. ఆబోతు వర్షాన్ని విలాసంగా పరిగ్రహించినట్లు, నరోత్తముడైన భీముడు శరవర్షాన్ని స్వీకరించాడు. మహాబలుడైన భీముడు రణభూమిలో బాణాలదెబ్బ తింటూ, రథం నొగలుపై చేయివేసి ద్రోణుని రథాన్ని విసిరివేశాడు. రాజా! రణభూమిలో భీమునిచే విసిరివేయబడిన ద్రోణుడు సత్వరంగా మరో రథాన్ని ఎక్కి, మరల వ్యూహద్వారం దగ్గర నిలిచాడు. అప్పుడు ద్రోణుని ఉత్సాహం భంగపడింది. అలా వస్తున్న ద్రోణుని చూసి, భీముడు వేగంగా వెళ్ళి, మరల రథం ఇరుసును పట్టుకొని, తీవ్రకోపంతో అతిరథుడైన

96361
A.C.NO.
హైదరాబాద్-500032

ఆ ద్రోణుని మరలా విసిరివేశాడు. ఆ రీతిగా భీమసేనుడు లీలగా ఎనిమిది రథాలను విసిరివేశాడు. మరల రెప్పపాటు కాలంలో ద్రోణుడు తన రథంపై నిలిచి కనిపించాడు. నీ యోధులందరూ ఆశ్చర్యంతో కళ్ళు విప్పార్చి చూడసాగారు. ఆ క్షణంలోనే భీమసేనుని రథసారథి భీముని దగ్గరకు వేగంగా గుర్రాలను నడిపించాడు. కౌరవ్యా! అది అద్భుతంగా ఉంది. ఆపై భీమసేనుడు తన రథాన్ని ఎక్కి, వేగంగా నీ కుమారుని సేనపై దాడిచేశాడు. ఆ భీముడు రణభూమిలో క్షత్రియులను మర్దిస్తూ, సేనలను చీల్చుతూ, ముందుకు వచ్చాడు. భీముడు కృతవర్మ కాపాడుతున్న భోజసేనను సమీపించి, వేగంగా మథించి, వెంటనే ముందుకు సాగిపోయాడు. పులి ఆబోతులను భయపెట్టినట్టు కరతలశబ్దంతో భీముడు సేనలను భయపెడుతూ, సర్వసైన్యాలనూ జయించాడు. భోజసేనను అతిక్రమించి, దరదసేనను దాటి, అలాగే ఇతర మ్లేచ్ఛగణాలను, యుద్ధ విశారదుల నెందరినో ఉల్లంఘించి, అక్కడ పోరాడుతున్న మహారథుడైన సాత్యకిని చూసి, భీముడు ప్రయత్నపూర్వకంగా, వేగంగా రథంపై అక్కడకు వెళ్ళాడు. భీమసేనుడు అర్జునుని చూడగోరి రణభూమిలో నీ యోధుల నందరినీ దాటిపోయాడు. అక్కడ పోరాడుతున్న అర్జునుని చూశాడు భీముడు.

అర్జునుడు సైంధవవధకై పరాక్రమిస్తున్నాడు. అర్జునుని చూసి భీముడు వర్షాకాలంలోని మేఘం గర్జించినట్లు పెద్దపెద్దగా అరిచాడు. భీకరంగా అరుస్తున్న ఆ భీమసేనుని సింహనాదాన్ని రణభూమిలో అర్జునుడు, కృష్ణుడు విన్నారు. మహాబలుడైన ఆ భీముని నినాదాన్ని కృష్ణార్జునులు ఒకే మారు విని, అతనిని చూడగోరి పదేపదే గర్జించారు. మహారాజా! ఆపై అర్జునుడు, కృష్ణుడు కూడా రంకెవేస్తున్న ఆబోతులవలె పెద్దగా అరుస్తూ భీముని సమీపించారు. భీమసేనుని గర్జనను, అర్జునుని సింహనాదాన్ని విని, యుధిష్ఠిరుడు ఆనందించాడు. ఆ ఇద్దరి నినాదాన్ని విని ధర్మరాజు శోకాన్ని వదిలించుకొన్నాడు. శక్తిశాలి అయిన ధర్మజుడు యుద్ధంలో అర్జునుని విజయాన్ని ఆశించాడు. మదాతిశయంతో భీమసేనుడు అలా అరుస్తుంటే యుధిష్ఠిరుడు చిరునవ్వు నవ్వి, ఆ మహాధర్మాత్ముడు మనస్సులో ఏదో అనుకొంటూ ఇలా అన్నాడు.

"భీమా! నీవు సంకేతాన్ని ఇచ్చావు. అన్నమాటను చేసి చూపావు. పాండవా! నీవు శత్రువు వయితే యుద్ధంలో ఎవ్వరూ నిన్ను గెలువలేరు. సవ్యసాచి అయిన అర్జునుడు భాగ్యవశాన రణభూమిలో ప్రాణాలు నిలుపుకొన్నాడు. భాగ్యంకొద్దీ సత్యవిక్రముడైన సాత్యకి క్షేమంగా ఉన్నాడు. భాగ్యవశాన కృష్ణార్జునుల నినాదాలు వింటున్నాను. అర్జునుడు యుద్ధంలో ఇంద్రుని జయించి, అగ్నిని తృప్తి పరిచాడు. అటువంటి శత్రుహంత భాగ్యం కొద్దీ రణభూమిలో జీవించియున్నాడు. మనమంతా అతని బాహుబలాన్ని ఆశ్రయించియే బ్రతికిఉన్నాం. దేవతలు కూడా గెలవలేని నివాతకవచులను ఒకే ధనుస్సుతో ఓడించిన

అర్జునుడు భాగ్యం కొద్దీ జీవించిఉన్నాడు. గోగ్రహణం కోసం గుమిగూడి వచ్చిన కౌరవులనందరినీ విరాటనగరంలో ఓడించినవాడు అర్జునుడు. భాగ్యం కొద్దీ జీవించియున్నాడు. మహాసంగ్రామంలో పదునాలుగువేల మంది కాలకేయులను భుజబలంతో సంహరించినవాడు అర్జునుడు. భాగ్యవశాన జీవించిఉన్నాడు. దుర్యోధనుని కోసం బలశాలి అయిన గంధర్వరాజును అస్త్రపరాక్రమంతో ఓడించినవాడు అర్జునుడు. భాగ్యం కొద్దీ జీవించిఉన్నాడు. అర్జునుడు కిరీటి, శ్వేతవాహనుడు, కృష్ణసారథి, బలశాలి. నాకు ఎప్పుడూ నచ్చినవాడు. భాగ్యంకొద్దీ జీవించిఉన్నాడు.

పుత్రశోక సంతప్తుడై దుష్కరమైన పనిచేయాలన్న తలంపుతో జయద్రథుని చంపాలని ప్రతిజ్ఞ చేశాడు అర్జునుడు. ఈ రోజు యుద్ధంలో సైంధవుని చంపగలడా? వాసుదేవ రక్షణలో సూర్యాస్తమయానికి ముందే ప్రతిజ్ఞను పూర్తిచేసిన అర్జునుని నేను కలవగలనా? దుర్యోధనుని హితం కల్పించటంలో ఆసక్తుడైన సైంధవుడు అర్జునుని చేతిలో మరణించి, శత్రువులను సంతోషపెట్టగలడా? అర్జునుని చేతిలో మరణించిన సైంధవుని చూసిన తరువాత అయినా దుర్యోధనరాజు రణరంగంలో మాతో సంధి చేసికొంటాడా? రణభూమిలో భీమసేనుని చేతిలో చనిపోయిన సోదరులను చూసిన తరువాత అయినా బుద్ధిహీనుడైన దుర్యోధనుడు మాతో సంధి చేసికొంటాడా? నేలగూలిన ఇతర మహాయోధులను చూసిన తరువాత అయినా బుద్ధిహీనుడైన దుర్యోధనుడు పశ్చాత్తాపాన్ని పొందుతాడా? భీష్మ డొక్కడు మరణిస్తే మా శత్రుత్వం శమిస్తుందా? మిగిలిన వీరులను రక్షించుకోవాలని అయినా, సుయోధనుడు సంధికి సిద్ధపడతాడా?" అప్పుడు ఆ రీతిగా అనేక విధాలుగా ధర్మరాజు దయామయుడై చింతిస్తుంటే మరోవైపు ఘోరయుద్ధం జరిగింది.

129. భీమకర్ణుల యుద్ధము - కర్ణపరాజయము

ధృతరాష్ట్ర డిలా అడిగాడు. "ఆ రీతిగా భీమసేనుడు సింహనాదాలు చేస్తున్నప్పుడు ఏ వీరులు నిరోధించారు? భీమసేనునకు ఎదురుగా రణరంగంలో నిలువగలవాడు మూడు లోకాలలోనూ నాకెవ్వరూ కనిపించటం లేదు. సంజయా! కాలునివలె గద నెత్తి యుద్ధం చేస్తున్న భీమసేనునకు రణంలో ఎదురు నిలువగల మగవాడు నా కెవ్వడూ కనిపించటం లేదు. సాక్షాత్తు ఇంద్రుడు కూడా యుద్ధరంలో అతని నెదిరించలేడు. ఇంకెవరు నిలువగలరు? కాలుడు సమస్త ప్రజలను గ్రసించినట్లు భీమసేనుడు రణభూమిలో నా కుమారులనందరినీ మృత్యువుకు బలిచేస్తుంటే చూసి, భీముని నివారించిన వారెవరు? నాకు అర్జునుడంటే అంత భయం లేదు. కృష్ణుడన్నా, సాత్యకి అన్నా, ధృష్టద్యుమ్నుడన్నా

అంత భయంలేదు. కానీ భీముడంటేనే భయం.

సంజయు డిలా చెప్తున్నాడు. "భీమసేనుడు ఆ రీతిగా గర్జిస్తుంటే కర్ణుడు కూడ భీకరంగా సింహనాదాలు చేస్తూ పరాక్రమించాడు. అసహనశీలుడైన కర్ణుడు వెనుగాలిని చెట్టు నిరోధించినట్టు భీమసేనుని మార్గాన్ని నిరోధించాడు. భీముడు కూడా తన ఎదుట నిలిచిన కర్ణుని చూసి, కోపించి, పదునుపెట్టిన బాణాలను బలపూర్వకంగా కర్ణునిపై ప్రయోగించాడు. కర్ణుడు కూడా ఆ బాణాలను స్వీకరించి, ప్రతిగా అనేక బాణాలను ప్రయోగించాడు. ఆ పై కర్ణ భీమసమాగమాన్ని చూసి, యోధులందరి శరీరాలు వణికిపోసాగాయి. ఆ ఇద్దరి చేతిచరుపుల చప్పుళ్లు, భీమసేనుని భీకర సింహనాదమూ విని, రథికులు, ఆశ్వికుల శరీరాలు కూడా కంపించసాగాయి. సర్వయోధుల చేతుల నుండి ధనుర్బాణాలు నేలబడి పోయాయి. కొందరి ప్రాణాలు కూడా పోయాయి. సర్వ సేనల వాహనాలు మలమూత్ర విసర్జన చేశాయి. అన్నీ తెల్లబోయి నిలిచాయి. భయంకరమైన అపశకునాలు కనిపించసాగాయి. రాజా! ఆ కర్ణభీమసేన యుద్ధంలో ఆకాశమంతా గ్రద్దలతో, కాకులతో, డేగలతో నిండిపోయింది. ఆ పై కర్ణుడు ఇరవై బాణాలతో భీముని, వెంటనే అయిదు బాణాలతో రథసారథిని గాయపరిచాడు. భీమసేనుడు కూడా నవ్వుతూ అరవై నాలుగు బాణాలతో కర్ణునిపై దాడి చేశాడు. కర్ణుడు భీమునిపై నాలుగు బాణాలను ప్రయోగించాడు. అవి తన దగ్గరకు రాకముందే భీమసేనుడు వాటిని ముక్కలు ముక్కలు చేశాడు. కర్ణుడు తనను మాటిమాటికి కప్పివేస్తుండగా భీముడు కర్ణుని ధనుస్సును మధ్యకు ఖండించాడు. అనేక బాణాలతో కర్ణుని గాయపరిచాడు. ఆ పై కర్ణుడు మరొక ధనుస్సును తీసికొని, యుద్ధంలో భీముని గాయపరిచాడు. దానితో భీముడు మూడు బాణాలను వేగంగా కర్ణుని ఛాతీపై గ్రుచ్చుకొనేటట్లు కొట్టాడు. ఆ బాణాలతో అప్పుడు కర్ణుడు మూడు శిఖరాలు గల ఉన్నత పర్వతంవలె ప్రకాశించాడు. బాణాలతో గాయపడ్డ కర్ణుని ఛాతీనుండి నెత్తురు ప్రవహించింది. ఆ దెబ్బలతో బాధపడి, కర్ణుడు కొంచెంగా విచలితుడై, ధనుస్సును చెవివరకు లాగి, బాణాలతో భీముని గాయపరిచాడు. ఆ పై మరల వందల, వేల బాణాలను భీమునిపై ప్రయోగించాడు. భీముడు వెంటనే ఒక కత్తితో కర్ణుని వింటి అల్లెత్రాటిని తెగేటట్లు కొట్టాడు. భీమసేనుడు బల్లెంతో కర్ణుని సారథిని రథాసనంపై నుండి పడగొట్టాడు. అతని నాలుగు గుర్రాలను కూడా చంపివేశాడు. రాజా ! గుర్రాలు చనిపోయిన రథం నుండి వెంటనే దూకి, కర్ణుడు భయంతో వృషసేనుని రథమెక్కాడు..

యుద్ధంలో కర్ణుని ఓడించి, భీమసేనుడు మేఘ గర్జనవంటి సింహనాదాన్ని చేశాడు. ఆ సింహనాదాన్ని విని, యుధిష్ఠిరుడు యుద్ధంలో భీమసేనుని చేతిలో కర్ణుడు

ఓడిపోయాడని భావించి, పరమానందాన్ని పొందాడు. అప్పుడు అన్ని వైపులనుండి పాండవసేన శంఖధ్వానాలు చేసింది. శత్రుసేనల ధ్వనిని విని, నీ వారు కూడా పెద్దపెట్టున సింహనాదాలు చేశారు. యుధిష్ఠిర నరపాలుడు ఆనందంతో శంఖ బాణనినాదాలతో, హర్షనాదాలతో తన సేనను నింపేశాడు. రాజా! అప్పుడు అర్జునుడు ధనుష్టంకారాలు చేశాడు. కృష్ణుడు పాంచజన్యశంఖాన్ని పూరించాడు. ఆ రెండింటినీ వినిపించకుండా చేస్తూ భీముడు భయంకరంగా సింహనాదాలు చేశాడు. ఆ ధ్వని సర్వసేనలలోనూ వినిపించింది. ఆ తరువాత ఆ ఇద్దరూ పరస్పరం బాణాలను విడివిడిగా ప్రయోగించుకొన్నారు. కర్ణుడు గట్టిగా కొట్టలేక పోతున్నాడు. భీముడు దృఢంగా వ్యవహరిస్తున్నాడు.

మహారాజా! భీమునిచే అనేక బాణాలచే బాధింపబడుతున్న కర్ణుని చూసి దుర్యోధనుడు "కర్ణుడు కష్టాలలో ఉన్నాడు చూడు. వెంటనే రథాన్ని అందుబాటులో ఉంచు" అంటూ దుశ్శలునితో అన్నాడు. దుర్యోధనుడలా ఆదేశించగానే దుశ్శలుడు కర్ణుని దగ్గరకు పరువెత్తాడు. మహారథుడైన కర్ణుడు దుశ్శలుని రథమెక్కాడు. భీముడు వెంటనే వెళ్ళి పదిబాణాలతో ఇద్దరినీ గాయపరిచి, దుశ్శలుని తల నరికివేశాడు."

130. దుర్యోధన యుద్ధము

సంజయు డిలా చెప్తున్నాడు. "ఆ రీతిగా సేన చెదరిపోగా, అర్జునుడు సైంధవునికై ముందుకు సాగాడు. సాత్యకి, భీమసేనుడు అర్జునుని వెంట నడిచారు. దుర్యోధనుడు తొందరపడుతూ మరొకరథం తోడు లేకుండా, వివిధ కర్తవ్యాలను ఆలోచిస్తూ ద్రోణుని దగ్గరకు వచ్చాడు. అప్పుడు దుర్యోధనుడు కోపంతో కళ్లెర్రచేసి, కంగారు పడుతూ ద్రోణునితో ఇలా అన్నాడు. 'అర్జునుడు, భీమసేనుడు, ఓటమి నెరుగని సాత్యకి ఈ మహారథులు మన విశాలసేనల నన్నింటినీ ఓడించి సైంధవుని సమీపిస్తున్నారు. వారి నెవ్వరూ ఆపలేకపోతున్నారు. పార్థుడు నిన్ను దాటిపోగలిగితే పోవచ్చు. సాత్యకి, భీమసేనుడు కూడా నిన్ను అతిక్రమించి, ఎలా వెళ్ళగలిగారు? సాత్యకి, భీమసేనుడు, అర్జునుడు తమరిని ఓడించటమంటే సముద్రాన్ని ఎండగట్టడం వంటిదే. లోకంలో ఇది ఆశ్చర్యకరమైన విషయం. లోకులు దీన్ని గూర్చి తీవ్రంగా చర్చించుకొంటున్నారు. 'ధనుర్వేద పారంగతుడైన ద్రోణుడు యుద్ధంలో ఎలా ఓడిపోయాడు ?' అని యోధులు అంటున్నారు. తమ ఓటమిని నమ్మలేకపోతున్నారు. తమను అతిక్రమించి, ఆ ముగ్గురు మహారథులు వెళ్ళగలిగా రంటే మందభాగ్యుడనైన నాకు యుద్ధంలో వినాశం తప్పదు. ఈ పరిస్థితిలో కర్తవ్యమేమిటి? తమరేం చెప్పదలచుకొన్నారు. చెప్పండి. జరిగినదేదో జరిగిపోయింది. మిగిలిన దానిని గూర్చి ఆలోచించండి: ఇప్పుడు సైంధవుని రక్షణకై వెంటనే చేయదగిన పని యేది?

బాగా ఆలోచించి త్వరగా ఏర్పాటు చేయండి.' ద్రోణు డిలా అన్నాడు.

నాయనా! ఆలోచించవలసినది చాలా ఉంది. కానీ కర్తవ్యాన్ని చెపుతాను. పాండవ పక్షంలోని ముగ్గురు మహారథులు మనలను దాటి వెళ్ళిపోయారు. అంటే వాళ్ళవల్ల ముందు వెనుక కూడా భయం సమానమే. అయితే కృష్ణార్జునులున్న చోట మరీ ఎక్కువగా భయపడాలి. కౌరవసేన ముందు, వెనుక కూడా శత్రువుల దాడికి గురియై ఉంది. ఇప్పుడు సర్వాత్మనా సైంధవ సంరక్షణమే కర్తవ్యమని నేను భావిస్తున్నాను. కోపించిన అర్జునుడంటే సైంధవుడు బెదరిపోయి ఉన్నాడు. అతన్ని రక్షించటమే అన్నిటికన్న ముఖ్యం. భయంకరులైన సాత్యకి భీమసేనులు ఇప్పటికే సైంధవునికై ముందుకు వెళ్ళారు. శకుని బుద్ధిలో పుట్టిన జూదం ఇదిగో ఇప్పుడీ రీతిగా సఫలమవుతోంది. ఆ సభలో ఎవ్వరూ గెలవలేదు. ఎవ్వరూ ఓడలేదు. ఇప్పుడు ప్రాణాల నొడ్డి జూదమాడుతున్నాం. గెలుపో, ఓటమియో ఇప్పుడు తేలుతుంది. శకుని కౌరవసభలో భయంకరమైన పాచికలను పట్టి జూదమాడాడు. అప్పుడు వాటిని పాచికలనే అనుకొన్నాడు కానీ నిజాని కవి తిరుగులేని బాణాలు. నాయనా! నీ కౌరవసేనలు ఎక్కువగా నిలిచి ఉన్న ప్రదేశమే సభ. సైన్యమే జూదరులు. రాజా! బాణాలే పాచికలు సైంధవుడే పణం. జూదంలో గెలుపోటముల నిశ్చయం అక్కడే జరుగుతుంది. మహారాజా! సైంధవుని ప్రాణాల నొడ్డి, మనకు శత్రువులతో గొప్ప జూదం జరుగుతోంది. ఇక్కడ అందరూ తమ జీవితాలపై ఆశను వీడి, విధిగా సైంధవరక్షణ చేయాలి. అప్పుడు జూదమాడుతున్న మనకు జయమో, అపజయమో తేలుతుంది. మేటి విలుకాండ్రైన వారంతా ప్రయత్న పూర్వకంగా సైంధవుని రక్షిస్తున్నారు. నీవు కూడా అక్కడకు వెంటనే వెళ్ళు. సైంధవ రక్షకులను రక్షించు. నేను ఇక్కడే ఉంటాను, మరికొందరిని అక్కడకు పంపుతాను. పాండు సృంజయులతో కూడి పాంచాలురను ఇక్కడే నిలువరిస్తాను.' ఆ పై దుర్యోధనుడు ఆచార్యుని ఆదేశం మేరకు భీకరయుద్ధ కర్మకు తనను తాను సిద్ధం చేసికొని, తన అనుచరులతో పాటు వెళ్ళాడు. అర్జునుని చక్రరక్షకులైన పాంచాల దేశీయులు - యుధామన్యుడు, ఉత్తమౌజుడు సేనల వెలుపలి ప్రక్క నుండి అర్జునుని సమీపానికి వెళ్ళసాగారు. మహారాజా! అర్జునుడు యుద్ధంచేసే తలంపుతో నీ సేనలోనికి చొచ్చినపుడు కృతవర్మ ముందుగానే వారిద్దరినీ నివారించాడు. ఇప్పుడు వారిద్దరూ వెలుపల ప్రక్కనుండి నీ సేనను ఛేదించి లోనికి చొచ్చుకొని వస్తున్నారు. ఆ ప్రక్క నుండి సేనలోనికి చొచ్చుకొనివస్తున్న ఆ ఇద్దరిని దుర్యోధనుడు చూశాడు. దుర్యోధనుడు వెంటనే త్వరపడుతూ వస్తున్న ఆ సోదరులిరువురితో తీవ్రంగా పోరాడాడు. మహారథులుగా ప్రసిద్ధి పొందిన ఆ క్షత్రియ శ్రేష్ఠులిరువురూ యుద్ధంలో విండ్ల నెక్కుపెట్టి, దుర్యోధనునిపై దాడి చేశారు. యుధామన్యుడు గ్రద్ద రెక్కలు గల ముప్పై బాణాలతో

దుర్యోధనుని, ఇరవై బాణాలతో అతని సారధిని, నాలుగు బాణాలతో నాలుగు గుర్రాలను గాయపరిచాడు. నీ కుమారుడైన దుర్యోధనుడు ఒక బాణంతో యుధామన్యుని ధ్వజాన్ని ఖండించాడు. మరొక బాణంతో అతని వింటిని విరిచాడు. ఒక భల్లంతో అతని సారథిని రథం మీది ఆసనం నుండి పడగొట్టాడు. ఆ పై తీక్ష్ణబాణాలు నాలుగింటితో నాలుగు గుర్రాలను గాయపరిచాడు. యుధామన్యుడు కూడా కోపించి వేగంగా ముప్పై బాణాలను నీ కుమారుని ఛాతీపై విడిచాడు. అదే రీతిగా ఉత్తమౌజుడు కూడా కోపించి, శరాలతో దుర్యోధనుని సారధిని గాయపరిచి, యమసదనానికి పంపించాడు. రాజేంద్రా! దుర్యోధనుడు కూడా పాంచాలుడైన ఉత్తమౌజుని నాలుగు గుర్రాలను, రథ పృష్ఠ రక్షకునీ, సారథినీ కూడా చంపివేశాడు. యుద్ధంలో గుర్రాలు, సారథీ మరణిస్తే ఉత్తమౌజుడు త్వరత్వరగా సోదరుడైన యుధామన్యుని రథాన్నెక్కి అనేక బాణాలతో దుర్యోధనుని గుర్రాలను కొట్టాడు. అవి చచ్చి నేలగూలాయి. దుర్యోధనుని గుర్రాలు పడిపోగానే ఒక గొప్ప బాణాన్ని ప్రయోగించి యుధామన్యుడు దుర్యోధనుని వింటిని, అమ్ముల పొదిని ఛేదించాడు. గుర్రాలు, సారథీ చనిపోగా ఆ రథం నుండి వెంటనే దూకి నీ కుమారుడు - దుర్యోధనుడు గదను చేతబట్టి పాంచాలురపై దాడి చేశాడు. అప్పుడు దుర్యోధనుడు కోపంతో మీదకు రావటాన్ని చూసి, యుధామన్యుడు, ఉత్తమౌజుడు రథం వెనుక నుండి క్రిందకు దూకారు. రాజా! ఆ పై గదాధారి అయిన దుర్యోధనుడు క్రోధంతో స్వర్ణాలంకరణాలు గల ఆ రథాన్ని గుర్రాలు, సారథి, ధ్వజంతో సహా గదాఘాతాలతో చూర్ణం చేశాడు. నీ కుమారుడు తన గుర్రాలను సారథిని కోలుపోయి పాంచాలుర రథాన్ని భంగపరచి వెంటనే శల్యుని రథమెక్కాడు. ఆ పై వారిరువురు (యుధామన్యుడు - ఉత్తమౌజుడు) వేరే రథాల నెక్కి అర్జునుని దగ్గరకు వెళ్ళిపోయారు."

131. భీమసేనుడు కర్ణుని ఓడించుట

"మహారాజా! రోమాంచజనకంగా యుద్ధం జరుగుతోంది. అందరూ అన్ని వైపుల నుండి బాధలకు గురి అవుతూ కలవరపడుతున్నారు. కర్ణుడు యుద్ధాభిలాషతో మరల భీముని ముందుకు వచ్చాడు. ధృతరాష్ట్రుడిలా అడిగాడు. 'కర్ణుడు, భీముడు ఇద్దరూ మహాబలులు. వారు అర్జునుని రథానికి దగ్గరగా నిలిచి పోరాడుతున్నారు గదా! ఆ యుద్ధ మెలా ఉంది ? కర్ణుని భీమసేనుడు ఇంతకుముందే యుద్ధంలో ఓడించాడు గదా! మహారథుడైన అతడు మరల భీముని మీదకు ఎలా వచ్చాడు? భీముడైనా భూమండలంలో మహారథుడుగా ప్రసిద్ధి పొందిన కర్ణునితో యుద్ధం చేయాటానికెలా ముందుకు వచ్చాడు? ధర్మరాజు కూడా భీష్మ ద్రోణులను ప్రక్కన పెడితే కర్ణునివలన

తప్ప మరెవ్వరివలనా భయపడడు. మహాబాహువు, మహోత్ముడు అయిన రాధేయునికి భయపడి, ఎప్పుడూ అతని పరాక్రమాన్ని గూర్చియే ఆలోచిస్తూ యుధిష్ఠిరుడు కొన్ని సంవత్సరాలపాటు నిద్రకూడా పోలేదు. అటువంటి కర్ణునితో భీముడు రణభూమిలో ఎలా పోరాడాడు?

కర్ణుడు బ్రాహ్మణభక్తుడు, పరాక్రమ సంపన్నుడు. యుద్ధంలో వెనుకంజవేయని శ్రేష్ఠయోధుడు. అటువంటి కర్ణునితో భీముడెలా పోరాడాడు? కర్ణ భీములు వీరులు. మహాబలం, మహాపరాక్రమం గలవారు. అటువంటి వారు ఎదురుపడి ఎలా యుద్ధం చేశారు? కర్ణుడు దయామయుడు. అర్జునునిపై తప్ప ఇతర పాండవులపై ఇంతకు ముందే సోదరభావాన్ని ప్రదర్శించినవాడు. కుంతి మాటను తలచుకొంటూ కూడా భీమునితో ఎలా తలపడ్డాడు? భీముడైనా కర్ణునితో గల పూర్వవైరాన్ని స్మరిస్తూ, కర్ణునితో ఎలా యుద్ధం చేశాడు? సంజయా! కర్ణుడు యుద్ధంలో సమస్త పాండవులను గెలువగలడని దుర్యోధనుడు ఎప్పుడూ ఆశపడుతుంటాడు. అటువంటి వాడు భీకరకర్మలు చేయగల భీమసేనునితో ఎలా పోరాడుతున్నాడు? నాయనా! నా కుమారులు కర్ణుని ఆశ్రయించియే మహారథులైన పాండవులతో శత్రుత్వాన్ని వహించారు. అటువంటి కర్ణునితో భీముడెలా యుద్ధం చేస్తున్నాడు ? కర్ణుని కారణంగా పుట్టిన వివిధ విపరీత చర్యలను తలచుకొంటూ భీముడు కర్ణునితో ఎలా తలపడుతున్నాడు? కర్ణుడు ఒకే రథాన్ని సహాయంగా తీసికొని సమస్త భూమండలాన్ని జయించాడు. అటువంటి కర్ణునితో భీముడెలా యుద్ధం చేశాడు ? కుండలాలతో, కవచంతో సహా పుట్టిన వానితో రణరంగంలో భీముడెలా పోరాడాడు ? సంజయా! వారిద్దరికీ యుద్ధమెలా జరిగింది? వారిలో ఎవరు గెలిచారు? అదంతా నాకు యథాతథంగా చెప్పు. నీవు బాగా చెప్పగలవు గదా!'

సంజయుడిలా చెప్తున్నాడు. "భీమసేనుడు రథిక శ్రేష్ఠుడైన రాధేయుని విడిచి, వీరులైన కృష్ణార్జునులున్న చోటికి వెళ్ళి లనుకొన్నాడు. భీముడలా వెళ్ళబోతుంటే రాధేయుడు అతనిపై దాడి చేసి మేఘం పర్వతంపై కురిసినట్లు భీమునిపై గ్రద్దరెక్కలు గల బాణాలను వర్షించాడు. కర్ణుడు వికసించిన పద్మంవంటి ముఖంతో పెద్దగా నవ్వుతూ తన నుండి వెళ్ళబోతున్న భీముని యుద్ధానికి ఆహ్వానించాడు. కర్ణ డిలా అన్నాడు. 'భీమా! యుద్ధంలో నీవు వెన్ను చూపుతావని నీ శత్రువులు కలలో కూడా భావించలేదు. అర్జునుని చూడాలన్న కోరికతో నాకు నీవు వెన్ను చూపుతా వెందుకు ? పాండు కుమారా! కుంతి కొడుకులకు ఇది తగిన పని కాదు. కాబట్టి నా ఎదుట నిలిచి నాపై బాణవృష్టిని కురిపించు.' కర్ణుడు తననలా యుద్ధానికి ఆహ్వానించటాన్ని భీమసేనుడు సహించలేకపోయాడు. అర్ధవృత్తాకారంగా తిరిగి కర్ణునితో యుద్ధం ప్రారంభించాడు. భీమసేనుడు, కవచాన్ని ధరించి, ధ్వైరథ

యుద్ధానికి సమాయత్తుడై యున్న కర్ణునిపై బాణాల వర్షాన్ని కురిపించాడు. యుద్ధాన్ని ముగించాలన్న సంకల్పంతో భీముడు కర్ణుని చంపాలనుకొంటూ తీవ్రంగా గాయపరిచాడు. అతని అనుచరులను కూడా చంపాలని భావించాడు. కర్ణుడు మదించిన ఏనుగులవలె మీద పడుతున్న ఆ బాణవృష్టులను అస్త్రమాయతో మ్రింగివేశాడు. కర్ణుడు తన అస్త్ర విద్య ద్వారా ద్రోణునివలె గౌరవాన్ని పొంది, రణభూమిలో మామూలుగా సంచరింపసాగాడు. రాజా! క్రోధంతో యుద్ధం చేస్తున్న భీమసేనుని పరిహసిస్తూ కర్ణుడు ఎదురునిలిచాడు. భీముడు కర్ణుని పరిహాసాన్ని సహించలేకపోయాడు. పోరాడుతున్న వీరులందరూ గమనిస్తుండగా భీమసేనుడు అంకుశాలతో మదపుటేనుగును పొడిచినట్టు తన ఎదుట నిలిచిన కర్ణుని వత్సదంతాలనే బాణాలతో గాయపరిచాడు. చిత్రకవచాన్ని ధరించిన కర్ణుని ఇరవై యొక్క బాణాలతో తీవ్రంగా గాయాలపాలు జేశాడు.

కర్ణుడు కూడా వాయువేగం గల భీముని గుర్రాలను అయిదు అయిదు బాణాలతో వేధించాడు. రాజా! ఆ తరువాత అరనిముసంలో భీమసేనుని రథం మీద కర్ణుడు ప్రయోగించిన బాణాల వల కనిపించింది. కర్ణుని ధనుస్సు నుండి వెలువడిన బాణాలు భీముని రథం, ధ్వజం, సారధులతో పాటు కప్పివేశాయి. కర్ణుడు అరవై నాలుగు బాణాలతో భీముని దృఢకవచాన్ని ముక్కలు చేశాడు. కోపంతో మర్మస్థానాలను ఛేదించగల బాణాలతో భీముని హింసించాడు. ఆ పై మహాబాహువైన వృకోదరుడు కర్ణుని ధనుస్సు నుండి వెలువడుతున్న బాణాలను పరిగణింపక, తడబాటు లేకుండా, కర్ణునకు దగ్గరగా నిలిచాడు. కర్ణుని ధనుస్సు నుండి వెలువడి విషసర్పాలవలె నున్న ఆ భీకర బాణాలను భరిస్తున్నా భీమసేనుడు వ్యధ చెందలేదు. ఆపై భీమసేనుడు ముప్పయిరెండు వాడిభల్లాలతో కర్ణుని గాయపరిచాడు. సైంధవుని చంపదలచిన ఆ భీమసేనునిపై కర్ణుడు అప్రయత్నంగానే తీవ్రశరవృష్టిని కురిపించాడు. కర్ణుడు మృదువుగానే భీమునితో యుద్ధం చేస్తున్నాడు. కానీ భీముడు గత వైరాన్ని మనస్సులో పెట్టుకొని, క్రోధపూర్వకంగా కర్ణునితో పోరాడుతున్నాడు. అమర్షశీలుడు, శత్రుసంహారకుడైన భీమసేనుడు కర్ణుని మార్దవాన్ని అవమానంగా భావించి, కర్ణునిపై వేగంగా బాణవృష్టిని కురిపించాడు. రణభూమిలో భీమసేనుడు విసిరిన ఆ బాణాలు కూతపెడుతున్న పక్షులవలె వీరుడైన కర్ణుని తనువెల్లా తాకాయి. భీమసేనుని ధనుస్సు నుండి వెలువడిన బాణాలు మెరుస్తున్న వాదరతో కూడినవి. నిప్పును మిడతలు కప్పినట్టు అవి కర్ణుని కప్పివేశాయి.

తన తనువంతా బాణాలు కప్పినా కర్ణుడు భీకర బాణవృష్టిని భీమునిపై కురిపించాడు. వజ్రసమానమైన ఆ బాణాలు తనను చేరకముందే భీముడు అనేక భల్లాలతో వాటిని ముక్కలు చేశాడు. కర్ణుడు రణభూమిలో మరలా భీమసేనుని శరవృష్టిలో ముంచెత్తాడు.

ఒళ్ళంతా బాణాలు గ్రుచ్చుకొన్న భీముని ముళ్ళపందిలా అందరూ చూశారు. కర్ణుని వింటి నుండి వెలువడిన బాణాలు స్వర్ణ పుంఖాలుగలవి. సానబట్టినవి. సూర్యుడు తన కిరణాలను ధరించినట్లు భీముడు రణంలో ఆ బాణాలు ధరించాడు. తనువంతా నెత్తురోడుతున్న భీమసేనుడు వసంతకాలంలో సమృద్ధిగా పూచిన అశోక వృక్షంవలె ప్రకాశించాడు. భీమునకు కోపంతో కళ్ళు తిరుగుతున్నాయి. కర్ణుని ఆ ప్రవర్తనను రణరంగంలో భీముడు సహింపలేకపోయాడు. ఇరవై అయిదు బాణాలతో కర్ణుని పీడించాడు. అప్పుడు కర్ణుడు విషసర్పాలతో కూడిన తెల్లని కొండలా కనిపించాడు. అమర పరాక్రమంగల భీముడు మరలా ఆరు, ఎనిమిది బాణాలతో శరీరాన్ని ఏపాటీ లెక్క చేయని కర్ణుని మర్మస్థానాలలో కొట్టాడు. వెంటనే మరో బాణంతో భీమసేనుడు నవ్వుతున్నట్లు తేలికగా కర్ణుని ధనుస్సును ఛేదించాడు. కర్ణుని గుర్రాలను నాలుగింటిని, రథ సారథిని బాణాలతో చంపివేశాడు. సూర్యకిరణాలవంటి కాంతి గల బాణాలతో కర్ణుని ఛాతీపై గాయపరిచాడు. మేఘాన్ని బ్రద్దలు చేస్తూ సూర్యకిరణాలు ప్రసరించినట్లు ఆ బాణాలు కర్ణుని చీల్చి, వెంటనే నేలపై పడ్డాయి. ధనుస్సు విరిగి, బాణపు దెబ్బలు తిని, తీవ్రంగా కలతపడిన ఆ ఆత్మాభిమాని - కర్ణుడు మరో రథం వైపు వెళ్ళిపోయాడు."

132. కర్ణభీమసేనుల భీకర యుద్ధము

ధృతరాష్ట్ర డిలా అడిగాడు. "పరశురాముడు సాక్షాత్తు పరమేశ్వరుని శిష్యుడు, అటువంటి మహర్షికి శిష్యుడై కర్ణుడు అస్త్రవిద్యలో ఆయనంతవా డయ్యాడు. ఉత్తమ శిష్యలక్షణాలు గల ఆ కర్ణుడు ఆ పరశురాముని మించినవాడు కూడా. కానీ అటువంటి కర్ణుని భీముడు తేలికగా ఓడించాడు. సంజయా! నా కుమారులకు కర్ణుని మీదనే పెద్ద ఆశ. అటువంటి కర్ణుడే భీముని చేతిలో ఓడిపోయి, యుద్ధ విముఖుడైతే దుర్యోధను డేమన్నాడు? మహాబలుడైన భీముడు ఎలా యుద్ధం చేశాడు? అగ్నిలా ప్రజ్వలిస్తున్న భీమసేనుని చూసిన కర్ణుడు ఆ తరువాత ఏం చేశాడు?

సంజయు డిలా చెప్తున్నాడు. 'కర్ణుడు మరలా పద్ధతిగా తయారు చేయబడి ఉన్న మరొక రథాన్ని ఎక్కి, ఎగిసిపడే సముద్రంలా భీమునిపై దాడి చేశాడు. రాజా! కర్ణునిలోని ఆ కోపాన్ని చూసి, నీ కుమారులు అగ్నిలో పడిన ఆహుతిలా భీమసేనుని భావించారు. ఆ పై కర్ణుడు ధనుష్టంకారం చేసి, భీకరంగా చేతులు చరిచి, భీమసేనుని రథం మీదకు దాడి సాగించాడు. మరల కర్ణునకూ, భీమునకూ మధ్య భీకరసంగ్రామం జరిగింది. ఒకరినొకరు చంపదలచుకొన్న ఆ మహాబాహువులు ఇద్దరూ, కోపంతో కళ్ళతోనే తగులబెడుతున్నట్లు ఒకరి నొకరు చూచుకొన్నారు. ఆ శూరులిద్దరూ బుసగొట్టే పాములవలె

నిట్టూర్పులు వదలుతూ, ఒకరినొకరు చెరిగివేశారు. బాగా కోపించిన పులులవలె, క్రుద్ధులైన ఆ ఇద్దరూ డేగలవలె వేగంగా కదులుతూ, కోపించిన శరభాలవలె ఒకరిపై ఒకరు దాడి చేశారు. మహారాజా! జూదమాడేటప్పుడు, అరణ్యంలో, విరాటనగరంలో తాము పొందిన దుఃఖాన్ని తలచుకొని, నీ కొడుకులు తమ రాజ్యాన్నీ, విలువైన రత్నాలను అపహరించటాన్ని తలచుకొని, పుత్రులతో కలిసి నీవు నిరంతరంగా కల్పించిన కష్టాలను స్మరించి, ఏ పాపమూ ఎరుగని కుంతిని పిల్లలతో సహా నీవు చంపించదలచటాన్నీ, సభామధ్యంలో దుర్మార్గులైన నీ కొడుకులు ద్రౌపదిని పెట్టిన బాధలను, దుశ్శాసనుడు ఆమె జుట్టు పట్టుకోవటాన్నీ, కర్ణుడు ఆమెతో పలికిన పరుష వచనాలను గుర్తుకు తెచ్చుకొని, నీ కొడుకులు నీ సమక్షంలోనే "ద్రౌపదీ! మరొక భర్తను వరించు. ఈ భర్తలికలేరు. వారంతా బోలునువ్వులవలె నిర్వీర్యులై కష్టంలో పడిపోయారు" అని పలికిన మాటలను, ద్రౌపదిని దాసిని చేసి అనుభవించాలనుకొన్న నీ కొడుకుల ఆలోచనలను జ్ఞప్తికి తెచ్చుకొని, కృష్ణాజినాలు ధరించి వారు బయలు దేరినప్పుడు సభలో నీ ఎదుటనే కర్ణుడు పలికిన పరుషవచనాలను, పాండవులను గడ్డి పోచలవలె భావించి నీ కొడుకు ఎగిసిపడటాన్ని, తాను సుఖంగా ఉండి కూడా దుర్యోధనుడు కష్టాలలోనున్న పాండవులపై బుద్ధి మాలి కోపాన్ని ప్రదర్శించటాన్ని, చిన్నప్పటి నుండి తాము పొందిన కష్టాలను తలచుకొని భీముడు తన జీవితంపై విరక్తి పొందాడు.

జీవిత మోహాన్ని వీడి స్వర్ణపృష్ఠం కలిగి దురాసదమైన పెద్ద వింటిని, తీసికొని టంకారం చేస్తూ కర్ణునిపై దాడి చేశాడు. ఆ భీమసేనుడు సానపట్టిన, ప్రకాశవంతమైన బాణ సమూహాల వలతో కర్ణుని రథాన్ని కప్పి, సూర్యకాంతిని అడ్డగించాడు. కర్ణుడు నవ్వుతూ వెంటనే సానపెట్టబడి రెక్కలు గల బాణాలతో భీమసేనుని చిన్నాభిన్నం చేశాడు. కర్ణుడు వాడియైన తొమ్మిది మేటి అమ్ములతో భీముని గాయపరిచాడు. అంకుశాలు ఏనుగులను నివారించినట్లు బాణాలు తనను నివారించినా భీమసేనుడు కంగారు పడకుండా కర్ణుని మీదకు వచ్చాడు. భీముడు వేగంగా మీదకు వస్తుండగా మదపుటేనుగు మదపుటేనుగును ఎదిరించినట్లు కర్ణుడు రణభూమిలో భీముని ఎదిరించాడు. కర్ణుడు నందభేరుల ధ్వనిని కలిగిస్తూ, శంఖాన్ని పూరించి, ఎగిసిపడుతున్న సముద్రంవలె పాండవసేనను కల్లోలపరిచాడు. ఏనుగులు, గుర్రాలు, రథాలు, కాల్బలంతో కూడిన ఆ సేన కలతపడటం చూసి, భీముడు కర్ణుని సమీపించి బాణాలతో క్రమ్మి వేశాడు. కర్ణుడు భీముని బాణాలతో ఆచ్ఛాదిస్తూ రణభూమిలో ఎలుగు బంటిరంగు గల తన గుర్రాలను హంసవర్ణం గల భీముని హయాలతో కలిపాడు. వాయు వేగంతో పయనించగల ఎలుగుబంటి రంగుగల గుర్రాలు తెల్లని గుర్రాలతో కలవటం చూసి, నీ కుమారుల సేనలో హాహాకారం చెలరేగింది.

ఆ తెల్లగుర్రాలు, నల్ల గుర్రాలు కలిసి ఆకాశంలో కొంగలవలె భలే అందగించాయి. కోపంతో ఎర్రబడిన కన్నులు గల ఆ కర్ణ భీమసేనులను చూసి, నీ సేనలోని మహారథులందరూ వణికిపోయారు. ఆ ఇరువురి పోరాటం యమరాజు రాజ్యంవలె ఘోరంగా ఉంది. యముని నగరంవలె చూడవీలుగాకుండా ఉంది. ఎవరికీ ఎవరూ తీసిపోని రీతిగా సాగుతున్న ఆ యుద్ధాన్ని చూస్తున్న మహారథులు ఏ ఒక్కరిలోనూ గెలుపును గుర్తించలేకపోయారు.

రాజా! నీవూ, నీ కుమారుడూ చేసిన కుతంత్రాల ఫలితాన్ని, కర్ణ భీమసేనులు కలిసిపోయి చేస్తున్న పోరాటంలో అందరూ చూడసాగారు. ఆ కర్ణ భీమసేనులు వాడి బాణాలతో ఒకరినొకరు కప్పివేస్తూ ఆకాశాన్ని బాణ సమూహాలతో నింపేశారు. ఆ మహారథులిద్దరూ కురుస్తున్న మేఘాలవలె చూడ ముచ్చటగా ఉన్నారు. ఆ కర్ణ భీమసేనులు బంగారుతో తయారు చేసిన బాణాలను విడుస్తూ పెద్ద పెద్ద ఉల్కలు పడినట్లుగా ఆకాశాన్ని ప్రకాశింపజేశారు. ఆ ఇద్దరూ గ్రద్ద రెక్కలు గల బాణాలను విడిస్తే అవి శరత్కాలంలో బెగ్గురు పక్షులు ఆకాశంలో బారులు తీరినట్లుగా వెలుగొందాయి. భీమసేనుడు కర్ణునితో కలబడటాన్ని చూసి, కృష్ణార్జునులు భీమునిపై పెనుభారం పడ్డట్టు భావించారు. అక్కడ కర్ణభీమసేనులు గట్టిగా ప్రయోగించిన బాణాలతాకిడికి మరణించిన గుర్రాలు, సైనికులు, ఏనుగులు బాణపతనానికి దూరంగా ఎగిరి పడుతున్నాయి. రాజా ! కొందరు పడుతున్నారు. కొందరు పడిపోయారు. మరెందరో మరణించారు. ఈ రీతిగా నీ కుమారునిసేనలో జనక్షయం జరుగుతోంది. భరతర్షభా! ప్రాణాలను కోల్పోయిన మనుష్య హయ గజాల శరీరాలతో భూమి క్షణకాలంలో నిండి పోయింది. దక్షయజ్ఞ సంహారకాలంలోని రుద్రుని క్రీడా స్థలంలా అది కనిపించింది."

133. భీమ కర్ణ యుద్ధము - దుర్జయవధ

ధృతరాష్ట్ర డిలా అన్నాడు. "భీమసేనుని పరాక్రమాన్ని నేను అత్యద్భుతమని భావిస్తున్నాను. ఎందుకంటే రణభూమిలో వేగంగా పరాక్రమించగల కర్ణునితో కూడా యుద్ధం చేయగలుగుతున్నాడు. సంజయా! సర్వాయుధాలను ధరించి యుద్ధానికి కూడివచ్చిన దేవతలను, యక్షులను, అసురులను, మనుష్యులను కూడా నిలువరించగలవాడు కర్ణుడు. అటువంటి వాడు భీమసేనుని యుద్ధంలో అతిక్రమించలేకపోయాడు. కారణ మేమిటి? నాకు వివరంగా చెప్పు. ప్రాణాలను పణంగా పెట్టిన వారిద్దరి మధ్య యుద్ధ మెలా జరిగింది? ఇరుపక్షాల జయాపజయాలు వారి యుద్ధం మీదనే ఆధారపడి ఉన్నాయి. సూతా! నా కుమారుడు కర్ణుని ప్రాపుతోడనే శ్రీకృష్ణునితో, సమస్త యాదవులతో కూడిన

పాండవులను జయించాలని ఉబలాటపడుతుంటాడు. భీమసేనుని చేతిలో మాటిమాటికి యుద్ధంలో కర్ణుడు ఓడిపోవటాన్ని వింటుంటే నన్ను మోహం ఆవేశిస్తోంది. సంజయా! నా కుమారుని దుర్నీతులవలననే కౌరవులంతా నశించిపోతున్నారని అనుకొంటున్నాను.

మేటి విలుకాండ్రయిన పాండవులను కర్ణుడు గెలవలేడు. కర్ణుడు పాండుకుమారులతో ఎన్నో మార్లు యుద్ధం చేశాడు. అయితే అన్ని మార్లూ కూడా రణభూమిలో పాండవులే కర్ణుని ఓడించారు. నాయనా! దేవేంద్రునితో కలిసి దేవతలు వచ్చినా పాండవులను గెలవలేరు. మందమతి అయిన సుయోధనుడు దానిని గ్రహించలేడు. కుబేరుని ధనాన్ని అపహరించినట్లు నా కొడుకు ధర్మజుని ధనాన్ని అపహరించాడు. పైనున్న తేనెను పొందాలనుకొంటూ లోయలో పడతామన్న విషయాన్ని ఆలోచించని మందబుద్ధి సుయోధనుడు. కపటత్వంలో నిష్ణాతుడు సుయోధనుడు. ఆ కపటత్వంతోనే మహాత్ములయిన పాండవుల రాజ్యాన్ని హరించాడు. తాను గెలిచినట్లే భావించుకొంటూ పాండవులను పరాభవిస్తున్నాడు. పుత్రస్నేహపు దెబ్బతో నన్ను నేను సంబాళించు కొనలేక నేను కూడా ధర్మబద్ధులు, మహాత్ములు అయిన పాండుకుమారులను వంచించాను. యుధిష్ఠిరుడు దీర్ఘదర్శి. తన సోదరులతో సహా శాంతినే కోరేవాడు. కానీ దానిని అశక్తతగా భావించి, నా కుమారులు సంధిని అంగీకరించలేదు. పలుమారు కల్పించిన దుఃఖాలను, అపకారాలను అన్నింటినీ మనస్సులో పెట్టుకొని మహాబాహువైన భీమసేనుడు కర్ణునితో యుద్ధం చేసి ఉంటాడు. కాబట్టి సంజయా! యుద్ధనిపుణులై ఒకరినొకరు చంపదలచుకొన్న కర్ణభీములు ఎలా యుద్ధం చేశారో నాకు స్పష్టంగా చెప్పు."

సంజయు డిలా చెప్తున్నాడు. "రాజా! పరస్పరం చంపగోరుతూ పోరాడిన వన గజాలకువలె కర్ణభీములకు మధ్య జరిగిన పోరాటాన్ని యథాతథంగా విను. రాజా! క్రుద్ధుడైన కర్ణుడు, భీముని ఆక్రమించి ముప్పయి బాణాలతో గాయపరిచాడు. వాడిమొనలు, కల బాణాలతో కర్ణుడు భీముని హింసించాడు. ఆ బాణాలను ప్రయోగిస్తున్న కర్ణుని ధనుస్సును భీముడు మూడు వాడి బాణాలతో ఖండించాడు. రథసారథిని ఒక భల్లంతో పడగొట్టాడు. అప్పుడు కర్ణుడు భీముని చంపగోరి వేగంగా శక్తిని చేత బట్టి, వైకెత్తి, భీముని పైకి విసిరాడు. అది భీముని ప్రాణాలను అంతం చేసేటట్లుంది. రాధేయుడు ఆ శక్తిని విడిచి పెద్దపెట్టున అరిచాడు. ఆ నాదాన్ని విని, నీ కుమారులు ఆనందించారు. కర్ణుని బాహువులనుండి వెలువడిన ఆశక్తి సూర్యునివలె, అగ్నివలె ప్రకాశిస్తోంది. భీముడు ఏడు బాణాలతో ఆ శక్తిని ఆకాశంలోనే ఖండించాడు. కుబుసం విడిచిన పాములవలె ఉన్న ఆ శక్తిని ఖండించి భీమసేనుడు కర్ణుని ప్రాణాలను అన్వేషిస్తున్నట్లు బాణాలను ప్రయోగించాడు. ఆ బాణాలు సానపెట్టి పదును చేయబడినవి. యమదండంవలె భీకరమైనవి.

అప్పుడు కర్ణుడు మరొకవింటిని చేతబట్టాడు.

అది స్వర్ణపీఠం గలది. భరింపరానిది. ఆ మహాచాపాన్ని ఆకర్షించి కర్ణుడు బాణాలను విడిచాడు. రాజా! కర్ణుడు విడిచిన ఆ తొమ్మిది మహాశరాలను భీమసేనుడు వంగిన కణుపులు గల తొమ్మిది బాణాలతో ఖండించి భీముడు సింహంలా గర్జించాడు. బలిష్ఠులైన ఆ కర్ణ భీములు ఆబోతులవలె రంకెలు వేస్తూ పోట్లాడుకొనే పులులవలె గర్జించారు. కర్ణభీములు గోశాలలోని ఆబోతులవలె ఒకరి నొకరు దెబ్బతీయాలని అవకాశం కోసం ఎదురుచూస్తూ, ఒకరివైపు మరొకరు.తీక్ష్ణంగా చూస్తున్నారు. కర్ణభీములు ధనుస్సులను పూర్తిగా లాగి, విడిచిన బాణాలతో ఒకరినొకరు దెబ్బతీస్తున్నారు. కర్ణభీములు శస్త్రవృష్టితో ఒకరినొకరు దహిస్తున్నారు. కోపంతో కన్నులు విప్పార్చి పరస్పరం తీవ్రంగా చూసుకొంటూ హేళన చేసికొంటూ, ఒకరినొకరు బెదిరిస్తూ, శంఖాలను పూరిస్తూ పరస్పరం పోరాడుతున్నారు. మారిషా! భీముడు మరల కర్ణుని వింటిని మధ్యకు విరిచాడు. శంఖవర్ణంగల కర్ణుని గుర్రాలను బాణాలతో యమపురికి పంపాడు. కర్ణుని సారథిని కూడా రథం మీది ఆసనం నుండి క్రిందకు పడ గొట్టాడు. కర్ణుడు బాణ సమూహం వలన ఏం చేయాలో తెలియని స్థితికి లోనయ్యాడు. కర్ణుని క్లిష్టస్థితిని చూసి, దుర్యోధన నరపాలుడు కోపంతో కంపించిపోతూ దుర్జయుని ఇలా ఆదేశించాడు –

'దుర్జయా! వెళ్ళు. భీముడు రాధేయుని మన ఎదుటనే కబళించబోతున్నాడు. కర్ణుని బలాన్ని పెంపొందిస్తూ తూబరకుడు (వయస్సు వచ్చినా మీసం గడ్డం రానివాడు) అయిన ఆ భీముని చంపు.' నీ కుమారుడు దుర్జయుడు సుయోధనునితో 'అలాగే' అని చెప్పి భీమసేనునిపై దాడిచేశాడు. దుర్జయుడు తొమ్మిది బాణాలతో భీమసేనుని, ఎనిమిది బాణాలతో గుర్రాలను, ఆరుబాణాలతో రథ సారథిని, మూడు బాణాలతో ధ్వజాన్ని, మరల ఏడు బాణాలతో భీముని కొట్టాడు. భీమసేనుడు కూడా కోపించి బాణాలతో దుర్జయుని మర్మస్థలాలను భేదించి సారథితో, గుర్రాలతో పాటు అతనిని యమసదనానికి పంపించాడు. భూషణాలను అలంకరించుకొని ఉన్న నీ కుమారుడు శిథిలావయవాలతో నేల గూలి, దెబ్బతిన్న పాములవలె విలవిలలాడసాగాడు. అప్పుడు కర్ణుడు దీనుడై ఏడుస్తూ నీ కుమారునకు ప్రదక్షిణం చేశాడు. ఈ రీతిగా కర్ణుని విరథుని చేసి, భీమసేనుడు బాణసమూహాలతో, శతఘ్నులతో, శంకువులతో కర్ణుని కప్పివేశాడు. అయినా కూడా భీమసేనుని బాణాలతో గాయపడుతూ కూడా కర్ణుడు భీమసేనుని విడిచి రణభూమి నుండి పారిపోలేదు.

134. కర్ణభీమసేన యుద్ధము, దుర్ముఖవధ, కర్ణపలాయనము.

సర్వవిధాలుగా విరథుడై భీమసేనునిచే పరాజితుడైన కర్ణుడు మరొక రథాన్ని ఎక్కి, మరలా భీమసేనుని గాయపరిచాడు. దంతాలకొనలతో పరస్పరం ఢీకొన్న మహాగజాలవలె కర్ణభీమసేనులు ధనుస్సులను పూర్తిగా లాగి విడిచిన బాణాలతో ఒకరినొకరు హింసించుకొన్నారు. కర్ణుడు బాణ సమూహాలతో భీమసేనుని గాయపరిచి, పెద్దపెట్టున సింహనాదం చేసి, మళ్లీ భీముని ఛాతీపై దెబ్బకొట్టాడు. భీముడు సూటిగా పయనించే పదిబాణాలతో కర్ణుని ఎదురు దెబ్బతీశాడు. మరల వంగిన కణుపులు గల డెబ్బయి బాణాలతో కర్ణుని గాయపరిచాడు. రాజా! భీముడు తొమ్మిది బాణాలతో కర్ణుని ఛాతీపై తీవ్రంగా గాయంచేసి, ఒక పదునైన బాణంతో ధ్వజాన్ని ఖండించాడు. ఆపై భీముడు అరవై మూడు బాణాలతో కర్ణుని గాయపరిచాడు. భీమునిచే అలా తీవ్రంగా గాయపడిన కర్ణునికి క్రోధంతో కనుకొనలు ఎరుపెక్కాయి. అతడు పెదవుల కొనలను నాకసాగాడు. ఆ తరువాత శరీరం మొత్తాన్ని చీల్చగల బాణాన్ని కర్ణుడు భీమునిపై ప్రయోగించాడు. కర్ణుని వింటినుండి వెలువడిన విచిత్రపక్షాలు గల ఆ బాణం యుద్ధంలో భీముని శరీరాన్ని చీల్చి, భూమిని చీల్చుతూ లోనికి చొచ్చుకొని పోయింది. భీమసేనుడు క్రోధంతో కన్నెర్రజేసి ఒక పెద్దగదను కర్ణునిపైకి అలవోకగా విసిరాడు. అది వజ్ర సమానమైనది భీమసేనుడు ఆ గదతో చక్కగా రథాన్ని లాగుతున్న కర్ణుని మేటిగుర్రాలను కొట్టాడు. భీమసేనుడు రెండు క్షురాలతో కర్ణుని ధ్వజాన్ని ఖండించి, బాణాలతో రథసారథిని చంపాడు. వెంటనే ఆ రథాన్ని విడిచి, కర్ణుడు కలతపడి, వింటిని ఆకర్షిస్తూ నిలిచాడు. అక్కడ రథం లేకపోయినా రథికశ్రేష్ఠుడై శత్రువులను నివారించిన కర్ణుని పరాక్రమం అద్భుతంగా కనిపించింది.

రథాన్ని కోల్పోయిన కర్ణుని చూసి దుర్యోధనుడు తమ్ముడు దుర్ముఖునితో 'దుర్ముఖా! అదిగో! భీముడు కర్ణుని రథహీనుని చేశాడు. ఆ మహారథునికి రథాన్ని సమకూర్చు' అన్నాడు. దుర్యోధనుని మాట విని దుర్ముఖుడు త్వరత్వరగా కర్ణుని దగ్గరకు చేరాడు. బాణాలతో భీముని నివారించాడు. కర్ణుని అనుసరించి వస్తున్న దుర్ముఖుని చూసి, భీముడు పెదవులకొనలను నాకుతూ ఆనందించాడు. బాణాలతో కర్ణుని నిరోధించి, భీముడు దుర్ముఖునివైపు వేగంగా రథాన్ని నడిపాడు. తొమ్మిది బాణాలతో భీమసేనుడు దుర్ముఖుని యమసదనానికి పంపాడు. రాజా! దుర్ముఖుడు మరణించగానే కర్ణుడు అదే రథాన్ని ఎక్కి ప్రజ్వలించే సూర్యునిలా ప్రకాశించాడు. మర్మస్థలాలు బ్రద్దలై నెత్తురోడుతూ పడియున్న దుర్ముఖుని చూసి, కర్ణుడు కన్నీరు కార్చుతూ ముహూర్తకాలం దాడిని

ఆపాడు. మరణించిన దుర్ముఖుని దాటి, ప్రదక్షిణం చేసి, కర్ణుడు వేడి నిట్టూర్పులు విడుస్తూ కర్తవ్య మూఢు డయ్యాడు. ఆ వ్యవధిలోనే భీమసేనుడు గ్రద్దరెక్కలుగల పదునాలుగు బాణాలను కర్ణునిపై ప్రయోగించాడు. మహారాజా! మహాతేజస్సు, సువర్ణ పక్షాలు గల ఆ బాణాలు సువర్ణచిత్రమైన కర్ణుని కవచాన్ని భేదించి, పదిదిక్కులను వెలుగొందజేశాయి.. రక్తం త్రాగే ఆ బాణాలు కాలప్రేరణతో కోపించిన సర్పాలవలె కర్ణుని నెత్తురు త్రాగాయి. ఆ బాణాలు నేలలోనికి చొచ్చుకొని పోతూ శరీరంలోని సగభాగం కన్నంలోనికి ప్రవేశించిన సర్పాలవలె శోభించాయి. కర్ణుడు అదేమీ లెక్క చేయకుండా స్వర్ణభూషితాలై పదునైన పదునాలుగు బాణాలతో భీముని కూడా గాయపరిచాడు. రెక్కలు గల ఆ భీకరబాణాలు భీమసేనుని కుడిభుజాన్ని చీల్చి, భూమిలోనికి చొచ్చుకొని పోయాయి. అస్తమించబోయే వేళలోని సూర్య కిరణాలవలె ఆ 'బాణాలు భూమిలోనికి చొచ్చుకొనిపోతూ ప్రకాశించాయి. ఆ బాణాలతో గాయపడి, భీముడు ఎక్కువగా నెత్తురోడసాగాడు. ఈ స్థితిలో భీముడు ప్రయత్నపూర్వకంగా మూడు బాణాలతో కర్ణుని, ఏడు బాణాలతో అతని సారథిని గాయపరిచాడు. దెబ్బలు తిని, కర్ణుడు మహాభయంతో కలతపడి, యుద్ధ భూమిని వీడి, పారిపోయాడు. అతిరథుడైన భీమసేనుడు మాత్రం స్వర్ణాలంకరణలు గల తన వింటిని లాగిపట్టి, జ్వలించే అగ్నివలె రణభూమిలో నిలిచాడు."

135. భీమసేనుడు దుర్మర్షణుడు మొదలైన ధార్తరాష్ట్రులను చంపుట

ధృతరాష్ట్ర డిలా అన్నాడు. "కర్ణుడు ఎంత ప్రయత్నించినా భీముని మించలేక పోయాడంటే ఛీ! పౌరుషం దండగ. దైవమే శ్రేష్ఠ మనిపిస్తోంది. 'కర్ణుడు కృష్ణునితో సహా పాండవులను యుద్ధంలో ఓడించా లనుకొంటున్నాడు. లోకంలో కర్ణునితో సమానుడైన యోధుని ఎవ్వరినీ చూడలేదు' అని దుర్యోధనుడు మాటిమాటికి అనటం నేను విన్నాను. సూతా! బుద్ధిహీనుడైన దుర్యోధనుడు గతంలో నాతో ఇలా అనేవాడు. "కర్ణుడు బలవంతుడు, శూరుడు, మేటివిలుకాడు, అలసటను జయించినవాడు. కర్ణుడు తోడుంటే దేవతలు కూడా యుద్ధంలో నన్ను గెలవలేరు. ఇక శక్తిహీనులు, వివేకహీనులు అయిన పాండుకుమారు లెంత?" అని. విషంలేని పాములవలె ఓడిపోయి, రణభూమినుండి పారిపోయిన కర్ణుని చూసి దుర్యోధనుడు ఏమన్నాడు? అయ్యో ! దుర్యోధనుడు మోహంతో యుద్ధ తంత్ర మెరుగని దుర్ముఖుని ఒంటరిగా అగ్నిలో మిడతను వలె యుద్ధంలోకి ప్రవేశపెట్టాడు. సంజయా! అశ్వత్థామ, శల్యుడు, కృపుడు, కర్ణుడు కలిసి కూడా భీముని ఎదుట నిలువలేరు. ఇది నిశ్చయం. వారైనా భీముని మారుతతేజస్సు, పదివేల ఏనుగులబలమూ, క్రూరప్రయత్నమూ

తెలిసిన వారే. భీముని బల కోప పరాక్రమాల నెరిగిన వారే. యమ, కాల, మృత్యు సమానమైన క్రూరకర్మ ప్రదర్శింపగల భీమునిపై రణభూమిలో ఎందుకు కోపాన్ని చూపుతారు? కర్ణుడు ఒక్కడే తన భుజబలగర్వంతో భీమసేనుని లెక్క చేయక రణభూమిలో యుద్ధం చేశాడు. కర్ణుని యుద్ధంలో ఓడించిన భీమసేనుని రణభూమిలో ఎవరు గెలువగలరు? ఒంటరిగా ద్రోణుని మధించి, కర్ణుని ద్వేషిస్తూ నా సేనలో ప్రవేశింపగలిగినవాడు భీముడు. బ్రతుకు మీద ఆశ ఉన్న వారెవరు భీముని ఎదిరించగలరు? భీముని ఎదుట నిలవటానికి ఎవడు ఉత్సహించగలడు?

మానవుడు యమలోకానికి వెళ్ళి అయినా మరలి రాగలడేమో కానీ భీమసేనునికి ఎదుట నిలిచి మరల వెనక్కు రాలేడు. అల్ప బుద్ధులై క్రుద్ధుడైన భీమసేనునికి ఎదురువెళ్ళినవారు అగ్నిలో ప్రవేశించిన మిడతలవంటివారే. కురుసభలో ఆనాడు కౌరవులందరూ వింటుండగా రౌద్రంతో నా కుమారుని చంపటాన్ని గురించి భీమసేనుడు పలికిన మాటలను తలచుకొని, కర్ణుని ఓటమిని చూసి, భయపడి, దుశ్శాసనుడు దుర్యోధనునితో సహా భీమునికి దూరమయ్యుంటాడు. దుర్బుద్ధియై సభలో మాటిమాటికి కర్ణుడు, దుశ్శాసనుడు, నేను యుద్ధంలో పాండవులను జయించ గల మని దుర్యోధను డన్నాడు. ఆ దుర్యోధనుడు విరథుడై, భీముని చేత ఓటమి నందిన కర్ణుని చూసి, కృష్ణుని మాటలు విననందుకు బాగా పశ్చాత్తాపపడుతుంటాడు. తన సోదరులు భీముని చేతిలో యుద్ధంలో చావటాన్ని చూసి, నా కుమారుడు తాను చేసిన తప్పుకు తీవ్రంగా పశ్చాత్తాపపడుతుంటాడు. క్రుద్ధుడై, భీకరాయుధాలు ధరించి, సాక్షాత్తు యమునివలె నిలిచిన భీమసేనునకు ప్రాణాలపై ఆశ ఉన్నవారెవరూ ఎదురు నిలవలేరు. బడబాగ్ని మధ్యలో పడిన మానవుడైనా బయటపడగలడు. కానీ భీముని ఎదిరించి మాత్రం ప్రాణాలతో బయటపడలేడని నా విశ్వాసం. పాండవులు కానీ, పాంచాలురు కానీ, శ్రీకృష్ణ సాత్యకులు కానీ యుద్ధంలో కోపిస్తే ఎవ్వరి జీవితాలనూ కాపాడరు. అయ్యో! సూతా! నా కుమారుల జీవితాలు ఆపదలో పడ్డాయి."

సంజయు డిలా చెప్తున్నాడు. "కురునందనా! మహాభయం మీద పడినప్పుడు శోకిస్తున్నావు. కానీ **ఈ జగద్వినాశానికి నిస్సంశయంగా నీవే కారణం.** కొడుకుల మాటమేరకు నిలిచి, మహాశత్రుత్వాన్ని స్వయంగా తెచ్చుకొన్నావు. హితకరమైన ఔషధాన్ని స్వీకరింపని మనిషివలె ఎవరు చెప్పినా వినలేదు. మహారాజా! జీర్ణంకాని కాలకూటాన్ని నీ అంతట నీవే త్రాగావు. ఇదంతా దాని ఫలితమే. అనుభవించు. యుద్ధం చేస్తున్న మహాబలశాలు లయిన యోధుల నందరినీ చూసి గర్విస్తున్నావు. అది వ్యర్థం. ఇప్పుడు యుద్ధమెలా జరుగుతోందో చెపుతాను. భీమసేనుని చేతిలో ఓటమినందిన కర్ణుని చూసి, నీ కొడుకులు

అయిదుగురు సోదరులు దానిని సహించలేకపోయారు. దుర్మర్షణుడు, దుస్సహుడు, దుర్మదుడు, దుర్ధరుడు, జయుడు – ఈ అయిదుగురు చిత్రకవచాల్ని ధరించి భీమసేనునిపై పరాక్రమించారు. వారు మహాబాహువయిన వృకోదరుని అన్ని వైపులా నివారించి, మిడతలదండువలె బాణాలతో పది దిక్కులనూ కప్పివేశారు. దేవరూపులయిన ఆ కుమారులను చూసి, వెంటనే భీమసేనుడు నవ్వుతూ యుద్ధంలో వారి దాడిని ప్రతిగ్రహించాడు. భీమసేనుడు ఎదురువెళ్ళిన నీ కుమారులను చూసి, కర్ణుడు మహాబలుడైన భీమసేననకు ఎదురు నిలిచాడు. కర్ణుడు సానపై పదునుపెట్టబడి తీక్ష్ణమైన బాణాలను వదులుతూ వచ్చాడు. కానీ భీముడు నీ కుమారులు నిలవరిస్తున్నా లెక్కచేయక వేగంగా కర్ణునికి ఎదురువెళ్ళాడు. అప్పుడు కౌరవులు భీముని అన్నివైపులా నిరోధిస్తూ, భీమసేనునిపై బాణవృష్టిని కురిపించారు. రాజా! భీముడు ఇరవై అయిదు బాణాలతో గుర్రాలతో, సారథులతో సహా భీకరధనుస్సులు ధరించిన ఆ నరోత్తములను యమసదనానికి పంపించాడు. వారంతా ప్రాణాలు కోలుపోయి, రథ సారథులతో సహా రథాలనుండి పడిపోయారు. కర్ణుని బాణాలతో నిలువరించి, నీ కుమారులను సంహరించిన ఆ భీమసేనుని పరాక్రమం అద్భుతంగా కనిపించింది. పదునైన బాణాలతో అన్ని వైపులా భీమునిచే నివారింపబడిన కర్ణుడు భీమసేనుని తీక్ష్ణంగా చూశాడు. భీమసేనుడు కోపంతో కన్నెర్ర జేసి తన గొప్ప వింటిని లాగి, మాటిమాటికి కర్ణునివైపు తీవ్రంగా చూడసాగాడు.

136. కర్ణపలాయనము - భీముడు ఏడుగురు ధార్తరాష్ట్రులను చంపుట.

నీ కొడుకులు పడిపోవడం చూసి ప్రతాపవంతుడైన కర్ణుడు తీవ్రకోధంతో నిండిపోయాడు. జీవితంపై విరక్తిని పొందాడు. తన కళ్ళఎదుటనే భీముడు నీ కొడుకులను చంపటం చూసి, కర్ణుడు తాను తప్పు చేసినట్లుగా భావించాడు. భీమసేనుడు పూర్వవైరాన్ని తలచుకొంటూ క్రుద్ధుడై, కర్ణుని శరీరంపై పదునైన బాణాలను నాటాడు. రాధేయుడు నవ్వుతూ అయిదు బాణాలతో భీముని గాయపరిచాడు. మరల పదును చేసిన డెబ్బయి బాణాలతో గాయపరిచాడు. కర్ణుడు వేసిన ఆ బాణాలను లెక్క చేయకుండా భీముడు వంగిన కణుపులు గల వందబాణాలతో కర్ణుని గాయపరిచాడు. మరల అయిదు బాణాలతో మర్మస్థానాలలో కర్ణుని గాయపరిచాడు. ఒక భల్లంతో కర్ణుని వింటిని ఖండించాడు. కర్ణుడు మరొక వింటిని చేబట్టి, బాణాలతో భీమసేనుని కప్పివేశాడు. భీముడు కర్ణుని గుర్రాలను, సారథిని చంపి బదులు తీర్చుకొని అట్టహాసం చేశాడు. భీముడు బాణాలతో కర్ణుని ధనుస్సును ఖండించాడు. కర్ణుడు ఆ రథం నుండి దిగి, గదను తీసికొని,

కోపంతో భీమునిపై విసిరాడు. తన మీదకు వస్తున్న ఆ గదను భీమసేనుడు సర్వసేనలు చూస్తుండగానే బాణాలతో నివారించాడు. ఆ పై భీముడు వేలకొలదిగ బాణాలను కర్ణునిపై ప్రయోగించాడు. కర్ణుడు ఆ బాణాలను తన బాణాలతో నిలువరించి, భీమసేనుని కవచాన్ని బాణాలతో బ్రద్దలు చేశాడు. ఆపై ఇరవై అయిదు బాణాలతో సర్వసేనలు చూస్తుండగా భీముని బాధించాడు. అది అద్భుత మనిపించింది.

భీముడు కోపించి తొమ్మిది బాణాలను కర్ణునిపై ప్రయోగించాడు. తీక్ష్ణమైన ఆ బాణాలు కర్ణుని కవచాన్ని, ఎడమ చేతిని చీల్చి పాములు పుట్టలో దూరినట్టు నేల మీద పడ్డాయి. భీమసేనుని బాణసమూహాలు తనను కప్పివేయగా కర్ణుడు మరల రణభూమి నుండి పారిపోయాడు. భీముని బాణాలు కప్పివేయగా యుద్ధవిముఖుడైన కర్ణుని చూసి, దుర్యోధనునరపాలుడిలా అన్నాడు. "త్వరగా, పూర్తిగా సంసిద్ధులై కర్ణునిరథం వైపు వెళ్లండి" అప్పుడు నీ కొడుకులు సోదరుని మాటను విని, వెంటనే బాణాలను విడుస్తూ రణభూమిలో భీమునికి ఎదురు వెళ్ళారు. వారు చిత్రుడు, ఉపచిత్రుడు, చిత్రాక్షుడు, చారుచిత్రుడు, శరాసనుడు, చిత్రాయుధుడు, చిత్రవర్మ. వారంతా రణభూమిలో చిత్రంగా యుద్ధం చేయగలవారు. వారు మీదకు వస్తుండగానే మహారథుడైన భీమసేనుడు ఒక్కొక్కరిని ఒక్కొక్క బాణంతో చంపివేశాడు. వారు మరణించి, గాలికి కూలిన చెట్లవలె నేలపై పడిపోయారు. రాజా! మహారథులైన నీ కొడుకులు చనిపోవడం చూసి, కర్ణుడు అశ్రుపూర్ణముఖుడై, విదురుడు చెప్పిన మాటను తలచుకొన్నాడు. యథావిధిగా సిద్ధం చేయబడిన మరొక రథాన్ని ఎక్కి, కర్ణుడు త్వరగా భీమునిపై దాడి చేశాడు. బంగారు రెక్కలు గల బాణాలతో ఆ ఇద్దరూ ఒకరినొకరు భేదించుకొని, సూర్యకిరణాలతో కుట్టిన మేఘాలవలె ప్రకాశించారు.

క్రుద్ధుడైన భీమసేనుడు ముప్పది యారు పదునైన భల్లాలతో కర్ణుని కవచాన్ని బ్రద్దలు చేశాడు. కర్ణుడు కూడా వంగిన కణుపులు గల ఏభై బాణాలతో భీమసేనుని గాయపరిచాడు. ఆ ఇద్దరు రక్తచందనాన్ని శరీరానికి పూసికొన్నవారు. ఇద్దరూ బాణాలతో తీవ్రంగా గాయపడినవారు. నెత్తుటితో తడిసిన వారు. ఉదయకాల సూర్యచంద్రులవలె ప్రకాశించారు. బాణాలతో కర్ణ భీముల కవచాలు బ్రద్దలయ్యాయి. శరీరాలు నెత్తురోడుతున్నాయి. కుబుసం విడిచిన పాములవలె ఇద్దరూ ప్రకాశిస్తున్నారు. ఒకరినొకరు దెబ్బకొడుతున్నారు. ఆ వీరులిద్దరూ రెండు మేఘాలవలె శరధారలను కురిపిస్తున్నారు. ఆ ఇద్దరూ సింహనాదాలు చేస్తూ, ఆనందిస్తూ, ఒకరితో ఒకరు ఆడుకొంటూ, రథాలతో మండలాకృతులు కల్పిస్తూ యుద్ధం చేస్తున్నారు. సింహపరాక్రము లయిన ఆ కర్ణ భీములు ధేనువు కోసం పోరాడుకొనే ఆబోతులవలె పోరాడసాగారు. భీమసేనుడు బాహువులతో

ధనుష్టంకారం చేస్తూ, మెరుపుతో కూడిన మేఘంవలె ప్రకాశించాడు. ఆ పై వేల బాణాలను భీముడు కర్ణునిపై కురిపించాడు. బాణాలతో భీముడు కర్ణుని కప్పివేస్తున్న ఆ పరాక్రమాన్ని నీ కుమారులు చూడగలిగారు. భీముడు రణభూమిలో అర్జునుని, కృష్ణుని, సాత్యకిని, చక్రరక్షకులైన యుధామన్యు ఉత్తమౌజులను ఆనందింపజేస్తూ కర్ణునితో పోరాడాడు. భీముని పరాక్రమాన్ని, భుజబలాన్ని, ధైర్యాన్ని చూసి నీ కుమారులు ఉదాసీనులయ్యారు."

137. భీమకర్ణ యుద్ధము - ఏడుగురు ధార్తరాష్ట్రుల వధ.

సంజయుడిలా చెప్తున్నాడు. "భీమసేనుని ధనుష్టంకారాన్ని విని, కర్ణుడు సహించలేకపోయాడు. కర్ణుడు కొద్దిసేపు భీమసేనుని దృష్టినుండి తొలగి, భీమసేనుడు చంపిన నీ కుమారులను చూసి, దుఃఖించి, విమనస్కుడై, వేడి నిట్టూర్పులు విడిచి, మరల భీమునిపైకి వచ్చాడు. కోపంతో కళ్ళు ఎర్రబడగా, మహాసర్పంవలె బుసగొడుతూ బాణాలను ప్రయోగిస్తూ కిరణాలను వెదజల్లుతున్న సూర్యునివలె ప్రకాశించాడు. కర్ణుని వింటినుండి వెలువడిన బాణాలు భీముని కప్పివేశాయి. కర్ణుని వింటినుండి వెలువడిన ఆ నెమలి ఈకలు గల బాణాలు, పక్షులు నివాసం కోసం చెట్టు మీద వ్రాలినట్లు భీముని శరీరంలోనికి గ్రుచ్చుకొనసాగాయి. సువర్ణ పక్షాలు గల బాణాలు కర్ణుని ధనుస్సునుండి వెలువడి అటు ఇటు పడుతూ, బారులు తీరిన హంసలవలె ప్రకాశించాయి. రాజా! కర్ణుని బాణాలు కేవలం వింటినుండి కాక ధ్వజం మొదలనుండి, ఉపకరణాల నుండి, గొడుగునుండి, కాడెనుండి, నొగలునుండి కూడా వెలువడుతున్నట్లు కనిపించాయి. కర్ణుడు గ్రద్ద ఈకలు గలిగి బంగారుతో చేసిన విచిత్రబాణాలను ప్రయోగించాడు. అవి మహావేగంతో ఆకాశాన్ని పూరిస్తూ ఆకాశంలో సంచరించసాగాయి. యమునివలె వస్తున్న కర్ణుని చూసి, భీమసేనుడు ప్రాణాలపై వ్యామోహాన్ని వీడి, పదునైన బాణాలతో కర్ణుని గాయపరిచాడు. భీమసేనుడు కర్ణుని వేగాన్ని సహింపరానిదిగా భావించి, కర్ణుని మహాబాణ సమూహాలను నివారించాడు. ఆ పై భీముడు కర్ణుని సానపై పదునుపెట్టిన మరో ఇరవై బాణాలతో గాయపరిచాడు. భీమసేనుని పరాక్రమాన్ని చూసి నీవారు, చారణులు కూడా ఆనందించి అభినందించారు. భూరిశ్రవుడు, కృపుడు, అశ్వత్థామ, శల్యుడు, జయద్రథుడు, ఉత్తమౌజుడు, యుధామన్యువు, సాత్యకి, కృష్ణుడు, అర్జునుడు - కౌరవ పాండవ ముఖ్యులైన ఈ పదిమంది మహారథులూ "భళా భళా" అంటూ వేగంగా సింహనాదాలు చేశారు.

రాజా! అలా భీకరంగా రోమాంచజనకంగా సింహనాదధ్వని వెలువడగా దుర్యోధనుడు త్వరపడుతూ రాజులతో, రాజకుమారులతో ప్రత్యేకించి తన సోదరులతో ఇలా అన్నాడు - 'భీముని నుండి రక్షించటానికి కర్ణుని దగ్గరకు వెళ్ళండి - మీకు శుభం

జరగాలి. భీముని వింటినుండి వెలువడిన బాణాలు కర్ణుని ముందుగానే కబళిస్తున్నాయి. మేటివిలుకాండ్రు మీరు కర్ణ సంరక్షణకై ప్రయత్నించండి.' భారతా! దుర్యోధనుని ఆదేశం మేరకు ఏడుగురు సోదరులు కోపంతో భీమునిపై ఆక్రమించి చుట్టుముట్టారు. వర్షాకాలంలో మేఘాలు పర్వతాన్ని వారిధారలతో ముంచెత్తినట్టు, వారు భీముని సమీపించి శరవృష్టితో ఆవరించారు. ప్రళయ కాలంలో సప్తగ్రహాలు సోముని పీడించినట్లు ఆ ఏడుగురు మహారథులు క్రుద్ధులై భీమసేనుని పీడించారు. ఆ పై భీమసేనుడు ధనుస్సును దృఢముష్టితో వేగంగా లాగి, ఆ ఏడుగురిని మామూలు మనుష్యులుగా గ్రహించి, ఏడు బాణాలను ఎక్కుపెట్టి, సూర్యకిరణాలవలె ప్రకాశిస్తున్న వాటిని సమర్థతతో ఆ ఏడుగురిపై విడిచాడు. మహారాజా! భీమసేనుడు గతవైరాన్ని తలచుకొని, నీ కుమారుల ప్రాణాలను శరీరాలనుండి లాగుతున్నట్లుగా బాణప్రయోగం చేశాడు. ఆ బాణాలు వారి గుండెలను చీల్చి, గగనతలంలో చరించే గరుడపక్షులవలె ప్రకాశించాయి. మర్మస్థానాలు బ్రద్దలై ఆ ఏడుగురు రథాల నుండి నేలగూలారు. శత్రుంజయుడు, శత్రుసహుడు, చిత్రుడు, చిత్రాయుధుడు, దృఢుడు, చిత్రసేనుడు, వికర్ణుడు - ఈ ఏడుగురిని భీముడు పడగొట్టాడు.

అక్కడ మరణించిన నీ కొడుకులందరిలో వికర్ణుడు భీమున కిష్టమైనవాడు. భీముడు అతనికోసమే దుఃఖిస్తూ తీవ్రశోకానికి గురి అయి ఇలా అన్నాడు. 'వికర్ణా! ధార్తరాష్ట్రులనందరినీ యుద్ధంలో చంపుతానని నేను ప్రతిజ్ఞ చేశాను. అందుకే నిన్ను చంపాను. నా ప్రతిజ్ఞను కాపాడుకొన్నాను. వీరా! నీవు క్షాత్రధర్మాన్ని ఆలోచించి యుద్ధానికి వచ్చావు. అందువలన యుద్ధంలో చంపవలసివచ్చింది. యుద్ధ ధర్మం చాలా నిష్ఠురమైనది. యుధిష్ఠిరుని హితాన్ని, మా హితాన్ని విశేషించి కోరుకొనేవాడవు నీవు. బృహస్పతితో సమానమైన బుద్ధి గల గాంగేయుడు కూడా న్యాయమో ! అన్యాయమో ! దెబ్బతిని రణ భూమిపై శయనించి ఉన్నాడు. ప్రాణాలను విడువబోతున్నాడు. అందుకే అంటున్నాను యుద్ధం చాలా నిష్ఠురమైనది.'

సంజయు డిలా చెప్తున్నాడు. "భీముడు కర్ణుడు చూస్తుండగానే వారిని చంపి భీకరంగా సింహనాదం చేశాడు. భారతా! ఆ శబ్దం ధర్మరాజుకు భీముడు యుద్ధాన్ని, తన మహావిజయాన్ని తెలియజేస్తున్నట్లుంది. భీమసేనుని ఆ మహానాదాన్ని విని, ధీమంతుడైన ధర్మరాజుకు పరమానందం కలిగింది. ఆనందించిన ధర్మరాజు వాద్యాల మహాధ్వనులతో తనసోదరుని ఆ సింహనాద ధ్వనిని స్వాగతించాడు. ఆ రీతిగా వృకోదరునకు తన ఆనందాన్ని తెలియబరిచి, యుధిష్ఠిరుడు మహా హర్షంతో ద్రోణుని మీదకు యుద్ధానికి వెళ్ళాడు. మహారాజా! నీ కొడుకులు ముప్పదియొక్కరు యుద్ధంలో పడి చనిపోవటం చూసి, దుర్యోధనుడు విదురుని మాటలను తలచుకొన్నాడు. 'విదురుడు చెప్పిన హితవచనం.

ఇదిగో ఇలా వాస్తవ రూపాన్ని ధరించింది.' ఆ రీతిగా ఆలోచించి నీ కొడుకు సమాధానాన్ని మాత్రం పొందలేకపోయాడు. అల్పబుద్ధి అయిన నీ కొడుకు సుయోధనుడు కర్ణునితో కలిసి పాంచాలిని సభలోనికి రప్పించి పలికిన పలుకులు, పాండుపుత్రుల సమక్షంలో నీవు, కౌరవులు అందరు వింటుండగా "ద్రౌపదీ ! పాండవులు నశించారు. శాశ్వత నరకంలో పడిపోయారు. మరొకరిని భర్తగా వరించు" అని కర్ణుడు పలికిన పరుషవచనాలు నేటికీ రీతిగా ఫలించాయి. నీ కుమారులు మహాత్ముడైన పాండవులను రెచ్చగొడుతూ, పుచ్చిన నువ్వులంటూ వారిని పరుషంగా మాటాడారు. దానితో పుట్టిన భీమసేనుని క్రోధాగ్ని పదమూడు సంవత్సరాలు అలాగే ఉంది. దానిని వెడలగ్రక్కుతూ భీముడు నీ కొడుకుల అంతం చూస్తున్నాడు. విదురుడు ఎంత విలపించినా నీ నుండి సంధిని పొందలేకపోయాడు. దాని ఫలితాన్ని ఇప్పుడు కొడుకులతో కలిసి అనుభవించు. నీవు వృద్ధుడవు. ధీరుడవు. కార్యతత్త్వాన్ని, కార్య ప్రయోజనాన్ని తెలిసినవాడవు. అయినా హితాభిలాషుల మాటను వినలేదు. అంతా విధి విలాసం. కాబట్టి నీవు శోకించవద్దు. దీనిలో నీ అవినీతియే అసలు కారణం. నీ కొడుకుల వినాశానికి నీవే కారణమని నా భావన. రాజేంద్రా! వికర్ణుడు చనిపోయాడు. పరాక్రమశాలి అయిన చిత్రసేనుడు చనిపోయాడు. నీ కొడుకులలో గొప్పవారు, ఇతర మహారథులూ కూడా చనిపోయారు. తన కంటికి కనిపించిన నీ కొడుకుల నందరినీ వెంటనే భీమసేనుడు చంపివేశాడు. నీ కోసం నేను భీమసేన కర్ణుల ధనుస్సుల నుండి వెలువడిన వేలకొలది బాణాలతో దహింపబడిన సేనను చూశాను."

138. భీమ కర్ణుల భీకర యుద్ధము

ధృతరాష్ట్ర డిలా అన్నాడు. "సంజయా! ఈ విషయంలో విశేషించి నా అవినీతియే పెద్ద తప్పు. ఇప్పుడు నాకు ఆ దుర్నీతి ఫలితం అనుభవానికి వస్తోంది. సంజయా! జరిగిందేదో జరిగిపోయిందని నేను ఇప్పటివరకు అనుకొంటున్నాను. ప్రస్తుతం నా కర్తవ్య మేమిటో చెప్పు పాటిస్తాను. సంజయా! నా అవినీతి వలన ఈ వీరుల వినాశం జరిగింది. అదంతా నాకు వివరంగా చెప్పు. ధైర్యంగానే ఉన్నాను." సంజయు డిలా చెప్తున్నాడు. "మహారాజా! పరాక్రమశాలులు, మహాబలులు అయిన కర్ణభీములు నీటిని వర్షించే రెండు మేఘాలవలె బాణవృష్టిని కురిపించారు. సువర్ణపుంఖాలు గలిగి సానపెట్టబడిన భీమనామాంకితమైన బాణాలు జీవితాన్ని ఛేదిస్తున్నట్లు కర్ణుని సమీపించి, గ్రుచ్చుకొన్నాయి. అదే రీతిగా కర్ణుడు ప్రయోగించిన నెమలి ఈకల బాణాలు వందలు, వేలుగా భీముని కప్పివేశాయి. అన్ని దిక్కులా పడుతున్న ఆ ఇద్దరి బాణాలతో అక్కడి సేనలో సముద్రంలో

కన్న పెద్ద సంక్షోభం ఏర్పడింది. భీముని వింటినుండి వెలువడిన ఆ బాణాలు, భీకర సర్పాలవలె, సేనామధ్య భాగంలో నీ సైన్యాన్ని చంపసాగాయి. రాజా! పడిపోయిన ఏనుగులు, ఆశ్వికులతో పాటు పడిన గుర్రాలతో రణరంగం గాలికి నేల గూలిన చెట్లతో నిండిన భూమివలె కనిపించింది. భీముని వింటినుండి వెలువడిన బాణాల దెబ్బలు తిని, నీ సైనికులు రణభూమినుండి పారిపోతూ "ఏం జరుగుతోంది ?" అని కూడా అంటున్నారు. మహావేగం గల కర్ణభీమసేనుల బాణాలతో సింధు, సౌవీర, కౌరవసైన్యం ఉదాసీనమై అక్కడ నుండి పారిపోసాగింది. ఆ శూరులు గుర్రాలను, రథాలను, ఏనుగులను కోల్పోయి, బాగా దెబ్బతిని, భీమకర్ణులను విడిచి అన్ని దిక్కులకు పారిపోయారు.

'తప్పక అర్జునుని కోసమే దేవతలు మనకు మోహాన్ని కలిగిస్తున్నారు. కర్ణభీములు విడిచిన బాణాలతో మన సేన నశిస్తోంది.' అని మాటాడుతూ నీ సైనికులు భయపీడితులై బాణ ప్రయోగాన్ని మాని, కేవలం యుద్ధాన్ని చూస్తూ నిలిచారు. అప్పుడు శూరులకు ఆనందాన్ని కలిగిస్తూ, భీరులకు భయాన్ని పెంచుతూ రణభూమిలో భయంకరమైన నది ప్రవహించసాగింది. ఆ నది ఏనుగులు, గుర్రాలు, మనుష్యుల నెత్తుటి సమూహం నుండి పుట్టింది. ప్రాణాలు కోల్పోయిన సైనికులు, ఏనుగులు, గుర్రాలతో ఆవరింపబడింది. అచింత్యమూ, అమానుషమూ, అద్భుతమూ అయిన ఆ భీమకర్ణుల పోరాటాన్ని చూసి, చారణ సిద్ధులకు ఆశ్చర్యం కలిగింది. శుష్కించిన ఇంధనంపై గాలి తోడైన అగ్నిగతివలె, రణభూమిలో భీముడు తోడైన కర్ణుని రౌద్రగతి పెచ్చుపెరిగింది. నరాధిపా! రెచ్చగొట్టబడిన రెండు ఏనుగులు ధ్వజాలను, రథాలను, పడగొట్టి గుర్రాలను, సైనికులను, ఏనుగులను చంపి, నాశనం చేసిన నరవనంవలె, మేఘసమూహంలా ఉన్న నీ సైన్యం దురవస్థకు గురి అయింది. రణభూమిలో కర్ణభీముల శత్రుసంహారం తీవ్రంగా ఉంది."

139. భీమకర్ణ యుద్ధము - అర్జునుని ధాటికి కర్ణాశ్వత్థామల పలాయనము.

సంజయు డిలా చెప్తున్నాడు. "మహారాజా! ఆ తరువాత కర్ణుడు మూడు బాణాలతో భీముని గాయపరిచి; అనేక రీతులుగా విచిత్ర బాణవృష్టిని కురిపించాడు. కర్ణుడు దెబ్బకొట్టినా, మహాబాహుడయిన భీముడు బ్రద్దలు చేయబడే కొండవలె ఏమీ వ్యథ చెందలేదు. భీముడు కూడా రణరంగంలో నూనెతో కడుగబడి మెరుస్తున్న తీక్ష్ణమైన 'కర్ణి' (చిల్లులు గల బాణం)తో కర్ణుని చెవిపై తీవ్రంగా గాయపరిచాడు. మహారాజా! ఆ కర్ణి స్వర్ణమయమై, విశాలమై అందమైన కర్ణుని కుండలాన్ని నేల మీదకు పడగొట్టింది. అది మెరిసే తార ఆకాశంనుండి నేలబడినట్లుంది. తీవ్రంగా కోపించిన భీముడు నవ్వుతూ, మరొక భల్లంతో కర్ణుని ఛాతీపై తీవ్రంగా గాయం చేశాడు. మరల భీముడు కుబుసం

విడిచిన పాములవలె నున్న పది బాణాలను కర్ణునిపై ప్రయోగించాడు. భీముడు విసిరిన ఆ బాణాలు కర్ణుని లలాటాన్ని చీల్చి, పుట్టలో దూరిన పాములవలె అక్కడే గ్రుచ్చుకొన్నాయి. నుదుట గ్రుచ్చుకొన్న ఆ బాణాలతో కర్ణుడు ముందే నీలోత్పలమాలను ధరించిన వానివలె విరాజిల్లాడు. భీమునిచే తీవ్రంగా గాయపరచబడిన కర్ణుడు రథంనొగలును ఆసరా చేసికొని నిలిచి కళ్ళు మూసికొన్నాడు. కర్ణుడు ముహూర్తకాలంలో మరల స్పృహలోనికి వచ్చాడు.

శరీరమంతా నెత్తుటితో తడిసి పోయింది. కర్ణునికి తీవ్రంగా కోపం వచ్చింది. మహావేగం గల కర్ణుడు రణభూమిలో భీముని రథం మీదకు వేగంగా దూసుకొని పోయాడు. అసహనం, క్రోధం పెచ్చుమీరగా, బలశాలి అయిన కర్ణుడు గ్రద్ద ఈకలు గల వందబాణాలను భీమునిపై ప్రయోగించాడు. కర్ణుని పరాక్రమాన్ని లెక్క చేయకుండా భీముడు వాడి మొనగల బాణాల వృష్టిని కురిపించాడు. కర్ణుడు క్రుద్ధుడై క్రోధరూపాన్ని ధరించి. భీముని వక్షస్థలంపై తొమ్మిది బాణాలతో కొట్టాడు. నరశ్రేష్ఠులైన ఆ కర్ణభీములు కోరలుగల రెండు పులులవలె పోరాడుతూ, రెండు మేఘాలవలె రణ భూమిలో ఒకరిపై ఒకరు బాణవృష్టిని కురిపించాడు. చేతులు చరుస్తూ, ఒకరినొకరు భయపెట్టారు. వివిధ బాణసమూహాలతో యుద్ధంలో ఒకరినొకరు ఛాతికి గురి పెట్టారు. ఇద్దరూ క్రుద్ధులై సమరంలో ఒకరిపై ఒకరు ప్రతీకారం తీర్చుకొనదలిచారు. భీమసేనుడు క్షురప్రంతో కర్ణుని ధనుస్సును ఖండించి, సింహనాదం చేశాడు. కర్ణుడు విరిగిన ఆ వింటిని విడిచి, అంతకన్న వేగం గల మరొక వింటిని చేతబట్టాడు. ఆ ధనుస్సును కూడా అర్ధనిమేషంలో భీముడు ఖండించాడు. అదే రీతిగా భీముడు మూడు, నాలుగు, అయిదు, ఆరు, ఏడు, ఎనిమిది, తొమ్మిది, పది, పదకొండు, పండ్రెండు, పదుమూడు, పదునాలుగు, పదిహేను, పదహారవ ధనుస్సును కూడ ఖండించాడు. ఆలాగే కర్ణుని పదిహేడవ వింటిని, వేగంగా పదునెనిమిదవ వింటిని – ఇంకా ఎన్నో ధనుస్సులను భీముడు ఖండించాడు.

ఆ తరువాత అర్ధనిమేషంలోనే మరొక వింటిని చేతబట్టి నిలిచాడు కర్ణుడు. కురు, సౌవీర, సింధు సేనల వినాశాన్ని, అంతటా పడియున్న కవచాలతో, ధ్వజాలతో, శస్త్రాలతో నిండిన రణభూమిని, ప్రాణాలు కోలుపోయిన ఏనుగులు, గుర్రాలు, రథికుల శరీరాలను చూసి, కర్ణుని శరీరం కోపంతో ప్రజ్వలించింది. కర్ణుడు ఆ మహాధనుస్సును ధ్వనింపజేస్తూ భయానకంగా కనిపిస్తున్న భీముని ఘోరదృష్టితో చూశాడు. కర్ణుడు కోపంతో బాణవృష్టిని కురిపిస్తూ, శరత్కాలంలోని మధ్యాహ్న సమయంలో తేజస్వి అయిన సూర్యునివలె ప్రకాశించాడు. కిరణాలతో ప్రకాశించే సూర్యుని శరీరంవలె వందల బాణాలు గ్రుచ్చుకొన్న కర్ణుని శరీరం ఘోరంగా కనిపించింది. రణభూమిలో కర్ణుడు చేతిలోనికి బాణాలు

తీసికోవటం, వాటిని ఎక్కుపెట్టటం, లాగటం, విడవటం – ఈ పనుల మధ్య వ్యవధానమే కనిపించటం లేదు. కుడి ఎడమల రెండు వైపులా బాణాలను ప్రయోగిస్తున్న కర్ణుని ధనుస్సు మండలాకారంలో అగ్నిచక్రంవలె భయంకరంగా కనిపిస్తోంది. కర్ణుని వింటి నుండి వెలువడిన ఆ స్వర్ణపుంఖాలుగల వాడిబాణాలు దిక్కులను, సూర్యకాంతులను కూడా నిరోధించాయి. కర్ణుని ధనుస్సు నుండి వెలువడిన ఆ బాణసమూహం గగనంలో అనేక రీతులలో కనిపిస్తోంది. కర్ణుని ధనుస్సు నుండి వెలువడుతున్న ఆ బాణాలు పంక్తులుగా నిలిచి ఆకాశంలోని క్రౌంచపక్షుల బారులవలె కనిపించాయి. కర్ణుడు విడుస్తున్న బాణాలు సానపై పదును పెట్టబడినవి. గ్రద్ద ఈకలు, సువర్ణాభరణాలు గలవి. మహావేగం, ప్రజ్వలించే మొనలు గలవి. చాపబలంతో పైకెగసిన స్వర్ణ భూషిత బాణాలు పదే పదే భీమసేనుని రథంపై పడసాగాయి. కర్ణుడు ప్రయోగించిన ఆ వేల కొలదిగా ఉన్న బంగారు బాణాలు ఆకాశంలో మిడతలదండువలె ప్రకాశించాయి. కర్ణుని వింటినుండి పడుతున్న ఆ బాణాలు ఆకాశంలో ఉన్న ఒకే పొడవైన బాణంవలె వెలుగొందాయి. కర్ణుడు బాణవృష్టితో భీముని కప్పివేశాడు.

క్రుద్ధుడైన భీముడు ఆ బాణవృష్టిని లెక్కచేయకుండా కర్ణునిపై దాడిచేశాడు. రాజా! స్వర్ణపృష్ఠం గల భీముని విశాలధనుస్సు లాగినందునల్ల మండలాకారాన్ని పొంది, మరొక ఇంద్రధనుస్సు వలె కనిపించింది. దాని నుండి ఆకాశాన్ని పూరిస్తున్నట్లుగా బాణాలు వెలువడ్డాయి. సువర్ణపుంఖాలు, వంగిన కణుపులు గల బాణాలతో భీముడు ఆకాశంలో కాంచనమాలను నిర్మించినట్లనిపించింది. అది గొప్పగా వెలుగొందుతోంది. అప్పుడు భీమసేనుని బాణాలదెబ్బ తిని, ఆకాశంలోనున్న బాణసమూహాలు ముక్కలై చెదరి పడుతున్నాయి. కర్ణభీమసేనులిద్దరి బాణసమూహాలు పరస్పరం తగిలి నిప్పులు క్రక్కుతున్నాయి. రణభూమిలో వాటి గమనానికి తిరుగులేదు. స్వర్ణపుంఖాలు గల ఆ బాణసమూహాలతో ఆకాశం ఆచ్ఛాదింపబడింది. అక్కడ సూర్యుడు ప్రకాశించటం లేదు. గాలి వీచటం లేదు. శరసమూహం కప్పివేసిన ఆ ఆకాశంలో ఏమీ తెలియటం లేదు. భరతశ్రేష్ఠా! మనుజ శ్రేష్ఠులయిన ఆ ఇరువురి బాణాలు పరస్పరం ఢీకొన్నందువలన ఆకాశంలో అగ్నిపుట్టింది. కర్ణుడు క్రుద్ధుడై వాడియైన బంగారు బాణాలను ప్రయోగించాడు. అయితే భీముడు కర్ణుని మించిపోతూ ఆ బాణాలను ఆకాశంలోనే ఒకొక్కదాన్ని మూడు మూడు ముక్కలు చేసి "ఆగు" అని కర్ణునితో అన్నాడు. ఒకరినొకరు చంపదలచుకొన్న కర్ణ భీమసేనుల పరాక్రమాన్ని చూడాలని సైనికులందరూ యుద్ధాన్ని విరమించారు. అపుడు దేవర్షులు, సిద్ధులు, గంధర్వులు, విద్యాధర సమూహాలు 'భళా, భళా' అంటూ అభినందించి పుష్పవృష్టిని కురిపించారు. భీముడు కోపంతో తన అస్త్రాలతో కర్ణుని అస్త్రాలను నిరోధించి, బాణాలతో కర్ణుని

గాయపరిచాడు. మహాబలుడైన కర్ణుడు కూడా యుద్ధంలో భీమసేనుని బాణాలను నిలువరించి, తొమ్మిది బాణాలను భీమునిపై ప్రయోగించాడు. భీముడు తొమ్మిది బాణాలతోనే కర్ణుడు ప్రయోగించిన తొమ్మిది బాణాలను గగనతలంలోనే ఖండించి "నిలు, నిలు" అని కర్ణునితో అన్నాడు.

భీమసేనుడు కోపించిన యమునివలె, మరొక యమదండంవలె కనిపిస్తున్న బాణాన్ని కర్ణునిపైకి విడిచాడు. కర్ణుడు నవ్వుతూ తన మీదకు వస్తున్న ఆ భీమునిబాణాన్ని మూడు బాణాలతో ఖండించాడు. మరల భీమసేనుడు భీకర బాణవృష్టిని కురిపించాడు. కర్ణుడు నిర్భయంగా ఆ భీముని బాణాలను స్వీకరించాడు. కర్ణుడు తన అస్త్రమాయతో, వంగిన కణుపులు గల బాణాలతో భీముని రెండు అమ్ముల పొదులను, అల్లెత్రాటిని, కళ్ళాలను, గుర్రాల జీనులను ఖండించాడు. మరల భీముని గుర్రాలను చంపి, అయిదు బాణాలతో రథ సారధిని గాయపరిచాడు. ఆ సారధి అక్కడ నుండి పారిపోయి యుధామన్యుని రథ మెక్కాడు. కోపంతో ప్రళయకాలాగ్నివలె జ్వలిస్తూ, కర్ణుడు నవ్వుతూ భీముని రథాన్ని ఖండించాడు. పతాకను పడగొట్టాడు. విల్లు విరిగిపోగా భీముడు శక్తిని చేతబట్టాడు. దానిని గిరగిర త్రిప్పి, కోపంతో కర్ణుని రథం మీదకు విసిరాడు. కర్ణుడు కొంచెం అలసిపోయినా కాంచనభూషణాలతో పెద్ద తోకచుక్కవలె తన మీదకు వస్తున్న ఆ శక్తిని పది బాణాలతో ఛేదించాడు. మిత్రునికోసం చిత్రంగా యుద్ధం చేయగల ఆ కర్ణుడు ప్రయోగించిన వాడి బాణాలతో ఆ శక్తి పది ముక్కలై నేలబడింది. ఆ స్థితిలో భీముడు విజయాన్నో, వీరమరణాన్నో దేన్నో ఒకదానిని పొందగోరి డాలును, కత్తిని చేతబట్టాడు. కర్ణుడు నవ్వుతూ వెంటనే భయంకర బాణాలను ఎన్నింటినో ప్రయోగించి ఆ భీముని డాలును బ్రద్దలు చేశాడు. విరథుడై డాలును కూడా కోల్పోయిన భీముడు క్రోధావేశంతో కత్తిని త్రిప్పి, వేగంగా కర్ణుని రథం మీదకు విసిరాడు.

ఆ మహాఖడ్గం కర్ణుడు ఎక్కుపెట్టిన ధనుస్సును ఖండిస్తే అది ఆకాశం నుండి పడుతున్న కోపించిన సర్పంవలె నేలపై పడింది. కర్ణుడు నవ్వి, కోపంతో మరొక వింటిని చేతబట్టాడు. అది శత్రుసంహారం చేయగలది. గట్టి అల్లెత్రాడుగలది. బాగా వేగం గలది. భీముని చంపాలన్న తలంపుతో సువర్ణపుంఖాలు, మంచి పదునుగల బాణాలను వేలకొలదిగ కర్ణుడు భీమునిపై ప్రయోగించాడు. కర్ణుని వింటినుండి వెలువడిన బాణాలవలన గాయపడి, భీమసేనుడు కర్ణుని మనస్సును కలతపెడుతూ కర్ణుని పట్టుకొనటానికి పైకి ఎగిరాడు. సంగ్రామంలో విజయాన్ని పొందగోరుతున్న ఆ భీముని చేష్టను గమనించి కర్ణుడు ముడుచుకొనిపోయి భీమసేనుని వంచించాడు. కర్ణుని శరీరమంతా బాధకు గురి అయింది. రథం వెనుక నక్కాడు కర్ణుడు. అది చూసి భీముడు రథధ్వజాన్ని

ఆసరా చేసికొని నేలపై నిలిచాడు. గరుడుడు పామును పట్టినట్టు, రథం నుండి కర్ణుని అపహరించదలచిన ఆ భీమని చేష్టను, కురువంశస్థులందరూ చారణులూ అభినందించారు. ఆ భీముడు విరథుడై, ధనుస్సు విరిగిపోయి ఉన్నా తన ధర్మాన్ని పరిపాలిస్తూ, తన రథాన్ని వెనుకనే నిలిపి యుద్ధానికే సంసిద్ధుడయ్యాడు. రాధేయుడు భీముని రథసామగ్రిని నష్టపరిచి, మరల కోపంతో యుద్ధానికి సంసిద్ధుడై ఉన్న భీమునిపై దాడి చేశాడు. భీముని శస్త్రాలన్నీ అయిపోయాయి. కర్ణుడు దాడి చేస్తూనే ఉన్నాడు. అప్పుడు రథమార్గానికి ఆటంకం కల్పించటానికి అర్జునుడు చంపివేసిన ఏనుగులు పర్వతాలవలె పడి ఉండటం చూశాడు. వాటిలోనికి ప్రవేశించాడు. ఏనుగుల గుంపులోనికి ప్రవేశించి, కర్ణుని రథం మీదకు రాకుండా చూసుకొన్నాడు భీముడు.

జీవితాన్ని కాపాడుకోదలచి కర్ణునిపై దాడి చేయలేదు. కర్ణుని బాణాలనుండి తప్పించుకోవటానికి ఏదో ఒక అడ్డుకావాలని తలచి భీముడు అర్జునుడు చంపిన ఒక ఏనుగును ఎత్తి పట్టుకొని, నిలిచాడు. అది హనుమంతుడు మహౌషధులతో కూడిన సంజీవని పర్వతాన్ని ఎత్తి నిలిచినట్లుంది. కర్ణుడు మరల బాణాలతో ఆ ఏనుగుశవాన్ని కొట్టాడు. అప్పుడు భీముడు ఏనుగు అవయవాలను కర్ణుని పైకి విసిరాడు. కోపించిన భీముడు చక్రాలో, గుర్రాలో, నేలపై ఏది కనిపిస్తే దానిని ఎత్తి కర్ణుని మీద విసిరాడు. అయితే భీముడు విసిరిన వాటినన్నింటినీ కర్ణుడు పదునైన బాణాలతో ఛేదించాడు. భీముడు పిడికిలి బిగించి, వజ్రసమానమై భయంకరమైన ఒక గ్రుద్దుతో కర్ణుని చంపదలచాడు. అంతలో అర్జునుడు చేసిన ప్రతిజ్ఞను, అర్జునుని తలచుకొని, ఆ ప్రతిజ్ఞకు అవకాశమిస్తూ, తాను కర్ణుని చంపగలిగి కూడా చంపలేదు. ఈ రీతిగా కలతపడిన భీముని కర్ణుడు మరలమరల పదునైన బాణాలను ప్రయోగించి మూర్ఛిల్లజేశాడు. కుంతి మాటను తలచుకొని కర్ణుడు నిరాయుధుడైన భీముని చంపలేదు. భీముని దగ్గరకు వెళ్ళి, వింటి కొనతో భీముని స్పృశించాడు. ధనుస్సు తగలగానే కోపించిన సర్పంవలె బుసకొడుతూ భీముడు ఆ ధనుస్సును లాగికొని కర్ణుని తలపై కొట్టాడు. భీముడు కొట్టగానే కర్ణుడు కోపంతో కళ్ళెర్రజేశాడు. భీముని హేళన చేస్తూ ఇలా అన్నాడు.

"మరలా మరలా అంటాను. నపుంసకా! మూర్ఖా! తిండిపోతా! అస్త్ర విద్య తెలియనివాడా! యుద్ధంలో భయపడేవాడా! అర్భకా! యుద్ధ మెప్పుడూ చేయవద్దు. పాండుకుమారా! బహువిధమైన భోజ్యం, భక్ష్యం, పానీయం లభించేచోట నీవు ఉండదగిన వాడివి. యుద్ధానికి ఎప్పుడూ పనికిరావు. భీమా! నీవు యుద్ధంలో నేర్పరివి కాదు. అరణ్యాలలో వ్రత నియమాలతో కందమూలాలు, పూలు, పండ్లు తింటూ ఉండటం నీకు తగినది. యుద్ధమెక్కడ? మహర్షి త్వమెక్కడ? భీమా! అరణ్యానికి పో! నీవు యుద్ధానికి తగవు.

నీకు వనవాసమే ఇష్టం. విరాటరాజు కొలువులో నీవు వంటలవాడివని తెలుసు. ఇంటిలో వంటవారిని, సేవకులను, దాసులను భోజనానికి బాగా తొందరపెడుతూ, కోపంతో వారిని కొట్టడానికి నీవు తగినవాడివి. దుర్మతీ! భీమా! లేకపోతే మునివై అరణ్యానికి పో! పండ్లను తెచ్చుకొని తిను. కొంతేయా! నీవు యుద్ధంలో నిపుణుడివి కాదు. వృకోదరా! నీవు పండ్లు, దుంపలు తినటంలో అతిథి పూజలో శక్తి గలవాడివి. ఆయుధం పట్టడానికి నీవు తగినవాడవని నేను భావించటం లేదు." రాజా! బాల్యంలో తనకు జరిగిన అప్రియ సంఘటనలను అన్నింటినీ ప్రకటిస్తూ చాలా కఠోరంగా మాటాడాడు కర్ణుడు. ఆ తరువాత అక్కడే దాగి ఉన్న భీమసేనుని ధనుస్సుతో మరల స్పృశించి, కర్ణుడు నవ్వుతూ మరల భీమునితో ఇలా అన్నాడు. "మారిషా! మరెవరితోనైనా యుద్ధం చేయి. నావంటి వారితో తలపడవద్దు. నా వంటి వారితో పోరాడితే ఇటువంటి గతి లేదా ఇంకా హీనస్థితీ కలుగుతుంది. లేదా కృష్ణార్జునులున్న చోటుకు పో! వారు నిన్ను యుద్ధంలో రక్షించగలరు. భీమా! లేకపోతే ఇంటికి వెళ్ళు. బాలకా! నీకు యుద్ధమెందుకు?" కర్ణుని ఆ దారుణ వచనాలను విని, భీముడు నవ్వుతూ అందరూ వింటుండగా కర్ణునితో ఇలా అన్నాడు. "దుష్టుడా! నీవు చాలాసార్లు ఓడిపోయావు. వ్యర్థంగా నిన్ను నీవు పొగడుకొంటా వెందుకు? లోకంలో దేవేంద్రుడు కూడా గెలుపు ఓటములకు గురికావటం ప్రాచీనులు చూశారు. దుష్కుల సంభవా! నాతో మల్లయుద్ధానికి రా! మహాబలుడు, మహాభోగి అయిన కీచకుని చంపినట్లు రాజులందరూ చూస్తుండగా నిన్ను చంపుతాను." భీముని అభిప్రాయాన్ని గ్రహించి కర్ణుడు విలుకాండ్రందరు చూస్తుండగానే యుద్ధాన్ని విరమించాడు. రాజా! ఈ రీతిగా భీముని విరథుని చేసి కృష్ణుడు, అర్జునుడు చూస్తుండగానే కర్ణుడు ప్రగల్భించాడు. ఆపై అర్జునుడు కృష్ణుని ప్రేరణతో సానపై పదునుపెట్టిన బాణాలను కర్ణునిపై ప్రయోగించాడు. అర్జునుని గాండీవం నుండి వెలువడిన బాణాలు క్రౌంచపర్వత గుహలలో హంసలు ప్రవేశించినట్లు కర్ణుని శరీరంలో గ్రుచ్చుకొన్నాయి. అర్జునుడు క్రుద్ధసర్పాలవంటి బాణాలతో కర్ణుని భీమునికి దూరంగా నెట్టివేశాడు. భీముడు వింటిని ఖండించాడు. అర్జునుడు బాణాలతో కొట్టాడు. దానితో కర్ణుడు తన పెద్దరథంపై వేగంగా భీమునినుండి దూరంగా వెళ్ళాడు.

భీముడు కూడా సాత్యకిరథాన్ని ఎక్కి, అర్జునుని రణభూమిలో అనుసరించాడు. ఆపై కోపంతో కన్నెర్ర జేసిన అర్జునుడు త్వరపడుతూ యమధర్మరాజు మృత్యువును ప్రయోగించినట్లు ఒక బాణాన్ని కర్ణునిపైకి పంపాడు. గాండివంనుండి వెలువడిన ఆ బాణం గరుత్మంతుడు పామును పట్టుకొనటానికి వెళ్ళినట్లు వేగంగా వెళ్లి, ఆకాశమార్గంలో

కర్ణునిపై పడింది. అర్జునుని భయంనుండి కర్ణుని తప్పించదలచిన అశ్వత్థామ ఒక బాణంతో అర్జునుని బాణాన్ని ఆకాశంలోనే ఖండించాడు. దానితో కోపించిన అర్జునుడు అరవైనాలుగు బాణాలతో అశ్వత్థామను గాయపరచి "పారిపోకు! నిలు!" అని పలికాడు. అయితే అర్జునుని బాణాలచే పీడనకు గురి అయిన అశ్వత్థామ వెంటనే రథాలతోనూ, మదపుటేనుగులతోనూ నిండిన వ్యూహంలోనికి చొచ్చుకొని పోయాడు. పారిపోతున్న అశ్వత్థామను అనుసరించి, అర్జునుడు తన బాణాలతో సేనను భయపెడుతూ కొంత మేర వెళ్ళాడు. గ్రద్ద-ఈకలు, నెమలి ఈకలు గల బాణాలతో సైనికులు, ఏనుగులు, గుర్రాల దేహాలను చీల్చి అర్జునుడు సేనను ధ్వంసం చేశాడు. భరతశ్రేష్ఠా! గుర్రాలతో, ఏనుగులతో, సైనికులతో కూడిన ఆ సేనను ఇంద్రసుతుడయిన అర్జునుడు సావధానుడై సంహరించాడు."

140. సాత్యకి అలంబుషుని వధించుట

ధృతరాష్ట్ర డిలా అన్నాడు. "సంజయా! ప్రకాశించే నా యశస్సు రోజురోజుకూ తగ్గిపోతుంది. ఇదంతా కాలభ్రమణ మనిపిస్తోంది. అర్జునుడు తీవ్రకోపంతో నా సేనలో ప్రవేశించాడు. వాస్తవానికి కర్ణాశ్వత్థామల రక్షణలోని ఆసేన దేవతలకు కూడా చొరరానిది. కృష్ణభీములు, శినిప్రవరుడైన సాత్యకి తోడు నిలవటం వలన అర్జునుని పరాక్రమం పెరిగింది. అప్పటి నుండి శోకం నన్ను దహించి వేస్తోంది. సైంధవునితో సహా రాజులందరినీ కాలం కబళించిన దనుకొంటున్నాను. సింధురాజు అర్జునునకు తీవ్రమైన అప్రియస్థితిని కలిగించాడు. అర్జునుని కంటబడితే ఇక ఎలా బ్రతకగలడు? సంజయా! సైంధవుడు ఇక లేనట్లే నేను అనుమానిస్తున్నాను. యుద్ధ మెలా జరిగిందో ఉన్నది ఉన్నట్టు నాకు వివరించి చెప్పు. సంజయా! ఏనుగు కొలనులో ప్రవేశించినట్లు, కోపంతో ఒంటరిగా నా విశాలసేనను క్షోభింపజేసి, పదేపదే మధించి, లోనికి ప్రవేశించిన సాత్యకి అర్జునుని కోసం సమాయత్తుడై ఎలా యుద్ధం చేశాడో యథాతథంగా చెప్పు. నీవు చెప్పటంలో నేర్పరివి."

సంజయు డిలా చెప్తున్నాడు. "రాజా! పురుషశ్రేష్ఠుడైన భీముడు అర్జునుని వైపు వెళ్తూ కర్ణునిచే బాధింపబడటాన్ని చూసి, సాత్యకి ఆ వీరనర సమూహంలో నుండియే భీమునకు సహాయం చేయటానికి రథంపై వెళ్ళాడు. వర్షాకాలంలో మేఘరూపంతో ఇంద్రుడు గర్జించినట్లు, శరత్కాలంలో సూర్యుడు ప్రజ్వలించినట్లు గర్జిస్తూ, ప్రజ్వలిస్తూ సాత్యకి దృఢధనుస్సుతో శత్రుసంహారం చేస్తూ నీ కుమారుని సేనను వణికించసాగాడు. రణభూమిలో వెండివన్నె గల గుర్రాలతో ముందుకుపోతూ, సింహనాదాలు చేస్తున్న సాత్యకిని నీ

రధికులందరూ కలిసికూడా నిరోధించలేకపోయారు. అప్పుడు బంగారు కవచాన్ని, ధనుస్సును ధరించి, యుద్ధంలో ఎప్పుడూ వెనుకంజవేయకుండా పోరాడే రాజశ్రేష్ఠుడు అలంబుషుడు అసహనంతో సాత్యకి ఎదురు నిలిచి నిరోధించాడు. భారతా! వారిద్దరి మధ్య ఎప్పుడూ, ఎక్కడా జరగనంత తీవ్రంగా పోరాటం జరిగింది. నీ యోధులు, శత్రుయోధులు కూడా రణరంగానికే శోభతెస్తున్న ఆ ఇద్దరినీ చూస్తూ నిలిచారు. రాజవరుడైన అలంబుషుడు బలమంతా వాడి, పది బాణాలను సాత్యకిపై ప్రయోగించాడు. కానీ శినిశ్రేష్ఠుడైన సాత్యకి తన దగ్గరకు రాకముందే ఆ బాణాలను ఖండించాడు. మరల అలంబుషుడు వింటిని చెవిదాకా లాగి, మూడు బాణాలను ప్రయోగించాడు. పదునైన ఆ బాణాలు అగ్నివలె ప్రజ్వలిస్తూ సాత్యకి కవచాన్ని చీల్చి, శరీరంలోనికి గ్రుచ్చుకొన్నాయి. ప్రజ్వలిస్తున్న బాణాలతో అలంబుషుడు సాత్యకి శరీరాన్ని చీల్చి, వెండివన్నె గల నాలుగు గుర్రాలను నాలుగు బాణాలతో బలంగా గాయపరిచాడు. సాత్యకి ఆ రీతిగా అలంబుషుని చేత దెబ్బతిని, తీవ్రవేగంగా ప్రసరించే నాలుగు బాణాలతో అలంబుషుని గుర్రాలను గాయపరిచాడు. ఆ పై అలంబుషుని రథసారధి శిరస్సును ఖండించి, ప్రళయ కాలాగ్ని వంటి భల్లంతో నిండు చందురుని వంటి కాంతితో, కుండలాలతో ప్రకాశిస్తున్న అలంబుషుని తలను దేహం నుండి వేరు చేశాడు.

సాత్యకి ఆరీతిగా యుద్ధంలో అలంబుషుని (ఒకరాజు) చంపి, నీ సేనను నివారిస్తూ అర్జునుని అనుసరించి వెళ్ళాడు. సాత్యకి గుర్రాలు సింధుదేశంలో పుట్టినవి. చక్కని శిక్షణ పొందినవి. ఆవుపాలవలె, కుందకుసుమాలవలె, చంద్రుని వలె, మంచువలె కాంతి మంతమైనవి. బంగారు జాలరులతో అలంకరింపబడినవి. నరశ్రేష్ఠుడైన సాత్యకి ఎటు వెళ్ళదలచుకొంటే అటు తీసికొనిపోతున్నాయి. అటువంటి రథంపై అర్జునుని అనుసరించి వచ్చి, శత్రువుల మధ్య సంచరిస్తూ, బాణాలతో కౌరవసేనలను సంహరిస్తూ, ఉన్న సాత్యకిని చూసి దుశ్శాసనుని ముందుంచుకొని, నీ కొడుకులు, ఇతర యోధులు అందరూ ఒక్కటై, వేగంగా సాత్యకిపై దాడిచేశారు. సేనల ఆక్రమణలను సహింపగల వారంతా యుద్ధంలో సాత్యకిని చుట్టుముట్టి దెబ్బకొట్ట సాగారు. సాత్వత శ్రేష్ఠుడు, వీరుడు అయిన సాత్యకి కూడా బాణసముదాయంతో వారిని నివారించాడు. సాత్యకి అగ్నిసమానమైన బాణాలతో వారిని వెంటనే నివారించి, ధనుస్సు నెక్కుపెట్టి దుశ్శాసనుని గుర్రాలను చంపాడు. ఆపై పురుషశ్రేష్ఠుడైన సాత్యకి పరాక్రమాన్ని యుద్ధంలో చూసి, అర్జునుడు, కృష్ణుడు కూడా ఆనందించారు."

141. సాత్యకి రాకతో అర్జునుడు చింతించుట

సంజయు డిలా చెప్తున్నాడు. "సాత్యకి తొందరపడవలసిన చోట త్వరగా స్పందించేవాడు. అర్జునుని విజయాన్ని కోరుతూ ఆ సాత్యకి సేనాసముద్రంలో ప్రవేశించి, దుశ్శాసనుని రథం మీదకు ఉరుకుతున్నప్పుడు త్రిగర్తదేశానికి చెందిన మేటివిలుకాండ్రు అతనిని చుట్టుముట్టారు. వారందరూ క్రుద్ధులై రథసమూహంతో సాత్యకిని అన్నివైపులా నిలువరించి బాణాలను కురిపించారు. సాత్యకి మహాసంగ్రామంలో రాజకుమారు లేబదిమందిని ఒంటరిగా ఓడించాడు. కౌరవ సేనామధ్యభాగం కరతాలధ్వనులతో ప్రతిధ్వనిస్తోంది. కత్తులు, శక్తులు, గదలతో నుండి దాటడానికి పడవలేని సముద్రంవలె ఉంది. అక్కడ రణభూమిలో సాత్యకి ప్రవర్తనను అద్భుతంగా చూశారు కౌరవులు. పడమట దిక్కున సాత్యకిని చూసి, వెంటనే తూర్పుదిక్కున చూడగలుగుతున్నాను. ఆ శూరుడు ఉత్తరం, దక్షిణం, తూర్పు, పడమర, విదిక్కులు ఎటుచూసినా వందల రథాలతో సమానంగా నృత్యం చేస్తున్నట్లు కనిపిస్తున్నాడు. సింహంవలె పరాక్రమిస్తున్న సాత్యకి వర్తనను చూసి, త్రిగర్తులు తమ బంధువులను గురించి శోకతప్తులై వెనుకంజవేస్తున్నారు. శూరసేన దేశస్థులైన శూరులు బాణసమూహాలతో సాత్యకిని యుద్ధంలో నివారించారు. ఊహకందని బలపరాక్రమాలు గల సాత్యకి ముహూర్తకాలంలో వారి వ్యవహారాన్ని ముగించి, ఆ పై కళింగ సేనలతో యుద్ధం చేసి, దానిని కూడా అతిక్రమించి అర్జునుని సమీపించాడు.

నీటిలో ఈతకొడుతూ అలసిపోయిన వాడు ఒడ్డుకు చేరినట్లు అర్జునుని సమీపించి సాత్యకి ఊరడిల్లాడు. దగ్గరకు వస్తున్న సాత్యకిని చూసి, కృష్ణుడు అర్జునునితో ఇలా అన్నాడు – "అర్జునా! ఆదిగో! నీ పాదాలను అనుసరించే సాత్యకి వస్తున్నాడు. ఈ సత్య పరాక్రముడు నీకు శిష్యుడు, మిత్రుడు కూడా. యోధులనందరినీ తృణీకరించి గెలిచాడు. నీకు ప్రాణాలకన్న ఇష్టమైన ఈ సాత్యకి కౌరవయోధులకు ఘోరమైన ఉపద్రవాన్ని కలిగించి వస్తున్నాడు. ద్రోణుని, కృతవర్మను బాణాలతో తిరస్కరించి, ఈ సాత్యకి వస్తున్నాడు. ధర్మరాజుకు ప్రియుడవైన నిన్ను వెదుకుతూ, శ్రేష్ఠులైన యోధులనెందరినో వధించిన శూరుడు, అస్త్రవేత్త అయిన సాత్యకి వస్తున్నాడు. సాత్యకి సైన్యమధ్యంలో పరాక్రమాన్ని చూపి, నీ దర్శనాన్ని కోరుతూ వస్తున్నాడు. ద్రోణాచార్యుడు మొదలుగాగల మహారథులు ఎందరితోనో ఒకే రథంతో రణభూమిలో పోరాడి, ఈ సాత్యకి వస్తున్నాడు. తన బాహుబలాన్ని ఆశ్రయించి, సేనలను చీల్చి, ధర్మరాజు ఆదేశం మేరకు ఈ సాత్యకి వస్తున్నాడు. కౌరవసేన మధ్యనుండి విముక్తుడైన ఈ సాత్యకి శత్రువులనెందరినో చంపి వస్తున్నాడు. పద్మాలవలె నున్న వేల కొలది రాజుల ముఖాలతో భూమిని కప్పి, ఈ

సాత్యకి వస్తున్నాడు. సోదరులతో సహా దుర్యోధనుని గెలిచి, జలసంధుని సంహరించి, ఈ సాత్యకి వేగంగా వస్తున్నాడు. నెత్తుటి ప్రవాహాలతో, రక్తమాంసాల బురదతో నదిని కల్పించి, కౌరవసేనలను గడ్డిపోచలవలె ఎగరగొట్టి ఈ సాత్యకి వస్తున్నాడు."

అప్పుడు అర్జునుడు ఆనందించి కృష్ణునితో ఇలా అన్నాడు "సాత్యకి నా దగ్గరకు రావటం నాకు నచ్చలేదు. ధర్మరాజు ఎలా ఉన్నాడో తెలియదు. సాత్యకి లేకుంటే అసలు బ్రదికి ఉన్నాడో? లేదో? ఈ సాత్యకియే ఆ ధర్మరాజును రక్షించాలి. కృష్ణా! ఆ ధర్మరాజును వీడి ఇతడు నన్నెలా అనుసరించాడు? ధర్మరాజును ద్రోణునకు వదిలివేశాడు. సైంధవు డింకా చావలేదు. ఇదిగో ! ఈ భూరిశ్రవుడు సాత్యకితో పోరాటానికి వస్తున్నాడు. సైంధవుని వలన ఇదిగో ఇలా బాధ్యత పెరిగింది. ధర్మజున కేమయినదో తెలుసుకోవాలి. సాత్యకిని కాపాడుకోవాలి. దీనికితోడు సైంధవుని చంపాలి. సూర్యుడు అస్తమించబోతున్నాడు. మాధవా! ఈ మహాబాహువు సాత్యకి అలసిపోయి, ఇప్పుడు శక్తిహీనుడై ఉన్నాడు. ఇతని గుర్రాలు, సారథికూడా అలసిపోయారు. కానీ భూరిశ్రవునకు కానీ అతని అనుచరులకు కానీ అలసట లేదు. ఈ సమాగమంలో, సంఘర్షణలో సాత్యకి గెలువ గలడా! సాత్యకి సాగరాన్ని దాటి కూడా గుంటలోపడి మునిగిపోతాడేమో! కౌరవముఖ్యుడు, అస్త్రవేత్త, మహాత్ముడు అయిన భూరిశ్రవునితో పోరాడి సాత్యకి క్షేమంగా ఉండగలడా? కేశవా! ధర్మరాజు చేసిన ఈ పని విపరీతంగా ఉంది. ద్రోణాచార్యుడంటే భయంలేకుండా సాత్యకిని పంపించాడు. ఆకాశంలో చరించే డేగ మాంసం మీదనే దృష్టిపెట్టినట్లు ద్రోణుడు ధర్మరాజును బంధించటం మీదనే దృష్టిపెట్టి ఉన్నాడు. ధర్మరాజు క్షేమమే గదా!"

142. సాత్యకి భూరిశ్రవుల యుద్ధము

సంజయు డిలా చెప్తున్నాడు. "రాజా! సాత్యకి తన మీదకు రావటాన్ని చూసి భూరిశ్రవుడు వెంటనే ఎప్పటినుండో కోరుకొంటున్న దానిని నేటి యుద్ధంలో పొందబోతున్నాను. రణరంగాన్ని వీడి పోకుంటే నేను నిన్ను ప్రాణాలతో విడువను. సాత్యకీ ! నిన్ను నీవు ఎప్పుడూ శూరుడ ననుకొంటుంటావు. నేటి యుద్ధంలో నిన్ను చంపి, సుయోధనుని సంతోషపెడతాను. నేడు నేల గూలిన నిన్ను కృష్ణార్జునులు కలిసి చూస్తారు. నిన్ను చంపిన మాటను విని, ధర్మరాజు వెంటనే సిగ్గుపడతాడు. తానే గదా నిన్ను ఇక్కడ ప్రవేశపెట్టింది. నీవు నెత్తుటితో తడిసి చచ్చి, నేలపై పడి ఉంటే అర్జునుడు ఈ రోజు నా పరాక్రమం తెలిసికొనగలుగుతాడు. సాత్యకీ ! ఇపుడే నీతో మహాఘోరమయిన యుద్ధం

చేస్తాను. దానితో నిజంగా నా బలవీర్యపౌరుషాలు ఏమిటో తెలుసుకొంటావు. రాముని సోదరుడైన లక్ష్మణునిచే యుద్ధంలో రావణుని కొడుకు ఇంద్రజిత్తు చంపబడినట్లు, నేడు నీవు నాతో యుద్ధంలో మరణించి, యమపురికి వెళ్ళగలవు. సింహం కంటబడిన క్షుద్రమృగంవలె, నా కంటబడిన నిన్ను వదలను.

యుయుధానుడు భూరిశ్రవుని మాట విని నవ్వుతూ ఇలా బదులిచ్చాడు - 'కౌరవేయా! యుద్ధంలో నా కెవరన్నా భయంలేదు. కేవలం మాటలతో నన్నెవ్వడూ భయపెట్టలేడు. నన్ను నిరాయుధుని చేయగలిగిన వాడే యుద్ధంలో నన్ను చంపగలడు. నీ గర్జన వింటుంటే నాకు నవ్వు వస్తోంది. పురుషాధమా! నేడు నిన్ను చంపకుండా నేను వెనుదిరగను.' ఆ ఇరువురూ ఈ రీతిగా ఒకరి నొకరు చంపగోరుతూ తీవ్రకోపంతో రణభూమిలో పోరాడసాగారు. భూరిశ్రవుడు, సాత్యకి మేఘాలవలె ఒకరిపై నొకరు బాణవృష్టిని కురిపించారు. భూరిశ్రవుడు బాణాలతో సాత్యకిని కప్పివేసి వాడి బాణాలతో గాయపరిచాడు. భూరిశ్రవుడు సాత్యకిపై పదునైన బాణాలను ప్రయోగించాడు. ప్రభూ! భూరిశ్రవుడు విడిచిన ఆ తీక్ష్ణబాణాలు తన దగ్గరకు చేరకముందే సాత్యకి తన అస్త్రబలంతో వాటిని అంతరిక్షంలోనే నష్టపరిచాడు. ఆ ఇద్దరూ ఒకరిపై ఒకరు శరవృష్టిని కురిపించారు. ఈ రీతిగా ఆ ఇద్దరూ యూధపతులైన ఏనుగులవలె ఒకరితో ఒకరు పోరాడసాగారు. బ్రహ్మలోకాన్ని దృష్టిలో నుంచుకొని, పరమపదాన్ని చేరాలని కోరుతున్న ఆ ఇద్దరూ కొద్దిసేపు ఒకరిపై నొకరు గర్జిస్తూ నిలిచారు. సాత్యకి, భూరిశ్రవుడు పరస్పరం శరవృష్టిని కురిపిస్తున్నారు. ధార్తరాష్ట్రులు ఆనందంగా దానిని చూస్తున్నారు. ఆడయేనుగు కోసం పోరాడే రెండు గజరాజులవలె పోరాడుతున్న ఆ సేనాధిపతుల నిద్దరినీ ప్రజలంతా ప్రేక్షకులై చూస్తున్నారు. ఒకరి గుర్రాలను ఒకరు చంపుకొని, ధనుస్సులను విరుచుకొని, విరథులై ఆ ఇద్దరూ కత్తులతో పోరాడటానికి దగ్గరయ్యారు. ఎద్దు చర్మంతో చేసిన డాలులను చేతబట్టి, ఒరలలో నుండి కత్తులను తీసి, ఇద్దరూ సమరభూమిలో సంచరించసాగారు. ఇద్దరూ చిత్ర కవచాలను, కత్తులను ధరించి వివిధ మార్గాలలో, సంచరిస్తూ, మండలా కృతులను కల్పిస్తూ కోపంతో ఒకరినొకరు గాయపరచసాగారు. ఆ ఇద్దరూ భ్రాంతం, ఉద్భ్రాంతం, ఆవిద్ధం, ఆప్లుతం, ప్లుతం, సృతం, సంపాతం, సముదీర్ణం అనే గతులను ప్రదర్శిస్తూ కత్తులతో పరస్పరం దెబ్బతీసికొనసాగారు. దాదాపు రెండు ఘడియలసేపు ఆ ఇద్దరూ దగ్గరై కత్తులతో తమ విచిత్ర కవచాలను ఖండించుకొన్నారు.

నరాధిపా! ఆపై ఆ పురుషోత్తము లిద్దరూ మళ్ల యుద్ధాని కుపక్రమించారు. ఆ ఇద్దరూ విశాలవక్షస్థలం, పొడవైన బాహువులు గలవారు. ఇద్దరూ మల్లయుద్ధంలో నిపుణులు. లోహపు గడియలవంటి తమ బాహువులతో ఇద్దరూ కలబడ్డారు. నరోత్తములైన

ఆ ఇద్దరూ పోరాడుతుంటే వజ్రమూ, పర్వతమూ కలిసినట్లు భయకరంగా పెద్దశబ్దం పుట్టింది. దంతాగ్రాలతో ఏనుగులవలె, కొమ్ములతో ఆబోతులవలె ఆ మహాత్ములిద్దరూ భుజపాశాలతో బంధిస్తూ, శిరస్సులతో ఢీకొడుతూ, కాళ్ళు పెనవేస్తూ, కాళ్ళతో లాగుతూ, తోమరాలతో కొట్టినట్టు కొడుతూ, అంకుశాలతో గ్రుచ్చినట్లు గ్రుచ్చుతూ, పాదబంధాలతో, ఉదర బంధాలతో, ఉద్భ్రమణాలతో, గత, ప్రత్యాగత, ఆక్షేప, పాతన, ఉత్థాన సంప్లుతాలతో పోరాడుతున్నారు. భారతా! మహాబలులైన ఆ ఇద్దరూ పోరాడుతూ, మల్ల యుద్ధంలోని ముప్పదిరెండు కళలనూ ప్రదర్శించసాగారు. ఆయుధాలు నశించి సాత్యకి మల్లయుద్ధం చేస్తుంటే కృష్ణుడు అర్జునునితో ఇలా అన్నాడు. "చూస్తున్నావా! యుద్ధంలో విలుకాండ్రందరిలో శ్రేష్ఠుడైన సాత్యకి రథహీనుడై యుద్ధం చేస్తున్నాడు. సాత్యకి శిథిలమవుతున్నాడు చూడు. అతనిని రక్షించు. నీ వెన్నంటి కౌరవసేనలో ప్రవేశించాడు. భారతవంశస్థులలో మహాపరాక్రమశాలులైన అందరితో యుద్ధం చేశాడు. అర్జునా! శ్రేష్ఠయోధుడైన సాత్యకి అలసిపోయాడు. అయినా యుద్ధం చేయాలన్న తలంపుతో భూరిదక్షిణుడైన భూరిశ్రవుడు వచ్చాడు. ఇది సమయుద్ధం కాదు." రాజా! ఆపై యుద్ధ దుర్మదుడైన భూరిశ్రవుడు క్రుద్ధుడై ఉద్యమించి మదపుటేనుగు మదపుటేనుగును కొట్టినట్టు సాత్యకిని దెబ్బతీశాడు. యోధశ్రేష్ఠులయిన కృష్ణార్జునులు రణ భూమిలో రథంపై కూర్చొని కోపంతో ఆ యుద్ధాన్ని చూస్తున్నారు. ఆపై కృష్ణుడు అర్జునునితో ఇలా అన్నాడు - "చూడు వృష్ణి-అంధక వంశాలలోని మేటివీరుడు భూరిశ్రవునికి లోబడుతున్నాడు. అర్జునా! దుష్కరమైన కర్మను చేసి అలసిపోయి నేలబడుతున్నాడు సాత్యకి. అతడు నీ శిష్యుడు. రక్షించు."

సంజయు డిలా చెప్తున్నాడు. "భరతర్షభా! ఇలా అంటుండగానే సేనలో పెద్ద హాహాకారం చెలరేగింది. మహాబాహువయిన భూరిశ్రవుడు సాత్యకిని ఎత్తి నేలపై వేశాడు. భూరిశ్రవుడు సాత్వత శ్రేష్ఠుడైన సాత్యకిని సింహం ఏనుగును ఈడ్చినట్లు రణభూమిలో లాగుతూ ప్రకాశించాడు. ఆ పై భూరిశ్రవుడు రణభూమిలో ఒరనుండి కత్తిని లాగి, పట్టుకొని, సాత్యకి జుట్టుపట్టుకొని కాలితో ఛాతీపై తన్నాడు. ఆపై కుండలాలతో కూడిన సాత్యకి తలను శరీరం నుండి ఖండించటానికి ఉపక్రమించాడు. అప్పుడు సాత్యకి వేగంగా తనతలను త్రిప్పసాగాడు. కుమ్మరి దండంతో గ్రుచ్చి చక్రాన్ని త్రిప్పినట్లు, జుట్టుపట్టుకొన్న భూరిశ్రవుని చేతితో పాటు తలను త్రిప్పసాగాడు సాత్యకి. రాజా! ఆ రీతిగా యుద్ధంలో గింజుకొంటున్న సాత్యకిని చూసి వాసుదేవుడు మరల అర్జునునితో ఇలా అన్నాడు. "మహాబాహూ! వృష్ణి అంధకవంశశ్రేష్ఠుడు ధనుర్విద్యలో నీ అంతటి వాడు. నీకు శిష్యుడు. చూడు భూరిశ్రవునికి లోబడిపోతున్నాడు. పార్థ! పరాక్రమమన్నది మిథ్య. కాకపోతే సాత్యకిని భూరిశ్రవుడు యుద్ధంలో మించిపోగలడా?" వాసుదేవుడిలా

అనగానే అర్జునుడు భూరిశ్రవుని మనసా ఇలా అభినందించాడు. 'కురువంశ కీర్తి వర్ధనుడైన భూరిశ్రవుడు సాత్వతశ్రేష్ఠుడైన సాత్యకిని ఈడ్చుతూ, రణభూమిలో ఆడుకొంటూ నాకు మరలా ఆనందాన్ని కల్గిస్తున్నాడు. సాత్యకిని ఈడ్చుతున్నాడు కానీ చంపటం లేదు.' రాజా! ఈ రీతిగా అర్జునుడు మనసా భూరిశ్రవుని ప్రశంసించి, వాసుదేవునితో ఇలా అన్నాడు. "సైంధవుని మీదనే దృష్టిపెట్టినందువలన సాత్యకిని గమనించలేదు. ఇదిగో సాత్యకి సంరక్షణకై దుష్కరకర్మను ఆచరిస్తాను." అలా చెప్పి అర్జునుడు వాసుదేవుని మాటను పాటిస్తూ, వెంటనే పదునైన క్షురప్రాన్ని గాండీవంపై సంధించాడు. ఆకాశం నుండి జారిపడుతున్న పెద్ద తోకచుక్కవలె అర్జునుని బాహువునుండి వెలువడిన ఆ బాణం కత్తిఎత్తిన ఆ భూరిశ్రవుని చేతిని అంగదాలతో పాటు ఖండించింది."

143. అర్జున భూరిశ్రవుల సంవాదము - సాత్యకి భూరిశ్రవుని వధించుట.

సంజయు డిలా చెప్తున్నాడు. "ఆ చేయి అంగదాలతో కత్తితో సహా నేలబడింది. అర్జునుడు తనను నిష్ఫలుని చేయగా భూరిశ్రవుడు సాత్యకిని వీడి, కోపంతో అర్జునుని నిందించ నారంభించాడు.

ఆ భూరిశ్రవుడు చేతిని కోలుపోయి, ఒకేరెక్కగల పక్షివలె, ఒకే చక్రంగల రథంవలె నేలపై నిలిచి క్షత్రియులందరూ వింటుండగా అర్జునునితో ఇలా అన్నాడు.

"అర్జునా! నీవు చాలా దారుణమైన పని చేశావు. నిన్ను చూడకుండా ఇతరులతో యుద్ధం చేస్తున్న నా చేతిని ఖండించావు. ధర్మపుత్రునితో ఏం చెపుతావు? భూరిశ్రవుడు మరేదో పనిచేస్తుంటే నేను యుద్ధంలో చంపానని ఎలా చెపుతావు? పార్థా! ఇటువంటి అస్త్రవిద్యను నీకు ఏ మహాత్ముడు ఉపదేశించాడు? ఇంద్రుడా? రుద్రుడా? ద్రోణుడా? కృపుడా? నీవు లోకంలో చాలా మందికన్న మిన్నగా అస్త్రధర్మం తెలిసివాడివి. కానీ నీతో ముఖాముఖి యుద్ధంలో తలపడని నన్ను ఎలా దెబ్బకొట్టావు? అభిమానవంతు లెవ్వరూ సావధానంగా లేనివాడిని, భయపడినవానిని, రథహీనుని, శరణుకోరిన వానిని, దుఃఖంలో ఉన్న వానిని దెబ్బతీయరు. పార్థా! ఇది నీచులు చేసే పని. చెడ్డవారు చేసే పని. ఇటువంటి పాప కర్మను నీవెలా చేయగలిగావు? అర్జునా! ఆర్యులు ఆర్యకర్మను చేయటమే సుకరం. కానీ ఆర్యుడు అనార్య కర్మను చేయటం లోకంలో మరీ చెడ్డపని అవుతుంది. నరోత్తమా! మనిషి ఎక్కడ, ఎవరిమధ్య ఉంటాడో ఆ శీలాన్ని వెంటనే అలవరచుకొంటాడు. ఇప్పుడు నీలో ఆ స్థితియే కనిపిస్తోంది. నీవు రాజవంశంలో పుట్టిన వాడవు. విశేషించి కురువంశంలో

మంచి నడవడి, మంచి వ్రతశీలం గల నీవు క్షాత్రధర్మాన్ని తప్పావు. వృష్ణివంశీయుడైన సాత్యకి కోసం నీవు చేసిన ఈ క్షుద్రకర్మ నిశ్చయంగా శ్రీకృష్ణుని అభిమతమే. నీవు ఇంత నీచంగా ఆలోచించవు. ఇతరులతో యుద్ధం చేస్తూ అసావధానంగా ఉన్న వానిని ఇలా ఇబ్బందిపెట్టడం శ్రీకృష్ణుని మిత్రునకే చెల్లినపని. అర్జునా! వృష్ణి, అంధక వంశస్థులు సంస్కార హీనులు, క్రూరకర్మలు చేసేవారు, స్వభావం చేతనే గర్హింపబడిన వారు. వారిని ప్రమాణంగా ఎలా స్వీకరించావు?"

భూరిశ్రవుడలా అనగానే అర్జునుడు అతనితో ఇలా అన్నాడు. "మనిషి ముసలివాడైతే బుద్ధి కూడా మందగిస్తుందన్నది స్పష్టమే. ప్రభూ ! నీవన్నదంతా నిరర్థకం. కృష్ణుని గూర్చి, పాండు కుమారుడనైన నన్ను గురించి నీకు తెలుసు. అయినా నిందిస్తున్నావు. నేను యుద్ధధర్మాలు తెలిసినవాడను. సర్వశాస్త్రార్థాల పారాన్ని ముట్టినవాడను. నేను అధర్మాన్ని చేయను. అది తెలిసి కూడా వ్యామోహానికి లోనవుతున్నావు. క్షత్రియులు తమ తమ సోదరులతో, పితరులతో, పుత్రులతో, సంబంధులతో, బంధువులతో, సమానావస్థ గల సహచరులతో, మిత్రులతో కూడి శత్రువులతో పోరాడుతారు. వారందరూ ప్రధానవీరుని బాహుబలాన్ని ఆశ్రయించినవారే. సాత్యకి నా శిష్యుడు. నాకు సుఖాన్ని సమకూర్చే సంబంధి. మా కోసం విలువైన తన ప్రాణాలమీద మోహాన్ని వీడి, పోరాడుతున్నవాడు. యుద్ధ దుర్మదుడైన సాత్యకి యుద్ధంలో నా కుడిభుజం వంటివాడు. అటువంటివాడు శత్రువుల కధీనమై కష్టపడుతుంటే చూస్తూ ఎలా ఊరుకోగలను. నీవు అతనిని ఈడ్చటం, తాను నిష్క్రియుడు కావటం నేను చూశాను. యుద్ధానికి వెళ్ళినవాడు కేవలం తనను రక్షించుకుంటే చాలదు. తన కార్యాలలో ఆసక్తులైన అందరినీ రక్షించుకోవాలి. మహాసంగ్రామంలో అటువంటివారిచే రక్షింపబడుతూ రాజు తనను తాను రక్షించుకోవాలి. మహారణంలో సాత్యకి చంపబడటం నేను చూస్తే అతని వియోగంవలన నాకు అనర్థకమై పాపం వస్తుంది. కాబట్టి నేను అతనిని రక్షించాను. నా పై కోపపడతావెందుకు? "ఇతరులతో యుద్ధం చేస్తున్న నన్ను నీవు వంచించా"వని నన్ను నీవు నిందించావు. ఇది నా బుద్ధిలో ఆలోచనను రేపుతోంది. నీవు స్వయంగా చాలామంది శత్రువులతో యుద్ధం చేస్తున్నావు. అలాగే రథాలతో, ఏనుగులతో నిండి, గుర్రాలతో, పదాతులతో కల్లోలమై, సింహనాదాల తీవ్రధ్వనితో గంభీరమైన ఈ సైన్య సాగరంలో, నీవారూ శత్రువులు పరస్పరం పోరాడుతుంటే నీవు సాత్యకితో కలబడ్డావు. ఇటువంటి యుద్ధం ఎవరో ఒకరు ఎవరో ఒకరితో చేసేది ఎలా అవుతుంది ? సాత్యకి చాలా మందితో కలబడి, మహారథుల నెందరినో ఓడించి అలసిపోయాడు. గుర్రాలూ అలసి పోయాయి. శస్త్రాల బారినపడి విమనస్కుడయ్యాడు. మహారథుడైన సాత్యకిని ఆటువంటి స్థితిలో యుద్ధంలో జయించి, పరాక్రమంతో

లొంగదీసికొన్నట్లు భావించి, గొప్పవాడ నను కొంటున్నావు. కాబట్టి రణభూమిలో అటువంటి సాత్యకి తలను నీవు కత్తితో నరుకదలచుకొన్నావు. సాత్యకి అటువంటి కష్టంలో ఉంటే చూస్తూ ఎవడు ఊరుకొంటాడు. వీరా! నిన్ను నీవే నిందించుకో, ఆత్మరక్షణమే చేసికొనలేకపోయావు. ఇక నిన్ను ఆశ్రయించిన వారిని ఎలా రక్షించగలవు?"

సంజయు డిలా చెప్తున్నాడు. "అర్జును డలా మాట్లాడగానే భూరిశ్రవుడు సాత్యకిని విడిచిపెట్టి రణభూమిలో ప్రాయోపవేశం చేశాడు. పుణ్యలక్షణుడైన భూరిశ్రవుడు ఎడమచేతితో బాణాలు పరచుకొని బ్రహ్మలోకాన్ని చేరగోరి ప్రాణాలలో ప్రాణాలు హోమం చేశాడు. కళ్ళను సూర్యునిలో, ప్రసన్న హృదయాన్ని నీటిలో సమాహితం చేసి, మహోపనిషత్తు ప్రతిపాదించిన పరబ్రహ్మను ధ్యానిస్తూ, యోగయుక్తుడైన ముని అయ్యాడు. ఆపై సర్వసేనలలోని జనం కృష్ణార్జునులను నిందించారు. పురుషోత్తముడైన భూరిశ్రవుని ప్రశంసించారు. కృష్ణార్జునులు నిందకు గురియై కూడా అప్రియ వచనాలు ఏవీ పలుకలేదు. ప్రశంసిస్తున్నా భూరిశ్రవుడు ఏమీ ఆనందించలేదు. రాజా! నీ కొడుకులు అలా నిందించగా వారిని, భూరిశ్రవుడు అంతకు ముందు పలికిన దానిని అర్జునుడు మనసా సహించలేకపోయాడు. భారతా! మనస్సులో కోపం పెట్టుకోకుండా గతంలోని మాటలను స్మరింపజేస్తున్నట్లు పాండుసుతుడైన అర్జునుడు కౌరవుల నాక్షేపిస్తూ ఇలా అన్నాడు. "రాజులందరికీ నా మహావ్రతం తెలుసు. నా బాణాల రక్షణలోనున్న నా వారి నెవ్వరినీ శత్రువులు చంపలేరు. యూపకేతూ! ఇది గ్రహించి నీవు నన్ను నిందించతగదు. ధర్మం తెలియకుండా ఇతరులను నిందించటం తగినపనికాదు. యుద్ధంలో సాత్యకిని చంపగోరి, కత్తిని పట్టిన నీ బాహువును నేను ఛేదించటం నిందింపదగిన ధర్మంకాదు. నాయనా! బాలుడైన అభిమన్యుడు శస్త్రాస్త్రాన్ని, రథాన్ని, కవచాన్ని కోల్పోయాడు. ఆ స్థితిలో అతనిని చంపటాన్ని ధార్మికు డెవ్వడూ అభినందించడు.

శాస్త్రమర్యాదలు పాటించని క్షుద్రుడు దుర్యోధనుడు. అటువంటి దుర్యోధనునకు సహకరిస్తున్న భూరిశ్రవుని వధ తగినదే. ప్రాణాల మీదకు వచ్చినపుడు నా వారిని నేను రక్షించాలి. ప్రత్యేకించి నా కళ్ళ ఎదుటనే వారు చంపబడుతున్నపుడు. ఇది నా నిశ్చయం. మహాత్ముడు అయిన భూరిశ్రవుడు సాత్యకిని లోబరుచుకొన్నాడు. కాబట్టి ప్రతిజ్ఞా పాలన చేస్తూ నేనిలా ప్రవర్తించాను." సంజయు డిలా చెప్తున్నాడు. "మరల బహువిధాలుగా ఆయా విషయాలను ఆలోచించి అర్జునుడు కృపాసహితుడై, శోకపీడితుడై భూరిశ్రవునితో ఇలా అన్నాడు. 'ఛీ! క్షత్రధర్మం! ఇతరులు శరణుకోరదగిన శరణ ప్రదుడైన నీవంటి రాజు కూడా ఇటువంటి అవస్థను పొందవలసివచ్చింది. నా వంటి పురుషోత్తముడెవడైనా ఈ లోకంలో నీవంటి వానిని దెబ్బకొడతాడా? ముందు చేసిన ప్రతిజ్ఞ ఇంత పని చేయించింది.'"

అర్జునుడలా అనగానే భూరిశ్రవుడు తలతో నేలను తాకాడు. తన ఎడమచేతితో

కుడిచేతిని అర్జునుని దగ్గరకు విసిరాడు. మహారాజా! మహాతేజస్వి, యూపకేతువు అయిన భూరిశ్రవుడు అర్జునుని మాటలు విని, తలవాల్చి మౌనంగా ఉన్నాడు. అర్జును డిలా అంటున్నాడు. "శలాగ్రజా! నాకు ధర్మరాజుపై, బలిష్ఠులలో శ్రేష్ఠుడైన భీమునిపై, నకుల సహదేవులపై ఎటువంటి ప్రేమయో నీపై కూడా అంతే. నా అనుమతితో, మహాత్ముడైన శ్రీకృష్ణుని అనుమతితో నీవు ఉశీనరసుతుడైన శిబిచక్రవర్తివలె పుణ్యలోకాలకు వెళ్ళు." వాసుదేవు డిలా అన్నాడు. "సతత అగ్నిహోత్రయాజీ! నాలోకాలు నిరంతరంగా ప్రకాశిస్తూ నిర్మలమైనవి. బ్రహ్మాది దేవశ్రేష్ఠులు కూడా కోరుకొనేవి. వెంటనే అక్కడకు చేరు. గరుత్మంతుని శిరస్సుపై నాతో సమానంగా కూర్చొని సంచరించగలవు." సంజయు డిలా చెప్తున్నాడు. "భూరిశ్రవునిచే విడువబడిన సాత్యకి లేచి, కత్తి తీసికొని ఆ మహాత్ముని శిరస్సును నరకబోయాడు. యాగాలలో భూరిదక్షిణలిచ్చే భూరిశ్రవుడు నిష్కల్మషుడు. చేయి తెగి, తొండంతెగిన ఏనుగువలె కూర్చొని ఉన్నాడు. అర్జునునిచే దాదాపు చంపబడి ప్రాయోపవేశం చేసిఉన్నాడు. అటువంటి వానిని సాత్యకి చంపదలచాడు. సైన్యాలన్నీ నిందిస్తున్నాయి. కృష్ణుడు, మహాత్ముడైన అర్జునుడు, భీముడు చక్రరక్షకులైన యుధామన్యువు, ఉత్తమౌజుడు, అశ్వత్థామ, కృపుడు, కర్ణుడు, వృషసేనుడు, సైంధవుడు వారిస్తున్నారు. అయినా మనస్సు చెడి సాత్యకి సర్వసేనలు ఆక్రోశిస్తుండగానే ప్రాయోపవేశవ్రతంలో ఉన్న భూరిశ్రవుని చంపాడు. అర్జునుడు చేయినరకగా రణభూమిలో ప్రాయోపవిష్టుడై ఉన్న భూరిశ్రవుని శిరస్సును సాత్యకి కత్తితో నరికివేశాడు.

అర్జునుడు అప్పటికే దెబ్బతీసిన భూరిశ్రవుని చంపిన సాత్యకి చేష్టను సేనలు అభినందించలేదు. భూరిశ్రవుడు యుద్ధంలో ప్రాయోపవేశంతో మరణించటం చూసి సిద్ధులు, చారణులు, మానవులు, దేవతలు అందరూ ఆయనను ప్రస్తుతించారు. ఆ భూరిశ్రవుని కర్మలతో వారు ఆశ్చర్యానికి లోనయ్యారు. నీ సైనికులు రకరకాలుగా అనుకూల వ్యతిరేక వ్యాఖ్యలు చేశారు. 'సాత్యకి తప్పేమీలేదు. అలా జరగవలసి ఉంది. కాబట్టి మీరు కోపపడవద్దు. **మనుష్యులకు క్రోధం మరీ దుఃఖకరం.** వీరుడైన సాత్యకి చేతనే భూరిశ్రవుడు చావాలి. దానిని గూర్చి విచారణ అనవసరం. రణరంగంలో సాత్యకినే ఈయనకు మృత్యువుగా బ్రహ్మ విధించాడు.' సాత్యకి ఇలా అన్నాడు. 'ధర్మకంచుకాన్ని ధరించి ఉన్న ధర్మవాదులారా! ధర్మవాదాలు చేస్తూ చంపవద్దు చంపవద్దు అని మీరంటున్నారు. సుభద్రకొడుకు అభిమన్యుని నిరాయుధుని చేసి మీరు చంపారే! అప్పుడు మీ ధర్మం ఎక్కడకు పోయింది? నేను ఇంతకు ముందే ప్రతిజ్ఞ చేశాను. నన్ను ఎవరైనా తిరస్కరించినా, రణభూమిలో నన్ను ఎవరైనా ఎత్తిపడవేసి బ్రతికి ఉన్నప్పుడే కాలితో తన్నినా, నేను అతనిని చంపుతాను. ఆ శత్రువు మునివ్రతంలో ఉన్నా తప్పదు. నేను నన్ను కొట్టిన

దెబ్బకు బదులు తీర్చుకోటానికి బాహువులతో సిద్ధంగా ఉన్నాను. కళ్ళుండి కూడా మీరు నేను మరణించినట్లు భావించటం మీ బుద్ధితక్కువతనం. కురుశ్రేష్ఠులారా! నేను బదులుతీర్చుకోవటం ఇతనికి తగినదే. తన ప్రతిజ్ఞ పాలిస్తూ అర్జునుడు నన్ను చూసి కత్తి దూసి ఇతని - బాహువును ఖండించాడే. అదే నాకు నష్టం. కీర్తికి దూరమయ్యాను. జరుగవలసినది జరుగుతుంది. దైవమే జరిపిస్తుంది. దాని కనుగుణంగా భూరిశ్రవుడు యుద్ధంలో చనిపోయాడు. ఇక్కడ అధర్మచర్య ఏముంది? వాల్మీకి మహర్షి ఈ లోకంలో పూర్వకాలంలోనే ఒక శ్లోకాన్ని గానం చేశాడు - వానరా! స్త్రీలను చంపగూడ దంటున్నావు. కానీ మనిషి ఎప్పుడూ, అన్ని వేళలా ప్రయత్న శీలుడై ఉండాలి. శత్రువులకు పీడ కలిగించేది ఏదైనా సరే కర్తవ్యమనే భావించాలి." సంజయుడిలా చెప్తున్నాడు. "మహారాజా! సాత్యకి అలా అనగానే కౌరవ పుంగవులు ఏమీ మాటాడలేదు. మనసా దాని నంగీకరించారు. మహాయాగాలలో మంత్రాలతో పవిత్రుడై, ఎన్నో వేల దక్షిణల నిచ్చి, కీర్తి గడించి, ఆరణ్యకుడైన మునివలె ప్రాయోపవేశం చేసిన భూరిశ్రవుని వధను మాత్రం ఒక్కడు కూడా అభినందించలేదు. శూరుడు, వరదుడు అయిన ఆ భూరిశ్రవుని శిరస్సు నీలకేశాలతో, పావురాల కళ్ళవంటి ఎర్రని కళ్ళతో ఉండి, అశ్వమేధయాగంలో నరుకబడి, కుండం మధ్యలో ఉంచిన గుర్రపు తలలా కనిపించింది. ఆ వరదుడు, వరస్వీకారానికి అర్హుడు అయిన ఆ భూరిశ్రవుడు ఆ మహాసంగ్రామంలో శస్త్ర తేజస్సుతో పవిత్రుడై, ఉత్తమ శరీరాన్ని వీడి ఉత్కృష్ట ధర్మం ద్వారా భూమ్యాకాశాలను లంఘించి ఊర్ధ్వలోకాలను ఆక్రమించాడు."

144. భూరిశ్రవుడు సాత్యకిని అవమానించుటకు కారణము చెప్పుట

ధృతరాష్ట్రుడిలా అడిగాడు. "ద్రోణ, కర్ణ, వికర్ణ, కృతవర్మల చేతిలో ఓడిపోలేదు. యుధిష్ఠిరుని కిచ్చిన మాటమేరకు కౌరవ సేనాసాగరాన్ని దాట గలిగాడు. యుద్ధంలో ఎదురులేనివాడు. ఆటువంటి వీరుని సాత్యకిని కౌరవేయుడైన భూరిశ్రవుడు బలంగా పట్టుకొని నేలపై పడవేయగలిగాడు. ఎలా జరిగింది?" సంజయు డిలా చెప్తున్నాడు. "రాజా! నీకు కలిగిన అనుమానం తీరాలంటే గతంలో సాత్యకి భూరిశ్రవుల పుట్టుక ఎలా జరిగిందో తెలియాలి. చెపుతా విను. అత్రి కొడుకు సోముడు. సోముని కొడుకు బుధుడు. బుధునకు ఒక్కడే కొడుకు పురూరవుడు. అతడు ఇంద్రసమానుడు. పురూరవుని కొడుకు ఆయువు. ఆయువు కొడుకు నహుషుడు. నహుషుని కొడుకు యయాతి. ఆ రాజుపై దేవతలకు, మునులకు కూడా ఆదరం. యయాతికి దేవయానియందు పుట్టిన పెద్దకొడుకు

యదువు. యదువంశంలో దేవమీఢుడనే ఒక రాజు. ఆయాదవుని కొడుకు శూరుడు. మూడు లోకాల అభినందనల నందినవా డాయన. శూరుని కొడుకు శౌరి. ఆ నరోత్తముడు మహాయశస్వి. వసుదేవ నామంతో ప్రసిద్ధుడు. రాజా! శూరుడు, ధనుర్విద్యలో అద్వితీయుడు. యుద్ధంలో కార్తవీర్యునితో సమానుడు. ఆ వంశంలో అటువంటి పరాక్రమంతోనే శిని జన్మించాడు.

రాజా! అదే సమయంలో మహాత్ముడైన దేవకుని కుమార్తె స్వయంవరానికి క్షత్రియులందరు ఒక్కచోట చేరారు. అక్కడ శిని రాజులందరినీ జయించి, వసుదేవుని కోసం దేవకిని తీసికొనిపోవటానికి ఆమెను రథమెక్కించాడు. ఆ దేవకిని చూసి, సోమదత్తుడు శిని పరాక్రమాన్ని సహించలేకపోయాడు. ఆ ఇద్దరిమధ్య అద్భుతమైన బాహుయుద్ధం ఒక పూటంతా జరిగింది. శిని సోమదత్తుని బలంగా పట్టి, నేలపై పడగొట్టాడు. కత్తి నెత్తి సోమదత్తుని జుట్టుపట్టుకొని కాలితో తన్నాడు. వేలకొలదిగ ఉన్న రాజుల మధ్యలో వారంతా ప్రేక్షకులై చుట్టు నిలిచి ఉండగా, మరల జాలిపడి "బ్రతుకుపో" అంటూ విడిచిపెట్టాడు. ఆ పై అసహనానికి లోనైన సోమదత్తుడు తపస్సుతో పరమేశ్వరుని ప్రసన్నుని చేసికొన్నాడు. దానితో ఆనందించి, గొప్పవరాల నివ్వగల సామర్థ్యం గల ఆ మహాదేవుడు ఇష్టమైన వరం కోరుకొమ్మన్నాడు. ఆ రాజు ఇలా వరమడిగాడు. "స్వామీ! శిని కుమారుని యుద్ధంలో పడగొట్టి వేల కొలదిగనున్న రాజుల మధ్యలో కాలితో కొట్టి చంపగల కొడుకు కావాలి.' పార్థివా! సోమదత్తుని ఆ మాట విని, మహాదేవుడు తలను అడ్డంగా త్రిప్పి ఇలా అన్నాడు - 'రాజా! ఇలా జరగదు. శిని కుమారుడు గతంలోనే తపస్సుతో నన్ను ఆరాధించి, మూడు లోకాలలోనూ ఎవరి ద్వారానూ మరణం లేకుండునట్లు మేటివరాన్ని పొందాడు. అయినా ఈ నీ శ్రమ వ్యర్థం కాదు. ఆయన మనవడిని నీ కొడుకు యుద్ధంలో మోహపెట్టగలడు. కానీ కృష్ణుని రక్షణలో నున్న అతనిని చంపటం కుదరదు. **నేనే కృష్ణుడను. నాకూ, కృష్ణునకు భేదం లేదు.** అలా జరగనీ" అని చెప్పి మహాదేవుడు అదృశ్యుడయ్యాడు. ఆ వరదానంతో సోమదత్తుడు భూరిదక్షిణుడైన భూరిశ్రవుని కొడుకుగా పొందాడు. అతడే రణరంగంలో శిని వంశీయుడైన సాత్యకిని పడగొట్టాడు. సర్వసేనలు చూస్తుండగానే సాత్యకిని కాలితో తన్న గలిగాడు. రాజా! నీవు నన్ను అడిగిన దానికి ఇది సమాధానం. వివరించాను.

ఎంతగొప్ప మనుష్యులైనా యుద్ధంలో సాత్యకిని గెలవలేరు. వృష్ణివంశీయులు లక్ష్యాలను చక్కగా ఛేదించగలరు. అనేక రీతులుగా విచిత్రంగా యుద్ధం చేయగలరు. దేవదానవ గంధర్వులను కూడా ఓడించగలరు. అయినా పొగరు పడరు. తమ పరాక్రమంతోనే ఉద్యమిస్తారు. ఇతరుల కెప్పుడూ లోబడరు. బలంలో వృష్ణివంశస్థతతో సమానమైనది

భూత భవిష్యద్వర్తమానాలలో ఏదీ లేదు. వారు జ్ఞాతులను అవమానించరు. పెద్దల మాట వినటంలో ఆసక్తి చూపుతారు. ఆ వృష్ణివీరులను దేవతలు, అసురులు, గంధర్వులు, యక్షులు, నాగులు, రాక్షసులు కూడా యుద్ధంలో గెలవలేరు. బ్రాహ్మణ ధనంకోసం, గురువుల ధనంకోసం, జ్ఞాతుల ధనంకోసం ఎప్పుడూ హింసకు పాల్పడరు. ఆపదలో నున్న వారిని రక్షిస్తారు. అందరూ ధనవంతులు, గర్వంలేని వారు, బ్రాహ్మణభక్తులు, సత్యవాదులు. సమర్థులను పరాభవించరు. దీనులను ఉద్ధరిస్తారు. ఎప్పుడూ దేవతల నారాధిస్తారు. వారు జితేంద్రియులు, పరసంరక్షకులు, ఆత్మప్రశంస చేసికొననివారు. అందువలన వృష్ణివీరుల చక్రాన్ని ఎవ్వరూ దెబ్బతీయలేరు. రాజా! ఎవడైనా మేరు పర్వతాన్ని మోయవచ్చు. సముద్రాన్ని దాటవచ్చు. కానీ వృష్ణివీరుల సమూహాన్ని మాత్రం అంతం చేయలేడు. కురురాజా! నరశ్రేష్ఠా! ప్రభూ! నీ సందేహానికి సమాధానంగా మొత్తం వివరించాను. ఈ యుద్ధంలో నీ అవినీతియే ప్రధాన కారణం."

145. సంకుల యుద్ధము.

ధృతరాష్ట్రుడిలా అడిగాడు. "సంజయా! కౌరవుడైన భూరిశ్రవుడు ఆ స్థితిలో మరణించిన తరువాత మరలా యుద్ధమెలా జరిగిందో నాకు చెప్పు." సంజయు డిలా చెప్తున్నాడు. భారతా! భూరిశ్రవుడు పరలోకానికి వెళ్ళిన తరువాత అర్జునుడు శ్రీకృష్ణుని ప్రేరేపించాడు. కృష్ణా! జయద్రధరాజు ఉన్నచోటికి గుర్రాలను నడిపించు. పుండరీకాక్షా! నీవు మూడు ధర్మాలలోనూ (ఆత్మరక్షణ, ఆశ్రితరక్షణ, ధర్మరక్షణ) ఉంటావని వింటుంటాం. అనఘా! నా ప్రతిజ్ఞను నీవే సఫలం చేయాలి. మహాబాహూ! సూర్యుడు వేగంగా అస్తమిస్తున్నాడు. పురుషశ్రేష్ఠా! నేను చాలా పెద్దపనికి ఉద్యమించాను. ఈ జయద్రధుడు కురుసేనలోని మహారథులచే సంరక్షింపబడుతున్నాడు. సూర్యుడు అస్తమించకముందే నా ప్రతిజ్ఞ సత్యం కావాలి కృష్ణా! జయద్రధుని చంపటానికి అనుగుణంగా గుర్రాలను నడిపించు.' ఆ పై వెండివన్నె గల గుర్రాలను జయద్రధవధను ఉద్దేశించి నడిపించసాగాడు మీదపడుతున్న బాణాలవలె నున్న గుర్రాలతో వస్తున్న అర్జునుని చూసి, కౌరవసేనలోని ప్రముఖులంతా వేగంగా పరుగెత్తారు. దుర్యోధనుడు, కర్ణుడు, వృషసేనుడు, మద్రరాజు (శల్యుడు), అశ్వత్థామ, కృపుడు, స్వయంగా సైంధవుడు - యుద్ధానికి సిద్ధపడ్డారు. అక్కడున్న సైంధవునకు ఎదురు నిలిచి, అర్జునుడు కోపంతో మండుతున్న కళ్ళతో దహిస్తున్నట్లు చూశాడు.

ఆపై జయద్రధుని చంపటానికి అతనివైపు వెళ్తున్న అర్జునుని చూసి, దుర్యోధనుడు త్వరపడుతూ కర్ణునితో ఇలా అన్నాడు. 'కర్ణా! కోరుకొన్న యుద్ధకాలం సమీపించింది.

మహాత్మా! నీ బలాన్ని ఇప్పుడు చూపించు. అర్జునుడు జయద్రథుని యుద్ధంలో చంపటానికి వీలుకానిరీతిగా ప్రవర్తించు. దినమిక కొంచెమే మిగిలి ఉంది. బాణసమూహాలతో శత్రువును నేడే చంపు. కర్ణా! రోజు గడిస్తే మనం తప్పక గెలిచినట్లే! సూర్యాస్తమయం దాకా సైంధవుని రక్షించుకొంటే ప్రతిజ్ఞను పూర్తిచేయలేని అర్జునుడు అగ్నిలో దూకుతాడు. అర్జునుడు లేని భూమిపై అతని సోదరులు, అనుచరులు ముహూర్తకాలం కూడా జీవించాలనుకోరు. కర్ణా! పాండవులు నశించగానే పర్వతాలు, వనాలు, కాననాలతో సహా ఈ భూమిని నిరాటంకంగా పరిపాలిద్దాం. మానదా! అర్జునుడు దైవోపహతుడు. అందుకే బుద్ధి విపరీతమైనది. కర్తవ్యాకర్తవ్యాలను గ్రహించకుండా రణభూమిలో ప్రతిజ్ఞ చేశాడు. కర్ణా! తప్పక ఆత్మవినాశం కోసమే పాండుసుతుడైన అర్జునుడు జయద్రథుని చంపుతానని ప్రతిజ్ఞ చేశాడు. రాధేయా! నీవు బ్రతికి ఉండగా అర్జునుడు సూర్యాస్తమయంలోపల సైంధవ రాజును ఎలా చంపగలడు? శల్యుడు, కృపుడు రక్షిస్తుండగా ధనంజయుడు యుద్ధంలో సైంధవుని ఎలా చంపగలడు? అశ్వత్థామ, నేను, దుశ్శాసనుడు రక్షిస్తుండగా అర్జునుడు సైంధవుని ఎలా సమీపించగలడు? కాలం అర్జునుని రెచ్చగొడుతోంది. మానదా! చాలా మంది శూరులు యుద్ధం చేస్తున్నారు. సూర్యుడు అస్తాద్రివైపు వెళ్తున్నాడు. అర్జునుడు సైంధవుని వైపు వెళ్ళలేడనే అనుమానిస్తున్నాను. కర్ణా! నీవు నాతో, అశ్వత్థామతో, శల్యునితో కృపునితో, మహారథులయిన ఇతర శూరులతో కలిసి, రణభూమిలో తీవ్రప్రయత్నంతో అర్జునునితో పోరాడు.'

'మారిషా! నీ కుమారుడు అలా చెప్పగా విని రాధేయుడు దుర్యోధనునకు ఇలా బదులిచ్చాడు. దృఢలక్ష్యంగల మేటివిలుకాడైన భీముడు యుద్ధంలో బాణసమూహాలతో చాలాసార్లు నా శరీరాన్ని తీవ్రంగా గాయపరిచాడు. రణభూమిలోనే ఉండాలి అన్న భావనతో మాత్రమే ఇప్పుడు ఉన్నాను. మహాబాణాలు నా శరీరాన్ని దహించి వేశాయి. నా శరీర మసలు కదలటం లేదు. నా శక్తి వంచన లేకుండా పోరాడుతాను. నా జీవితం నీ కోసమే. ఈ అర్జునుడు సైంధవుని చంపకుండా చూస్తాను. నేను యుద్ధం చేస్తూ, పదునైన బాణాలను విడుస్తుంటే సవ్యసాచి సైంధవుని సమీపించలేడు. భక్తుడు, నిత్యమూ శ్రేయోభిలాషి అయిన వాడు చేయవలసినట్లు అంతా చేస్తాను. గెలుపు మాత్రం దైవాధీనం. మహారాజా! నేటి యుద్ధంలో సైంధవ సంరక్షణకై తీవ్రంగా ప్రయత్నిస్తాను. నీకు ప్రియాన్ని కలిగిస్తాను. గెలుపు మాత్రం దైవాధీనం. నీ కోసం నేడు నేను నా పౌరుషాన్ని ఆశ్రయించి, అర్జునునితో యుద్ధం చేస్తాను. గెలుపు మాత్రం దైవాధీనం. కురుశ్రేష్ఠా! నేడు నాకూ, అర్జునునకూ మధ్య జరిగే ఒళ్లు గగుర్పొడిచే భీకర యుద్ధాన్ని సర్వ సేనలూ చూస్తాయి.'

రణభూమిలో కర్ణదుర్యోధను లిలా మాటాడుకొనే సమయంలో అర్జునుడు పదునైన బాణాలను నీ సేనపై ప్రయోగించాడు. అర్జునుడు పదునైన బాణాలతో రణభూమిలో ఎప్పుడూ వెనుదిరగని శూరుల బాహువులను ఖండించాడు. అవి గడియవలె, ఏనుగు తొండాలవలె ఉన్నాయి. మహాబాహువయిన అర్జునుడు అన్నివైపులా తన పదునైన బాణాలతో సైనికుల తలలను, ఏనుగుల తొండాలను, గుర్రాల మెడలను, రథాల ఇరుసులను ఖండించాడు. ప్రాసాలు, తోమరాలు ధరించి, నెత్తుటితో తడిసియున్న ఆశ్వికులను తన కత్తులతో అర్జునుడు రెండేసి, మూడేసి ముక్కలుగా నరికివేశాడు. గుర్రాలు, పెద్ద పెద్ద ఏనుగులు, ధ్వజాలు, గొడుగులు, ధనుస్సులు, చామరాలు, తలలు అంతటా పడిపోసాగాయి. ఎగిసిన అగ్ని ఎండిన అడవిని తగులబెట్టినట్లు నీ సేనను తగులబెడుతూ అర్జునుడు స్వల్పవ్యవధిలో రణభూమిని నెత్తురోడజేశాడు. బలవంతుడు దురాధర్షుడు సత్యవిక్రముడైన అర్జునుడు నీ సేనలోని సైనికులను దాదాపు అందరినీ చంపి, సైంధవుని సమీపించాడు. భరతశ్రేష్ఠా! భీమసేన సాత్యకుల సంరక్షణలో అర్జునుడు మండిపడే అగ్నిలా భాసించాడు. తన బలసంపత్తితో ఆ రీతిగా యుద్ధభూమిలో చెలరేగుతున్న అర్జునుని చూసి, నీ వారు సహించలేకపోయారు. దుర్యోధనుడు, కర్ణుడు, వృషసేనుడు, మద్రరాజు (శల్యుడు), అశ్వత్థామ, కృపుడు, స్వయంగా సైంధవుడు, సైంధవరక్షణకై సన్నద్ధులై అర్జునుని చుట్టుముట్టారు. సంగ్రామకోవిదుడైన అర్జునుడు ధనుష్టంకారాలతో రథమార్గాలలో నృత్యం చేస్తున్నాడు. నోరు తెరిచిన యమధర్మరాజువలె కనిపిస్తున్నాడు. అయినా యుద్ధవిశారదులయిన నీ వారందరూ నిర్భయంగా అర్జునుని చుట్టుముట్టారు. సైంధవుని వెనుక ఉంచి కాపాడుకొంటూ, కృష్ణార్జునులను చంపగోరుతూ వారు సూర్యాస్తమయాన్ని కోరుతూ నిరీక్షిస్తున్నారు. అంతలో సూర్యుడు ఎర్రబడ్డాడు. వారు పాముపడగలవంటి భుజాలతో విండ్లను వంచి, సూర్యకిరణాలవంటి బాణాలను వందల కొలదిగ అర్జునునిపై విడిచారు. అర్జునుడు ఆ బాణాలను రెండేసి, మూడేసి, ఎనిమిదేసి ముక్కలుగా ఖండించి, ఆ రథికులను గాయపరిచాడు. కృపాచార్యుడు తన పరాక్రమాన్ని ప్రదర్శిస్తూ అర్జునుని నివారించాడు. కృపుడు పదిబాణాలతో అర్జునుని, వీడు బాణాలతో కృష్ణుని గాయపరిచి రథమార్గంలో సైంధవుని కాపాడుతూ నిలిచాడు. ఆ తరువాత కౌరవసేనలోని శ్రేష్ఠమహారథులందరూ అనేక రథ సమూహాలతో కృపాచార్యునకు అన్నివైపులా నిలిచారు. నీ కుమారుని శాసనాన్ని అనుసరించి, ధనుస్సులను ఆకర్షిస్తూ, బాణాలను వదలుతూ సైంధవుని రక్షించసాగారు. ఆ పై శూరుడైన అర్జునుని బాహుబలం కళ్ళకు కట్టింది. గాండివధనుస్సు, బాణాల అక్షయత్వం కూడా కనిపించింది.

అశ్వత్థామ, కృపాచార్యుల అస్త్రాలను తన అస్త్రాలతో నిరోధించి, ఒక్కొక్కరిపై పదేసి బాణాలను ప్రయోగించి, అందరినీ బాధించాడు. అశ్వత్థామ ఇరవై అయిదు,

వృషసేనుడు ఏడు, దుర్యోధనుడు ఇరవై, కర్ణశల్యులు మూడు మూడు బాణాలను ప్రయోగించి అర్జునుని గాయపరిచారు. వారంతా అర్జునుని ఉద్దేశించి పదే పదే గర్జిస్తూ, మరల మరల బాణాలతో గాయపరుస్తూ, ధనుస్సులను విదిలిస్తూ అన్ని వైపులనుండి నిరోధించారు. ఆ మహారథులందరూ సూర్యాస్తమయానికై ఎదురు చూస్తూ, త్వరపడుతూ, రథసమూహాలను మండలాకారంలో దగ్గరదగ్గరగా నిలుపుకొని అన్ని వైపులా నిలిచారు. వారు అర్జునుని ఉద్దేశించి గర్జిస్తూ, ధనుస్సులను కంపింపజేస్తూ మేఘాలు నీటితో పర్వతాన్ని అభిషేకించినట్లు తీక్ష్ణబాణాలను అర్జునునిపై కురిపించారు. రాజా! ఆ శూరులు అర్జునుని శరీరంపై గొప్పగొప్ప దివ్యాస్త్రాలను ప్రదర్శించారు. అర్జునుడు నీసేనలోని యోధులను చంపినంత పనిచేసి సైంధవుని సమీపించాడు. ఆ సంగ్రామంలో భీమసేనుడు, సాత్యకి చూస్తుండగానే కర్ణుడు బాణాలతో అర్జునుని నిలువరించాడు. అర్జునుడు సర్వసేనలు చూస్తుండగా రణభూమిలో పదిబాణాలతో కర్ణుని గాయపరిచాడు. మారిషా! సాత్యకి మూడు బాణాలతో కర్ణుని గాయపరిచాడు. భీమసేనుడు మూడు బాణాలతో, అర్జునుడు మరో ఏడు బాణాలతో కర్ణుని వేధించారు. మహారథుడైన కర్ణుడు ఆరవై ఆరవై బాణాలతో వారిని ఎదురుదెబ్బతీశాడు. కర్ణుని ఆ యుద్ధం చాలా మందితో జరుగుతోంది. అక్కడ కర్ణుని పరాక్రమం అద్భుతంగా కనిపించింది. రణభూమిలో కోపంతో ఒంటరిగా నిలిచి, ముగ్గురు మహారథులను నిరోధించసాగాడు. అర్జునుడు కర్ణుని వంద బాణాలతో మర్మస్థలాలన్నింటిపై కొట్టాడు. శరీరమంతా నెత్తుటితో తడవగా, కర్ణుడు ఏబది బాణాలతో అర్జునుని కూడా గాయపరిచాడు. యుద్ధంలో ఆ కర్ణుని ఆ నేర్పును చూసి, అర్జునుడు సహించలేకపోయాడు. ఆపై ధనంజయుడు తొమ్మిది బాణాలతో వేగంగా కర్ణుని ధనుస్సును ఖండించి, ఛాతీపై గాయపరిచాడు. కర్ణుడు మరొక వింటిని తీసికొని ఎనిమిది వేల బాణాలతో అర్జునుని కప్పివేశాడు. కర్ణుని చాపం నుండి వెలువడిన ఆ అసమాన బాణవృష్టిని మిడుతల దండును గాలి ఎగరగొట్టినట్లు అర్జునుడు బాణాలతో నాశనం చేశాడు. అప్పుడు రణభూమిలో సర్వయోధులు చూస్తుండగా అర్జునుడు హస్తనైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ బాణాలతో కర్ణుని కప్పివేశాడు.

త్వరపడవలసిన ఆ సమయంలో అర్జునుడు కర్ణసంహారం కోసం సూర్యతేజస్సుగల బాణాన్ని వేగంగా కర్ణునిపైకి విసిరాడు. వేగంగా వస్తున్న ఆ బాణాన్ని అశ్వత్థామ తీక్ష్ణమైన అర్ధచంద్రాకార బాణంతో ఖండించాడు. అది విరిగి నేలపై పడింది. అర్జునుని పరాక్రమ ప్రదర్శనకు బదులు తీర్చుకొనగోరి కర్ణుడు కూడా ఎన్నో వేల బాణాలతో అర్జునుని కప్పివేశాడు. ఇద్దరూ ఆబోతులవలె రంకెలు వెడుతూ తమ బాణాలతో ఆకాశాన్ని కప్పివేశాడు. బాణసమూహాలతో ఒకరినొకరు కొట్టుకొంటూ ఆ ఇద్దరూ వాటి మరుగున

పడి "కర్ణా! నేను అర్జునుణ్ణి. నిలు!" పార్థా! నేను కర్ణుణ్ణి నిలు." అని ఒకరితో ఒకరు అనసాగారు. ఈ రీతిగా ఒకరినొకరు బెదిరిస్తూ, వాగ్బాణాలతో ఒకరినొకరు రెచ్చగొడుతూ ఆ వీరులిద్దరూ రణరంగంలో త్వరగా, అందంగా, విచిత్రంగా పోరాడారు. సర్వయోధుల సమ్మేళనంలో వారిద్దరూ చూడదగిన వారయ్యారు. రణభూమిలో సిద్ధులు, చారణులు, నాగులచే ప్రస్తుతింపబడుతూ కర్ణార్జునులు ఒకరి నొకరు చంపగోరుతూ యుద్ధం చేశారు. రాజా! అప్పుడు దుర్యోధనుడు నీ వారితో ఇలా అన్నాడు - 'కర్ణుని కాపాడటానికి ప్రయత్నించండి యుద్ధంలో అర్జునుని చంపకుండా కర్ణుడు వెనుదిరగడు. ఆ మాట తానే నాతో అన్నాడు.' రాజా! అంతలోనే కర్ణుని పరాక్రమాన్ని గమనించి అర్జునుడు చెవిదాకా లాగి విడిచిన నాలుగు బాణాలతో కర్ణుని నాలుగు గుర్రాలను యమలోకానికి పంపాడు. భల్లంతో కర్ణుని సారధిని రథం మీది ఆసనం నుండి పడగొట్టాడు. నీ కుమారుడు చూస్తుండగానే అర్జునుడు కర్ణుని బాణాలతో కప్పివేశాడు. గుర్రాలు, సారధి చనిపోయి రణభూమిలో బాణాలతో కప్పిబడిన కర్ణుడు మోహానికి గురియై ఏం చేయాలో తెలియని స్థితికి లోనయ్యాడు. మహారాజా! ఆ రీతిగా అప్పుడు విరథుడైన కర్ణుని చూసి అశ్వత్థామ కర్ణుని తన రథంపై ఎక్కించుకొని మరల అర్జునునితో పోరాడసాగాడు. శల్యుడు కూడా ముప్పయి బాణాలతో అర్జునుని గాయపరిచాడు. కృపుడు ఇరవై బాణాలతో కృష్ణుని గాయపరిచాడు. పండ్రెండు బాణాలతో అర్జునుని కొట్టాడు. మహారాజా! సింధు రాజు నాలుగు బాణాలతో, వృషసేనుడు ఏడు బాణాలతో విడివిడిగా కృష్ణార్జునులను గాయపరిచారు. అలాగే ధనంజయుడు అశ్వత్థామను అరవై నాలుగు బాణాలతో, శల్యుని పంద బాణాలతో, సైంధవుని పదిబాణాలతో, వృషసేనుని మూడు బాణాలతో, కృపుని ఇరవై అయిదు బాణాలతో గాయపరచి అర్జునుడు పెద్దగా అరిచాడు.

సవ్యసాచి అయిన అర్జునుని ప్రతిజ్ఞను భంగపరచాలని నీ వారంతా కలిసి వేగంగా అర్జునుని మీద పడ్డారు. ఆ పై అర్జునుడు ధార్తరాష్ట్రులను భయపెడుతూ అంతటా వారుణాస్త్రాన్ని ప్రయోగించాడు. కౌరవులందరూ తమ విలువైన రథాలతో అర్జునుని ముందు కురుకుతూ బాణవృష్టులను కురిపించారు. భారతా! అందరినీ మోహింపజేయగల అంత భయంకర యుద్ధం జరుగుతున్నా అర్జునుడు మోహానికి గురి కాలేదు. బాణసమూహాలను కురిపిస్తూనే ఉన్నాడు. అర్జునుడు రాజ్యాన్ని పొందగోరుతూ, కౌరవులు తమను పెట్టిన బాధలను, పండ్రెండు సంవత్సరాలు అరణ్యంలో పడ్డ కష్టాలను తలచుకొంటూ, గాండివం నుండి విడిచిన బాణాలతో సర్వదిక్కులను ఆవరింపజేశాడు. క్రుద్ధుడైన అర్జునుడు పచ్చని అల్లెత్రాడు గల గాండివ ధనుస్సుతో శత్రుసంహారం చేస్తుంటే ఆకాశం ఉల్కలతో వెలుగుతున్నట్లయింది. మృతదేహాలపై పక్షులు వాలుతున్నాయి.

అర్జునుడు బాణాలను ప్రయోగించి, మేలుజాతి గుర్రాలను, ఏనుగులను ఎక్కిఉన్న కురువీరులను బాణాలతో పడగొట్టాడు. ఆ రణరంగంలో భయంకరంగా కనిపిస్తున్న రాజులెందరో పెద్ద గదలను, లోహమయ పరిఘలను, కత్తులను, శక్తులను, గొప్ప గొప్ప శస్త్రాలను చేతబట్టి వెంటనే అర్జునునిపై దాడి చేశారు. ఆ అర్జునుడు ప్రళయకాల మేఘగర్జనవలె ధ్వనిస్తూ, ఇంద్రచాపంతో సమానమైన గాండివాన్ని, నవ్వుతూ రెండు చేతులతోనూ లాగి, నీ వారిని దహిస్తూ వేగంగా ముందుకు వచ్చాడు. వీరుడు, మేటివిలుకాడు అయిన అర్జునుడు రథాలతో, ఏనుగులతో, పదాతి సమూహాలతో దూసుకొని రావటాన్ని చూసి రణభూమిలో వారి ఆయుధాలను, జీవితాలను కూడా నశింపజేసి వారిని యమరాజ్య వర్ధకులను చేశాడు."

146. అర్జున పరాక్రమము - సైంధవవధ

సంజయు డిలా చెప్తున్నాడు. "రాజా! అర్జునుడు ఆకర్షిస్తున్న గాండివధనుస్సు యొక్క టంకారం యముని గర్జనవలె, ఇంద్రుని వజ్రధ్వనివలె భయంకరంగా ఉంది. దానిని విని, నీ సేన భయోద్విగ్నమై పైకెగసే అలలతో నిండి, చేపలను, మొసళ్ళను తనలో నింపుకొన్న సముద్రజలంవలె కనిపించింది. అర్జునుడు ఒకే మారు అన్ని దిక్కులను కలయజూస్తూ, అన్ని రకాల ఆయుధాలలో నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ, సంచరించసాగాడు. అర్జునుని హస్తలాఘవం వలన బాణాన్ని స్వీకరించటం, ఎక్కుపెట్టడం, లాగటం, విడవటం ఏమీ చూడలేకపోయాం. అర్జునుడు కౌరవసేనల నన్నింటినీ భయపెడుతూ, అణచటానికి వీలుకాని ఐంద్రాస్త్రాన్ని తీశాడు. ఆ ఐంద్రాస్త్రం నుండి దివ్యాస్త్రమంత్రాలతో మంత్రించబడి ప్రజ్వలిస్తున్న వందల, వేల బాణాలు వెలువడ్డాయి. చెవి దాకా లాగి విడిచిన బాణాలు అగ్ని సూర్య కిరణాలవలె ఆకాశమంతా వ్యాపించాయి. ఆకాశం తోక చుక్కలతో నిండినట్లయి చూడరాని విధంగా తయారయింది. ఆ పై కౌరవుల బాణాలతో అంతా అంధకార బంధురమైంది. దానిని తొలగించటం ఇతరుల ఊహకు కూడా అందనిది. కాని అర్జునుడు దివ్యాస్త్రాలను మంత్రించిన బాణాలతో వెంటనే దానిని నశింపచేశాడు. ఆ చర్య ఉదయ కాలంలో, సూర్యుడు కిరణాలతో చీకటిని నశింపజేసినట్లుంది. ఆ పై గ్రీష్మకాల సూర్యుడు మడుగులలోని నీటిని ఎండగట్టి నట్టు, అర్జునుడు ప్రజ్వలించే బాణకిరణాలతో నీ సేనను ఎండగట్టాడు.

దివ్యాస్త్రవేత్త అయిన అర్జునుడు ప్రయోగించిన బాణకిరణాలు సూర్యకిరణాలు లోకాన్ని ముంచివేసినట్లు శత్రుసేనను ముంచెత్తాయి. ఆ తరువాత అర్జునుడు విడిచిన

తీవ్రతేజస్సు గల ఇతర బాణాలు ప్రియబంధువులవలె నీ సేనలోని వీరుల గుండెల్లో ప్రవేశించాయి. నీ యోధులు రణభూమిలో అర్జునునిపై ప్రయోగించిన బాణాలు మండేనిప్పు మీద వాలిన మిడుతలవలె అర్జునుని తాకి నశించాయి. ఈ రీతిగా అర్జునుడు శత్రువుల జీవితాలను, వేరుప్రఖ్యాతులను, మట్టిలో కలుపుతూ, రూపుదాల్చిన మృత్యువువలె రణభూమిలో సంచరించాడు. అర్జునుడు కొందరు యోధుల కిరీటాలతో సహా వస్త్రాలను, అంగదాలతో సహా విశాలభుజాలను, కుండలాలతో సహా చెవులను ఖండించాడు. గజయోధుల బాహువులను తోమరాలతో సహా, ఆశ్వికుల బాహువులను ధనుస్సులతో సహా, రథసారధుల బాహువులను కళ్ళెములతో సహా అర్జునుడు ఖండించాడు. రణరంగంలో ప్రజ్వలిస్తున్న తీక్ష్ణబాణా లనే జ్వాలలతో కూడిన అర్జునుడు నిప్పురవ్వలతో మండుతున్న అగ్నివలె వెలుగొందాడు. అర్జునుడు ఇంద్ర సమానుడై ఒకే మారు సర్వదిక్కులయందును బాణాలను ప్రయోగిస్తూ రథంపై నిలిచి చూడముచ్చటగా కనిపించాడు. ధనుష్టంకారం చేస్తూ రథమార్గాలలో నృత్యం చేస్తున్నాడు. ఆ దశలో ఆకాశంలో తపిస్తున్న మధ్యాహ్న సూర్యునివలె ఉన్న అర్జునుని, రాజులు ప్రయత్న పూర్వకంగా కూడా చూడలేకపోయారు.

ప్రజ్వలించే తీక్ష్ణబాణాలను ధరించిన అర్జునుడు వర్షాకాలంలో ఇంద్రధనుస్సుతో కూడి జలభరమైన పెద్దమేఘంవలె విరాజిల్లాడు. ఆ రణభూమిలో అర్జునుడు పెద్దపెద్ద అస్త్రాలవరదను కల్పించాడు. దుస్తరమూ, భయంకరమూ అయిన ఆ వరదలో కౌరవసేనలోని యోధపుంగవులందరూ మునిగి పోయారు. క్షురాలు ఏనుగుల తొండాలను ఖండించగా అవి నేలపై పడ్డాయి. దానితో భూమి పాములతో నిండినట్లుంది. అక్కడక్కడ సేనల ముఖపద్మాలతో వ్యాపించిన భూమి మాలలను అలంకరించుకొనినట్లు ప్రకాశించింది. విచిత్రమైన తలపాగలు, కిరీటాలు, కేయూరాలు, అంగదాలు, కుండలాలు, స్వర్ణకవచాలు, ఏనుగుల గుర్రాల అలంకారాలు, వందలకొలది కిరీటాలు అక్కడక్కడ పడిఉండటంతో రణభూమి విచిత్రంగా నవవధువువలె మిక్కిలిగా ప్రకాశించింది. రణభూమిలో రూపుకట్టిన మృత్యువువలెనున్న ఆ అర్జునుని పరాక్రమాన్ని చూసి, కౌరవసేనలో ఎన్నడూ లేనంత భయం కలిగింది. అర్జునుడు తన అస్త్రాలతో శత్రుసేనల అస్త్రాలను లోబరచుకొంటూ రౌద్రకర్మాసక్తుడై తన రౌద్రాన్ని ప్రకటింపసాగాడు. అర్జునుడు రథికశ్రేష్ఠులను అతిక్రమించి, ముందుకు సాగాడు. ఆకాశంలో తపిస్తున్న మధ్యాహ్న సూర్యునివలెనున్న అర్జునుని సర్వప్రాణులు కూడా చూడలేకపోయాయి. రణభూమిలో మహాత్ముడైన ఆ అర్జునుని గాండివం నుండి వెలువడిన బాణసమూహాలు ఆకాశంలోని హంసల బారువలె కనిపించాయి. అర్జునుడు అన్నివైపులా తన అస్త్రాలతో శత్రువీరుల అస్త్రాలను నిరోధించి, రౌద్రకర్మాసక్తుడై తన రౌద్రాన్ని ప్రదర్శించాడు.

శ్రీ కృష్ణసారథి అయిన అర్జునుడు జయద్రథుని చంపగోరుతూ సర్వదిశలయందును బాణ వృష్టిని కురిపిస్తూ, వేగంగా రథంపై రణభూమిలో తిరుగసాగాడు. అర్జునుడప్పుడు చూడముచ్చటగా ఉన్నాడు. అర్జునుడు ప్రయోగించిన వందల, వేలబాణాలు ఆకాశంలో భ్రమిస్తున్నట్లు కనిపిస్తున్నాయి. అర్జునుడు బాణాలు చేతబట్టడాన్ని, సంధించటాన్ని, విడవటాన్ని అసలు గమనించలేకపోతున్నాం. రాజా! ఆ రీతిగా అర్జునుడు సర్వదిక్కులను, సర్వరధికులను రణరంగంలో కదంబకుసుమాలను (రోమాంచితాలను) చేసి, జయద్రథునిపై దాడిచేశాడు. ఆపై వంగిన కణుపులుగల అరవై నాలుగు బాణాలతో జయద్రథుని గాయపరిచాడు. సైంధవునకభిముఖంగా వెళ్తున్న అర్జునుని చూసి, కౌరవయోధులు సైంధవుని ప్రాణాలపై ఆశను వీడి, రణభూమినుండి వెనుదిరిగారు. రాజా! రణభూమిలో అర్జునునివైపు వెళ్ళిన నీ యోధుల శరీరాలపై ప్రాణాంతకాలైన బాణాలు పడ్డాయి. అర్జునుడు సూర్యకిరణాలతో సమానమైన తన బాణాలతో నీ సేనను శవాలతో నింపివేశాడు. రాజేంద్రా! ఈ రీతిగా ఆ నీ చతురంగబలాన్ని కలతబెట్టి, అప్పుడు అర్జునుడు జయద్రథునివైపు సాగిపోయాడు. అశ్వత్థామను ఏభై బాణాలతో, వృషసేనుని మూడు బాణాలతో గాయపరిచి అర్జునుడు జాలితో, కృపుని తొమ్మిది బాణాలతోనే పీడించాడు. శల్యుని పదహారు బాణాలతో, కర్ణుని ముప్పది రెండు బాణాలతో సైంధవుని అరవైనాలుగు బాణాలతో గాయపరిచి సింహంవలె గర్జించాడు. అర్జునుని బాణాలచే గాయపడిన సైంధవుడు దానిని సహించలేకపోయాడు. అంకుశంపోటు తిన్న ఏనుగువలె క్రుద్ధుడయ్యాడు. వరాహధ్వజుడయిన సైంధవుడు సూటిగా వెళ్ళే బాణాలను చెవివరకు లాగి, అర్జునుని రథం మీదకు ప్రయోగించాడు. మూడు బాణాలతో శ్రీకృష్ణుని, ఆరు బాణాలతో అర్జునుని, ఎనిమిది బాణాలతో గుర్రాలను, ఒక బాణంతో ధ్వజాన్ని కొట్టాడు సైంధవుడు. అర్జునుడు వేగంగా సైంధవుడు ప్రయోగించిన బాణాలను ఖండించి, ఒకేమారు రెండు బాణాలతో సైంధవరథసారథి తలను, ధ్వజాన్ని ఖండించాడు. అర్జునుని బాణం దెబ్బతిని అగ్నిశిఖవలెనున్న వరాహధ్వజం విరిగి నేలబడింది. రాజా! ఆ సమయంలోనే సూర్యుడు అస్తమించే సమయం దగ్గర పడుతుండగా జనార్దనుడు త్వరపడుతూ అర్జునునితో ఇలా అన్నాడు.

"మహాబాహూ! అర్జునా! ఈ సింధురాజు ప్రాణాలను రక్షించుకోవాలని మహారధులయిన ఆరుగురు వీరుల మధ్య భయంతో నిలిచిఉన్నాడు. ఈ మహారధుల నారుగురిని ఓడించకుండా ఏ మాయతోనూ సైంధవుని చంపటం కుదరదు. ఇప్పుడు సూర్యుని కప్పివేయటానికి ఒక యుక్తిని కల్పిస్తాను. కేవలం సైంధవుడు సూర్యుడు అస్తమిస్తున్నట్లు చూడగలడు. ప్రభూ! దానితో దురాచారుడైన ఆ సైంధవుడు ఆనందంతో తన జీవితాన్ని, నీ వినాశనాన్ని కోరుతూ తనను తాను ఏరీతిగానూ దాచుకోలేడు.

కురుసత్తమా! ఆ అవకాశం చూసికొని నీవు సైంధవుని చంపాలి. సూర్యుడు అస్తమించాడన్న ఆలోచనను కూడా చేయవద్దు." "అలాగే" అని అర్జునుడు కృష్ణునితో అన్నాడు. అప్పుడు యోగి, యోగీశ్వరుడు అయిన శ్రీహరి ధ్యానమగ్నుడై సూర్యుని చుట్టూ చీకటిని సృష్టించాడు. రాజా! కృష్ణుడు చీకటిని సృష్టించగానే, సూర్యుడు అస్తమించాడనుకొనీ, అర్జునుడు నశించబోతున్నాడనీ నీ యోధులంతా ఆనందించారు. రణభూమిలో ఆనందించిన నీ సైనికులు సూర్యునివైపు కూడా చూడలేదు. జయద్రథుడు మాత్రమే ముఖం పైకెత్తి పదే పదే చూడసాగాడు. ఆపై సింధురాజు సూర్యుని చూస్తుండగానే కృష్ణుడు మరల అర్జునునితో ఇలా అన్నాడు. "భరతసత్తమా! వీరుడైన సింధురాజు నీవలని భయాన్ని వీడి, సూర్యుని చూస్తున్నాడు. చూడు. మహాబాహూ! ఈ దురాత్ముని చంపటానికి ఇదే తగిన సమయం. వెంటనే అతని తలను ఖండించు. నీ ప్రతిజ్ఞను సఫలం చేసికో."

శ్రీ కృష్ణుడు అలా చెప్పగానే ప్రతాపవంతుడైన అర్జునుడు అగ్నితో, సూర్యునితో సమానమైన తన బాణాలతో నీ సేనను చంపసాగాడు. ఇరవైబాణాలతో కృపుని, ఏభై బాణాలతో కర్ణుని, ఆరు ఆరు బాణాలతో శల్య దుర్యోధనులను, ఎనిమిది బాణాలతో వృషసేనుని, ఆరు బాణాలతో సైంధవుని గాయపరిచాడు. రాజా! అలాగే మహాబాహువయిన అర్జునుడు నీ వారిని తీవ్రంగా గాయపరిచి, సైంధవుని మీదకు వచ్చాడు. తన జ్వాలలతో అందరినీ ఆస్వాదించే అగ్నివలె మీదకువస్తున్న అర్జునుని చూసి, జయద్రథుని రక్షిస్తున్న వారంతా పెద్దసందేహంలో పడిపోయారు. నీ యోధులందరూ రణభూమిలో అర్జునుని బాణధారలతో అభిషేకించారు. అర్జునుడు మాటిమాటికి బాణసమూహాలు తనను కప్పివేయటంతో కోపానికి లోనయ్యాడు. ఆపై పురుషశ్రేష్ఠుడైన అర్జునుడు నీ సేనను చంపదలచి బాణమయమై, భయంకరమైన వలను సృష్టించాడు. రాజా! రణభూమిలో వీరుడైన అర్జునునిచే దెబ్బతింటున్న నీ యోధులు భయంతో సైంధవుని వీడి పోయారు.

ఆ భయంతో ఏ ఇద్దరూ కూడా కలిసి, పరుగెత్తలేకపోయారు. అక్కడ అర్జునుని పరాక్రమం అద్భుతంగా కనిపించింది. మహాయశస్వి అయిన అర్జునుడు అంత పరాక్రమాన్ని గతంలో ప్రకటించలేదు, భవిష్యత్తులో ప్రకటించబోడు కూడా. రుద్రుడు జంతువులను చంపినట్లుగా అర్జునుడు ఏనుగులనూ, ఏనుగులనెక్కినవారినీ, గుర్రాలనూ, ఆశ్వికులనూ, రథికులనూ చంపివేశాడు. రాజా! ఆ యుద్ధంలో అర్జునుని బాణాల దెబ్బలు తినని ఏనుగు కానీ, గుర్రం కానీ, సైనికుడు కానీ నాకు కనిపించలేదు. దుమ్ముతో, చీకటితో కళ్ళు మూసికొనిపోయిన యోధులు మహామోహానికి గురి అయ్యారు. ఒకరినొకరు గుర్తించలేకపోయారు. భారతా! అర్జునుడు ప్రయోగించిన బాణాల దెబ్బలు తిన్న సైనికులు గిరగిర తిరుగుతున్నారు. జారుతున్నారు, పడుతున్నారు, బాధపడుతున్నారు,

మలినపడుతున్నారు కూడా. సమస్త ప్రాణులూ నశించే ప్రళయంవలె మహాభయంకరమై, దాటరానిదై, దారుణమైన ఆ మహాసంగ్రామం జరుగుతుంటే రక్తప్రవాహంతో, వాయుగమనంతో నెత్తుట తడిసిన నేల మీది ధూళి అణిగిపోయింది. ఆ నెత్తుటిలో రథచక్రాలు నడిమి దిమ్మెల (ఇరుసుల) దాకా కూరుకొనిపోయాయి. రాజా! రణభూమిలో వేగశాలులై, మదించియున్న నీ ఏనుగులు వేలకొలదిగ శరీరాలు చీలి, తమనెక్కిన యోధులు మరణించగా ఆర్తనాదాలు చేస్తూ, తమసేనలనే త్రొక్కివేస్తూ పారిపోయాయి. రాజా! గుర్రాలమీది ఆశ్వికులు పడిపోగా అర్జునుని బాణాల దెబ్బలు తిన్న గుర్రాలు, కాల్బలమూ భయంతో పారిపోయారు. సైనికులు జుట్టు విరబోసికొని, కవచాలను కోలుపోయి, గాయాలనుండి నెత్తురోడుతూ రణాంగణాన్ని వీడి, భయంతో పారిపోయారు. ఊరువులనే మొసళ్ళు పట్టివేయగా కొందరు అక్కడే నిలిచిపోయారు. కొందరు చనిపోయిన ఏనుగుల మధ్య చిక్కువడిపోయారు.

రాజా! ఈ రీతిగా అర్జునుడు నీ సేనలను పారద్రోలి సింధురాజును రక్షిస్తున్నవారిని ఘోర బాణాలతో చంపివేశాడు. అశ్వత్థామను, కృపుని, కర్ణుని, శల్యుని, వృషసేనుని, సుయోధనుని తీవ్రమైన బాణసమూహాలతో అర్జునుడు కప్పివేశాడు. రాజా! అర్జునుడు యుద్ధంలో చాలా వేగంగా అస్త్రాలను ప్రయోగిస్తున్నాడు. ఎప్పుడు బాణం తీస్తున్నాడో, ఎప్పుడు సంధిస్తున్నాడో, ఎప్పుడు లాగుతున్నాడో, ఎప్పుడు విడుస్తున్నాడో ఎవ్వరికీ ఏ రీతిగానూ కనిపించటంలేదు. ఎప్పుడు బాణాలు విడుస్తున్నా, మండలాకార ధనుస్సే కనిపిస్తోంది. అన్ని వైపుల దూసుకొని పోతున్న బాణాలే కనిపిస్తున్నాయి. అర్జునుడు కర్ణవృషసేనుల ధనుస్సులను ఖండించి, శల్యుని రథసారథిని భల్లంతో రథాసనం నుండి పడగొట్టాడు. జయశీలులలో శ్రేష్ఠుడైన అర్జునుడు రణభూమిలో మామా అల్లుళ్ళయిన కృపాశ్వత్థామలను ఇద్దరినీ బాణాలతో తీవ్రంగా గాయపరిచాడు. ఈ రీతిగా నీ మహారథుల నందరినీ కలతపెట్టి అర్జునుడు అగ్నిసమానమై, భయంకరమైన బాణాన్ని పైకి తీశాడు. ఆ బాణం దివ్యాస్త్రమంత్రాలతో మంత్రించబడి ఇంద్రుని వజ్రం వలె ప్రకాశిస్తోంది. సర్వభారాన్ని సహించగల ఆ మహాబాణం నిత్యమూ గంధమాల్యాదులచే అర్చించబడేది. ఆ బాణాన్ని యధావిధిగా మంత్రించి వజ్రాస్త్రంతో సంయోజన చేసి, వేగంగా గాండివంపై అనుసంధించాడు. రాజా! అగ్ని తేజస్సుగల ఆ బాణాన్ని అనుసంధానం చేస్తున్న సమయంలో ఆకాశంలో చరించే ప్రాణులలో మహాకోలాహలం చెలరేగింది.

జనార్దనుడు త్వరపడుతూ మరలా అర్జునునితో ఇలా అన్నాడు - "అర్జునా! దురాత్ముడైన సైంధవుని తలను ఖండించు. సూర్యుడు పర్వతశ్రేష్ఠమైన అస్తాద్రికి చేరబోతున్నాడు. జయద్రధుని చంపే విషయంలో మరొక్క మాట చెప్తున్నా వినుఁ! సైంధవుని

తండ్రి వృద్ధక్షత్రుడు. లోకవిఖ్యాతి గన్నవాడు. ఆయన చాలా కాలానికి సైంధవుని కొడుకుగా పొందాడు. జయద్రథుని జన్మ కాలంలో అశరీరవాణి జయద్రథుని గూర్చి ఆ రాజాతో ఇలా అన్నది. 'రాజా! నీ కొడుకు కుల, శీల, దమాది గుణాలతో మీ రెండు వంశాలకు తగినవాడు కాగలడు. నిత్యమూ శూరుల సత్కారాల నందుకొంటూ లోకంలో క్షత్రియ శ్రేష్ఠుడవుతాడు. అయితే చివరలో రణభూమిలో యుద్ధం చేస్తున్న సమయంలో ఒక క్షత్రియ శ్రేష్ఠుడు కోపంతో తన ఎదుట నిలిచిన ఇతని తలను ఖండిస్తాడు.' ఇది విని సింధురాజు - వృద్ధ క్షత్రుడు చాలా సేపు ఆలోచించి పుత్రప్రేమ ప్రేరణ చేయగా జ్ఞాతులందరితో ఇలా అన్నాడు. 'రణభూమిలో యుద్ధం చేస్తూ పెనుభారాన్ని మోస్తున్న నా కుమారుని శిరస్సును నేలపై పడవేసినవాని తల నూరు ముక్కలవుతుంది. ఇది నిస్సంశయం.' ఈ రీతిగా పలికి ఆపై జయద్రథుని రాజును చేసి వృద్ధ క్షత్రుడు అరణ్యానికి పోయి, తీవ్ర తపస్సులో లగ్నమయినాడు. వానరధ్వజా! తేజస్వి అయిన ఆ వృద్ధక్షత్రుడు ఈ సమంతపంచకానికి వెలుపలగా సహింపరాని ఘోర తపస్సు చేస్తున్నాడు. కాబట్టి నీవు మహాసంగ్రామంలో భీకరాద్భుత కర్మ సాధించగల దివ్యాస్త్రంతో సింధురాజైన జయద్రథుని తలను కుండలాలతో సహా ఖండించి, వృద్ధక్షత్రుని ఒడిలో పడవేయి. అలాకాక నీవు ఇతని తలను భూమిపై పడగొడితే నీ తల కూడా నిస్సందేహంగా నూరు ముక్కలవుతుంది. కురుశ్రేష్ఠా! దివ్యాస్త్రాన్ని ఆశ్రయించి ఈ విషయం వృద్ధక్షత్రుడు గ్రహించలేని రీతిలో సాధించు. నీవు సాధించలేని పని కానీ, చేయలేని పని కానీ ఏదీ లేదు."

కృష్ణుని ఈ మాటను విని, అర్జునుడు పెదవుల కొనలను తడుపుకొంటూ వెంటనే నిత్యమూ గంధ మాల్యార్చితమై, సర్వభారాన్ని సహించగల వజ్రసమస్పర్శ గల బాణాన్ని దివ్యమంత్రాలతో అభిమంత్రించి, సైంధవుని చంపటానికై సంధించి, విడిచాడు. గాండివం నుండి వెలువడిన ఆ బాణం డేగవలె వేగంగా వెళ్ళి, సింధుపతి తలను ఖండించి, గగనతలానికి ఎగిరింది. ఆ సింధురాజు తలను బాణాలతో పైపైనే నడిపించాడు. అది దుర్మార్గులకు దుఃఖాన్ని, మంచి వారికి ఆనందాన్ని కలిగించింది. అదే సమయంలో అర్జునుడు ఆ ఆరుగురు మహారథులను కదంబకుసుమాలవలె రోమాంచితులను చేసి వారితో పోరాడాడు. భారతా! ఆ పై అక్కడ మరీ మహాశ్చర్యకరమైన సంఘటనను చూశాం. రణభూమినుండి సమంతపంచకం వెలుపలకు సింధురాజు తలను నడిపించాడు.

మారిషా! ఆ సమయంలో వృద్ధక్షత్రనరపాలుడు సంధ్యోపాసన చేస్తున్నాడు. నల్లని వెండ్రుకలతో కుండలాలతో నున్న ఆ సింధురాజు తలను ఉపాసన చేస్తున్న వృద్ధక్షత్రుని ఒడిలో పడవేసింది ఆ బాణం. కుండలాలతో అందగించియున్న ఆ తల

తన ఒడిలో పడటాన్ని వృద్ధక్షత్రనరపాలుడు గమనించలేదు. భారతా! ఆ వృద్ధక్షత్రుడు జపాన్ని పూర్తిచేసి లేవగానే వెంటనే ఆ తల నేలపై పడింది. అరిందమా! కొడుకుతల నేలబడగానే ఆ రాజుతల కూడా వెంటనే నూరు ముక్కలయింది. ఆపై సర్వసేనలూ సాటిలేని ఆశ్చర్యానికి లోనయ్యాయి. కృష్ణుని, మహారథుడైన అర్జునుని ప్రశంసించాయి. అర్జునుడు సింధురాజును చంపగానే కృష్ణుడు ఆ చీకటిని ఉపసంహరించాడు. ఆ తరువాత నీ కుమారులు, అతని అనుచరులు అదంతా కృష్ణుడు ప్రయోగించిన మాయ అని గ్రహించారు. రాజా! ఈ రీతిగా అమితతేజస్వి అయిన అర్జునుడు ఎనిమిది అక్షౌహిణుల సేనను నీ అల్లుడైన సైంధవుని కూడా చంపివేశాడు. నరాధిపా! జయద్రథుని మరణాన్ని చూసి నీ కుమారులు దుఃఖంతో కన్నీరు కార్చారు. విజయం దక్కదని నిరాశకు లోనయ్యారు. అర్జునుని చేతిలో జయద్రథుడు మరణించిన తరువాత కృష్ణుడు, అర్జునుడు కూడా శంఖాలు పూరించారు. భారతా! భీముడు, యుధామన్యుడు, ఉత్తమౌజుడు కూడా విడివిడిగా శంఖాలు పూరించారు.

ఆ మహానాదాన్ని విని, ధర్మరాజు మహనీయుడైన అర్జునుని చేతిలో సైంధవుడు మరణించినట్లు భావించాడు. ఆపై వాద్యాలను మ్రోయింపజేసి, తన యోధులకు ఆనందాన్ని కల్గించాడు. ద్రోణునితో యుద్ధం చేయాలని రణభూమిలో సంచరించాడు. రాజా! ఆపై సూర్యు డస్తమించుచుండగా ద్రోణుడు సోమకులతో రోమాంచజనకంగా పోరాడాడు. సైంధవుడు మరణించిన తరువాత మహారథులైన సోమకులు అందరు ద్రోణుని చంపదలచి ప్రయత్న పూర్వకంగా పోరాడారు. పాండవులు సింధురాజును చంపి, విజయాన్ని పొందారు. దానితో విజయోన్మత్తులై ఎక్కడెక్కడి వారో వచ్చి, ద్రోణాచార్యునితో పోరాడసాగాడు. అర్జునుడు కూడా సింధురాజును చంపి, రథిక శ్రేష్ఠులైన నీ యోధులతో యుద్ధం చేయసాగాడు. ఇంద్రుడు దేవశత్రువులను చంపినట్లు, సూర్యుడు ఉదయించి చీకట్లను తొలగించినట్లు వీరుడైన ఆ అర్జునుడు తన తొలి ప్రతిజ్ఞను పూర్తి చేసికొని, అన్ని వైపుల నుండి నీ సేనలను సంహరించసాగాడు.

147. అర్జున కృపాచార్య యుద్ధము - కర్ణసాత్యకి యుద్ధము.

ధృతరాష్ట్ర డిలా అడిగాడు. "సంజయా! వీరుడైన సైంధవుని అర్జునుడు చంపిన తరువాత నా వారు ఏం చేశారు? నాకు వివరంగా చెప్పు." సంజయు డిలా చెప్తున్నాడు. "భారతా! యుద్ధభూమిలో అర్జునుడు సైంధవుని చంపటం చూసి, కృపుడు అశ్వత్థామ క్రోధానికి లోనయి, మహా బాణవృష్టిని అర్జునునిపై కురిపించారు. అర్జునుడు ఆ రీతిగా మహాశరవృష్టిచే పీడింపబడుతూ ఎంతో వ్యథ చెందాడు. అర్జునుడు తన

గురువును గానీ గురుపుత్రుని కానీ యుద్ధంలో చంపదలచలేదు. అందువలన ధనంజయుడు అక్కడ వారిపై గురుత్వాన్ని చూపాడు. కృప అశ్వత్థామల అస్త్రాలను తన అస్త్రాలతో నివారించి, వారిని చంపదలచలేదు కాబట్టి స్వల్పవేగంగల బాణాలను వారిపై ప్రయోగించాడు. అర్జునుడు ప్రయోగించిన ఆ బాణాల సంఖ్య ఎక్కువగా ఉన్నందువలన వాటి ద్వారా వారు గట్టిగానే దెబ్బతిన్నారు. తీవ్రవేదనకు వారు గురి అయ్యారు. రాజా! అప్పుడు అర్జునుని బాణాలు బాధించగా కృపుడు మూర్ఛపోతూ రథం వెనుకవైపున కూర్చున్నాడు. తన యజమాని బాణపీడితుడై మూర్ఛపోవటాన్ని గమనించి, ఆయన మరణించాడని భావించి, రథసారథి రథాన్ని దూరంగా తీసికొనిపోయాడు. కృపుడు మూర్ఛిల్లి రణభూమి నుండి తొలగిపోగానే, అశ్వత్థామ కూడా అర్జునుని వీడి, మరొక రథికునితో తలపడటానికి వెళ్ళిపోయాడు.

బాణాల దెబ్బతిని, మూర్ఛిల్లిన కృపాచార్యుని చూసి, మేటివిలుకాడైన అర్జునుడు రథం మీదనే నిలిచి, జాలితో విలపించసాగాడు. కంటతడిపెట్టి దీనంగా ఇలా అన్నాడు. "మహామేధావి అయిన విదురుడు ఇటువంటి పరిణామాలను భావించియే, కులవినాశకుడైన సుయోధనుడు పుట్టినప్పుడే "వంశాన్ని చెరిపే ఈ శిశువును పరలోకానికి పంపటమే మేలు. ఇతని వలన కురుముఖ్యుల కందరకూ తీవ్రభయం కలుగబోతోంది" అని ధృతరాష్ట్రునికి చెప్పాడు. సత్యవాది అయిన విదురుని మాట ఇప్పుడు వాస్తవానికి వస్తోంది. ఆ దుర్యోధనుని వలననే ఈనాడు శరతల్పంపై నున్న గురువును చూడవలసి వచ్చింది. ఛీ! క్షత్రియ ధర్మం! ఛీ! బలం, పౌరుషం! నావంటివాడు బ్రాహ్మణునకూ, అందునా ఆచార్యునకు ఎలా ద్రోహం చేయగలడు? ఋషి కొడుకు, నాకు గురువు, ద్రోణునకు ఇష్టసఖుడు అయిన ఈ కృపుడు నా బాణాల దెబ్బతిని, రథాసనంపై పడిఉన్నాడు. నేను కోరకపోయినా బాణాలదెబ్బ గట్టిగానే తగిలింది. రథాసనంపై పడిపోయాడు కృపుడు. నా ప్రాణాలు పోతున్నట్లున్నాయి. పుత్రశోకంతో కలిగిన తాపంవలన, బాణాల పీడవలన, మహాదురవస్థకు లోనుకావటం వలన నేను చాలా బాణాలు ప్రయోగించి బాధించాను. నిశ్చయంగా అభిమన్యుమరణం కన్న కృపాచార్యుడు ఎక్కువగా నన్ను దుఃఖింపజేస్తున్నాడు. కృష్ణా ! చూడు. తన రథంపై శిథిలంగా దీనంగా ఎలా పడిఉన్నాడో ! ఆచార్యుల నుండి విద్యలను పొంది, వారి కోరికలను నెరవేర్చిన నరోత్తములు దేవత్వాన్ని పొందగలరు. ఆచార్యులనుండి విద్యలను పొంది, వారినే సంహరించే పురుషాధములు దుర్మార్గులు. వారు నరకానికే వెళతారు. నేను ఇదిగో ఇలా కృపాచార్యుని శరవర్షంతో రథంపై పడగొట్టి, నరకానికి పోదగిన పని చేశాను. గతంలో అస్త్రవిద్యను నేర్పుతూ కృపుడు నాతో అనేవాడు - కౌరవ్యా! ఏ పరిస్థితిలోనూ గురువుపై బాణ ప్రయోగం చేయగూడదు అని. మహాత్ముడు,

సాధువు అయిన ఆ గురువు మాటను నేను పాటించలేదు. ఇదిగో! ఇలా ఆయన మీదనే రణభూమిలో శరవృష్టిని కురిపించాను. యుద్ధమందు వెన్ను చూపని పూజ్యుడు, గౌతమ వంశీయుడైన కృపునకు నమస్కారం. కృష్ణా! ఆయననే దెబ్బతీశానే! నన్ను నేనే అసహ్యించుకొంటున్నాను."

అర్జునుడు అలా విలపిస్తుండగానే, సైంధవుని మరణాన్ని చూసిన కర్ణుడు అర్జునునిపై దాడి చేశాడు. అర్జునుని రథం మీదకు వస్తున్న కర్ణుని చూసి, పాంచాలురు, సాత్యకి వెంటనే కర్ణునిపై దాడిచేశారు. తన మీదకు వస్తున్న కర్ణుని చూసి, మహారథుడైన అర్జునుడు నవ్వుతూ కృష్ణునితో ఇలా అన్నాడు. "ఇదిగో, కర్ణుడు సాత్యకి రథం మీదకు వెళ్తున్నాడు. రణరంగంలో భూరిశ్రవుని మరణాన్ని సహించలేకపోతున్నాడు. అనుమానం లేదు. జనార్దనా! కర్ణుడు వెళ్తున్న వైపుకే గుర్రాలను నడిపించు. ఈ కర్ణుడు భూరిశ్రవుని దారిలో సాత్యకిని పంపటానికి వీలుండకూడదు." అర్జునుడు అలా అనగానే మహాబాహువు, మహాతేజస్వి అయిన కృష్ణుడు సమయోచితంగా ఇలా బదులిచ్చాడు. "అర్జునా! మహాబాహువైన సాత్యకి ఒక్కడే కర్ణుని ఎదిరించటానికి చాలు. ఇక ద్రౌపదికొడుకు లిద్దరు తోడుంటే చెప్పవలసిన దేముంది? అర్జునా! ఇప్పుడు నీవు, కర్ణుడు యుద్ధం చేయటం మంచిది కాదు. పెనుతోకచుక్కవలె జ్వలించే ఇంద్రశక్తి అతని దగ్గర ఉన్నది. అర్జునా! నీకోసం కర్ణుడు దానిని పూజిస్తూ, దాచి ఉంచాడు. కాబట్టి సాత్యకినే కర్ణునితో పోరాడటానికి వెళ్ళనీ! అర్జునా! ఈ దుర్మార్గుని చంపవలసిన సమయం నాకు తెలుసు. అప్పుడు తీక్ష్ణమైన బాణాలతో ఈ కర్ణుని నేలగూల్చుదువుగాని !"

ధృతరాష్ట్ర డిలా అడిగాడు. "భూరిశ్రవుడు చనిపోగా, సైంధవుడు నేలగూలగా ఇక కర్ణునితో వీరసాత్యకి జరుపుతున్న పోరాటం ఎలా ఉంది? సంజయా! సాత్యకి కూడా రథాన్ని కోల్పోయాడు గదా! మరి ఏ రథాన్ని ఎక్కాడు ? చక్రరక్షకులైన పాంచాలురు (యుధామన్యు ఉత్తమౌజులు) ఎవరితో పోరాడారు ? నాకు వివరంగా చెప్పు." సంజయు డిలా చెప్తున్నాడు. "మహాసంగ్రామంలో జరుగుతున్నది యథాతథంగా చెప్తాను. నీవు స్థిరంగా ఉండి, నీ దుశ్చర్యల పరిణామాన్ని విను. ప్రభూ! వీరుడైన సాత్యకి భూరిశ్రవునిచే పరాజితుడు కావాలన్నది ముందుగానే కృష్ణుడు సంకల్పించిన విషయం. జనార్దనునకు జరిగినదీ, జరగబోయేదీ కూడా తెలుసు. అందుకనే తన సారథి అయిన దారుకుని పిలిచి, రేపు ఉదయం రథాన్ని పూన్చి, సిద్ధం చేయుమని ఆదేశించాడు. శ్రీకృష్ణుడు బలసంపన్నుడు. దేవతలు కానీ, గంధర్వులు కానీ, యక్షులు గానీ, నాగులు గానీ, రాక్షసులు గానీ, మానవులు గానీ కృష్ణార్జునులను గెలవగల వారెవ్వరూ లేరు. బ్రహ్మ మొదలయిన దేవతలు, సిద్ధులు ఆ కృష్ణుని తెలిసినవారు. కర్ణార్జునుల ప్రభావం సాటిలేనిది.

ఇక యుద్ధ విషయాలు విను.

విరధుడైన సాత్యకిని, యుద్ధానికి ఉద్యమిస్తున్న కర్ణుని చూసి, కృష్ణుడు మహానాదం గల శంఖాన్ని ఋషభస్వరంతో పూరించాడు. దారుకుడు శంఖధ్వనిని విని, శ్రీకృష్ణుని సందేశాన్ని గ్రహించి, సాత్యకి కోసం రథాన్ని తెచ్చాడు. దానిపై గరుడచిహ్నాంగల ఉన్నతధ్వజం ఎగురుతోంది. కృష్ణుని అనుమతితో, ఆ సాత్యకి దారుకుడు తెచ్చిన రథాన్ని ఎక్కాడు. అది అగ్నివలె సూర్యునివలె భాసిస్తోంది. ఆ రథానికి శైబ్య, సుగ్రీవ, మేఘపుష్ప, వలాహకాలనే గుర్రాలు పూన్చబడి ఉన్నాయి. ఆ గుర్రాలు కామగమనం, మహావేగం కలవి. స్వర్ణాలంకారాలతో అలంకరింపబడినవి. విమానంవలె భాసిస్తున్న ఆ రథాన్ని ఎక్కి, సాత్యకి అనేక బాణాలను కురిపిస్తూ కర్ణునిపై దాడిచేశాడు. అప్పుడు చక్రరక్షకులైన యుధామన్యు - ఉత్తమౌజులు కూడా అర్జునుని రథాన్ని వీడి, కర్ణుని మీదకు వెళ్ళారు. మహారాజా! కర్ణుడు కూడా తీవ్రకోపంతో రణభూమిలో శరవర్షాన్ని కురిపిస్తూ, అచ్యుతుడైన సాత్యకిపై దాడిచేశాడు. ఈ లోకంలో కానీ, స్వర్గలోకంలో కానీ, దేవతల మధ్య కానీ, గంధర్వుల మధ్య కానీ, అసురులమధ్య కానీ, రాక్షసుల మధ్య కానీ ఇటువంటి యుద్ధం జరిగినట్టు వినలేదు. మహారాజా! వారిద్దరి యుద్ధాన్ని చూసి, సైన్యం చిత్త భ్రమకు గురి అయింది. ఆ నరశ్రేష్ఠుల అమానుషయుద్ధాన్ని, దారుకుని సారథ్యాన్ని అందరూ ఒక్కటై చూస్తున్నారు. రథ గజ తురగ పదాతులతో కూడిన ఆసేన యుద్ధాన్ని మానివేసింది. కశ్యపగోత్రీయుడైన దారుకుడు సారథిగా రథంపై కూర్చొని గమనం, ప్రత్యాగమనం, ఆవర్తనం, మండలం, సన్నివర్తనం మొదలయిన రథగమన రీతులతో రథాన్ని నడుపుతుంటే గగనతలంపై నున్న దేవతలు, గంధర్వులు, దానవులు విస్మయానికి లోనయ్యారు. కర్ణసాత్యకుల యుద్ధాన్ని చూడటానికి సావధాను లయ్యారు. బలిష్ఠులైన కర్ణసాత్యకులు ఇద్దరూ తమ మిత్రులకోసం పరస్పర స్పర్ధతో పోరాడసాగారు. కర్ణుడు, యుయుధానుడు ఒకరిపై నొకరు బాణవృష్టిని కురిపించారు. జలసంధ భూరిశ్రవుల మరణాన్ని సహింపలేని కర్ణుడు శినిమనుమడైన సాత్యకిని శరవృష్టితో మధించాడు. కర్ణుడు శోకానికి లోనయి, బుసకొట్టే పాములవలె నిట్టూరుస్తూ, రణభూమిలో కోపంతో సాత్యకిని దగ్ధం చేయాలన్నట్లుగా చూస్తూ, పదేపదే వేగంగా సాత్యకిపై దాడిచేశాడు. కోపంతో ఉన్న కర్ణుని చూసి, సాత్యకి మహాశరవృష్టిని కురిపిస్తూ ఏనుగును ఏనుగు ఢీకొన్నట్లుగా ఎదురుదాడి చేశాడు. ఆ నరశ్రేష్ఠులిరువురూ కలబడి, రణభూమిలో అసాధారణ పరాక్రమాన్ని ప్రదర్శిస్తూ, ఒకరినొకరు క్షతగాత్రులను చేశారు. సాత్యకి పూర్తిగా లోహంతో చేసిన బాణాలతో కర్ణుని సర్వావయవాలను మాటిమాటికి గాయపరిచాడు. అతని సారథిని భల్లంతో రథాసనం నుండి పడగొట్టాడు. కర్ణుని నాలుగు గుర్రాలను కూడా పదునైన బాణాలతో చంపివేశాడు. ధ్వజాన్ని, రథాన్ని కూడా నూరు

ముక్కలుగా ఖండించి, నీ కొడుకు చూస్తుండగానే కర్ణుని రథహీనుని చేశాడు. రాజా! దానితో విమనస్కులై నీ సేనలోని మహారథులైన వృషసేనుడు – కర్ణుని కొడుకు, మద్రాధిపతి శల్యుడు, అశ్వత్థామ సాత్యకిని చుట్టుముట్టారు. ఆ రీతిగా వీరుడైన కర్ణుడు రథహీనుడు కాగా అంతా అల్లకల్లోలమయింది. ఎవ్వరికీ ఏమీ తెలియలేదు. రాజా! అప్పుడు సర్వసేనలలోనూ తీవ్రంగా హాహాకారం చెలరేగింది. సాత్యకి బాణాలతో కర్ణుని విరథుని చేయగా, వెంటనే నిట్టూరుస్తూ దుర్యోధనుని రథాన్ని ఎక్కాడు కర్ణుడు. చిన్న నాటి నుండి నీ కుమారుని సౌహార్దాన్ని గౌరవిస్తూ, దుర్యోధనునకు రాజ్యమందించాలన్న ప్రతిజ్ఞను నెరవేర్చటంలో లగ్నమై ఉన్నాడు కర్ణుడు. పార్థివా! అలా విరథుడైన కర్ణుని, వీరులైన నీ కుమారులు దుశ్శాసనాదులను కానీ సాత్యకి చంపలేదు. భీమార్జునులు ముందుచేసిన ప్రతిజ్ఞలను రక్షిస్తూ తనను తాను నియంత్రించుకొన్నాడు. సాత్యకి నీ వారిని రథహీనులను చేసి కలతపెట్టాడే కానీ చంపలేదు. భీమసేనుడు నీ కుమారులను చంపుతానని ప్రతిన పూని ఉన్నాడు. అనుద్యూతంలో అర్జునుడు కర్ణుని చంపుతానని ప్రతిజ్ఞ చేశాడు. కర్ణుడు మొదలుగాగల శ్రేష్ఠమహారథులు సాత్యకిని చంపటానికి ప్రయత్నించారు కానీ చంపలేకపోయారు. అశ్వత్థామ, కృతవర్మ అలాగే ఇతర మహారథులు, వందలకొలది క్షత్రియ శ్రేష్ఠులు – వీరినంతా ఒక్క వింటితోనే సాత్యకి ఓడించాడు. ధర్మరాజునకు ప్రియాన్ని చేకూర్చి, పరలోకాన్ని పొందాలని కోరుకొంటున్నాడు సాత్యకి. పరాక్రమంలో కృష్ణార్జునులతో సమానమైనవాడు సాత్యకి. శత్రుతాపనుడైన ఆ సాత్యకి నీ సేనల నన్నింటినీ నవ్వుతూ, తేలికగా గెలిచాడు. నరశ్రేష్ఠా! ఈ లోకంలో కృష్ణుడు, అర్జునుడు, సాత్యకి – ఈ ముగ్గురే మేటివిలుకాండ్రు, నాలుగవవాడు లేడు."

ధృతరాష్ట్ర డిలా అడిగాడు. "సాత్యకి రణభూమిలో వాసుదేవు డంతటివాడు. జయింపవీలుకాని వాసుదేవరథాన్ని అధిరోహించి, కర్ణుని రథహీనుని చేయగలిగాడు. పైగా బాహుబలగర్వంగల అతనికి దారుకుడు తోడయ్యాడు. శత్రుతాపనుడైన ఆ సాత్యకి మరేదైనా రథాన్ని కూడా ఎక్కాడా? సంజయా! దీనిని వినాలనుకొంటున్నాను. నీవు నేర్పుగా మాటాడగలవాడవు. సాత్యకిని సహించటం ఎవరికీ వీలుకాదనుకొంటున్నాను. వివరంగా నాకు చెప్పు." సంజయుడు చెప్తున్నాడు. "రాజా! జరిగింది జరిగినట్లు చెపుతా విను. దారుకుని తమ్ముడు బుద్ధిమంతుడు. అతడు పద్దతిమేరకు మరొక రథాన్ని సిద్ధంచేసి, తీసికొని వచ్చాడు. దాని నొగలు లోహ, స్వర్ణఫలకాలతో సిద్ధం చేయబడినది. దానిపై వేడి తారలు తాపటం చేయబడ్డాయి. సింహధ్వజపతాకలు దానికున్నాయి. దానికి పూన్చిన గుర్రాలు సింధు జాతివి. గాలితో సమానంగా పరుగెత్తగల ఆ గుర్రాలు బంగారు అలంకరణలతో దృఢంగా ఉన్నాయి. చంద్రునిలా ప్రకాశిస్తున్న అవి శబ్దాన్ని దాటి పోగలవి.

రాజా! ఆ గుర్రాలు బంగారు కవచాలతో సిద్ధం చేయబడినవి. అవి మేలు జాతి గుర్రాలు. అవి పూన్చిన ఆ రథంపై మువ్వల సవ్వడులు, శక్తితోమరాల కాంతులు చెలగుతున్నాయి. మేఘగంభీర ధ్వనులు గల ఆ రథంపై యుద్ధ ద్రవ్యాల నన్నింటినీ, శస్త్రాస్త్ర సమూదాయాన్ని సిద్ధంచేసి దారుకుని తమ్ముడు తీసికొని వచ్చాడు. ఆ రథాన్ని ఎక్కి, సాత్యకి నీ సేనపై దాడి చేశాడు. దారుకుడు స్వేచ్ఛగా కృష్ణుని దగ్గరకు వెళ్ళిపోయాడు. రాజా! కర్ణుని రథం కూడా మరీవేగంగల మేలు జాతి గుర్రాలు పూన్చినదే. ఆ గుర్రాలు శంఖంవలె, ఆవుపాలవలె తెల్లగా ఉన్నాయి. చిత్రమైన స్వర్ణకవచాలు గలవి. బంగారు గొలుసులతో కట్టబడిన ధ్వజం, యంత్రాలు, పతాకలతో అది శోభిస్తోంది. అనేక శస్త్రాస్త్రాలు సమకూర్చబడినది. మేటి సారథి గలది. ఆ రథాన్ని కర్ణునికోసం తీసికొని వచ్చారు. దాని నెక్కి కర్ణుడు శత్రువులపై దాడిచేశాడు. నీవు నన్ను అడిగిన విషయమంతా వివరంగా చెప్పాను. నీ అవినీతివలన కలిగిన వినాశనాన్ని గురించి ఇంకా చెపుతా విను. ఎప్పుడూ చిత్రంగా యుద్ధం చేయగల దుర్ముఖునితో సహా నీ కొడుకులు ముప్పయి ఒక్క మందిని భీముడు చంపివేశాడు. భారతా! సాత్యకి, అర్జునుడు కలిసి భీష్ముడు, భగదత్తుడు మొదలయిన వందల వీరులను పడగొట్టారు. రాజా! ఈ వినాశమంతా నీ అవినీతివలన కలిగినదే."

148. అర్జునుని శ్రీకృష్ణుడు యుధిష్ఠిరుని దగ్గరకు కొనిపోవుట.

ధృతరాష్ట్రుడిలా అడిగాడు. "సంజయా! నా సేనలోని శూరులు, పాండవసేనలోని శూరులు ఆ విధంగా యుద్ధసన్నద్ధులైన తరువాత భీముడేమి చేశాడు? నాకు వివరంగా చెప్పు." సంజయుడిలా చెప్తున్నాడు. "విరథుడైన భీమసేనుడు కర్ణుని వాగ్బాణాల పీడతో కోపానికి గురియై, అర్జునునితో ఇలా అన్నాడు. "అర్జునా! నీవు వింటుండగానే కర్ణుడు మాటిమాటికి నన్ను "షండుడా! మూర్ఖుడా? తిండిపోతా! అస్త్రవిద్య నెరుగనివాడా! బాలుడా! సంగ్రామభీరువూ! యుద్ధం చేయవద్దు" అన్నాడు. అలా అన్నవాడిని తప్పనిసరిగా నేను చంపాలి. అంత ఘోరంగా మాటాడాడు. కానీ కర్ణుని చంపాలన్న ప్రతిజ్ఞ నీతో పాటు నేను చేశాను. కర్ణుని చంపటం నాపని మాత్రమే కాదు. నీ పని కూడా. అనుమానం లేదు. కర్ణుని చంపేటప్పుడు ఈ నా మాటలను కూడా మనస్సులో పెట్టుకో. నా ప్రతిజ్ఞ నెరవేరేటట్లు ప్రయత్నించు." భీముని ఆ మాట విని అర్జునుడు రణభూమిలో కర్ణునకు మరింత దగ్గరయి ఇలా అన్నాడు. "కర్ణా! కర్ణా! మిథ్యాదర్శనా! సూతపుత్రా ! ఆత్మశ్లాఘీ! అధర్మబుద్ధీ! ఇప్పుడు నేను చెపుతున్న మాటలు విను. యుద్ధంలో శూరులకు రెండే కర్మఫలాలు. గెలుపు లేదా ఓటమి. రాధేయా! యుద్ధానికి దిగిన తర్వాత ఇంద్రునికైనా ఇవి అనిశ్చితాలే.

సిగ్గులేనివాడా! మాటిమాటికి యుద్ధాన్ని వీడి పారిపోతావు. నీవు పారిపోతున్నా భీముడు పరుషంగా మాటాడలేదు. భీముని ఈ మాహాత్మ్యాన్ని, ఉన్నత వంశంలో జన్మించినందువలన కలిగిన స్వభావాన్ని గమనించు. సూతపుత్రా! నీవు కూడా ఎన్నోసార్లు యుద్ధం చేసి వీరుడైన భీముని యాదృచ్ఛికంగా ఒక్కసారి విరథుని చేయగలిగావు. రాధేయా! భీముని నిందించి, నీవు నీ కులానికి తగినట్లు ప్రవర్తించావు. నరోత్తమా! ఇప్పుడు నీవు పడబోతున్న అవస్థను గ్రహించలేకున్నావు. నక్క ఆటవిక జంతువులను హేళన చేసినట్లు నీవు క్షత్రియులను అవమానిస్తున్నావు. యుద్ధం భీమసేనునకు ఆనువంశికమైన కర్మ. నీ పని నీ కులానికి తగినట్లు రథాన్ని తోలటమే. రాధేయా! రణరంగంలో శస్త్రధారులందరి మధ్య నేను నీకు చెప్తున్నాను. నీ పని నీవు ఏ రీతిగా అయినా చేసికో. కానీ యుద్ధంలో ఇంద్రునకైనా కేవలం విజయమో, కేవలం పరాజయమో కలుగదు.

సాత్యకి నిన్ను విరథుని చేశాడు. దాదాపు చావు దగ్గరకు నడిపించాడు. నీ ఇంద్రియాలన్నీ కలతకు గురి అయ్యాయి. అయినా నిన్ను నేనే చంపాలని తెలిసి, సాత్యకి నిన్ను ఓడించి కూడా ప్రాణాలతో విడిచారు. మహాబలుడైన భీమునితో యుద్ధం చేస్తూ, యాదృచ్ఛికంగా ఏదోరీతిగా నీవు భీముని విరథుని చేసి, చాలా పరుషంగా మాటాడావు. ఇది చాలా అధర్మం. ఉత్తములు చేయదగిన పని కూడా కాదు. నరశ్రేష్ఠులయిన శూరులు శత్రువును ఓడించినా ఆత్మస్తుతి చేసికోరు. దుర్భాషలాడరు. ఎవ్వరినీ నిందించరు. అటువంటివారే సజ్జనులు. సూతనందనా! నీ బుద్ధి నీచమైనది. అందువలననే నీవు చపలత్వానికి గురి అయి, అనాలోచితంగా, అసంబద్ధంగా, వినరాని రీతిగా మాటాడుతున్నావు. పరాక్రమశాలి, శూరుడు అయిన భీముడు మర్యాదలను పాటించటంలో ఆసక్తుడై యుద్ధం చేస్తుంటే నీవు అప్రియంగా మాటాడావు. అది సత్యమార్గం కాదు. నేను, శ్రీకృష్ణుడు, సమస్త సేనలు చూస్తుండగా భీముడు యుద్ధంలో చాలాసార్లు నిన్ను రథహీనునిగా జేశాడు. కానీ పాండుసుతుడు అయిన భీముడు నిన్ను ఏమీ అనలేదు. అయితే నీవు పరుషంగా భీముని నిందించి నందుకు, నేను లేనిసమయంలో నా కుమారుని – అభిమన్యుని – మీరు అన్యాయంగా చంపినందులకు తగిన ఫలితాన్ని వెంటనే అనుభవిస్తావు. దుర్మతీ! నీవు నీ వినాశం కోసమే అభిమన్యుని ధనుస్సును ఖండించావు. మూర్ఖుడా! అందువలన భృత్యులు, సుతులు, బంధువులతో సహా నీవూ దండింపదగినవాడవు. నీవు చాలా భయపడుతున్నావు. చేయవలసినవన్నీ పూర్తిచేయి. నీవు చూస్తుండగానే యుద్ధంలో వృషసేనుని చంపబోతున్నాను. సత్యప్రమాణంగా ఆయుధాన్ని పట్టి, చెప్తున్నాను. బుద్ధిమోహంతో నన్ను సమీపించిన రాజుల నందరినీ కూడా చంపివేస్తాను. మూఢుడా ! అపవిత్రబుద్ధివైన నిన్ను ఎక్కువగా భావించుకొంటున్నావు. అటువంటి నిన్ను యుద్ధంలో చంపివేయటం చూసి మందమతి అయిన దుర్యోధనుడు తీవ్రంగా బాధపడవలసి ఉంటుంది.”.

అప్పుడు అర్జునుడు కర్ణుని కొడుకును చంపుతానని ప్రతిజ్ఞ చేయగానే రథికులలో తీవ్రమైన కలకలం చెలరేగింది. మహాభయంకరమైన ఆ ఘోరయుద్ధం జరుగుతున్న సమయంలోనే సూర్యుడు కాంతితగ్గి అస్తాద్రివైపు వెళ్ళిపోయాడు. రాజా! ఆ తరువాత కృష్ణుడు, ప్రతిజ్ఞను పూర్తి చేసికొని రణభూమిలో అగ్రభాగాన నిలిచిన అర్జునుని కౌగిలించుకొని, ఇలా అన్నాడు. "జయశీలా! అదృష్టం కొద్దీ మహాప్రతిజ్ఞను నెరవేర్చుకొన్నావు. పాపాత్ముడైన వృద్ధక్షత్రుని కొడుకుతో సహా చంపావు. భారతా! జయశీలా! ధార్తరాష్ట్రుని సేనాబలంతో చేరితే దేవతాసేన అయినా యుద్ధంలో శిథిలమవుతుంది. ఇక దీనిని గురించి ఆలోచించనవసరం లేదు. పురుషశ్రేష్ఠా! మూడు లోకాలలోనూ దుర్యోధన సేనతో యుద్ధం చేయగల పురుషుడు నీవు తప్ప మరొకరు ఆలోచించినా కనిపించడు. నీతో సమానులు, నీ కన్న అధికులు మహానుభావులైన రాజులు ఎందరో దుర్యోధనుని కారణంగా సమకూడారు. వారంతా కవచాలు ధరించి, కోపంతో నిన్ను ఎదిరించటానికి వచ్చారు కానీ నిలవలేకపోయారు. నీ పరాక్రమం, నీ శక్తి, రుద్రునితో, ఇంద్రునితో, యమునితో సమానమైనవి. శత్రుతాపనుడవై నీవు ఒంటరిగా నేడు ప్రదర్శించిన పరాక్రమాన్ని మరెవ్వరూ కూడా రణరంగంలో ప్రదర్శించలేరు. ఈ రీతిగా దురాత్ముడైన కర్ణుని కూడా బంధుమిత్రులతో పాటు నీవు చంపితే నీవు శత్రువిజేతవు, శత్రుహంతవు కాగలవు. అప్పుడు నిన్ను ఇంకా వర్ధిల్లజేస్తాను." అప్పుడు అర్జునుడు కృష్ణునితో ఇలా అన్నాడు - "మాధవా! నీ అనుగ్రహం వలననే దేవతలకు కూడా దాటరాని ఈ ప్రతిజ్ఞను నేను దాటగలిగాను. కేశవా! నీ రక్షణలో నున్నవారు గెలవటం ఆశ్చర్యకరం కాదు. నీ అనుగ్రహంతో యుధిష్ఠిరుడు సమస్త భూమండలాన్ని పొందగలడు. వార్ష్ణేయా! ఈ ప్రభావం నీదే. ఈ విజయం నీదే. మధుసూదనా! నీవు మమ్ము ఎప్పుడూ వృద్ధిపొందించాలి." అర్జునుడు అలా అనగానే కృష్ణుడు గుర్రాలను మెల్లగా నడుపుతూ, ఆ ఘోరసంగ్రామ దృశ్యాలను అర్జునునకు చూపాడు.

శ్రీ కృష్ణుడిలా అన్నాడు. "శూరులైన రాజులు యుద్ధంలో విజయాన్ని సర్వతోవ్యాప్తమైన మహాయశస్సును కోరుతూ నీ బాణాలచే మరణించి నేలబడిఉన్నారు. శస్త్రాలూ, ఆభరణాలూ చెదరి, గుర్రాలు, ఏనుగులు మరణించి, రథాలు విరిగి, మర్మస్థానాలు శిథిలాలు కాగా ఈ రాజులు మహావ్యాకులత్వాన్ని పొందారు. కొందరు మరణించారు. కొందరు కొన ఊపిరితో ఉన్నారు. మరణించినవారు కూడా పరమతేజస్సు కారణంగా సజీవులనే అనిపిస్తున్నారు. సువర్ణపక్షాలు గల ఆ రాజుల బాణాలతో, పదునైన వివిధ శస్త్రాలతో, వాహనాలతో, ఆయుధాలతో భూమి నిండిపోయింది. చూడు. పృథివీపతులు పృథివికోసం ప్రాణాలు పోగొట్టుకొని పృథివిపై బడి, భర్తను కౌగిలించుకొన్న భార్యలవలె పృథివిని కౌగిలించుకొని నిదురిస్తున్నారు. వీరుడా! పర్వతాల శిఖరాలవలె కనిపిస్తున్న

ఐరావతాలవంటి ఈ ఏనుగులను చూడు. శస్త్రాలవలన ఏర్పడిన గాయాలనుండి నెత్తురు విపరీతంగా స్రవించి, కొండలు తమ గుహలనుండి గైరికాదిధాతుజలాన్ని ప్రవహింపజేస్తున్నట్లు కనిపిస్తున్నాయి. బాణాల దెబ్బతిని నేలబడి ఉన్నాయి. ఇదిగో! సువర్ణాలంకారాలతో నేలబడియున్న గుర్రాలను చూడు. రథికులు, రథ సారథులు చనిపోగా, ధ్వజపతాకాలు, ఇరుసులు, చక్రాలు విరిగిపోగా గంధర్వనగరాలవలె కనిపిస్తున్నాయి. చూడు. నొగలు, కాడి విరిగిపోయి, ఏడి కోలలు ముక్కలై పడియున్న రథాలను, అర్జునా! విమానాలవలె కన్పిస్తూ నేలగూలియున్న గుర్రాలను చూడు. వందలు, వేలకొలదిగ సైనికులు విండ్లు, డాళ్ళు చేతబట్టి, నెత్తురోడుతూ, మరణించి నేలపై పడుకొనియున్నారు చూడు. నీ బాణాలవలన శరీరాలు బ్రద్దలు కాగా, దుమ్ముకొట్టుకొన్న వెండ్రుకలతో, సర్వావయవాలతోనూ నేలను కౌగిలించికొనిఉన్న యోధులను చూడు. నరోత్తమా! నేలను చూడు. చూడరానట్లుంది. చచ్చిన ఏనుగులు, గుర్రాలు, విరిగిన రథాలు ఒత్తుగా పడిఉన్నాయి. నెత్తురు, క్రొవ్వు, మాంసం కలిసి బురద బురదగా ఉన్నాయి. రాక్షసులు, కుక్కలు, తోడేళ్ళు, పిశాచాలు – వీటికి ఆనంద జనకంగా ఉంది రణభూమి. రణ భూమిలో యశోవర్ధకమైన ఇంతపని చేసే శక్తి నీలోనూ, మహాసంగ్రామంలో దైత్యదానవులను సంహరించే శక్తి దేవరాజైన ఇంద్రునిలోను మాత్రమే ఉంది." కృష్ణుడు ఈ రీతిగా అర్జునునకు రణభూమిని చూపిస్తూ, ఆనందమగ్నులైన తన వారిని కూడి, పాంచజన్యాన్ని పూరించాడు. ఆ జనార్దనుడు అర్జునునకు రణభూమిని అలా చూపిస్తూనే వేగంగా అజాతశత్రువైన యుధిష్ఠిరుని సమీపించి, జయద్రథుడు చనిపోయాడని తెలియజేశాడు."

149. యుధిష్ఠిర హర్షము.

సంజయుడిలా చెప్తున్నాడు. "అర్జునుడు సైంధవుని చంపిన తర్వాత శ్రీకృష్ణుడు యుధిష్ఠిర నరపాలుని దగ్గరకు వచ్చి సంతుష్ట హృదయుడై నమస్కరించాడు. రాజేంద్రా! అదృష్టంకొలదీ వర్ధిల్లుతున్నావు. శత్రువు నశించాడు. అదృష్టం కొద్దీ నీ తమ్ముడు ప్రతిజ్ఞను పూర్తిచేసికొన్నాడు." శ్రీకృష్ణుడిలా అనగానే యుధిష్ఠిర నరపాలుడు ఆనందించి, రథం నుండి దిగి, ఆనందబాష్పాలు కళ్ళలో నింపుకొని, కృష్ణార్జునులను కౌగిలించుకొన్నాడు. పద్మంవలె ప్రకాశిస్తున్న ముఖాన్ని చేతితో తుడుచుకొని కృష్ణార్జునులతో ఇలా అన్నాడు. "పుండరీకాక్షా! నీ ద్వారా ఈ ప్రియ వార్తను విని, సముద్రాన్ని దాటగోరినవాడు ఒడ్డుకు చేరినట్లు అంతులేని ఆనందాన్ని పొందుతున్నాను. కృష్ణా! బుద్ధిమంతుడైన అర్జునుడు అద్భుతకార్యాన్ని చేశాడు. అదృష్టం కొలది యుద్ధంలో బరువుదించుకొన్న మహారథులను

మిమ్ము చూడగలుగుతున్నాను. సైంధవుడు మరణించటం మన అదృష్టమే. కృష్ణా! అదృష్టం కొలదీ ఈ మహానందాన్ని నీవు అందజేశావు. నీ రక్షణలో అర్జునుడు సైంధవుని చంపగలిగాడు. నీ రక్షణలో నున్న మాకు విజయసిద్ధి అత్యద్భుత విషయమేమీ కాదు. సర్వలోకాలకు గురువయిన నీ రక్షణలో నున్నవారికి చేయలేనిదంటూ ఏదీ ఉండదు. గోవిందా! నీ అనుగ్రహం ద్వారానే మేము శత్రువులను గెలవగలుగుతున్నాము. ఉపేంద్రా! నీవు ఎప్పుడూ సర్వవిధాల మాకు ప్రియాన్ని, హితాన్ని కల్గించటంలో లగ్నమై ఉంటావు. మేము నిన్ను ఆశ్రయించి, యుద్ధంలో ఆయుధాలు పట్టాము. జనార్దనా! దేవతలకు కూడా ఊహించరాని ఈ అద్భుతకార్యాన్ని, నీ బుద్ధి బలపరాక్రమాలతో ఈ అర్జునుడు సాధించగలిగాడు. కృష్ణా! బాల్యదశలోనే నీవు చేసిన ఘన కార్యాలనెన్నింటినో వినిఉన్నాను.

అవి అమానుష దివ్య కార్యాలు. వాటిని విన్నప్పుడే నా శత్రువులను చంపి, నేను రాజ్యాన్ని పొందగలిగినట్లు గ్రహించాను. నీ అనుగ్రహంతో కలిగిన పరాక్రమంతోనే ఇంద్రుడు వేలకొలది రాక్షసులను చంపి, దేవేంద్రుడు కాగలిగాడు. నీ అనుగ్రహం వలననే స్థావర జంగమాత్మకమైన ఈ విశ్వం తన హద్దులలో నిలిచి, జపహోమాదులలో ప్రవర్తిస్తోంది. తొలుత విశ్వమంతా ఒకే సముద్రంగా తమోమయంగా ఉండేది. నీ అనుగ్రహం వలననే ఈ సృష్టి జరిగింది. సర్వలోకసృష్టి కర్తగా, వినాశంలేని పరమాత్మ స్వరూపంగా, హృషీకేశునిగా నిన్ను చూడగలవారు ఎన్నడూ మోహానికి గురికారు. నీవు పురాణుడవు. పరమదైవానివి. దేవదేవుడవు. సనాతనుడవు. సురగురువువు. నిన్ను ఆశ్రయించినవారు ఎప్పుడూ మోహానికి గురికారు. హృషీకేశా! నీవు ఆద్యంత రహితుడవు. లోకకర్తవు. నాశరహితుడవు. దివ్యుడవు. నీ భక్తులు కష్టాలను అతిక్రమించగలరు. నీవు అత్యంత ప్రాచీన పురుషుడవు. పరాత్పరుడవు. పరమేశుడవు. నిన్ను శరణుకోరినవారు పరమైశ్వర్యాన్ని పొందగలరు. నాలుగు వేదాలు నీగురించి గానం చేస్తున్నాయి. వేదాలలో కీర్తింపబడిన మహాత్ముడవు నీవు. అటువంటి నిన్ను ఆశ్రయించి నేను అద్వితీయమైన ఐశ్వర్యాన్ని అనుభవిస్తున్నాను. పరమేశా! పరమేశ్వరేశా! తిర్యగీశా! నరేశ్వరా! సర్వేశ్వరా! ఈశ్వరేశా! ఈశా! పురుషోత్తమా! నీకు నమస్కారం. మాధవా! విశాలాక్షా! నీవు ఈశ్వరునికే ఈశ్వరుడవు. శాసకుడవు. ప్రభూ! నీవు వృద్ధినందు. సర్వాత్మా! సర్వసృష్టి విలయాలకు నీవే కారణం. నీవు అర్జునునకు మిత్రుడవు. అర్జునుని హితాన్ని కోరేవాడవు. అర్జునుని రక్షించేవాడవు. నిన్ను ఆశ్రయిస్తే సుఖం వర్ధిల్లుతుంది.

అనఘా! ప్రాచీన మహర్షి అయిన మార్కండేయుడు నీ చరిత్ర నెరిగినవాడు. ఆ ముని నీ ప్రభావాన్ని, మాహాత్మ్యాన్ని గతంలో నాకు వివరించాడు. అసితుడు, దేవలుడు, మహాతపస్వి అయిన నారదుడు, నా తాత వ్యాసుడు నిన్ను ఉత్తమవిధిగా కీర్తించారు.

నీవే తేజస్సువు. నీవే పరబ్రహ్మవు. నీవే సత్యం. నీవే మహాతపస్సు. శ్రేయస్సు నీవే. ఉత్తమ కీర్తివి నీవే. జగత్కారణం నీవే. స్థావర జంగమాత్మకమైన ఈ సర్వజగత్తును నీవే సృష్టించావు. ప్రలయకాలంలో మరల సృష్టి నీలోనే లీనమవుతుంది. జగత్పతీ! వేదవేత్తలు నిన్నే ఆద్యంతరహితుడ వనీ, దివ్యరూపుడ వనీ, విశ్వేశుడ వనీ, బ్రహ్మ వనీ, అజుడ వనీ, భూతరూపుడ వనీ, మహాత్ముడ వనీ, అనంతుడ వనీ, విశ్వతో ముఖుడ వనీ కీర్తిస్తారు. నీ రహస్యాన్ని దేవతలు కూడా తెలియలేరు. ఆది కారణుడవూ, జగత్పతివీ, నారాయణుడవు, పరదేవుడవు, పరమాత్మవూ, ఈశ్వరుడవూ నీవే. జ్ఞాన కారణమైన హరివి, ముముక్షువులకు గతి అయిన విష్ణువువు నీవే. పరమ ప్రాచీన పురుషుడవు, పరాత్పరుడవు నీవే. ఇటువంటి నీ గుణాలనూ, భూతభవిష్యద్వర్తమానాలలోని నీ కర్మలను పరిగణించగలవారు స్వర్గంలో కానీ, భూలోకంలో కానీ ఎవరూ లేరు. ఇంద్రుడు దేవతలను రక్షించినట్లు మమ్ము అన్ని విధాలా నీవే ఆదుకోవాలి. సర్వగుణసంపన్నుడైన మిత్రుడవుగా నీవు మాకు లభించావు." ధర్మరాజు ఇలా అనగానే జనార్దనుడు దానికి తగినట్లు ఇలా బదులుపలికాడు. "నీ ఉగ్ర తపస్సువలన, ఉత్తమ ధర్మంవలన, మంచితనం వలన, నిజాయితీ వలన పాపాత్ముడైన జయద్రథుడు మరణించాడు. పురుషోత్తమా! నీ నిరంతరధ్యానం రక్షణగా ఉండి, అర్జునుడు వేలకొలది యోధులను చంపి, జయద్రథుని సంహరింపగలిగాడు. అస్త్ర విద్యలో, బాహుబలంలో, నిశ్చలత్వంలో, వేగంలో, అమోఘబుద్ధిలో అర్జునునితో సమానమైనవాడు ఎవ్వడూ లేడు. భరతశ్రేష్ఠా! అందువలననే నేడు నీ సోదరుడైన అర్జునుడు రణభూమిలో సైన్యాన్ని నశింపజేసి సైంధవుని తలను ఖండించాడు."

ఆ తరువాత ధర్మరాజు అర్జునుని కౌగిలించుకొని, ముఖాన్ని నిమిరి, ఊరటను కల్గిస్తూ ఇలా అన్నాడు. "అర్జునా! మహోన్నత కార్యాన్ని సాధించావు. దేవేంద్రుడుతోడున్న దేవతలకయినా దీనిని సహించటం, సాధించటం కష్టమే. శత్రుహంతా! అదృష్టంకొద్దీ భారాన్ని దించుకొన్నావు. శత్రువును చంపగలిగావు." అదృష్టం కొద్దీ సైంధవుని చంపి, ప్రతిజ్ఞను సత్యాన్ని చేయగలిగావు. అర్జునునితో అలా పలికి మహాయశస్వి అయిన ధర్మరాజు సుగంధయుక్తమైన చేతితో అర్జునుని వీపు తట్టాడు. ధర్మరాజు కృష్ణార్జునులతో అలా అనగానే అప్పుడు వారు యుధిష్ఠిర రాజుతో ఇలా అన్నారు. "పాపాత్ముడైన సింధురాజు నీ కోపాగ్నికి బలి అయ్యాడు. యుద్ధభూమిలో దుర్యోధనుని మహాసేనను గెలువగలగటం కూడా నీ చలవే. భారతా! శత్రుసూదనా! నీ కోపంతో దెబ్బతిన్న కౌరవులు చంపబడుతున్నారు, చంపబడ్డారు, చంపబడబోతున్నారు కూడా. కంటి చూపుతోనే చంపగల వీరుడవైన నిన్ను కోపింపజేసిన దురాత్ముడైన సుయోధనుడు బంధుమిత్రులతోపాటు యుద్ధంలో చావబోతున్నాడు. దేవతలు కూడా గెలువలేని భీష్ముడు నీ కోపం దెబ్బతిని, అంపశయ్యపై

పడుకొనిఉన్నాడు. రిపుసూదనా! యుధిష్ఠిరా! నీవు కోపించినవారికి యుద్ధంలో గెలుపు దక్కదు. వారు మృత్యువుకు లొంగిపోకతప్పదు. మానదా! నీవు కోపించినవాడు స్వల్ప కాలంలోనే రాజ్యాన్ని, ప్రాణాలను, సంపదలను, పుత్రులను, వివిధ సౌఖ్యాలను పోగొట్టుకొంటాడు. పరంతపా! నిత్యము రాజధర్మాన్ని పాటించే నీవు కోపించావు కాబట్టి పుత్ర పశు బంధువులతో పాటు కౌరవులు నశించినట్లే భావిస్తున్నాను."

ఆ తరువాత బాణాలతో తీవ్రంగా గాయపడిఉన్న భీముడు, సాత్యకి ధర్మరాజుకు నమస్కరించి నేలపై నిలిచారు. పాంచాలురచే చుట్టబడి, ఆనందంగా చేతులు జోడించి, ఎదుట నిలిచిన వీరులు, మేటి విలుకాండ్రు అయిన భీమసాత్యకులను చూసి, ధర్మరాజు అభినందించాడు. 'ద్రోణాచార్యుడు, కృతవర్మ అనే మొసళ్ళతో కూడి, భరింపరాని కౌరవ సేనాసముద్రంనుండి విముక్తులైన శూరులను అదృష్టం కొద్దీ చూడగలుగుతున్నాను. అదృష్టంవలననే యుద్ధంలో సర్వరాజులు ఓడిపోయారు. మీరిద్దరూ విజయం సాధించారు. మిమ్ములను చూడటం ఆదృష్టమే. అదృష్టం వలననే యుద్ధంలో ద్రోణుని, కృపుని జయించగలిగారు. అదృష్టంవలననే కర్ణుడు కూడా మీ బాణాలవలన పరాభవానికి గురిఅయ్యాడు. మీరే శల్యుని కూడా పారద్రోలగలిగారు. మీ ఇద్దరూ రణరంగం నుండి క్షేమంగా మరలి రాగలగటం నేను చూస్తున్నాను. ఇది అదృష్టఫలమే. నామీదున్న గౌరవానికి లోబడి, నా మాటను పాటించే వీరులు మీరిద్దరు సేనాసాగరాన్ని దాటివచ్చారు. అదృష్టఫలితంగానే మిమ్ము చూడగలుగుతున్నాను. యుద్ధంలో ప్రశంసల నందుకొనేవారు. పరాజయాన్ని ఎరుగని వీరులు. నా మాటను మన్నించే వారు. మిమ్ములను క్షేమంగా చూడటం అదృష్టమే." రాజా! ఆ రీతిగా పలికి ధర్మరాజు నరోత్తములైన యుయుధాన భీమసేనులను కౌగిలించుకొని, ఆనంద బాష్పాలను విడిచాడు. పాండవుల సైన్యమంతా ఆనందించింది. మరల యుద్ధం మీద మనస్సు పెట్టింది."

150. దుర్యోధనుడు బాధతో ద్రోణుని నిందించుట.

సంజయుడిలా చెప్తున్నాడు. "రాజా! సైంధవుడు మరణించగానే నీ కుమారుడు సుయోధనుడు దీనుడయ్యాడు. ముఖంపై కన్నీరు నిండింది. శత్రువులను గెలవాలన్న ఉత్సాహం తగ్గింది. కోరలు పెరికిన విషసర్పంవలె నిట్టూరుస్తూ, మనోవ్యాకులతకు లోనయ్యాడు. సర్వప్రజల విషయంలో అపరాధి అయిన నీ కొడుకు తీవ్రవ్యథను పొందాడు. అర్జునుడు, భీమసేనుడు, సాత్యకి రణభూమిలో తన మహాసైన్యంతో ఘోరంగా చేసిన యుద్ధాన్ని చూసి, దీనుడై, కాంతిని కోల్పోయాడు. దుర్బలుడై కంట తడిపెట్టాడు. మారిషా! అర్జునునితో సమానమైనవాడు లోకంలో లేడని భావించాడు. అర్జునుడు కుపితుడై యుద్ధం చేస్తుంటే

ద్రోణుడు కానీ, కర్ణుడు కానీ, అశ్వత్థామ కానీ, కృపుడు కానీ ఎదిరింపజాలరని గ్రహించాడు. "నా మహారథులనందరినీ యుద్ధంలో ఓడించి, అర్జునుడు సైంధవుని చంపాడు. ఒక్కడు కూడా వారించలేకపోయాడు. కౌరవుల ఈ మహాసేన అన్నివిధాలుగా ఇక నశించినట్లే, సాక్షాత్తు దేవేంద్రుడయినా దీనిని రక్షించలేడు. కర్ణుని ఆసరాతో నేను యుద్ధానికి ఆయుధాల నెత్తాను. కానీ ఆ కర్ణుడు యుద్ధంలో ఓడిపోయాడు. సైంధవుడు కూడా చనిపోయాడు. కర్ణుని పరాక్రమాన్ని ఆశ్రయించియే సంధికై ప్రార్థించిన కృష్ణుని గడ్డిపోచగా భావించాను. కానీ ఆ కర్ణుడే యుద్ధంలో ఓడిపోయాడు!" రాజా! ఆ రీతిగా వికల హృదయుడై సర్వప్రజల విషయంలోనూ అపరాధియైన నీ కొడుకు ద్రోణుని చూడటానికి వెళ్ళాడు. ఆపై కౌరవుల మహావినాశనానికి సంబంధించిన సమస్త సమాచారాన్నీ, శత్రువిజయాన్ని, ధార్తరాష్ట్రులు కష్టాలలో మునిగిపోవటాన్ని ద్రోణునితో చెప్పాడు.

దుర్యోధనుడిలా అన్నాడు. "ఆచార్యా! పట్టాభిషిక్తులయిన ఈ మహారాజుల మహాసంగ్రామాన్ని చూశావా? నా పితామహుడైన భీష్మునితో ప్రారంభించి ఎంతమంది శూరులు నిహతు లయ్యారో? లుబ్ధుడైన ఈ శిఖండి భీష్ముని పడగొట్టి, నిండు మనస్సుతో, సర్వపాంచాలురతో కూడి సేనకు ముందు నిలిచాడు. అర్జునుడు ఏడు అక్షౌహిణుల సేనను సంహరించి, నీకు మరో శిష్యుడు, దుర్ధర్షుడు అయిన సింధురాజును చంపివేశాడు. నా విజయాన్ని కోరుతూ, నాకు మేలు చేయాలని వచ్చిన మిత్రులు ఎందరో యమసదనానికి వెళ్ళిపోయారు. వారి ఋణం ఎలా తీర్చుకొనగలను ? నా కోసం ఈ భూమిని గెలవవచ్చిన రాజులు రాజ్యైశ్వర్యాన్ని వీడి, నేలపై పడియున్నారు. నేను చెడ్డవాడను. మిత్రులను ఇలా వినాశనానికి గురిచేశాను. వేయి అశ్వమేధయాగాలు చేసినా పవిత్రుడను కాలేను. నేను లుబ్ధుడను, పాపిని, ధర్మవినాశకుడను. అటువంటి నాకై యుద్ధంలో గెలవా లనుకొన్నవారు యమలోకానికి వెళ్ళిపోయారు. నడవడి చెడి, మిత్రద్రోహం చేసిన నాకోసం ఈ రాజుల సమక్షంలోనే భూమి బ్రద్దలై, నాకు దారియెందుకివ్వదో! యుద్ధంలో దెబ్బతిని, నెత్తురోడుతూ రాజుల మధ్య పడియున్న పితామహుని నేను కాపాడలేకపోయాను. పరలోకాన్ని జయించిన వాడు భీష్ముడు. ఇహ లోకంలో ఎవరూ ఎదిరింపలేనివాడు. ఈ విధంగా నీచుడను, మిత్రద్రోహిని, అధార్మికుడను అయిన నేను ఆయన దగ్గరకు వెళితే ఏమంటాడో? జలసంధుడు మేటివిలుకాడు, మహారథుడు, శూరుడు. నాకై ప్రాణవ్యామోహాన్ని వీడి ఉద్యమించినవాడు. కానీ సాత్యకి అతనిని కూడా చంపివేశాడు. చూడు. కాంబోజుడు, అలంబుషుడు, ఇంకా ఎంతోమంది మిత్రులు చనిపోయిన తరువాత ఇప్పుడు నేను బ్రతకట మెందుకు ? పరంతపా! యుద్ధంలో వెన్నుచూపని శూరులైన నా మిత్రులు

నాకై పోరాడుతూ, నా శత్రువులను గెలవాలని శక్తినంతా వినియోగించి, ప్రయత్నిస్తూ చనిపోయారు. నేను నేడు నా శక్తి కొలది వారి ఋణాన్ని తీర్చుకోవటానికి యమునానది దగ్గరకు వెళ్ళి, ఆ నీటితో తర్పణాలు చేస్తాను. సర్వశస్త్రధారులలో శ్రేష్ఠుడా! సత్యప్రమాణంగా, నేను సాధించిన యాగాది పుణ్యకర్మల మీద, పరాక్రమం మీద, పిల్లలమీద, ఒట్టువేసి చెపుతున్నాను. యుద్ధంలో సర్వ పాంచాలురను, పాండవులతో సహా చంపి శాంతిస్తాను. లేదా నా మిత్రులు వెళ్ళిన చోటికే నేనూ వెళ్తాను. నాకై రణభూమిలో పోరాడుతూ, అర్జునునిచే మరణించిన ఆ నరోత్తములు వెళ్ళిన తావునకే నేనూ చేరతాను.

మహాబాహూ! ఇప్పుడు నా సహాయకులు రక్షణలేనందువలన మనకు సహకరించడానికి ఇష్టపడరు. మన శ్రేయస్సుకన్న పాండవుల శ్రేయస్సునే వారు కోరుతుంటారు. సత్యసంధుడైన భీష్ముడు స్వయంగా మృత్యువును వరించాడు. యుద్ధంలో నిన్ను ఎదిరించాడు. కానీ అర్జునుడు నీ శిష్యుడు కాబట్టి నీవు ఉపేక్షించావు. నా విజయాన్ని కోరుకొన్న వారంతా చనిపోయారు. కాబట్టి ఇప్పుడు కర్ణుడొక్కడే నా గెలుపును కోరేవాడు అనుకొంటున్నాను. మిత్రుని వాస్తవస్థితిని గ్రహించకుండానే పనులలో నియోగించే మూర్ఖుని కార్యాలు శిథిలమవుతాయి. నా మిత్రులుగా భావింపబడేవారు కూడా, మోహంతో ధనాన్ని అభిలషిస్తూ, పాపదృష్టితో కుటిలంగా ప్రవర్తించిన నా పనిని అలాగే శిథిలం చేశారు. జయద్రథుడు, పరాక్రమశాలి అయిన భూరిశ్రవుడు, అభీషాహులు, శూరసేనులు, శిబులు, వసాతులు కూడా మరణించారు. నాకోసం రణభూమిలో అర్జునునితో పోరాడుతూ మరణించిన ఆ పురుషోత్తములు వెళ్ళిన చోటికే ఇప్పుడు నేను కూడా పోతాను. ఆ పురుషశ్రేష్ఠులు లేకుండా నేను బ్రతకటంలో అర్థం లేదు. పాండుకుమారుల గురువయిన తమరు నన్ను అనుమతించాలి."

151. ద్రోణుని సమాధానము.

ధృతరాష్ట్రుడిలా అడిగాడు. "నాయనా! యుద్ధంలో అర్జునుని చేతిలో సైంధవుడు, సాత్యకి చేతిలో భూరిశ్రవుడు చనిపోయిన తరువాత మీ మానసికస్థితి ఎలా ఉన్నది ? సంజయా! దుర్యోధనుడు కౌరవసభలో ద్రోణాచార్యునితో అలా పలికిన తరువాత ఆయన ఏమని సమాధానమిచ్చాడు? అది నాకు వివరంగా చెప్పు." సంజయుడిలా చెప్తున్నాడు. "భారతా! సైంధవుడు, భూరిశ్రవుడు మరణించటం చూసిన నీసేనలో తీవ్రంగా ఆర్తనాదం చెలరేగింది. నీ కుమారుని మాటలను వారెవ్వరూ ఒప్పుకొన లేదు. తన మంత్రాంగం

వలననే కదా వందలకొలది క్షత్రియశ్రేష్ఠులు మరణించింది. ద్రోణుడు నీ కొడుకు మాటలు విని, మనస్సులో కలతపడి, క్షణకాల మాలోచించి, తీవ్రవేదనతో ఇలా అన్నాడు.

'దుర్యోధనా! వాగ్బాణాలతో నన్నెందుకిలా భేదిస్తావు. అర్జునుని యుద్ధంలో గెలవటం అసాధ్యమని నేను ఎప్పుడూ చెపుతూనే ఉన్నాను గదా? కౌరవా! కిరీటి రక్షణలో శిఖండి రణరంగంలో భీష్ముని పడగొట్టగలిగాడు. అది చాలు అర్జునుడంటే ఏమిటో తెలిసికొనడానికి. దేవదానవులకు కూడా వధింపరాని భీష్ముడు యుద్ధంలో పడిపోయినప్పుడే ఇక కౌరవసేన మిగలదని నేను గ్రహించాను. మూడులోకాలలోని పురుషులలోనూ సర్వ శూరుడని భీష్ముని భావించాం. ఆయనే పడిపోతే ఇక ఎవరిని ఆశ్రయించగలం ! విదురుడప్పుడే చెప్పాడు - నాయనా! కౌరవసభలో శకుని పాచికలు వేస్తున్నాడు. అవి పాచికలు కాదు. శత్రువులను తపింపజేయగల పదునైన బాణాలు. విదురుడలా చెప్పినప్పుడు నీవు గ్రహించలేదు. నాయనా! ఆ పాచికలే అర్జునుని చేతి బాణాలై మనలను చంపుతున్నాయి. మహాత్ముడైన విదురుడు నీ మేలుకోరి చెప్పిన మంచి మాటలను విజయోల్లాసంతో నీవు వినలేదు. ఆ మాటలను తృణీకరించినందువలననే నీ కారణంగా ఇప్పుడు ఈ మహాదారుణ వినాశం సంభవించింది. **మేలుకోరే మిత్రుల హితవచనాలను అవహేళన చేసి, తన ఇచ్ఛవచ్చినట్లు ప్రవర్తించే మూఢుడు కొద్ది కాలంలోనే దయనీయ స్థితికి చేరుతాడు.** మేమంతా చూస్తుండగానే ఆ కౌరవసభకు ద్రౌపదిని పిలిపించి పరిహసించావు. ఆమె ఉత్తమ వంశ సంజాత, సర్వధర్మాలను అనుసరించెడిది. ఆ స్థితికి తగనిది గాంధారికొడుకా! ఆ అధర్మఫలితమే ఈ మహావినాశం. ఇదే జరగకపోతే పరలోకంలో నీవు ఇంతకన్న ఎక్కువగా పాపఫలాన్ని అనుభవించవలసి వచ్చేది. పాండవులను జూదంలో కపటంగా ఓడించి, జింకచర్మాలను ధరింపజేసి, అడవులకు పంపించావు అప్పుడు. (దాని ఫలితమే ఇది)

వారు నాకు పుత్రులవంటివారు. నిత్యమూ ధర్మాన్ని ఆచరించేవారు. అటువంటివారిని బ్రాహ్మణుడనిపించుకొంటూ కూడా ద్వేషించేవాడు నాకన్న మరొకడు లోకంలో ఉండడు. ధృతరాష్ట్రుని అనుమతితో కౌరవసభలో నీవు శకునితో కలిసి పాండవులు ఇంత కోపించే స్థితికి తీసికొని వచ్చావు. దుశ్శాసనుడు నీకు తోడు నిలిచాడు. కర్ణుడు ఆ కోపాన్ని పెంచాడు. విదురుని వాక్యాన్ని పరిహసించి, నీవు పదే పదే ఆ కోపం పెరిగేటట్లు చేశావు. మీరంతా సంసిద్ధులై, అర్జునుని చుట్టుముట్టినా పరాభవానికి గురి అయ్యారు. సైంధవుని ఆశ్రయించి, మీరంతా నిలిచినా మీ మధ్యనే తానెలా మరణించాడు? కౌరవ్యా! నీవు, కర్ణుడు, కృపుడు, శల్యుడు, అశ్వత్థామ జీవించిఉండగానే సైంధవు డెలా మరణించాడు? యుద్ధంచేస్తున్న రాజులందరూ కూడా సైంధవుని రక్షించటానికి

ప్రచండతేజస్సును ఆశ్రయించారు. అయినా మీ మధ్యనే సైంధవుడెలా చంపబడ్డాడు ? దుర్యోధనా! ఆ సింధురాజు విశేషించి నీ మీదా, నా మీదా అర్జునుని నుండి రక్షించగలమని ఆశపెట్టుకొన్నాడు. అయితే అర్జునుని నుండి సైంధవుని రక్షించ లేకపోయిన తరువాత నన్ను నేను రక్షించుకొనే మార్గం కూడా ఏదీ నాకు కనిపించటం లేదు. శిఖండితో సహా పాంచాలురను చంపని నేను, ధృష్టద్యుమ్నుని పాపసంకల్పంలో మునిగిపోయినట్లుగా నన్ను భావించుకొంటున్నాను. భారతా! ఆ దశలో తపిస్తున్న నన్ను, సైంధవుని రక్షించటంలో అసమర్థుడవైన నీవు ఇంకా వాగ్బాణాలతో ఛేదిస్తా వెందుకు ? భీష్ముని సువర్ణధ్వజం ఇప్పుడు రణభూమిలో కనిపించటం లేదు. అయినా గెలవగలమని ఎలా అనుకొంటున్నావు ? మహారథుల మధ్యలోనే సైంధవుడు చంపబడ్డాడు. భూరిశ్రవుడు హతుడయ్యాడు. ఇంకా ఏమి మిగిలిం దనుకొంటున్నావు ?

రాజా! ఇతరులకెదిరింపరాని కృపుడు జీవించేఉన్నాడు. సింధురాజమార్గంలో అతడు పయనించలేదు. అందుకతనిని అభినందిస్తున్నాను. కౌరవ్యా! రాజా! యుద్ధంలో దేవేంద్రునితో సహా దేవతలు కూడా సంహరించలేని భీష్ముడు ఘోరంగా పోరాడుతూ, నీ తమ్ముడైన దుశ్శాసనుడు చూస్తుండగానే పడిపోవటాన్ని చూసినప్పుడే ఇక నీకు రాజ్యం దక్కదని నేను భావించాను. భారతా! ఇదిగో, ఈ పాండవ సృంజయసేనలు ఒక్కటై ఇప్పుడు నా మీద దాడిచేయబోతున్నాయి. ధార్తరాష్ట్రా! పాంచాలుర నందరినీ చంపేదాకా యుద్ధభూమిలో కవచాన్ని విడువను. నీకు హితమైన పనినే చేస్తాను. రాజా! నాకుమారుడైన అశ్వత్థామతో ఇలా చెప్పు – "యుద్ధంలో నిన్ను నీవు రక్షించుకొంటూనే సోమకులను ప్రాణాలతో విడువవద్దు. తండ్రి చెప్పిన మాటను పాటించు. దయ, దమం, సత్యం, ఋజుత్వం – ఈ గుణాలలో స్థిరంగా నిలు. ధర్మ-అర్థ-కామ సాధనలో నేర్పరివై ధర్మార్థాలను బాధించకుండా పదే పదే ధర్మప్రధానమైన కార్యాలనే ఆచరించు. చూపులతోనూ, హృదయంతోనూ విప్రులను సంతోషపెట్టాలి. యథాశక్తిగా వారిని పూజించాలి. వారికి నచ్చని పని చేయవద్దు. వారు అగ్ని జ్వాలల వంటివారు". రాజా! నీ వాగ్బాణాలతో నేను పీడింపబడ్డాను. ఇదిగో మహాసంగ్రామం కోసం సేనలలో ప్రవేశిస్తున్నాను. దుర్యోధనా! నీకు శక్తి ఉంటే నీవు కూడా సేనలను రక్షించు. కోపంతో ఉన్న కురుసృంజయ సేనలు రాత్రిపూట కూడా యుద్ధానికి సిద్ధపడవచ్చు." అలా పలికి ద్రోణుడు నక్షత్రకాంతులను అపహరించే సూర్యునివలె క్షత్రియ తేజస్సులను అపహరిస్తూ పాండవ సృంజయులతో పోరాడటానికి బయలుదేరాడు."

152. కర్ణదుర్యోధన సంభాషణము - మరల యుద్ధప్రారంభము.

సంజయుడిలా చెప్తున్నాడు. "ద్రోణుడా రీతిగా ప్రేరణ చేయగా అసహనానికి గురి అయిన దుర్యోధన నరపాలుడు యుద్ధం మీదనే మనస్సును పెట్టాడు. అప్పుడు నీ కొడుకు కర్ణునితో ఇలా అన్నాడు - "చూడు! శ్రీ కృష్ణుని సహాయంతో పాండుసుతుడైన అర్జునుడు దేవతలకు కూడా చొరరాని ద్రోణ వ్యూహాన్ని ఛేదించి, నీవూ, ద్రోణాచార్యుడు యుద్ధం చేస్తుండగానే ముఖ్యయోధుల సమక్షంలోనే సైంధవుని సంహరించాడు. కర్ణా! చూడు. సింహం ఇతర జంతువులను చంపినట్లు అర్జును డొక్కడే భూమండలంలో శ్రేష్ఠరాజుల నందరినీ యుద్ధంలో చంపిపడవేశాడు. నేనూ, మహాత్ముడైన ద్రోణుడు శ్రమించి, యుద్ధం చేస్తున్నా అర్జునుడు నా సేనలో కొద్దిమందిని మాత్రమే మిగిల్చాడు. ద్రోణాచార్యుడు యుద్ధంలో అర్జునుని నిరోధించేందుకు సంకల్పించి ఉంటే అర్జునుడు ఎంత ప్రయత్నించినా దుర్భేద్యమైన వ్యూహాన్ని ఛేదించి, సైంధవుని చంపి, ప్రతిజ్ఞను పూర్తిచేసికొన గలిగేవాడా ? రాధేయా! ఇంద్రునివంటి పరాక్రమం గల ఎందరో రాజులు యుద్ధంలో అర్జునుని చేత పడగొట్టబడి, చచ్చి, పడిఉన్నారు చూడు! వీరా! ద్రోణుడు ప్రయత్నపూర్వకంగా అర్జునుని నిరోధించిఉంటే, ఆయనకిష్టం లేకుండా దుర్భేద్యమైన వ్యూహాన్ని అర్జునుడెలా ఛేదించగలిగేవాడు? ఆచార్యునకు అర్జునుడు ఎప్పుడూ ఇష్టమయినవాడే. అందువలననే పోరాడకుండానే ద్రోణుడు అర్జునునకు దారి ఇచ్చాడు. ద్రోణుడు సైంధవునకు అభయమిచ్చి కూడా అర్జునుడికి అవకాశమిచ్చాడు. నేనెంత గుణహీనుణ్ణి? యుద్ధానికి ముందే ద్రోణుడు సైంధవునకు ఇంటికి వెళ్ళటానికి అనుమతినిచ్చిఉన్నట్లయితే జన వినాశనం తప్పిపోయేది. మిత్రమా! ప్రాణాలమీది ప్రేమతో సైంధవుడు ఇంటికి వెళతానన్నా ద్రోణుని నుండి అభయాన్ని పొంది, సైంధవుని నివారించిన అధముడను నేనే.

"నేను సైంధవుని రక్షిస్తాను. యుద్ధంలో అర్జునుడు సైంధవుని దగ్గరకు కూడా రాలేడు" అని చెప్పి *"బ్రాహ్మణుడైన ద్రోణుడు సైంధవుని ఆపి, నా సేనను నశింపజేశాడు. యుద్ధంలో నేనెంత ప్రయత్నిస్తున్నా నా దురదృష్టం కొద్దీ సర్వసేనలూ నశించాయి. సింధురాజు కూడా చనిపోయాడు. కర్ణా! వందలు, వేలకొలది శ్రేష్ఠయోధులను చూడు. అందరూ అర్జునుని వేర వెలువడిన బాణాలతో యమలోకానికి పంపబడ్డారు. మనమింతమందిమి చూస్తుండగానే అర్జునుడు ఒకే రథంతో వేలకొలది యోధులను, సింధురాజును కూడా ఎలా చంపగలిగాడు ?*

దురాత్ములం మనం చూస్తుండగానే నేడు భీమసేనుని యుద్ధంలో ఎదిరించి, చిత్రసేనాదులైన నా సోదరులు నశించిపోయారు." కర్ణుడిలా అన్నాడు. "ఆచార్యుని నిందించవద్దు. ఆ బ్రాహ్మణుడు తన ప్రాణాలపై మోహాన్ని వీడి యథాబలంగా, యథోత్సాహంగా, శక్తికొలదీ పోరాడుతూనే ఉన్నాడు. ఆయనను దాటి శ్వేతవాహనుడైన

అర్జునుడు వ్యూహంలో ప్రవేశించటంలో ఏ రీతిగానూ ఆచార్యుని దోషం కొంచెం కూడా లేదు. అర్జునుడు అస్త్రవిద్యలో నేర్పరి. వేగంగా పరాక్రమించగలవాడు. సమర్థుడు, యువకుడు. శూరుడు. దివ్యాస్త్రవేత్త. దివ్యాస్త్రాలతో కూడి వానర ధ్వజంగల రథమెక్కినవాడు. అభేద్యమైన కవచాన్ని ధరించినవాడు. బలవంతుడు, బాహుబలదర్పితుడు. అటువంటి అర్జునుడు కృష్ణసారథియై, అశిథిలమైన దివ్యగాండీవధనుస్సును పట్టి, పదునైన బాణాలను కురిపిస్తూ, ద్రోణుని అతిక్రమించిపోయాడు. అది అర్జునునకు తగినదే. రాజా! ఆచార్యుడు వృద్ధుడు. త్వరగా కదలలేనివాడు. పరిశ్రమించి, భుజబలాన్ని ప్రదర్శించలేనివాడు. అందువలన కృష్ణసారథి అయిన అర్జునుడు ఆచార్యుని దాటిపోగలిగాడు. ఈ కారణంగా ద్రోణునిలో తప్పు పట్టలేము. ద్రోణుడు అస్త్రవేత్త అయినా యుద్ధంలో పాండవులను గెలువలేడని నా భావన. అందువలననే అర్జునుడు ద్రోణుని అతిక్రమించి, వ్యూహంలో ప్రవేశించగలిగాడు. సుయోధనా! దైవ నిర్ణయంలో ఎప్పుడూ మార్పుండదని నా భావన. ఎందుకంటే మనం మహాశక్తిని ప్రదర్శించి పోరాడుతున్నా, యుద్ధంలో సైంధవుడు చనిపోయాడు. దైవమే ఇక్కడ అసలు కారణం.

రణభూమిలో నీతోపాటు మేముకూడా తీవ్ర ప్రయత్నం చేస్తున్నాం. వంచనతో, పరాక్రమంతో కూడా ఎప్పుడూ విజయానికై ప్రవర్తిస్తున్నాం. అయినా మన పౌరుషాన్ని నశింపజేసి, దైవం మనలను వెనుకకు నెట్టుతోంది. దైవోపహతుడైన పురుషుడు ఎప్పుడు ఏపని ప్రారంభించినా, చేస్తున్న పనులనన్నింటినీ దైవం పట్టి కొట్టిస్తుంది. మనిషి ఎప్పుడూ ప్రయత్నశీలుడై, అనుమానం లేకుండా తన కర్తవ్యకర్మను చేస్తూనే ఉండాలి. ఫలితం మాత్రం దైవాధీనం. భారతా! మనం పాండవులను కపటత్వంతో మోసగించాం. చంపాలని విషప్రయోగాలు చేశాం. లక్క ఇంటిని తగులబెట్టించాం. జూదంలో ఓడించాం. రాజనీతిని ఆశ్రయించి, వనాలకు పంపించాం. ప్రయత్నపూర్వకంగా ఎంత చేసినా దైవం వాటిని పడగొట్టింది. దైవాన్ని ప్రక్కనపెట్టి, పురుష ప్రయత్నంతో పోరాడు. నీవూ, పాండవులు ఉద్యమించి పోరాడుతుంటే దైవం దాని దారిలో అది వెళుతుంది. వీరా! పాండవులు బుద్ధిపూర్వకంగా చేసిన సుకృతమేదీ నాకు కనిపించటం లేదు. అలాగే నీవు హీనబుద్ధివై బుద్ధిపూర్వకంగా చేసిన దుష్కృతమూ కనిపించటం లేదు. **మంచిపని అయినా చెడ్డపని అయినా అన్నింటికీ దైవమే ప్రమాణం. మన పురాకృతకర్మయే దైవం. మనం నిదురించినా అది మేల్కొనియే ఉంటుంది.** మొదట నీ సేనలు ఎక్కువ. యోధుల సంఖ్య కూడా ఎక్కువే. పాండవులకు అంతసేన లేదు. అలా యుద్ధం ప్రారంభమైంది. అల్పసంఖ్య గల వారిచే అధికసంఖ్య గల నీ యోధులు నశింపజేయబడ్డారు. అది దైవికమనే అనుకొంటున్నాను. నీ పురుషార్థాన్ని అదే నశింపజేసింది." సంజయుడిలా చెప్తున్నాడు.

"రాజా! వారు అలా దీర్ఘంగా మాటాడుకొంటుండగానే రణభూమిలో పాండవుల సేనలు కనిపించాయి. రాజా! ఆ తరువాత నీ అవినీతివలన నీ వారికి పాండవులతో ఘోరయుద్ధం ప్రారంభమైంది. రథాలు రథాలతో, ఏనుగులు ఏనుగులతో కలిసిపోయాయి."

153. దుర్యోధనయుధిష్ఠిర సంగ్రామము - దుర్యోధన పరాజయము

సంజయుడిలా చెప్తున్నాడు. "రాజా! నీ గజసేన పాండవ సేనను అతిక్రమించి, అంతటా వ్యాపించి పోరాడసాగింది. పాంచాల కౌరవసేనలు దీక్షవహించి, పరస్పరం యుద్ధం చేయసాగారు. శూరులు శూరులతో కలబడి బాణాలు, తోమరాలు, శక్తులతో పరస్పరం గాయపరచుకొన్నారు. యమలోకానికి పంపిస్తున్నారు. రథికులకు రథికులతో ఘోరయుద్ధం జరిగింది. ఒకరినొకరు దెబ్బతీస్తుంటే నెత్తురు దారుణంగా ప్రవహిస్తోంది. మహారాజా! మదించిన ఏనుగులు తీవ్రకోపంతో కలయబడి, దంతాలతో పరస్పరం చీల్చుకొంటున్నాయి. ఆశ్వికులు ఘోరసంగ్రామంలో ఘనకీర్తిని పొందగోరి ప్రాసాలు, శక్తులు, గొడ్డళ్ళతో ఆశ్వికులను గాయపరచసాగారు. రాజా! నిత్యమూ వందలకొలది సైనికులు పరస్పరం కొట్టుకొంటున్నారు. గోత్ర, వంశ, నామధేయాలను వినటం ద్వారానే కౌరవులతో పోరాడుతున్నది పాంచాలురని తెలుస్తోంది. ఆ యోధులందరూ నిర్భయంగా సంచరిస్తూ బాణాలు, శక్తులు, గొడ్డళ్ళతో కొట్టి, ఒకరినొకరు పరలోకానికి పంపుతున్నారు. రాజా! సూర్యుడు అస్తమించినందువలన వారు విడిచిన వేలకొలది బాణాలు పదిదిక్కులలోనూ వ్యాపించినా యథాతథంగా ప్రకాశించటం లేదు. పాండవులు ఆ రీతిగా యుద్ధం చేస్తుంటే దుర్యోధనుడు ఆ సేనలలో చొరబడ్డాడు. సైంధవుని వధతో, తీవ్ర దుఃఖానికి లోనైన దుర్యోధనుడు మరణానికి కూడా సిద్ధపడి, ఆ శత్రుబలంలో ప్రవేశించాడు. రథఘోషతో దిక్కులను ప్రతిధ్వనింపజేస్తూ, భూమిని కంపింపజేస్తూ నీకొడుకు పాండవసేనకు ఎదురు నిలిచాడు. పాండవసేనలకు, దుర్యోధనునకు జరిగిన ఆ మహాసంగ్రామం సర్వసేనలనూ తీవ్రంగా నశింపజేసింది."

ధృతరాష్ట్రుడిలా అడిగాడు. "ద్రోణుడు, కర్ణుడు, కృపుడు, కృతవర్మ రాజు క్షేమాన్ని కాంక్షించేవారు గదా! వారు దుర్యోధనుడు యుద్ధంలో ప్రవేశించకుండా ఎందుకు ఆపలేదు ? యుద్ధంలో సర్వోపాయాల చేతనూ రాజును రక్షించాలిగదా! మహర్షులు యుద్ధనీతికి సంబంధించిన ఈ గొప్పనీతిని సందర్భించి చెప్పారు. సంజయా! నా కుమారుడు శత్రుబలంలో ప్రవేశించినపుడు నా సేనలోని శ్రేష్ఠరథికులు ఏం చేశారు ?" సంజయుడిలా చెప్తున్నాడు. "రాజా! నీ కుమారుడు చేస్తున్న పోరాటం ఆశ్చర్యజనకంగా ఉంది. ఒక్కడే చాలామందితో అద్భుతంగా పోరాడుతున్నాడు. చెపుతున్నా విను. ద్రోణుడు, కర్ణుడు, కృపుడు నివారిస్తున్నా నీ కొడుకు పాండవసేనలోనికి ప్రవేశించాడు. ఎక్కడికక్కడ అన్నివైపులా వేలకొలది బాణాలను కురిపిస్తూ, వాడిబాణాలతో పాంచాలురను, పాండవులను గాయపరిచాడు.

ఉదయిస్తున్న సూర్యుడు చీకటిని నశింపజేసినట్లు మహాబలుడైన నీ కొడుకు శత్రుబలాన్ని నశింపజేశాడు.

మధ్యాహ్న కాలంలో కిరణాలతో తపిస్తున్న సూర్యునివలె బాణకిరణాలతో సేనలను తపింపజేస్తూ, వారి మధ్య నిలిచిన నీ కొడుకును రణభూమిలో పాండవులు తేరిచూడలేకపోయారు. మహాత్ముడైన నీ కొడుకు హింసిస్తుంటే పాంచాలురు శత్రుజయంపై నిరుత్సాహంతో, పారిపోవటంపై ఉత్సాహంతో అటు ఇటు పరుగెత్తారు. నీ కుమారునిచే పీడింపబడిన పాండు సైనికులు వేగంగా పడిపోతున్నారు. రాజా! నీ కొడుకు ప్రదర్శిస్తున్న ఘోర పరాక్రమకర్మను నీవారిలో మరెవ్వరూ చూపలేకపోయారు. నీ కుమారుడు రణభూమిలో పాండవసేనను మధించాడు. నీ కుమారుని తేజస్సుతో పాండవసేన కళను కోల్పోయింది. భారతా! నీ కుమారుడు పాండవసేనను చంపటం చూసి పాంచాలురు భీమసేనుని ముందుంచుకొని దుర్యోధనుని మీదకు దూసుకొనివచ్చారు.

అప్పుడు దుర్యోధనుడు పదిబాణాలతో భీమసేనుని, మూడు మూడు బాణాలతో నకుల సహదేవులను, ఆరు బాణాలతో విరాట ద్రుపదులను, వంద బాణాలతో శిఖండిని, డెబ్బయి బాణాలతో ధృష్టద్యుమ్నుని, ఏడు బాణాలతో ధర్మరాజును, పెక్కు బాణాలతో కేకయులను, చేదివంశస్థులను గాయపరిచాడు. అయిదు బాణాలతో సాత్యకిని, మూడు మూడు బాణాలతో ద్రౌపదికొడుకులను, ఘటోత్కచుని గాయపరిచి, సింహనాదం చేశాడు. క్రుద్ధుడైన దుర్యోధనుడు ఏనుగులతో సహా వందలకొలది ఇతర యోధులను నరికివేశాడు. రాజా! ఆ పాండవసేన పారిపోసాగింది. పాండవుల సైనికులు తపిస్తున్న సూర్యునివలె నున్న దుర్యోధనుని చూడలేకపోయారు. అప్పుడు యుధిష్ఠిర నరపాలుడు కుపితుడై నీకుమారుని చంపదలచి, అతనివైపు ఉరికాడు. దుర్యోధన యుధిష్ఠిరులు స్వార్థం కోసం పరాక్రమిస్తూ ఒకరికొకరు దగ్గరయ్యారు. అప్పుడు దుర్యోధనుడు క్రోధంతో, పదిబాణాలతో యుధిష్ఠిరుని గాయపరిచి, ఒక బాణంతో ధ్వజాన్ని ఖండించాడు. యుధిష్ఠిర నరపాలునకు ఇష్టుడైన రథసారథిని – ఇంద్రసేనుని మూడు బాణాలతో నుదుట కొట్టాడు. దుర్యోధనుడు మరో బాణంతో యుధిష్ఠిరుని వింటిని ఖండించాడు. నాలుగు బాణాలతో నాలుగు గుర్రాలను గాయపరిచాడు. దానితో కోపించిన యుధిష్ఠిరుడు నిమేష కాలంలోనే మరొక వింటిని చేపట్టి, వేగంగా దుర్యోధనుని నిలువరించాడు.

యుధిష్ఠిరుడు రెండు భల్లాలతో ఆ విశాలధనుస్సును మూడు ముక్కలు చేశాడు. పదిబాణాలను ప్రయోగించి, దుర్యోధనుని గాయపరిచాడు. ఆ బాణాలన్నీ దుర్యోధనునకు గ్రుచ్చుకొని, మర్మస్థలాలను ఛేదించి, నేలపై పడ్డాయి. పారిపోయిన యోధులందరూ, మరల యుధిష్ఠిరుని చుట్టూ చేరారు. అది వృత్రసంహారం కోసం దేవతలు దేవేంద్రుని చుట్టూ నిలిచినట్లుంది. యుధిష్ఠిర నరపాలుడు సూర్యరశ్మివంటి

కాంతిగలిగి, పరమ భయంకరమై, ఆపటానికి వీలుకాని బాణాన్ని "చచ్చావు" అంటూ నీ కుమారునిపై ప్రయోగించాడు. ధర్మరాజు చెవిదాకా లాగి విడిచిన ఆ బాణంతో గాయపడి, దుర్యోధనుడు తీవ్రంగా మూర్ఛిల్లి, రథం వెనుకభాగంలో కూర్చున్నాడు. రాజేంద్రా! ఆపై ఆనందంతో పాంచాల సేనలు "దుర్యోధనుడు చనిపోయా"డంటూ అన్నివైపుల మహా కోలాహలం చేయసాగాయి. అక్కడ తీవ్రంగా బాణాల చప్పుడు వినిపించసాగింది. రణభూమిలో వెంటనే ద్రోణుడు కనిపించాడు. దుర్యోధనుడు హర్షంతో మరొక గట్టివింటిని చేపట్టి, "నిలు నిలు" అని ఆక్షేపిస్తూ ధర్మరాజు మీదకు వచ్చాడు. జయాన్ని ఆశిస్తున్న పాంచాలురు వేగంగా దుర్యోధనుని ఎదుట నిలిచారు. వెనుగాలికి చెలరేగిన మేఘాలను సూర్యుడు నశింపజేసినట్లు ద్రోణుడు కురురాజును రక్షిస్తూ, పాంచాలురను చెదరగొట్టాడు. రాజా! ఆ తరువాత యుద్ధాభిలాషతో కలబడుతున్న నీవారికీ, శత్రుసేనలకూ మధ్య ప్రాణనష్టాన్ని పెంచుతూ మహాసంగ్రామం జరిగింది."

154. రాత్రి యుద్ధములో పాండవసేనలు ద్రోణుని ఆక్రమించుట - ద్రోణుడు వారిని సంహరించుట.

ధృతరాష్ట్రుడిలా అడిగాడు. "నా మాటను అతిక్రమించే మూర్ఖుడు, నా కుమారుడు అయిన దుర్యోధనునితో అలా పలికి మేటివిలుకాడు, బలిష్ఠుడు అయిన ద్రోణుడు కుపితుడై పాండవసేనలో ప్రవేశించాడు గదా! అలా ప్రవేశించి, రథంపై నిలిచి, సంచరిస్తున్న ఆశూరుని - ద్రోణుని పాండవులెలా నివారించారు ? ఆ మహాసంగ్రామంలో శత్రువుల ననేకులను సంహరిస్తున్న ఆచార్యుని దక్షిణచక్రాన్ని ఎవరు రక్షించారు ? ఉత్తర చక్రాన్ని ఎవరు రక్షించారు ? వీరుడు, మహారథుడు అయిన ద్రోణాచార్యుడు యుద్ధం చేస్తుంటే ఆయన వెన్నంటి ఉన్నవారెవరు ? శత్రువులలో ఎవరు ఆయన ముందు నిలువగలిగారు ? ఋతుసంబంధం లేకపోయినా వారిని చలి తీవ్రంగా తాకిందనుకొంటున్నాను. వారంతా శిశిరర్తువులో గోపులవలె వణికిపోయారని భావిస్తున్నాను. సర్వ శస్త్రధారులలో శ్రేష్ఠుడు ఓటమినెరుగని వాడు, మేటి విలుకాడు అయిన ద్రోణుడు పాంచాలసేనలలో రథమార్గంలో నృత్యం చేస్తూ ప్రవేశించాడు. ద్రోణుడు క్రుద్ధుడై ధూమకేతువు వలె పాంచాలుర సేనల నన్నింటినీ దగ్ధం చేయసాగాడు గదా! ఎలా మరణాన్ని పొందాడు ?"

సంజయుడిలా చెప్తున్నాడు. "సాయంకాలం సైంధవుని చంపి, అర్జునుడు యుధిష్ఠిరుని కలుసుకొన్నాడు. ఆపై అర్జునుడు, సాత్యకి ద్రోణునిపై దాడిచేశారు. అలాగే పాండుకుమారులైన యుధిష్ఠిర భీమసేనులు వెంటనే విడివిడిగా సేనలను సమకూర్చుకొని

ద్రోణునిపై దాడిచేశారు. అలాగే నకులుడు, సహదేవుడు, ధృష్టద్యుమ్నుడు కేకయులతో కూడి విరాటుడు, మత్స్య, శాల్వ దేశీయులు రణభూమిలో ద్రోణుని మీదకే వెళ్ళారు. రాజా! ద్రుపదుడు కూడా పాంచాలసేనల రక్షణలో ద్రోణునివైపే మరలారు. ద్రౌపది కొడుకులు, రాక్షసజాతికి చెందిన ఘటోత్కచుడు సేనలతో కూడి మహాతేజస్వి అయిన ద్రోణునివైపే తిరిగారు. ప్రభద్రక, పాంచాల యోధులు ఆరువేలమంది శిఖండిని ముందు నిలుపుకొని, ద్రోణుని మీదకు వచ్చారు. అదే విధంగా పాండవసేనలోని ఇతర మహారథులు కూడా ఒక్కటై ద్రోణునివైపు మరలారు. ఆ శూరులు యుద్ధానికి వచ్చిన తరువాత పిరికివారికి భయాన్ని పెంచుతూ ఆ రేయి భీకరమైంది. రాజా! ఆరేయి యోధులకు అమంగళకరంగా, యమునికడకు నడిపించేదిగా ఉంది. అప్పుడు ఏనుగులకు, గుర్రాలకు, మనుష్యులకు ప్రాణాంతకంగా ఉంది. ఆ రాత్రివేళలో నక్కలు అంతటా ఊళలుపెడుతూ, మంటలు క్రక్కుతున్న ముఖాలతో భయాన్ని సూచిస్తున్నాయి. విశేషించి కౌరవసేనలో తీవ్రభయాన్ని సూచిస్తూ భయంకరమైన గుడ్లగూబలు కూడా కనిపించాయి.

రాజేంద్రా! రణభేరుల మహాధ్వనితో, మృదంగాల చప్పుళ్ళతో, ఏనుగుల ఘీంకారాలతో, గుర్రాల సకిలింతలతో, గిట్టల చప్పుళ్ళతో భయంకరమైన శబ్దం అంతటా వ్యాపించింది. ఆ సంధ్యవేళలో సమస్త సృంజయులకు, ద్రోణునకు మధ్య అతిదారుణంగా యుద్ధం జరిగింది. లోకమంతా చీకటితోనూ, సేనలు రేగగొట్టిన ధూళితోనూ నిండిపోయింది. ఏమీ తెలియటం లేదు. సైనికులు, గుర్రాలు, ఏనుగుల నెత్తుటితో కలిసిపోయి నేలమీది దుమ్ము కనిపించటం లేదు. అందరినీ మోహం క్రమ్మివేసింది. రాత్రివేళ పర్వతంమీద తగులబడుతున్న వెదురువనం వలె, ఆయుధాల పాటువలన భీకరమైన చటచటశబ్దం వినిపించసాగింది. మృదంగాలు, డోళ్ళశబ్దాలతో, ఝర్ఝర పటహధ్వనులతో, ఏనుగుల ఘీంకారాలతో, గుర్రాల సకిలింతలతో రణభూమి అంతా వ్యాకులమై కనిపించింది. రాజా! చీకటి కప్పిన ఆ చోట స్వపరభేదం కూడా తెలియటం లేదు. ఆ అపరసంధ్య వేళలో అంతా ఉన్మాదానికి లోనయింది. రాజేంద్రా! రక్తం నేలమీది ధూళిని నశింపజేసింది. బంగారు కవచాలు, నగలతో అంధకారం దూరమయింది. భరతర్షభా! అప్పుడు ఆ రాత్రివేళలో, మణులతో కూడిన బంగారు నగలచే అలంకరింపబడిఉన్న కౌరవసేన నక్షత్రాలతో కూడిన ఆకాశంవలె ఉంది. నక్కల సమూహాల ఊళలతో, శక్తులు, ధ్వజాలతో, ఏనుగుల ఘీంకారాలతో, సైనికుల సింహనాదాలతో, పరస్పరం పిలుపులతో భయంకరంగా ఉన్నది. అక్కడ మహేంద్రుని వజ్రధ్వని అన్ని దిక్కులను ఆవరించినట్లు రోమాంచజనకమైన మహాభీకర ధ్వని రణభూమి మొత్తం వ్యాపించింది. ఆ రాత్రివేళలో కౌరవసేన తమ అంగదాలు, కుండలాలు, పతకాలు, శస్త్రాలతో ప్రకాశిస్తోంది. ఆ రాత్రివేళ అక్కడ

బంగారు ఆభరణాలతో అలంకరింపబడిన ఏనుగులు, రథాలు మెరుపులతో కూడిన మేఘాలవలె కనిపిస్తున్నాయి. ఋష్టులు, శక్తులు, గదలు, బాణాలు, ముసలాలు, ప్రాసాలు, పట్టిశాలు నేలబడుతూ నిప్పురవ్వలవలె కనిపిస్తున్నాయి.

యుద్ధం చేయగోరుతున్న సైనికులు భీకరమైన ఆ సేనలో ప్రవేశించారు. అది మేఘసమూహం వలెనుంది. దుర్యోధనుడు దానికి అనుకూలమారుతం. రథాలు, ఏనుగులే మేఘాలు. వాద్యఘోష ఉరుములు. విండ్లు, ధ్వజాలు, మెరుపులు. ద్రోణుడు, పాండవులు మేఘాలు. ఖడ్గాలు, శక్తులు, గదలు పిడుగులు. బాణాలే ధారలు. అస్త్రాలు పవనాలు. చల్లదనంతోనూ, వెచ్చదనంతోనూ వ్యాపించి తీవ్రభయంకరమై, ఉగ్రమైన ఆ సేన అందరికీ ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. సేనల జీవితాలను విచ్ఛిన్నం చేసే దానిని దాటడానికి నావలు లేవు. మహాశబ్దంతో ప్రతిధ్వనిస్తూ, భయంకరమైన ఆ రేయి తొలి ఝాము, పిరికివారికి భయాన్ని కలిగిస్తూ, శూరులకు ఆనందాన్ని పెంచుతూ గడచిపోయింది. రాత్రియుద్ధం జరుగుతుంటే క్రుద్ధులైన పాండవులు, స్పంజయులు కలిసి ద్రోణునిపై దాడిచేశారు. రాజా! తనకు ఎదుట నిలిచిన మహారథుల నందరినీ ద్రోణుడు యుద్ధవిముఖులను చేశాడు. కొందరిని యమసదనానికి పంపించాడు. ఆ ప్రదోషకాలంలో ద్రోణుడొక్కడే బాణాలతో వేయి ఏనుగులను, పదివేల రథాలను, లక్షల కొలదిగ కోట్లకొలదిగ కాల్బలాన్ని, గుర్రాలను నశింపజేశాడు."

155. భీముని పరాక్రమము.

ధృతరాష్ట్రుడిలా అడిగాడు. "ద్రోణుడు అసహనంతో, కోపంతో స్పంజయుల సేనలో ప్రవేశించినప్పుడు మీరెలా భావించారు ? నా మాటలను ఉల్లంఘించే దుర్యోధనుడు ఆ రీతిగా పలుకగా విని, ద్రోణుడు శత్రుసేనలలో ప్రవేశించినప్పుడు అర్జునుడు ఏం చేశాడు ? సైంధవుడు, భూరిశ్రవుడు మరణించిన తరువాత ద్రోణుడు పాంచాలసేన మీదకు వెళ్ళినపుడు, ద్రోణుడు అలా ప్రవేశించటాన్ని చూసి, దుర్యోధనుడు అప్పటికి తగినట్లుగా ఏ పని చేయదలచుకొన్నాడు ? ఆ బ్రాహ్మణ శ్రేష్ఠుని ఎవరు అనుసరించారు ? యుద్ధం చేస్తున్న ఆ శూరుని వెన్నంటి నిలిచిన వీరులెవరు ? ఎవరు ద్రోణునకు ముందు నిలిచారు ? ద్రోణుని బాణాల పీడనకు గురి అయిన పాండవులందరూ శిశిర ఋతువులో కృశించిన గోవులవలె వణికిపోయా రనుకొంటున్నాను. ద్రోణుడు పాంచాలసేనలో ప్రవేశించి ఎలా మరణించాడు? రాత్రివేళలో సర్వయోధులు, మహారథులూ ఒక్కచోట కలిసి కలబడ్డారు గదా! సేనలు విడివిడిగా మథింపబడుతున్నాయి గదా! ఆ సమయంలో

మీలో ఎవరు తెలివిగా ప్రవర్తించారు ? ప్రతియుద్ధంలోనూ నా సేనలోని మహారథులు మరణించినట్లు, చిక్కుకొన్నట్లు, ఓడిపోయినట్లు, రథ హీనులయినట్లు చెప్తున్నావు. పాండవులు మథిస్తూ అందరినీ అచేతనులను చేస్తుండగా, గాఢాంధకారంలో మునిగిపోయిన నావారు ఏం చేయాలనుకొన్నారు ? పాండవులు ఆనందంగా, ఉల్లాసంగా ముందుకు సాగుతున్నారని చెప్తున్నావు. నావారు శోకంతో చెదరిపోయారని చెప్తున్నావు. సంజయా! యుద్ధంలో వెనుకంజవేయని పాండవులకు ఆ రాత్రివేళ అక్కడ వెలుగు ఎలా వచ్చింది ? కౌరవులకు ప్రకాశమెలా కలిగింది ?"

సంజయుడిలా చెప్తున్నాడు. "రాజా! దారుణంగా రాత్రియుద్ధం జరుగుతుండగా పాండవులందరూ సోమకులతో కలిసి ద్రోణునిపై దాడిచేశారు. అప్పుడు ద్రోణుడు వేగంగా దూసుకొనిపోయే బాణాలతో కేకయులను, ధృష్టద్యుమ్నుని కొడుకులను అందరినీ ప్రేతలోకానికి పంపివేశాడు. రాజా! తనకు ఎదుట నిలిచిన మహారథుల నందరినీ ద్రోణుడు పితృలోకానికి పంపించాడు. ద్రోణుడు వీరులను చంపుతుండగా, శిబిమహారాజు క్రోధంతో ద్రోణునికి ఎదురువచ్చాడు. పాండవసేనలోని ఆ శిబి తన మీదకు రావటాన్ని చూసి, ద్రోణుడు పది పదునైన బాణాలతో అతనిని గాయపరిచాడు. బదులుగా శిబి ముప్పయి పదునైన బాణాలతో ద్రోణుని గాయపరిచి, నవ్వుతూ ఒక భల్లంతో ద్రోణుని సారథిని పడగొట్టాడు. ద్రోణుడు మహాత్ముడైన ఆ శిబి గుర్రాలను, రథసారథిని చంపి, ఆపై శిబి తలను శిరస్త్రాణంతో పాటు శరీరం నుండి వేరుచేశాడు. ఆ వెంటనే దుర్యోధనుడు ద్రోణునకై మరొకసారథిని ఏర్పాటు చేశాడు. ఆ సారధి పగ్గాలు పట్టగానే, ద్రోణుడు మరల శత్రువులపై దాడిచేశాడు. కళింగసేనతో కలిసి భీమసేనుని ఆక్రమించాడు. అంతకు ముందు భీముడు తన తండ్రిని చంపినందువలన కళింగరాజు కోపంతో ఉన్నాడు. అతడు ముందు అయిదు బాణాలతోనూ మరలా ఏడు బాణాలతోనూ, భీముని గాయపరిచాడు. మూడు బాణాలతో రథసారథి అయిన విశోకుని, ఒక బాణంతో ధ్వజాన్ని కొట్టాడు. కోపంతో పోరాడుతున్న ఆ కళింగ వీరుని క్రుద్ధుడైన భీమసేనుడు తన రథాన్ని అతని రథం మీదకు నడిపి, పిడికిలితో కొట్టాడు. బలిష్ఠుడైన భీమసేనుని ముష్టిఘాతంతో కళింగరాజు ఎముకలన్నీ వెంటనే రణభూమిలో విడివిడిగా పడ్డాయి. కర్ణుడు, కర్ణుని సోదరులు భీమసేనుని ఆ ఆక్రమణను సహించలేకపోయారు. పాములవంటి బాణాలతో వారు భీమసేనుని కొట్టారు.

ఆపై భీముడు ఆ శత్రురథాన్ని వీడి, మరొక శత్రువైన ధ్రువుని రథం మీదకు పోయాడు. అదే పనిగా బాణాలను కురిపిస్తున్న ధ్రువుని కూడా పిడికిలితో కొట్టి, చంపాడు. బలిష్ఠుడైన భీమసేనుని దెబ్బతిని, ధ్రువుడు కూడా పడిపోయాడు. భీమసేనుడు ధ్రువుని చంపి జయరాతుని రథంమీదకు పోయి పదే పదే సింహనాదం చేశాడు. ఆపై

సింహనాదం చేస్తూనే జయరాతుని కుడి చేతితో లాగి, అరచేతితో చరిచి, చంపివేశాడు. వెంటనే కర్ణుని ఎదుట నిలిచాడు. కర్ణుడు బంగారుతో చేసిన శక్తిని భీమునిపైకి విసిరాడు. భీముడు నవ్వుతూ దానినే చేతబట్టాడు. దుర్ధర్షుడైన భీముడు దానినే కర్ణునిపైకి విసిరాడు. కర్ణుని మీదకు వస్తున్న ఆ శక్తిని శకుని నూనెబాణంతో ఖండించాడు. భీమసేనుడు ఆ ఘనకార్యాన్ని సాధించి మరల తన రథంపైకెక్కి నీ సేనను తరుమసాగాడు. రాజా! కోపించిన యమునివలె తమను చంపటానికి మీదకు వస్తున్న భీమసేనుని మహారథులయిన నీ కుమారులు తీవ్రశరవృష్టిని కురిపిస్తూ, నివారించారు. ఆపై భీముడు నవ్వుతూ దుర్మదుని సారథిని, గుర్రాలను బాణాలతో యమసదనానికి పంపించాడు. వెంటనే దుర్మదుడు దుష్కర్ణుని రథాన్ని ఎక్కాడు. ఆ సోదరులిద్దరూ ఒకే రథాన్ని ఎక్కి, మిత్రావరుణులు దైత్యరాజయిన తారకుని ఆక్రమించినట్లు భీమసేనునిపై దాడిచేశారు. నీ కుమారులైన దుర్మద దుష్కర్ణులు ఒకే రథాన్ని ఎక్కి, బాణాలతో భీముని గాయపరిచారు. ఆపై కర్ణుడు, అశ్వత్థామ, దుర్యోధనుడు, కృపుడు, సోమదత్తుడు, బాహ్లీకుడు చూస్తుండగానే భీముడు దుర్మద దుష్కర్ణులు ఎక్కిన ఆ రథాన్ని కాలితో కొట్టి, నేలగూల్చాడు. నీకుమారులు దుర్మద దుష్కర్ణులను భీముడు కోపంతో పిడికిలితో కొట్టి, ముద్ద చేశాడు. ఆపై సింహనాదం చేశాడు.

దానితో కౌరవసేనలో హాహాకారం చెలరేగింది. భీముని చూసి రాజులందరూ "సాక్షాత్తూ రుద్రుడే భీముని రూపం ధరించి, ధార్తరాష్ట్రులతో యుద్ధం చేస్తున్నాడు" అని చెప్పుకోసాగారు. భారతా! అలా అంటూ రాజులందరూ పారిపోసాగారు. మతి తప్పిన వారు తమ వాహనాలను తామే తోలుకొంటూ వెళ్ళారు. ఏ ఇద్దరూ కలిసి పారిపోవటం లేదు. ఆ తరువాత ప్రదోషకాలంలో కౌరవసేన చెదరిపోగా, పద్మంవలె విప్పారిన కన్నులు గల భీముడు రాజశ్రేష్ఠుల ప్రశంసల నందుకొంటూ ధర్మరాజును సమర్పించాడు. ఆపై నకుల సహదేవులు, ద్రుపదుడు, విరాటుడు, కేకయులు, యుధిష్ఠిరుడు పరమానందాన్ని పొందారు. అంధకుడు మరణించినపుడు దేవతలు పరమశివుని పూజించినట్లు, వారందరూ భీమసేనుని చక్కగా సత్కరించారు. ఆ తరువాత వరుణపుత్రుల వంటి పరాక్రమం గల నీ కుమారులు కోపావిష్టులై, యుద్ధాసక్తితో రథాలతో, కాల్బలంతో, ఏనుగులతో పాటు మహాత్ముడైన ద్రోణునితో కలిసి భీమసేనుని వేగంగా చుట్టుముట్టారు.

అపుడు నకులసహదేవులు, సైనికులతో సహా ద్రుపద సుతులు, యుధిష్ఠిరుడు, ద్రుపదుడు, విరాటుడు, సాత్యకి, ఘటోత్కచుడు, జయ విజయులు, ద్రుముడు, వృకుడు, సృంజయులు నీ కుమారులను నిరోధించారు.

రాజా! ఆపై గాఢాంధకారం వ్యాపించిన ఆ మహాభీకరమైన ప్రదోషవేళలో ఆ మహనీయుల మధ్య దారుణమై, భయావహమైన అద్భుతయుద్ధం జరిగింది. అది తోడేళ్ళకు, గ్రద్దలకు ఆనందాన్ని కలిగిస్తోంది."

156. సోమదత్త పరాజయము - పాండవసేన పరాజయము.

సంజయుడిలా చెప్తున్నాడు. "ప్రాయోపవేశానికి కూర్చున్న తన కుమారుని సాత్యకి చంపటంతో తీవ్రంగా కోపించిన సోమదత్తుడు, సాత్యకితో ఇలా అన్నాడు. 'సాత్వతా! మహాత్ములైన దేవతలు తొల్లి దర్శించిన క్షత్రధర్మాన్ని వీడి, నీవు చోరధర్మాన్ని ఎలా ఇష్టపడ్డావు ? సాత్యకీ! యుద్ధవిముఖుడై, దీనుడై, శస్త్రాలు విడిచిన వానిని క్షత్రధర్మాసక్తుడైన బుద్ధిమంతుడెవడైనా యుద్ధంలో కొడతాడా ? సాత్వతా! వృష్ణివంశస్థులై, రణకర్మలో ప్రఖ్యాతి చెందిన మహారథు లిద్దరే ఉన్నారు. మహాబాహువయిన ప్రద్యుమ్నుడొకడు, నీవొకడవు. అర్జునుడు బాహువును ఖండించగా ఆమరణ నిరశన దీక్ష స్వీకరించిన నా కుమారుని క్రూరంగా పడగొట్టే పనిని ఎలా చేయగలిగావు ? దుర్మార్గుడా! ఆ పనికి ఫలితాన్ని యుద్ధంలో పొందగలవు. మూఢుడా! నేడు పరాక్రమించి బాణంతో నీ తలను ఖండిస్తాను. వృష్ణి పాంసనా! సాత్వతా! నేను నా ఇద్దరు కుమారుల మీదా, పుణ్య కర్మల మీద ఒట్టువేసి చెప్తున్నాను. ఈ రాత్రి గడవకముందే అర్జునుడు నిన్ను రక్షిస్తున్నా సరే, తనను తాను వీరుడనుకొనే నిన్ను, పుత్రులు, సోదరులతో సహా చంపకపోతే నేను ఘోరనరకంలో పడిపోతాను.' అలా పలికి సోమదత్తుడు తారస్వరంతో శంఖాన్ని పూరించి, సింహనాదం చేశాడు. ఆపై సాత్యకి బాగా కోపించి, సోమదత్తునితో ఇలా అన్నాడు.

'కౌరవేయా! నీతో కానీ, ఇతరులతో కానీ యుద్ధంచేసే నాకు హృదయంలో ఏ రీతిగానూ, ఎటువంటి భయమూ లేదు. కౌరవా! సర్వసైన్య సంరక్షణలో నిలిచి, నీవు నాతో పోరాడినా, నీవలన నాకెటువంటి బాధ కలుగదు. నేను క్షాత్రధర్మంలో నిలిచినవాడను. యుద్ధమే పరిణామమైన నిష్ఠుర వాక్యాలతో నన్ను భయపెట్టలేవు. అది దుర్జనులు ఆదరించే పద్ధతి. నరాధిపా! నేడు నాతో యుద్ధం చేయాలన్న కోరిక నీకుంటే, దయమాలి పదునైన బాణాలతో కొట్టు. నిన్ను నేను కొడతాను. మహారాజా! నీ కొడుకు భూరిశ్రవుడు చనిపోయాడు. సోదరుని మరణానికి దుఃఖించిన శలుడు కూడా మరణించాడు. నేడు నిన్ను కూడా పుత్రులతో, బంధువులతో సహా చంపుతాను. కౌరవులలో నీవు మహారథుడవు గదా! ఇక యుద్ధానికి సిద్ధమై నిలబడు. యుధిష్ఠిరరాజులో దానం, దమం, శౌచం, అహింస, సిగ్గు, ధైర్యం, సహనం - ఈ గుణాలన్నీ నశించకుండా ఎప్పుడూ నిలిచిఉంటాయి.

మృదంగధ్వజుడైన ఆ ధర్మజుని తేజస్సుతో నీవెప్పుడో మరణించావు. నేడు కర్ణశకునులతో పాటు రణభూమిలో నాశనమైపోగలవు. కోపించిన నేను పాపాత్ముడవైన నిన్ను, పుత్రులతో పాటుగా యుద్ధంలో చంపకపోతే, శ్రీకృష్ణుని పాదాలమీదా, నా ఇష్టాపూర్తి కర్మల మీదా ఒట్టే. నీవు యుద్ధంనుండి తొలగిపోతే నా నుండి తప్పించుకొనగలవు పురుషశ్రేష్ఠులైన ఆ ఇరువురూ కోపంతో కన్నెర్ర చేసి, ఒకరితో ఒకరు ఇలా పలికి శరవృష్టిని కురిపించనారంభించారు. ఆపై వేయి రథాలతో, పదివేల ఏనుగులతో దుర్యోధనుడు అన్నివైపుల నుండి సోమదత్తునికి ఆసరాగా నిలిచాడు. నీ బావమరిది అయిన శకుని కూడా తీవ్రకోపంతో పుత్రపౌత్రులతోనూ, దేవేంద్ర పరాక్రములయిన సోదరులతోనూ, పరివృతుడై అక్కడకు చేరాడు. ధీమంతుడైన శకుని గుర్రాలు లక్షకుపైగా మేటివిలుకాడైన సోమదత్తుని అన్నివైపులా రక్షించసాగాయి.

బలిష్ఠుల రక్షణలో నిలిచి, సోమదత్తుడు సాత్యకిని తన బాణాలతో కప్పివేశాడు. వంగిన కణుపులు గల బాణాలచే కప్పబడిన సాత్యకిని చూసి, ధృష్టద్యుమ్నుడు కోపంతో పెద్దసేనను తీసికొని, అక్కడకు వచ్చాడు. రాజా! పరస్పరం దెబ్బతీసికొంటున్న ఆ సేనల కోలాహలం పెనుగాలులచే కలతపడిన సముద్రఘోషవలె ఉంది. సోమదత్తుడు సాత్యకిని తొమ్మిది బాణాలతో గాయపరిచాడు. సాత్యకి కూడా ఆ కురుశ్రేష్ఠుని తొమ్మిది బాణాలతో గాయపరిచాడు. సాత్యకి ద్వారా రణభూమిలో తీవ్రంగా గాయపడిన సోమదత్తుడు రథంవెనుక భాగానికి చేరి, చైతన్యాన్ని కోల్పోయి మూర్ఛిల్లాడు. సోమదత్తుడు మూర్ఛిల్లిన విషయాన్ని గుర్తించి, రథసారథి వేగంగా ఆ వీరమహారథుని యుద్ధభూమి నుండి దూరంగా తీసికొనిపోయాడు. సోమదత్తుడు యుయుధానుని బాణాల దెబ్బతిని, మూర్ఛిల్లిన విషయాన్ని గమనించి, వెంటనే ద్రోణుడు సాత్యకిని చంపదలచి, అతనిపై దాడిచేశాడు. సాత్యకి మీదకు వస్తున్న ద్రోణుని చూసి, యుధిష్ఠిరుడు మొదలయిన పాండవులు సాత్యకిని రక్షిస్తూ, ఆ ద్రోణుని చుట్టుముట్టారు. ఆపై పూర్వం మూడులోకాలను జయించాలన్న కోరికతో బలి దేవతలతో పోరాడినట్లు ద్రోణునకు పాండవులతో పోరు జరిగింది. ద్రోణుడు బాణసమూహంతో పాండవసేనను ఆవరించాడు. యుధిష్ఠిరుని గాయపరిచాడు. మహాబాహువైన ద్రోణుడు సాత్యకిపై పది, ధృష్టద్యుమ్నునిపై ఇరువదింటిని, భీమసేనునిపై తొమ్మిది, నకులునిపై అయిదు సహదేవునిపై ఎనిమిది శిఖండిపై వంద, ద్రౌపది కొడుకుల మీద అయిదు – అయిదు, విరాటునిపై ఎనిమిది, ద్రుపదునిపై పది, యుధామన్యునిపై మూడు, ఉత్తమౌజునిపై ఆరు బాణాలను ప్రయోగించి, ఇతరసైనికులను వివిధ బాణాలతో గాయపరిచి, యుధిష్ఠిరునిపై దాడిచేశాడు. రాజా! ద్రోణునిచే హింసింపబడుతున్న ఆ పాండవ సైనికులు భయంతో ఆర్తనాదాలు చేస్తూ, పదిదిక్కులకూ పరుగెత్తారు. ద్రోణునిచే చంపబడుతున్న

ఆ సేనను చూసి, అర్జునుడు కొంచెం కోపించి వేగంగా గురువు నెదిరించాడు.

ద్రోణునిపై దాడిచేస్తున్న అర్జునుని చూసి, యుధిష్ఠిరసేన మరల వెనుకకు వచ్చింది. మరల పాండవులకు ద్రోణునకు మధ్య పోరాటం జరిగింది. రాజా! నీ కుమారులు అన్నివైపులా చుట్టి నిలువగా ద్రోణుడు, అగ్ని దూదిప్రోవును తగులబెట్టినట్లు పాండుసేనలను ధ్వంసం చేయసాగాడు. రాజా! ప్రజ్వలిస్తున్న అగ్నివలె, తపిస్తున్న భాస్కరునివలె ద్రోణుడు శత్రుసైన్యాలను దహిస్తున్నాడు. ఆయన నెవ్వరూ వారించలేకపోయారు. ద్రోణుని ఎదుట ఏ వీరుడు నిలిచినా ఆయన బాణాలు వారివారి శిరస్సులను ఖండించి, నేలగూలుస్తున్నాయి. ఈ రీతిగా ద్రోణుని పీడనకు గురి అయిన పాండవసేన భయపడి, అర్జునుడు చూస్తుండగానే మరలా పారిపోయింది. భారతా! ఆ రేయి ద్రోణునివలన చెదరిపోయిన సేనను చూసి, అర్జునుడు "ద్రోణుని రథంవైపు వెళ్ళు" అని కృష్ణునితో అన్నాడు. వెండితో, ఆవు పాలతో, మొల్లపూలతో, చంద్రునితో సమానమైన కాంతిగల గుర్రాలను కృష్ణుడు ద్రోణరథం వైపుకు నడిపించాడు. ద్రోణునివైపు వెళుతున్న అర్జునుని చూసి, భీమసేనుడు కూడా "ద్రోణసేనవైపు నన్ను తీసికొనిపో" అని తన సారథికి చెప్పాడు. భీమసేనుని మాట విని, ఆ విశోకుడు అర్జునుని వెనుకనే తన గుర్రాలను నడిపించాడు. మహారాజా! ఆ సోదరులిద్దరూ ద్రోణసేనవైపు ఉద్యమించి వెళ్ళటం చూసి, పంచాలురు, సృంజయులు, మత్స్యదేశీయులు, చేది దేశస్థులు, కారూష దేశీయులు, కోసల దేశీయులు, కేకయ మహారథులు వారిని అనుసరించి వెళ్ళారు. రాజా! ఆపై రోమాంచాన్ని కల్గిస్తూ ఘోరమైన యుద్ధం జరిగింది.

అర్జునుడు దక్షిణంవైపు, భీముడు ఉత్తరం వైపు పెద్ద రథ సమూహాలతో నీ బలంపై పట్టు బిగించారు. భీమార్జునులను చూసి ధృష్టద్యుమ్నుడు, సాత్యకి కూడా అక్కడకు చేరారు. రాజా! అప్పుడు సేనాసమూహాలు పరస్పరం కొట్టుకొంటుంటే మహా కోలాహలం చెలరేగింది. అది పెనుగాలికి క్షోభించిన సముద్రాల గర్జనవలె ఉన్నది. రాజా! భూరిశ్రవుని చంపినందువలన తీవ్రకోపంతో నున్న అశ్వత్థామ రణభూమిలో సాత్యకిని చూసి, చంపి వేయాలని నిశ్చయించుకొని, అతనిపై దాడిచేశాడు. సాత్యకి రథంమీదకు వస్తున్న ఆ అశ్వత్థామను చూసి, భీమసేనుని కొడుకు ఘటోత్కచుడు తీవ్రకోపంతో ఆ శత్రువును నిరోధించాడు. ఘటోత్కచుడు పెద్ద రథంమీద కూర్చొని వచ్చాడు. అది ఉక్కుతో చేసింది. చాలా భయంకరంగా ఉంది. దానిపై ఎలుగుబంటి చర్మాలను పరిచాడు. దాని లోపలి పాడవు వెడల్పులు పన్నెండువేల జానలు. యంత్రాలు, కవచాలు దానిలో పేర్చి ఉన్నాయి. మహా మేఘ సమూహగర్జన వలె దాని చప్పుడు వినిపిస్తోంది. దానికి గట్టిన వాహనాలు ఏనుగులూ కావూ, గుర్రాలు కావు. కాని ఏనుగులవలె ఉన్నాయి. ఎత్తైన ధ్వజదండముంది. రెక్కలు విప్పి, కాళ్ళు చాచి, కళ్ళు విప్పార్చి, కూస్తున్న గ్రద్ద

ధ్వజచిహ్నంగా ఉంది. ధ్వజపతాక నెత్తుటితో తడిసి ఉన్నది. ప్రేవుల మాలలు ఆ రథానికి అలంకరణలు. ఎనిమిది చక్రాలతో కూడిన ఆ విశాల రథాన్ని ఎక్కి, ఘోరరూపంగల ఒక అక్షౌహిణి రాక్షససేనతో కూడి, ఘటోత్కచుడు వచ్చాడు.

ఆ సేన శూలాలను, ముద్గరాలను, పర్వతాలను, చెట్లను చేతబట్టి వచ్చింది. ప్రళయకాలంలో దండధారియై నిలిచిన యమునివలె పెద్ద ధనుస్సును ఎత్తిపట్టి, నిలిచిన ఆ ఘటోత్కచుని చూసి, రాజులు కలత చెందారు. ఆ ఘటోత్కచుడు పర్వతశిఖరం వలె కనిపిస్తున్నాడు. రూపం భీకరంగా ఉంది. అందరికీ భయం కలిగిస్తోంది. భీషణమైన ఆ రూపం కోరపళ్ళతో మరీ ఉగ్రంగా ఉంది. శంకువుల వంటి చెవులు, పెద్ద దవడలు, పైకి లేచిన జుట్టు, వికృతమైన కళ్ళు, ప్రజ్వలించే ముఖం, లోనికిపోయిన పొట్ట, పెద్దగుంట వంటి గొంతు, కిరీటంతో, అదిమిపెట్టిన వెంట్రుకలతో నోరుతెరిచిన యమునివలె సర్వప్రాణులను భయపెడుతున్నాడు. శత్రుసేనలో క్షోభను కలిగిస్తూ, మహాచాపాన్ని ఎత్తిపట్టి, వెలుగుతూ వస్తున్న ఆ రాక్షసరాజును - ఘటోత్కచుని - చూసి భయానికి లోనయిన నీ కుమారుని సేన గాలికి క్షోభించి, సుళ్ళతో, పైకెగిసిన అలలతో నున్న గంగానది వలె తీవ్రంగా కలగిపోయింది. ఘటోత్కచుడు చేసిన సింహనాదానికి భయపడి ఏనుగులు మూత్రవిసర్జన చేశాయి. మనుష్యులు తీవ్రంగా వ్యథచెందారు. ఆపై అక్కడ సంధ్యాకాలంలో బలం పెంచుకొన్న రాక్షసులు నేలపై పెనురాళ్ళవానను కురిపించారు. లోహచక్రాలు, భుశుండులు, ప్రాసాలు, తోమరాలు, శూలాలు, శతఘ్నులు, పట్టిశాలు ఆగకుండా పడుతూనే ఉన్నాయి. అత్యంత భయంకరమూ, రౌద్రమూ అయిన ఆ యుద్ధాన్ని చూసి రాజులు, నీ కొడుకులు, కర్ణుడు వ్యథితులై దిక్కులుపట్టి, పారిపోయారు. అప్పుడు తన అస్త్రబలాన్ని అభిమానించే ఆత్మాభిమాని అశ్వత్థామ ఒక్కడే వ్యధ చెందలేదు. తాను ఘటోత్కచుడు కల్పించిన మాయను తన బాణాలతో నశింపజేశాడు. మాయ నశించగా, ఆ ఘటోత్కచుడు అసహనంతో భీకరబాణాలను ప్రయోగించాడు. అవి అశ్వత్థామకు గ్రుచ్చుకొన్నాయి. క్రోధంతో కలతచెందిన పాములు వేగంగా పుట్టలోనికి చొరబడినట్లు, సువర్ణపక్షాలు గలిగి, సానతో పదునెక్కిన ఆ బాణాలు అశ్వత్థామను చీల్చి, నెత్తుటితో తడిసి, వెంటనే నేలలో గ్రుచ్చుకొన్నాయి.

అశ్వత్థామ హస్తనైపుణ్యం గలవాడు. తాను తీవ్రంగా కోపించి, క్రోధంతో నున్న ఘటోత్కచుని పది బాణాలతో గాయపరిచాడు. ఆ రీతిగా అశ్వత్థామ ఘటోత్కచుని మర్మస్థానాలలో తీవ్రంగా గాయపరచగా విలవిలలాడిన ఘటోత్కచుడు మణివజ్ర భూషితమై, బాలసూర్యునివలె భాసిస్తున్న చక్రాన్ని చేతబట్టాడు. ఆ చక్రానికి లక్ష ఆకులున్నాయి. అంచులలో చురకత్తులున్నాయి. ఆ చక్రాన్ని ఘటోత్కచుడు అశ్వత్థామను చంపాలని

అతనిపై విసిరాడు. అది తీవ్రవేగంతో వచ్చింది. అశ్వత్థామ బాణాలతో దానిని దూరంగా నెట్టివేశాడు. అభాగ్యుని సంకల్పంవలె, అది వ్యర్థమై నేలగూలింది. పడిపోయిన చక్రాన్ని చూసి, ఘటోత్కచుడు వెంటనే రాహువు సూర్యుని క్రమ్మివేసినట్లు అశ్వత్థామను బాణాలతో కప్పివేశాడు. ఘటోత్కచుని కొడుకు అంజనపర్వుడు. బ్రద్దలైన అంజన పర్వతపుముక్కల సమూహంవలె నల్లని వాడు, తేజస్వి అయిన అతడు ప్రభంజనాన్ని హిమాలయం నిరోధించినట్లు మీదకు వస్తున్న అశ్వత్థామను నిరోధించాడు. అంజనపర్వుని బాణాలచే ఆవరింపబడిన అశ్వత్థామ మేఘజలధారలచే ఆవరింపబడిన మేరు పర్వతంవలె శోభించాడు. రుద్రునివలె, ఉపేంద్రునివలె పరాక్రమశాలి అయిన అశ్వత్థామ కలత పడకుండా ఒకే బాణంతో అంజనపర్వుని ధ్వజాన్ని ఛేదించాడు. రెండు బాణాలతో ఇద్దరు సారథులను, మూడు బాణాలతో త్రివేణుకాన్ని, ఒక బాణంతో ధనుస్సును, నాలుగు బాణాలతో నాలుగు గుర్రాలను ఖండించాడు. విరథుడైన అంజనపర్వుడు బంగారు చుక్కలతో అలంకరింపబడిన కత్తిని పైకెత్తాడు. పదునైన బాణంతో అశ్వత్థామ దానిని రెండు ముక్కలు చేశాడు. రాజా! అంజనపర్వుడు - బంగారు అంగదాలు గల గదను తీసికొని, త్రిప్పి, విసిరాడు. అశ్వత్థామ దానిని కూడా బాణాలతో కొట్టాడు. అది నేలబడింది. ఆపై అంజనపర్వుడు ఆకాశానికి ఎగిరి, కాలమేఘంవలె గర్జిస్తూ చెట్లవానను కురిపించసాగాడు. సూర్యుడు కిరణాలతో మేఘసమూహాన్ని చీల్చినట్లు, అశ్వత్థామ అంజన పర్వుని గగన తలంమీదనే బాణాలతో గాయపరిచాడు. ఆపై అంజనపర్వుడు అంజన పర్వతం నేలకు దిగినట్లు ఆకాశం నుండి దిగి, స్వర్ణభూషితమైన రథంపై అశ్వత్థామ ముందు నిలిచాడు. లోహ కవచాన్ని ధరించి వచ్చిన అంజనపర్వుని అశ్వత్థామ మహేశ్వరుడు అంధకాసురుని చంపినట్లు చంపాడు. ఆపై మహాబలుడైన తన కుమారుడు అశ్వత్థామ చేతిలో చావటం చూసి, ఘటోత్కచుడు రోషంతో అశ్వత్థామ దగ్గరకు వచ్చి, విస్తరిస్తున్న అగ్ని వనాన్ని దహించినట్లు పాండవసేనను దహిస్తున్న వీరుడైన అశ్వత్థామతో తడబాటు లేకుండా ఇలా అన్నాడు.

'ద్రోణకుమారా! నిలు, నిలు! నా చేతి నుండి తప్పించుకొని ప్రాణాలతో వెళ్ళలేవు. అగ్నిసుతుడైన కార్తికేయుడు క్రౌంచ పర్వతాన్ని చీల్చినట్లు నేడు నిన్ను చంపుతాను.' అశ్వత్థామ ఇలా అన్నాడు. 'వత్సా! అమరవిక్రమా! వెళ్ళు. ఇతరులతో యుద్ధం చేయి. హిడింబాసుతా! పుత్రునికోసం తండ్రిని బాధించటం న్యాయం కాదు. హిడింబానందనా! వాస్తవానికి నీ మీద నాకు కోపం లేదు. కానీ కోపించిన ప్రాణి తననైనా తాను నశింపజేసికొనగలదు.' సంజయుడిలా చెప్తున్నాడు. "పుత్రశోకంతో మునిగిపోయిన ఘటోత్కచుడు అశ్వత్థామ మాటలు విని, కోపంతో కన్నెర్రజేసి, అశ్వత్థామతో ఇలా అన్నాడు. 'అశ్వత్థామా! ఇతర జనులవలె నేను యుద్ధంలో భయపడే వాడనా! నన్ను

మాటలతో బెదిరిస్తున్నావు. నీ ఈ మాట మంచిది కాదు. నేను విపులమైన కురుకులంలో భీమసేనునకు పుట్టినవాడిని. యుద్ధంలో వెన్నుచూపని పాండవుల కొడుకును. రాక్షసరాజును. బలంలో రావణునితో సమానుడను. ద్రోణకుమారా! నిలు, నిలు! నా చేతినుండి తప్పించుకొని బ్రతికిపోలేవు. నేడు రణరంగంలో నీ యుద్ధశ్రద్ధను పోగొడతాను, అలా పలికి కోపంతో కన్నెర్రజేసి ఘటోత్కచుడు - కోపించిన సింహం ఏనుగుపై దాడిచేసినట్లు అశ్వత్థామపై దాడిచేశాడు. మేఘం పర్వతంపై జలధారలను కురిపించినట్లు రధికశ్రేష్ఠుడైన అశ్వత్థామపై ఘటోత్కచుడు రధపుటిరుసులవంటి బాణాలను కురిపించాడు. అశ్వత్థామ ఆ శరవృష్టి తనను సమీపించకముందే దానిని బాణాలతో నశింపజేశాడు. దానితో ఆకాశంలో మరో శరసంగ్రామం జరిగినట్లయింది. అటు తర్వాత అస్త్రాల రాపిడివలన పుట్టిననిప్పు రవ్వలతో ఆ ప్రదోషకాలంలో ఆకాశం మిణుగురులతో అలంకరింపబడినట్లు ప్రకాశించింది.

అశ్వత్థామ తన మాయను నష్టపరచటాన్ని చూసి, ఘటోత్కచుడు అదృశ్యుడై మరల మాయను సృష్టించాడు. చెట్లతో నిండి శిఖరాలతో ప్రకాశిస్తున్న ఒక పెద్ద పర్వతంగా తాను మారిపోయాడు. దానినుండి శూలాలు, ప్రాసాలు, ఖడ్గాలు, ముసలాలు నీటి ప్రవాహాల్లా వెలువడుతున్నాయి. అంజనగిరి వలె నున్న ఆ పర్వతాన్ని చూసి, దానినుండి మీదపడుతున్న బహుశస్త్ర సమూహాలతో గాయపడి కూడా అశ్వత్థామ వ్యథచెందలేదు. ఆపై అశ్వత్థామ నవ్వుతూ వజ్రాస్త్రాన్ని ప్రయోగించాడు. ఆ అస్త్రందెబ్బ తగిలిన వెంటనే ఆ పర్వతం కనిపించకుండా పోయింది. ఆ తరువాత ఘటోత్కచుడు ఆకాశంలో మెరుపులతో కూడిన నీలమేఘంగా మారి, రాళ్ళవానతో రణభూమిలో అశ్వత్థామను కప్పివేశాడు. అటు తర్వాత అశ్వత్థామ వాయవ్యాస్త్రాన్ని ప్రయోగించి, ఎగిసిన ఆ నీలమేఘాన్ని నశింపజేశాడు. ఆ అశ్వత్థామ బాణసమూహాలతో అన్ని దిక్కులను కప్పి, లక్షమంది శత్రు రథికులను సంహరించాడు. ఆ తరువాత అనేక రాక్షసులను చుట్టూ నిలుపుకొని, వింటినెక్కుపెట్టి లాగి ఏ తడబాటు లేకుండా రథంపై వస్తున్న ఘటోత్కచుని అశ్వత్థామ చూశాడు. ఘటోత్కచుని అనుచరులు సింహాలతో, శార్దూలాలతో, మదపుటేనుగులతో సమానమైన పరాక్రమం గలవారు. వికారమైన ముఖాలు, తలలు, మెడలు గలవారు. వారు ఏనుగులను, రథాలను, గుర్రాలను ఎక్కివచ్చారు. మహేంద్ర పరాక్రములైన పౌలస్త్యులు, యాతుధానులు, ఇతర తామసులు వారిలో ఉన్నారు. వివిధ శస్త్రాలను, వివిధ కవచాలను, ఆభరణాలను ధరించి, భీకరంగా సింహనాదాలు చేస్తూ, కోపంతో కళ్ళు త్రిప్పుతూ, యుద్ధదుర్మదులై, మహాబలులై వచ్చిన ఆ రాక్షసులను చూసి నీ కొడుకు - దుర్యోధనుడు విషాదానికి లోనయ్యాడు.

అది చూసి అశ్వత్థామ ఇలా అన్నాడు. 'దుర్యోధనా! ఇప్పుడు నీవు కానీ, వీరులయిన నీ సోదరులు కానీ, ఇంద్ర విక్రములైన ఈ రాజులు కానీ కంగారు పడనవసరం లేదు. ఊరకే ఉండు. నీ శత్రువులను నేను సంహరిస్తాను. సత్య ప్రమాణంగా చెపుతున్నాను. నీకు ఓటమి లేదు. సేనకు (ధైర్యం చెప్పి) ఊరట కలిగించు.' దుర్యోధనుడిలా అన్నాడు. 'ద్రోణపుత్రా! నీ మనస్సు గొప్పది. నీవీ పని చేయటం అద్భుతమేమీ కాదు. మాపై నీకు మిక్కుటమైన అనురాగమున్నది.' సంజయుడిలా చెప్తున్నాడు. "అశ్వత్థామతో అలా పలికి దుర్యోధనుడు రణరంగానికి అందం కలిగిస్తున్న గుర్రాలు పూన్చిన వేయిరథాలను చుట్టూ నిలుపుకొన్న శకునితో ఇలా అన్నాడు. 'అరవై వేల రథికులను వెంటబెట్టుకొని, అర్జునునిపై దాడిచేయి. కర్ణుడు, వృషసేనుడు, కృపాచార్యుడు, నీలుడు, ఉత్తరదేశాలసైనికులు, కృతవర్మ, పురుమిత్రుడు, సుతాపనుడు, దుశ్శాసనుడు, నికుంభుడు, కుండభేది, పురంజయుడు, దృఢరథుడు, పతాకి, హేమకంపనుడు, శల్యుడు, ఆరుణి, ఇంద్రసేనుడు, సంజయుడు, విజయుడు, జయుడు, కమలాక్షుడు, పరక్రాథి, జయవర్మ, సుదర్శనుడు – వీరందరూ, అరవైవేల కాల్బలమూ నిన్ను అనుసరిస్తుంది. మామా! దేవేంద్రుడు రాక్షసులను చంపినట్లు భీముని, నకుల సహదేవులను, ధర్మరాజును చంపు. నేను గెలుస్తానని నీమీదనే ఆశపెట్టుకొన్నాను. మామా! కార్తికేయుడు అసురులను చంపినట్లు అశ్వత్థామ బాణాల దెబ్బలు తిని, బాగా ఒళ్ళు హూనమైయున్న పాండవులను చంపు.' రాజా! నీ కొడుకు అలా చెప్పగానే శకుని నీ కొడుకులకు ప్రీతిని కలిగించటానికై పాండవులను దగ్ధం చేయాలని వెంటనే బయలుదేరాడు. ఆపై రణభూమిలో అశ్వత్థామకు, ఘటోత్కచునకు మధ్య ఆ రాత్రివేళలో ఇంద్రప్రహ్లాదుల మధ్య జరిగినట్లు భీకరసంగ్రామం జరిగింది. ఘటోత్కచుడు తీవ్రకోపంతో విషంతో, అగ్నితో సమానమైన పది గట్టి బాణాలతో అశ్వత్థామ ఛాతిపై గాయపరిచాడు. భీమసుతుడైన ఘటోత్కచుడు ప్రయోగించిన ఆ బాణాలచే గట్టి దెబ్బతిని, అశ్వత్థామ గాలికి కంపిస్తున్న వృక్షంలా రథం మధ్యలోనే నిలిచి వణికిపోయాడు.

అంతలోనే మరల అంజలికమనే పేరుగల బాణంతో ఘటోత్కచుడు అశ్వత్థామ చేతిలోని మహాకాంతిమంతమైన ధనుస్సును వేగంగా ఖండించాడు. వెంటనే అశ్వత్థామ భారసహమైన మరొక పెద్ద వింటిని చేతబట్టి, మేఘం జలధారలను కురిసినట్లు తీక్ష్ణబాణవృష్టిని కురిపించాడు. భారతా! ఆ తరువాత అశ్వత్థామ బంగారు రెక్కలు గలిగి శత్రువులను చంపగల వ్యోమగాములైన బాణాలను రాక్షసునిపై ప్రయోగించాడు. విశాల వక్షఃస్థలాలు గల ఆ రాక్షససేన ఆ బాణాల తాకిడికి కలతపడి, సింహాల దాడికి కలతపడిన మదపుటేనుగుల సమూహం వలె ప్రకాశించింది. పరమాత్మ ప్రళయకాలంలో ప్రాణులను దగ్ధం చేసినట్లు

అశ్వత్థామ గుర్రాలు, సారథులు, రథాలు, ఏనుగులతో సహా బాణాలతో రాక్షసులను భస్మం చేయసాగాడు. రాజా! బాణాలతో అశ్వత్థామ ఒక అక్షౌహిణి సంఖ్యగల రాక్షససేనను దహించి, త్రిపురాలను దహించిన ఆదిదేవుడైన మహేశ్వరుని వలె విరాజిల్లాడు. అశ్వత్థామ ప్రళయకాలంలో సంవర్తకాగ్ని సర్వప్రాణులను దహించినట్లు నీ శత్రువులను దహించి విరాజిల్లాడు. ఘటోత్కచుడు క్రుద్ధుడై "అశ్వత్థామను చంపండి" అని ఆ విశాలరాక్షససేనను ఆదేశించాడు. ఘటోత్కచుని ఆ ఆదేశాన్ని రాక్షసులు శిరసా వహించారు. కోరపళ్ళతో ప్రకాశిస్తూ పెద్దముఖాలతో, ఘోరరూపంతో, భీకరమైన నాలుకలతో, తెరిచిన నోళ్ళతో, కోపంతో ఎర్రబడ్డ కళ్ళతోనున్న ఆ రాక్షసులు మహా సింహనాదాలతో భూమిని ప్రతిధ్వనింపజేస్తూ, వివిధాయుధాలను ధరించి, అశ్వత్థామను చంపటానికి వచ్చారు.

ఆ రాక్షసులు కోపంతో కన్నెర్రజేసి నిర్భయంగా శక్తులను, శతఘ్నులను, పరిఘలను, అశనులను, శూలాలను, పట్టిశాలను, కత్తులను, గదలను, భిందిపాలాలను, రోకళ్ళను, గొడ్డళ్ళను, ప్రాసాలను, కటారులను, తోమరాలను, కణపాలను, కంపనాలను, పెద్దపెద్ద రాళ్ళను, భుశుండులను, గదలను, ఉక్కుకడ్డీలను, శత్రువులను చీల్చగల ముద్గరాలను రణభూమిలో వందలు వేలుగా అశ్వత్థామపై విసిరారు. అశ్వత్థామపై పడుతున్న ఆ మహా శస్త్రవృష్టిని చూసి, నీ సైనికులంతా వ్యథచెందారు. అశ్వత్థామ పరాక్రమించి, వజ్రసదృశాలయిన బాణాలతో భీకరంగా వ్యాపించిన ఆ అస్త్రవృష్టిని ధ్వంసం చేశాడు. అశ్వత్థామ బంగారు రెక్కలు కలిగి దివ్యాస్త్రాలతో మంత్రింపబడిన ఇతర బాణాలతో వేగంగా రాక్షసులను కొట్టాడు. విశాల వక్షఃస్థలాలు గల ఆ రాక్షస సమూహం అశ్వత్థామ బాణాలచే పీడింపబడి, సింహాలవలన కలతబడిన మదపుటేనుగుల గుంపువలె భాసించింది. మహాబలులయిన ఆ రాక్షసులు అశ్వత్థామచే దెబ్బలు తిని, తీవ్రకోపంతో అశ్వత్థామను చంపాలని మీది కురికారు. భారతా! అక్కడ సర్వప్రాణులలోనూ ఎవ్వరికీ వీలుకాని రీతిగా అశ్వత్థామ అద్భుత పరాక్రమాన్ని ప్రదర్శించాడు. మహాస్త్రవేత్త అయిన అశ్వత్థామ ఒంటరిగా క్షణంలో ప్రజ్వలించే బాణాలతో ఘటోత్కచుడు చూస్తుండగానే రాక్షససేనను దగ్ధం చేశాడు. భారతా! పాములవలెనున్న బాణాలతో రాక్షససేనను అశ్వత్థామ సంహరిస్తుంటే, పాండవుల పక్షాన ఉన్న వేలకొలది రాజులలో ఒక్కడు కూడా అశ్వత్థామవైపు చూడలేకపోయారు. వీరుడు, మహాబలుడు, రాక్షసరాజు అయిన ఘటోత్కచుడు మాత్రమే మినహాయింపు.

ఘటోత్కచుడు మాత్రం కోపంతో కళ్ళు త్రిప్పుతూ చేతులు చరిచి, పెదవి కొరికి "అశ్వత్థామ వైపు రథాన్ని నడుపు" అని తన రథసారథితో అన్నాడు. ఆ ఘటోత్కచుడు విరాజిల్లే పతాకంగల భీకరరథంపై మరల అశ్వత్థామతో ద్వైరథయుద్ధం చేయటానికి వెళ్ళాడు. భీకర పరాక్రమంగల ఆ ఘటోత్కచుడు సింహంవలె పెద్దగా గర్జించి, దేవనిర్మితమై,

ఎనిమిది గంటలు గల మహాదారుణమైన అశనిని గిరగిర త్రిప్పి, అశ్వత్థామపైకి విసిరాడు. అశ్వత్థామ తన ధనుస్సును రథంపైపెట్టి, ఆ అశనిని పట్టుకొని, దానినే ఘటోత్కచునిపైకి విసిరాడు. దానితో ఘటోత్కచుడు రథంమీది నుండి దూకాడు. మహాదారుణమైన ఆ అశని గుర్రాలు, రథసారథి, ధ్వజాలతో సహా ఆ రథాన్ని భస్మం చేసి, నేలను చీల్చుకొని వెళ్ళింది. శంకరనిర్మితమయిన ఆ భీకరాశనిని ఎగిరిపట్టుకొన్న ఆ అశ్వత్థామ చేష్టను చూసి, సర్వప్రాణులు అభినందించాయి. రాజా! ఆ తరువాత ఘటోత్కచుడు ధృష్టద్యుమ్నుని రథం దగ్గరకు పోయి, ఇంద్రాయుధంవలె మహా ఘోరధనుస్సును తీసికొని మరల అశ్వత్థామ ఛాతీపై పదునైన బాణాలను ప్రయోగించాడు. ధృష్టద్యుమ్నుడు కూడా తడబాటు లేకుండా బంగారు రెక్కలు గలిగి పాములవలెనున్న బాణాలను అశ్వత్థామ ఛాతీపై ప్రయోగించాడు. ఆపై అశ్వత్థామ వారిపై వేలకొలదిగా బాణాలను వేశాడు. వారిద్దరూ అగ్నిజ్వాలల వంటి బాణాలతో అశ్వత్థామ విడిచిన బాణాలను ఖండించివేశారు. భరతర్షభా! ఆ పురుష సింహులకు, అశ్వత్థామకు మధ్య యోధుల కందరికీ ప్రీతిని కలిగిస్తూ అతితీవ్రంగా మహా సంగ్రామం జరిగింది.

ఆ సమయంలో వేయి రథాలతో, మూడువందల ఏనుగులతో, ఆరువేల గుర్రాలతో భీముడు అక్కడకు వచ్చాడు. ఆపై సులువుగా విక్రమించగల అశ్వత్థామ ఘటోత్కచునితో, ధృష్టద్యుమ్నునితో పోరాడాడు. భారతా! అక్కడ సర్వప్రాణులతోనూ ఎవ్వరికీ వీలుకాని రీతిగా అశ్వత్థామ మహాద్భుత పరాక్రమాన్ని ప్రదర్శించాడు. రెప్పపాటు కాలంలో గుర్రాలు, సారథులు, రథాలు, ఏనుగులతో సహా అక్షౌహిణి సంఖ్యగల రాక్షస సేనను పదునైన బాణాలతో సంహరించాడు. భీమసేనుడు, ఘటోత్కచుడు, ధృష్టద్యుమ్నుడు, నకుల సహదేవులు, ధర్మరాజు, అర్జునుడు, కృష్ణుడు చూస్తుండగానే అదంతా జరిగింది. సూటిగా దూసుకొని వచ్చిన బాణాలచే గాఢంగా దెబ్బతిన్న ఏనుగులు శిఖరాలుగల పర్వతాలవలె నేలబడ్డాయి. ఏనుగుల తొండాలు తెగి, ఇటూ అటూ ఎగిరిపడుతూ రణరంగమంతా వ్యాపించాయి. అది పాములు ప్రాకుతున్నట్లు కనిపించింది. బంగారు దండాలు గల రాజులగొడుగులు చెదురు మదురుగా పడి ఉన్నాయి. వాటితో రణరంగం ప్రళయకాలంలో సూర్య, చంద్ర, నక్షత్రాలతో కూడిన గగనతలం వలె కనిపించింది. అశ్వత్థామ ఆ రణభూమిలో రక్తనదిని ప్రవహింపజేశాడు. అది రక్తప్రవాహంతో మహాభయంకరంగా ఉంది. విరిగిపడిన ధ్వజాలే మండూకాలు, రణభేరులే తాబేళ్ళు. గొడుగులే హంసలు. చామరసమూహాలే నురుగులు. డేగలు, గ్రద్దలే మొసళ్ళు. వివిధాయుధాలే చేపలు, పెద్దగజాలే పాషాణాలు. చనిపోయిన గుర్రాలే మకరాలు. విరిగిపడిన రథాలే దిబ్బలు. పతాకలే అందమైన చెట్లు, బాణాలే చేపలు. ప్రాసాలు, శక్తులు, ఋష్టులే

డుండుభసర్పాలు. క్రొవ్వు, మాంసాలే బురద. తేలుతున్న శవాలే తెప్పలు. కేశాలే నాచు. అది మహాఘోరమై, పిరికివారికి భయాన్ని కలిగిస్తోంది. ఏనుగులు, గుర్రాలు, సైనికుల శరీరాల వినాశనం నుండి అది పుట్టింది. యోధుల ఆర్తనాదాలే ఆ నది గలగలలు. నెత్తుటి అలలు దానిలో ఎగిసిపడుతున్నాయి. క్రూరజంతువులతో అది మహాఘోరంగా ఉన్నది. అది యమరాజ్య మనే సముద్రంవైపు సాగుతోంది. అశ్వత్థామ బాణాలతో రాక్షసులను చంపి, ఘటోత్కచుని బాధించాడు. మరల తీవ్రకోపంతో అశ్వత్థామ బాణ సమూహాలతో భీమసేన, ధృష్టద్యుమ్నులతో సహా పాండవులను గాయపరిచి, సురథుడనే ద్రుపద కుమారుని చంపివేశాడు. ఆపై రణభూమిలో ద్రుపదకుమారులయిన శత్రుంజయుని, బలానీకుని, జయానీకుని, జయాశ్వని కూడా చంపివేశాడు. శ్రుతాహ్వాయుడనే పేరుగల రాజును కూడా అశ్వత్థామ యమసదనానికి పంపాడు. మారిషా! మరోమాడు బాణాలతో హేమమాలిని, పృషధ్రుని, చంద్రసేనుని కూడా చంపాడు. కుంతి భోజుని కొడుకులను పదిమందిని కూడా పదిబాణాలతో సంహరించాడు.

తరువాత అశ్వత్థామ తీవ్రకోపంతో సూటిగా వెళ్ళగల, యమదండంవంటి మరొక గొప్ప భీకర బాణాన్ని వింటిపై సంధించి, చెవిదాగా లాగి, ఘటోత్కచుని మీదకు గురిపెట్టి వేగంగా విడిచాడు. రాజా! మంచి రెక్కలు గల ఆ గొప్ప బాణం ఆ రాక్షసుని హృదయాన్ని చీల్చి, వేగంగా నేలలో గ్రుచ్చుకొంది. రాజేంద్రా! ఘటోత్కచుడు దెబ్బతిని పడటాన్ని గమనించి, మహారథుడైన ధృష్టద్యుమ్నుడు ఆ రథాన్ని అశ్వత్థామ నుండి దూరంగా తీసికొనిపోయాడు. ఆ తరువాత యుధిష్ఠిరుని సైన్యమంతా యుద్ధవిముఖమైంది. ఆ సేనను ఓడించి వీరుడైన అశ్వత్థామ సింహనాదం చేశాడు. సర్వప్రాణులు, నీకుమారులు కూడా అశ్వత్థామను ప్రశంసించారు. ఆపై వందలబాణాలవల్ల శరీరాలు తెగి, చచ్చి పడియున్న రాక్షసులచే ఆవరింపబడిన ఆ రణభూమి కొండశిఖరాలచే ఆవరింపబడినట్లు భీకరంగా, దుర్గమంగా కనిపించింది. ఆ అశ్వత్థామను సిద్ధులు, గంధర్వులు, పిశాచ సమూహాలు, నాగులు, సుపర్ణులు, పితరులు, పక్షులు, రాక్షసగణాలు, భూతగణాలు, అచ్చరలు, దేవతలు - అందరూ ప్రశంసించారు."

157. ద్రోణ యుధిష్ఠిరయుద్ధము

సంజయుడిలా చెప్తున్నాడు. "ద్రుపదుని కొడుకులను, కుంతిభోజుని కొడుకులను, వేలకొలది రాక్షసులను అశ్వత్థామ చంపటం చూసి యుధిష్ఠిరుడు, భీమసేనుడు, ధృష్టద్యుమ్నుడు, యుయుధానుడు యుద్ధం మీదనే మనస్సుపెట్టి సంసిద్ధులయ్యారు. సోమదత్తుడు రణభూమిలో సాత్యకిని చూసి, మరల క్రుద్ధుడై తీవ్రశరవృష్టితో కప్పివేశాడు.

ఆ తరువాత విజయాన్ని కోరుతున్న నీవారికీ, శత్రువులకు మధ్య భయవర్ధకమైన తీవ్ర యుద్ధం జరిగింది. సోమదత్తుని రాకను గమనించి, భీమసేనుడు సాత్యకికి సహాయపడుతూ బంగారు రెక్కలు గలిగి, సానపై పదునెక్కిన బాణాలతో సోమదత్తుని గాయపరిచాడు. సోమదత్తుడు కూడా వందబాణాలతో వీరుడైన సాత్యకిని తిరిగి, గాయపరిచాడు. సాత్యకి కూడా తీవ్రకోపంతో వజ్రాన్ని కూడా పగలగొట్టగల పది తీక్ష్ణ బాణాలతో పుత్రశోకంలో మునిగి, నహుషనందనుడైన యయాతివలె వార్ధక్య లక్షణాలతో కూడియున్న వృద్ధుని - సోమదత్తుని గాయపరిచాడు. సాత్యకి శక్తితో సోమదత్తుని చీల్చి, మరల ఏడు బాణాలతో గాయపరిచాడు. ఆపై సాత్యకికి సహకరిస్తూ భీమసేనుడు కూడా ఘోరమై, దృఢమైన నూతన పరిఘను సోమదత్తుని తలపై విసిరాడు. సాత్యకి కూడా కోపంతో అగ్నిలా ప్రజ్వరిల్లే పదునైన గొప్ప బాణాన్ని, సోమదత్తుని ఛాతీపై ప్రయోగించాడు. భీముడు విడిచిన పరిఘ, సాత్యకి విడిచిన బాణం ఘోరంగా ఒకేసారి సోమదత్తుని శరీరంపై పడ్డాయి, ఆ మహారథుడు పడిపోయాడు. తనకొడుకు మూర్ఛిల్లగానే బాహ్లీకుడు వర్షర్తువులో కురిసే మేఘంలాగా శరవృష్టిని కురిపిస్తూ, సాత్యకి మీదకు వచ్చాడు. ఆపై భీముడు సాత్యకికి సహకరిస్తూ, బాహ్లీకుని బాధిస్తూ, తొమ్మిది బాణాలతో అతనిని గాయపరిచాడు. ప్రతీవుని కొడుకు అయిన బాహ్లీకుడు తీవ్రకోపంతో, భీముని ఛాతీపై శక్తిని గ్రుచ్చాడు. ఆ రీతిగా దెబ్బతిన్న ఆ భీముడు వణికిపోయాడు. మూర్ఛిల్లాడు. మరల తేరుకొన్న ఆ బలిష్ఠుడు బాహ్లీకునిపైకి గదను విసిరాడు. భీమసేనుడు విసిరిన ఆ గద బాహ్లీకుని శిరస్సును ఖండించింది. మరణించిన ఆ బాహ్లీకుడు వజ్రపుదెబ్బతిన్న పర్వతంవలె నేలబడ్డాడు.

బాహ్లీకుడు మరణించగా నీ కుమారులు పదిమంది భీముని పీడించసాగారు. ఆ పదిమంది - నాగదత్తుడు, దృఢరథుడు, మహాబాహువు, అయోభుజుడు, దృఢుడు, సుహస్తుడు, విరజుడు, ప్రమాధి, ఉగ్రుడు, అనుయాయి. వారిని చూసి భీముడు కోపించాడు. కార్యభారాన్ని నిర్వహించగల పది బాణాలను చేతబట్టాడు. ఒక్కొక్కరిపై ఒక్కొక్కటిగా వారి మర్మస్థలాలపై ప్రయోగించాడు. అలా గాయపడినవారు పెనుగాలికి నిర్మూలమై, పర్వతం మీదనుండి చెట్లు పడినట్లు తేజస్సు కోల్పోయి, మరణించి, రథాలమీదనుండి పడిపోయారు. భీముడు పది బాణాలతో నీ కొడుకులను చంపి, కర్ణుని ప్రియపుత్రుడైన వృషసేనునిపై బాణవృష్టిని కురిపించాడు. ఆపై లోకప్రసిద్ధిచెందిన కర్ణుని సోదరుడు, బలిష్ఠుడు అయిన వృకరథుడు భీముని బాణాలతో కొట్టి, గాయపరిచాడు. భారతా ! వీరుడైన భీమసేనుడు నీ బావమరదులలో ఏడుగురిని బాణాలతో కొట్టి, శతచంద్రుని కూడా చంపివేశాడు. శతచంద్రుని మరణాన్ని సహింపలేక, శకుని సోదరులైన అయిదుగురు మహారథులు - గవాక్షుడు, శరభుడు, విభుడు, సుభగుడు, భానుదత్తుడు భీమసేనునిపై

దాడిచేసి, తీక్ష్ణమైన బాణాలతో కొట్టారు. వర్షం పైబడుతున్న కొండలా బలిష్ఠమైన ఆ భీమసేనుడు బాణాల దెబ్బలు తింటూ, ఆ అయిదుగురు అతిరథులను అయిదు బాణాలతో చంపాడు. ఆ వీరులు మరణించటం చూసి రాజశ్రేష్ఠ లందరూ చలించిపోయారు.

అనఘా! ఆ పై యుధిష్ఠిరుడు క్రుద్ధుడై ద్రోణుడు, నీ కొడుకులు చూస్తుండగానే నీ సేనను సంహరించాడు. యుధిష్ఠిరుడు క్రుద్ధుడై రణభూమిలో అంబష్ఠమాలవ, త్రిగర్త, శిబిదేశీయ వీరులను మృత్యులోకానికి పంపించాడు. అభీషహ, శూరసేన, బాహ్లీక, సవసాతిక దేశీయ యోధులను చంపి, యుధిష్ఠిరుడు రణభూమిని నెత్తుటి బురదగా చేశాడు. రాజా! యుధిష్ఠిరుడు తన బాణాలతో యౌధేయ, మాలవ, మద్రక గణాల శూరులను రణభూమిలో మృత్యులోకానికి పంపించాడు. "చంపండి! తీసికొని రండి! పట్టుకోండి! గాయపరచండి! నరికివెయ్యండి" మొదలయిన భీకర శబ్దాలు యుధిష్ఠిర రథం దగ్గర వినిపిస్తున్నాయి. కౌరవసేనను పారద్రోలుతున్న యుధిష్ఠిరుని చూసి, ద్రోణుడు నీ కుమారుని ప్రేరణతో ఆయనపై బాణవృష్టిని కురిపించాడు. తీవ్రకోపంతో, వాయవ్యాస్త్రంతో యుధిష్ఠిరుని గాయపరిచాడు. యుధిష్ఠిరుడు కూడా ద్రోణుని దివ్యాస్త్రాలను తన అస్త్రంతో నాశనం చేశాడు. వాయవ్యాస్త్రం నశించగానే ద్రోణుడు పరమ కోపంతో పాండుకుమారుడైన యుధిష్ఠిరుని చంపగోరి, వారుణాస్త్రాన్ని, యామ్యాస్త్రాన్ని, ఆగ్నేయాస్త్రాన్ని, త్వాష్ట్రాస్త్రాన్ని, సావిత్రాస్త్రాన్ని ప్రయోగించాడు. మహాబాహువైన ధర్మజుడు ద్రోణుడు ప్రయోగించిన, ప్రయోగిస్తున్న ఆ అస్త్రాలను నిర్భయంగా తన అస్త్రాలతో నశింపజేశాడు. భారతా! ద్రోణుడు నీ కుమారుని హితంపై ఆసక్తితో తనప్రతిజ్ఞను వాస్తవం చేయదలచి, యుధిష్ఠిరుని చంపదలచి, ఐంద్రాస్త్రాన్ని, ప్రాజాపత్యాస్త్రాన్ని ధర్మజునిపై ప్రయోగించాడు. చెదరని తేజస్సు గల యుధిష్ఠిరుడు మహేంద్రాస్త్రాన్ని ప్రయోగించి, ద్రోణుడు ప్రయోగించిన దివ్యాస్త్రాలను నశింపజేశాడు.

తన అస్త్రాలన్నీ నశింపగా క్రోధంతో నిండిన ద్రోణుడు యుధిష్ఠిరుని చంపదలచి, బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించాడు. రాజా! దానితో గాఢాంధకారం వ్యాపించగా రణభూమిలో ఏమీ తెలియలేదు. సమస్త ప్రాణులు తీవ్రభయానికి లోనయ్యాయి. రాజేంద్రా! బ్రహ్మాస్త్రం ఉద్యమించటం చూసి, యుధిష్ఠిరుడు బ్రహ్మాస్త్రంతోనే దానిని నివారించాడు. ఆ తరువాత సర్వ యుద్ధవిశారదులు అయిన ద్రోణయుధిష్ఠిరులను ప్రధాన సైనికు లందరూ ప్రశంసించారు. ఆపై ద్రోణుడు యుధిష్ఠిరుని వీడి, కోపంతో కన్నెర్రజేసి, ద్రుపదుని సేనను వాయవ్యాస్త్రంతో సంహరించసాగాడు. ద్రోణునిచే దెబ్బలు తిన్న పాంచాలురు భీమార్జునులు చూస్తుండగానే భయంతో పారిపోయారు. ఆ వెంటనే అర్జునభీమసేనులు పెద్ద రథసేనతో తమసేనలను మరలిస్తూ, వేగంగా అటు వెళ్ళారు. అర్జునుడు దక్షిణంవైపు, భీమసేనుడు ఉత్తరం వైపు

మహాశర సమూహాలను ద్రోణునిపై కురిపించారు. మహారాజా! కేకయులు, సృంజయులు, మహాతేజస్సు గల పంచాలురు, మత్స్యదేశీయులు, వృష్ణివంశస్థులతో కూడి భీమార్జునులను అనుసరించారు. ఆపై కిరీటిచే దెబ్బతిన్న కౌరవసేన చీకటి, నిదురలవలన బాధకు గురియై మరలా చెదరిపోయింది. మహారాజా! ద్రోణుడు, స్వయంగా నీ కొడుకు దుర్యోధనుడు ఆ యోధులను ఆపే ప్రయత్నం చేసినా, అప్పుడు నివారించలేకపోయారు."

158. కృప కర్ణసంవాదము

"రాజా! పాండవుల మహాబలం విజృంభించటం చూసి, దానిని భరించటం కష్టమని భావించి దుర్యోధనుడు కర్ణునితో ఇలా అన్నాడు. "మిత్రవత్సలా! మిత్రులు మైత్రీధర్మాన్ని పాటించవలసిన సమయమాసన్నమైనది. కర్ణా! రణభూమిలో క్రోధంతో నిండి పాములవలె బుసకొడుతూ పాంచాలురు, మత్స్యదేశీయులు, కేకయులు, పాండవులు మన వారిని చుట్టుముట్టారు. మహారథులైన మనయోధులనందరినీ రక్షించు. ఇదిగో! విజయంతో వెలుగొందుతున్న పాండవులు, ఇంద్రపరాక్రమం గల ఎందరో పాంచాల మహారథులు పరమహర్షంతో సింహనాదాలు చేస్తున్నారు." కర్ణుడిలా అన్నాడు. "దేవేంద్రుడే అర్జునుని రక్షించటానికి వచ్చినా ఆ ఇంద్రుని కూడా ఓడించి ఆపై అర్జునుని చంపుతాను. భారతా! సత్యప్రమాణంగా చెపుతున్నాను. ఊరడిల్లు. పాండవులను, వారికి తోడువచ్చిన పాంచాలురను చంపుతాను. కార్తికేయుడు తారకుని సంహరించి ఇంద్రునకు గెలుపునందిచ్చినట్లు నీకు విజయాన్ని అందిస్తాను. రాజా! నీకు ఇష్టమైన పని చేయాలనే నేను బ్రతుకుతున్నాను. పాండవులందరిలో మిక్కిలి బలవంతుడు అర్జునుడే. దేవేంద్రుడిచ్చిన శక్తిని అర్జునునిపై ప్రయోగిస్తాను. మేటివిలుకాడైన అర్జునుడు చనిపోతే అతని సోదరులు నీకు లొంగుతారు. లేదా మరల అరణ్యాలకు పోతారు. కురుకుమారా! నేను బ్రతికియుండగా నీవు ఎప్పుడూ బాధ పడవద్దు. యుద్ధంలో అనుచరులతో సహా పాండవులనందరినీ నేను గెలుస్తాను. పాంచాలురను, కేకయులను, వృష్ణివంశీయులను, వారి అనుచరులను బాణసమూహాలతో ముక్కలు చేసి నీకు రాజ్యాన్ని అందిస్తాను." సంజయుడిలా చెప్తున్నాడు.

"కర్ణుడిలా చెప్తుండగా కృపుడు నవ్వుతూ కర్ణునితో ఇలా అన్నాడు. 'కర్ణా! మాటలతోనే పని జరిగేటట్లయితే నీ సహాయంతో దుర్యోధనునికి గతి దొరికినట్టే. కర్ణా! దుర్యోధనుని ముందు చాలా ప్రగల్భిస్తున్నావు. నీ పరాక్రమం కానీ, దాని ఫలం కానీ ఏదీ కనిపించదు. సూతనందనా! రణభూమిలో చాలాసార్లు పాండవులతో నీవు పోరాడావు. కానీ అన్నిమార్లు పాండవులు నిన్ను ఓడించారు. కర్ణా! గతంలో గంధర్వులు దుర్యోధనుని

బంధించి కొనిపోతున్నప్పుడు సేనలన్నీ యుద్ధం చేశాయి. అయితే అందరికన్నా ముందు పారిపోయినది నీవే. విరాట నగరంలో కూడా కౌరవులందరూ ఒక్కటై కూడా యుద్ధంలో పాండవులచేతిలో ఓడిపోయారు. కర్ణా! నీవు కూడా సోదరులతో సహా ఓడిపోయావు. రణరంగంలో ఒక్క అర్జునునకు కూడా నీవు చాలవు. కానీ కృష్ణునితో సహా సర్వపాండవులను జయించాలని ఉత్సాహపడుతున్నావెందుకు ? సూతజా! కర్ణా! మాటలు మాని యుద్ధం చేయి. చాలా ప్రగల్భిస్తున్నావు. మాటలు చెప్పకుండా పరాక్రమించటమే సత్పురుషుల వ్రతం. సూతపుత్రా! శరత్కాలమేఘంలా నిష్ఫలంగా ఉరుముతున్నావు. కర్ణా! అది దుర్యోధనునికి తెలియటం లేదు. రాధేయా! అర్జునుని చూసే దాకా ఎంతసేపైనా గర్జించు. అర్జునుని దగ్గరగా చూసిన తరువాత ఇక నీ గర్జనలుండవు. అర్జునుని బాణాలను ఇంకా ఎదుర్కొనలేదు కాబట్టి గర్జిస్తున్నావు. అర్జునుని బాణాలతో గాయపడిన తరువాత నీవు గర్జించలేవు. క్షత్రియులు బాహుబలశూరులు, బ్రాహ్మణులు వాచా శూరులు. అర్జునుడు వింటితో శూరుడు, కర్ణుడు మనోరథాలలో శూరుడు, రుద్రుని కూడా మెప్పించిన అర్జునుని ఎవడు త్రిప్పి కొట్టగలడు.'

కృపాచార్యుడు అలా పలకగానే యోధులలో శ్రేష్ఠుడైన కర్ణుడు కోపించి, కృపునితో ఇలా అన్నాడు. 'శూరులు వర్షాకాలమేఘాలవలె ఎప్పుడు గర్జిస్తూనే ఉంటారు. సకాలంలో విత్తిన గింజలాగా వెంటనే ఫలితాన్ని కూడా ఇస్తారు. శూరులు రణప్రాంగణంలో ఆత్మప్రశంస చేసికొంటూ మాట్లాడటంలో నాకు తప్పు కనిపించటం లేదు. వారు రణభారాన్ని కూడా మోస్తారు. పురుషుడు భారాన్ని మోయటానికి మనసా సిద్ధపడితే అక్కడ అతనికి దైవం కూడా తప్పక సహాయానికి వస్తుంది. నేను మనసా ఏ భారాన్ని మోయదలచుకొన్నానో దానికై ప్రయత్నం కూడా చేస్తున్నాను. విప్రా! నేను పాండవులను, కృష్ణునితో, వృష్ణివంశీయులతో సహా సంహరించి, గర్జిస్తే నీకేం నష్టం. శరత్కాలమేఘాలవలె వ్యర్థంగా శూరులు గర్జించరు. పండితులు తమ సామర్థ్యాన్ని తెలిసికొనినతరువాతనే గర్జిస్తారు. అటువంటి నేను గౌతమా! నేడు యుద్ధానికి సన్నద్ధులైయున్న కృష్ణార్జునులను జయించాలని మనసా ఉత్సాహపడుతున్నాను. అందుకే గర్జిస్తున్నాను. విప్రా! ఈ గర్జనకు ఫలితాన్ని విను. యుద్ధంలో పాండుకుమారులను కృష్ణునితో, వృష్ణివంశీయులతో, అనుచరులతో సహా చంపి, నిష్కంటకమైన ఈ రాజ్యాన్ని దుర్యోధనునకు సమర్పిస్తాను.'

కృపుడిలా అన్నాడు. 'సూతజా! నీ మనోరథ ప్రలాపాలను నేను స్వీకరించను. ధర్మరాజును, కృష్ణార్జునులను ఎప్పుడూ ఆక్షేపిస్తుంటావు. కర్ణా! యుద్ధవిశారదులైన ఆ కృష్ణార్జునులున్న వైపే గెలుపు. ఇది నిశ్చయం. దేవతలు, గంధర్వులు, యక్షులు, మనుష్యులు,

నాగులు, రాక్షసులు, కవచాలు ధరించివచ్చినా యుద్ధంలో కృష్ణార్జునులను గెలవలేరు. ధర్మపుత్రుడైన యుధిష్ఠిరుడు బ్రాహ్మణ భక్తుడు, సత్యవాక్కుడు, దాంతుడు, గురుదేవతా పూజకుడు, నిత్యమూ ధర్మాసక్తుడు, విశేషించి అస్త్రవిద్యనెరిగినవాడు, ధీరుడు, కృతజ్ఞుడు. ఆయన సోదరులు కూడా బలవంతులు, సర్వాస్త్ర నిపుణులు, పెద్దలయెడ గౌరవం గలవారు, ప్రాజ్ఞులు, ధర్మ తత్పరులు, కీర్తిమంతులు. పాండవుల సంబంధీకులు కూడా ఇంద్రునితో సమానమైన పరాక్రమవంతులు. పాండవులపై బాగా ఇష్టం కలవారు, చక్కగా దెబ్బతీయగలవారు. వారు – ధృష్టద్యుమ్నుడు, శిఖండి, దుర్ముఖి కొడుకు జనమేజయుడు, చంద్రసేనుడు, రుద్రసేనుడు, కీర్తిధర్ముడు, ధ్రువుడు, ధరుడు, వసుచంద్రుడు, దామచంద్రుడు, సింహచంద్రుడు, సుతేజుడు, ద్రుపదుని కొడుకులు, మహాస్త్రవేత్త అయిన ద్రుపదుడు. ఆ పాండవులకోసం తన సోదరులైన శతానీక, సూర్యదత్త, శ్రుతానీక, శ్రుతధ్వజ, బలానీక, జయానీక, జయాశ్వ, రథవాహన, చంద్రోదయ, సమరథులతో కూడి మత్స్యరాజు విరాటుడు, నకుల సహదేవులు, ద్రౌపది కొడుకులు, రాక్షసుడైన ఘటోత్కచుడు – వీరంతా యుద్ధం చేయటానికి సిద్ధమై ఉన్నారు. ఇక పాండవులకు వినాశం లేదు.

పాండుకుమారుడైన యుధిష్ఠిరునకు ఇవే కాక ఇంకా ఎన్నో గుణాలున్నాయి. భీమార్జునులు తలచుకొంటే దేవతలు, అసురులు, మనుష్యులు, యక్షులు, రాక్షసగణాలు, భూతాలు, పాములు, ఏనుగులతో సహా ఈ జగత్తునంతా తమ అస్త్రబలంతో నాశనం చేయగలరు. యుధిష్ఠిరుడు కూడా తీవ్రమైన చూపుతో భూమండలాన్ని దహించగలడు. అప్రమేయబలుడైన కృష్ణుడు పాండవుల కోసం కవచాన్ని ధరించి, సిద్ధంగా ఉన్నాడు. కర్ణా! అటువంటి శత్రువులను యుద్ధంలో జయించాలని ఎలా ఉత్సాహపడుతున్నావు ? సూతజా! ఎప్పుడూ నీవు రణభూమిలో కృష్ణునితో యుద్ధం చేయాలనుకొంటున్నావు. ఇది చాలా అవినీతి.' కృపుడు అలా అనగానే కర్ణుడు నవ్వుతూ గురువుతో ఇలా అన్నాడు. 'బ్రాహ్మణా! పాండవులను గూర్చి సత్యవచనాన్నే చెప్పావు. ఇవి, ఇంకా ఎన్నో గుణాలు పాండవులలో ఉన్నాయి. దేవేంద్రునితో, దైత్యులతో, యక్షులతో, గంధర్వులతో, పిశాచులతో, నాగులతో, రాక్షసులతో కూడిన దేవతలకైనా పాండవులు గెలువ వీలుకాని వారే. అయినా దేవేంద్రుడిచ్చిన ఈ శక్తితో పాండవులను గెలుస్తాను. బ్రాహ్మణా! ఈ అమోఘశక్తిని ఇంద్రుడు నాకు ఇచ్చాడు. దీనితో యుద్ధంలో అర్జునుని చంపుతాను. అర్జునుడు చనిపోతే అతడు లేకుండా అతని సోదరులు ఈ రాజ్యాన్ని ఏ రీతిగానూ అనుభవించలేరు. గౌతమా! వారంతా అలా నశించిపోతే సాగరాలతో సహా ఈ భూమి అప్రయత్నంగానే దుర్యోధనునికి లొంగి ఉంటుంది. **ఈ లోకంలో చక్కని రీతిలో ప్రయత్నిస్తే అన్ని పనులు సిద్ధిస్తాయి.** ఈ విషయంలో అనుమానం లేదు. అది తెలుసు కాబట్టి నేను

గర్జిస్తున్నాను. నీవు బ్రాహ్మణుడవు, వృద్ధుడవు, యుద్ధం చేయలేనివాడవు. పాండవులతో ఒకప్పుడు మైత్రి నెరపినవాడవు. అందువలన మోహానికి లోనై నన్ను అవమానిస్తున్నావు. దుర్మతీ! అయినా నీవిలా నాకు అప్రియంగా మాటాడుతుంటే కత్తినెత్తి నీ నాలుకను కోసివేస్తాను. విప్రా! కౌరవసేనలనన్నింటినీ భయపెడతూ, రణభూమిలో పాండవులను ప్రశంసిస్తున్నావు గదా! ఈ విషయంలో కూడా ఉన్నదున్నట్టు చెపుతాను. నా మాట విను.

దుర్యోధనుడు, ద్రోణుడు, శకుని, దుర్ముఖుడు, జయుడు, దుశ్శాసనుడు, వృషసేనుడు, మద్రరాజు శల్యుడు, నీవు, సోమదత్తుడు, భూరి, అశ్వత్థామ, వివింశతి - వీరంతా యుద్ధవిశారదులు. వీరు కవచాలు ధరించి నిలిస్తే, దేవేంద్రతుల్యుడయినా సరే! ఏ శత్రువు వీరిని జయించ గలడు ? శూరులు, అస్త్రవిద్యానిపుణులు, బలవంతులు, వీరస్వర్గాన్ని కోరేవారు, ధర్మజ్ఞులు, యుద్ధకుశలులు అయిన వీరంతా యుద్ధంలో దేవతలనైనా చంపగలరు. వీరంతా పాండవుల వధను, దుర్యోధనుని విజయాన్ని ఆకాంక్షిస్తూ, కవచాలు ధరించి రణభూమిలో నిలుస్తారు. ఎంత బలవంతులకయినా గెలుపు దైవాధీనమనే నేను భావిస్తున్నాను. అందుకే మహాబాహువయిన భీష్ముడు కూడా వందల బాణాల దెబ్బలు తిని, పడి ఉన్నాడు. వికర్ణుడు, చిత్రసేనుడు, బాహ్లీకుడు, జయద్రథుడు, భూరిశ్రవసుడు, జయుడు, జలసంధుడు, సుదక్షిణుడు, రథికశ్రేష్ఠుడైన శలుడు, పరాక్రమశాలి అయిన భగదత్తుడు వీరు ఇతర రాజులు కూడా దేవతలకు కూడా గెలువరానివారు. పురుషాధమా! బలవత్తరులయిన ఈ శూరులెందరో యుద్ధంలో పాండవులచేతిలో చనిపోయారు. దైవఘటన కాక దీనికి కారణమేమనుకొంటున్నావు ? ద్విజా! దుర్యోధనుని శత్రువులయిన ఆ పాండవులను ఎప్పుడూ స్తుతిస్తున్నావు. కాని వారిసేనలోని శూరులు కూడా వందలు, వేలుగా చనిపోయారు గదా ! కౌరవపాండవులిద్దరి సేనలూ నశించిపోతున్నాయి. ఏ రీతిగానూ ఇది పాండవుల ప్రభావమని నేను భావించటం లేదు. ద్విజాధమా! వారిని బలవంతులని నీవు ఎప్పుడూ అనుకొంటున్నావు. దుర్యోధనుని హితాన్ని కోరి, ఆ పాండవులతో యథాశక్తిగా యుద్ధం చేయటానికి నేను ప్రయత్నిస్తాను. గెలుపు దైవాధీనం."

159. దుర్యోధన వచనము

సంజయుడిలా చెప్తున్నాడు. "తన మేనమామతో (కృపునితో) కర్ణుడు అలా కటువుగా మాటాడటం చూసి అశ్వత్థామ వెంటనే కత్తి నెత్తిపట్టి కర్ణుని మీదికి ఉరికాడు. అశ్వత్థామ ఇలా అన్నాడు. 'నరాధమా! దుర్బుద్ధీ! అర్జునుని వాస్తవగుణాలను ప్రస్తుతిస్తున్న శూరుని - నా మేనమామను- ద్వేషంతో దూషిస్తున్నావు. పాగరు బాగాపట్టి నీ శౌర్యాన్ని

నీవే శ్లాఘించుకొంటూ, సర్వలోకాలలోనూ మేటి విలుకాడైన నా మేనమామను గర్వంతో లెక్క చేయడం లేదు. అర్జునుడు యుద్ధంలో నిన్ను ఓడించి, నీవు చూస్తుండగానే జయద్రథుని చంపినప్పుడు నీ పరాక్రమమూ, నీ అస్త్రాలు ఏమయ్యాయి? సూతాధమా! గతంలో సాక్షాత్తు పరమేశ్వరునితోనే యద్ధం చేసినవాడు అర్జునుడు. అటువంటి వానిని నీవు మనోరథాలతో గెలవాలని వ్యర్థంగా భావిస్తున్నావు. సర్వశస్త్రధారులలో శ్రేష్ఠుడై, శ్రీకృష్ణునితో కూడియున్న అర్జునుని దేవేంద్రునితో సహా సురాసురులు కలిసివచ్చినా గెలవలేరు. సూతా! దుర్బుద్ధీ! అటువంటి లోకైకవీరుడై, పరాజయమెరుగని అర్జునుని నీవు యుద్ధంలో ఈ రాజులతో కలిసి గెలవగలవా ? కర్ణా! చూడు! దుర్బుద్ధీ! నిలు! నరాధమా! దుర్మతీ ఇప్పుడే నీ శిరస్సును మొండెం నుండి ఎగరగొడతాను.' అలా వేగంగా దూసుకొని వస్తున్న అశ్వత్థామను దుర్యోధనుడు, కృపుడు స్వయంగా నివారించారు.

కర్ణుడిలా అన్నాడు. 'కురుసత్తమా! దుర్మతి, ద్విజాధముడు అయిన ఈ శూరుడు (అశ్వత్థామ) యుద్ధాన్ని గూర్చి గొప్పగా చెప్తున్నాడు. నా పరాక్రమమేమిటో చూపిస్తాను. ఇతన్ని విడిచిపెట్టు.' అశ్వత్థామ ఇలా అన్నాడు. 'సూతసుతా! దుర్బుద్ధీ! నీ తప్పును మేము క్షమిస్తున్నాము. నీ ఈ అలవిమాలిన పాగరును అర్జునుడు నశింపజేస్తాడు.' దుర్యోధనుడిలా అన్నాడు. 'అశ్వత్థామా! ప్రసన్నుడవుకమ్ము ! మానదా! నీవు క్షమించాలి. కర్ణునిపై ఏరీతిగానూ కోపాన్ని చూపవద్దు. ద్విజోత్తమా! ప్రసన్నుడవు కావాలి. కర్ణుడు, కృపుడు, ద్రోణుడు, శల్యుడు, శకుని - వీరందరి మీద పెద్ద కార్యభారముంది. బ్రాహ్మణా! ఇదిగో! యుద్ధాభిముఖులై కర్ణునితో యుద్ధం చేయగోరి పాండవులు అన్నివైపుల నుండి ఆహ్వానం పలుకుతూ వస్తున్నారు.' సంజయుడిలా చెప్తున్నాడు. "దుర్యోధనుడలా అనునయించగానే తీవ్రకోపంతో ఉన్న మహామనస్వి అయిన అశ్వత్థామ ప్రసన్నుడయ్యాడు. రాజేంద్రా! ఆ తరువాత మహామనస్వి అయిన కృపాచార్యుడు కూడా సామ్యస్వభావం వలన వెంటనే మృదుత్వాన్ని తెచ్చుకొని ఇలా అన్నాడు. "సూతసుతా! దుర్బుద్ధీ! నీ ఈ తప్పును మేము క్షమిస్తున్నాము. నీ ఈ అలవిమాలిన పాగరును అర్జునుడు నశింపజేస్తాడు."

సంజయుడిలా చెప్తున్నాడు. "రాజా! ఆ తరువాత కీర్తిమంతులైన పాండవులు, పాంచాలురు ఒక్కటై అన్నివైపుల నుండి కర్ణుని బెదిరిస్తూ వచ్చారు. కర్ణుడు తన బాహుబలాన్ని ఆశ్రయించి, వింటిని ఎత్తిపట్టి నిలబడ్డాడు. కర్ణునకు పాండవులతో భయంకరయుద్ధం జరిగింది. సింహనాదాలతో ఆ యుద్ధం విరాజిల్లుతోంది. పాండవులు, పాంచాలురు మహాబాహువయిన కర్ణుని చూసి, పెద్దగా సింహనాదం చేశారు. 'ఈ కర్ణుడెక్కడ ? అడుగో కర్ణుడు. కర్ణా! మహా సంగ్రామంలో నిలు. దుర్మార్గుడా ! పురుషాధమా! మాతో పోరాడు.' మరికొందరు కర్ణుని చూసి క్రోధంతో కన్నెర్రచేసి ఇలా అన్నారు. 'అల్పబుద్ధి,

గర్విష్టి అయిన సూతపుత్రుని రాజశ్రేష్ఠులందరూ కలిసి చంపండి. ఇతడు బ్రతికినందువలన ప్రయోజనమేమీ లేదు. ఈ పాపాత్ముడు పాండవులకు తీవ్రవిరోధి. దుర్యోధనుని అభిప్రాయంలో నిలిచిన ఇతడే అనర్థాలకు మూలం. ఇతన్ని చంపండి !' అంటూ క్షత్రియ మహారథులు యుధిష్ఠిరుని ప్రేరణతో మహాశరవృష్టితో కర్ణుని కప్పివేశారు. ఆ మహారథులందరూ ఆ రీతిగా దాడిచేయటాన్ని చూసి, కూడా కర్ణుడు బాధపడలేదు. భయపడలేదు. భరతర్షభా! ప్రళయకాలమందువలె ఆ సైన్యసముద్రం ఉప్పొంగటాన్ని చూసి, శీఘ్రకారి అయిన కర్ణుడు నీ కుమారులకు ప్రియాన్ని చేయాలని, ఆ సైన్యాన్ని అన్నివైపులా బాణ సమూహంతో నివారించాడు.

ఆ తరువాత రాజులు శరవర్షంతో కర్ణుని నివారించారు. వందలు వేలుగా రాజులు విండ్లను కంపింపజేస్తూ, కర్ణునితో పోరు సాగించారు. రాజులు కురిపించిన ఆ శరవర్షాన్ని కర్ణుడు మహాశరవృష్టితో అన్ని వైపులకు చెదరగొట్టాడు. దేవాసుర సంగ్రామంలో దానవులతో ఇంద్రునకు యుద్ధం జరిగినట్లు, వారి మధ్య యుద్ధం జరిగింది. అక్కడ కర్ణుని నైపుణ్యం ఆశ్చర్యకరంగా కనిపించింది. శత్రువులు అన్నివిధాలుగా యుద్ధసంసిద్ధులైనా కర్ణుని సమీపించలేకపోయారు. కర్ణుడు ఆ రాజుల బాణసమూహాలను నివారించి, తనవేరనున్న భీకర బాణాలను వారి నొగళ్ళపై, ఈషాదండాలపై, గొడుగులపై, ధ్వజాలపై, గుర్రాలపై కురిపించాడు. రాజులందరూ కలతచెంది, చలికి బాధపడుతున్న గోవులవలె అక్కడక్కడే తిరుగసాగారు. కర్ణుని దెబ్బతిని చనిపోయిన గుర్రాలు, ఏనుగులు, రథికులు కుప్పలుకుప్పలుగా అక్కడక్కడ కనిపిస్తున్నారు. యుద్ధంలో వెనుకంజవేయని శూరుల తలలు, బాహువులు అంతటా పడివున్నాయి. రణభూమి అంతా వాటితో నిండిపోయింది. కొందరు చనిపోయారు. కొందరు చనిపోతున్నారు. కొందరు ఆక్రోశిస్తున్నారు. వీరందరితో నిండిన ఆ రణభూమి యమనగరం వలె రౌద్రంగా మారిపోయింది.

ఆ తరువాత దుర్యోధనరాజు కర్ణుని పరాక్రమాన్ని చూసి అశ్వత్థామ దగ్గరకు వచ్చి ఇలా అన్నాడు. 'ఈ కర్ణుడు కవచాన్ని ధరించి, రాజులందరితో యుద్ధం చేస్తున్నాడు. కార్తికేయునిచే ధ్వంసం చేయబడిన రాక్షససేనవలె కర్ణబాణాలచే పీడింపబడి పారిపోతున్న సైన్యాన్ని చూడు. కర్ణునిచే ఓడింపబడిన సేనను చూసి ఇదిగో! అర్జునుడు కర్ణుని చంపాలని ముందుకు వెళ్తున్నాడు. కాబట్టి మహారథుడైన కర్ణుని మన ఎదుటనే అర్జునుడు చంపటానికి వీలులేని రీతిగా యుద్ధనీతిని పాటించు.' కర్ణునిమీదకు వస్తున్న అర్జునుని చూసి అశ్వత్థామ, కృపుడు, శల్యుడు, కృతవర్మ కర్ణుని సంరక్షించటానికి అర్జునునికి ఎదురువెళ్ళారు. అర్జునుడు కూడా పాంచాలురు తన చుట్టూ నిలువగా కర్ణునికి ఎదురు వెళ్ళాడు.

ధృతరాష్ట్రుడిలా అడిగాడు. "సూతా! కాలాంతకుడైన యమునివలె కోపంతో వస్తున్న అర్జునుని చూసి సూర్యసుతుడైన కర్ణుడు ఎలా బదులిచ్చాడు. మహారథుడైన కర్ణుడు ఎప్పుడూ అర్జునునితో పోటీపడుతుంటాడు. భయంకరుడైన అర్జునుని యుద్ధంలో జయించాలని ఆశిస్తుంటాడు. అటువంటి తీవ్రవైరి హఠాత్తుగా ఎదురు వచ్చాడు గదా! సూర్యసుతుడైన కర్ణుడు ఎలా ప్రత్యుత్తరమిచ్చాడు ?"

సంజయుడిలా చెప్తున్నాడు. "తన మీదకు వచ్చిన అర్జునుని చూసి, కర్ణుడు తడబడకుండా రణభూమిలో అర్జునునకెదురు నిలిచాడు. వేగంగా వస్తున్న కర్ణుని అర్జునుడు సూటిగావెళ్ళే బాణాలతో కప్పివేశాడు. కర్ణుడు కూడా అర్జునుని బాణాలతో కప్పివేశాడు. ఆ అర్జునుడు బాణ సమూహంతో కర్ణుని కప్పివేశాడు. దానితో తీవ్రంగా కోపించిన కర్ణుడు మూడు బాణాలతో అర్జునుని గాయపరిచాడు. అర్జునుడు కర్ణుని ఆ నైపుణ్యాన్ని సహించలేకపోయాడు. సానపై పదునెక్కినమూడువందల బాణాలను కర్ణునిపై ప్రయోగించాడు. అంతేగాక అర్జునుడు కోపంతో నవ్వుతూ, ఒక బాణంతో కర్ణుని కుడిభుజం మీద గాయపరిచాడు. బాణం దెబ్బతినగానే కర్ణుని చేతినుండి విల్లు పడిపోయింది. అర్ధనిమేషకాలంలో ఆ మహాబలుడు మరల వింటిని చేతబట్టి, ఎంతో నైపుణ్యంతో బాణసమూహాలతో అర్జునుని కప్పివేశాడు. భారతా! కర్ణుడు కురిపించిన ఆ బాణవృష్టిని అర్జునుడు నవ్వుతూ తన బాణవృష్టితో నశింపజేశాడు. రాజా! ఆ ఇద్దరూ పరస్పరం బదులు తీర్చుకోవాలని ఒకరినొకరు బాణవృష్టితో కప్పివేశారు. ఆడయేనుగుకోసం కోపంతో నున్న వనగజాల పోరాటంవలె రణభూమిలో ఆ కర్ణార్జునుల యుద్ధం మహాద్భుతంగా కనిపించింది. అర్జునుడు కర్ణుని పరాక్రమాన్ని చూసి, వెంటనే కర్ణుని వింటిని మధ్యకు విరగగొట్టాడు. నాలుగు గుర్రాలను కూడా భల్లాలతో యమ సదనానికి పంపాడు. పార్థుడు కర్ణుని సారథితలను మొండెం నుండి పడగొట్టాడు. అర్జునుడు విల్లు విరిగి, గుర్రాలు సారధి మరణించిన ఆ కర్ణుని నాలుగు బాణాలతో గాయపరిచాడు. అర్జునుని బాణాలచే పీడింపబడిన కర్ణుడు, గుర్రాలు మరణించిన ఆ రథం నుండి వెంటనే దూకి, కృపుని రథాన్ని ఎక్కాడు.

అర్జునుని బాణాలతో కర్ణుడు ముండ్ల పందివలె కనిపిస్తూ జీవితం మీది ఆశతో కృపుని రథాన్ని ఎక్కాడు. కర్ణుడు ఓడిపోవటాన్ని చూసి, నీవారంతా అర్జునుని బాణాలు ఒళ్ళంతా గ్రుచ్చుకొనగా పది దిక్కులకు పరుగెత్తారు. రాజా! పారిపోతున్న ఆ సేనలను చూసి దుర్యోధనరాజు వారిని వెనుకకు మరలించి, అప్పుడు ఇలా అన్నాడు. 'శూరులారా! పారిపోవద్దు. నిలవండి. అర్జునుని సంహరించటానికి నేనే స్వయంగా రణభూమిలో ప్రవేశిస్తున్నాను. పాంచాల సోమకులతో సహా నేను పాండవులను చంపుతాను. ప్రళయకాలంలోని యమునివలె నేను నేడు అర్జునునితో పోరాడుతుంటే రాజులు నా పరాక్రమాన్ని చూస్తారు.

ఈరోజు వేలకొలదిగా నేను ప్రయోగిస్తున్న బాణాలను మిడతల సమూహాలను వలె రణభూమిలో యోధులు చూడగలరు. గ్రీష్మకాలం ముగిసేటప్పుడు మేఘవృష్టివలె విలుకాడనైన నేను సృష్టించే బాణవర్షాన్ని రణభూమిలో సైనికులు చూస్తారు. వంగిన కణుపులు గల బాణాలతో నేడు అర్జునుని గెలుస్తాను. శూరులారా! యుద్ధంలో చూడండి ! అర్జునుని వలన భయాన్ని వదలండి. సముద్రం చెలియలికట్టను చేరి నిలవలేనట్లు అర్జునుడు నా పరాక్రమాన్ని తాకి సహించలేడు.' అలా పలికి దుర్యోధనుడు కోపంతో కళ్ళు ఎర్రచేసి, గొప్పసేనను చుట్టూ నిలుపుకొని, అర్జునుని మీదకు వెళ్ళాడు. దుర్యోధనుడు అలా బయలుదేరగా చూసి, కృపుడు అశ్వత్థామ దగ్గరకు వెళ్ళి ఈ మాట అన్నాడు. 'ఈ దుర్యోధనవరపాలుడు క్రోధంతో తనను తాను తెలియక మిడతవలె అర్జునునితో యుద్ధం చేయాలనుకొంటున్నాడు. అర్జునునితో కలబడి మనం చూస్తుండగానే ఈ పురుషోత్తముడు ప్రాణాలను విడువకముందే దుర్యోధనుని నివారించు. కౌరవరాజు అర్జునుని బాణాలకు గురికాకముందే ఆయనను నివారించు. కుబుసం విడిచిన పాములవలె భయంకరమైన అర్జునుని బాణాలతో దుర్యోధనుడు భస్మంకాక ముందే యుద్ధం నుంచి మరలించు. మనమంతా ఉండగానే దుర్యోధనుడు ఒంటరిగా తానే స్వయంగా యుద్ధానికి బయలుదేరటం తగదనిపిస్తోంది. సింహంతో పోరాడే ఏనుగు మనలేనట్లు అర్జునునితో పోరాడే దుర్యోధనుడు జీవించటం దుర్లభమనిపిస్తోంది.'

మేనమామ అలా చెప్పగానే అశ్వత్థామ తొందరపడుతూ దుర్యోధనునితో ఇలా అన్నాడు. 'దుర్యోధనా! నిత్యమూ నీ మేలు కోరే నేను బ్రతికిఉండగానే నన్ను కాదని నీవు పోరాటానికి వెళ్ళదగదు. సుయోధనా! అర్జునుడు గెలుస్తాడని నీవు కంగారు పడవద్దు. నిలు! అర్జునుని నేను నిలువరిస్తాను.' దుర్యోధనుడిలా అన్నాడు. 'ద్విజోత్తమా! మా గురువుగారు పాండవులను కన్న బిడ్డలనువలె కాపాడుతున్నాడు. నీవు కూడా వారి విషయంలో ఎప్పుడూ ఉపేక్షనే చూపిస్తున్నావు. యుద్ధంలో నీ పరాక్రమం మందగిస్తోంది. అది నా అల్పభాగ్యతయో, ధర్మరాజుకో, ద్రౌపదికో, మేలు చేయాలని ప్రవర్తించటమో తెలియటం లేదు. ఛీ! నేను పరమలోభిని. ఓటమిలేక సుఖపడవలసిన బంధువులందరూ నాకోసం తీవ్రదుఃఖాన్ని పొందుతున్నారు. అశ్వత్థామ తప్ప మరెవడు శస్త్రవేత్తలలో ముఖ్యుడై, మహేశ్వర సమానుడై కూడా రణభూమిలో శత్రువును సంహరించకుండ ఉండగలడు ? అశ్వత్థామా! ప్రసన్నుడవు కమ్ము! ఈ నా శత్రువులను నాశనం చేయి. నీ బాణాల గురిలో దేవదానవులయినా నిలువలేరు. అశ్వత్థామా! పాంచాలురను, సోమకులను అనుచరులతో సహా జయించు. నీ అండతో మేము మిగిలినవారిని చంపుతాం. బ్రాహ్మణా! ఈ సోమకులు, పాంచాలురు కోపంతో నా సేనలలో దావాగ్నివలె సంచరిస్తున్నారు. అర్జునుని రక్షణలో

మనసేనలను నిశ్శేషం చేయకముందే వారిని వారించు. అశ్వత్థామా! వేగిరపాటుతో వెంటనే వెళ్ళు. ముందే చేస్తావో, తరువాత చేస్తావో ఇది నీ పనియే. నీవు పాంచాలుర సంహారం కోసమే పుట్టావు. నీవు ఉద్యమిస్తే ప్రపంచంలో ఎక్కడా పాంచాలురు లేకుండా చేయగలవు. నీ విషయంలో సిద్ధులు అలాగే అన్నారు. ఆ మాట యథార్థం కావాలి. అందువలన నీవు అనుచరులతో సహా పాంచాలురను సంహరించు. నీ బాణాలకు లక్ష్యంగా దేవేంద్రునితో కూడిన దేవతలయినా నిలవలేరు. ఇక పాండవుల విషయం, పాంచాలుర విషయం చెప్పవలసినదేముంది. నేను నీకు సత్యమే చెప్తున్నాను. వీరా! సోమకులతో సహా పాండవులయినా బలపూర్వకంగా నీతో యుద్ధం చేయటానికి సమర్థులు కారు. నీకు సత్యం చెప్తున్నాను. వెంటనే వెళ్ళు. కాలం మించిపోకూడదు. అర్జునుని బాణాల పీడతో మన ఈ సైన్యం పారిపోతోంది. దివ్యతేజస్సుతో పాండవులను, పాంచాలురను నిగ్రహించటంలో నీవే సమర్థుడవు."

160. పంకులయుద్ధము.

"దుర్యోధనుడు అలా చెప్పగానే అశ్వత్థామ శత్రువధకై సిద్ధమయ్యాడు. అశ్వత్థామ నీ కొడుకు దుర్యోధనునితో ఇలా అన్నాడు. 'నీవు చెప్పినది సత్యమే. నాకూ, మా తండ్రికీ పాండవులు ఎప్పుడూ ఇష్టమైనవారే. అలాగే వారికీ మేమంటే ఇష్టమే. కానీ అది యుద్ధంలో మాత్రం కాదు. నాయనా! ప్రాణాలపై ఆశవీడి, నిర్భయంగా యథాశక్తిగా యుద్ధం చేస్తాం. నేను, కర్ణుడు, శల్యుడు, కృపుడు, కృతవర్మ కలిసి నిమేషమాత్రంలో పాండవ సేనను నశింపజేస్తాం. పాండవులు కూడా మేము రణభూమిలో లేకపోతే అరనిముసంలోనే కౌరవసేనను నాశనం చేయగలరు. భారతా! మాతో యుద్ధం చెయ్యాలని మోజుపడుతున్న పాండవులతో యథాశక్తిగా యుద్ధం చేస్తాం. తేజస్సు తేజస్సులో లీనమై ఉపశమిస్తుంది. పాండుకుమారులు బ్రతికియుండగా పాండవ సేనను వెంటనే జయించటం కుదరదు. ఆ సత్యం నీకు చెపుతున్నాను. భారతా! ఆ పాండుకుమారులు సమర్థులు. తమ కోసమే యుద్ధం చేస్తున్నవారు. ఇక వారు నీ సేనలను ఎందుకు చంపరు ? రాజా! నీవు మరీ లోభివి. వంచకుడవు. ఆత్మాభిమానివి. అందరినీ శంకించేవాడవు. అందుకే మమ్ము కూడా శంకిస్తున్నావు. రాజా! నీవు చెడ్డవాడవు. పాపాత్ముడవు. పాపపురుషుడవు. నీవన్నీ చెడుతలంపులే. అందుకే ఇతరులను, మమ్ముకూడా అనుమానిస్తున్నావు. కురునందనా! నేను నీ కోసం జీవితాశను వీడి, ప్రయత్నపూర్వకంగా యుద్ధం చేయటానికి ఇదిగో వెళ్తున్నాను. అరిందమా! నేను శత్రువులతో యుద్ధం చేస్తాను. గొప్ప గొప్ప యోధులను

గెలుస్తాను. పాంచాలురతో, సోమకులతో, కేకయులతో, పాండవులతో రణభూమిలో నీకోసం పోరాడుతాను. నేడు నా బాణాలచే దహింపబడిన పాంచాలురు, సోమకులు సింహంబారినపడిన గోవుల వలె అన్నిదిక్కులకు పారిపోతారు. నేడు ధర్మరాజు సోమకులతో కలిసి నా పరాక్రమాన్ని చూసి, లోకమంతా అశ్వత్థామమయంగా భావిస్తాడు. యుద్ధంలో చనిపోయిన పాంచాలురను, సోమకులను చూసి, ధర్మసుతుడైన యుధిష్ఠిరుడు నిర్వేదానికి లోనవుతాడు. నాకు ఎదురునిలిచి పోరాడిన వారినందరినీ చంపుతాను. నా బాహువుల మధ్యకు వచ్చినవారినెవ్వరినీ విడువను, దుర్యోధనునితో అలా పలికి అశ్వత్థామ నీ కుమారులకు ప్రియమయిన పని చేయాలని విలుకాండ్ర నందరినీ భయపెడుతూ యుద్ధానికి వెళ్లాడు.

ఆ తరువాత అశ్వత్థామ కేకయపాంచాలురతో ఇలా అన్నాడు – "మహారథులారా! నా శరీరంపై బాణాలను ప్రయోగించండి. అస్త్రలాఘవాన్ని ప్రదర్శిస్తూ స్థిరంగా నిలిచి పోరాడండి. మహారాజా! అశ్వత్థామ అలా అనగానే ఆ మహారథులందరూ మేఘాలు జలవృష్టిని కురిపించినట్లు అశ్వత్థామపై బాణవృష్టిని కురిపించారు. అశ్వత్థామ ఆ బాణాలను ఖండించి, ధృష్టద్యుమ్న పాండవసమక్షంలోని పదిమంది వీరులను చంపివేశాడు. దెబ్బతింటున్న ఆ పాంచాలురు, సోమకులు రణభూమిని విడిచిపెట్టి, పది దిక్కులకు పారిపోయారు. పాంచాల, సోమకవీరులు అలా పారిపోవటాన్ని చూసి, ధృష్టద్యుమ్నుడు రణభూమిలో అశ్వత్థామపై దాడిచేశాడు. ఆపై బంగారు అలంకరణలు గలిగి, నీరు నిండిన మేఘాలవలె ధ్వనించే వంద రథాలతో, యుద్ధంలో వెనుకంజవేయని రథికులతో కూడి, ధృష్టద్యుమ్నుడు చనిపోయిన యోధులను చూసి, అశ్వత్థామతో ఇలా అన్నాడు. "గురుపుత్రా! దుర్బుద్ధీ! నీవు ఇతరులనెవరినో చంపటమేమిటి? శూరుడవే అయితే రా! నాతో పాటు యుద్ధం చేయి. నేను నిన్ను చంపివేస్తాను. ఇప్పుడు నా ఎదుట నిలు." వెంటనే ధృష్టద్యుమ్నుడు మర్మాలను ఛేదించగల తీక్ష్ణబాణాలతో అశ్వత్థామను కొట్టాడు. వాడి మొనలు గలిగి అందరిశరీరాలను చీల్చగల ఆ బాణాలు వరుస కట్టి, అశ్వత్థామ శరీరంలో గ్రుచ్చుకొన్నాయి. అది మకరందం కోసం ఎగిసిపడుతూ, తుమ్మెదలు పుప్పించిన చెట్టును చుట్టుముట్టినట్టుంది. అశ్వత్థామ అలా గాయపడి కాలితో త్రొక్కిన పాములె తీవ్రంగా కోపించి, తడబడకుండా బాణాన్ని చేతబట్టి ఇలా అన్నాడు.

"ధృష్టద్యుమ్నా! స్థిరంగా నిలు. కొద్దిసేపు నిరీక్షించు. ఇంతలో నిన్ను పదునైన బాణాలతో యమసదనానికి పంపుతాను." అశ్వత్థామ ధృష్టద్యుమ్నునితో అలా మాటాడి హస్తనైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ బాణ సమూహాలతో ధృష్టద్యుమ్నుని అన్నివైపులనుండి కప్పివేశాడు. ధృష్టద్యుమ్నుడు ఆ రీతిగా యుద్ధంలో అశ్వత్థామచే బాధింపబడుతూ మాటలతో అశ్వత్థామను బెదిరించాడు. 'బ్రాహ్మణా! నా ప్రతిజ్ఞ నీకు తెలియదు. నా పుట్టుక గురించి నీకు

తెలియదు. సుదుర్మతీ! ద్రోణుని చంపి ఆ తరువాత నేను నిన్ను చంపుతాను. ద్రోణుడింకా జీవించిఉన్నాడు. కాబట్టి యుద్ధంలో నేడు నిన్ను చంపను. ఈ రాత్రి తెల్లవారకముందే నీ తండ్రిని చంపి, ఆపై నిన్ను కూడా యుద్ధంలో ప్రేతలోకానికి పంపుతాను. అదే నా మనస్సులో ఉన్నది. నీకు పాండవులపైనున్న ద్వేషాన్ని, కౌరవులపై నున్న భక్తిని స్థిరంగా నిలిచి ప్రదర్శించు. నేను నిన్ను ప్రాణాలతో విడువను. నీవలె బ్రాహ్మణ ధర్మాన్ని వీడి, క్షత్రధర్మాన్ని పాటించిన బ్రాహ్మణుని లోకంలో ఎవరైనా చంపవచ్చు." అలా ధృష్టద్యుమ్నుడు పరుషవచనాలు పలుకగా అశ్వత్థామ తీవ్రకోపాన్ని తెచ్చుకొని "నిలు నిలు" అని అన్నాడు. కళ్ళతోనే దహిస్తున్నట్లుగా అశ్వత్థామ ధృష్టద్యుమ్నుని చూశాడు. పామువలె బుసకొడుతూ బాణాలతో కప్పివేశాడు.

రాజశ్రేష్ఠా! అశ్వత్థామచే అలా కప్పబడిన ధృష్టద్యుమ్నుడు సర్పపాంచాల సేనలచే చుట్టబడి నిశ్చలంగా నిలిచాడు. ఆ మహాబాహువు తన పరాక్రమాన్ని ఆశ్రయించి, వివిధ బాణాలను అశ్వత్థామపై ప్రయోగించాడు. ఆ మేటి విలుకాండ్రు ఇద్దరూ ఒకరిపై ఒకరు ఆసహనాన్ని ప్రదర్శిస్తూ, అంతటా బాణవృష్టిని కురిపిస్తూ, బాణసమూహాలతో ఒకరినొకరు పీడిస్తూ, ప్రాణాలనే పణంగా పెట్టి రణభూమిలో మరలా తలపడ్డారు. భయానకంగా ఉన్న ఆ అశ్వత్థామ ధృష్టద్యుమ్నుల యుద్ధాన్ని చూసి సిద్ధులు, చారణులు, పక్షిగణాలు ప్రశంసించాయి. ఆ ఇద్దరూ బాణసమూహాలతో ఆకాశాన్ని, దిక్కులను నింపివేస్తూ బాణాలతో గాఢాంధకారాన్ని సృష్టించి, ఒకరికొకరు కనిపించకుండా పోరాడసాగారు. వారు ఇద్దరూ ఒకరినొకరు చంపటానికి ప్రయత్నిస్తూ రణభూమిలో ధనుస్సులను మండలాకారంలో నిలిపి, సర్వప్రాణులకు భయం కలిగిస్తూ నృత్యం చేస్తున్నట్లుంది. ఆ మహాబాహువు లిద్దరూ వేలకొలదిగ ఉన్న యోధవరులచేత రణభూమిలో ప్రశంసింపబడుతూ చిత్రంగా, వేగంగా, చక్కగా యుద్ధం చేయసాగారు. అరణ్యంలో అడవియేనుగులవలె పోరాడుతున్న ఆ ఇద్దరినీ రణభూమిలో చూసి, ఉభయ సేనలలోనూ తీవ్రహర్షం చెలరేగింది. అప్పుడు పిరికివారికి భయాన్నిపెంచే ఆ భీకర యుద్ధం రెండు గడియలసేపు సమానస్థాయిలో జరిగింది.

అప్పుడు, అశ్వత్థామ ధృష్టద్యుమ్నుని ధ్వజాన్ని, వింటిని, గొడుగును, రథ పృష్ఠరక్షకులను, సారథిని, నాలుగు గుర్రాలను చంపి, యుద్ధంలో ముందుకు సాగాడు. అశ్వత్థామ వంగిన కణుపులు గల బాణాలను వందలు, వేలుగా ప్రయోగించి, ఆ పాంచాలురను అందరినీ పారద్రోలాడు. ఆపై రణభూమిలో దేవేంద్రునివలె, అశ్వత్థామ చేస్తున్న ఆ మహాకర్మను చూసి, పాండవసేన వ్యధ చెందింది. అశ్వత్థామ వందబాణాలతో వందమంది పాంచాలురను చంపి, మరల మూడు పదునైన బాణాలతో ముగ్గురు మహారథులను

చంపి, ధృష్టద్యుమ్నుడు, అర్జునుడు చూస్తుండగానే బహుసంఖ్యాకులైన ఆ పాంచాలురను నశింపజేశాడు. అలా చంపబడుతున్న పాంచాలురు, సృంజయులతో కలిసి అర్జున ధృష్టద్యుమ్నులు అశ్వత్థామను వీడి వెళ్ళిపోయారు. వారి రథాలు, ధ్వజాలు చెల్లాచెదరయినాయి. అశ్వత్థామ శత్రువులను జయించి, వర్షాకాలమేఘం వలె పెద్దగా సింహనాదం చేశాడు. ప్రళయకాలంలో సర్వభూతాలను భస్మం చేసిన అగ్నివలె అశ్వత్థామ శూరుల నెందరినో చంపి విరాజిల్లాడు. అశ్వత్థామ యుద్ధంలో వేలకొలదిగ శత్రువులను చంపి, కౌరవుల ప్రశంసలనందుకొంటూ రాక్షససంహారం చేసిన దేవేంద్రునివలె విరాజిల్లాడు."

161. భీమార్జునులపరాక్రమము - కౌరవసేనా పలాయనము.

"మహారాజా! ఆ తరువాత యుధిష్ఠిర భీమసేనులు అశ్వత్థామను చుట్టుముట్టారు. దుర్యోధన నరపాలుడు అశ్వత్థామ తోడు నిలువగా రణభూమిలో పాండవులను ఎదిరించాడు. అప్పుడు పిరికివారికి భయాన్ని పెంచుతూ ఘోరమైన యుద్ధం జరిగింది. భీమసేనుడు క్రుద్ధుడై అంబష్ఠ, మాలవ, వంగ, శిబి, త్రిగర్తగణాలను మృత్యులోకానికి పంపించాడు. భీముడు అభీషాహ, శూరసేన, క్షత్రియులను చంపి, నేలను నెత్తుటి బురదగా మార్చాడు. అర్జునుడు పదునైన బాణాలతో యౌధేయ, ఆర్జిజ, మద్రక, మాలవసేనలను మృత్యులోకానికి పంపించాడు. తేలికగా దూసుకొనిపోగల బాణాలచే గట్టిదెబ్బతిన్న ఏనుగులు, రెండు శిఖరాలు గల పర్వతాలవలె నేలగూలాయి. ఏనుగుల తొండాలు తెగి, ఇటూ అటూ ఎగిరిపడుతున్నాయి. వాటితో నిండిన నేల ప్రాకుతున్న పాములతో నిండినట్లు ప్రకాశిస్తోంది. ప్రళయకాలంలో సూర్యచంద్రాదిగ్రహాలతో వ్యాపించిన ఆకాశంవలె ఆ రణభూమి అటు ఇటు చెదరిపడిన బంగారు అలంకరణలు గల రాజాలగొడుగులతో ప్రకాశించింది. ఎర్రని గుర్రాల ద్రోణుని రథం దగ్గర "చంపండి! కొట్టండి! నిర్భయంగా గాయపరచండి! నరకండి!" మొదలయిన శబ్దాలు భీకరంగా వినిపించాయి. ఆపరాని పెనుగాలి మేఘాలను ధ్వంసం చేసినట్లు ద్రోణుడు వాయవ్యాస్త్రంతో శత్రువులను ధ్వంసం చేశాడు. అర్జునుడు, భీమసేనుడు చూస్తుండగానే ద్రోణునిచే దెబ్బతిన్న పాంచాలురు భయంతో పరుగెత్తారు.

ఆ తరువాత భీమార్జునులు అనేక రథాలను, పెద్దసేనను వెంటబెట్టుకొని, వెంటనే ద్రోణునివైపు వెళ్ళారు. కుడివైపునుండి అర్జునుడు, ఎడమప్రక్క నుండి భీముడు ద్రోణునిసేనపై దాడిచేసి, బాణవృష్టిని కురిపించారు. అలాగే పాంచాలురు, సృంజయులు, మత్స్యదేశీయులు, సోమకులు కూడా భీమార్జునుల బాటపట్టారు. రాజా! అలాగే నీ కుమారుని సేనలోని రథికశ్రేష్ఠులు కూడా పెద్దసేనతో ద్రోణుని రథంవైపు వెళ్ళారు. ఆ

తరువాత అర్జునునిచే పీడింపబడుతున్న ఆ కౌరవసేన చీకటి, నిద్రల కారణంగా మరలా చెదిరిపోయింది. ద్రోణుడు, స్వయంగా నీ కొడుకు నివారించే ప్రయత్నం చేసినా సేనలను నివారించలేకపోయారు. లోకమంతా అంధకారబంధురం కాగా అర్జునునిచే చీల్చబడుతున్న మహాకౌరవసేన అన్ని దిక్కులకూ పారిపోయింది. భయావిష్టులైన కొందరు రాజులు వందలకొలదిగ ఉన్న వాహనాలను వీడి, అన్నివైపులకూ పరుగెత్తారు.

162. రాత్రి యుద్ధము

సంజయుడిలా చెప్తున్నాడు. "తన విశాలధనుస్సును కదుపుతున్న సోమదత్తుని చూసి, సాత్యకి రథసారథితో ఇలా అన్నాడు - 'నన్ను సోమదత్తుని దగ్గరకు తీసికొనిపో! సూతా! సోమదత్తుని చంపకుండా రణభూమి నుండి వెనుకకు మరలను నా మాట వాస్తవం.' మనోజవంతో సర్వశబ్దాలను అతిక్రమించి పోగల గుర్రాలను రథసారథి రణభూమిలో నడిపించాడు. రాజా! మనోవేగ వాయువేగాలతో వెళ్ళే ఆ గుర్రాలు ఆ యుయుధానుని కొనిపోయాయి. తన మీదకు వేగంగా వస్తున్న ఆ సాత్యకిని చూసి, సోమదత్తుడు తడబాటు లేకుండా సాత్యకి వైపు వెళ్ళాడు. వర్షించే మేఘంవలె శరవృష్టిని కురిపిస్తూ, మేఘం సూర్యుని కప్పివేసినట్లు సోమదత్తుడు సాత్యకిని కప్పివేశాడు. సాత్యకి తడబాటు లేకుండా సోమదత్తుని బాణసమూహాలతో పూర్తిగా కప్పివేశాడు. రాజా! సోమదత్తుడు అరవై బాణాలతో సాత్యకి ఛాతీపై గాయపరిచాడు. సాత్యకి కూడా పదునైన బాణాలతో సోమదత్తుని గాయపరిచాడు. పరస్పరం బాణాలతో గాయపరచుకొన్న ఆ నరశ్రేష్ఠులు ఇరువురూ వసంతర్తువులో వికసించిన మోదుగ చెట్లవలె విరాజిల్లారు. కురువంశానికి, వృష్ణి వంశానికీ కీర్తికరులైన ఆ ఇద్దరూ శరీరాలు నెత్తురోడుతుండగా, కళ్ళతోనే తగులబెడుతున్నట్లు పరస్పరం చూసుకొన్నారు. వారిద్దరూ రథమండల మార్గంలో సంచరిస్తూ ఘోరరూపంతో కనిపించారు. రాజేంద్రా! బాణాలతో శరీరాలు శిథిలం కాగా, ఒళ్ళంతా ముక్కలు ముక్కలుగా కనిపిస్తూ ఆ ఇద్దరూ బాణాల దెబ్బలు తిన్న రెండు క్రూరజంతువుల్లా కనిపిస్తున్నారు. బాణాలు శరీరమంతా గ్రుచ్చుకొని ఆ ఇద్దరూ వర్షాకాలంలో మిణుగురు పురుగులు చుట్టుముట్టిన చెట్లవలె ప్రకాశించారు. శరీరాంగాలు అన్నీ బాణాలతో ప్రకాశిస్తున్న ఆ మహారథులిద్దరూ రణభూమిలో క్రోధంతో నిండి ఉల్కలతో ప్రకాశిస్తున్న ఏనుగులవలె కనిపించారు.

మహారాజా! ఆ తరువాత మహారథుడైన సోమదత్తుడు సాత్యకి యొక్క విశాలధనుస్సును అర్ధచంద్రబాణంతో ఖండించాడు. ఆపై అదే సమయంలో ఇరవై అయిదు

బాణాలను ప్రయోగించాడు. సోమదత్తుడు మరల పదిబాణాలతో సాత్యకిని కొట్టాడు. సాత్యకి మరింత వేగంగల మరొక వింటిని తీసికొని, అయిదు బాణాలతో శీఘ్రంగా సోమదత్తుని గాయపరిచాడు. సాత్యకి నవ్వుతూ మరొక భల్లాన్ని తీసికొని బాహ్లీకుని బంగారు ధ్వజాన్ని ఖండించాడు. సోమదత్తుడు పడిపోయిన ధ్వజాన్ని చూసి కూడా, తడబాటులేకుండా ఇరవై అయిదు బాణాలను సాత్యకిపై వేశాడు. సాత్యకి కూడా క్రుద్ధుడై, సోమదత్తుని ధనుస్సును వాడియైన క్షురప్రమనే భల్లంతో ఖండించాడు. రాజా! ఆ తరువాత వంద బాణాలతో సాత్యకి దంతాలు విరిగిన ఏనుగులవలె సోమదత్తుని శరీరాన్ని చాలాసార్లు గాయపరిచాడు. సోమదత్తుడు మరొకవింటిని తీసికొని, సాత్యకిని బాణవృష్టితో కప్పివేశాడు. సాత్యకి తీవ్రకోపంతో సోమదత్తుని గాయపరిచాడు. సోమదత్తుడు కూడా బాణసమూహంతో సాత్యకిని పీడించాడు. భీముడు సాత్యకికి సహకరిస్తూ పదిబాణాలతో సోమదత్తుని హింసించాడు. సోమదత్తుడు కూడా తడబడకుండా, పదునైన బాణాలతో భీమును గాయపరిచాడు. ఆ తరువాత సాత్యకికి సహకరిస్తూ భీమసేనుడు దృఢమైన ఒక క్రొత్త పరిఘను భీకరంగా సోమదత్తుని ఛాతీపైకి ప్రయోగించాడు. వేగంగా మీదకు వస్తున్న ఆ పరిఘను సోమదత్తుడు నవ్వుతూ రెండుగా ఖండించాడు. రెండుగా ఖండింపబడిన ఆ మహాలోహ పరిఘ వజ్రంతో కొట్టబడిన పెద్ద గిరిశిఖరం వలె నేలబడింది. సాత్యకి సోమదత్తుని ధనుస్సును భల్లంతోనూ, అయిదు బాణాలతో అతని చేతితొడుగును ఖండించాడు. ఆ తరువాత నాలుగు బాణాలతో సోమదత్తుని మేలి గుర్రాలను యముని దగ్గరకు పంపించాడు. సాత్యకి నవ్వుతూ భల్లంతో సారథి శిరస్సును మొండెం నుండి వేరుచేశాడు. రాజా! ఆ తరువాత మండుతున్న అగ్నివలె ఉన్న ఒక భీకరబాణాన్ని సాత్యకి ప్రయోగించాడు. ఆ అమ్ము వేగంగా సోమదత్తుని ఛాతీపై పడింది. సోమదత్తుడు, సాత్యకిచే తీవ్రంగా గాయపరచబడి పడిపోయాడు, వెంటనే చనిపోయాడు.

సోమదత్తుడు మరణించటం చూసి కౌరవమహారథులు తీవ్రబాణవృష్టిని కురిపిస్తూ సాత్యకిపై దాడిచేశారు. వెంటనే యుధిష్ఠిరుడు, పాండవులు ప్రభద్రకులందరితో కలిసి, మహాసేనను వెంటబెట్టుకొని ద్రోణుని సేనపై దాడిచేశారు. ఆపై యుధిష్ఠిరుడు కోపించి, నీ మహాసేనను ద్రోణుడు చూస్తుండగానే బాణాలతో పారద్రోలాడు. సేనలను పారద్రోలుతున్న యుధిష్ఠిరుని చూసి, ద్రోణుడు క్రోధంతో కన్నెర్రజేసి వేగంగా ఎదురువచ్చాడు. ఆపై ఏడు పదునైన బాణాలతో యుధిష్ఠిరుని గాయపరిచాడు. యుధిష్ఠిరుడు కూడా కోపించి అయిదుబాణాలతో ఎదురుగాయపరిచాడు. అలా తీవ్రంగా గాయపడిన ద్రోణుడు యుధిష్ఠిరుని ధ్వజాన్ని, వింటినీ ఖండించాడు. యుధిష్ఠిరుడు రణభూమిలో విల్లు విరిగిపోగా వేగంగా దృఢమైన మరొక వింటిని స్వీకరించాడు. ఆ తరువాత యుధిష్ఠిరుడు వేయి బాణాలతో

గుర్రాలు, రథసారథి, ధ్వజం, రథాలతో పాటు ద్రోణుని గాయపరిచాడు – అది అద్భుతంగా ఉంది. అప్పుడు బాణాలతాకిడి వలన వ్యథ చెందిన ద్రోణుడు ముహూర్తకాలం రథంవెనుకవైపు కూర్చున్నాడు. ముహూర్తకాలంలో తేరుకొని ద్రోణుడు తీవ్రకోపంతో వాయవ్యాస్త్రాన్ని ప్రయోగించాడు. భారతా! ఆపై యుధిష్ఠిరుడు తడబాటు లేకుండా వింటిని లాగి, ఆ వాయవ్యాస్త్రాన్ని తన అస్త్రంతో స్తంభింపజేశాడు. యుధిష్ఠిరుడు ద్రోణుని దీర్ఘధనుస్సును ఖండించాడు. ద్రోణుడు మరొక ధనుస్సును చేతబట్టాడు. యుధిష్ఠిరుడు ఆ ధనుస్సును కూడా పదునైన భల్లాలతో ఖండించాడు.

అప్పుడు శ్రీకృష్ణుడు యుధిష్ఠిరునితో ఇలా అన్నాడు "ద్రోణునితో నీవు యుద్ధాన్ని విరమించు. ద్రోణుడెప్పుడూ యుద్ధంలో నిన్ను పట్టుకోవాలని ప్రయత్నిస్తాడు. కాబట్టి నీతో యుద్ధం చేయటం ద్రోణునకు తగదని నేను భావిస్తున్నాను. ఈ ద్రోణుని వినాశం కోసం పుట్టినవాడే ఈయనను సంహరించగలడు. కాబట్టి గురువును వీడి, సుయోధనుడున్న చోటికే వెళ్ళు. రాజు రాజుతోనే యుద్ధం చేయాలి. కానీ రాజుకాని వారితో యుద్ధం తగదు. కౌంతేయా! ఏనుగులు, గుర్రాలు, రథాలతో కూడి సుయోధనుడి దగ్గరకే వెళ్ళు. అంతలో నా సహాయంలో అర్జునుడు, భీముడు కౌరవులతో యుద్ధం చేస్తుంటారు." శ్రీకృష్ణుని మాటవిని యుధిష్ఠిరుడు ముహూర్తకాలం ఆ ఘోరయుద్ధాన్ని గూర్చి ఆలోచించాడు. ఆపై నోరు తెరిచిన మృత్యువు వలె నీ సేనలోని యోధులను సంహరిస్తున్న భీముని దగ్గరకు వేగంగా వెళ్ళాడు. వర్షాకాలం మేఘంవలె మహారథం ఘోషతో భూమిని కంపింపజేస్తూ, పదిదిక్కులను ప్రతిధ్వనింపజేస్తూ శత్రుసంహారం చేస్తున్న భీముని ప్రక్కకు రక్షణకై నిలిచాడు యుధిష్ఠిరుడు. ద్రోణుడు కూడా ఆ ప్రదోషకాలంలో పాండవులను, పాంచాలురను సంహరించసాగాడు."

163. కౌరవపాండవుల ప్రదీపప్రకాశము.

సంజయుడిలా చెప్తున్నాడు. "రాజా! భయంకరంగా ఆ యుద్ధం జరుగుతోంది. లోకాన్ని అంతా చీకటి, ధూళి కప్పివేశాయి. యోధులు ఒకరినొకరు గుర్తించలేకపోతున్నారు. అనుమానంతో, సంజ్ఞలతో మాత్రమే మహాయుద్ధం క్రమక్రమంగా పెరుగుతోంది. నృపసత్తమా! యుద్ధం బాగా రోమాంచజనకంగా ఉంది. ద్రోణుడు, కర్ణుడు, కృపుడు, భీముడు, ధృష్టద్యుమ్నుడు, సాత్యకి – ఈ వీరులంతా పరస్పరం సేనలను క్షోభకు గురిచేశారు. ఆ సేనలు చీకటితో నిండియున్న అన్ని దిక్కులకు పారిపోతున్నాయి. ఆ యోధులు పరుగెత్తుతూ కూడా హింసకు లోనయ్యారు. కళ్ళు కనిపించని ఆ గాఢాంధకారంలో నీ

కుమారుని మంత్రాంగానికి అనుగుణంగా వేలకొలది మహారథులు పరస్పరం కొట్టుకొన్నారు. సమస్త సేనలు, సేనారక్షకులు కూడా అక్కడ వ్యామోహానికి గురి అయ్యారు.

ధృతరాష్ట్రుడిలా అడిగాడు. "గాఢాంధకారంలో మునిగి పాండవులచే తేజస్సు భంగపరచబడి, మథింపబడుతున్న ఆ సమయంలో మీ మనస్సు ఎలా ఆలోచించింది ? సంజయా! లోకమంతా ఆ రీతిగా చీకటి ఆవరించగా ఆ పాండవుల సేనలకు గానీ, నా సేనకు కానీ వెలుగు ఎక్కడిది ?" సంజయుడిలా చెప్తున్నాడు. "చావగా మిగిలిన సేనలకు, సేనాపతులకు తగిన ఆదేశాలవిచ్చి దుర్యోధనుడు మరలా వ్యూహనిర్మాణం చేశాడు. రాజా! ముందు ద్రోణుడు, మధ్యలో శల్యుడు, ప్రక్కల అశ్వత్థామ శకునులు - అలా వ్యూహాన్ని పన్ని, తానే స్వయంగా సర్వబలాలను సంరక్షిస్తూ ఆ రాత్రి దుర్యోధనుడు యుద్ధానికి ముందుకు సాగాడు. రాజా! దుర్యోధనుడు కాల్బలమంతటిని అనునయిస్తూ "పెద్దపెద్ద ఆయుధాలను వీడి అందరూ, ప్రజ్వలించే దీపాలను చేతబట్టండి" అని ఆదేశించాడు. ఆ సైనికులంతా దీపాలను చేతబట్టారు. దేవతలు, ఋషులు, గంధర్వులు, దేవర్షిగణాలు, విద్యాధరులు, అచ్చరలు, కిన్నరులు, నాగులు, యక్షులు, ఉరగులు, కిన్నరులు - వీరంతా గగనతలంలో నిలిచి ప్రసన్నులై దీపాలను చేతబట్టారు. దిగ్దేవతల దగ్గర కూడా సుగంధ భరితమైన తైలంతో వెలిగించిన దీపాలు క్రిందకు దిగుతూ కనిపించాయి. విశేషించి నారద పర్వతులు కూడా కౌరవపాండవుల సౌకర్యానికై దీపాలు వెలిగించారు. ఆ రాత్రివేళ ఆ సేన అగ్నికాంతులతో మరల స్పష్టంగా విడివిడిగా కనిపించసాగింది. విలువైన నగలతో ప్రజ్వలిస్తూ, మీదపడుతున్న దివ్యాస్త్రాలతో ఆ సేన విరాజిల్లింది. ప్రతిరథంలోనూ అయిదు దీపాలు, ప్రతి ఏనుగుమీద మూడు దీపాలు. ప్రతిగుర్రం మీద ఒక పెద్దదీపం - ఈ విధంగా కౌరవులు, పాండవులు కూడా ఏర్పాటు చేసుకొన్నారు. క్షణకాలంలోనే ఆ ఏర్పరచిన దీపాలన్నీ వెంటనే నీ సేనను ప్రకాశింపజేశాయి. ఆరేయి దీపాలను తైలాన్ని చేతబట్టుకొని నిలిచిన కాల్బలం చేత సేవింపబడుతున్న సమస్తసేనలు ఆకాశంలో మెరుపులచే ప్రకాశింపజేయబడుతున్న మేఘాలవలె కనిపించాయి.

రాజేంద్రా! ఆ రీతిగా సేన వెలుగులోకి రాగానే బంగారు కవచం ధరించిన ద్రోణుడు తపిస్తూ అంతటా కలయదిరుగుతూ గగనమధ్యంలో నిలిచిన కిరణమాలి అయిన సూర్యుని వలె వెలుగొందాడు. అప్పుడు సువర్ణభరణాల మీదా, పతాకాల మీదా, నిర్మలంగా ఉన్న ధనుస్సులమీదా, పసిమివన్నెగల ఆయుధాల మీద ఆ దీపాల ప్రతిబింబాలు ఏర్పడ్డాయి. ఆజమీఢా! గదలు, శక్యాలు, మెరుస్తున్న పరిఘలు, శక్తులు రథాలపై కదులుతూ ప్రతిబింబకాంతులతో మరల మరల దీపాలను సృష్టిస్తున్నాయి. రాజా! అక్కడ గొడుగులు, వింజామరలు, కత్తులు, ప్రజ్వలించే పెద్ద ఉల్కలు, వీరసైనికుల సువర్ణమాలలు

ప్రదీపకాంతులతో విరాజిల్లాయి. రాజా! శస్త్రప్రభలతో, దీపకాంతులతో, ఆభరణ కాంతులతో ప్రకాశింపజేయబడిన నీ సేన అప్పుడు ఎంతో ప్రకాశాన్ని పొందింది. రణభూమిలో నెత్తుటితో తడిసి ప్రకాశిస్తున్న శస్త్రాలు, వీరులు కదిలిస్తున్న కవచాలు ప్రదీప ప్రతిబింబాలతో వర్షాకాలంలో ఆకాశంలో ప్రజ్వరిల్లే మెరుపుతీగెలవలె ఉజ్జ్వలకాంతులను కల్పించాయి. దెబ్బలతాకిడిలోని వేగానికి కంపించినవారు, దెబ్బతీస్తున్నవారు, వేగంగా శత్రువులమీదకు దూకుతున్నవారు ఇటువంటి వీరసైనికుల ముఖాలు గాలికి కదులుతున్న పెద్ద తామరలవలె ప్రకాశించాయి. భారతా! ఎండిన మ్రోళ్ళు గల మహావనం మండుతుంటే సూర్యతేజస్సు కూడా కనిపించకుండా పోయినట్టు ఆ రాత్రివేళ నీ సేన ప్రజ్వలిస్తూ, మహాభయాన్ని కల్గిస్తూ ఘోరరూపంతో కనిపించసాగింది. మనసేనలు దీపకాంతిలో ప్రకాశించటాన్ని చూసి, పాండవులు కూడా వెంటనే తమసేనలలోని కాల్బలాన్ని కూడా దీపాలు వెలిగించమని ఆదేశించారు. వీరు కూడా దీపాలను వెలిగించారు. ప్రతి ఏనుగుమీదా ఏడు దీపాలు, ప్రతిరథం మీదా పది పది దీపాలు, ప్రతి గుర్రం మీదా పన్నెండు దీపాలు అటూ ఇటూ ధ్వజాల దగ్గరా, రథాల వెనుక భాగంలో దీపాలు వెలిగించారు. సేనలన్నింటి ప్రక్కనా, వెనుకా, ముందూ, మధ్యభాగానా, అన్నివైపులా కూడా సైనికులు ప్రజ్వలించే దీపాలను చేతబట్టుకొని పాండవులసేనను ప్రకాశింపజేశారు. రెండు సేనలలోనూ, రకరకాల సైనికులు వెలుగుతున్న దీపాలను చేతబట్టి రెండుసేనల మధ్యా సంచరించసాగారు. సర్వసేనలలోని కాల్బలాలు, ఏనుగులు, రథాలు, గుర్రాల సమూహాలతో కలిసి నీ సేననూ, పాండవరక్షణలోని సేననూ చక్కగా ప్రకాశింపజేశారు. తన కిరణాలతో వెలుగులను చిమ్ముతూ ప్రకాశించే సూర్యగ్రహం ద్వారా అగ్ని ప్రకాశింపజేయబడినట్లు, దీపజ్వాలలచే వెలుగొందచేయబడిన పాండవసేన ద్వారా నీ సేన మరింతగా ప్రకాశించింది. ఆ దీపాల వెలుగులు నేలనూ, నింగినీ, సర్వదిక్కులనూ అతిక్రమిస్తూ వ్యాపించాయి.

ఆ వెలుగుతో నీసైన్యం, పాండవసైన్యం కూడా బాగా వెలుగులోనికి వచ్చింది. రాజా! స్వర్గందాకా వ్యాపించిన ఆ వెలుగుచే జాగరూకులయిన దేవగణాలు, గంధర్వులు, యక్షులు, అసురులు, సిద్ధసమూహాలూ, అచ్చరలు - అందరూ (యుద్ధం చూడాలని) వచ్చారు. దేవతలు, గంధర్వులు, యక్షులు, అసురులు, అప్సరల గణాలతోనూ, యుద్ధంలో మరణించి స్వర్గానికి వెళుతున్న శూరులతోనూ నిండి, ఆ రణభూమి దివ్యలోకంవలె కనిపిస్తోంది. రథాలు, గుర్రాలు, ఏనుగులతో నిండి, ప్రదీప కాంతితో ప్రకాశింపజేయబడి, రోషంతో నిండిన వీరులతో కూడి, గాయపడి పరుగెత్తే గుర్రాల సందడితో కలిసి, వ్యూహాత్మకంగా నిలిచిన రథాలు, గుర్రాలు, ఏనుగులతో సంపన్నమైన ఆ మహాసేన దేవాసురుల వ్యూహంవలె నిలిచింది. రాత్రివేళలో జరుగుతున్న ఆ యుద్ధం మేఘాలు

కప్పిన రోజువలె ఉన్నది. అక్కడ శక్తుల సమూహాలే ప్రచండవాయువులు. పెద్ద రథాలే మేఘ సమూహాలు. ఏనుగులు, గుర్రాల ఘోషలే మేఘగర్జనలు, శస్త్రసమూహమే వర్షం. నెత్తురే జలధారలు. నరేంద్రా! ఆ రణభూమిలో అగ్నిసమానమైన తేజస్సుగల ద్రోణుడు పాండవులను సంతాపానికి గురిచేస్తూ గ్రీష్మ ఋతువులో మధ్యాహ్నకాలంలో తన కిరణాలతో లోకాన్ని తపింపజేసే సూర్యునివలె కనిపించాడు."

164. సంకులయుద్ధము

సంజయుడిలా చెప్తున్నాడు. "దుమ్ము, చీకటి, కప్పుకొన్న లోకం ఆ రీతిగా వెలుగులోకి రాగానే ఒకరి నొకరు చంపాలన్న కోరికతో వీరులంతా మరల కలబడ్డారు. రాజా! శస్త్రాలు, ప్రాసాలు, కత్తులు ధరించిన ఆ యోధులు రణభూమిలో గుమిగూడి పరస్పరం అపరాధం చేసినవారు ఒకరినొకరు చూసికొనసాగారు. నాల్గువైపులా వేలకొలది దీపాలు వెలుగుతున్నాయి. ఆ దీపస్తంభాలు బంగారుతో చేసినవి. వాటిపై రత్నాలను పొదిగిఉన్నారు. సుగంధ తైలంతో వత్తులను తడుపుతున్నారు. భారతా! దేవతలు, గంధర్వులు కూడా దీపాలు వెలిగిస్తున్నారు. అవి తమ కాంతులతో మిక్కిలిగా ప్రకాశిస్తున్నాయి. ఆ దీపాలతో రణభూమి గ్రహాలతో ఆకాశంవలె విరాజిల్లుతోంది. ప్రళయకాలంలో భూమి అంతా తగులబడుతున్నట్లుగా, వందల దీపాలతో ప్రజ్వలిస్తూ ఆ రణభూమి ప్రకాశిస్తోంది. ఆ దీపాలతో దిక్కులన్నీ అన్నివైపులా ప్రకాశిస్తున్నాయి. అవి వర్షఋతుసాయంకాలంలో మిణుగురు పురుగులు చుట్టుముట్టిన చెట్లవలె తళతళలాడుతున్నాయి. ఆపై వీరులు శత్రువీరులతో విడివిడిగా కలబడ్డారు. ఏనుగులు ఏనుగులతోనూ, ఆశ్వికులు ఆశ్వికులతోనూ తలపడ్డారు. రథికశ్రేష్ఠులు రథికశ్రేష్ఠులతోనే ఆనందంగా పోరాడసాగారు. భీకరమైన ఆ ప్రదోషకాలంలో నీ కుమారుని శాసనం వలన చతురంగ సేనకు తీవ్రమైన వినాశం కలుగసాగింది. అర్జునుడు రాజుల నందరనూ సంహరిస్తూ వేగంగా కౌరవసేనను నశింపజేయసాగాడు."

ధృతరాష్ట్రుడిలా అడిగాడు. "కోపంతో, అసహనంతో అర్జునుడు ఎదిరింపవీలుకాని రీతిగా నా కుమారుని సేనలో ప్రవేశించినప్పుడు మీరెలా ఆలోచించారు ? అర్జునుడు అలా ప్రవేశించగా నా సేనలు ఏం చేశాయి? దుర్యోధనుడు కూడా ఆ సమయానికి తగిన కర్తవ్యంగా దేనిని భావించాడు ? రణభూమిలో ఏ వీరులు అర్జునుని ఎదిరించారు ? అర్జునుడు ప్రవేశించగానే ద్రోణునికెవరు రక్షణగా నిలిచారు ? ద్రోణుని కుడివైపు రథచక్రాన్ని ఎవరు రక్షించారు ? దక్షిణంవైపు రథచక్రాన్ని ఎవరు రక్షించారు ? ఏ వీరులు శత్రువీరులను

చంపుతూ వెనుక నిలిచారు ? రణభూమిలో శత్రుసంహారం చేస్తూ ఎవరు ముందు నిలిచారు ? ద్రోణుడు నాట్యమాడుతున్నట్టుగా పాంచాలసేనలో ప్రవేశించాడు గదా! పాంచాలుర రథిక సమూహాన్ని కోపించిన అగ్నివలె తన బాణాలతో దహించివేసిన ద్రోణుడు మృత్యువును ఎలా పొందాడు ? సూత్తా! శత్రువులు రణభూమిలో సావధానంగా, అపరాజితులుగా, హర్షోత్సాహపూరితులుగా ఉన్నట్లు చెపుతున్నావు. నా వారిని గురించి మాత్రం అలా చెప్పటం లేదు. యుద్ధంలో నా సేనలోని రథికులు దెబ్బతిన్నట్టు, చీలిపోతున్నట్టు, చెదిరిపోతున్నట్లు, రథ హీనులైనట్లు చెప్తున్నావు."

సంజయుడిలా చెపుతున్నాడు. "మహారాజా! యుద్ధం చేయదలచిన ద్రోణుని అభిప్రాయాన్ని అనుసరించి ఆ రాత్రి దుర్యోధనుడు తనకు వశవర్తులైన సోదరులతో, కర్ణునితో, వృషసేనునితో మద్రరాజు (శల్యుని)తో, దుర్ధర్షునితో, దీర్ఘబాహువుతో, వారిని అనుసరిస్తున్న వారితో ఇలా అన్నాడు. 'అందరు ప్రయత్నపూర్వకంగా పరాక్రమించి వెనుకనుండి ద్రోణుని రక్షించండి. కృతవర్మ దక్షిణచక్రాన్ని, శల్యుడు ఎడమవైపు చక్రాన్ని రక్షించాలి.' త్రిగర్తులలో చావగా మిగిలిన శూర మహారథులను ద్రోణునకు ముందు నడవవలసినదిగా ఆదేశిస్తూ నీ కుమారుడు ఇలా అన్నాడు. 'ద్రోణాచార్యుడు పూర్తిగా సావధానంగా ఉన్నాడు. పాండవులు కూడా బాగా సంసిద్ధంగా ఉన్నారు. మీరు కూడా రణభూమిలో శత్రువులను సంహరిస్తున్న ద్రోణాచార్యుని సావధానులై రక్షించండి. ద్రోణాచార్యుడు బలవంతుడు. రణభూమిలో వేగంగా చేయి కదపగలవాడు. ప్రతాపశాలి. యుద్ధంలో దేవతలనైనా ఓడించగలవాడు. పాండవులు, సోమకుల విషయంలో చెప్పే దేముంది? కాబట్టి మీరంతా కలిసి పూర్తిగా సావధానులై ధృష్టద్యుమ్నుని నుండి కాపాడండి. పాండవసేనలలో ద్రోణుడితో యుద్ధం చేయగలరాజు ధృష్టద్యుమ్నుడు తప్ప మరొకడు కనిపించడు. కాబట్టి సర్వవిధాలా ద్రోణాచార్య సంరక్షణమే అవసరమనుకొంటున్నాను. చక్కని కాపుదలలో ద్రోణాచార్యుడు పాండవులను, సృంజయులను, సోమకులను సంహరించగలడు. రణముఖంలో సృంజయులందరూ చనిపోతే అశ్వత్థామ యుద్ధంలో ధృష్టద్యుమ్నుని చంపగలడు. అనుమానం లేదు. అదే రీతిగా కర్ణుడు అర్జునుని చంపగలడు. నేను కూడా పట్టుదలతో భీమసేనుని, తేజోవిహీనులైన ఇతర పాండవులను బలపూర్వకంగా గెలువగలను. అటువంటి నా గెలుపు చిరకాలం నిలిచిపోతుంది. కాబట్టి ద్రోణుని రక్షించండి.' అలా నీ కొడుకు దుర్యోధనుడు ఆ గాఢాంధకారంలో సైనికులను యుద్ధానికి ఆదేశించాడు. ఆపై ఉభయసేనల మధ్య ఘోరమైన రాత్రియుద్ధం ప్రారంభమైంది. అర్జునుడు కౌరవసేనను, కౌరవసేన అర్జునుని వివిధ శస్త్రసమూహాలతో పరస్పరం పీడించారు. అశ్వత్థామ పాంచాలరాజును (ద్రుపదుని), ద్రోణుడు సృంజయులను వంగిన కణుపులు గల బాణాలతో

రణభూమిలో కప్పివేశారు. పరస్పరం సంహరించుకొంటున్న పాండు పాంచాలసేనలలో, కౌరవులలో తీవ్రమైన ఆర్తనాదాలు వినిపించాయి. అక్కడ జరుగుతున్న రౌద్ర భయంకర యుద్ధం వంటి యుద్ధాన్ని గూర్చి మనం కానీ మన పూర్వీకులు కానీ చూడలేదు, వినలేదు."

165. యుధిష్ఠిర పరాజయము

"రాజా! రౌద్రంగా, సర్వప్రాణి వినాశకరంగా రాత్రి యుద్ధం జరుగుతున్న సమయంలో యుధిష్ఠిరుడు "ద్రోణుని చంపటం కోసమే కలిసి పరాక్రమించండి" అని పాండవులతో, పంచాలురతో, సోమకులతో చెప్పాడు. రాజా! ధర్మరాజు ఇచ్చిన ఆ ఆదేశంతో పాంచాలురు, స్ృంజయులు భీకరంగా సింహనాదాలు చేస్తూ ద్రోణునే ఎదిరించారు. వారందరూ అసహనంతో తమశక్తి, ఉత్సాహ, ధైర్యాలకు తగినట్లుగా ద్రోణునిపై దాడిచేశారు. ద్రోణుని మీదకు వస్తున్న యుధిష్ఠిరుని కృతవర్మ ముందుకు దూకి, నివారించాడు. రాజా! అన్నివైపులా బాణవృష్టిని కురిపిస్తున్న సాత్యకిని భూరి ఎదిరించాడు. ఆపై ద్రోణుని సమీపించాలని ముందుకు వస్తున్న సహదేవుని కర్ణుడు నివారించాడు. నోరుతెరిచిన యమధర్మరాజు వలె, వైరాన్ని వహించిన మృత్యువు వలె ముందుకు వస్తున్న భీమసేనుని స్వయంగా దుర్యోధనుడే ఎదిరించాడు. నకులుని సుబలసుతుడైన శకుని వేగంగా నివారించాడు. శిఖండి రథంమీద ముందుకు వస్తుండగా కృపుడు నివారించాడు. మహారాజా! నెమలిరంగు వంటి గుర్రాలు పూన్చిన రథం మీద వస్తున్న ప్రతివింధ్యుని దుశ్శాసనుడు నివారించాడు. మాయలలో నేర్పు గడించిన ఘటోత్కచుడు ముందుకు వస్తుండగా అశ్వత్థామ నిరోధించాడు. అనుచరులతో కూడి వస్తున్న మహారథుడైన ద్రుపదుని వృషసేనుడు నివారించాడు. ద్రోణుని చంపాలని వేగంగా వస్తున్న విరాటుని శల్యుడు తీవ్రకోపంతో నివారించాడు. ద్రోణుని చంపాలని వేగంగా వస్తున్న నకులుని కొడుకు - శతానీకుని చిత్రసేనుడు బాణాలతో నిరోధించాడు. అర్జునుడు దూసుకొనివస్తుంటే రాక్షసరాజైన అలంబుషుడు నివారించాడు. అదే రీతిగా ద్రోణుని ధృష్టద్యుమ్నుడు నివారించాడు. అలాగే పాండవులసేనలోని ఇతర మహారథులు మీదకు రాగా నీ సేనలోని రథికులు బలాన్ని ప్రయోగించి. నివారించారు.

ఆ మహాసంగ్రామంలో వందలవేల గజారోహకులు వేగంగా శత్రుపక్షంలోని గజారోహకులతో కలబడి, పోరాడుతూ, సైనికులను పిండిచేస్తున్నారు. రాజా! ఆ రాత్రి గుర్రాలు ఒకదానిపై ఒకటి వేగంగా దాడిచేస్తూ రెక్కలు గల పర్వతాలవలె కనిపిస్తున్నాయి. చేతులలో ప్రాసాలను, శక్తులను, ఋష్టులను ధరించిన ఆశ్వికులు విడివిడిగా గర్జిస్తూ

శత్రుసేనలలోని ఆశ్వికులతో పోరాడుతున్నారు. ఆ రణభూమిలో అనేకసైనికులు గదలతో, రోకళ్ళతో వివిధ శస్త్రాలతో ఒకరిపై ఒకరు పరాక్రమిస్తున్నారు. హృదికుని కొడుకైన కృతవర్మ ధర్మసుతుడైన యుధిష్ఠిరుని నివారించాడు. యుధిష్ఠిరుడు కృతవర్మను అయిదు బాణాలతో, మరల ఇరవై బాణాలతో గాయపరిచి "నిలు ! నిలు!" అని పలికాడు. కృతవర్మ కోపించి ధర్మరాజు ధనుస్సును ఒక భల్లంతో ఖండించి, ధర్మరాజును ఏడు బాణాలతో గాయపరిచాడు. మహారథుడైన ధర్మసుతుడు మరొక ధనుస్సును తీసికొని, పదిబాణాలతో కృతవర్మ భుజాల మీద, ఛాతీమీద కొట్టాడు. యుధిష్ఠిరుని బాణాలతో గాయపడిన కృతవర్మ వణికిపోతూ, రోషంతో ఏడు బాణాలతో యుధిష్ఠిరుని కొట్టాడు. రాజా! యుధిష్ఠిరుడు కృతవర్మ ధనుస్సును ముక్కలు చేసి, చేతితొడుగును ఖండించి, సానపై పదునెక్కిన అయిదు బాణాలను కృతవర్మపై ప్రయోగించాడు. ఆ బాణాలు, కృతవర్మ కవచాన్ని ఛేదించి, పాములు పుట్టలో దూరినట్లు నేలలోనికి చొచ్చుకొని పోయాయి. కృతవర్మ రెప్పపాటు కాలంలో మరొకవింటిని తీసికొని, అరవై బాణాలతో యుధిష్ఠిరుని, తొమ్మిది బాణాలతో రథసారథిని గాయపరిచాడు.

భరతశ్రేష్ఠా! యుధిష్ఠిరుడు తన మహాధనుస్సును రథంపై పెట్టి, పాములవలెనున్న శక్తిని కృతవర్మమీదకు విసిరాడు. యుధిష్ఠిరుడు ప్రయోగించిన ఆ సువర్ణాలంకరణలో గల శక్తి కృతవర్మ కుడిచేతిని భేదించి నేలగూలింది. అదే సమయంలో యుధిష్ఠిరుడు మరల ధనుస్సును చేతబట్టి వంగిన కణుపులు గల బాణాలతో కృతవర్మను ముంచెత్తాడు. ఆ తరువాత కృతవర్మ రణభూమిలో అర్ధనిమేషకాలంలో యుధిష్ఠిరుని గుర్రాలను, సారథిని, రథాన్ని నశింపజేశాడు. ఆపై పాండవజ్యేష్ఠుడైన యుధిష్ఠిరుడు కత్తిని, డాలును చేతబట్టాడు. అయితే కృతవర్మ రణభూమిలో పదునైన బాణాలతో ఆ కత్తిని, డాలును నాశనం చేశాడు. వెంటనే యుధిష్ఠిరుడు బంగారు దండం గలిగి ఎదిరింపరాని తోమరాన్ని తీసికొని, రణభూమిలో కృతవర్మ మీదకు విసిరాడు. ధర్మరాజు చేతినుండి వెలువడి మీదకు వస్తున్న ఆ తోమరాన్ని కృతవర్మ నవ్వుతూ నిపుణతతో రెండుగా నరికివేశాడు. ఆ తరువాత కృతవర్మ వందల బాణాలను యుధిష్ఠిరునిపై కురిపించాడు. తీవ్రకోపంతో, తీక్ష్ణబాణాలతో యుధిష్ఠిరుని కవచాన్ని కూడా చీల్చివేశాడు. కృతవర్మ బాణాలతో కప్పబడిన విలువైన ఆ కవచం ఆకాశం నుండి తారలు రాలుతున్నట్లు రణభూమిలో పడిపోయింది. యుధిష్ఠిరుడు ఆ రీతిగా ధనుస్సు విరిగి, రథం నశించి, కవచం శిథిలం కాగా బాణాల పీడనంది రణభూమినుండి వేగంగా పారిపోయాడు. కృతవర్మ ధర్మాత్ముడైన యుధిష్ఠిరుని ఓడించి, మరల మహాత్ముడైన ద్రోణుని చక్రరక్షణలో నిలిచాడు."

166. దుర్యోధన పలాయనము

"రాజా! భూరి రథికశ్రేష్ఠుడైన సాత్యకిని రణభూమిలో ముందుకు రానివ్వకుండా నిలిపివేశాడు. ఆపై కోపించిన సాత్యకి అయిదు పదునైన బాణాలతో భూరిని ఛాతీపై గాయపరిచాడు. దానినుండి నెత్తురు కారసాగింది. అదే రీతిగా సాత్యకిని భూరి పదునై, తీక్ష్ణమైన పది బాణాలతో ఛాతీపై గాయపరిచాడు. కోపంతో ఎర్రబడిన కన్నులు గల ఆ ఇద్దరూ తమ ధనుస్సులను లాగి, కోపంగా బాణాలతో ఒకరినొకరు తీవ్రంగా గాయపరచుకొన్నారు. మహారాజా! ఆ ఇద్దరి మీద దారుణమైన బాణవృష్టి కురియసాగింది. వారు యమునివలె, మృత్యువు వలె కోపంగా బాణాలను ప్రయోగించుకొనసాగారు. రాజా! వారిద్దరూ బాణాలతో ఒకరినొకరు కప్పివేసికొని నిలిచారు. రెండుగడియల సేపు వారి మధ్య సమయుద్ధం జరిగింది. సాత్యకి కోపించి, నవ్వుతూ మహోత్ముడైన భూరియొక్క వింటిని ఖండించాడు. విల్లు విరిగిపోయిన ఆ భూరిని వెంటనే తొమ్మిది పదునైన బాణాలతో ఛాతీపై గాయపరిచి "నిలు! నిలు!" అని పలికాడు. ఆ భూరి శత్రువుచే తీవ్రంగా గాయపరచబడి కూడా వేరొక వింటిని తీసికొని, సాత్యకిని ఎదురుగా గాయపరిచాడు. మూడు బాణాలతో గాయపరిచి, నవ్వుతూ ఒక తీక్ష్ణమైన భల్లంతో సాత్యకి వింటిని ఛేదించాడు. విల్లు విరిగిపోగా సాత్యకి తీవ్రకోపంతో మహావేగం గల శక్తితో భూరి ఛాతీపై కొట్టాడు. ఆ శక్తిచే శరీరం ఛిన్నాభిన్నమై భూరి ఆ శ్రేష్ఠరథం నుండి అనుకోకుండా ఆకాశం నుండి పడిపోయిన కుజునివలె కూలిపోయాడు. భూరి చనిపోవటాన్ని చూసి, అశ్వత్థామ వేగంగా సాత్యకిపై దాడిచేశాడు.

అశ్వత్థామ "నిలు! నిలు!" అంటూ సాత్యకిని నివారించి, మేఘం వర్షంతో మేరుపర్వతాన్ని ముంచెత్తినట్లు శరసమూహాన్ని సాత్యకిపై కురిపించాడు. రాజా! సాత్యకి రథం మీదకు కోపంతో వస్తున్న అశ్వత్థామను చూసి, మహారథుడైన ఘటోత్కచుడు సింహనాదం చేసి, ఇలా అన్నాడు. 'ద్రోణపుత్రా! నిలు నిలు! నా దగ్గర నుండి ప్రాణాలతో వెళ్ళలేవు. మహిషుని కుమారస్వామి వలె నిన్ను నేను చంపుతాను. ఈరోజు రణాంగణంలో యుద్ధంమీద నీకున్న శ్రద్ధను వదలగొడతాను.' అని పలికి కోపంతో కళ్ళు ఎర్రబడగా ఘటోత్కచుడు సింహం ఏనుగును ఆక్రమించినట్లు క్రోధంతో అశ్వత్థామను ఆక్రమించాడు. మేఘం జలధారలను కురిపించినట్లు ఘటోత్కచుడు అశ్వత్థామపై రథపు టిరుసులవంటి బాణాలను కురిపించాడు. మీద పడుతున్న ఆ బాణవృష్టిని అశ్వత్థామ వెంటనే పెద్దగా నవ్వుతూ పాములవంటి బాణాలతో ఉపశమింపజేశాడు. ఆపై వేగంగా పయనించి

మర్మస్థలాలను ఛేదించగల తీక్ష్ణబాణాలతో ఘటోత్కచుని శరీరంపై నాటించాడు. అశ్వత్థామ బాణాలు గ్రుచ్చుకొని ఆ రాక్షసుడు రణభూమిలో ఒళ్ళంతా ముళ్ళుగల ముళ్ళపందివలె ప్రకాశించాడు. ఆ తరువాత ప్రతాపవంతుడైన ఘటోత్కచుడు క్రోధంతో నిండి వజ్రంవలె, పిడుగువలె ప్రకాశిస్తున్న తీక్ష్ణబాణాలతో అశ్వత్థామను శిథిలం చేశాడు. క్షురప్రం, అర్ధచంద్రం, నారాచం, శిలీముఖం, వరాహకర్ణం, నాలీకం మొదలయిన అస్త్రవృష్టిని కురిపించాడు. గాలి మహామేఘసమూహాన్ని చెదరగొట్టినట్లుగా అశ్వత్థామ క్రుద్ధుడై దివ్యాస్త్రాలతో మంత్రింపబడిన భీకర బాణాలతో తన మీదపడుతూ వజ్రమూ, పిడుగు పడుతున్నట్లు శబ్దం చేస్తూ అసాధారణంగా ఉన్న ఆ దుస్సహబాణవర్షాన్ని మనస్సులో కలతపడకుండా నశింపజేశాడు.

ఆ తరువాత అంతరిక్షంలో మరొక భీకర బాణయుద్ధం కొనసాగింది. అది యోధులకు హర్షాన్ని పెంపొందింపజేసింది. ఆపై అస్త్రాల ఒరిపిడివలన పుట్టిన నిప్పురవ్వలు అంతటా వ్యాపించటంలో రాత్రివేళలో మిణుగురులు వ్యాపించిన ఆకాశంవలె రణభూమి ప్రకాశించింది. ఆ అశ్వత్థామ నీకుమారునకు ప్రియాన్ని చేకూర్చాలని బాణ సమూహాలతో దిక్కులనన్నింటిని కప్పి, ఘటోత్కచునిపై కూడా బాణవృష్టిని కురిపించాడు. గాఢంగా చీకట్లుక్రమ్మిన ఆ అర్ధరాత్రివేళలో అశ్వత్థామ ఘటోత్కచుల మధ్య తీవ్రంగా పోరు జరిగింది. ఘటోత్కచుడు క్రుద్ధుడై రణభూమిలో ప్రళయకాలాగ్నివంటి పదిబాణాలతో అశ్వత్థామ ఛాతీపై కొట్టాడు. ఘటోత్కచుడు ప్రయోగించిన ఆ విశాలశరాలతో గాయపడిన మహాబలుడైన, ఆ అశ్వత్థామ వణికిపోయాడు. ధ్వజదండాన్ని పట్టుకొని మూర్ఛిల్లాడు. రాజా! ఆ తరువాత నీ సేన అంతా హాహాకారాలు చేసింది. నీ వారంతా అశ్వత్థామ చనిపోయాడనే భావించారు. రణరంగంలో ఆ అవస్థలో నున్న అశ్వత్థామను చూసి పాంచాలురు, సృంజయులు సింహనాదం చేశారు. ఆ తరువాత అశ్వత్థామ స్పృహలోకి వచ్చి ఎడమచేతితో వింటిని గట్టిగా పట్టుకొని, చెవిదాకా ఆకర్షించి, ఘటోత్కచునకు గురిపెట్టి, యమదండం వలె భీకరమైన ఒక మేటి అమ్మును ప్రయోగించాడు. భయంకరమైన ఆ మేటి అమ్ము ఘటోత్కచుని హృదయాన్ని చీల్చి, పక్షాలతోపాటు నేలలోనికి చొచ్చుకొని పోయింది. ఘటోత్కచుడు రణాసక్తుడైన ఆ అశ్వత్థామచే తీవ్రంగా గాయపరచబడి రథం వెనుకభాగంలో కూర్చుండిపోయాడు. ఘటోత్కచుడు చైతన్యాన్ని కోల్పోవటం చూసి, సారథి కంగారుపడి వెంటనే రణభూమినుండి, ప్రత్యేకించి అశ్వత్థామనుండి ఘటోత్కచుని దూరంగా తీసికొనిపోయాడు. అశ్వత్థామ ఆ రీతిగా ఘటోత్కచుని గాయపరిచి

పెద్దపెట్టున సింహనాదం చేశాడు.

భారతా! నీ కుమారులచేత సర్వయోధుల చేతనూ ప్రశంసింపబడి అశ్వత్థామ మధ్యాహ్న సూర్యునివలె శరీర కాంతితో వెలిగిపోయాడు. యుద్ధానికై ద్రోణుని రథాన్ని సమీపిస్తున్న భీముని స్వయంగా దుర్యోధననరపాలుడే పదునైన బాణాలతో గాయపరిచాడు. భీమసేనుడు పది బాణాలతో దుర్యోధనుని గాయపరిచాడు. దుర్యోధనుడు కూడా ఇరవై బాణాలతో భీమసేనుని తిరిగి గాయపరిచాడు. బాణసమూహంతో కప్పబడిన ఆ ఇద్దరూ ఆకాశంలో మేఘసమూహంచే కప్పబడిన సూర్యచంద్రులవలె కనిపించారు. ఆ తరువాత దుర్యోధనరపాలుడు అయిదు బాణాలతో భీముని గాయపరిచి 'నిలు! నిలు!' అని అరిచాడు. భీముడు పదిబాణాలతో దుర్యోధనుని ధనుస్సును, ధ్వజాన్ని ఖండించి, వంగిన కణుపులు గల తొంబది బాణాలతో ఆ కౌరవశ్రేష్ఠుని గాయపరిచాడు. దుర్యోధనుడు మరొక మేటివింటిని తీసికొని, విలుకాండ్రు అందరూ చూస్తుండగానే పదునైన బాణాలతో భీమసేనుని పీడించారు. దుర్యోధనుని వింటినుండి వెలువడిన ఆ బాణాలను నశింపజేసి, భీమసేనుడు ఇరవై అయిదు బాణాలతో దుర్యోధనుని వేధించాడు. కోపించిన దుర్యోధనుడు ఒక క్షురప్రంతో భీమసేనుని ధనుస్సును ఖండించి పది బాణాలతో ఆతనిని గాయపరిచాడు. భీమసేనుడు మరొకవింటిని తీసికొని ఏడు పదునైన బాణాలతో వేగంగా దుర్యోధనుని గాయపరిచాడు. దుర్యోధనుడు భీమసేనుని ఆ ధనుస్సును కూడా వేగంగా ఖండించాడు. మహారాజా! భీమసేనుని రెండవ, మూడవ, నాలుగవ, అయిదవ ధనుస్సులను పట్టినవాటిని పట్టినట్టుగా జయశీలుడు, మదోత్కటుడు అయిన నీ కొడుకు ఖండించాడు.

తన విండ్లనన్నింటిని దుర్యోధనుడు అలా ఖండించగా భీమసేనుడు మృత్యువు చెల్లెలివలె, వెలిగే అగ్నిశిఖవలె ఉన్న ఒక మంచి లోహగదను దుర్యోధనునిపైకి విసిరాడు. ఆ శక్తి తన దగ్గరకు రాకముందే మహోత్ముడైన భీమసేనుడు, సర్వయోధులు చూస్తుండగానే దుర్యోధనుడు దానిని మూడు ముక్కలుగా ఖండించాడు. ఆపై భీమసేనుడు బరువైన గదను గిరగిర త్రిప్పి, వేగంగా దుర్యోధనుని రథంమీదకు విసిరాడు. ఆపై ఆ మహాగద, వేగంగా రణభూమిలో నీ కుమారుని గుర్రాలను, సారథిని, రథాన్ని కూడా మర్దించింది. రాజేంద్రా! నీ కుమారుడు భీమునికి భయపడి, కనిపించకుండా పారిపోయి, మహోత్ముడైన నందకుని రథాన్ని ఎక్కాడు. అప్పుడు భీముడు మహారథుడైన నీ కుమారుడు చనిపోయాడని భావించి, ఆ రాత్రివేళలో కౌరవులు బెదిరిపోయేటట్లు పెద్దపెట్టున సింహనాదం చేశాడు. నీ సైనికులు కూడా రాజు చనిపోయాడనే అనుకొన్నారు. దానితో అన్నివైపులా, అందరూ

'హాహా' అని ఆక్రోశించసాగారు. రాజా! చెదిరిపోయిన ఆ యోధులందరి హాహాకారాలను, మహాత్ముడైన భీమసేనుని సింహనాదాన్ని విని, యుధిష్ఠిర నరపాలుడు కూడా సుయోధనుడు మరణించాడని భావించి, భీమసేనుడున్నచోటికి వేగంగా వచ్చాడు. రాజా! పాంచాలురు, కేకయులు, మత్స్యదేశీయులు, సృంజయులు యుద్ధాభిలాషతో సర్వప్రయత్నాలతో ద్రోణాచార్యుని మీదకు వచ్చారు. ఆపై అక్కడ ద్రోణునకు శత్రువులతో మహాసంగ్రామం జరిగింది. అందరూ చీకటిలో మునిగి ఒకరినొకరు కొట్టుకొంటున్నారు."

167. అలంబుష పరాభవము

"ద్రోణుని సమీపించాలని వస్తున్న సహదేవుని కర్ణుడు నివారించాడు. సహదేవుడు తొమ్మిది బాణాలతో, మరల పది బాణాలతో కర్ణుడు గాయపరిచాడు. వంగిన కణుపులు గల వందబాణాలతో కర్ణుడు సహదేవుని గాయపరిచాడు. వేగంగా చేతులు కదపగల నైపుణ్యంతో సహదేవుని వింటిని వేగంగా ఖండించాడు. సహదేవుడు మరొకవింటిని తీసికొని, ఇరవై బాణాలతో కర్ణుని గాయపరిచాడు. అది అద్భుతంగా కనిపించింది. కర్ణుడు వంగినకణుపులు గల బాణాలతో సహదేవుని గుర్రాలను చంపి, రథసారథిని భల్లంతో వేగంగా యమసదనానికి పంపించాడు. రథాన్ని కోల్పోయిన సహదేవుడు కత్తిని, డాలును చేతబట్టాడు. కర్ణుడు నవ్వుతూ కత్తిని కూడా బాణాలతో ముక్కలు చేశాడు. ఆపై బంగారు అలంకరణలు గలిగి, మహాఘోరంగా ఉన్న పెద్ద బరువైన గదను సహదేవుడు కోపంతో కర్ణుని రథంమీదకు విసిరాడు. సహదేవుడు ప్రయోగించిన ఆ గద మీదకు వస్తుంటే కర్ణుడు వెంటనే బాణాలతో దానిని నిలువరించి నేలగూల్చాడు. గద పడిపోవటం గమనించి, సహదేవుడు త్వరగా కర్ణునిపైకి శక్తిని విసిరాడు. దానిని కూడా కర్ణుడు బాణాలతో ఛేదించాడు. సహదేవుడు తన శ్రేష్ఠరథంనుండి వెంటనే వేగంగా క్రిందకు దూకి, కర్ణుడు ఎదుట నిలిచియుండటం చూసి, రథచక్రాన్ని తీసికొని రణభూమిలో కర్ణుని మీదకు విసిరాడు. ఎత్తిన కాలచక్రంవలె వేగంగా తన మీదకు వస్తున్న రథచక్రాన్ని కర్ణుడు కొన్నివేల బాణాలను ప్రయోగించి, ఖండించాడు. మహాత్ముడైన కర్ణుడు ఆ చక్రాన్ని పడగొట్టగా సహదేవుడు ఈషాదండాన్ని, కాడిపలుపును, రకరకాల కాడెలను, చనిపోయిన ఏనుగుల శరీరభాగాలను, గుర్రాలను, మనుషులను మిక్కిలిగా కర్ణుని మీదకు విసిరాడు. కర్ణుడు బాణాలతో వాటిని ధ్వంసం చేశాడు. ఆ సహదేవుడు తాను నిరాయుధుడైన విషయాన్ని గ్రహించి, కర్ణుని బాణాలు చుట్టుముట్టగా రణభూమిని విడిచిపెట్టాడు.

రాజా ! భరతర్షభా ! కర్ణుడు ముహూర్తకాలం సహదేవుని వెంటబడి తరిమి నవ్వుతూ అతనితో ఇలా అన్నాడు. "పిరికివాడా! యుద్ధభూమిలో మేటి రథికులతో పోరాడవద్దు. నీ సాటివారితో పోరాడు. నామాటలను అనుమానించవద్దు." ఆ తరువాత వింటికొనతో సహదేవుని పొడుస్తూ మరలా ఇలా అన్నాడు. "ఇదిగో! అర్జునుడు రణభూమిలో కౌరవులతో వేగంగా పోరాడుతున్నాడు. మాద్రీసుతా! అక్కడకు వెళ్ళు. కావాలనుకొంటే ఇంటికైనా వెళ్ళు." కర్ణుడు అలా పలికి పాంచాల పాండవసేనలను దహించటానికన్నట్లు రథాన్ని వారివైపు నడిపించాడు. మహాయశస్వి, సత్యసంధుడు, శత్రుసంహర్త అయిన కర్ణుడు కుంతికిచ్చిన మాటను తలచుకొని సహదేవుని చంపే అవకాశం వచ్చినా కూడా చంపలేదు. ఆపై సహదేవుడు బాణపీడతో కర్ణుని వాగ్బాణాల పీడతో కలతజెంది. జీవితంపై విరక్తిని పొందాడు. తొందరతొందరగా రణభూమిలో పాంచాల రాజకుమారుడు అయిన జనమేజయుని రథాన్ని ఎక్కాడు. సేనలతో సహా ద్రోణుని మీదకు వేగంగా వస్తున్న మేటి విరాటుని శల్యుడు బాణ సమూహంతో కప్పివేశాడు. రాజా! పూర్వకాలంలో జంభాసురదేవేంద్రుల మధ్య జరిగిన యుద్ధం వంటి యుద్ధం గట్టి విలుకాండ్రైన ఆ ఇద్దరి మధ్య జరిగింది. శల్యుడు త్వరత్వరగా వంగిన కణుపులు గల నూరు బాణాలతో సేనాపతి అయిన విరాటుని వెంటనే గాయపరిచాడు. రాజా! విరాటుడు ముందు తొమ్మిది పదునైన బాణాలతో మరల ముప్పదియేడు బాణాలతో, ఆపై వందబాణాలతో శల్యుని గాయపరిచాడు. శల్యుడు రణరంగంలో విరాటుని రథాశ్వాలను నాలుగింటినీ చంపి, రెండు బాణాలతో రథసారథిని, ధ్వజాన్ని పడగొట్టాడు. గుర్రాలు చనిపోగా విరాటుడు వెంటనే రథంమీదనుండి దూకి, వింటిని ఆకర్షిస్తూ, పదునైన బాణాలను ప్రయోగిస్తూ నిలిచాడు. ఆపై శతానీకుడు తన సోదరుడైన విరాటుడు రథహీనుడు కావటం చూసి, అందరూ చూస్తుండగా రథం మీద వేగంగా వచ్చాడు. అలా వస్తున్న శతానీకుని చూసి, శల్యుడు అనేక బాణాలతో గాయపరిచి, వెంటనే యముని ఇంటికి పంపించాడు. వీరుడైన ఆ శతానీకుడు మరణించగానే రథికశ్రేష్ఠుడైన విరాటుడు వెంటనే ధ్వజమాలలు గల ఆ రథాన్ని ఎక్కాడు. ఆపై విరాటుడు క్రోధంతో కళ్ళు పెద్దవి చేసి, రెట్టించిన పరాక్రమంతో వేగంగా శల్యుని రథాన్ని బాణాలతో కప్పివేశాడు. దానితో క్రుద్ధుడైన శల్యుడు బాగా వంగిన కణుపులు గల బాణంతో సేనాపతి అయిన విరాటుని ఛాతీపై గట్టిగా కొట్టాడు. ఆ విరాటుడు తీవ్రంగా గాయపడి రథం వెనుక భాగాన కూర్చుండిపోయాడు. తీవ్రమైన మూర్ఛ విరాటుని ఆవహించింది. భారతా! బాణాలతో గాయపడిన విరాటుని రథసారథి ఆయనను రణభూమినుండి దూరంగా తీసికొనిపోయాడు.

ఆ తరువాత యుద్ధానికి వన్నె తేగల శల్యునిచే వందల బాణాలచే హింసింపబడుతున్న ఆ మహాసేన ఆ రాత్రివేళ పారిపోయింది. అలా పారిపోతున్న ఆ సేనను చూసి కృష్ణార్జునులు శల్యుడున్న వైపు వెళ్ళారు. రాక్షసరాజైన అలంబుషుడు ఎనిమిది చక్రాలు గల గొప్ప రథాన్ని ఎక్కి, కృష్ణార్జునులకు ఎదురువచ్చాడు. ఆ అలంబుషుని రథంమీద గుర్రం ముఖాలతో భయంకరంగా కనిపించే పిశాచాలున్నాయి. ఎర్రరంగుతో తడిసిన పతాకం, ఎర్రని పూలతో, అలంకరణలు దానికున్నాయి. అది ఉక్కుతో చేసినది. ఎలుగుబంటి చర్మాలు దానిపై ఉన్నాయి. అది భీకరమైనది. ఆ రథధ్వజం చాలా ఎత్తయినది. దానిపై చిత్రమైన రెక్కలతో, విప్పార్చిన కళ్ళతో, తనవైన అరుపులతో గ్రద్ద రౌద్రంగా ప్రకాశిస్తోంది. ఆ రాక్షసుడు అలంబుషుడు బ్రద్దలయిన కాటుక కొండవలె వెలుగొందుతున్నాడు. రాజా! దగ్గరకు వస్తున్న అర్జునుని తలపై వందలకొలదిగా బాణసమూహాలను కురిపిస్తూ అలంబుసుడు పర్వతం ప్రభంజనాన్ని నిరోధించినట్లు అర్జునుని నివారించాడు. భారతా! అక్కడ అప్పుడు నరరాక్షసులకు మధ్య అతి తీవ్రమైన మహాసంగ్రామం జరిగింది. అది ప్రేక్షకుల కందరికీ ముచ్చటగొలుపుతోంది. గ్రద్దలకు, కాకులకు, కొంగలకు, గుడ్లగూబలకు, డేగలకు, నక్కలకు ఆనందాన్ని కలిగిస్తోంది. అర్జునుడు అతనిని వంద బాణాలతో కొట్టాడు. భారతా! తొమ్మిది పదునైన బాణాలతో ధ్వజాన్ని ఖండించాడు. మూడు బాణాలతో సారథిని, మరో మూడు బాణాలతో త్రివేణుకాన్ని, ఒక బాణంతో వింటిని, నాలుగు బాణాలతో నాలుగు గుర్రాలను ఖండించాడు. మరల అలంబుషుడు మరొకవింటిని ఎక్కుపెట్టగా దానిని కూడా రెండు ముక్కలు చేశాడు. రథహీనుడైన అలంబుషుడు కత్తినెత్తగా దానిని కూడా బాణంతో రెండు ముక్కలు చేశాడు. అర్జునుడు అలంబుషుని నాలుగు పదునైన బాణాలతో గాయపరిచాడు. గాయపడిన అలంబుషుడు భయంతో పారిపోయాడు. రాజా! అర్జునుడు అలంబుషుని ఓడించి వెంటనే సైనికులపై, ఏనుగులపై, గుర్రాలపై బాణాలు కురిపిస్తూ ద్రోణుని సమీపించాడు. అర్జునునిచే హింసింపబడుతున్న సైనికులు పెనుగాలికి పెల్లగిల్లిన చెట్లవలె నేలగూలారు. రాజా! మహాత్ముడైన అర్జునుడు సైనికులను అలా చంపుతుండగా నీ కుమారుని సైన్యమంతా పారిపోయింది."

168. శతానీకాది యుద్ధము.

సంజయుడిలా చెప్తున్నాడు. "భారతా! (నకులుని కొడుకైన) శతానీకుడు వేగంగా బాణాలతో నీ సేనను దహిస్తుంటే నీ కొడుకు చిత్రసేనుడు అతనిని నివారించాడు. శతానీకుడు అయిదు బాణాలతో చిత్రసేనుని గాయపరిచాడు. చిత్రసేనుడు పది పదునైన

బాణాలతో శతానీకుని తిరిగి గాయపరిచాడు. మహారాజా! మరలా చిత్రసేనుడు రణభూమిలో తొమ్మిది పదునైన బాణాలతో శతానీకుని ఛాతీపై కొట్టాడు. శతానీకుడు వంగిన కణుపులుగల బాణాలతో చిత్రసేనుని కవచాన్ని శరీరంనుండి వేరు చేశాడు. అది అద్భుతంగా ఉంది. రాజేంద్రా! కవచం తొలగిపోగా నీ కుమారుడు తగిన వేళలో కుబుసాన్ని విడిచిన పాములె మిక్కిలి విరాజిల్లాడు. శతానీకుడు పదునైన బాణాలతో ప్రయత్నశీలుడై ఉన్న చిత్రసేనుని ధ్వజాన్ని, ధనుస్సును ఖండించాడు. ధనుస్సు విరిగిపోగా, కవచం తొలగిపోగా ఆ చిత్రసేనుడు శత్రువులను చీల్చగల మరొక వింటిని చేపట్టాడు. ఆపై చిత్రసేనుడు క్రోధంతో రణభూమిలో శతానీకుని వేగంగా తొమ్మిది బాణాలతో గాయపరిచాడు. శతానీకుడు తీవ్రకోపంతో చిత్రసేనుని గుర్రాలను నాలుగింటిని, సారథిని కూడా చంపివేశాడు. చిత్రసేనుడు ఆ రథం నుండి వేగంగా దూకి ఇరవై అయిదు బాణాలతో శతానీకుని పీడించాడు. నకులుని కొడుకైన శతానీకుడు రత్నభూషితమైన చిత్రసేనుని వింటిని అర్ధచంద్రాకారబాణంతో ఖండించాడు. విల్లు విరిగి, గుర్రాలు, సారథి చనిపోగా, రథాన్ని కూడా కోల్పోయిన చిత్రసేనుడు వెంటనే మహాత్ముడైన కృతవర్మ రథంపైకి ఎక్కాడు.

మహారథుడైన ద్రుపదుడు ద్రోణాచార్యుని ఎదిరించటానికి సేనతో సహా వస్తుండగా వృషసేనుడు వందలబాణాలను కురిపిస్తూ వేగంగా ఎదురువెళ్ళాడు. అనఘా! రణభూమిలో యజ్ఞసేనుడు (ద్రుపదుడు) అరవై బాణాలతో వృషసేనుని భుజాలపై ఛాతీపై కొట్టాడు. వృషసేనుడు కూడా తీవ్రకోపంతో అనేక తీక్ష్ణబాణాలతో రథస్థుడై ఉన్న ద్రుపదుని ఛాతీపై కొట్టాడు. మహారాజా! రణభూమిలో ఆ ఇద్దరూ బాణాలతాకిడిచే శరీరాలు శిథిలం కాగా బాణాలనే కంటకాలు గ్రుచ్చుకొని, ఒళ్ళంతా ముళ్ళున్న ముళ్ళపందులవలె ప్రకాశించారు. బంగారు రెక్కలు, వాడి అయిన మొన గల బాణాల తాకిడిచే కవచాలు విరిగిపోగా నెత్తుటి ధారలతో తడిసిన ఆ ఇద్దరూ మహాసంగ్రామంలో శోభించారు. చిత్రమైన బంగారం వలె, అద్భుతమైన కల్పవృక్షాల వలె, వికసించిన మోదుగ చెట్లవలె వారిద్దరూ రణాంగణంలో విరాజిల్లారు. అప్పుడు వృషసేనుడు ముందుగా తొమ్మిది బాణాలతో ద్రుపదుని గాయపరిచి, మరల డెబ్బయి బాణాలతో, మరలా మూడు మూడు బాణాలతో గాయపరిచాడు. మహారాజా! ఆ తరువాత కర్ణునికొడుకు – వృషసేనుడు కురుస్తున్న మేఘంవలె వేల బాణాలను కురిపిస్తూ ప్రకాశించాడు. ఆపై ద్రుపదుడు క్రుద్ధుడై, పసిమివన్నెగల పదునైన భల్లంతో వృషసేనుని వింటిని రెండుగా ఛేదించాడు. ఆ వృషసేనుడు బంగారుమైపూత గలిగి క్రొత్తదైన మరొక గట్టి వింటిని, చేతబట్టి పదునెక్కి ఉన్న భల్లాన్ని వింటిపై సంధించి, చెవిదాకా లాగి, ద్రుపదునకు గురిపెట్టి,

సర్వసోమకులనూ భయపెడుతూ ప్రయోగించాడు. అది ద్రుపదుని గుండెను చీల్చి నేలగూలింది. వృషసేనుని బాణందెబ్బకు ద్రుపదుడు మూర్ఛిల్లాడు. రాజేంద్రా! అప్పుడు రథసారథి తన కర్తవ్యాన్ని తలచుకొని ద్రుపదుని దూరంగా తీసికొనిపోయాడు. పాంచాలుర మహారథుడైన ద్రుపదుడు భంగపడగా బాణాలతాకిడికి కవచాలన్నీ బ్రద్దలయిన ఆ ద్రుపదసేన ఆ భయంకర రాత్రివేళ పారిపోయింది.

రాజా! పారిపోతున్న ఆ సేన వదిలివేసిన ఆ దీపాలు అంతటా వెలుగుతుంటే ఆ రణభూమి మేఘ రహితమై నక్షత్రాలతో కూడిన గగన తలంవలె ప్రకాశించింది. మహారాజా! అదే రీతిగా వీరుల శరీరాల నుండి జారిపడిన అంగదాలతో ఆ రణభూమి వర్షాకాలంలో మెరుపులతో మేఘం ప్రకాశించినట్లు వెలుగొందింది. ఆపై వృషసేనునకు భయపడి, తారకాసుర సంగ్రామంలో ఇంద్రునకు భయపడిన దానవులవలె సోమకులు పారిపోయారు. మహారాజా! యుద్ధంలో వృషసేనునిచే పీడింపబడి పారిపోతున్న సోమకులు దీపాల వెలుగుతో వెలవెలపోయారు. భారతా! యుద్ధంలో సోమకులను జయించిన కర్ణసుతుడు – వృషసేనుడు కూడా మధ్యాహ్న కాలసూర్యునివలె ప్రకాశించాడు. నీవారిలోనూ, శత్రువులలోనూ ఉన్న వేలకొలది రాజులలో వృషసేనుడొక్కడే ప్రజ్వలిస్తూ, రణభూమిలో నిలిచాడు. వృషసేనుడు యుద్ధంలో మహారథుడు, శూరులు అయిన సోమకులను జయించి, త్వరగా యుధిష్ఠిరనరపాలుడున్న చోటుకు వెళ్ళాడు. అటు ప్రతివింధ్యుడు క్రోధంతో రణభూమిలో శత్రువులను దహిస్తున్నాడు. మహారథుడైన నీ కొడుకు దుశ్శాసనుడు ప్రతివింధ్యుని ఎదిరించాడు. రాజా! మేఘాలు లేని ఆకాశంలో రవిబుధుల కలయికవలె ప్రతివింధ్య దుశ్శాసనుల సమాగమం చిత్రంగా కనిపించింది. రణభూమిలో దుష్కరకృత్యాన్ని చేస్తున్న ప్రతివింధ్యుని దుశ్శాసనుడు మూడు బాణాలతో నుదుట గాయపరిచాడు. మేటివిలుకాడు అయిన నీ కుమారునిచే తీవ్రంగా గాయపరచబడి ఆ ప్రతివింధ్యుడు మూడు శిఖరాల కొండవలె విరాజిల్లాడు. కానీ మహారథుడైన ప్రతివింధ్యుడు రణభూమిలో దుశ్శాసనుని తొమ్మిది బాణాలతో గాయపరిచి, మరల ఏడు బాణాలతో వ్యథపెట్టాడు. ఆ సమయంలో నీ కొడుకు దుష్కర కృత్యాన్ని చేశాడు. ప్రతివింధ్యుని గుర్రాలను భీకర బాణాలతో పడగొట్టాడు. ఒక భల్లంతో ప్రతివింధ్యుని సారథిని, ధ్వజాన్ని పడగొట్టాడు. ఆ విలుకాని రథాన్ని కూడా నువ్వులంత ముక్కలుముక్కలు చేశాడు. తాను కోపించి వంగిన కణుపులు గల బాణాలతో ప్రతివింధ్యుని పతాకాలను, అమ్ముల పొదులను, గుర్రాల కళ్ళాలను, కాడి పలుపులను కూడా నువ్వులవలె ముక్కలు ముక్కలు చేశాడు. ఆ ప్రతివింధ్యుడు రథాన్ని కోలుపోయి కూడా ధనుస్సు చేతబట్టి నిలిచి, వందల వందల బాణాలను

కురిపిస్తూ, నీ కొడుకుతో పోరాడాడు. నీ కొడుకు క్షురప్రంతో ప్రతివింధ్యుని వింటిని ఖండించాడు. ఆపై విల్లు విరిగిన అతనిని పది బాణాలతో పీడించాడు. రణభూమిలో విరథుడైన ప్రతివింధ్యుని చూసి, మహారథులైన ఆయన సోదరులు పెద్దసేనతో వేగంగా అక్కడకు సహాయపడటానికి వచ్చారు. మహారాజా! ప్రతివింధ్యుడు ప్రకాశిస్తున్న సుతసోముని రథం మీదకు ఎగిరి ఎక్కి, ధనుస్సును తీసికొని నీ కుమారుని గాయపరిచాడు. ఆ తరువాత నీవారందరూ దుశ్శాసనుని చుట్టి, పెద్ద సేనతో నిలిచి, రణభూమిలో యుద్ధానికి సిద్ధమయ్యారు. భారతా! ఆ తరువాత భీకరమైన ఆ రాత్రివేళలో నీవారికీ, వారికీ మధ్య యమరాజ్యాన్ని వర్ధిల్లజేసేటట్లు యుద్ధం జరిగింది."

169. నకులుడు శకునిని ఓడించుట - శిఖండి కృపుల యుద్ధము.

సంజయుడిలా చెప్తున్నాడు. "యుద్ధంలో వేగంగా నీ సేనను సంహరిస్తున్న నకులుని శకుని కోపంతో ఎదిరించి "నిలు! నిలు!" అని, అరిచాడు. ముందునుండీ శత్రుత్వాన్ని వహించియున్న ఆ వీరులిద్దరూ ఒకరినొకరు చంపగోరి, పూర్తిగా లాగి విడిచిన బాణాలతో పరస్పరం గాయపరచుకొన్నారు. రాజా! నకులుడు ఎటువంటి బాణవర్షాన్ని కురిపిస్తే అటువంటి దానికి అనుగుణంగా శకుని యుద్ధంలో తన నేర్పును ప్రదర్శించాడు. అప్పుడు ఆ శూరులిద్దరూ యుద్ధంలో బాణకంటకాలు గ్రుచ్చుకొని ఒళ్ళంతా ముళ్ళుగల ముళ్ళపందులవలె విరాజిల్లారు. బంగారురెక్కలు, వాడి మొనలు గల బాణాల తాకిడిచే కవచాలు విరిగిపోగా నెత్తుటి ధారలతో తడిసిన ఆ ఇద్దరూ మహాసంగ్రామంలో బంగారం వలె, అద్భుతమైన కల్పవృక్షాలవలె, ఉత్పుల్లమైన మోదుగుచెట్లవలె విరాజిల్లారు. మహారాజా! అప్పుడు ఆ శూరులిద్దరూ యుద్ధంలో బాణకంటకాలు గ్రుచ్చుకొని, నిలువెల్ల ముళ్ళుగల బూరుగు చెట్లవలె ప్రకాశించారు. రాజా! క్రోధంతో కళ్ళెర్రజేసిన ఆ ఇద్దరూ కళ్ళు విప్పార్చి, ఒకరినొకరు వక్రదృష్టితో చూస్తూ పరస్పరం భస్మం చేస్తున్నట్లున్నారు. నీ బావమరిది – శకుని క్రుద్ధుడై నవ్వుతూ పదునైన కర్ణితో మాద్రీపుత్రుని ఛాతీపై గాయపరిచాడు. విలుకాడైన నీ బావమరిదిచే తీవ్రంగా గాయపడిన నకులుడు రథంవెనుక భాగాన కూర్చున్నాడు. మూర్ఛిల్లాడు కూడా. రాజా! తనకు ప్రబలశత్రువు, గర్వి అయిన శత్రువు ఆ స్థితికి లోనుకావటం చూసి శకుని వర్షాకాలంలోని మేఘంవలె గర్జించాడు.

నకులుడు మూర్ఛనుండి తేరుకొని నోరుతెరిచిన మృత్యువువలె మరల శకునిపై దాడిచేశాడు. నకులుడు తీవ్రకోపంతో ముందు అరవై బాణాలతో, మరల వంద బాణాలతో శకుని ఛాతీపై గాయపరిచాడు. ఆపై శకుని బాణాన్ని సంధించగా, ఆ వింటిని నకులుడు

మధ్యకు విరగగొట్టాడు. వేగంగా ధ్వజాన్ని కూడా ఖండించి, రథంమీదనుండి నేలకు పడగొట్టాడు. ఆ తరువాత పసిమివన్నె కలిగిపదునైన ఒక తీక్ష్ణబాణంతో నకులుడు శకుని తొడలను రెండింటినీ చీల్చి, బోయవాడు రెక్క విప్పిన డేగను పడగొట్టినట్లు శకునిని పడగొట్టాడు. మహారాజా! తీవ్రంగా గాయపడిన ఆ శకుని రథంవెనుక భాగాన కాముకుడు కామినిని కౌగిలించుకొన్నట్లు ధ్వజదండాన్ని పట్టుకొని కూర్చొన్నాడు. నీ బావమరిది స్పృహతప్పి, పడిపోవటాన్ని చూసి, రథసారథి వేగంగా శకునిని రథంమీదనే సేననుండి దూరంగా తీసికొనిపోయాడు. ఆ తరువాత పాండవులు, వారి అనుచరులు సింహనాదాలు చేశారు. శత్రుతాపనుడైన నకులుడు యుద్ధంలో శత్రువును జయించి, కోపంతో "ద్రోణుని సేనవైపు నన్ను తీసికొనిపో" అని సారథితో అన్నాడు. రాజా! మాద్రీసుతుడైన నకులుని ఆ ఆదేశాన్ని విని, సారథి ద్రోణుడున్న చోటికి రథాన్ని కొనిపోయాడు. రాజా! ద్రోణుని సమీపించాలని వస్తున్న శిఖండిని కృపుడు వేగంగా సంసిద్ధంగా ఎదిరించాడు. వేగంగా ద్రోణుని సేనవైపు వస్తున్న అరిందముడైన కృపుని శిఖండి నవ్వుతూ తొమ్మిది భల్లాలతో గాయపరిచాడు. కృపాచార్యుడు శిఖండిని ముందు అయిదు బాణాలతో గాయపరిచి, మరల ఇరవై బాణాలతో గాయపరిచాడు. నీ కొడుకులను ప్రియాన్ని చేకూర్చాడు. దేవాసురసంగ్రామంలో శంబరాసుర దేవేంద్రులకు వలె ఆ ఇద్దరికీ మధ్య భయానకమూ, రౌద్రమూ అయిన మహా సంగ్రామం జరిగింది. ఆ వీర మహారథులిద్దరూ వర్షాకాలంలో మేఘాలవలె ఆకాశాన్ని బాణసమూహాలతో ఆవరింపజేశారు. స్వాభావికంగానే భయంకరంగా కనిపించే ఆ ఆకాశం అప్పుడు మరీ భీకరమైంది. యుద్ధం చేస్తున్న యోధులకు కూడా ఆ రాత్రి కాళరాత్రివలె ఘోరరూపంతో భయంకరంగా అనిపించింది. మహారాజా! గౌతముడు ఎక్కుపెట్టి, బాణాన్ని సంధించిన మహాధనుస్సును శిఖండి అర్ధచంద్రాకారం గల బాణంతో ఛేదించాడు. దానితో కోపించిన కృపాచార్యుడు బంగారు దండమూ, మొక్కవోని మొన గలిగి కమ్మరిచే చక్కజేయబడిన దారుణమైన శక్తిని శిఖండిపైకి విసిరాడు. తనమీదకు వస్తున్న ఆ శక్తిని శిఖండి అనేక బాణాలతో ఛేదించాడు. గొప్పకాంతితో ప్రకాశిస్తున్న ఆ శక్తి వెలుగులు చిమ్ముతూ నేలబడింది. కృపాచార్యుడు మరొక వింటిని చేతబట్టి, పదునైన బాణాలతో శిఖండిని కప్పివేశాడు. గౌతముడు అలా ఆచ్ఛాదించగా రథికశ్రేష్ఠుడైన శిఖండి రథంవెనుక భాగాన కూర్చున్నాడు. శిథిలమైన శిఖండిని చూసి, కృపుడు శిఖండిని చంపగోరినట్లుగా అనేక బాణాలతో కొట్టాడు. ఆ ద్రుపదసుతుడు (శిఖండి) యుద్ధవిముఖుడు కావటం చూసి పాంచాలురు, సోమకులు నాలుగువైపులా శిఖండికి అండగా నిలిచారు. అదే రీతిగా నీకుమారులు కూడా పెద్దసేనతో కృపాచార్యుని చుట్టూ నిలిచారు. ఆపై యుద్ధం జరిగింది.

రాజా! రణభూమిలో ఒకరికొకరికి ఎదురుగా పరువులు పెడుతున్న రథాలచప్పుడు మేఘగర్జనలవలె భయంకరంగా ఉంది. ఎదురెదురుగా పరుగులు తీస్తున్న గుర్రాలు, ఏనుగులతో ఆ యుద్ధభూమి దారుణంగా కనిపిస్తోంది. పరుగులు పెడుతున్న పదాతి సైనికులు పాదధ్వనితో రణభూమి కంపించింది. కాకులు ఎగిరిఎగిరి మిడతలను పట్టినట్లు రథికులెందరో రథాలనెక్కి తీవ్రవేగంతో పయనిస్తూ శత్రుసైనికులను పట్టుకొంటున్నారు. భారతా! మదజలం స్రవిస్తున్న పెద్ద ఏనుగులు మదజలం స్రవిస్తున్న ఏనుగులతో కలబడి, క్షణంలో ప్రయత్నపూర్వకంగా లొంగదీస్తున్నాయి. అలాగే రణభూమిలో ఆశ్వికులు ఆశ్వికులను, కాల్బలం కాల్బలాన్ని సమీపించి, కోపంతో ఉండి కూడా ఒకరినొకరు దాటి ముందుకు పోలేకపోతున్నారు. ఆ రాత్రివేళ కొందరు సైనికులు పరుగెత్తుతున్నారు. కొందరు పారిపోతున్నారు. కొందరు మరలి వస్తున్నారు. దానితో అక్కడ పెద్దకోలాహలం చెలరేగింది. మహారాజా! రథాలపై, ఏనుగులపై, గుర్రాలపై వెలుగుతున్న ప్రదీపాలు ఆకాశంనుండి జారిపడిన పెద్ద ఉల్కలవలె కనిపిస్తున్నాయి. భరతశ్రేష్ఠా! రణాంగణంలో ఆ రాత్రి దీపాలకాంతితో పగలుగా మారింది. సూర్యుని వెలుగుతో లోకంలో వ్యాపించిన చీకటి నశించినట్లు ఇటూ - అటూ వెలుగుతున్న దీపాలతో అంధకారం అదృశ్యమై పోయింది. అంతకుముందు ధూళితో, చీకటితో వ్యాపించి, అదృశ్యమైన ఆకాశం, భూమి, దిక్కులు, మూలలు మరల దీపకాంతితో వెలుగులోనికి వచ్చాయి. మహోత్సాహులైన యోధుల అస్త్రాలు, కవచాలు, మణుల కాంతులు అన్నీ దీపకాంతులతో సన్నగిల్లాయి. భారతా! ఆ రాత్రివేళ కోలాహలంగా యుద్ధం జరుగుతుంటే ఎవ్వరికీ ఏమీ తెలియటం లేదు. తామెవరో కూడా తమకు తెలియనిస్థితి ఏర్పడింది. ఆ రణభూమిలో వ్యామోహంతో తండ్రి కొడుకును చంపాడు. కొడుకు తండ్రిని చంపాడు. మిత్రుడు, మిత్రుని చంపాడు. అలాగే మేనల్లుని మేనమామ, మేనమామను మేనల్లుడు కూడా చంపాడు. తాను తనవారినే, శత్రువులు శత్రువులనే పరస్పరం కొట్టుకొన్నారు. ఆ రాత్రియుద్ధం హద్దులకు దూరమై పిరికివారికి భయంకరమై నిలిచింది."

170. సంకులయుద్ధము.

"మహారాజా! ఆ రీతిగా భయంకరమైన యుద్ధం జరుగుతున్నప్పుడు ధృష్టద్యుమ్నుడు ద్రోణాచార్యుని మీదకు వచ్చాడు. మేటివింటిపై బాణాలను అనుసంధిస్తూ, అల్లెత్రాటిని మాటిమాటికి లాగుతూ స్వర్ణవిభూషితమైన ద్రోణుని రథం మీద దాడిచేశాడు. ద్రోణుని అంతం చేయాలన్న తలంపుతో వస్తున్న ధృష్టద్యుమ్నుని చూసి పాండవులు,

పాంచాలురు కూడా ద్రోణుని చుట్టుముట్టారు. ఆ రీతిగా శత్రువులు చుట్టుముట్టిన ఆచార్యశ్రేష్ఠుడైన ద్రోణుని చూసి, నీ కుమారులు అన్నివైపులా రణరంగంలో ద్రోణుని రక్షింపసాగారు. గాలికి ఎగిసిపడుతూ, జలజంతువులను కలతపెడుతూ రెండు భయంకర సముద్రాలు కలిసినట్లు ఆ రాత్రివేళలో ఆ రెండు సేనాసముద్రాలూ కలిశాయి. మహారాజా! ఆపై ధృష్టద్యుమ్నుడు అయిదు బాణాలతో ద్రోణుని ఛాతీపై గాయపరిచి, వెంటనే సింహనాదం చేశాడు. భారతా! రణభూమిలో ద్రోణుడు ఇరవై అయిదు బాణాలతో ధృష్టద్యుమ్నుని గాయపరిచి, మరొక భల్లంతో పెద్దగా చప్పుడు చేస్తున్న ధృష్టద్యుమ్నుని వింటిని విరిచాడు. భరతర్షభా! ద్రోణునిచే తీవ్రంగా గాయపడిన ధృష్టద్యుమ్నుడు వెంటనే పెదవి కొరుకుతూ, వింటిని విడిచిపెట్టాడు. ధృష్టద్యుమ్నుడు కోపించి, ద్రోణుని అంతం చేయాలని మరొక మేటివింటిని చేతబట్టాడు.

ధృష్టద్యుమ్నుడు ఆ చిత్రమైన వింటిని చెవిదాకా లాగి, దానినుండి ద్రోణుని చంపగల భీకరబాణాన్ని విడిచాడు. ధృష్టద్యుమ్నుడు ఆ మహా సంగ్రామంలో విడిచిన ఆ ఘోరబాణం ఉదయించిన సూర్యునివలె ఆ సేనను ప్రకాశింపజేసింది. ఆ బాణాన్ని చూసి దేవతలు, గంధర్వులు, మానవులు "ద్రోణునకు మేలు కలగాలి" అని అనసాగారు. ద్రోణాచార్యుని రథంమీదకు వస్తున్న ఆ బాణాన్ని కర్ణుడు సిద్ధహస్తునివలె పన్నెండు ముక్కలుగా నరికాడు. ఆ బాణం వెంటనే విషంలేని పామువలె పడిపోయింది. ఆపై ధృష్టద్యుమ్నుని కర్ణుడు పది బాణాలతో గాయపరిచాడు. అశ్వత్థామ అయిదు బాణాలతోనూ, స్వయంగా ద్రోణుడే ఏడు బాణాలతోనూ గాయపరిచారు. అలాగే శల్యుడు పది బాణాలతోనూ, దుశ్శాసనుడు మూడు బాణాలతోనూ, దుర్యోధనుడు ఇరవైబాణాలతోనూ, శకుని అయిదు బాణాలతోనూ గాయపరిచారు. రాజా! మహారథులందరూ కలిసి వెంటవెంటనే ధృష్టద్యుమ్నుని గాయపరిచారు. ఆ మహాసంగ్రామంలో ద్రోణుని కోసం ఏడుగురు వీరులు తనను గాయపరచగా ఏ తడబాటు లేకుండా ధృష్టద్యుమ్నుడు మూడు మూడు బాణాలతో వారినందరినీ గాయపరిచాడు. మరల ద్రోణుని, అశ్వత్థామను, కర్ణుని, నీ కుమారుని కూడా గాయపరిచాడు. ఆ విలుకాడు అలా తమను గాయపరచగా ఆ వీరులు తిరిగి అయిదు అయిదు బాణాలతో ధృష్టద్యుమ్నుని గాయపరిచారు. ప్రతిరథికశ్రేష్ఠుడు ధృష్టద్యుమ్నుని కొట్టాడు. రాజా! అప్పుడు ద్రుమసేనుడు కోపంతో ఒక బాణంతో ధృష్టద్యుమ్నుని గాయపరిచాడు. మరల వెంటనే మూడు బాణాలను ప్రయోగించి "నిలు! నిలు!" అని అరిచాడు. అప్పుడు ధృష్టద్యుమ్నుడు రణభూమిలో బంగారు రెక్కలు కలిగి, సానబెట్టబడి, సూటిగా పయనించగల మూడు తీక్ష్ణ బాణాలతో ద్రుమసేనుని గాయపరిచాడు. అవి

ప్రాణాంతకాలైన బాణాలు. ధృష్టద్యుమ్నుడు మరొక భల్లంతో బంగారు కుండలాలతో ప్రకాశిస్తున్న ద్రుమసేనుని తలను శరీరంనుండి వేరు చేశాడు. పెదవులు కొరుక్కొంటున్న ఆ తల రణభూమిలో నేలగూలింది. అది మగ్గిన తాటిపండు పెనుగాలికి రాలిపడినట్లుంది.

ఆ ధృష్టద్యుమ్నుడు పదునైన బాణాలతో ఆ యోధుల నందరినీ గాయపరిచి, కర్ణుని వింటిని భల్లాలతో విరుగగొట్టాడు. గొప్ప సింహం తన తోకను కత్తిరించటాన్ని సహించనట్లు కర్ణుడు తన వింటిని ధృష్టద్యుమ్నుడు విరగగొట్టడాన్ని సహించలేకపోయాడు. క్రోధంతో కన్నెర్రజేసి, నిట్టూర్పులు విడుస్తూ ఆ కర్ణుడు మరొక వింటిని చేతబట్టి, ధృష్టద్యుమ్నుని వైపు దూసికొనిపోయి ఆ మహాబలునిపై బాణవృష్టి కురిపించాడు. కర్ణుడు కోపించటం చూసి, రథికశ్రేష్ఠ లయిన ఆ ఆరుగురు ధృష్టద్యుమ్నుని చంపగోరి, వేగంగా చుట్టుముట్టారు. నీ సేనలోని ఆరుగురు యోధశ్రేష్ఠుల యెదుట నిలిచిన ఆ ధృష్టద్యుమ్నుడు మృత్యు ముఖంలో పడ్డట్టు మేము భావించాం. అదే సమయంలో దాశార్హుడైన సాత్యకి శరవృష్టిని కురిపిస్తూ ధృష్టద్యుమ్నుని దగ్గరకు వచ్చాడు. మేటివిలుకాడు, యుద్ధదుర్మదుడు అయిన సాత్యకి రావటాన్ని చూసి కర్ణుడు, సూటిగా వెళ్ళే పది బాణాలతో అతనిని గాయపరిచాడు. సర్వసేనలు చూస్తుండగానే సాత్యకి పదిబాణాలతో కర్ణుని గాయపరిచి "వెళ్ళకు! నిలు!" అని అరిచాడు. రాజా! బలవంతుడైన సాత్యకి, మహాత్ముడైన కర్ణుడు కలవటం బలి దేవేంద్రుల సమాగమంవలె ఉన్నది. క్షత్రియశ్రేష్ఠుడైన సాత్యకి రథఘోషతో క్షత్రియులను భయపెడుతూ కమలాక్షుడైన కర్ణుని బాగా గాయపరిచాడు. కర్ణుడు తన వింటిచప్పుడుతో భూమిని కంపింపజేస్తూ, సాత్యకితో పోరాడసాగాడు. విపాఠాలు, కర్ణులు, వత్సదంతాలు, క్షురాలు – మొదలగు బాణాలను వందలకొలదిగా ప్రయోగించి, కర్ణుడు సాత్యకిని తీవ్రంగా గాయపరిచాడు. అదే రీతిగా సాత్యకి కూడా కర్ణునిపై శరవృష్టిని కురిపించాడు. ఆయుద్ధం సమానుల మధ్య యుద్ధంగా నిలిచింది.

మహారాజా! కవచాన్ని ధరించి కర్ణునికొడుకు, నీ సేనలు కూడా అన్నివైపుల నుండి పదునైన బాణాలతో వేగంగా సాత్యకిని గాయపరిచారు. సాత్యకి క్రుద్ధుడై వారి అస్త్రాలను, కర్ణుడు ప్రయోగించిన అస్త్రాలను కూడా తన అస్త్రాలతో నివారించి, వృషసేనుని ఛాతీపై గాయపరిచాడు. ఆ బాణంతో తీవ్రంగా గాయపడి, పరాక్రమవంతుడైన వృషసేనుడు వింటిని విడిచి, స్పృహతప్పి, రథంపై పడిపోయాడు. దానితో మహారథుడైన వృషసేనుడు చనిపోయాడనుకొని కర్ణుడు పుత్రశోకంతో కుమిలిపోతూ సాత్యకిని పీడించసాగాడు. ఆపై మహారథుడైన సాత్యకి కర్ణుని పీడనకు గురియై, త్వరత్వరగా మాటిమాటికి కర్ణుని అనేకబాణాలతో గాయపరిచాడు. ఆ సాత్యకి కర్ణుని పదిబాణాలతో, వృషసేనుని ఏడు

బాణాలతో గాయపరిచి, వారి చేతితొడుగులను, విండ్లను విరిచాడు. ఆ కర్ణవృషసేనులు వేరే విండ్లను ఎక్కుపెట్టుకొని పదునైన బాణాలతో అన్నివైపుల సాత్యకిని గాయపరిచారు. రాజా! గొప్పగొప్ప వీరుల వినాశానికి హేతువయిన ఆ పోరు సాగుతున్నప్పుడు గాండివమహాధ్వని బోరుగా వినిపించింది. అర్జునుని రథఘోషను, గాండివ ధనుష్టంకారాన్ని విని, కర్ణుడు దుర్యోధనునితో ఇలా అన్నాడు. "ఇదిగో మేటి విలుకాడైన ఈ అర్జునుడు సర్వసేనలనూ, ముఖ్యులైన కౌరవశ్రేష్ఠులను చంపి, తన శ్రేష్ఠధనుస్సుతో టంకారం చేస్తూ విజయాన్ని సూచిస్తున్నాడు. మేఘగర్జనలాగా గాండివనాదం, రథఘోష వినిపిస్తున్నాయి. రాజా! అర్జునుడు తనకు తగినట్లుగా పౌరుషాన్ని ప్రకటిస్తున్నాడు. ఈ భరతవంశసేన ముక్కలు ముక్కలుగా చెదిరిపోతోంది. సర్వసేనలూ చెల్లాచెదరయిపోయాయి. ఒక్కచోట ఎక్కడా నిలవలేకపోతున్నారు. అర్జునుని ఎదుట నిలిచిన సేన గాలికి చెదరిపోతున్న మేఘసమూహంవలె, కడలిలో బ్రద్దలైన నౌకవలె కనిపిస్తోంది. గాండీవం నుండి వెలువడిన శరాలతో గాయపడి పారిపోతున్న వందలకొలదిగానున్న ప్రముఖయోధుల ఆర్తనాదాలు పెద్దగా వినిపిస్తున్నాయి. ఈ రాత్రివేళలో ఆకాశంలో మేఘగర్జనవలె అర్జునుని రథం దగ్గర దుందుభిఘోష వినిపిస్తోంది విను. అర్జునుని రథం దగ్గర హాహాకార ధ్వనులు, సింహనాదాలు, బహువిధ శబ్దాలు చాలా వినిపిస్తున్నాయి విను. మన మధ్యనున్న సాత్వతశ్రేష్ఠుడైన ఈ సాత్యకిని మన బాణాలను గురిచేయగలిగితే శత్రువులనందరినీ జయించగలను. ఇదిగో ఈ ధృష్టద్యుమ్నుడు ద్రోణునితో కలబడుతున్నాడు. చుట్టూ శూరులు, రథికశ్రేష్ఠులు అయిన యోధులు నిలిచియున్నారు. సాత్యకిని, ధృష్టద్యుమ్నుని చంపగలిగితే నిస్సంశయంగా తప్పక గెలుపు మనదే. మహారాజా! అభిమన్యునివలె వృష్ణి పార్షత వంశీయులైన ఈ మహారథులను – సాత్యకి ధృష్టద్యుమ్నులను చుట్టుముట్టి చంపే ప్రయత్నం చేద్దాం. అనేక కురుశ్రేష్ఠులతో సాత్యకి పోరాడటం చూసి, అర్జునుడు ద్రోణసేనకు ఎదురు వస్తున్నాడు. ప్రముఖ రథికశ్రేష్ఠులంతా అక్కడకు నడవండి. సాత్యకిని అనేకులు చుట్టుముట్టినట్లు అర్జునుడు గ్రహించకముందే శూరులంతా బాణాలు ప్రయోగించటానికి బాగా తొందరపడండి. ఈ సాత్యకి పరలోకానికి వెళ్ళటానికి అనుగుణంగా నీతి మార్గాన్ని స్వీకరించి చక్కగా ప్రయోగించే ప్రయత్నం చేయాలి." రాజా! ఇంద్రుడు రణభూమిలో యశస్వి అయిన విష్ణునితో మాటాడినట్లుగా కర్ణుని అభిప్రాయాన్ని విని, నీ కొడుకు శకునితో ఇలా మాటాడాడు.

"వెనుకంజవేయని పదివేల గుర్రాలను పదివేల రథాలను తీసికొని వెంటనే అర్జునుని మీదకు వెళ్ళు. దుశ్శాసనుడు, దుర్విషహుడు, సుబాహువు, దుష్ప్రధర్షణుడు అనేక సేనలతో కూడి నిన్ను అనుసరించి వస్తారు. మామా! కృష్ణుని, అర్జునుని, ధర్మరాజును,

నకులుని, సహదేవుని, భీమసేనుని చంపు. మామా! దేవతలు దేవేంద్రునిపై ఆశపెట్టుకొన్నట్లు నీ మీదనే నాకు గెలుస్తామన్న ఆశ ఉంది. స్కందుడు రాక్షసులను చంపినట్లు నీవు పాండవులను చంపు." రాజా! నీ కొడుకు ఆ రీతిగా ఆదేశించగానే శకుని పెద్దసేనతో, నీ కొడుకులతో కలిసి పాండవులమీదకు వెళ్ళాడు. శకుని నీకుమారులకు ప్రియాన్ని చేకూర్చాలని, పాండవులను దహించాలని ఆశిస్తున్నాడు. అప్పుడు నీవారికి శత్రువులతో యుద్ధం జరిగింది. రాజా! శకుని పాండవుల సేనమీదకు వెళ్ళగా కర్ణుడు పెద్దసేనతో కూడి, చాలావందల బాణాలను కురిపిస్తూ, వేగంగా సాత్యకిపై దాడిచేశాడు. అలాగే ఇతరరాజులు కూడా సాత్యకిని చుట్టుముట్టారు. తరువాత ద్రోణుడు ధృష్టద్యుమ్నుని రథంవైపు వెళ్ళాడు. ఆ రాత్రి సమయంలో వీరుడయిన ధృష్టద్యుమ్నుడు, పాంచాలురతో ద్రోణాచార్యుడికి మహత్తరమూ, అద్భుతమూ అయిన యుద్ధం జరిగింది."

171. సాత్యకిచే దుర్యోధనునికి, అర్జునునిచే శకుని ఉలూకులకు, ధృష్టద్యుమ్నునిచే కౌవరసేనకు ఓటమి.

సంజయుడు చెప్పాడు – "రాజా! తరువాత యుద్ధదుర్మదు లయిన వారందరూ కోపప్రతీకారాలతో చాలా వేగంగా సాత్యకి రథం వైపువెళ్లి, సర్వసన్నద్ధాలయిన రథాలతో, రౌతులతో, గజసైన్యంతో ఆయనను చుట్టుముట్టారు. ఆ మహారథు లందరూ సాత్యకిని నాలుగువైపుల చుట్టి, సింహనాదాలు చేస్తూ, భయపెట్టసాగారు. వారందరూ ఆయన మీద చాలా త్వరగా బాణ వర్షం కురిపించారు. మహాబాహువయిన సాత్యకి చాలా వేగంగా పడుతున్న ఆ బాణాలను చూసి, లెక్కలేనన్ని బాణాలను వదలుతూ, వాటిని గ్రహించాడు. సాత్యకి వంగిన ములుకులు గల తీవ్రమైన బాణాలు వేసి, ఆ ఎదుర్కొన్నవారి శిరస్సులను ఖండించాడు. సాత్యకి పదునయిన బాణాలతో నీ సైన్యంలోని ఏనుగుల తొండాలను, గుఱ్ఱాలను, ఆయుధాలతో గూడిన బాహువులను త్రుంచివేశాడు. నేలబడిన వింజామరలతో, తెల్లగొడుగులతో నిండిన రణభూమి నక్షత్రాలతో నిండిన ఆకాశంలా కన్పించింది. ఆ యుయుధానుడితో యుద్ధం చేస్తున్న వీరి హాహాకారాలు ప్రేతాలు పెడుతున్న కేకల లాగా ఉన్నాయి. ఆ ధ్వనితో భూమి అంతా నిండిపోయింది. తీవ్రరూపమై, భయాన్ని కలిగించే రాత్రి అయింది. సాత్యకి బాణాలతో దెబ్బతిని, వికలమవుతున్నసేనను చూసి, ఆ రాత్రి సమయంలో శరీరం భయంతో గగుర్పొడిచే సమధికమయిన ఆర్తనాదాన్ని విని, నీ పెద్దకొడుకు సారథిని "ఆ కేకలు వినిపించే వైపు రథాశ్వాలను తోలు" అని పలుమారులు చెప్పాడు.

అలా ఆయన పురికొల్పగా సారథి గుఱ్ఱాలను సాత్యకి రథంవైపు తోలాడు. చిత్రంగా యుద్ధంచేసే దుర్యోధనుడు యుయుధానుని మీదికి దూకాడు. రక్తాన్ని భుజించే పన్నెండు బాణాలను వదలి దుర్యోధనుని గాయపరిచాడు. ముందుగానే బాణాల దెబ్బలు తిన్న దుర్యోధనుడు కోప పరవశుడయి, సాత్యకిని పదిబాణాలతో కొట్టాడు. అప్పుడు పాంచాలురకు, కౌరవసేనలోని వారికి మధ్య దారుణమయిన దొమ్మియుద్ధం జరిగింది. సాత్యకి మహారథు డయిన నీ పుత్రుని వక్షఃస్థలంలో ఎనభై బాణాలు వేసి బాధించాడు. తరువాత ఆయన రథాశ్వాలను బాణాలతో యమలోకానికి పంపాడు. త్వరగా ఒక బాణంవేసి సారథిని రథం మీదినుంచి నేలగూల్చాడు. గుర్రాలు కూలిన రథం మీదనే ఉండి నీపుత్రుడు సాత్యకి రథంమీదికి పదునయిన బాణాలను వేశాడు. రాజా! నీ కుమారుడు వేసిన ఆ యాభై బాణాలను సాత్యకి సిద్ధహస్తునివలె ముక్కలు చేశాడు. తరువాత మాధవుడు ఇంకొక బాణంతో నీ పుత్రుని చేతిపిడికిలిలో ఉన్న పెద్ద ధనుస్సును ముక్కలు చేశాడు. రథంలేక ధనుస్సు విరిగిపోయిన దుర్యోధనుడు కృతవర్మ రథాన్ని త్వరగా ఎక్కాడు. ఇలా దుర్యోధనుడు వెనుదిరిగితే సాత్యకి ఆ అర్ధరాత్రి సమయంలో బాణాలు వేసి, నీ సైన్యాన్ని పారద్రోలాడు. శకుని కూడా అనేక వేల రథాలతో, వేలకొలది ఏనుగులతో, గుర్రాలతో గూడి వచ్చి అర్జునుని మీద నానావిధాలయిన శస్త్రాలను కురిపించాడు. మీపక్షంలోని క్షత్రియులు కాలుడు పురికొల్పగా, మహాస్త్రాలను అర్జునుని మీద కురిపిస్తూ ఆయనతో యుద్ధం చేశారు.

అర్జునుడు కౌరవసేనను సంహరిస్తూ అలసిపోయిగూడా వేల కొలది ఆ రథ, గజ, అశ్వాలను నశింపజేశాడు. అప్పుడు శకుని వివిధాలయిన నిశిత బాణాలతో అర్జునుని గాయపరిచాడు. వందల బాణాలు వేసి మహారథుడయిన ఆయనను నిలువరించాడు. అర్జునుడు ఆ శకునిని ఇరవై బాణాలతో గాయపరిచాడు. ఆయనతో ఉన్న ఇతర మహాధానుష్కులను మూడేసి మూడేసి బాణాలతో వేధించాడు. ధనంజయుడు వారిని నిలువరించి, ఇంద్రుడు అసురులనువలె మీ యోధులను సంహరించాడు. ఏనుగుతొండాల వలె ఉన్న ఆ వీరుల విచ్ఛిన్నభుజాలతో వ్యాప్తమయిన భూమి అయిదు తలలు గల పాములతో నిండినట్లు ఉన్నది. కిరీటాలతో గూడినవి, చక్కని ముక్కులు, అందమయిన కుండలాలు గలవి, పెదవికొరుకుతున్నవి, కోపంతో విశాలమయిన కన్నులు గలవి, కంఠహారాలు, చూడామణులు ధరించినవి, ఇష్టులకు ప్రియవచనాలు చెప్పేవి, అయిన క్షత్రియుల శిరస్సులు పడి ఉన్న భూమి పద్మాలు పరిచినట్లుగా విరాజిల్లింది. అర్జునుడు భీకరమయిన ఆ

మహాత్కార్యం చేసి, శకునిని వంగినములుకులు గల అయిదు బాణాలతో మళ్ళీ కొట్టాడు. ఉలూకుని మూడు బాణాలతో కొట్టాడు. ఆ రీతిగా తాడితుడై క్రుద్ధు డయిన ఉలూకుడు కృష్ణుని బాణాలతో కొట్టాడు. భూమినంతా నింపుతున్నట్లుగా పెద్ద సింహనాదం చేశాడు. యుద్ధంలో అర్జునుడు శకుని ధనుస్సును బాణాలు వేసి, ముక్కలు చేశాడు. రథానికి ఉన్న నాలుగు గుఱ్ఱాలను చంపేశాడు. అప్పుడు శకుని రథంమీదనుంచి దూకి త్వరగా ఉలూకుని రథం ఎక్కాడు. ఆ తండ్రీ కొడుకులు ఒకే రథం ఎక్కి, మేఘాలు జలధారలతో పర్వతాన్ని ముంచెత్తినట్టు అర్జునుని బాణాలతో ముంచేశారు. అర్జునుడు వారిని పదునయిన బాణాలతో గాయపరిచి, నీ సైన్యాన్ని పారద్రోలుతూ వందలకొలది బాణాలతో కొట్టాడు. ఆకాశంలో గాలి మేఘాలను విచ్ఛిన్నం చేసినట్లుగా రాజా! మన సైన్యాలను అంతటా అలా అర్జునుడు విచ్ఛిన్నం చేశాడు. ఆ రీతిగా అర్ధరాత్రి సమయంలో అర్జునబాణాలు తగులగా ఆ సైన్యం అంతా భయపడి, చూస్తుండగానే అన్ని దిక్కులకు పారిపోయింది. ఆ దారుణమయిన చీకటిలో కొందరు వాహనాలను విడిచిపెట్టి, ఇంకా కొందరు వాహనాలను తోలుతూ, తొట్రుపడుతూ పరుగెత్తారు. యుద్ధభూమిలో మీవాళ్ళను జయించి, సంతోషంతో కృష్ణార్జునులు శంఖాలను ఊదారు.

ధృష్టద్యుమ్నుడు మూడు బాణాలతో ద్రోణుని గాయపరిచి త్వరగా ఒక బాణంతో ఆయన ధనుస్సుకున్న అల్లెత్రాటిని త్రెంచేశాడు. ద్రోణుడు విరిగిన ధనుస్సును క్రింద పడవేసి దృఢమయి, వేగం గల ఇంకొక ధనుస్సు తీసుకొని ధృష్టద్యుమ్నుని వీడు బాణాలతో కొట్టి, ఆయన రథసారథిని అయిదు బాణాలతో గాయపరిచాడు. ధృష్టద్యుమ్నుడు బాణాలతో వేగంగా ఆయనను అడ్డుకొని రాక్షససేనను ఇంద్రునివలె కౌరవసేనను సంహరించాడు. ఆర్యా! ఆ సైన్యాన్ని సంహరించటం వలన రక్త ప్రవాహాలతో గూడిన ఘోరమయిన రక్తనది ఏర్పడింది. ఆ రెండు సేనల మధ్య పదాతులు, గుర్రాలు, ఏనుగులు కొట్టుకొనిపోయే ఆ రక్తనది యముని పట్టణంవైపు ప్రవహించే వైతరణీ నదిలాగా ఉన్నది. ఆ సైన్యాన్ని అంతనూ పారద్రోలి ధృష్టద్యుమ్నుడు దేవ సమూహంలో ఇంద్రుని వలె విరాజిల్లాడు. అప్పుడు ధృష్టద్యుమ్నుడు, శిఖండి, నకుల సహదేవులు, సాత్యకి, భీముడు తమ శంఖాలను ఊదారు. విజయంతో విలసిల్లే రణోత్సాహ సంతుష్టులయిన పాండవులు నీ సైన్యంలో వేల రథాలను జయించి, నీ కుమారుడయిన దుర్యోధనుడు, కర్ణుడు, ద్రోణుడు, శూరు డయిన అశ్వత్థామ చూస్తుండగానే సింహనాదాలు చేశారు."

172. రాత్రి సంకులసమరము భీమార్జునులు ఎదిరించుట.

సంజయుడు చెప్పాడు – "రాజా! పాండవ వీరులు బాధిస్తుండగా పారిపోతున్న తన సేనను చూసి కోపపరవశుడయినాడు నీ పుత్రుడు దుర్యోధనుడు. దుర్యోధనుడు కర్ణద్రోణుల వద్దకు త్వరగా వెళ్ళి కోపంతో ఇలా అన్నాడు. "అర్జునుడు సైంధవుని చంపటం చూచి క్రుద్ధులయిన మీరు ఇద్దరు ఈ యుద్ధాన్ని పొడిగించారు. పాండవ సైన్యం నాసైన్యాన్ని సంహరిస్తుంటే వారి సేనను జయించటానికి సమర్థులయి కూడా అశక్తులులాగా కనిపిస్తున్నారు. వీరులారా! మీరు నన్ను వదలివేయాలి అనుకొంటే, మొదటనే మేము యుద్ధంలో పాండవులను జయించగలం అని చెప్పకుండా ఉంటే సరిపోయేది. అప్పుడే విముఖవచనాలు మీరు చెప్పివుంటే, నేను పాండవులతో సమస్త యోధవినాశకరమయిన ఈ వైరం పెట్టుకొని ఉండేవాడిని కాదు. పురుష శ్రేష్ఠులారా! నేను మీకు వదలివేయదగినవాడను కాకపోతే మీరు తగిన రీతిగా యుద్ధం చేయండి." ఈ రీతిగా ఆ వీరులు నీ పుత్రుని మాటలు అనే చెన్నకోల దెబ్బలు తిని, యుద్ధం చేశారు. ఆ కర్ణద్రోణులు సాత్యకి మొదలయిన వీరుల మీద విజృంభించారు. అలాగే సమస్త సైన్యాలతో గూడిన పాండవ వీరులు మాటిమాటికి గర్జిస్తున్న ఆ మహావీరులను ఎదిరించారు. అప్పుడు ద్రోణుడు క్రుద్ధుడై చాల త్వరగా సాత్యకిని పదిబాణాలతో గాయపరిచాడు. ఆ యుద్ధంలో కర్ణుడు పది బాణాలతో, నీపుత్రుడు ఏడు బాణాలతో, వృషసేనుడు పది బాణాలతో, శకుని ఏడు బాణాలతో, సాత్యకిని నాలుగువైపుల నుంచి ముంచివేశారు. పాండవసైన్యాన్ని సంహరిస్తున్న ద్రోణుని చూసి, సోమకులు త్వరగా అన్నివైపుల నుంచి బాణవర్షంతో ఆయనను గాయపరిచారు.

సూర్యుడు కిరణాలతో అంతటా వ్యాపించి ఉన్న చీకటిని హరించినట్లు, ద్రోణుడు పరపక్ష క్షత్రియుల ప్రాణాలను హరించాడు. ద్రోణుడు వధిస్తున్న పాంచాలురలో ఒకరినొకరు పిలుస్తున్న సంకులధ్వనులు వినిపించాయి. కొందరు కొడుకులను, కొందరు తండ్రులను, ఇంకా కొందరు సోదరులను, మరికొందరు మేనమామలను, కొందరు మేనల్లుండ్లను, కొందరు మిత్రులను, మరికొందరు చుట్టాలను, సంబంధులను వదలివేసి, ప్రాణరక్షణకై పారిపోతున్నారు. కొంతమంది పాండవసైనికులు ఆ యుద్ధంలో మోహితులై, మోహం వశత్వం వల్ల ఆ ద్రోణునికే ఎదురు వెళ్ళారు. మరణించారు. ద్రోణునిచే బాధితమయిన పాండవసేన భీముడు, అర్జునుడు, కృష్ణుడు, నకుల సహదేవులు, యుధిష్ఠిరుడు, ధృష్టద్యుమ్నుడు చూస్తుండగానే ఆ రాత్రిపూట చేతులలోని కాగడాలను వదలి, పారిపోయింది. అంతటా పాండవసైన్యంలో చీకటి క్రమ్ముకోవటం వలన ఏమీ కనపడలేదు. కౌరవసేనలోని

కాగడాల వెలుతురు వల్ల శత్రుపక్షీయులు పారిపోతూ కన్పించారు. అలా పాండవసైన్యం పారిపోతుంటే మహారథులయిన ద్రోణకర్ణులు వెంబడించి అనేక బాణాలను ప్రయోగించి సంహరించారు. పాంచాల సైన్యాలు అంతటా చెల్లాచెదరయి నశిస్తుంటే' శ్రీకృష్ణుడు దీన చిత్తుడయి అర్జునునితో ఇలా అన్నాడు.

"మహాధనుష్కులయిన ఈ ద్రోణకర్ణులు ఏకమయి ధృష్టద్యుమ్న, సాత్యకులను, పాంచాలురను బాణాలతో చాలా తీవ్రంగా గాయపరిచారు. అర్జునా! వీరు కురిపించిన బాణ వర్షంవల్ల మన సైన్యంలోని మహారథులు కాలునిలుపలేకపోతున్నారు. ఎంతగా వారిస్తున్నా మనసేన నిలవటం లేదు." అలా పారిపోతున్న సేనను చూసి, కృష్ణార్జునులు "పాండవసేనలలోని వీరులారా! భయపడి పారిపోకండి. భయాన్ని వదిలేయండి. ఆయుధాలతో సంసిద్ధమయి మనసైన్యాల వ్యూహాలతో ఆ ద్రోణకర్ణులను బాధించటానికి గట్టిగా ప్రయత్నిస్తాం. శూరులు అయిన ఈ ద్రోణకర్ణులను ఉపేక్షిస్తే ఈ రాత్రికే వీరు మీ సేనలను అన్నింటిని వినాశం చేస్తారు." కృష్ణార్జునులు ఈ రీతిగా పలుకుతుండగా మహాబలుడయిన భీముడు సైన్యాన్ని యుద్ధోన్ముఖుల్ని చేసి వచ్చాడు. ఇలా వస్తున్న భీముని చూసి కృష్ణుడు అర్జునుని సంతోషపెడుతూ మళ్ళీ ఇలా అన్నాడు. "యుద్ధరంగంలో మెచ్చుకోదగిన ఈ భీముడు సోమక పాండవసేనతో గూడి వేగంగా మహారథులయిన ద్రోణకర్ణులను ఎదిరిస్తున్నాడు. అర్జునా! ఈయనతోను, మహారథులయిన పాంచాలురతోను కలిసి, సైన్యాలకు ధైర్యం కలిగించటానికి శత్రువులతో యుద్ధం చేయి." తరువాత కృష్ణార్జునులు యుద్ధరంగంలో ద్రోణకర్ణులను సమీపించి నిలిచారు. మళ్ళీ వెనుకకు తిరిగి వచ్చిన యుధిష్ఠిరుని మహత్తర సైన్యాన్ని యుద్ధంలో ద్రోణకర్ణులు నాశనం చేయసాగారు. రాజా! చంద్రోదయకాలంలో పెంపొందుతున్న రెండు సముద్రాలకు వలె రాత్రి సమయంలో సంకులమయిన మహాయుద్ధం జరిగింది. అప్పుడు మీ సేన చేతులలోని కాగడాలను వదలిపెట్టి పిచ్చెక్కినట్లు సంకులభావం లేకుండా పాండవసేనతో యుద్ధం చేసింది. దుమ్ముతో, చీకటితో క్రమ్ముకొని, మిక్కిలి భయంకరమయిన సమయంలో కేవలం నామ గోత్రాలను చెప్పుతూ, జయకాంక్షులై ఉభయపక్ష సైనికులు యుద్ధం చేశారు. మహారాజా! స్వయంవరంలోవలె యుద్ధ రంగంలో కూడా యుద్ధం చేస్తున్న రాజులు చెపుతున్న పేర్లు వినిపించాయి. ఒక్కక్షణంలో అంతటా గొప్ప నిశ్శబ్దం అయింది. వెంటనే కోపించి యుద్ధం చేస్తూ ఓడిపోతున్న, జయిస్తున్న వారి కేకల ధ్వనులు సమధికంగా వినిపించాయి. కురుసత్తమా! బాగా దీపాలు కనిపించే చోట నల్లా ఆ శూరులు మిడతల్లాగా చచ్చిపడిపోతున్నారు. రాజేంద్రా! కౌరవ పాండవులు అలా సంకుల సమరం సాగిస్తుండగా రాత్రి బాగా చీకటి క్రమ్ముకొంది."

173. కర్ణుడు ధృష్టద్యుమ్నుని ఓడించుట. ఘటోత్కచుని యుద్ధమునకు పంపుట.

సంజయుడు చెప్పాడు - "తరువాత కర్ణుడు యుద్ధరంగంలో ధృష్టద్యుమ్నుని చూసి, మర్మస్థానాలను ఛేదించి, పది బాణాలతో వక్షఃస్థలాలలో కొట్టాడు. ధృష్టద్యుమ్నుడు వెంటనే కర్ణుని పదిబాణాలతో కొట్టి, "నిలు, నిలు" అని అన్నాడు. వారు ఇద్దరు పెద్ద రథాలను ఎక్కి, ఒకరిని ఒకరు బాణాలతో కప్పివేసుకున్నారు. మళ్ళీ పరస్పరం గాయపరచుకొన్నారు. ధృష్టద్యుమ్నుని సారథిని, నాలుగు గుర్రాలను బాణాలతో గాయపరిచాడు కర్ణుడు. ఆయన ధనుస్సును పదునయిన బాణాలతో ఖండించాడు. ఆయన సారథిని రథంలోని ఆసనం మీదినుంచి ఒక బాణంతో నేలగూల్చాడు. ధృష్టద్యుమ్నుడు రథం లేక, గుఱ్ఱాలు, సారథి మరణించగా ఘోరమయిన పరిఘం అనే ఆయుధంతో కర్ణుని రథాశ్వాలను పిండిచేశాడు. ఆ కర్ణుని పాములవంటి అనేక బాణాలతో గాయపడి, ధృష్టద్యుముడు త్వరగా నడచి, యుధిష్ఠిరుని సేనలోకి ప్రవేశించాడు. ఆర్యా! ధృష్టద్యుమ్నుడు సహదేవుని రథం ఎక్కి, మళ్ళీ కర్ణుని మీదకు వెళ్ళబోతుంటే ధర్మరాజు ఆయనను వారించాడు. కర్ణుడు సింహనాదంతో కలిసేటట్లుగా ధనుష్టంకారం చేశాడు. శంఖం తారాస్థాయిలో ఊదాడు. ధృష్టద్యుమ్నుడు యుద్ధంలో ఓడిపోవటం చూచి సోమకులతో కూడా పాంచాలురు కోపపరవశులయి అందరూ సూతపుత్రుని వధించటానికి శస్త్రాలను గ్రహించారు. యుద్ధం నుంచి వెనక్కు తిరగటానికి మృత్యువును అవధిగా నిర్ణయించుకొని కర్ణుని మీదికి వెళ్ళారు. సూతుడు కర్ణుని రథానికి శంఖంలాగా తెల్లనివి, సింధు దేశీయాలు అయిన గుఱ్ఱాలను కట్టాడు. గురి తప్పని కర్ణుడు వర్షధారలతో మేఘం పర్వతాన్నివలె, మహారథులయిన పాంచాలురను ప్రయత్న పూర్వకంగా బాణాలతో వేధించాడు. కర్ణునిచే పీడితమయిన పాంచాల మహాసైన్యం సింహానికి భయపడిన లేడివలె పారిపోయింది.

ఆ రణభూమిలో గుర్రాలమీది నుంచి, ఏనుగులమీది నుంచి, రథాలమీది నుంచి నేలబడిన మనుష్యులు అక్కడక్కడ కన్పించారు. ఆ మహాయుద్ధంలో కర్ణుడు పారిపోయే యోధుని బాహువులను, కుండలాలతో గూడిన శిరస్సును ఖండించాడు. ఏనుగులమీద ఉన్నా, గుర్రం మీద ఉన్నా, నేలపైన ఉన్నా వాడి తొడలను ఖండించాడు. పరుగెత్తుతున్న అనేకమహారథులు తమ శరీరాలు, వాహనాలు ఆ యుద్ధంలో తెగిపోవటం కూడా తెలుసుకోలేకపోయారు. ఈ రీతిగా గాయాలపాలవుతున్న సృంజయులూ, పాంచాలురూ గడ్డిపోచ కదిలినా కర్ణుడే అని భావించారు. యుద్ధంలో తమ పక్షంలోని అచేతనుడయి పరుగెత్తుతున్న యోధుని కూడా కర్ణుడే అనుకొని ఆతనిని చూసి, భయపడి, పారిపోతున్నారు.

భారతా! చెల్లాచెదరయి పారిపోతున్న ఆ సైన్యాలను కర్ణుడు బాణాలువేస్తూ వేగంగా వెంటపడ్డాడు. మహామనస్వి అయిన కర్ణుడు సంహరిస్తున్న చైతన్యహీనులు, మోహితులయి పాంచాలసేనలో ఒకరినొకరు చూస్తూ యుద్ధరంగంలో నిలువలేకపోయారు. రాజా! కర్ణుడు, ద్రోణుడు ప్రయోగించిన బాణాల దెబ్బలు తిని, దిక్కులు అన్నీ చూస్తూ పాంచాలురు పారిపోయారు. అప్పుడు యుధిష్ఠిరుడు తన సైన్యం పారిపోవటం చూసి, తానుకూడా యుద్ధరంగం నుంచి తొలగదలచి అర్జునునితో ఇలా అన్నాడు. "విల్లుచేతబట్టుకొని దారుణమయిన అర్ధరాత్రి సమయంలో తహతహలాడిస్తున్న సూర్యునివలె గొప్ప విలుకాడయిన కర్ణుని చూడు. అర్జునా! కర్ణుని బాణాలతో గాయపడి, దిక్కులేని వాళ్ళలాగా హాహాకారాలు చేస్తున్న నీ బంధువుల ఆర్తధ్వానాలు ఎడతెరిపి లేకుండా వినిపిస్తున్నవి. ఈ కర్ణుడు ధనుస్సులో బాణాలను కూర్చటంలో, విడవటంలో వ్యవధానం నాకు కనపడటం లేదు. మనలను ఈయన నాశనం చేయటం నిశ్చయం. ధనంజయా! ఇక్కడ ఈ సమయంలో ఏం చేస్తే బాగుంటుందో కర్ణవధతో కూడా దాన్ని చెయ్యి."

మహారాజా! ఇలా అన్న చెప్పగా అర్జునుడు కృష్ణునితో ఇలా అన్నాడు. "ఈ మహారాజు ఈనాటి కర్ణుని పరాక్రమం చూసి భయపడ్డాడు. మనసేన మాటిమాటికి పారిపోతున్న ఈ స్థితిలో కర్ణుని సేన విషయంలో మనం ఏం చేయాలో త్వరగా నీవు నిశ్చయించు. మధుసూదనా! ద్రోణుని బాణాలతో గాయపడి, కర్ణుడికి భయపడుతున్న మనసేనలు నిలువలేకపోతున్నవి. ఏమాత్రం జంకులేకుండా సంచరిస్తూ మనసేనలోని మహారథికుల మీద పదునయిన బాణాలు వేస్తూ పారద్రోలుతున్న ఈ కర్ణుని చూస్తున్నాను. యుద్ధరంగంలో వీరవిహారం చేస్తున్న ఈయనను ఎదురుగా చూస్తూ కాలితో త్రొక్కిన పాములాగా సహించలేను. మధుసూదనా! కర్ణుడున్నచోటికి మనరథం నడుపు. నేను ఆయనను గాని, ఆయన నన్నుగాని చంపాలి." శ్రీవాసుదేవుడు ఇలా అన్నాడు - 'అర్జునా! యుద్ధరంగంలో మహేంద్రుని వలె సంచరిస్తూ మానవశ్రేష్ఠుడై, అతిమానుషమయిన పరాక్రమం గల కర్ణుని చూస్తున్నాను. ధనంజయా! యుద్ధంలో ఇతనిని ఎదుర్కొనటానికి నీవుగాని, రాక్షసశ్రేష్ఠుడయిన ఘటోత్కచుడు గాని తగినవారు. వేరొకడు లేడు. మహాబాహూ! సూతపుత్రుని యుద్ధంలో నీవు ఎదుర్కొనదగిన సమయం వచ్చిందని నేను అనుకోవటం లేదు. ప్రజ్వలించే మహోల్కలాగా వెలిగిపోయే ఇంద్రుడు ఇచ్చిన శక్తి అనే ఆయుధం ఉన్నది. సూతపుత్రుడు యుద్ధంలో నీమీద ప్రయోగించటానికే ఆశక్తిని సురక్షితంగా ఉంచుకొన్నాడు. అది మహాభయంకర రూపం ధరించగలదు. మహాబలుడయిన ఘటోత్కచుడు కర్ణుని ఎదుర్కొనాలి. దేవతల పరాక్రమం కల ఆతడు భీముని కుమారుడు గదా! అతని

వద్ద దివ్య రాక్షస ఆసురాస్త్రాలు ఉన్నాయి. ఆ ఘటోత్కచుడు మీయందు ప్రేమగలవాడు, మీ మేలు కోరేవాడు. అతడు తప్పక యుద్ధంలో కర్ణుని జయిస్తాడు. ఈ విషయంలో నాకు సందేహం లేదు."

ఇలా చెప్పగా అర్జునుడు ఆతనిని ఆవాహనం చేశాడు. వెంటనే ఘటోత్కచుడు వారి ఎదుట ప్రత్యక్షమయ్యాడు. రాజా! కవచధారి, బాణం కలవాడు, ఖడ్గధరుడు, ధనుర్ధారి అయిన ఘటోత్కచుడు శ్రీకృష్ణునికి, అర్జునునికి నమస్కరించి కృష్ణుని నేను ఏం చెయ్యాలో సెలవియ్యమని అడిగాడు. అప్పుడు మేఘం లాగా నల్లనివాడై, తేజోవంతమయిన ముఖం, కుండలాలతో వెలిగిపోతున్న ఘటోత్కచునితో శ్రీకృష్ణుడు నవ్వుతున్నట్లు ఇలా అన్నాడు. "వత్సా! ఘటోత్కచా! నేను చెప్పే విషయం బాగా తెలుసుకో. ఇప్పుడు పరాక్రమించవలసిన సమయం ఆసన్నమయింది. ఈ అవకాశం నీకే కాని ఇంకెవ్వరికీ లేదు. అలాంటి నీవు ఆపదలో మునుగుతున్న నీ చుట్టాలకు తెప్పవు కావలసింది. నానావిధాలయిన అస్త్రాలు నీకు ఉన్నాయి. రాక్షసమాయ కూడా ఉంది. ఘటోత్కచా! ఆలకాపరి ఆవులను తోలినట్లు, యుద్ధంలో కర్ణుడు పారద్రోలే పాండవ సైన్యాన్ని చూడు. ఈ కర్ణుడు పాండవసైన్యంలోని క్షత్రియ శ్రేష్ఠులను ఎలా సంహరిస్తున్నాడో చూడు. మనవారు మహత్తరమయిన బాణ వర్షాన్ని కురిపిస్తూ గూడా, కర్ణుని బాణాగ్నిచే పీడితులయి నిలువలేక పోతున్నారు. అర్ధరాత్రి పూట కర్ణుని బాణ వర్షంతో పీడితులయిన ఈ పాంచాలురు సింహానికి భయపడిన మృగాలలాగా పారిపోతున్నారు. ఈ రీతిగా యుద్ధంలో పెచ్చు పెరుగుతున్న సూతపుత్రుని నీవు తప్ప ఇంకెవ్వరూ అడ్డుకొనలేరు. అలాంటి నీవు నీ మేనమామల, తండ్రుల తేజస్సుకు అస్త్రబలానికి తగిన వీరకార్యం చేయవలసింది. హిడింబా పుత్రా! మానవులు పుత్ర సంతతి కావాలని కోరుకోవటం దుఃఖాన్నుంచి మమ్ములను ఎలా తరింపజేస్తాడా అనే ఉద్దేశ్యంతోనే. ఘటోత్కచా! పితరులు పుత్రులను స్వార్థంకోసమే కోరుకుంటారు. వాళ్ళు హితులై ఈలోకాన్నుంచి తరింపజేసి పరలోకానికి చేర్చటం కోసమే. భీమనందనా! సంగ్రామ రంగంలో యుద్ధంచేస్తుంటే నీకు ఎల్లప్పుడు భయంకరమయిన బలమూ, రాక్షసమాయలు పుష్కలంగా ఉన్నాయి. శత్రుతాపనా ! ఎవ్వరు దాటిపోలేనివి అవి. అర్ధరాత్రిలో కర్ణుడు ప్రయోగించిన బాణాలతో తీవ్రంగా దెబ్బతిన్న పాండవసేన కౌరవసైన్య సముద్రంలో మునిగిపోతున్నది. ఆ సేనకు నీవు తీరమయి కాపాడు. రాత్రి కాలంలో రాక్షసులు బాగా తీవ్రపరాక్రమవంతులు బలిష్ఠులు, చెనకరానివారు, శూరులు, వీరత్వంతో విక్రమించేవారు అవుతారుగదా! ఈ రాత్రిపూట యుద్ధంలో, రాక్షసమాయతో విలుకాడయిన కర్ణుని జయించు. పాండవులు ధృష్టద్యుమ్నుని ముందుంచుకొని ద్రోణుని వధిస్తారు."

"శ్రీకృష్ణుని మాటలు విని, అర్జునుడు ఘటోత్కచునితో ఇలా అన్నాడు. "ఘటోత్కచా! మన సైన్యాలు అన్నింటిలో నీవు, దీర్ఘబాహువు అయిన సాత్యకి, భీముడు శ్రేష్ఠులని నా అభిప్రాయం. అందువల్ల ఈ రాత్రి సమయంలో కర్ణునితో ద్వంద్వ యుద్ధానికి వెళ్ళు. మహారథుడయిన సాత్యకి నీకు వెన్నుదన్నుగా ఉంటాడు. పూర్వం ఇంద్రుడు కుమారస్వామితో కలిసి తారకాసురుని చంపినట్లు నీవు యుద్ధంలో సాత్యకి సహాయంతో కర్ణుని జయించు." ఘటోత్కచుడు అన్నాడు - "మహాబాహూ! అలాగే నీవు చెప్పినట్లే చేస్తాను. నీవు నియోగించటం వల్ల కర్ణుని వధింపగోరి వెళ్తాను. కర్ణుని, ద్రోణుని, అస్త్రవిద్యలో ఆరితేరిన మహాత్ములయిన ఇతర క్షత్రియవీరులను ఎదుర్కొనటానికి నేను సమర్థుడనే. ఈ రాత్రిపూట కర్ణునికి తగిన రీతిగా యుద్ధాన్ని ప్రసాదిస్తాను. భూమి ఉన్నంతకాలం దీన్ని గురించి మానవులు వివిధంగా చెప్పుకునేటట్లు చేస్తాను. నేను రాక్షస ధర్మాన్ని అనుసరించి శూరులను గాని, భయపడిన వారిని గాని, దోసిలొగ్గి శరణన్నవారిని గాని వదలకుండా అందరిని సంహరిస్తాను." ఘటోత్కచుడు ఇలా చెప్పి నీ సైన్యాన్ని భయపెడుతూ తుముల సంగ్రామంలో కర్ణుని ఎదిరించాడు. వెలిగిపోతున్న ముఖంలో వెలుగు వెదజల్లుతున్న జుట్టుతో తన మీదికి వస్తున్న ఆతనిని మానవ శ్రేష్ఠుడయిన కర్ణుడు నవ్వుతూ ఎదుర్కొన్నాడు. రాజేంద్రా! ఇంద్ర ప్రహ్లాదులకు వలె ఆ యుద్ధరంగంలో గర్జిస్తున్న కర్ణఘటోత్కచుల మధ్య భీషణ సమరం సాగింది."

174. అలంబుష వధ.

"రాజా! కర్ణుని రథంవైపు ఆతనిని సంహరించటానికి వస్తున్న ఘటోత్కచుని చూసి, దుర్యోధనుడు దుశ్శాసనునితో ఇలా అన్నాడు. "యుద్ధంలో కర్ణుని పరాక్రమం చూసి, ఈ రాక్షసుడు త్వరగా ఆయనవైపు వస్తున్నాడు కాబట్టి ఆ మహారథుని అడ్డగించు. నీవు పెద్దసేనతో గూడి ఘటోత్కచునితో యుద్ధం చేయదలచిన కర్ణుని వద్దకు వెళ్ళు. సైన్యంతో గూడి సర్వసంసిద్ధమయి యుద్ధంలో కర్ణుని రక్షించు. మన పరాకువల్ల రాక్షసుడు కర్ణుని నాశనం చేయరాదు." రాజా! ఇలా చెపుతుండగానే జటాసురుని కుమారుడయిన అలంబుషుడు దుర్యోధనుని దగ్గరకు వచ్చి ఇలా అన్నాడు. "దుర్యోధనా! పాండవులను సైన్యాలతో గూడా నీవు ఆజ్ఞాపిస్తే సంహరిస్తాను. పూర్వం మా తండ్రి జటాసురుని నీచులయిన పాండవులు రాక్షసవినాశకర మయిన పనిచేసి చంపివేశారు. రాజేంద్రా! శత్రువుల రక్తమాంసాల పూజతో దానికి ప్రతీకారం చేయగోరుతున్నాను. కాబట్టి నన్ను అనుమతించు." ఆ మాటలకు సంతోషించి దుర్యోధనుడు ఆతనితో పలుమారులు

ఇలా అన్నాడు. "ద్రోణకర్ణాదులతో కూడా నేను శత్రువులను వధింప సమర్థుడను. నా ఆజ్ఞానుసారం నీవు వెళ్ళి రాక్షస మానవుల పుత్రుడు, క్రూర కార్యాలు చేసే ఘటోత్కచుని యద్ధంలో జయించు. పాండవుల మేలు గోరేవాడు, ప్రతిరోజు ఏనుగులను, గుర్రాలను, రథాలను ధ్వంసంచేస్తూ, ఆకాశంలో విహరించే ఆ రాక్షసుని యుద్ధంలో యమనివాసానికి పంపు." అలంబుషుడు 'సరే' అని ఘటోత్కచుని యుద్ధానికి పిలిచి, నానా శస్త్రాలను కురిపించాడు.

పెద్దగాలి మేఘాలను వలె ఘటోత్కచుడు ఒక్కడే అలంబుషుని, కర్ణుని, కౌరవసైన్యాన్ని మథించాడు. అలంబుషుడు ఘోటత్కచుని మాయాబలం చూసి, అనేక విధాలయిన బాణ సమూహాలను వేగంగా ఆయన మీద కురిపించసాగాడు. మహాబలుడయిన ఆతడు అనేక బాణాలతో ఘటోత్కచుని గాయపరిచి, బాణ సమూహంతో పాండవ సేనను పారద్రోలాడు. పాండవసేనలు రాత్రి సమయంలో గాలిచెదర గొట్టిన మేఘాలవలె చెల్లాచెదరయ్యాయి. అలాగే ఘటోత్కచుడు పారద్రోలిన నీ సైన్యాలు అర్ధ రాత్రి చేతులలోని కాగడాలను వదలి వేలకొలదిగా పరుగెత్తాయి. అప్పుడు కోపించిన అలంబుషుడు మహాయుద్ధంలో ఘటోత్కచుని అంకుశాలతో పెద్ద ఏనుగును వేధించినట్లు పదిబాణాలతో కొట్టాడు. ఘటోత్కచుడు అలంబుషుని రథాన్ని సూతుని, ఆయుధాలను అన్నింటిని నూపు గింజలంత చిన్న ముక్కలు చేసి, చాలా దారుణంగా గర్జించాడు. తరువాత మేఘం నిశ్చలమయిన మేరు పర్వతం మీదవలె వేలకొలది బాణాలతో కర్ణుని పైన, కౌరవులనేకుల పైన వర్షం కురిపించాడు. ఘటోత్కచుడు మథించిన కౌరవసైన్యం సంక్షోభం చెందింది. చతురంగ సైన్యాలు తమలో తాము ఒకరినొకరు నాశనం చేసుకొన్నారు. అప్పుడు అలంబుషుడు రథం విరిగి, సారథి మరణించగా క్రుద్ధుడయి, ఘటోత్కచుని చాలావేగంగా దృఢమయిన పిడికిలితో గ్రుద్దాడు. భూకంపం వచ్చినప్పుడు చెట్లు, గడ్డి, పొదలతో గూడిన పర్వతంవలె అలంబుషుని పిడిగ్రుద్దుతో ఘటోత్కచుడు చలించాడు. అప్పుడు భీమపుత్రుడు శత్రుసమూహాన్ని నాశనం చేసే పరిఘ అనే ఆయుధం వంటి పిడికిలి పోటుతో అలంబుషుని కొట్టాడు. క్రుద్ధుడయిన హిండింబా పుత్రుడు ఆతనిని తీవ్రంగా మథించి, ఇంద్రధ్వజాల వంటి చేతులతో, ఆతనిని నేలమీద పడేటట్లు బాగా కొట్టాడు. అలంబుషుడు ఘటోత్కచుని నుంచి తప్పించుకొని, లేచి, వేగంగా ఘటోత్కచుని మీదికి దూకాడు. అలంబుషుడు గూడా ఘటోత్కచుని గ్రుద్ది, పైకెత్తి నేలమీద పడేసి మథించాడు. పెద్ద శరీరాలతో, పెద్దగా కేకలు పెడుతున్న, ఘటోత్కచాలంబుషుల మధ్య శరీరాలు గగుర్పొడిచేటట్లు సంకులయుద్ధం జరిగింది.

మాయలతో ఒకరినొకరు మించిపోతూ ఇంద్రవిరోచనులవలె యుద్ధం చేశారు. వారిద్దరు ఒకసారి అగ్ని సముద్రులయి, ఇంకోసారి గరుడతక్షకులయి, మరొకసారి మేఘమహా వాయువులయి, వేరొకసారి వజ్రాయుధ మహాపర్వతాలయి పోరాడారు. వారిలో ఒకరు ఏనుగు కాగా, ఇంకొకరు పెద్దపులి అయి ఒకసారి, ఇంకోసారి ఒకరు సూర్యుడు, ఇంకొకరు రాహువు అయి పోరాడారు. ఈరీతిగా వందలకొలది మాయలను సృజిస్తూ అలంబుష ఘటోత్కచులు ఒకరినొకరు చంపగోరి చాలాతీవ్రంగా, చిత్రంగా యుద్ధం చేశారు. వారు ఒకరినొకరు పరిఘలతో, గదలతో, ప్రాసలతో, ముద్గరాలతో, పట్టిసాలతో, ముసలాలతో, పర్వత శిఖరాలతో కొట్టుకొన్నారు. మహా మాయావులు, రాక్షసశ్రేష్ఠ లయిన వారిద్దరూ గుర్రాలతో, ఏనుగులతో, పదాతులతో ఒకరినొకరు దెబ్బకొడుతూ యుద్ధం చేశారు. అప్పుడు ఘటోత్కచుడు బాగా కోపించి, అలంబుషుని చంపదలచి, డేగలాగా పైకి ఎగిరి, క్రిందికి దూకాడు. అలంబుషుని పట్టుకొని పైకెత్తి మయుని యుద్ధంలో విష్ణువు కొట్టినట్లు నేలమీదికి విసిరికొట్టాడు. ఘటోత్కచుడు అద్భుతంగా కన్పించే తన ఖడ్గం ఎత్తి, అత్యంత భయంకరంగా గర్జిస్తూ శత్రు వయిన అలంబుషుని భయంకర శిరస్సును ఖండించి, శరీరం నుంచి వేరుచేశాడు. రక్తం కారుతున్న అలంబుషుని శిరస్సును జుట్టుతో పట్టుకొని, ఘటోత్కచుడు వేగంగా దుర్యోధనుని రథం వద్దకు వెళ్ళి, నవ్వుతూ దుర్యోధనుని రథం మీద ఆ శిరస్సును పడేసి, వర్షాకాలంలో మేఘం ఉరిమినట్టు భయంకరంగా గర్జించాడు.

తరువాత దుర్యోధనునితో ఇలా అన్నాడు - ఇడుగో నీ ఆప్తుడు చచ్చాడు. వీడి పరాక్రమం అంతా చూచావు గదా. మళ్ళీ ఇకముందు నీకు, కర్ణునికి పట్టబోయే దుర్గతిని కూడా చూస్తావు. **తన ధర్మాన్ని, అర్థాన్ని కామాన్ని ఈమూడింటిని కోరేవాడు వట్టి చేతులతో రాజును బ్రాహ్మణుని, స్త్రీని చూడగూడదు కదా!*** నేను కర్ణుని వధించే వరకు నీవు ఇక్కడ సంతోషంగా ఉండు." అని చెప్పి ఘటోత్కచుడు కర్ణుని రథం వైపు కోపంతో రణరంగంలో బాణసమూహాలను వదులుతూ వెళ్ళాడు. మహారాజా! ఆ తరువాతి యుద్ధభూమిలో నరరాక్షసులకు ఘోరరూపమూ, భయంకరమూ, ఆశ్చర్యకరమూ అయిన యుద్ధం జరిగింది."

---

* **స్వధర్మమర్థం కామం చ త్రితయం యోఽభివాంఛతి ॥ 42**
రిక్తపాణిర్న పశ్యేత రాజానం బ్రాహ్మణం స్త్రియమ్ ।

175. ఘటోత్కచుని రథాదుల వర్ణన, కర్ణఘటోత్కచుల ఘోరయుద్ధము.

ధృతరాష్ట్రుడిలా అన్నాడు. "కర్ణుడు, ఘటోత్కచుడు రాత్రి యుద్ధంలో ఎలా తలపడ్డారు? ఆ యుద్ధం ఎలా జరిగింది ? ఆ రాక్షసుని రూపం ఎలా ఉంది? వాడి రథం, గుర్రాలు, ఆయుధాలు అన్నీ ఎలాంటివి ? వాడి గుర్రాలు రథం, జెండా, ధనుస్సు ఎంత పరిమాణం గలవి? వాడి కవచం కిరీటం ఎలాంటివి? నేను అడుగుతున్న ఇది అంతా చెప్పు. సంజయా! చెప్పటంలో నీవు నేర్పరివి."

సంజయుడు చెప్పాడు - "ఆ ఘోటత్కచుని కన్నులు ఎఱ్ఱగా ఉంటాయి. వాడి శరీరం చాలా పెద్దది. ముఖం రాగిలా ఎర్రగా ఉంటుంది. పొట్ట గుంటగా ఉంటుంది. వెంట్రుకలు నిటారుగా ఉంటాయి. గడ్డం, మీసాలు, నల్లగా ఉంటాయి. చెవులు గసిక (మేకు)లవలె ఉంటవి. దవడలు పెద్దవి, ముఖం చెవులదాకా ఉంటుంది. పదునైన కోరలు, అతడు చూడటానికి మహాభయంకరుడు. అతని నాలుక, పెదవులు, చాలాపొడవైనవి, ఎఱ్ఱనివి, కనుబొమలు వ్రేలాడుతుంటాయి. ముక్కు లావు, శరీరం నీలవర్ణం. మెడ లోహిత వర్ణం, పర్వతంలాంటి శరీరం. వీటితో భయంకరుడు. అతడు పెద్దశరీరం, పొడవైన చేతులు, పెద్ద తల గలవాడు. మహాబలుడు. వికారంగా ఉంటాడు. అతని స్పర్శ పరుషంగా ఉంటుంది. వికారమయినవాడు. పిక్కలు బాగా పెద్దవి. అతని పిరుదులు పెద్దవి. బొడ్డులోపలికి ఉంటుంది. శరీరం బాగా పెరగలేదు. చేతిమురుగులు కూడా తగినట్లే ఉంటాయి. మహామాయావి. పర్వతం అగ్నిమాలను దాల్చినట్లు గుండెల మీద కంటె ధరించి ఉంటాడు. అనేకరూపాల అంగాలతో శోభితమై, తోరణం వంటి, స్వచ్ఛమయిన బంగారు కిరీటం ఆతని శిరస్సు మీద ప్రకాశిస్తుంది. కుండలాలు ఉదయించే సూర్యునివంటివి. చక్కని బంగారు మాలికను, విశాలమై, కాంతిమంతమై కంచుతో నిర్మితమయిన కవచం ధరిస్తాడు. అతని మహారథానికి గల వందల కొలది చిరుమువ్వలు మధురంగా మ్రోగుతూ ఉంటాయి. జెండా ఎఱ్ఱటిది. ఎలుగుబంటి తోలుతో ఆ రథం కప్పబడి ఉంటుంది. నాలుగు వందల మూరల పొడవు వుంటుంది. సమస్తమయిన శ్రేష్ఠాయుధాలు ఆ రథంలో ఉంటాయి. ధ్వజంతో శోభిస్తుంటుంది. ఎనిమిది చక్రాలుగల అది మేఘంవలె గంభీరధ్వని కలది. ఆ రథానికి కట్టిన నూరుగుర్రాలు మంచి బలం గలవి, మదించిన ఏనుగుల వంటివి, ఎర్రని కన్నులు గలవి. భయంకరమయినవి, కోరిన రంగూ, వేగమూ కలవి. ఆగుఱ్ఱాల మెడల మీద పొడవైన వెంట్రుకలున్నాయి. అవి శ్రమను జయించాయి. అవి అన్నీ విపులమయిన కేసరాలతో శోభిస్తున్నవి. మాటి మాటికి సకిలిస్తున్నవి. ఘటోత్కచునికి వికారమయిన కన్నులు, ప్రదీప్తమయిన ముఖమూ, కుండలాలు గల సూతుడు ఉన్నాడు.

సూర్యకిరణాలతో సమాన కాంతిగల పగ్గాలతో, గుర్రాలను అదుపులో పెడుతున్నాడు. ఆ రథికుడు అరుణసారథి అయిన సూర్యునిలాగా విరాజిల్లుతున్నాడు. పెద్దమబ్బుతో గూడిన పెద్దకొండలాగా అతని రథంమీద ఆకాశాన్ని అంటే పెద్ద జెండా ఉన్నది. ఆ రథంమీద ఎర్రటి తలగల్గి మాంసం తినే చాలా భయంకరమయిన గ్రద్ద కన్పిస్తున్నది. వీరులను సంహరించే ఆ రాత్రి యందు ఇంద్రుని వజ్రంవలె భయంకరటంకారం గల దృఢమయిన అల్లెత్రాడు గల్గి ఒకమూర వెడల్పు, పన్నెండు మూరల పొడవు, గల ధనుస్సును సారిస్తూ, బండి ఇరుసంత పొడవయిన బాణాలతో అన్ని దిక్కులను కప్పివేస్తూ కర్ణుని మీదికి వెళ్ళాడు.

రథం మీద నిశ్చలంగా నిలిచి, ధనుస్సును సారిస్తున్న ఆతని ధనుష్టంకారం ఉరుమువలె వినిపించింది. భారతా! ఆతని చేత భయపెట్టబడుతున్న నీ సైన్యాలు అన్నీ సముద్రంలోని పెద్ద తరంగాలవలె కంపించినవి. వికారమయిన కన్నులతో, భయంకరంగా మీదపడుతున్న ఆతనిని చూసి, నవ్వుతూ కర్ణుడు త్వరగా ముందుకు వచ్చి వారించాడు. అతిసమీపం నుంచి బాణాలు వేస్తూన్న ఆ ఘటోత్కచుని, కర్ణుడు ఒక గజసమూహాధిపతిని ఇంకొక గజబృందాధిపుని వలె ఎదుర్కొన్నాడు. నరాధిపా! కర్ణరాక్షసుల ఆ యుద్ధం ఇంద్రశంబరుల యుద్ధంవలె తీవ్రమయింది. వారు ఇద్దరు భయంకరవేగం గల ధనుస్సులను చేపట్టి, తీవ్రబాణాలతో ఒకరినొకరు గాయపరచుకొంటూ, బాణసమూహంతో కప్పివేసుకొన్నారు. తరువాత పూర్తిగా వంచిన ధనుస్సులలోనుంచి విడువబడి వంగిన ములకులు గల బాణాలతో కంచు కవచాలను చీల్చి వేసుకొని, ఒకరినొకరు నివారించారు. ఆ ఇద్దరు వీరులు పరస్పరం పదునయిన గోళ్ళతో పెద్దపులులవలె, దంతాలతో శ్రేష్ఠగజాలవలె రథశక్తులతో, బాణాలతో గాయపరచుకొన్నారు. బాణాలను సంధిస్తూ, శరీరాలను ఛేదించుకొంటూ బాణా లనే ఉల్కలతో కౌరవులను దహిస్తూ, తేరిపారజూడ వీలు లేనివారయ్యారు. సర్వాంగాలు గాయాలయి రక్త ప్రవాహాలతో నిండిన కర్ణ ఘటోత్కచులు, అరుణజలాన్ని స్రవిస్తున్న గైరిక పర్వతాలవలె విరాజిల్లారు. వారిద్దరి శరీరాలు బాణాలమొనలతో చర్మం లేచిపోయినాయి. ఒకరినొకరు చీల్చివేసుకొంటున్నారు. మహా తేజస్వులయిన వారు ఇద్దరు విశ్వప్రయత్నం చేస్తూ కూడా ఒకరినొకరు కంపింపజేయలేకపోయారు. రాజా! ఆ యుద్ధరంగంలో ప్రాణాలనే పణంగాపెట్టిన కర్ణరాక్షసుల మధ్య ప్రారంభమయిన రాత్రియుద్ధం సుదీర్ఘంగా చాలాసేపు జరిగింది.

ఆ ఘటోత్కచుడు తీక్షణమయిన బాణాలను సంధించటం, వేయటం చేస్తుంటే వచ్చే ధనుష్టంకారధ్వనితో, స్వపక్ష పరపక్షవీరులు భయంతో వణికిపోయారు. రాజా!

అస్త్రజ్ఞశ్రేష్ఠుడయిన కర్ణుడు ఘటోత్కచుని మీరిపోలేనప్పుడు దివ్యాస్త్రాన్ని సంధించాడు. కర్ణుడు దివ్యాస్త్రాన్ని సంధించటం చూచిన ఘటోత్కచుడు రాక్షస మహామాయను సృష్టించాడు. శూలాలు, ముద్గరాలు, ధరించి. కొండలు, చెట్లు చేతులతో పట్టుకొన్న ఘోరమయిన మహత్తరమయిన రాక్షససేనతో చుట్టి ఉన్నాడు. మహాధనుస్సును ఎక్కుపెట్టిన ఆతనిని చూసి, రాజు లందరూ ఉగ్రమయిన కాల దండాన్ని ధరించి వస్తున్న యము డనుకొని వ్యథచెందారు. ఘటోత్కచుడు చేసిన సింహనాదానికి భయపడి, ఏనుగులు మూత్రం విడిచాయి. యోధులు వ్యథచెందారు. అర్ధరాత్రి సమయంలో అధికబలం గల రాక్షససేనలు తీవ్రమూ, భయంకరమూ అయిన రాళ్ళవాన అంతటా కురిపించాయి. ఇనుప చక్రాలు, ముళ్ళగదలు, శక్తులు, తోమరాలు, ఎడతెరపి లేకుండా శూలాలు, శతఘ్నులు, పట్టిశాలు పడ్డాయి. భీకరమయిన ఆ యుద్ధం చూసి, నీ పుత్రులు వ్యథజెందారు. యోధులు పారిపోయారు. ఆ కౌరవసైన్యంలో ఒకే ఒకడు అస్త్రబలంలో ప్రశంసించదగినవాడు, అభిమాని అయిన కర్ణుడు మాత్రం స్వల్పంగా కూడా వ్యథజెందలేదు. ఘటోత్కచుడు నిర్మించిన మాయను బాణాలు వేసి, ధ్వంసం చేశాడు. ఇలా మాయ నశించగా, కుపితుడయిన ఘటోత్కచుడు ఘోరమయిన బాణాలను వేశాడు. అవి కర్ణునిలో ప్రవేశించాయి. ఆ బాణాలు కర్ణుని శరీరాన్ని ఛేదించి, రక్తంతో తడిసిపోయి, బాగా కోపించిన సర్పాలవలె భూమిలోకి చొచ్చుకుపోయాయి. ప్రతాపం, హస్తనైపుణ్యం గల కర్ణుడు తీవ్రంగా కోపించి ఘటోత్కచుని పదిబాణాలతో ఛేదించాడు. మర్మస్థానాలలో కర్ణునిబాణాలు తీవ్రంగా తగిలి, గాయపడిన ఘటోత్కచుడు అధిక బాధకులోనయి నూరు అంచులుగల దివ్యచక్రాన్ని గ్రహించాడు. కోపించిన భీమపుత్రుడు కర్ణుని చంపదలచి మణులు, రత్నాలతో అలంకృతమై, ఉదయకాలసూర్యుని వలె ప్రకాశిస్తున్న చిరుకత్తులు అంచులుగాగల ఆ చక్రాన్ని ప్రయోగించాడు. చాలా వేగంగా విసరటం చేత గిర గిరా తిరుగుతున్న చక్రం కర్ణుని బాణాలు తగిలి దురదృష్టవంతుని సంకల్పంవలె వ్యర్థమయి నేలగూలింది.

చక్రం పడిపోవటం చూసి, తీవ్రంగా కోపించిన ఘటోత్కచుడు, రాహువు సూర్యునివలె, కర్ణుని బాణాలతో కప్పివేశాడు. రుద్రునితో, ఉపేంద్రునితో, ఇంద్రునితో సమానమయిన పరాక్రమం గల కర్ణుడు ఏమాత్రం తొట్రుపడక, ఘటోత్కచుని రథాన్ని వేగంగా బాణాలతో కప్పివేశాడు. క్రుద్ధుడయిన ఘటోత్కచుడు బంగారుతో అలంకరించిన గదను త్రిప్పి విసిరివేయగా కర్ణుడు వేసిన బాణాల దెబ్బతో అది భగ్నమయిపడింది. ఘటోత్కచుడు ఆకాశానికి ఎగిరి కాలమేఘంలాగా గర్జిస్తూ ఆకాశంనుంచి వృక్షవర్షం కురిపించాడు. మాయావి అయిన భీమపుత్రుని ఆకాశంలోని మేఘాన్ని సూర్యుడు కిరణాలతో

ఛేదించినట్లు కర్ణుడు బాణాలతో కొట్టాడు. కర్ణుడు ఆ రాక్షసుని రథాశ్వాలను చంపి, రథాన్ని నూరుముక్కలు చేసి, వార్షుకమేఘంవలె ఆతనిపై బాణాలను కురిశాడు. ఆతని శరీరంలో రెండు అంగుళాల మేరగూడా గాయపడకుండా లేదు. ఒక్కక్షణకాలంలో ఆయన ముళ్ళతో నిండిన ముండ్లపందివలె కన్పించాడు. బాణ సమూహంతో నిండిపోయిన ఆ రథం గాని, గుర్రాలు గాని, ధ్వజం గాని, ఘటోత్కచుని గాని ఆ యుద్ధంలో ఎవ్వరూ చూడలేకపోయారు.

మాయావి అయిన ఘటోత్కచుడు కర్ణుని ఆ దివ్యాస్త్రాన్ని దివ్యాస్త్రంతో ధ్వంసం చేసి, మాయా యుద్ధంతో పోరాడాడు. ఆయన అప్పుడు కర్ణుని మాయతో, నైపుణ్యంతో ఎదుర్కొని యుద్ధం చేశారు. ఆకాశం నుంచి కనిపించకుండా బాణసమూహాలు పడ్డాయి. మహా మాయావి అయిన భీమసుతుడు కర్ణాదులను మోహపెడుతూ సంచరించాడు. ఆయన అనేక వికృత రూపాలు, అమంగళమయిన ముఖాలు దాల్చి, మాయతో సూతపుత్రుని దివ్యాస్త్రాలను మ్రింగివేశాడు. మళ్ళీ పలు విధాలుగా బాణాల దెబ్బలతో గాయపడి, బలంతరిగి, ఉత్సాహహీనుడై ఆకాశంలోనుంచి క్రింద పడి కన్పించాడు. ఆయన మరణించాడు అనుకొని కౌరవయోధులు సింహనాదాలు చేశారు. అంతట ఆయన అనేకమయిన నూతన శరీరాలతో అన్ని దిక్కుల కన్పించాడు. మహా శరీరుడయిన ఆయన మళ్ళీ అనేక శరీరాలతో, అనేక శిరస్సులతో మైనాక పర్వతంలాగా కన్పించాడు. మళ్ళీ ఆ రాక్షసుడు బొటన వ్రేలంత మాత్రం అయి ఎగిరిపడిన సముద్రతరంగం వలె అడ్డంగా, నిలువుగా ఉన్నాడు. ఒకమారు భూమిని చీల్చుకొని వచ్చాడు. మళ్ళీ వెంటనే నీటిలో మునిగాడు. ఇంకొక చోటినుంచి పైకి తేలి, అక్కడ కన్పించాడు. ఆయన పైనుంచి క్రిందకు దిగి బంగారు రథంమీద ఉన్నాడు. మాయతోనే భూమి ఆకాశం, సర్వదిక్కులలో తిరుగుతూ కవచధారి అయి కుండలాలు గల శిరస్సుతో కర్ణుని రథసమీపంలో సంచరించాడు. ఘటోత్కచుడు తబ్బిబ్బుపడకుండా కర్ణునితో ఇలా అన్నాడు. "సూతపుత్రా! ఇప్పుడు కదలక నిలువు. నేనుండగా ఎక్కడికి పోతావు? రణభూమిలో ఈరోజు నీ యుద్ధోత్సాహాన్ని నిర్మూలిస్తాను." అని పలికి కోపంతో కన్నులు ఎర్రబడగా క్రూర పరాక్రముడయిన ఘటోత్కచుడు విశాలమయిన ఆకాశంలోకి ఎగిరి సుదీర్ఘవికటాట్టహాసం చేశాడు. సింహం గజేంద్రుని వలె దెబ్బతీయసాగాడు. ఘటోత్కచుడు రథపుటిరుసంత పరిమాణం గల బాణాలను రథికశ్రేష్ఠుడయిన కర్ణునిమీద మేఘవర్షధారలను వలె కురిపించాడు. కర్ణుడు రాక్షసుని బాణవృష్టి తన మీదికి రాకముందే నాశనం చేశాడు.

కర్ణుడు తన మాయను ధ్వంసం చేయటం చూసి, ఘటోత్కచుడు అంతర్ధానం

చెంది, మళ్ళీ మాయను సృష్టించాడు. ఆయన చాలా ఎత్తయిన చెట్లతో నిండిన శిఖరాలతో గూడిన పెద్ద పర్వతం అయినాడు. దాని మీది నుండి శూలాలు, ప్రాసలు, ఖడ్గాలు, ముసలాలు అనే జల ప్రవాహాలు కురుస్తున్నాయి. కాటుక కుప్పలాగా ఉన్న, భయంకరమయిన ఆయుధాల ప్రవాహాలు గల మహా పర్వతమయిన ఘటోత్కచుని చూసి, కర్ణుడు ఏ మాత్రం కలత చెందలేదు. ఆయన నవ్వుతూ దివ్యాస్త్రాన్ని ఆవిర్భవింపజేశాడు. ఆ దివ్యాస్త్రం తాకటంచేత పర్వతం నశించింది. తరువాత రాక్షసుడు ఇంద్రధనుస్సుతో గూడిన నల్లని మేఘమయి చాలా ఉగ్రుడయి రాళ్ళవాన కర్ణుని మీద కురిపించాడు. కర్ణుడు వాయవ్యాస్త్రాన్ని సంధించి, ప్రయోగించి, మేఘాన్ని ధ్వంసం చేశాడు. మహారాజా! ఘటోత్కచుడు ప్రయోగించిన అస్త్రాన్ని కర్ణుడు బాణసమూహంతో దిక్కులను కప్పివేసి, నాశనం చేశాడు. అప్పుడు ఘటోత్కచుడు పెద్దగా నవ్వి, కర్ణునిమీదికి మహామాయను సృష్టించి, వదిలాడు. కర్ణుడు రాక్షసుడు రథం ఎక్కి రావటం చూశాడు. ఆయన మాత్రం తొట్రుపడటం లేదు. సింహాలు, పెద్దపులులవంటివారు, మదించిన గజాలవలె పరాక్రమవంతులు అయిన అనేక రాక్షసులు ఆయనకు నలువైపుల ఉన్నారు. ఆ రాక్షసులలో కొందరు ఏనుగుల మీద, మరికొందరు రథాల మీద, ఇంకాకొందరు గుర్రాల మీద ఉన్నారు. వారు నానా శస్త్రాలను, నానా కవచాలను, అలంకారాలను దాల్చి ఉన్నారు. మరుత్తులతో ఇంద్రుని వలె వారితో గూడి ఉన్న ఘటోత్కచుని చూసి, మహాధానుష్కుడయిన కర్ణుడు యుద్ధం సాగించాడు. అప్పుడు ఘటోత్కచుడు కర్ణుని అయిదు బాణాలతో కొట్టి, సమస్త రాజులను భయపెడుతూ భయంకర సింహనాదం చేశాడు. అంజలికం అనే బాణాన్ని వేసి, ఘటోత్కచుడు బాణాల సమూహంతో కూడా కర్ణుని చేతిలో ఉన్న పెద్ద ధనుస్సును త్వరగా ముక్కలు చేశాడు. కర్ణుడు దృఢమయి, ఇంద్ర ధనుస్సు వలె ఎత్తయిన ఇంకొక గొప్ప వింటిని తీసుకొని, దాన్ని బలంగా లాగాడు. అంతట కర్ణుడు బంగారు ఈకలు గలవి, శత్రునాశకాలు అయిన బాణాలను ఆకాశంలో తిరిగే రాక్షసుల మీద ప్రయోగించాడు. ఆ బాణాలతో బాగా బలిసిన వక్షఃస్థలాలు గల రాక్షసుల సమూహం సింహం చేత బాధితమయిన అడవి ఏనుగుల సమూహంవలె వ్యాకులమయింది. ప్రళయకాలంలో అగ్నిదేవుడు సమస్త ప్రాణులను దగ్ధం చేసినట్లు కర్ణుడు తన బాణాలతో గుర్రాలు, సూతులు, ఏనుగులతో గూడిన రాక్షసులను దగ్ధం చేశాడు. ఆ సూతనందనుడు రాక్షస సేనను సంహరించి, పూర్వం త్రిపురాలను దగ్ధం చేసిన మహేశ్వరుని వలె విలసిల్లాడు.

ఆర్యా! పాండవపక్షంలో ఉన్న వేలరాజులలో ఒక్క రాజు కూడా అప్పుడు కర్ణుని కన్నెత్తి చూడలేకపోయాడు. కోపపూర్ణుడయిన యమధర్మరాజులాగా ఘటోత్కచుడు

తప్ప మరొకడు ఎవరూ ఆయనను ఎదిరించలేరు. రాజా! పెద్ద కొరవుల నుండి మంటలతో గూడిన మూడు బొట్లవలె, క్రుద్ధుడయిన ఆ రాక్షసుని కన్నులనుండి జ్వాలలు ఏర్పడినవి. ఆయన ఒక అరచేతిలో ఇంకొక అరచేతిని గట్టిగా కొట్టి, పెదవి కొరికి, పిశాచముఖాలు గల్గి ఏనుగులంత ఉన్న గుర్రాలు కట్టిన రథం ఎక్కి "సూతపుత్రునివైపు మన రథం నడుపు" అని సారథితో అన్నాడు. ఆ ఘటోత్కచుడు కర్ణునితో తలపడగోరి భయంకరాకారం గల రథం ఎక్కి వెళ్లాడు. ఆ రాక్షసుడు ఎనిమిది చక్రాలు గల్గి, రుద్రనిర్మితమై, ఘోరమయిన అశని అనే ఆయుధాన్ని కర్ణుని మీద ప్రయోగించాడు. అది రెండు యోజనాల ఎత్తు, ఒక యోజనం వైశాల్యం గలది, కింజల్కాలతో గూడిన కదంబపుష్పంవలె శూలాలు గలది, ఇనుముతో చేసినది. కర్ణుడు ధనుస్సును రథంమీద ఉంచి, ఎగిరి, ఆ అశనిని పట్టుకొన్నాడు. దాన్ని ఘటోత్కచుని మీదికే విసిరాడు. ఆతడు రథం మీదినుంచి దూకాడు. ఆ మహాకాంతి గల అశని గుర్రాలతో, సూతునితో, ధ్వజంతో సహా ఆ రథాన్ని భస్మం చేసి భూమిని చీల్చుకొని లోపలికి పోయింది. అది చూచి దేవతలు ఆశ్చర్యపడ్డారు. పరమేశ్వరుడు నిర్మించిన ఆ మహాశనిని ఎగిరి అందుకొన్న కర్ణుని సర్వభూతాలు ప్రశంసించాయి, ఇలా చేసి, కర్ణుడు మళ్ళీ రథం ఎక్కి, శత్రువు మీద బాణాలు ప్రయోగించాడు. భయంకరంగా కనపడే సంగ్రామ రంగంలో కర్ణుడు చేసిన ఆ ఘనకార్యం సర్వప్రాణులలో ఎవ్వరూ చేయలేరు. వర్షధారలతో పర్వతం వలె కర్ణబాణ సమూహాలు తగులుతుండగా గంధర్వనగరం లాగా ఆ రాక్షసుడు మళ్ళీ మాయమయ్యాడు. శత్రునాశకుడు, మహాకాయుడయిన ఆయన మాయతో, నేర్పుతో ఆ దివ్యాస్త్రాలను అన్నింటినీ నాశనం చేశాడు. రాక్షసుడు మాయతో తన అస్త్రాలను నాశనం చేస్తుండగా కర్ణుడు ఏమాత్రం తొట్రుపాటు చెందక ఆ రాక్షసునితో యుద్ధం చేశాడు.

అపుడు క్రుద్ధుడు, మహా బలుడయిన భీమపుత్రుడు శత్రుసేనలోని మహారథులను భయపెడుతూ అనేకాకారాలు ధరించాడు. అన్నిదిక్కుల నుంచి సింహాలు, పెద్దపులులు, చిరుతపులులు, అగ్ని జిహ్వాలయిన సర్పాలు, ఇనుప ముక్కులు గల పక్షులు వచ్చి పడ్డాయి. కర్ణుని ధనుస్సు నుండి బయలుదేరిన బాణాలు శరీరం అంతా గ్రుచ్చుకొనగా గజేంద్రునివలె తేరిపారజూడ వీలుగాని ఆ ఘటోత్కచుడు అక్కడే అంతర్ధానం చెందాడు. రాక్షసులు, పిశాలు, యాతుధానులు, కుక్కలు, వికృతముఖాలు గల అనేక నక్కలు, కర్ణుని చంపటానికి అన్నివైపుల నుంచి దూకాయి. భయంకరమయిన ధ్వనులతో ఆయనను భయపెట్టసాగాయి. రక్తంతో తడిసి, ఘోరమైన, అనేక ఆయుధాలతో, బాణాలతో వాటిల్లో ప్రతీ దానిని కర్ణుడు కొట్టాడు. ఆ రాక్షసమాయను దివ్యాస్త్రంతో కొట్టివేసి, ఘటోత్కచుని

గుర్రాలను బాగా వంగిన ములుకులుగల బాణాలతో కొట్టాడు. ఆ గుర్రాల శరీరాలు బాణాలతో భిన్నం కాగా, వీపులు చీలిపోగా, ఆ రాక్షసుడు చూస్తుండగానే నేలబడ్డాయి. ఇలా తన మాయ ధ్వంసం కాగా హిడింబానందనుడు 'ఇదిగో నీకు మృత్యువు కలిగిస్తాను!' అని చెప్పి మాయమయ్యాడు."

176. అలాయుధుడు యుద్ధభూమిలో ప్రవేశించుట, ఆతని రూప, రథాదుల వర్ణన.

సంజయుడు చెప్పాడు – "కర్ణ ఘటోత్కచులకు అలా యుద్ధం జరుగుతుండగా అలాయుధుడు అక్కడికి వచ్చాడు. ఆతడు వికార రూపులయిన వేలకొలది రాక్షసులతో, చాలాపెద్ద సేనతో గూడి దుర్యోధనుని వద్దకు వచ్చాడు. నానారూపధరులు, వీరు లయిన రాక్షసులు ఆతని వెంట ఉన్నారు. ఆతని బంధువు, వీరుడు, బ్రాహ్మణ భక్షకుడు, అయిన బకాసురుడు హతుడు కావటం వల్ల, వెనుకటి పగను గుర్తుపెట్టుకొన్నాడు. పూర్వం ఈతనికి మిత్రుడయిన హిడింబుడు, మహాతేజస్వి అయిన కిమ్మీరుడు మరణించారు. అందువల్ల చాలా కాలంనుంచి ఉన్న ఆ పూర్వవైరాన్ని స్మరిస్తూ వచ్చాడు. ఈ రాత్రి యుద్ధం విషయం తెలిసి, యుద్ధరంగంలో భీముని సంహరింపదలిచాడు. మదించిన ఏనుగువలె, బాగా కోపించిన సర్పంవలె అలాయుధుడు దుర్యోధనునితో ఇలా అన్నాడు. "మహారాజా! నా బంధువులు, రాక్షసులయిన హిడింబ బక కిమ్మీరులను భీముడు సంహరించాడని నీకు తెలుసు గదా! అంతేకాక పూర్వం మమ్ములను, ఇతర రాక్షసులను అవమానించి, రాక్షసకన్య అయిన హిడింబను బలాత్కరించాడు. రాజా! తనవారితో గూడిన ఆ భీముని, రథగజాలతో అమాత్యులతో గూడిన ఘటోత్కచుని చంపటానికి నేను స్వయంగా వచ్చాను. కృష్ణుడు ముందున్న పాండవులను అందరినీ, వారి అనుచరులతో సహా చంపి తింటాను. నీ సైన్యాన్ని అంతా వెనక్కు పిలువు. మేము పాండవులతో యుద్ధం చేస్తాం." అనే అలాయుధుని మాటలు విని, సోదరులతో గూడిన దుర్యోధనునికి చాలా సంతోషం కలిగింది. అలాయుధుని ఉద్దేశ్యాన్ని అంగీకరించి, ఇలా అన్నాడు.

రాక్షసరాజా! సైన్యంతో గూడిన నిన్ను ముందు ఉంచుకొని, మేము యుద్ధం చేస్తాం. ఈపగకు అంతం చూడవలెననుకొనే నా సైనికులు యుద్ధం చేయకుండా ఉండలేరు." రాక్షసశ్రేష్ఠుడయిన అలాయుధుడు 'సరే! కానీయండి!' అని దుర్యోధనునితో అని, మానవులను తినే రాక్షససేనతో గూడి, త్వరగా ఘటోత్కచుని మీదకు వెళ్ళాడు. రాజేంద్రా! ఘటోత్కచుని వలె దేదీప్యమానమయినదేహంతో, సూర్యుని వలె వెలుగుతున్న

రథంతో వచ్చాడు. ఆతని మహారథం సాటిలేని ధ్వని గలది. దానికి అనేక తోరణాలు చిత్రితాలయి ఉన్నాయి. ఎలుగుబంటితోలుతో అది అంతా కప్పి ఉన్నది. దాని ఎత్తుపాడవులు నాలుగువందల మూరలు ఉంది. ఆ రథానికి కట్టిన గుర్రాలు నూరు త్వరగా పరిగేత్తేవి. ఏనుగులంత శరీరాలు గలవి. వాటి కంఠధ్వని చాలా కఠినంగా ఉంటుంది. అవి మాంసం, రక్తం ఆహారంగా గలవి. అతని రథ ధ్వని కూడా మహామేఘగర్జనలాగా ఉంటుంది. అతని ధనుస్సు చాలా పెద్దది. దాని అల్లెత్రాడు చాలా గట్టిది. అది బంగారు కవచం గలది. అతని బాణాలు గూడా కాడి అంత ఉంటాయి. వాటికి బంగారు ఈకలు ఉన్నాయి. వాటిని బాగా పదునుపెట్టారు. అతడు కూడా ఘటోత్కచునివలె మహాబాహువు, మహావీరుడు. అలాయుధుని జెండా కూడా సూర్యాగ్నులవలె కాంతిమంతం. నక్కలగుంపు దాని మీద ఉంటుంది. ఘటోత్కచుని ఆకారం వలె అతని రూపంకూడా వికాసవంతం. ఆతని ముఖం కూడా వికారమయిన కాంతితో కూడి ఉంది. అతని భుజకీర్తులు ప్రకాశవంతాలు. కిరీట హారాలు వెలుగుతున్నాయి. మెడలో హారాలు ప్రకాశిస్తున్నాయి. ఆతని తలపాగాలో ఖడ్గం ఉన్నది. గద, భుశుండి, ముసలం, నాగలి, ధనుస్సు ధరించి ఉన్నాడు. ఆతని శరీరం ఏనుగంత ఉన్నది. బంగారు రంగుతో ధగధగా మెరుస్తున్న రథం ఎక్కి, అలాయుధుడు పాండవసైన్యాన్ని పారద్రోలుతూ, యుద్ధరంగంలో ఆకాశంలో మెరుపుల మాలికలు గల మేఘం వలె సంచరించాడు. పాండవపక్షంలోని వీర యోధులు గూడా సర్వశ్రేష్ఠులు, మహాబలవంతులు. కవచాలు, డాళ్ళు కలిగి సంతోషంతో అంతటా యుద్ధం చేయసాగారు."

177. భీమ అలాయుధయుద్ధం.

"ఆతడు యుద్ధంలోకి రావటం చూసి, కౌరవులు అందరూ సంతోషించారు. అలాగే దుర్యోధనాదులయిన నీ పుత్రులు కూడా, ఎలాంటి పడవలేని వారు ఒక పడవ రాగా సముద్రం దాటదలిచినట్లు రణసాగరాన్ని దాటదలచారు. ఆ పురుషశ్రేష్ఠ లందరూ మళ్ళీ పుట్టినట్లు అనుకొంటూ రాక్షసశ్రేష్ఠ డయిన అలాయుధుని స్వాగతాదులతో అర్చించారు. ఆ రాత్రి సమయంలో కర్ణ రాక్షసులకు మధ్య మహాభయంకరంగా జరుగుతున్న యుద్ధం మానవాతీతం, మహా దారుణమయినది. అశ్వత్థామ గాని, కృపుడు గాని, ద్రోణుడు గాని, శల్యుడు గాని, కృతవర్మ గాని ఘటోత్కచుని ఎదుర్కొన లేకపోయారు. కేవలం కర్ణుడు ఒక్కడే ఆయనకు దీటు అయ్యాడు. రాజా! రాజులతో గూడిన పాంచాలురు, మీవాళ్ళు ఆశ్చర్యంలో అక్కడక్కడ నిలచి, యుద్ధప్రేక్షకులుగా మిగిలారు. యుద్ధరంగంలో ఘటోత్కచుడు

చేసిన ఆ వీరకార్యం చూసి ద్రోణుడు, అశ్వత్థామ, కృపుడు మొదలయిన వారు ఆందోళన చెంది "మనసైన్యం పని అయిపోయింది." అని కేకలు పెట్టారు. మహారాజా! 'కర్ణుడు ఇక బ్రతకడు' అని నిరాశపడిన నీ సైన్యం అంతా హాహాకారాలు చేస్తూ చెల్లాచెదరై మ్రాన్పడిపోయింది. కర్ణుడు ఆర్తిని పొందటం చూసిన దుర్యోధనుడు అలాయుధుని పిలిచి ఇలా చెప్పాడు. "వీరవరా! అటు చూడు. ఈ కర్ణుడు ఘటోత్కచునితో పోరాడుతున్నాడు. తన శక్తినిమించి చాలా తీవ్రంగా మహత్కార్యం చేస్తున్నాడు. ఏనుగు చెట్లను నుగ్గుచేసినట్లు భీమకుమారుని చేతిలో నానాశస్త్రాల దెబ్బలు తిని, నేలగూలిన రాజులను చూడు. ఈ రాజులందరిమధ్యలో ఈ ఘటోత్కచుని నీ భాగం చేస్తున్నాను. ఇది నీ ఉద్దేశ్యప్రకారమే. వీరా! కాబట్టి అతని మీద పరాక్రమించి సంహరించు. ఇంతకుముందు కూడా శత్రువులను బాధించే పాపాత్ముడయిన ఈ ఘటోత్కచుడు మాయాబలాన్ని ఆశ్రయించి, కర్ణుని బాధించాడు." దుర్యోధనుడు ఇలా చెప్పగానే అలాయుధుడు 'సరే' అని ఘటోత్కచుని పైకి వెళ్ళాడు.

తరువాత ఘటోత్కచుడు కర్ణుని వదలి, తన దగ్గరకు వస్తున్న శత్రువును బాణాలతో బాధించాడు. ఆడ ఏనుగుకోసం మత్తగజాలు రెండింటికివలె క్రుద్ధులయిన ఆ రాక్షసశ్రేష్ఠులు ఇద్దరికి యుద్ధం జరిగింది. ఘటోత్కచుడు వదలిన తరువాత కర్ణుడు సూర్యకాంతి గల రథంమీద ఉండి భీమునివైపు వెళ్ళాడు. భీమసేనుడు తనవైపు వస్తున్న కర్ణుని లెక్కచేయక సింహానికి చిక్కిన ఎద్దువలె అలాయుధుని బారిన పడిన ఘటోత్కచుని చూసి సూర్య సమానమయిన రథంమీద ఉండి, అలాయుధుని రథం మీద బాణ సమూహాన్ని, ప్రయోగిస్తూ వెళ్ళాడు. ప్రభూ! అలా వస్తున్న భీముని చూసి, అలాయుధుడు ఘటోత్కచుని వదలి, భీముని యుద్ధానికి పిలిచాడు. భీముడు వేగంగా ఆ రాక్షసశ్రేష్ఠుని వైపు వచ్చి, ఆతనిమీద బాణవర్షం కురిపించాడు. శత్రునాశకుడయిన అలాయుధుడు కూడా రాతిమీద బాగా పదునుపెట్టి, సూటిగా వెళ్ళే బాణాలను వర్షించాడు. నీ పుత్రుల జయాన్ని కోరిన ఆ రాక్షసులు అందరూ నానావిధాలయిన ఆయుధాలు ధరించి, భయంకరంగా భీమసేనునిపైకి విజృంభించారు. చాలామంది రాక్షసులు బాణాదులతో కొడుతుండగా భీమసేనుడు వారిని అందరిని ఆయిదేసి బాణాలతో కొట్టాడు. ఆ విధంగా భీముడు గాయపరుస్తుంటే ఆ రాక్షసులు తుముల నాదాలు చేస్తూ పదిదిక్కులకు పారిపోయారు.

తనవారిని అందరిని భయపెడుతున్న భీముని చూసి, అలాయుధుడు చాలా వేగంగా పరుగెత్తివచ్చి బాణాలను ఆయన మీద కురిపించాడు. ఆతడువేసిన బాణాలను భీముడు పదునయిన ములుకులు గల బాణాలువేసి, క్షీణింపజేశాడు. యుద్ధంలో భీముడు వేసిన కొన్ని బాణాలను అలాయుధుడు తెగగొట్టాడు. కొన్నిటిని పట్టుకొన్నాడు. భీముడు

ఆ రాక్షసేంద్రుని గురి చూసి, పిడుగుపాటుతో సమానమయిన గదను వేగంగా వేశాడు. జ్వాలామాలికలతో గూడి వేగంగా వస్తున్న ఆ గదను తనగదతో అలాయుధుడు కొట్టాడు. భీముని గద ఆయన వద్దకే వచ్చింది. భీముడు రాక్షసశ్రేష్ఠుని మీద బాణవర్షం కురిపించాడు. రాక్షసుడు వాటిని కూడా పదునయిన బాణాలతో వ్యర్థం చేశాడు. ఆ రాత్రి ఆ రాక్షసులందరూ అలాయుధుని ఆజ్ఞానుసారం పాండవ బలంలోని రథాలను, ఏనుగులను చంపారు. రాక్షసులు చాలాతీవ్రంగా బాధిస్తుంటే పాంచాలురు, సృంజయులు వారి గుర్రాలు, గజేంద్రాలు అక్కడ ఏ మాత్రం శాంతిని పొందలేదు. శ్రీకృష్ణుడు ఘోరంగా జరుగుతున్న ఆ మహాయుద్ధం చూసి, అర్జునునితో ఇలా అన్నాడు. "అర్జునా! భీముడు అలాయుధుని వశంకావటం చూడు. ఇంక ఆలోచించకుండా భీముని వద్దకు త్వరగా వెళ్ళు. ధృష్టద్యుమ్నుడు, శిఖండి, యుధామన్యువు, ఉత్తమౌజుడు, ఉపపాండవులతో గూడిన ఈ మహారథులు కర్ణుని ఎదుర్కొనాలి. అర్జునా! నీ ఆజ్ఞానుసారం నకుల సహదేవులు, యుయుధానుడూ ఇతర రాక్షసులను సంహరించాలి. తీవ్రమయిన ఆపద వచ్చింది. నీవు ద్రోణునిముందున్న ఈకౌరవసేనను నిలువరించు."

ఈవిధంగా కృష్ణుడు చెప్పగా ఆ మహారథులు అందరూ ఆయుద్ధంలో కర్ణుని, రాక్షసులను ఎదుర్కొన్నారు. అప్పుడు ప్రతాపవంతుడయిన రాక్షసశ్రేష్ఠుడు ఆకర్ణాంతం లాగి వేసిన పాములాంటి బాణాలతో భీముని ధనుస్సును ముక్కలు చేశాడు. రాక్షసుడు భీముడు చూస్తుండగానే ఆయన రథాశ్వాలను, సారథిని పదునయిన బాణాలతో చంపాడు. గుర్రాలు, సారథి హతులు కాగా భీముడు రథం మీదినించి దిగి, సింహనాదం చేస్తూ పెద్దగదను ఆ రాక్షసుని మీద వేశాడు. ధ్వని చేస్తూ తనమీదికి వస్తున్న ఆ గదను రాక్షసుడు తనగదతో కొట్టి, సింహనాదం చేశాడు. అలాయుధుని భయంకరమయిన కార్యం చూసి, భీమసేనుడు సంతోషంతో, ఉత్సాహంతో తన గదను చేత తీసుకొన్నాడు. గదా ప్రహారాల వల్ల కలిగే పెద్ద ధ్వనులతో భూమండలాన్ని అంతను తీవ్రంగా కంపింపజేస్తున్న ఆ నరరాక్షసులకు తుముల యుద్ధం జరిగింది. గదలను వదలి, వారిద్దరు ఒకరినొకరు పిడుగు పాటుల వంటి ధ్వనులు వచ్చే పిడిగుద్దులతో ముష్టి యుద్ధం చేశారు. కోపపూర్ణులయిన వారిద్దరు రథచక్రాలతో, నొగలతో, ఇరుసులతో, రథంపైన ఉండే ఆసనాలతో, ఇతర ఉపకరణాలతో చేతికి దొరికిన వాటిని తీసుకొని కొట్టుకొన్నారు. వారు ఇద్దరూ రక్తధారలు కారుతుండగా మత్తగజాలవలె పరస్పరం తలపడి, పలుమారులు ఒకరినొకరు లాగటం, త్రోసివేయటం చేశారు. పాండవుల మేలు కోరి, శ్రీకృష్ణుడు ఆసన్నివేశం చూసి, భీమసేనుని రక్షణకోసం ఘటోత్కచుని పురికొల్పాడు."

178. ఘటోత్కచుడు అలాయుధుని వధించుట.

"రాక్షసగ్రస్తుడయిన భీముని చూసి, శ్రీకృష్ణుడు సమీపంలో ఉన్న ఘటోత్కచునితో ఇలా అన్నాడు. "సర్వసైన్యాలు, నీవు చూస్తుండగానే భీముని రాక్షసుడు వశం చేసుకోవటం చూడు. మహాబాహూ! కర్ణునివదలి రాక్షసేంద్రు డయిన అలాయుధుని ముందు సంహరించు. తరువాత కర్ణుని వధించు." ఘటోత్కచుడు శ్రీకృష్ణుని మాటలు విని, కర్ణుని వదలి వక్రుని సోదరుడయిన అలాయుధునితో యుద్ధం చేశాడు. ఆ రాత్రి సమయంలో అలాయుధ ఘటోత్కచులకు భయంకరమూ, తుములమూ అయిన యుద్ధం జరిగింది. భయంకరంగా కన్పించేవారు, శూరులు, ధనుర్ధారులు అయిన అలాయుధుని రాక్షసయోధులను, వేగంగా మీదికి వస్తున్నవారిని యుయుధానుడు, నకుల సహదేవులు పదునయిన బాణాలతో ఛేదించారు. రాజా! అర్జునుడు అంతటా బాణవర్షం కురిపిస్తూ, కౌరవపక్షంలోని క్షత్రియశ్రేష్ఠులను అందరినీ పారద్రోలాడు. కర్ణుడు కూడా యుద్ధంలో ధృష్టద్యుమ్నుడు, శిఖండిమున్నగు పాంచాలమహారథులను, రాజులను పారద్రోలాడు. భీముడు బాధితులైన తన పక్షంవారిని అందరిని చూసి, యుద్ధంలో బాణాలు కురిపిస్తూ, కర్ణుని ఎదుర్కొన్నాడు. నకుల సహదేవులు, మహారథుడయిన సాత్యకి, రాక్షసులను చంపి కర్ణుడు ఉన్నచోటికి వచ్చారు. వారు కర్ణునితో యుద్ధం చేయసాగారు. పాంచాలురు ద్రోణుని ఎదుర్కొన్నారు. అప్పుడు అలాయుధుడు బాగా కోపించి, ఘటోత్కచుని తలమీద చాలా పెద్దదయిన పరిఘ అనే ఆయుధంతో కొట్టాడు. భీమకుమారుడు ఆ తీవ్రప్రహారంతో కొంచెం మూర్ఛపోయి, మళ్ళీ నిలద్రొక్కుకున్నాడు. తరువాత మండుతున్న అగ్నిగోళం, లాంటిది, నూరు గంటలతో అలంకృతమూ, బంగారంతో భూషితమూ అయిన గదను అలాయుధుని మీదికి ఘటోత్కచుడు విసిరాడు.

భయంకర కార్యాలు చేసే ఆయన విసిరిన ఆ గద మహధ్వని చేస్తూ వేగంగాపోయి రాక్షసుని గుర్రాలను, రథాన్ని సారథిని పిండి చేసింది. అలాయుధుడు గుర్రాలు, చక్రాలు, ఇరుసు, ధ్వజం, కూబరం ముక్కలయిన రథంమీదినుంచి రాక్షస మాయను గ్రహించి, త్వరగా ఎగిరాడు. మాయను ఆశ్రయించి, అలాయుధుడు రక్తం చాలా ఎక్కువ కురిపించాడు. ఆకాశం అంతా మెరుపులతో సంకుల మేఘాలతో నిండింది. తరువాత ఆ మహాయుద్ధంలో పిడుగులు పడ్డాయి. ఉరుములతో గూడిన మెరుపులు, మహత్తరచ్చటచ్చటా శబ్దం కలిగాయి. అలాయుధుని రాక్షసమాయను చూసి, ఘటోత్కచుడు ఆకాశంలోకి ఎగిరి, రాక్షసమాయతోనే నాశనం చేశాడు. తన మాయను మాయతోనే నాశనం చేయటం చూసి, అలాయుధుడు ఘటోత్కచుని మీద రాళ్ళవర్షం కురిపించాడు. ఘటోత్కచుడు, ఆ రాళ్ళవానను బాణాలు

వేసి ధ్వంసం చేశాడు. అది మహాద్భుతం అనిపించింది. తరువాత వారు నానావిధాలయిన ఆయుధాలతో ఒకరినొకరు కొట్టుకున్నారు. ఇనుపగుదియలతో, శూలాలతో, ముసలాలతో, ముద్గరాలతో, పినాకాలతో, కత్తులతో, తోమరాలతో, ప్రాసాయుధాలతో, కంపనాలతో, నారాచాలతో, పదునయిన బల్లేలతో, బాణాలతో, చక్రాలతో, పరశ్వధాలతో, ఇనుపగుండ్లతో, భిందిపాలాలతో, గోశీర్షాలతో, రోకళ్ళవంటి ఆయుధాలతో, మారేడు, పీలు, కదంబ చంపక, ఇంగుద, రేగు, కోవిదారములు, పుష్పించిన మోదుగలు, అరిమేదాలు, జువ్వి, మద్రి, పిప్పలి వృక్షాలతో అనేకవిధాలయిన రంగు రాళ్ళుగల విశాలమయిన పర్వత శిఖరాలతో వారు ఇద్దరు యుద్ధం చేశారు. రాజా! ఆ పర్వతాదుల యుద్ధంలో వజ్రాలు పగిలిపోతున్నంత పెద్దమోత విన్పించింది. పూర్వం వాలిసుగ్రీవులకు జరిగినంత తీవ్రంగా ఘటోత్కచ అలాయుధులకు ఘోరయుద్ధం జరిగింది. వారు అనేక ఘోరాయుధాలతో, బాణాలతో యుద్ధం చేసి, తరువాత పదునయిన ఖడ్గాలు తీసుకొని ఒకరినొకరు ఎదుర్కొన్నారు. మహాకాయులు, మహాబలులయిన వారు ఒకరిమీదికి ఇంకొకరు దూకి, చేతులతో ఒకరిజుట్టు ఇంకొకరు పట్టుకొన్నారు. వారు ఇద్దరి మహాశరీరాలు బాగా చెమటపట్టినవి. బాగా వర్షించే మేఘాలవలె చెమటను, రక్తాన్ని కార్చారు. ఇంతలో ఘటోత్కచుడు చాలావేగంగా దూకి, అలాయుధుని పట్టుకొని, గిరగిర త్రిప్పి, బలంగా గిరవాటువేసి, ఆతని పెద్దతలను నరికి చాలా భయంకరమయిన సింహనాదం చేశాడు.

అలాయుధుడు మరణించటం చూసి పాంచాలురు, పాండవులు, సంతోషంతో సింహనాదాలు చేశారు. యుద్ధరంగంలో ఆ రాక్షసుడు హతుడుకావటం తెలిసి, పాండవసేనలోని సైనికులు వేల దుందుభులను, అనేక శంఖాలను మ్రోగించారు. జయదాయకమయిన ఆ రాత్రి అనేక దీపాల మాలికలతో అంతటా ప్రకాశిస్తూ విరాజిల్లింది. భీమపుత్రుడు అలాయుధుని శిరస్సును దుర్యోధనుని ఎదుట పడేటట్టు విసిరివేశాడు. భారతా! అలాయుధుడు మరణించటం చూసి, దుర్యోధనుడు తనసైన్యంతో సహా చాలా కలవర పడ్డాడు. అలాయుధుడు తమకుగల వెనుకటి పగను గుర్తుచేసుకొని తనంతతానే వచ్చి, 'యుద్ధంలో భీముని చంపుతాను' అని ప్రతిజ్ఞ చేశాడు. అలాయుధుడు భీముని తప్పక చంపుతా డనీ, తన సోదరులు చాలాకాలం బ్రతుకుతారు అనీ దుర్యోధనుడు గట్టిగా నమ్మాడు. ఘటోత్కచునిచేత అతడు హతుడు కావటం చూసి, దుర్యోధనుడు భీముడు తానుచేసిన ప్రతిజ్ఞను పూర్తిగా నెరవేరుస్తాడు అనుకొన్నాడు."

179. కర్ణుడు శక్త్యాయుధముతో ఘటోత్కచుని వధించుట.

సంజయుడు చెప్పాడు "అలాయుధుని చంపి, ఘటోత్కచుడు నీసైన్యం ఎదుటనిలిచి, నానావిధాలయిన నాదాలు చేశాడు. ఏనుగులను కూడా వణికించే ఆ భయంకర ధ్వనిని విని, మీపక్షంవారికి దారుణమయిన భయంకలిగింది. ఘటోత్కచుడు అలాయుధునితో యుద్ధం చేస్తున్నప్పుడు, కర్ణుడు పాంచాలురను ఎదుర్కొని, పదేసి బాణాలతో ధృష్టద్యుమ్నశిఖండులను ఛేదించాడు. తరువాత ఉత్తమమయిన నారాచాలతో యుధామన్యుని, ఉత్తమౌజుని, రథోదారుడయిన సాత్యకిని అనేక బాణాలు వేసి వణికించాడు. నరేంద్రా! యుద్ధంలో సాత్యకి మొదలయినవారు కూడా కుడి ఎడమల నుంచి బాణాలు వేస్తుంటే వారి ధనుస్సులు మండలాకారంగా కన్పించాయి. ఆ రాత్రి సమయంలో వారి అల్లెత్రాటి ధ్వనులు, రథ చక్రాల ధ్వనులు, వర్షాకాలంలో మేఘగర్జనవలె భయంకరమయ్యాయి. రాజా! యుద్ధం అనే మేఘానికి అల్లెత్రాటి, రథాల ఇరుసుల ధ్వనులే ఉరుములు, ధనుస్సులే మెరుపుల సమూహం, ధ్వజాగ్రాలే పెద్దశిఖరాలు, బాణసమూహాలే సంకులమయిన వర్షంగా అయింది. కర్ణుడు యుద్ధంలో అద్భుతమయిన ఆ బాణవర్షాన్ని ధ్వంసం చేశాడు. కర్ణుడు యుద్ధంలో సాటిలేనివై, పిడుగుపాటుతో సమానమయినవై. విచిత్రమయిన బంగారపు ఈకలు గల పదునైన బాణాలతో శత్రువులను సంహరించసాగాడు. ఆ కర్ణుడు పాండవసేనలో కొందరి జెండా కర్రలను ముక్కలు చేశాడు. కొందరి శరీరాలను చీల్చి బాధించాడు. కొందరి సారథులను, కొందరి రథాలగుఱ్ఱాలను చంపాడు. యుద్ధవీరులు యుద్ధంలో ఎలాంటి శాంతి లేక ధర్మరాజు సేనలో దాక్కున్నారు. అలా చెల్లాచెదరై యుద్ధవిముఖులయిన వారిని చూచిన ఘటోత్కచునికి తీవ్రంగా కోపం వచ్చింది.

బంగారంతో, రత్నాలతో చిత్రవర్ణమయిన ఉత్తమ రథాన్ని ఎక్కి, ఆయన సింహంలాగా గర్జించాడు. కర్ణుని సమీపించి, వజ్రంతో సమానమయిన బాణాలు వేసి బాధించాడు. ఆ ఘటోత్కచ కర్ణులు కర్ణులతో నారాచాలతో, బాణాలతో, నాళీకాలతో, దండాలతో, ఆసనాలతో వత్సదంతాలతో వరాహకర్ణాలతో, విపాఠాలతో కొమ్ములవంటి బాణాలతో, క్షురప్రాలవర్షంతో ఆకాశాన్ని కప్పివేశారు. అడ్డంగా పోయిన ఆ బాణధారతో, ఆవరింపబడిన ఆకాశం యుద్ధరంగంలో బంగారపు పుంఖాలతో మండుతున్న కాంతులతో గూడి, విచిత్రపుష్పాలతో కట్టిన పూలమాలలవలె ప్రకాశించింది. వారిద్దరి మనస్సులు, ఏకాగ్రంగా ఉన్నాయి. వారు సాటిలేని ప్రభావవంతులు. ఉత్తమాస్త్రాలతో ఒకరినొకరు గాయపరచుకొంటున్నారు. ఆ వీరశ్రేష్ఠులు ఇద్దరిలో ఎవరూ ఎవరినీ మించలేకపోతున్నారు. శస్త్రాల చేత ఘోరమయి, సంకులమయిన ఆ కర్ణఘటోత్కచుల యుద్ధం ఆకాశంలో

రాహుసూర్యుల మధ్య జరిగిన ఉన్మత్త సంగ్రామంవలె చిత్రమయి, సాటిలేనిదిగా కన్పించింది. అస్త్రజ్ఞ శ్రేష్ఠుడయిన కర్ణుడు ఘటోత్కచుని మించలేక ఒక భయంకరమయిన అస్త్రాన్ని తీశాడు. ఆ అస్త్రంతో ఆతని రథాన్ని, గుర్రాలను, సారథిని కర్ణుడు చంపాడు. రథహీనుడయిన హిడింబాకుమారుడు వెంటనే అంతర్ధానం అయినాడు.

ధృతరాష్ట్రుడు అడిగాడు "సంజయా! వంచనాయుద్ధ పరాయణుడయిన ఆ రాక్షసుడు అంతర్ధానం చెందగా మావాళ్ళు ఏమి ఆలోచించారో, ఏమి చేశారో చెప్పు." సంజయుడు ఇలా అన్నాడు. "ఘటోత్కచుడు మాయమయినాడని తెలిసి, కౌరవులు అందరూ కపట యుద్ధం చేసే ఈ రాక్షసుడు యుద్ధరంగంలో కనిపించటం లేదు. ఇక కర్ణుని చంపకుండా వదలుతాడా? అని గోలగోల పెట్టసాగారు. నైపుణ్యంతో, విచిత్రంగా అస్త్రాలతో యుద్ధంచేసే కర్ణుడు బాణ సమూహాలతో అన్ని దిక్కులను కప్పివేశాడు. బాణజాలంతో అంతరిక్షం అంతా అంధకార బంధురం అయినా అక్కడ ఏప్రాణీ మరణించి, క్రిందపడలేదు. ఆసూతపుత్రుని నైపుణ్యం వలన అంబులపొదిని చేతివ్రేళ్ళతో తగలటం గాని, బాణాలు తీయటం గాని, అల్లెత్రాటిపై సంధించటంగాని చూచేవారికి తెలియటం లేదు. ఆ రీతిగా ఆకాశాన్ని అంతను బాణాలతో కప్పివేశాడు. ఆ తరువాత రాక్షసుడు ఆకాశంలో సృష్టించిన దారుణమయిన మాయను చూశాం. అది మొదట ఎర్రటి మేఘంలాగా ప్రకాశించింది. తరువాత భయంకరంగా ప్రకాశిస్తున్న అగ్నిజ్వాలవలె అయింది. తరువాత ఆ మాయలో మెరుపులు మెరిశాయి. బాగా మండే ఉల్కలు వచ్చాయి. వేలకొలది దుందుభులు మ్రోగుతున్నట్లు చాలా పెద్దధ్వని వచ్చింది. అప్పుడు బంగారు పిడులు గల బాణాలు, శక్తులు, ఋష్టులు, ప్రాసలు, ముసలాలు, ఇతరాయుధాలు, పరశ్వధాలు, నూనెతో శుభ్రం చేసిన బాగా మెరుస్తున్న తోమరాలు, పట్టిశాలు, పదునయిన పరిఘలు, ఇనుప గదలు, పదునయిన మొనగల విచిత్రమయిన శూలాలు, బంగరు తొడుగులు గల పెద్ద గదలు, శతఘ్నులు అంతటా ఆవిర్భవించాయి. అక్కడక్కడ పెద్దబండరాళ్ళు పడ్డాయి. ఉరుములతో పిడుగులు వేలకొలది పడ్డాయి. లెక్కలేనన్ని మొనలు గల్గి, అగ్నివలె వెలుగులు గల చక్రాలు ఆవిర్భవించాయి.

శక్తులు, రాళ్ళు, పరశ్వధాలు, ప్రాసలు, ఖడ్గాలు, పిడుగులు, మెరుపులతో విస్తారమయి మండుతూ పడుతున్న వర్షాన్ని కర్ణుడు బాణసమూహంతో ధ్వంసం చేయలేకపోయాడు. బాణాల దెబ్బలకు పడిపోతున్న గుర్రాల ధ్వనులూ, పిడుగులు పడటం వల్ల దెబ్బతింటున్న ఏనుగుల ధ్వనులూ, రాళ్ళదెబ్బలతో పడిపోతున్న రథాల

ధ్వనులూ కలిసి పెద్దధ్వని కలిగింది. అంతటా చాలా భయంకరమయిన, నానావిధ శస్త్రాలు పడటంతో ఘటోత్కచుడు ధ్వంసం చేస్తున్న దుర్యోధనుని సైన్యం ఆర్తితో తిరుగుడుపడుతూ, గిరగిర తిరుగుతూ కన్పించింది. కౌరవసైన్యం హాహాకారాలు చేస్తూ, విషాదం ఆకారం దాల్చినట్లు ఉండి, పారిపోతూ దాక్కొంటున్నది. వీరశ్రేష్ఠులు మాత్రం పారిపోవటం పరువు తక్కువ అని యుద్ధవిముఖులు కాకుండా ఉన్నారు. భయంకరమై, ఘోరమై, మహాశస్త్రమయమై మీదపడుతున్న ఆయుధ వర్షాన్ని, నేలగూలుతున్న సైన్య సమూహాలను, చూసిన నీ కుమారులకు భయం పట్టుకొన్నది. అగ్నిజ్వాలలతో వెలుగుతున్న నాలుకలుగల నక్కలు లెక్కలేనన్ని భయంకరంగా అరుస్తున్నాయి. రాక్షస సమూహాలు గర్జిస్తున్నాయి. వీటిని అన్నింటిని చూసి, కౌరవ రాజయోధ వీరులు వ్యథజెందారు.

పర్వతాలవలె విశాలదేహులు, ప్రజ్వలిస్తున్న నాలుకల నుండి నిప్పులు క్రక్కుతున్నవారు, పదునయిన కోరలు గలవారు, భయంకరులు, శక్తి ఆయుధాలు చేత దాల్చిన ఆ రాక్షసులు ఆకాశంలోకి వచ్చి, మేఘాలు భయంకరవర్షాన్ని వలె, ఆయుధ వర్షం కురిపించసాగారు. ఆ రాక్షసుల చేతులలోని బాణాలు, శక్తులు, శూలాలు, భయంకర గదలు, ప్రకాశిస్తున్న పరిఘలు, పిడుగులు, ధనుస్సులు, మెరుపు దెబ్బలు, శతఘ్నులు, చక్రాల దెబ్బలు తిని, కౌరవ సైనికులు నేలగూలారు. ఆ రాక్షసులు, నీ పుత్రుని సైన్యంమీద శూలాలను, భుశుండులను, ఇనుప గుండ్లను, శతఘ్నులను, ఇనుపతొడుగు గల స్తంభాల వంటి ఆయుధాలను కురిపించారు. అందువల్ల వారు తీవ్రంగా మోహపరవశులయినారు. తీవ్రమయిన రాళ్ళవాన కురియటం చేత నీ సైన్యంలోని వీరుల శిరస్సులు పగిలాయి. శరీరాలు నుజ్జు అయ్యాయి. పేగులు బయటకు వచ్చి చెల్లాచెదరుగా పడ్డాయి. ఆ స్థితిలో వారు నేలగూలారు. గుర్రాలు నలిగిపోయాయి. ఏనుగులు నాశనమయ్యాయి, రథాలు పిండి పిండి అయినాయి. ఘటోత్కచుడు మాయతో సృష్టించిన రాక్షసుల మహత్తరమయిన శస్త్రవర్షాన్ని సృష్టిస్తూ, భయపడిన వారిని గాని, ప్రాణదానం చేయమని కోరేవానిని గాని వదలకుండా చంపారు. కౌరవ వీరులను నాశనం చేసే ఆ యుద్ధం క్షత్రియులను అంతం చేయటానికి సాక్షాత్తుగా కాలుడే కల్పించాడా అన్నట్లు ఉంది. అందులో చెల్లాచెదరైన కౌరవులు అందరూ కేకలుపెడుతూ త్వరగా పారిపోసాగారు. 'కౌరవులారా! పారిపోండి. ఇంక ఈ సైన్యం ఏమాత్రం మిగలదు. పాండవుల కోసమని దేవతలు ఇంద్రునితో కూడా వచ్చి మనలను చంపుతున్నారు.' అని అరుస్తూ సమరసముద్రంలో మునిగిపోతున్న కౌరవసేనకు కర్ణుడు ద్వీపంలాగా రక్షకుడయ్యాడు.

సంకులంగా సాగుతున్న ఆ యుద్ధంలో కౌరవసైన్యం భగ్నమయి లీనం అవుతుండగా, సైన్యంలోని భాగాలు వ్యక్తం కాకపోవటం వల్ల ఎవరు కౌరవ సైనికులో, ఎవరు ఇతరులో తెలియలేదు. హద్దు, ఆపులేకుండా భయంకరంగా సాగుతున్న ఆ యుద్ధంలో పారిపోతున్న సైనికులకు అన్ని దిక్కులు శూన్యంగా కన్పించాయి. రాజా! ఆ శస్త్రవృష్టిని వక్షఃస్థలంతో గ్రహిస్తున్న కర్ణుని ఒక్కనిని మాత్రమే ఇతరులు చూశారు. ఆయన బాణాలతో రాక్షసుని దివ్య మాయను ఎదుర్కొని, యుద్ధం చేస్తూ ఆకాశాన్ని కప్పివేశాడు. అలాంటి ఉత్తమకార్యాన్ని యుద్ధంలో చేస్తూ కూడా కర్ణుడు మోహితుడు కాలేదు. రాజా! అప్పుడు సింధు దేశీయులు, బాహ్లికులు అందరు యుద్ధంలో మోహపడని కాని ఆయనను గౌరవిస్తూ, రాక్షసుని విజయాన్ని చూస్తూ భయపడ్డారు. ఇదే సమయంలో ఘటోత్కచుడు చక్రాలు గల శతఘ్నిని వదలాడు. అది ఒకేసారి కర్ణుని రథాశ్వాలను నాలుగింటిని చంపింది. అవి మోకాళ్ళమీద వంగి నేలమీద పడ్డాయి. పండ్లు, కన్నులు, నాలుకలు బయటికి వచ్చి, అవి మరణించాయి. గుఱ్ఱాలు మరణించగా రథంమీది నుంచి దిగి, కర్ణుడు ఏకాగ్రచిత్తంతో కొంచెం ఆలోచించాడు. కురువీరులు పారిపోతున్నా, దివ్యాస్త్రాలు రాక్షసమాయతో నశిస్తున్నా, ఏమాత్రం మోహం చెందక వెంటనే చేయవలసింది ఆలోచించుకొన్నాడు. అప్పుడు కౌరవులు అందరూ కర్ణుని, భయంకర రూపమయిన మాయను చూసి 'కర్ణా! ఇవ్వాళ శక్త్యాయుధంతో రాక్షసుని త్వరగా సంహరించు, లేకపోతే కౌరవ సైన్యాలు, కౌరవులు నశిస్తారు. భీమార్జునులు ఏం చేస్తారు మనలను? అర్ధరాత్రి మనలను తపింపజేస్తున్న ఈ పాపాత్ముని జయించు. భయంకరమయిన ఈ యుద్ధంనుంచి విముక్తుడైన వాడు సైన్యంతో గూడిన పాండవులతో యుద్ధం చేస్తాడు. కాబట్టి ఇంద్రుడిచ్చిన శక్తి ఆయుధంతో ఘోరరూపు డయిన ఈ రాక్షసుని సంహరించు. ఇంద్ర సమానులయిన కురువీరులు యోధులతో కూడా ఈ రాత్రి యుద్ధంలో నశించకుండా ఉందురుగాక." రాజా! రాక్షసుడు రాత్రిపూట వధిస్తుంటే భయపడిపోతున్న సైన్యాన్ని చూసి, కురుసేనల తీవ్రమయిన ఆర్తధ్వనిని విని, కర్ణుడు ఇంద్రదత్తశక్తిని ప్రయోగించటానికి నిశ్చయించుకొన్నాడు.

సింహంవలె అమర్షి అయిన అతడు క్రుద్ధుడయి, ఘటోత్కచుడు తన శస్త్రాస్త్రాలను యుద్ధంలో నాశనం చేయటం సహించలేకపోయాడు. ఆ రాక్షసుని వధించదలచి, ఆయన సహింపలేని వైజయంతి అనే శక్తిని తీసుకున్నాడు. రాజా! యుద్ధంలో అర్జునుని వధించటానికే, ఆశక్తిని చాలా సంవత్సరాలనుంచి గౌరవాదరాలతో దాచి ఉంచాడు. కర్ణుని కవచకుండలాలు

తీసుకున్నదానికి బదులుగా, ఇంద్రుడు కర్ణునిచేతుల్లో దాన్ని పెట్టాడు. అది సమస్తాన్ని నాకివేయటానికి సర్వసంసిద్ధమయిన యమధర్మరాజు నాలుకవలె ఉంది. అది మృత్యువుకు తోబుట్టువు వలె, మండుతున్న ఉల్కవలె కన్పిస్తున్నది. పాశాలతో గూడి ప్రజ్వలిస్తున్న దివ్యశక్తిని, సూర్యపుత్రు డయిన కర్ణుడు రాక్షసు డయిన ఘటోత్కచుని సంహరించటానికి ప్రయోగించాడు. చాలాశ్రేష్ఠమూ, ఇతర శరీరాలను నాశనం చేసేది, కర్ణుని చేతిలో జ్వలిస్తూ ఉన్న ఆశక్తిని చూసి భీతుడయిన రాక్షసుడు వింధ్య పర్వతంలాగా తన శరీరాన్ని పెంచి పరుగెత్తాడు. నరేంద్రా! కర్ణుని చేతుల మధ్యలో ఉన్న ఆ శక్త్యాయుధాన్ని చూసి, అంతరిక్షంలో ఉన్న ప్రాణులు నినదించాయి. భయంకరంగా గాలులు వీచాయి. మెరుపులతో పెద్ద పిడుగు నేలమీద పడ్డది. ప్రజ్వలించే ఆ శక్తి, ఆ రాక్షసమాయను భస్మంచేసి, ఘటోత్కచుని గుండెను చీల్చుకొని, రాత్రిపూట వెలుగులు వెదజల్లుతూ, పైకి వెళ్ళి నక్షత్రాల మధ్యలో ప్రవేశించింది. అంతకుముందు ఘటోత్కచుడు దివ్య నాగ మానుష రాక్షసాస్త్రాల సమూహాలతో భిన్న శరీరుడయి ఉన్నాడు. తుదకు ఇంద్ర శక్తి భేదించగా భయంకరంగా నానావిధాల కేకలు వెడుతూ ఇష్టమయిన ప్రాణాలను వదిలాడు.

మహారాజా! ఇంతేకాక ఆ రాక్షసుడు శత్రునాశం కోసం విచిత్రమై ఆశ్చర్యమయిన ఇంకో పనిచేశాడు. శక్త్యాయుధం మర్మస్థానాలను ఛేదించగా ఆ సమయంలో పెద్ద పర్వతంలాగా, మేఘంలాగా చాలా విశాల శరీరు డయ్యాడు. అప్పుడు ఆ ఘటోత్కచుడు భిన్న దేహుడయి ప్రాణాలుపోగా క్రిందికి తల ఉండగా మొద్దు బారిన శరీరంతో, నాలుక బయటకు రాగా, చాలాపెద్ద ఆకారం ధరించి, ఆకాశం నుంచి నేలమీద పడ్డాడు. భయంకరకార్యాలు చేసే భీమకుమారుడు భీతిప్రదమయిన పనిచేసి భయంకరాకారం దాల్చి, పడిపోయాడు. మరణించిగూడా అతడు ఈ విధంగా పడి, నీసైన్యంలో ఒక భాగాన్ని తన దేహంతో నుజ్జు చేశాడు. ఘటోత్కచుడు సమధిక ప్రమాణంతో పెరుగుతున్న తన శరీరంతో ప్రాణాలు పోయి కూడా, పాండవులకు మేలు చేస్తూ, నేలగూలి, నీ సైన్యంలో ఒక అక్షౌహిణిని వెంటనే నాశనం చేశాడు. అప్పుడు సింహనాదాలతో కలిసి భేరులు, శంఖాలు, నగారాలు, ఆనకాలు తీవ్రంగా మ్రోగాయి. రాక్షసమాయ నశించటం, రాక్షససంహారం చూసి, సంతోషపరవశులయిన కౌరవవీరులు కేకలు పెట్టారు. తరువాత కౌరవు లందరూ వృత్రాసురసంహారానంతరం ఇంద్రుని పూజించినట్లు గౌరవిస్తుండగా నీ కుమారుడయిన దుర్యోధనుని రథాన్ని ఎక్కి కర్ణుడు సంతోషంగా తమసైన్యంలో ప్రవేశించాడు."

180. ఘటోత్కచవధ వల్ల పాండవ శోకం, శ్రీకృష్ణ హర్షము.

సంజయుడు చెప్పాడు – "చితికిపోయిన పర్వతంవలె పడి వున్న హిడింబా కుమారుని చూసి, పాండవులందరూ దుఃఖంతో కన్నీరు నించారు. శ్రీకృష్ణుడయితే పరమానందపరవశుడయి పెద్దగా సింహనాదం చేసి, అర్జునుని కౌగిలించుకున్నాడు. ఆయన పగ్గాలను నొగలకు కట్టివేసి, గాలికి ఊగిపోయే చెట్టులాగా హర్షపరవశుడయి నాట్యం చేశాడు. తరువాత మళ్ళీ అర్జునుని ఆలింగనం చేసుకొని, మాటిమాటికి ఆయన వీపు చరుస్తూ, రథంనొగలిపై కూర్చున్న శ్రీకృష్ణుడు మళ్ళీ హర్షనాదాలు చేశాడు. వాసుదేవుడు సంతుష్టాంతరంగుడయ్యాడని తెలుసుకొని అర్జునుడు దిగులుతో ఇలా అన్నాడు. "మధుసూదనా! ఘటోత్కచవధ వల్ల కలిగిన శోకసమయంలో ఈ రోజు నీకు పరమానందం కలుగుతున్నది ఎందుకో ! ఘటోత్కచుడు హతుడు కావటం చూసిన సైన్యాలు యుద్ధవిముఖాలు అయ్యాయి. మేము కూడా చాలా ఉద్విగ్నులమైనాం. జనార్దనా! నీ ఈ పరమసంతోషానికి ఏదో పెద్ద కారణమే ఉంటుంది. ఇలా అడుగుతున్న నాకు సత్యం చెప్పు. ఆ విషయం రహస్యం కాకపోతే చెప్పవలసింది. ఇప్పుడు మాధైర్యం సడలుతున్నది. జనార్దనా! నీవు ఈరోజు చేసినపని సముద్రం ఎండిపోయినట్లు, మేరుపర్వతం వణికినట్లు ఆశ్చర్యకరంగా ఉంది."

శ్రీవాసుదేవుడు అన్నాడు – "ధనంజయా! మనస్సుకు వెంటనే ప్రసన్నతను కలిగించేది ఇది. నాకు కలిగిన మహదానందానికి కారణం విను. ధనంజయా! ఇంద్రదత్తమయిన శక్తిని ఘటోత్కచుని మిషగా వ్యర్థం చేసుకొన్నాక కర్ణుడు వెంటనే యుద్ధంలో హతుడయినట్లుగానే తెలుసుకో. శక్తిహస్తుడయిన కుమారస్వామివలె నిలిచే కర్ణుని ఎదిరించగల వీరుడు ఈ లోకంలో ఎవడు ఉన్నాడు? కర్ణుని కవచం పోవటం మన అదృష్టం. కుండలాలు అపహరించటం అదృష్టం. మన అదృష్టం వల్లనే ఆ శక్తి ఘటోత్కచుని మీద ప్రయుక్తమయి వ్యర్థమయింది. కవచకుండలాలే ఉండి ఉంటే కర్ణుడు యుద్ధంలో దేవతలతో గూడా మూడులోకాలను జయించేవాడు. ఇంద్రుడు గాని, కుబేరుడు గాని జలాధిపుడయిన వరుణుడు గాని, యముడు గాని యుద్ధంలో కర్ణుని ఎదుర్కొనటానికి ఉత్సహించరు. గాండీవం ఎక్కుపెట్టి నీవు గాని, సుదర్శన చక్రాన్ని పట్టి నేను గాని కవచకుండలాలు గల కర్ణుని జయించే శక్తిగల వాళ్ళం కాము. ఈకర్ణుని మాయచేసి ఇంద్రుడు నీమేలు కోరి కుండలాలను కవచాన్ని అపహరించాడు. కవచాన్ని కోసి నిర్మలమయిన ఆ కుండలాలు తీసి ఇంద్రునికి ఇవ్వటం వల్ల కర్ణుడు వైకర్తనుడని ప్రసిద్ధు డయినాడు. మంత్రబలంతో స్తబ్ధమయిన క్రుద్ధసర్పం వలె, మంటలు చల్లారిన అగ్నివలె ఇవ్వాళ కర్ణుడు కన్పిస్తున్నాడు. దివ్యమయిన కవచకుండలాలకు బదులుగా, మహాత్ముడయిన ఇంద్రునివల్ల శక్తి అనే

ఆయుధాన్ని పొంది, కర్ణుడు నిన్ను చంపినట్లుగానే ఎప్పుడూ అనుకొనేవాడు. ఇలా శక్తి హీనుడయినా ఈ కర్ణుని నీవు తప్ప ఇంకెవరూ చంపలేరని ఒట్టుపెట్టి చెపుతున్నాను. బ్రాహ్మణ భక్తుడు, సత్యవచనుడు; తపస్వి, నియమాలను వ్రతాలను పాటించేవాడు, శత్రువుల మీదగూడా దయగలవాడు కావటం చేత కర్ణుడు వృషనామంతో ప్రసిద్ధుడయినాడు. (వృషుడు = ధర్మాత్ముడు). కర్ణుడు యుద్ధకుశలుడు. అతని ధనుస్సు ఎల్లప్పుడూ సన్నద్ధంగా ఉంటుంది. ఆయన అడవిలోని సింహంలాగా గర్జిస్తాడు. మత్తగజం ఇతర గజరాజాలను వలె రథికశ్రేష్ఠుల మదం దించేస్తాడు. నరోత్తమా ! ఆయనను ఆకాశంలో నడినెత్తిమీదికి వచ్చిన సూర్యునివలె కన్నెత్తి చూడటం కష్టం. నీ పక్షంలోని మహాత్ములయిన వీరశ్రేష్ఠులు కూడా ఆయనను ఎదుర్కొనలేరు.

శరత్కాలంలోని సూర్యునివలె, కర్ణుడు బాణాలే వేలకిరణాలు గల సూర్యునిలాగా ఉంటాడు. వర్షాకాలంలో వర్షించే మేఘం జలధారలను వదలినట్లు, దివ్యాస్త్ర లనే జలాన్ని కురిపిస్తుంది కర్ణుడు అనే మేఘం నాలుగువైపులా బాణవర్షం కురిపిస్తూ మాంసరక్తాలను ప్రవహింపజేసే దేవతలు గూడా ఈ కర్ణుని జయించలేరు. పాండవా! కవచకుండలాలు లేనికర్ణుడు, నేడు ఇంద్రుడిచ్చిన శక్తి అనే ఆయుధం లేక సామాన్య మనుష్య డయ్యాడు. ఇంతయినా ఈయనను చంపటానికి ఒకే ఉపాయం ఉంది. ఒక లొసుగు వీర్పడి పరాకుగా ఉన్నప్పుడు, నీతో యుద్ధం చేసేటప్పుడు కర్ణుని రథచక్రం భూమిలో కూరుకుపోతుంది. అతడు సంకటస్థితిలో పడతాడు. అప్పుడు నీవు జాగ్రత్తగా ఉండి నేను చేసే సూచనను అనుసరించి ముందుగానే చంపాలి. యుద్ధంలో ఆయుధం పట్టుకొన్నప్పుడు, అజేయవీరు డయిన కర్ణుని, ముల్లోకాలలో వీకైక వీరు డయి వజ్రాయుధధారి అయిన ఇంద్రుడు కూడా జయించలేడు: మగధరాజయిన జరాసంధుని, మనస్వి అయిన చేది దేశాధిపతి శిశుపాలుని, నిషాదరాజయిన ఏకలవ్యుని నీ మేలుకోరే నేను విభిన్నమయిన ఉపాయాలతో ఒక్కొక్కని సంహరింపజేశాను. వీరేకాక ఇతర రాజులను, హిడింబకిమ్మీర బకాదులయిన రాక్షసముఖ్యులను, అలాయుధుని, ఘటోత్కచుని చంపించాను."

181. ధర్మద్రోహులయిన జరాసంధాదులవధ కారణము.

అర్జునుడు అడిగాడు – "జనార్దనా ! మాకు మేలు చేయటానికి నీవు ఏయే ఉపాయాలతో జరాసంధాదులయిన నరేంద్రులను సంహరింపజేశావు ?" శ్రీవాసుదేవుడు చెప్పాడు – "జరాసంధుడు, శిశుపాలుడు, మహాబలుడయిన ఏకలవ్యుడు మొదలయిన వారు పూర్వం నిహతులు కాకపోతే ఇప్పుడు భయంకరులు అయ్యేవారు. రథికశ్రేష్ఠులయిన

వారిని దుర్యోధనుడు తప్పక అర్థించేవాడు. మనలను నిత్యమూ ద్వేషించే వారు. కౌరవ పక్షాన్ని ఆశ్రయించేవారు. మహావీరులు, మహాధానుష్కులు, అస్త్రవిద్యా నిపుణులు గట్టిగా నిలిచి యుద్ధం చేసే వారంతా కలిసి దుర్యోధనుని సైన్యాన్ని దేవతలవలె రక్షించేవారు. కర్ణుడు, జరాసంధుడు, శిశుపాలుడు, ఏకలవ్యుడు దుర్యోధనుని ఆశ్రయించి, ఈ భూమండలాన్ని అంతను జయించగలవారు. ధనంజయా! ఏయే ఉపాయాలతో వారిని సంహరించానో చెపుతా, వినుు. ఉపాయాలు పన్నకపోతే దేవత లయినా వారిని జయించలేరు. పార్థా! వారిలో ఏ ఒక్కరయినా లోకపాలకులు రక్షించే దేవసైన్యాన్ని అయినా యుద్ధంలో ఎదుర్కొనగలరు. పూర్వం బలరాముడు యుద్ధంలో ఓడించాడు. అందువల్ల కోపించిన జరాసంధుడు మమ్ములను చంపటానికి సమస్తాన్నీ ధ్వంసం చేసే గదను విసిరివేశాడు. ఆ గద ఇంద్రుడు వేసిన వజ్రాయుధం లాగా ఆకాశంలో పాపటను వీర్పరుస్తున్నట్లు మామీదికి పడబోతూ కన్పించింది. మామీద పడబోతున్న ఆ గదను చూచినంతనే, బలరాముడు దాన్ని నివారించటానికి స్థూణాకర్ణమనే అస్త్రాన్ని ప్రయోగించాడు. స్థూణాకర్ణాస్త్ర వేగంతో నివారితమయిన ఆ గద పర్వతాలను కంపింపజేస్తున్నట్లు భూమిని చీల్చివేస్తున్నట్లు క్రింద పడిపోయింది.

అక్కడ మహాపరాక్రమం గల జర అనే ఘోరరాక్షసి ఉండేది. ఆమె శత్రువులను అణచివేసే జరాసంధుని కలిపింది. ఆతడు ఒక తల్లికి సగం దేహం, ఇంకొక తల్లికి ఇంకొక సగం దేహం కలిగి పుట్టాడు. ఆ రెండు సగాలను జరా అనే రాక్షసి సంధించింది. కలిపింది. అందువల్ల జరాసంధుడయినాడు. అర్జునా! కొడుకులతో, బంధువులతో భూమిలోఉండే ఆ రాక్షసి, ఆ గద స్థూణాకర్ణం అనే అస్త్రం తగిలి మరణించింది. ఆ గద లేకపోవటం వల్లనే జరాసంధుని మహాయుద్ధంలో భీముడు నీవు చూస్తుండగానే సంహరించాడు. నరోత్తమా! జరాసంధుని చేతిలో ఆ గద ఉంటే యుద్ధంలో ఇంద్రునితో గూడిన దేవతలు గూడా ఆతనిని చంపలేరు. నీ మేలు కోరే ద్రోణాచార్యుడు గురువయి, వంచనతో, సత్యపరాక్రముడయిన ఏకలవ్యుని బొటనవ్రేలిని ఖండింపజేశాడు. దృఢమయిన పరాక్రమం గలవాడు, అత్యధికాభిమానవంతుడు, అడవిలో నివసించేవాడు అయిన ఏకలవ్యుడు రక్షణగా చేతి వ్రేళ్ళకు ఉడుముతోలు తొడుగులు తొడుగుకొని మరియొక పరశురాముని వలె విలసిల్లాడు. అర్జునా! బొటనవ్రేలు ఉంటే ఏకలవ్యుని రాక్షసులు, నాగులతో గూడి దేవదానవులు కూడా యుద్ధంలో ఏ రీతిగాను జయించలేరు. అంతటివానిని మానవమాత్రుడు తేరిపారజూడగలడా? బలమయిన పిడికిలి పట్టుగలవాడు, అస్త్రవిద్యా విశారదుడు, ప్రతిదినమూ రేయింబవళ్ళు అస్త్ర విద్యాభ్యాసం చేస్తాడు. ఆ ఏకలవ్యుని నీ మేలుగోరి యుద్ధరంగంలో

నేను సంహరించాను.

పరాక్రమించిన శిశుపాలుని నీ కన్నుల ముందే సంహరించాను గదా! ఆ శిశుపాలుని కూడా దేవదానవులు యుద్ధంలో జయించలేరు. నరోత్తమా! లోకాలకు మేలుగోరి నేను అతనిని , నీ సహాయంతో దేవద్వేషులను సంహరింప అవతరించాను. హిడింబుడు, బకుడు, కిర్మీరుడు అనే రాక్షసులు రావణునితో సమానమయిన బలంగలవారు, బ్రాహ్మణ యజ్ఞ వినాశకులు, వారిని భీమసేనుడు నేలగూల్చాడు. అలాగే ఘటోత్కచుడు మాయాబలంతో అలాయుధుని సంహరించాడు. ఘటోత్కచుని కూడా ఉపాయంతో కర్ణుని శక్త్యాయుధంతో చంపించాను. కర్ణుడు శక్త్యాయుధంతో చంపకపోతే నేను మరొకప్పుడు వానిని చంపేవాడిని. మీకు సంతోషం కలిగించటానికే నేను ఇతనిని ఇంతకు ముందు చంపలేదు. బ్రాహ్మణులను ద్వేషించేవాడు, యజ్ఞాలను ద్వేషించేవాడు, ధర్మాన్నినశింపజేసేవాడు, పాపాత్ముడు కావటం చేతనే ఇతన్ని చంపించాను. పవిత్ర చరిత్రా! ఇంద్రుడిచ్చిన శక్తి ఆయుధాన్ని ఉపాయంతో వ్యర్థం చేయించాను. పాండునందనా! **ధర్మాన్ని లోపింప జేసేవారు ఎవరయినా వాకు వధ్యులే సుమా! ధర్మాన్ని సంస్థాపనం చేయటానికే శాశ్వతమయిన ప్రతిజ్ఞ చేశాము. వేదాలు, సత్యం, ఇంద్రియ నిగ్రహం, శౌచం, ధర్మం, లజ్జ, శ్రీ, ధైర్యం, ఓర్పు ఉండే చోటే వే సుఖంగా ఉంటాము.** అని నీకు సత్యం మీద ఒట్టుపెట్టి చెపుతున్నాను. వైకర్తనుడయిన కర్ణుని సంహరించటంలో నీవు విషణ్ణుడివి కావద్దు. అతన్ని ఎలా ఎదిరించాలో దానికి తగిన ఉపాయం ఉపదేశిస్తాను. పాండునందనా! దుర్యోధనుని కూడా యుద్ధంలో భీముడు సంహరిస్తాడు. ఆతని వధోపాయం గూడా నీకు చెపుతాను. ఇప్పుడు చాలా భయంకరధ్వని శత్రుసేనల్లో వినపడుతున్నది. నీ సైన్యాలు పదిదిక్కులకు పారిపోతున్నవి. కౌరవుల గురి తప్పటం లేదు. నీ సైన్యాన్ని నాశనం చేస్తున్నారు. ఇటువైపు యోధశ్రేష్ఠుడయిన ద్రోణుడు మీ సైన్యాన్ని దగ్ధం చేస్తున్నాడు."

182. అర్జునుని మీద కర్ణుడు శక్తిని ప్రయోగించకపోవుటకు హేతువు.

ధృతరాష్ట్రుడు అడిగాడు – "సంజయా! కర్ణుని వద్ద ఉన్న శక్త్యాయుధం ఒక్కవీరుని మాత్రమే వధించి వ్యర్థమయ్యేది గదా! అందరినీ వదలి, అతడు దాన్ని అర్జునుని మీద ఎందుకు వేయలేదు? ఆ అర్జునుని చంపితే, పాండవులు సృంజయులు అందరూ హతులయినట్లే గదా! అలాంటప్పుడు ఏకవీరుడయిన అర్జునుని చంపి, కర్ణుడు ఎందుకు విజయం పొందలేదు? యుద్ధానికి పిలిస్తే వెనక్కు తిరగను అని అర్జునుని నియమం. అందువల్ల కర్ణుడు అర్జునుని స్వయంగా వెతకవలసింది. అప్పుడు ఇద్దరు

రథికులు మాత్రమే ఎదుర్కొని చేసే యుద్ధంలో కర్ణుడు, అర్జునుని ఎదుర్కొని ఎందుకు చంపలేదో ! సంజయా! నాకు చెప్పవలసింది. నిజంగా నాకుమారుడు బుద్ధిలేనివాడు, నిస్సహాయుడు, శత్రువులు మోసం చేశారు. ఆ పాపాత్ముడు శత్రువులను ఇంక ఎలా జయిస్తాడు? అన్నిటిని మించిన శక్తి అయి విజయానికి ఆధారమయిన ఆ దివ్యశక్తిని ఘటోత్కచుని మీద ప్రయోగింపజేసి శ్రీకృష్ణుడు వ్యర్థం చేయించాడు. బలవంతుడు దుర్బలుడయిన వికలాంగుని చేతిలోని పండును లాక్కున్నట్లు శ్రీకృష్ణుడు ఆ అమోఘశక్తిని ఘటోత్కచుని మీద ప్రయోగింపజేయటం వల్ల వ్యర్థమయింది. విద్వాంసుడా! పంది, కుక్క పోట్లాడుకొంటూ ఉంటే వాటిల్లో ఒకటిపోతే కుక్కలు తినేవానికి లాభం కలిగినట్లు కర్ణఘటోత్కచుల యుద్ధంలో కృష్ణునికి లాభం కలిగిందని అనుకొంటాను. ఘటోత్కచుడే కర్ణుని చంపి ఉంటే పాండవులకు చాలా లాభం కలిగి ఉండేది. కర్ణుడు ఘటోత్కచుని చంపితే శక్త్యాయుధం వ్యర్థం అయినందున అదీ వారికే ప్రయోజనం అయ్యేది అని మేధావి, మానవశ్రేష్ఠుడయిన శ్రీకృష్ణుడు పాండవులకు సంతోషాన్ని, మేలును కలిగిస్తూ యుద్ధంలో కర్ణునిచేత ఘటోత్కచుని చంపించాడు. మధుసూదనుడు కర్ణుడు చేయదలచినది తెలుసుకొని ఘటోత్కచుని ఒకరితో ఒకరు యుద్ధం చేయటానికి నియోగించాడు. సంజయుడు చెప్పాడు. "రాజా! నీ దురాలోచన వల్లే మహామేధావి అయిన జనార్దనుడు అమోఘమయిన శక్తి ఆయుధాన్ని నాశనం చేయటానికే ఇది చేశాడు. కురుశ్రేష్ఠా! మహారథుడయిన కర్ణుని బారినుండి శ్రీకృష్ణుడు రక్షించకపోతే అప్పుడే మనం చేయవలసినపని (అర్జునవధ) అయిపోయేది. ధృతరాష్ట్రా! యోగేశ్వరుడు, సర్వసమర్థుడయిన శ్రీకృష్ణుడు లేకపోతే యుద్ధంలో అర్జునుడు గుఱ్ఱాలతో, జెండాతో గూడిన రథంమీద నుంచి పడిపోయేవాడు. శ్రీకృష్ణపాలితు డయిన అర్జునుడు ఆయా ఉపాయాలతో రక్షితు డవుతూ, శత్రువుల నెదుర్కొని జయిస్తున్నాడు. శ్రీకృష్ణుడు విశేష ప్రయత్నం చేసి, అమోఘమయిన ఆశక్తి బారినుండి అర్జునుని రక్షించాడు. అలా చేయకపోతే ఆశక్తి ఆయుధం పిడుగుపాటు చెట్టును పడగొట్టినట్లు వెంటనే అర్జునుని సంహరించేది." ధృతరాష్ట్రుడు అన్నాడు - "నా కొడుకు అందరికీ విరోధి, వాడికి సలహాలు ఇచ్చేవాళ్ళు దుష్టులు, 'నేను మహామేధావిని' అని అనుకొంటాడు. జయాన్ని కలిగించే వధోపాయం చేయి దాటిపోయింది. సర్వశస్త్రధారులలో శ్రేష్ఠుడు, మహామేధావి ఆయిన ఆ కర్ణుడు గూడా అమోఘమయిన దాన్ని అర్జునుని మీదఎందుకు ప్రయోగించలేదు? మహాబుద్ధీ! గవల్గణ కుమారా! సంజయా! నీవయినా ఈ శక్తి ప్రయోగ విషయాన్ని ఎందుకని బోధించకుండా దాటవేశావు?"

సంజయుడు చెప్పాడు – "కర్ణా! రేపు సర్వసైన్యాలను వదలి అర్జునుని జయించు" అని ప్రతిరోజూ రాత్రిపూట దుర్యోధనుడు, శకుని, నేను, దుఃశాసనుడు చెపుతూ ఉండే వారం. 'అర్జునవధ కాగానే మనం పాండవులను, పాంచాలురను మన సేవకులుగా చేసుకొని భోగాలు అనుభవించుదాం' అని కూడా అనే వారం. 'అలా అర్జునుడు హతుడయితే పాండవులలో ఇంకొకరిని అర్జునుడు నిలుపవచ్చు. కాబట్టి కృష్ణునే సంహరించు. పాండవులకు కృష్ణుడే మూలం. అర్జునుడు బోదెలాగా అవుతాడు. ఇతర పాండవులు కొమ్మల వంటివారు. పాంచాలురు ఆకులవంటివారు. పాండవులకు కృష్ణుడే ఆశ్రయం, కృష్ణుడే బలం, కృష్ణుడే దిక్కుగా ఉంటాడు. నక్షత్రాలకు చంద్రునివలె, కృష్ణుడే వారికి గొప్ప అండగా ఉంటాడు. కాబట్టి కర్ణా! ఆకులను, కొమ్మలను, బోదెను వదలి మూలాన్ని గమనించు. పాండవులకు అన్నిచోట్లా, ఎల్లవేళలా పాండవులకు మూలం కృష్ణుడే అని తెలుసుకో. రాజా! కర్ణుడు శ్రీకృష్ణుని సంహరిస్తే ఈ సమస్త భూమండలం ఆయన వశం అవుతుంది. సందేహం లేదు. నరేంద్రా! యదువంశానికి పాండవులకు ఆనందం కలిగించే శ్రీకృష్ణుని సంహరించి, నేలగూలిస్తే పర్వతాలతో, సముద్రాలతో, అడవులతో గూడా సమస్త భూమండలమూ నీకు వశమయ్యేది. 'ఇలాగా నిశ్చయం చేసిన తరువాత కూడా యుద్ధ సమయంలో నిరంతరం ముందుజాగ్రత్తగా ఉండేవాడు, శ్రీకృష్ణుని సమీపానికి వెళ్ళేసరికి ఆ కర్ణుని మోహం ఆవరించేది. శ్రీకృష్ణుడు కర్ణుని బారిన పడకుండా అర్జునుని ఎల్లప్పుడూ రక్షించేవాడు. ఆయన అర్జునుని యుద్ధంలో కర్ణునికి ఎదురుగా ఉంచాలని అనుకోలేదు. ఆ శక్తిని ఎలా వ్యర్థం చేయాలా అని కృష్ణుడు కర్ణునికి ఎదురుగా ఇతర రథిక శ్రేష్ఠులను నిలిపేవాడు. కృష్ణుడు కర్ణుని బారినపడకుండా అర్జునుని రక్షించేవాడు. పురుషోత్తముడు ఆత్మరక్షణ ఎందుకు చేసుకోడు ? ఆ శ్రీకృష్ణుని గూర్చి బాగా ఆలోచిస్తే, ముల్లోకాల్లో ఆయనను జయింపగలవాడు ఎవడూ లేడని అనిపిస్తుంది. సాత్యకి శ్రీకృష్ణుని కర్ణుని విషయం అడిగాడు. 'దేవా! కర్ణునికి శక్తి ఆయుధం మీద అమితమయిన నమ్మకం ఉన్నదిగదా! శక్తి ఆయుధం గూడా మహావిక్రమం చేయగలదు. దానిని కర్ణుడు అర్జునుని మీద ఎందుకు ప్రయోగించలేదు?'

శ్రీ వాసుదేవుడు అన్నాడు – 'కర్ణా! కర్ణా! అమోఘమయిన ఈ శక్తిని మహారథుడు, కుంతీపుత్రుడు అయిన అర్జునుని మీద తప్ప ఇంకెవరిమీద ప్రయోగించవద్దు!' అని దుశ్శాసనుడు, కర్ణుడు, శకుని, సైంధవుడు దుర్యోధనుని ముందుంచుకొని మంత్రాంగం చేసేటప్పుడు కర్ణునికి చెప్పేవారు. దేవతలు ఇంద్రునివలె వారిలో అర్జునుని మించినవారు లేరు. ఆ అర్జునుని సంహరిస్తే సృంజయులతో కూడా పాండవులు మృతప్రాయులు

అవుతారు. సాత్యకీ! కర్ణుడు అలాగే నని ప్రతిజ్ఞ చేసేవాడు. అర్జునుని వధించాలనే కర్ణుని మనస్సులో నిత్యం ఉద్దేశ్యం ఉండేది. యోధశ్రేష్ఠా! నేనే కర్ణుని నిత్యం మోహితుని చేస్తుండేవాడిని. అందువల్లనే శ్వేతవాహనుడయిన అర్జునుని మీద శక్తిని ప్రయోగించలేదు. అర్జునుని పాలిటి మృత్యువే ఆశక్తి అని నిరంతరం ఆలోచించే నాకు నిద్రపట్టేదికాదు. నామనస్సుకు సంతోషం కలిగేది కాదు. ఆ శక్తి ఘటోత్కచుని మీద ప్రయుక్తమయి వ్యర్థం కావటం చూసి అర్జునుడు మృత్యుముఖంనుంచి విముక్తుడయినట్లు ఇవ్వాళ చూస్తున్నాను. యుద్ధరంగంలో అర్జునుని రక్షించవలసినట్లు నాకు తండ్రి గాని, తల్లి గాని, సోదరులయిన మీరు గాని, ప్రాణాలు గాని రక్షించవలసినవి కావు. సాత్యకీ! ముల్లోకాలకంటె అధికమయిన అత్యంత దుర్లభమయిన వస్తువు ఉంటే, దాన్ని కూడా అర్జునుడు లేకుండా నేను పొందగోరను. సాత్యకీ! అందువల్లనే మరణించిన వాడు తిరిగి బ్రతికినట్లుగా, అర్జునుని చూసిన నాకు మహత్తరమయిన ఆనందం కలుగుతున్నది. అందువల్లనే కర్ణుని ఎదుర్కొనటానికి రాక్షసుడయిన ఘటోత్కచుని పంపాను. రాత్రి సమయంలో కర్ణుని బాధించటానికి ఇంకెవ్వరూ యుద్ధంలో సమర్థులు కారు.' సంజయుడు చెప్పాడు – "నిరంతరం అర్జునునికి ప్రియం కలిగించేవాడు, అర్జునుని మేలుకోరేవాడు, దేవకీనందనుడయిన శ్రీకృష్ణుడు అప్పుడు సాత్యకికి చెప్పాడు."

183. ధృతరాష్ట్రుని పశ్చాత్తాపము, సంజయుని సమాధానము, యుధిష్ఠిరుని దుఃఖము, శ్రీకృష్ణవ్యాసులు నివారించుట.

ధృతరాష్ట్రుడు అడిగాడు – "వత్సా! సంజయా! కర్ణ దుర్యోధనాదులకు, శకునికి, నీకు గూడా చాలా అన్యాయం జరిగింది. ఆశక్తి ఎప్పుడయినా ఒక్కనినే చంపుతుందని, ఇంద్రునితో గూడిన దేవతలయినా, దానిని ఆపలేరని, సహించలేరని మీకు అందరికీ తెలిసి ఉంటే, యుద్ధప్రారంభంలో కర్ణుడు కృష్ణుని మీదగాని, అర్జునుని మీదగాని ఎందుకు ప్రయోగించలేదు ?" సంజయుడు చెప్పాడు – "నరేంద్రా! యుద్ధంనుంచి వెనుదిరిగిన మా అందరి కలయిక, మంత్రాలోచన రాత్రిపూట జరిగేది. కర్ణా! కర్ణా! రేపు తెల్లవారగానే ఈ శక్తి ఆయుధాన్ని కృష్ణుని మీదగాని, అర్జునుని మీదగాని ప్రయోగించు. అని నిత్యం చెప్పేవారం. రాజా! మరునాడు తెల్లవారిన తరువాత దేవతలు కర్ణునికి, ఇతరయోధులకు ఆ జ్ఞానాన్ని మళ్ళీ నాశనం చేసేవారు. కర్ణుడు చేతిలో ఉన్న శక్తితో యుద్ధంలో అర్జునుని గాని, కృష్ణుని గాని చంపలేదంటే అందు కా విధియే ప్రధాన కారణం అనుకొంటాను. ఆతని చేతిలో ఉన్న శక్తి కాళరాత్రివలె శత్రువధకు సిద్ధంగా ఉండేది. దైవం ఆ జ్ఞానాన్ని

పోగొట్టటం చేత కర్ణుడు దాన్ని ప్రయోగించలేదు. దైవమాయచే మోహితుడై అర్జునుని మీదగాని, దేవకీ పుత్రుడయిన శ్రీకృష్ణుని మీదగాని ఇంద్రశక్తిని వేయలేకపోయాడు.

ధృతరాష్ట్రుడు అన్నాడు – "సంజయా! నిజంగా మీరు దైవోపహతులే. అందువల్లనే శ్రీకృష్ణుని ఆలోచనానుసారం ఆశక్తి అర్జునుని వదలి, గడ్డి పరకలాంటి ఘటోత్కచుని చంపి, వ్యర్థమయింది. ఆ దుర్నీతి కారణంగానే నా పుత్రులు అందరు, ఇతర రాజులు యమలోకానికి చేరిసట్టేనని అనిపిస్తున్నది. ఘటోత్కచ వధానంతరం కౌరవపాండవులకు ఏ రీతిగా యుద్ధం జరిగిందో మళ్ళీ చెప్పవలసింది. సైన్యాలను పన్నిన ఏ వీరులు పాంచాలురతో, సృంజయులతో కలిసి ద్రోణుని ఎదిరించారు ? వారు ఏ విధంగా యుద్ధం చేశారు ? భూరిశ్రవసైంధవుల వధచే కోపించిన ద్రోణాచార్యుడు వచ్చినప్పుడు, జీవితం మీద మోహం వదలి పాండవసైన్యాన్ని మథిస్తూ అందులో ప్రవేశించసాగినప్పుడు, గర్జిస్తున్న పెద్ద పులివలె, నోరుతెరిచిన యమునివలె బాణవర్షం కురిపిస్తూ ఉన్న ఆయనకు ఎదురుగా పాండవ సృంజయులు ఎలా రాగలిగారు ? నాయనా! దుర్యోధనుడు ముందుగాగల అశ్వత్థామ కర్ణకృపులలో ఎవరు ఆచార్యుని రక్షించారు ? వారందరూ యుద్ధంలో ఎలా ప్రవర్తించారు ? ద్రోణుని సంహరించదలచిన అర్జున భీములను నావారు యుద్ధంలో ఏ రీతిగా ఎదుర్కొన్నారు? సంజయా ఇదంతా నాకు వివరించు. సైంధవుని వధవలన మావారు, ఘటోత్కచ వధతో వారు కుపితులయి రాత్రి యుద్ధం ఎలా చేశారు ?"

సంజయుడు చెప్పాడు – "రాజా! రాత్రిపూట కర్ణుడు ఘటోత్కచుని చంపాడు. మీపక్షంవారు సంతోషంతో సింహనాదాలు చేస్తూ యుద్ధం చేయదలచి పాండవ సేన మీద పడుతున్నారు, వేగంగా వారిని వధిస్తున్నారు. రాత్రి గాఢాంధకారం క్రమ్మగా ధర్మరాజు తీవ్రమయిన విషాదం పొందాడు. యుధిష్ఠిరుడు భీమునితో ఇలా అన్నాడు – "వత్సా! కౌరవసేనను నిలువరించు. ఘటోత్కచ వధవల్ల నా మనస్సును అధికమయిన మోహం ఆవరించింది." ఈ విధంగా భీముని ఆజ్ఞాపించి, యుధిష్ఠిరుడు ముఖం కన్నీటితో నిండగా మాటిమాటికి నిట్టూర్పులు విడుస్తూ తన రథంమీద కూర్చున్నాడు. కర్ణుని పరాక్రమం చూసిన ఆయనమనస్సులో ఘోరమయిన కలవరం కలిగింది. ఆ విధంగా వ్యథకు లోనయిన యుధిష్ఠిరుని చూసి, శ్రీకృష్ణుడు, "కుంతీకుమారా! కలతచెందకు. ఇది నీకు తగదు. అతిసామాన్య మనుష్యునివలె ఇలా నీరుగారిపోవటం నీకు సముచితంగాదు. ప్రభూ! లే ! యుద్ధభారాన్ని వహించు ! యుద్ధం చెయ్యి. నీవే నిరుత్సాహపడితే మనకు విజయం సందిగ్ధ స్థితిలో పడుతుంది' అని అన్నాడు. శ్రీకృష్ణుని మాటలు విన్న యుధిష్ఠిరుడు చేతులతో కన్నులు తుడుచుకొని శ్రీకృష్ణునితో ఇలా అన్నాడు.

"మహాబాహూ! కృష్ణా! నాకు ధర్మాసుశ్రేష్ఠగతి తెలుసు. చేసిన ఉపకారం మరిచిపోయేవారికి బ్రహ్మహత్యా పాతకం కలుగుతుంది.* జనార్దనా! మేము అరణ్యవాసం చేసేటప్పుడు మహాత్ముడయిన హిడింబాకుమారుడు బాలుడయి కూడా సహాయం చేశాడు. అర్జునుడు మహాస్త్రసాధనకు వెళ్ళాడని తెలిసి ఇతడు కామ్యక వనంలో నావద్దకు వచ్చి, అర్జునుడు వచ్చేదాకా మాతో పాటే ఉన్నాడు. గంధమాదన పర్వత యాత్రచేసినప్పుడు కష్టాలనుంచి మమ్ములను గట్టెక్కించాడు. బాగా అలసిపోయి నడువలేని ద్రౌపదిని ఈ మహాత్ముడు వీపు మీద మోశాడు. ప్రభూ! యుద్ధాలు మొదలయినప్పటి నుంచి నాకు చేదోడుగా ఉన్నాడు. మహా యుద్ధంలో, నాకోసం దుష్కరకార్యం చేశాడు. జనార్దనా! సహదేవుని యందు నాకు గల ప్రేమయే రాక్షస శ్రేష్ఠుడయిన ఘటోత్కచుని యందూ ఉంది. మహాబాహువయిన ఆతడు నా భక్తుడు, నేనంటే ఆతనికి చాలా ఇష్టం. నాకు గూడా ఆతడు ఇష్టుడే.

కృష్ణా! ఆతనికి కలిగిన దుఃస్థితి చూచి శోకతప్తుడయిన నాకు మోహం కలిగింది. కృష్ణా! కౌరవులు పారద్రోలుతున్న మన సైన్యాలను చూడు. ద్రోణకర్ణులు యుద్ధంలో ఎలా సప్రయత్నులయి ఉన్నారో చూడు. అర్ధరాత్రి సమయంలో మదించిన రెండు ఏనుగులు విశాలమయిన పద్మవనాన్ని వలె వారిసేన పాండవసేనను మర్దించింది. మాధవా! భీమసేనుని బాహుబలాన్ని, పార్థుని విచిత్రాస్త్రనైపుణ్యాన్ని లెక్కచేయక కౌరవులు పరాక్రమిస్తున్నారు. ఈద్రోణుడు, కర్ణుడు, దుర్యోధనుడు యుద్ధంలో రాక్షసుని సంహరించి, సంతోషంతో కేకలు పెడుతున్నారు. జనార్దనా! మేము, నీవు సజీవంగా ఉండగానే కర్ణుని ఎదిరించిన హిడింబాపుత్రుడు ఎలా మరణించాడో? కృష్ణా! మనల నందరిని అవమానించి, భీమపుత్రుడు రాక్షసుని సంహరించాడు. కృష్ణా ! దుర్మార్గులయిన కౌరవులు అభిమన్యుని సంహరించినప్పుడు అర్జునుడు అక్కడ లేడు. సైంధవుడు ఆ యుద్ధంలో మమ్ములను అందరినీ నిలిపివేశాడు. అభిమన్యువధకు కొడుకుతో గూడా ద్రోణుడు కారణ మయినాడు. కర్ణునికి ద్రోణాచార్యుడే అభిమన్యుని వధోపాయం స్వయంగా చెప్పాడు. అభిమన్యుడు ప్రయత్న పూర్వకంగా ఖడ్గ యుద్ధం చేస్తున్న సమయంలో అతని ఖడ్గాన్ని రెండు ముక్కలు చేశాడట. ఆతడు సంకటస్థితిలో ఉండగా కృతవర్మ ఆతని రథాశ్వాలను, పార్శ్వరక్షకులను, సారథిని చంపాడు. అలాగే ఇతర మహాధనుష్కులు సుభద్రా పుత్రుని యుద్ధంలో నేలగూల్చారు. కృష్ణా! స్వల్పకారణంతో అర్జునుడు సైంధవుని

* విదితా మే మహాబాహో ధర్మాణాం పరమా గతిః ॥ 27
బ్రహ్మహత్యా ఫలం తస్య యైః కృతం నావబుధ్యతే ।

సంహరించాడు. అది నాకు ఏమాత్రం ఇష్టం గాదు. పాండవులు శత్రువధ చేయటం న్యాయం అయితే మొట్టమొదట కర్ణద్రోణులనే సంహరించవలసింది అని నాఅభిప్రాయం. మా దుఃఖాలకు అన్నింటికీ మూలం ఈ ఇద్దరే. ఈ ఇద్దరిని యుద్ధరంగంలో ఆలంబనగా పొంది, దుర్యోధనుడు ధైర్యంగా ఉన్నాడు. సపరివారంగా ద్రోణకర్ణులను వధించవలసిన చోట అర్జునుడు దూరంగా ఉన్న సైంధవుని సంహరించాడు.

ముందు నేను కర్ణుని సంహరించాలి. కాబట్టి స్వయంగా నేనే కర్ణసంహారానికి వెళ్తాను. భీముడు ద్రోణసైన్యంతో యుద్ధంలో ఉన్నాడు." అని పలికి యుధిష్ఠిరుడు మహాధనుష్టంకారంచేస్తూ భయంకరంగా శంఖధ్వానం చేసి చాలా త్వరగా యుద్ధంలోకి వెళ్ళాడు. అప్పుడు శిఖండి వేయి రథాలతో, మూడు వందల ఏనుగులతో అయిదువేల గుర్రాలతో, ప్రభద్రకులతో, పాంచాలురతో గూడి యుధిష్ఠిరుని వెనక త్వరగా వెళ్ళాడు. ఆ సమయంలో యుధిష్ఠిరుడు ముందున్న పాంచాలురు, పాండవులు, భేరులను మ్రోగింపజేశారు. కవచధారులయిన వారు శంఖధ్వానాలు చేశారు. అప్పుడు మహాబాహువయిన వాసుదేవుడు ధనంజయునితో 'ఈ యుధిష్ఠిరుడు క్రోధావిష్టుడయి త్వరగా కర్ణుని సంహరించటానికి వెళ్ళుతున్నాడు. ఇప్పుడు ఈయనను ఒంటరిగా పోనీయటం తగదు.' అని చెప్పాడు. ఇలాగని శ్రీకృష్ణుడు గుఱ్ఱాలను వేగంగా తోలాడు. దూరంగా వెళ్ళిన రాజుకు శ్రీకృష్ణుడు వెంట వెళ్ళాడు. కర్ణుని సంహరింపదలచి, శోకంతో ఆయన ఆలోచనా శక్తి కోల్పోయాడు. అగ్నితో దగ్ధుడవుతున్నట్లున్నాడు.

అలాంటి ధర్మపుత్రుడయిన యుధిష్ఠిరుని చూచి వ్యాసమహర్షి సమీపించి ఇలా అన్నాడు. 'యుధిష్ఠిరా! కర్ణుని ఎదిరించిన అర్జునుడు అదృష్టం వల్ల జీవించి ఉన్నాడు. ఆ కర్ణుడు అర్జునుని వధింపదలచి శక్తి ఆయుధాన్ని రక్షించుకొంటున్నాడు గదా! అలాంటి సమయంలో అదృష్టంవల్లనే కర్ణునితో అర్జునుడు ద్వైరథ యుద్ధంలో ఎదుర్కొనలేదు. ఒకరితో ఒకరు పోటీపడే వారు అన్నివిధాల దివ్యాస్త్రాలను ప్రయోగిస్తారు. తన అస్త్రాలన్ని వ్యర్థమయి అర్జున బాణపీడితుడయిన సూతపుత్రుడు యుద్ధంలో ఇంద్రదత్త శక్తిని ఆతని మీద తప్పక ప్రయోగించేవాడు. భరతసత్తమా! యుధిష్ఠిరా! అందువల్ల ఘోరమయిన ఆపదవచ్చేది. అదృష్టవిశేషం వల్లనే కర్ణుడు ఘటోత్కచుని సంహరించాడు. ఇంద్రశక్తి అనే కారణంతో యముడే ఆతనిని సంహరించాడు. వత్సా! యుధిష్ఠిరా! నీకు మేలు గలగటానికే యుద్ధంలో రాక్షసుడు హతు డయినాడు. కాబట్టి కోపం తెచ్చుకోవద్దు. శోకించవద్దు. ఈ జగత్తులో అన్నిప్రాణులకు ఈ స్థితి కలుగక తప్పదు. రాజా! నీ సోదరులు అందరితో, నీ పక్షంలోని మహాత్ము లయిన రాజులు అందరితో కలిసి

కౌరవుల నెదుర్కొని యుద్ధం చెయ్యి. నాయనా! ఈ నాటికి అయిదవరోజున సమస్త భూమండలం నీది అవుతుంది. **వరశ్రేష్ఠా! నిత్యమూ ధర్మపద్ధతిలోనే ఆలోచించు. క్రూరత్వం లేకపోవటం, తపస్సు, దానం, ఓర్పు, సత్యవచనం అనేవాటిని సంతోషంతో పాటించు. ధర్మం ఉన్నచోటనే జయం ఉంటుంది.*** అని ధర్మరాజుతో చెప్పి వ్యాసమహర్షి అక్కడే అంతర్ధానం చెందాడు."

184. ఇరుపక్షాల సైనికులు నిద్రించుట, చంద్రోదయము తరువాత మరల యుద్ధము చేయుట.

సంజయుడు చెప్పాడు – "భరతశ్రేష్ఠా! వ్యాసమహర్షి ఇలా చెప్పగా ధర్మరాజయిన యుధిష్ఠిరుడు కర్ణవధ ప్రయత్నం నుంచి స్వయంగానే వెనుదిరిగాడు. కర్ణుడు ఘటోత్కచుని సంహరిస్తే ఆ రాత్రి యుధిష్ఠిరుడు దుఃఖక్రోధాలకు వశుడయినాడు. భీముడు మహత్తరమయిన నీ సేనను వారించటం చూచి ధృష్టద్యుమ్ననితో "నీవు ద్రోణుని అడ్డుకో. నీవు ద్రోణ వినాశనానికే బాణాలు, కవచం, ఖడ్గం, ధనుస్సు ధరించి శత్రుసంతాపకరుడవయి జనించావు. సంతోషంగా యుద్ధంలో ముందుకువెళ్ళు. నీకు ఎలాంటి భయమూ లేదు. జనమేజయుడు, శిఖండి, దుర్ముఖ పుత్రుడయిన యశోధరుడు ఉత్సాహంగా అన్ని వైపులా ద్రోణుని చుట్టుముట్టాలి. నకులుడు, సహదేవుడు, ద్రౌపదీ పుత్రులు, ప్రభద్రకులు, పుత్రులతో, సోదరులతో ద్రుపదవిరాటులు, సాత్యకి కేకయులు, అర్జునుడు ద్రోణవధను కోరి దండెత్తండి. అలాగే రథికులు అందరు, మనకున్న ఏనుగులు, గుఱ్ఱాలతో పదాతులు యుద్ధంలో మహారథుడయిన ద్రోణుని నేలగూల్చండి." అని యుధిష్ఠిరుడు ఆజ్ఞాపించగా ద్రోణవధ చేయదలచి వారందరూ ఆయన మీద దాడికి వెళ్ళారు. సర్వప్రయత్న పూర్ణులయి చాలా త్వరగా మీదికి వస్తున్న పాండవ వీరులను ద్రోణుడు ఎదుర్కొన్నాడు. అప్పుడు దుర్యోధనుడు కోపించి సర్వసన్నద్ధులయి వస్తున్న పాండవ వీరులను ద్రోణ రక్షణ కోరుతూ ఎదిరించాడు.

ఆ తరువాత అలిసి పోయిన వాహనాలు, సైనికులు గల పాండవకౌరవుల సైన్యం పరస్పరం కేకలు వెడుతుండగా యుద్ధం ఆరంభమయింది. మహారాజా! యుద్ధంలో బాగా అలసిపోయిన వారు, నిద్రతో గ్రుడ్డివారివలె ఉన్న ఆ మహారథులు అందరూ యుద్ధంలో చేష్టలుడిగి నిలిచారు. ఘోరరూపమూ, భయంకరమూ, ప్రాణాలను హరించేది

---

* నిత్యం చ పురుషవ్యాఘ్ర ధర్మమేవానుచింతయ ।
ఆనృశంస్యం తపో దానం క్షమాం సత్యం చ పాండవ ॥ 66
సేవేథాః పరమప్రీతః యతో ధర్మస్తతో జయః ।

అయిన ఆ రాత్రి వేయి జాములతో సమానమయింది. నిద్రతో కన్నుగానని ఆ సైనికులలో కొందరు బాగా గాయపడుతున్నా, కొందరు వధింపబడుతున్నా నీ పక్షంలో, పరపక్షంలో ఉన్న క్షత్రియులు అందరూ ఉత్సాహ రహితులు దీన మనస్కులు, అస్త్రాలు, బాణాలు పోయాయి. అప్పుడు వారు సరిగా యుద్ధం చేయలేకపోతున్నా సిగ్గుపడేవాళ్ళు కావటం వల్ల క్షత్రియధర్మాన్ని గుర్తించి తమసేనలను విడిచి పోలేదు. కొందరు సైనికులు చేతుల్లోని ఆయుధాలను వదలి నిద్రాంధులయి రథాలమీద కొందరు, ఏనుగుల మీద కొందరు, గుర్రాల మీద కొందరు పడి నిద్రపోతున్నారు. నరేంద్రా! నిద్రామత్తులు కావటం వల్ల ఏం చేయాలో తెలియక ఉన్నవారిని ఆ యుద్ధరంగంలో ఇతర యోధులు సంహరిస్తున్నారు. నిద్రామత్తులయి ఒళ్ళు తెలియకుండా ఉన్న శత్రువులను కొందరు సంహరించగా ఇంకా కొందరు తమవారు, శత్రువులు అనే తేడా లేకుండా చంపసాగారు. నిద్రా పరవశులయివారు ఆ మహా యుద్ధంలో ఆ సమయాన అనేక విధాలుగా మాట్లాడుతున్నారు. మహారాజా! మన పక్షంలోని వారు, శత్రుపక్షం లోనివారు చాలామంది నిద్రతో కన్నులు ఎర్రబడి యుద్ధం చేయాలి కదా అని నిలిచి ఉన్నారు. యుద్ధంలో కొందరు వీరులు నిద్రతో పరవశించి, శత్రువీరులను ఆ దారుణమయిన చీకటిలో సంహరించారు. చాలామంది సైనికులు నిద్రామోహితులు కావటం వల్ల యుద్ధంలో శత్రువులు తమ్ము చంపటం కూడా తెలుసుకోలేకపోయారు. అర్జునుడు సైనికుల ఈ ప్రవర్తనను గుర్తించి, దిక్కులు పిక్కటిల్లేటట్లు ఇలా పలికాడు.

"సైనికులారా! నిద్రాంధులయిన మీరు అందరూ మీ వాహనాలతో కూడా బాగా అలసిపోయారు. ఇక్కడ ఈ సేనలను దట్టమయిన చీకటి సమధికమయిన దుమ్ము కప్పి వేసింది. మీకు అందరికీ ఇష్టమయితే ఈ యుద్ధభూమిలోనే కొద్దిసేపు యుద్ధం విరమించి, నిద్రించండి. కౌరవపాండవ పక్షీయులారా! తరువాత నిద్రమత్తు వదలగా, కొంత విశ్రాంతి నంది చంద్రోదయం అయిన తరువాత మళ్ళీ యుద్ధం చేయండి." ధార్మికుడయిన అర్జునుని ఆ మాటలు విన్న ధర్మజ్ఞులయిన సైనికులు అందుకు ఇష్టపడ్డారు. అప్పుడు సైన్యాలు ఒకరితో ఒకరు చెప్పుకున్నారు. 'కర్ణా! కర్ణా! దుర్యోధనా! పాండవసైన్యం యుద్ధం విరమించింది. మీరు కూడా యుద్ధం విరమించండి.' భారతా! అలా అర్జునుని కేకలు విని పాండవసేన, నీ సేన యుద్ధం విరమించింది. అర్జునుని మంచి మాటలు విన్న దేవతలు మహర్షులు, సర్వసైన్యాలు సంతోషించి, ఆయనను ఆదరించాయి. భరతశ్రేష్ఠా! దయాన్వితమయిన ఆ మాటలను సర్వసైన్యాలు అలసి ఉండటం వల్ల గౌరవించి, క్షణకాలం విశ్రాంతి తీసికొన్నాయి. రాజా! నీ సైన్యం విశ్రాంతి తీసుకొని, సుఖంగా నిద్రించి వీరుడయిన

అర్జునుని గౌరవించాయి. 'వేదాలు, అస్త్రాలు, వివేకం, పరాక్రమం, ధర్మం, ప్రాణుల యందు దయ నీకున్నవి. ఈ విధంగా మాకు ఊరట కలిగించినందుకు నీకు సుఖం కలుగుగాక. వీరా! పార్థా! మనస్సులో నీవు కోరుకున్నవి త్వరగా పొందుదువుగాక.' అర్జునుని మహారథులు ఈ రీతిగా ప్రశంసిస్తూ నిద్రాముద్రితులై ఊరుకున్నారు.

ఉభయసైన్యాలలోనివారు అందరూ ఆయుధాలు, గదలు, ఖడ్గాలు, పరశువులు, ప్రాసాయుధాలు, కవచాలు ధరించినవి అలాగే ఉంచుకొని గుర్రాల మీదకొందరు, రథాల వెనుక కొందరు, ఏనుగులమీద కొందరు, మరికొందరు నేలమీద విడివిడిగా పడుకొని నిద్రించారు. నిద్రాపరవశాలయిన ఏనుగులు దుమ్ముకొట్టుకొన్న తొండాలతో భూమిని నిట్టూర్పుల గాలులతో చల్లపరిచాయి. తొండాలనుంచి గాలి విడుస్తూ నేలమీద పడుకొన్న ఏనుగులు బుసలు కొడుతున్న మహాసర్పాలు గల్గి చెల్లాచెదరుగా పడి ఉన్న పర్వతాల వలె విలసిల్లాయి. బంగరు కళ్ళేలు గల గుర్రాలు మెడల జూలు మీద కాడులు ఉండగా సమంగా ఉన్న భూమిని గిట్టల ముందు భాగాలతో ఎత్తుపల్లాలుగా చేశాయి. రాజేంద్రా! ఈ రీతిగా రథాల కాడులకు కట్టి ఉండగానే అవి నిద్రించాయి. ఈ విధంగా గుఱ్ఱాలు, ఏనుగులు, యోధులు ఎక్కువ శ్రమతో అలసిపోయి యుద్ధం విరమించి నిద్రించారు. ఆలాగా నిద్రాపరవశమయి ఒళ్ళు తెలియకుండా గాఢ నిద్రలో ఉన్న ఆ సైన్యం నేర్పరులయిన చిత్రకారులు చిత్ర పటం మీద చిత్రించిన చిత్రంవలె ఉన్నది. చెవులకు కుండలాలు గల ఆ క్షత్రియయువకులు పరస్పరం బాణాలతో గాయపడిన శరీరాలు గలిగి, ఏనుగు కుంభస్థలాల మీద పడుకొని, కాంతుల వక్షఃస్థలంలో నిలీనులయినట్లు కన్పించారు. (అంత సుఖంగా నిద్రించారు) ఆ తరువాత (చంద్రోదయమైంది) ఇంద్రుని దిక్కు (తూర్పు) అనే గుహనుంచి బయటకు వచ్చినది, కిరణాలు అనే ప్రకాశించే జూలుతో పచ్చనిరంగు గలది, చీకటి అనే మత్తగజాన్ని చీల్చేది అయిన ఉదయాచల సింహం (చంద్రుడు) ఉదయించింది.

పరమేశ్వర వాహనమయిన నందీశ్వరుని శరీరకాంతి పుష్పమయమయిన మన్మథుని ధనుస్సుతో సమానమయిన సంపూర్ణ ధవళకాంతి కల్గి, క్రొత్త పెళ్ళికూతురి చిరునవ్వువలె మనోహరుడయిన కలువల చెలికాడు ఆకాశంలో క్రమంగా పైకి వస్తూ, వెన్నెల వెదజల్లుతున్నాడు. తరువాత రెండు గడియల్లో చంద్రుడు నక్షత్రాల కాంతులను మ్రింగేస్తూ ముందు అరుణకాంతిని చూపించాడు. తరువాత వెండివలె తెల్లని కిరణసమూహాన్ని మెల్లమెల్లగా చంద్రుడు ప్రసరింపజేశాడు. ఆ చంద్రకాంతులు తమ వెలుగుతో చీకటిని పోగొట్టుతూ మెల్లమెల్లగా అన్నిదిక్కులను ఆకాశాన్ని, భూమిని వ్యాపించాయి. తరువాత

రెండు గడియలలో లోకం అంతా జ్యోతిర్మయం అయింది. చీకటి ఊరూపేరూ లేకుండా త్వరగా మాయమయింది. చంద్రుడు పూర్తిగా వెలుగులు వెదజల్లగా జగత్తులో పగటివలె ప్రకాశం వ్యాపించింది. రాజా! అప్పుడు రాత్రిపూట చరించే కొన్ని ప్రాణులు సంచరించాయి. కొన్ని కదలకుండా పడి ఉన్నాయి. రాజా! చంద్రకిరణ స్పర్శ చేత మేలుకొన్న సైన్యం సూర్యకిరణ ప్రసారం వల్ల వికసించిన పద్మాల వనం వలె విలసిల్లింది. చంద్రోదయం కాగానే ఆప్రభావంతో ఆటుపోట్లకు గురి అయిన సముద్రం వలె చంద్రోదయంతో మేలుకొన్న సైన్య సాగరం కలకలంతో వెలసింది. లోకంలో పరలోకానికి వెళ్ళగోరే సేనలకు జననాశనానికి యుద్ధం ప్రారంభమయింది."

185. దుర్యోధనుని నింద - ద్రోణుని వ్యంగ్యోక్తి.

సంజయుడు చెప్పాడు. అంతట కోపపరవశుడయిన దుర్యోధనుడు హర్షతేజస్సులను పెంపొందిస్తూ ద్రోణుని వద్దకు వచ్చి ఇలా అన్నాడు. 'ఆచార్యా! యుద్ధంలో అలసిపోయి ఖిన్నమనస్కులు, విశేషంగా లక్ష్యాన్ని పొందే శత్రువులు విశ్రాంతి తీసుకోవటం మనం ఉపేక్షించరాదు. నీకు సంతృప్తి కలిగించటం కోసం నిద్రిస్తున్న శత్రువులను సంహరించలేదు. అందువల్లనే బలవత్తరులయిన పాండవులు బాగా విశ్రాంతి తీసుకొన్నారు. మేము అందరమూ అన్నివిధాల తేజస్సు, బలంలేని వారం అయినాము. నీవు రక్షించటం వల్ల పాండవులు ప్రతిసారి బలపడుతూ పెంపొందుతున్నారు. బ్రహ్మాస్త్రాదులయిన సమస్త దివ్యాస్త్రాలు మీలోనే విశేషంగా ఉన్నాయి. పాండవులు గాని, మేము గాని, లోకంలో గల ఇతర ధానుష్కులు గాని యుద్ధం చేస్తున్న నీతో సమానులం కాము. ఈ నిజం నీకు చెపుతున్నాను. ద్విజోత్తమా! దేవతలు, రాక్షసులు, గంధర్వులతో గూడిన ఈ లోకాలను అన్నింటినీ సర్వాస్త్రవిజ్ఞానం గల నీవు దివ్యాస్త్రాలతో సంహరించగలవు. సందేహం లేదు. అంత గొప్ప వాడవయిన నీవు శిష్యుడయిన అర్జునుని మీద ప్రేమవల్లనో, ప్రత్యేకించి మా దురదృష్టం వల్లనో నీకు భయపడే పాండవులను క్షమిస్తున్నావు.' సంజయుడు అన్నాడు - "ఈ రీతిగా పొగడటంతో సంతోషించి, తెగడటంతో కోపించి ద్రోణుడు నీ కుమారుడయిన దుర్యోధనునితో ఇలా అన్నాడు.

'దుర్యోధనా ! ముసలివాడనయి కూడా యుద్ధంలో యథాశక్తి శత్రువులను ఎదిరిస్తున్నాను. ఇక నీద విజయకాంక్షలతో నీచకార్యం చేయాలి. సర్వశస్త్రాస్త్రాల పరిజ్ఞానం బాగా ఉన్న నేను ఇంకమీద ఏమాత్రం అస్త్రపరిజ్ఞానం లేని వీరిని అందరినీ చంపాలి. మంచిదో, చెడ్డదో నీవు కర్తవ్యం అని అనుకొనేదాన్ని ధుర్యోధనా! నీ మాట ప్రకారం

చేస్తాను. దీనికి తిరుగులేదు. రాజా! యుద్ధభూమిలో పరాక్రమించి పాంచాలురను అందరినీ సంహరించిన తరువాతే కవచాన్ని విడుస్తాను. అని నా ధనుస్సును ముట్టి ప్రతిజ్ఞచేసి చెపుతున్నాను. యుద్ధంలో అర్జునుడు బాగా అలసిపోయాడని అనుకొంటున్నావు కదా! అతని పరాక్రమం ఎంత గొప్పదో నిజం చెపుతా విను. కోపించిన సవ్యసాచితో దేవతలు గాని, గంధర్వులు గాని, యక్షులు గాని, రాక్షసులు గాని యుద్ధంలో జయించటానికి ఉత్సాహం చూపించరు. అతడు ఖాండవ వన దహనంలో వర్షం కురిపిస్తూ, వారిస్తున్న ఇంద్రుని ఎదుర్కొని నిలువరించాడు. యక్షులు, నాగులు, దైత్యులు తదితరులను పురుషశ్రేష్ఠుడయిన అతడు చంపాడని నీకు తెలుసు గదా! ఘోషయాత్రా సమయంలో చిత్రసేనాదులయిన గంధర్వులు మిమ్ములను జయించి, అపహరించుకొనిపోతుంటే, అర్జునుడు మిమ్ములను వారిచెర నుంచి విడిపించాడు. దేవతలకు చంపరాని వారు, దేవతలకు శత్రువులు అయిన నివాత కవచులను కూడా అతడు జయించాడు. పురుషశ్రేష్ఠుడయిన అతడు హిరణ్యపురంలో ఉండే వేలకొలది దానవులను జయించాడు. అలాంటివాడిని మానవ మాత్రులు ఎలా జయించగలరు ? నరపతీ! మేము అందరమూ యుద్ధం చేస్తున్నప్పటికీ నీ సైన్యం అంతా పాండుపుత్రుడు నాశనం చేయటం నీవు ప్రత్యక్షంగా చూశావు గదా!'

ఈ రీతిగా అర్జునుని మెచ్చుకొంటున్న ద్రోణునితో కోపంతో నీ సుతుడు మళ్ళీ ఇలా అన్నాడు. 'ఇవ్వాళ నేను, దుఃశాసనుడు, కర్ణుడు, మా మేనమామ శకుని భారతసేనను రెండు భాగాలుగా చేసి యుద్ధంలో అర్జునుని సంహరిస్తాం. నీవు ఆలాగే చూస్తూఉండు నీకు శిష్యుడంటే చాలా ఇష్టం కదా!' ఆయన ఆమాటలు విని ద్రోణుడు నవ్వుతున్నట్లు ఆయన మాటను ఆమోదిస్తూ 'నీకు మంగళమగుగాక' అని అన్నాడు. 'తేజస్సుతో ప్రజ్వలించేవాడు, క్షత్రియశ్రేష్ఠుడు, క్షయంలేని గాండీవధారిని ఏ క్షత్రియుడు నాశం చేయగలడు? ఆయుధం పట్టిన ఆతనిని కుబేరుడు గాని, ఇంద్రుడు గాని, యముడు గాని, వరుణుడు గాని, అసురులు గాని, ఉరగులు గాని, రాక్షసులు గాని నాశనం చేయలేరు. భారతా! నీవు అన్నమాటలు మూర్ఖ లంటారు. అర్జునుని యుద్ధంలో ఎదిరించి ఎవడు హాయిగా ఇంటికి వెళ్ళగలడు ? నీవయితే అందరినీ అనుమానిస్తుంటావు, కఠినుడివి, పాపపు ఆలోచనలు, నిశ్చయమూ గలవాడివి. నీకు హితాన్ని కోరేవారిని నోటికి వచ్చినట్లు ఇష్టం వచ్చినట్లు అంటావు. నీవు కూడా నీ ప్రయోజనం కోరుకొని ఆలస్యం చేయకుండా అర్జునుని ఎదరించు, ఉత్తమ వంశంలో జన్మించావు. క్షత్రియుడివి కూడా గదా! ఏ పాపం చేయని ఈ క్షత్రియులను అందరినీ చంపివేస్తున్నావు. ఈ శత్రుత్వానికి అంతకూ మూలం నీవే గదా! కాబట్టి అర్జునుని స్వయంగా ఎదిరించు. ఈ

నీ మేనమామ శకుని కుటిలజూదం ఆడేవాడు, మహామేధావి, క్షత్రియ ధర్మం పాలించేవాడు. గాంధారీ నందనా! ఈయన కూడా అర్జునుని ఎదిరించుగాక. ఈయన పాచికలాటలో నేర్పరి, వంచకుడు, జూదరి, కుటిలుడు, యుద్ధంలో పాండవులను జయించగలడు. దుర్యోధనా! నీవు ఏకాంతంలో వలె సభలో ధృతరాష్ట్రుడు వింటుండగా కర్ణునితో కూడా చాలా ఉత్సాహంతో మోహవశుడవయి "నాన్నా! నేను, కర్ణుడు దుఃశ్శాసనుడు మేము ముగ్గురమే యుద్ధంలో ఒకటయి పాండవులను చంపేస్తాం." అని సభచేసిన ప్రతిసారీ డంబాలు పలకటం చాలాసార్లు విన్నాను. ఆ ప్రతిజ్ఞ మీద నిలువు. వారితో గలిసి ఆ మాట తప్పకు. ఈ నీ శత్రువు అర్జునుడు జంకులేకుండా నీ ఎదుటే ఉన్నాడు. క్షత్రియధర్మాన్ని గుర్తుపెట్టుకో, యుద్ధంలో జయానికంటే అర్జునుని చేతిలో నీకుమరణం కలిగినా గొప్ప అవుతుంది. దానాలు చేశావు. బాగా చదువుకొన్నావు. గొప్ప సంపదను పొందావు. కావలసింది అంతా అనుభవించావు. కృతకృత్యుడివి అయినావు. దేవ, ఋషి, పితృ ఋణవిముక్తుడివి. కాబట్టి భయపడక అర్జునునితో యుద్ధం చేయి.' అని చెప్పి ద్రోణుడు యుద్ధంలో శత్రువులు ఉన్నవైపు వెళ్ళాడు. తరువాత సేనను రెండు భాగాలు చేసి, యుద్ధం చేశారు."

186. ద్రుపద విరాటాదుల వధ, ధృష్టద్యుమ్న ప్రతిజ్ఞ.

సంజయుడు చెప్పాడు – "రాజా! రాత్రిలో మూడో భాగమే మిగిలి ఉండగా సంతోషంతో, ఉత్సాహంగా ఉన్న కురుపాండవుల యుద్ధం ఆరంభమయింది. అప్పుడు చంద్రకాంతిని దొంగిలిస్తూ సూర్యునికి ముందుండే అరుణుడు ఆకాశాన్ని తామ్రవర్ణంగా చేయటానికా అన్నట్లు ఉదయించాడు. తూర్పు దిక్కున అరుణుడు ఎర్రగాచేసిన సూర్యమండలం బంగారు చక్రంలాగా ప్రకాశిస్తున్నది. ఆ సమయంలో కౌరవపాండవ పక్ష యోధులు అందరు రథాలను, గుర్రాలను, పల్లకీలను వదలి సంధ్యా సమయంలో సూర్యునికి ఎదురుగా నిలిచి దోసిలొగ్గి, సంధ్యావందన తత్పరులైనారు. ఆ తరువాత రెండు భాగాలుగా అయిన సైన్యంతో ద్రోణుడు దుర్యోధనుని ముందుంచుకొని పాంచాలురతో గూడిన సోమకులమీదికి దాడిచేశాడు. ఇలాగా రెండు భాగాలుగా విడిపోయి వస్తున్న కౌరవ సైన్యాన్ని చూసి 'శ్రీకృష్ణుడు అర్జునా! అన్య శత్రువులను కుడివైపు చేసుకొని, ద్రోణాచార్యుని ఎడమవైపు ఉండేటట్టు చేసుకో' అన్నాడు. ధనంజయుడు శ్రీకృష్ణుని అలాగే చేయమని ద్రోణకర్ణులకు కుడివైపు తిరిగాడు. కృష్ణుని అభిప్రాయం తెలుసుకొని భీమసేనుడు యుద్ధముఖంలో ఉన్న అర్జునునితో ఇలా అన్నాడు.

'అర్జునా! ఈ నామాట శ్రద్ధగా విను. క్షత్రియ స్త్రీ వీరసంతతిని ఎందుకు

కంటుందో దానికి తగిన సమయం వచ్చింది. సమయం వచ్చినప్పుడు గూడా నీ పక్షానికి మేలు కలిగించే పని చేయలేకపోతే, నీవల్ల సమకూరే శౌర్య పరాక్రమాలకు అన్యాయం చేస్తే నీవు పరాక్రమశూన్యుడి వవుతావు. ఈ స్థితిలో నీవు మన పక్షానికి చాలా క్రూరవ్యక్తిగా కన్పిస్తావు. యోధశ్రేష్ఠా! శత్రుసైన్యాన్ని ఎడమవైపుగా చేసుకొని ఛేదించు, పరాక్రమంతో సత్యశ్రీధర్మయశస్సుల ఋణవిముక్తుడివి కమ్ము.' సంజయుడు చెప్పాడు - "భీమ, శ్రీకృష్ణులు ప్రోత్సహించగా అర్జునుడు కర్ణద్రోణులను అతిక్రమించి, సైన్యాన్ని నాలుగువైపుల నుంచి చుట్టుముట్టాడు. యుద్ధముఖంలోకి వచ్చి, క్షత్రియశ్రేష్ఠులను దహిస్తూ తమవైకి వస్తున్న ఆ అర్జునుని క్షత్రియ పుంగవులు పరాక్రమంతో ఎదుర్కొని కూడా అంతకంతకు వృద్ధినందుతున్న అగ్నినివలె ఆయనను వారించలేకపోయారు. అప్పుడు దుర్యోధనుడు, కర్ణుడు, శకుని ధనంజయుని బాణవర్షంతో ముంచెత్తారు. రాజేంద్రా! అర్జునుడు వారి అస్త్రాలనన్నింటిని వ్యర్థం చేసి, బాణవర్షం వారిమీద కురిపించాడు. అలవోకగా బాణాలు వేసే అర్జునుడు శత్రువుల అస్త్రాల నన్నింటినీ అస్త్రాలతో వారించి, వారిని అందరిని పదిపదిబాణాలతో కొట్టాడు. అప్పుడు దుమ్ము ఎక్కువగా పైకిపోయింది. బాణవర్షం కురిసింది. చీకటి క్రమ్మింది. భయంకరమయిన పెద్ద ధ్వని కలిగింది. అలా కావటం వల్ల ఆకాశం, భూమి, దిక్కులు తెలియలేదు. సైన్య చలనం వల్ల లేచిన దుమ్ముతో కప్పుకుపోవటం వల్ల అంతా అంధకారమయం అయింది.

రాజా! మాకూ, శత్రుసైన్యానికి పరస్పరం తెలుసుకునే స్థితి పోయింది. అప్పుడు రాజులు తమ తమ పేర్లు చెప్పుకొని యుద్ధం చేశారు. రాజా! రథాలు విరిగిపోగా రథికులు ఒకరినొకరు ఎదుర్కొని ఒకరి జుట్టునొకరు, ఒకరి కవచం ఇంకొకరు, ఒకరి బుజాలు ఇంకొకరు పట్టుకొని యుద్ధం చేశారు. అనేక రథికులు గుర్రాలు, సూతులు చనిపోగా భయపడిపోయి నిశ్చేష్టులయి బ్రతికి ఉండికూడా మరణించినవారి వలె ఉన్నారు. మరణించి పర్వతాల్లాగా పడి ఉన్న ఏనుగులను, గుర్రాలను, కొగిలించుకొని మరణించిన వీరులు మావటివారితో గూడా కన్పించారు. ఇంకొక వైపు ద్రోణాచార్యుడు యుద్ధం నుంచి ఉత్తర దిక్కుకు వెళ్ళి, పొగలేకుండా మండే అగ్నిలాగా యుద్ధరంగంలో ఉన్నాడు. నరనాథా ! ఆయన ఒక్కడే యుద్ధముఖాన్నుంచి తొలగి, ఒంటరిగా ఉన్నాడని విని, పాండవసైన్యాలు వణికిపోయాయి. వీరశోభతో వెలుగుతూ, తేజస్సుతో జ్వలిస్తున్నట్లున్న ద్రోణుని చూసి, శత్రువులు భయపడ్డారు. కొందరు అక్కడినుంచి పారిపోయారు. కొందరు నిరుత్సాహపడ్డారు. దానవులు ఇంద్రుని జయించలేనట్లు, పాండవసేనలు మన పక్షంలోని సైన్యాలు యుద్ధానికి పిలుస్తున్నా మదజలాన్ని స్రవించే గజంలాంటి ద్రోణుని జయించ

సాహసించలేదు. వారిసేనలో కొందరు నిరుత్సాహం చెందారు. కొందరు తెభిమానవంతులు క్రుద్ధు లయినారు. కొందరు ఆశ్చర్యపడ్డారు. ఇంకా కొందరు సహనం కోల్పోయారు. మరికొందరు రాజులు చేతులు పిసుక్కొన్నారు. వేరొక కొందరు కోపపరవశులయి పండ్లతో పెదవులు కొరుక్కొన్నారు. వేరొక కొందరు ఆయుధాలను పైకెత్తి విసిరారు. మరికొందరు భుజాలను అప్పళించుకోసాగారు. కొందరు మహాతేజస్సులు ప్రాణాలమీద ఆశవదలుకొని, ద్రోణుని మీదికి దూకారు.

రాజేంద్రా! పాంచాలురు ద్రోణబాణాలతో బాగా దెబ్బతిని, తీవ్రమయిన బాధతో సమరంలో స్థిరంగా నిలిచారు. అప్పుడు యుద్ధంలో దుర్జయుడయి సంచరిస్తున్న ద్రోణుని విరాటద్రుపదులు ఎదుర్కొన్నారు. ద్రుపదుని మనుమలు ముగ్గురు చేది దేశవీరులు ద్రోణుని ఎదుర్కొన్నారు. ద్రోణుడు ఆ ద్రుపదుని మనుమలను ముగ్గురిని మూడు బాణాలతో కొట్టి, వారి ప్రాణాలు అపహరించాడు. వారు నేలగూలారు. అప్పుడు ద్రోణుడు యుద్ధంలో చేది కైకయ సృంజయులను, మత్స్య వంశీయులను అందరిని జయించాడు. ఆ సమయంలో ద్రుపద విరాటులు కోపంతో ద్రోణుని మీద బాణవర్షం కురిపించారు. ద్రోణుడు ఆ బాణవర్షాన్ని వమ్ముచేసి, ఆ విరాటద్రుపదులను ఇద్దరిని బాణవర్షంతో కప్పివేశాడు. అపుడు యుద్ధరంగాగ్రంలో తీవ్రకోప పరవశు లయిన వారు ఇద్దరు బాణాలువేసి ద్రోణుని వేధించారు. కోపంతో, అసహనంతో ద్రోణుడు రెండుబాణాలతో వారిద్దరి ధనుస్సులను ముక్కలు చేశాడు. అందుకు కోపించిన విరాటుడు ద్రోణుని చంపాలనే కోరికతో పది తోమరాలను, పది బాణాలను వేశాడు. ద్రుపదుడు ఇనుముతో చేసిన శక్తిని కోపంతో ద్రోణుని రథంవైపు విసిరాడు. అప్పుడు ద్రోణుడు పదునైన బాణాలతో పదితోమరాలను ఖండించి, బంగారంతో వైడూర్యాలతో అలంకృతమయిన శక్తిని బాణాలతో ఛేదించాడు. ఆ తరువాత ద్రోణుడు మంచి పచ్చని రెండు బాణాలు వేసి ద్రుపదవిరాటులను యముని వద్దకు పంపాడు. విరాట ద్రుపదులు, కేకయులు, చేది మత్స్యులు, పాంచాలురు, ద్రుపదుని మనుమలు వీరులు ముగ్గురు హతులు కావటం, ద్రోణుడు చేసిన ఆపని చూసి కోపదుఃఖాలతో గూడి, ధృష్టద్యుమ్నుడు ఈ రీతిగా శపథం చేశాడు. 'ఇవ్వాళద్రోణుని సజీవంగా చేతులారా వదిలేవాడు, ద్రోణుని చేత పరాభవం పాలయ్యేవాడు, నూతులు బావులు త్రవ్వించటం వల్ల, ఉద్యానవనాలు ఏర్పరచటం వల్ల కలిగే పుణ్యం నుండి క్షత్రియత్వ బ్రాహ్మణత్వాల నుండి చ్యుతుడై నశించుగాక' అని సర్వధానుష్కుల మధ్య ప్రతిజ్ఞ చేసి శత్రునాశకు డయిన ధృష్టద్యుమ్నుడు సైన్యంతో గూడా ద్రోణుని ఎదుర్కొన్నాడు.

ఒకవైపున ధృష్టద్యుమ్నుడు పాండవవీరులతో కూడా ద్రోణుని బాణాలతో కొడుతున్నాడు. రెండోవైపున దుర్యోధనుడు కర్ణుడు శకుని సోదరులు, ఇతర ముఖ్యులు

యుద్ధంలో ద్రోణునికి రక్షకు లయినారు. ఆ మహారథులంతా రక్షణ కవచంగా ఉండటం చేత పాంచాలురు ఎంత ప్రయత్నించినా ద్రోణుని కన్నెత్తి చూడలేకపోయారు. అందుకు ధృష్టద్యుమ్నుని మీద కోపం కలిగిన భీమసేనుడు మాటల బాణాలతో ఆయనను గాయపరుస్తూ ఇలా అన్నాడు. "ధృష్టద్యుమ్నా ! ద్రుపదవంశంలో జన్మించావు. అస్త్రవేత్తలలో శ్రేష్ఠుడివి. క్షత్రియుడ వయిన నీవు తప్ప ఇంకెవ్వడూ ఎదురుగా ఉన్న శత్రువును చూస్తూ ఊరుకోడు. తండ్రి, పుత్రులు చనిపోతే ప్రత్యేకించి రాజసమూహ మధ్యంలో శపథం చేసి ఏ మగాడు శత్రువును రక్షిస్తాడు? ఈ ద్రోణుడు అగ్నివలె వెలుగుతూ పరాక్రమంతో క్షత్రియజాతిని దహిస్తున్నాడు. ఆయన పాండవసేనను నిఃశేషంగా చేయకముందే ద్రోణుని మీదికి వెళ్తాను. నేను చేయబోయేపని అందరు చూడండి." అని పలికి క్రుద్ధుడయిన వృకోదరుడు సంపూర్ణంగా ధనుస్సునులాగి వదిలిన బాణాలతో నీ సేనలను పారద్రోలుతూ, ద్రోణసైన్యంలోకి ప్రవేశించాడు. ధృష్టద్యుమ్నుడు కూడా విశాలమయిన కౌరవసైన్యంలోకి ప్రవేశించి, ద్రోణుని సమీపించాడు. అప్పుడు సంకుల సమరం సాగింది. రాజా! ఆనాడు సూర్యోదయ సమయంలో జరిగిన జనసంహారం గల మహాయుద్ధాన్ని మేము ఎన్నడూ చూడలేదు. వినలేదు. రథసమూహాలు అన్నీ అతుక్కుపోయినట్లున్నవి. అసంఖ్య మానవ శరీరాలు చెల్లాచెదురుగా పడి కన్పించాయి. కొందరు యోధులు వేరే చోటికి వెళ్తుంటే త్రోవలో శత్రువులు ఆక్రమించగా నిహతులు అయ్యారు. కొందరు యుద్ధం లోనించి వెనక్కు తిరిగిపోతూ వెనక, ప్రక్కల తగిలిన గాయాలను తట్టుకొంటున్నారు. ఆ రీతిగా చాలా భయంకరమయిన ఘోరయుద్ధం జరుగుతుండగానే ఒక్క క్షణంలో ప్రాతఃసంధ్యా సమయంలో సూర్యోదయమయింది."

187. భీకరయుద్ధవర్ణన. వకులుని చేతిలో దుర్యోధన పరాజయము.

సంజయుడన్నాడు - "మహారాజా! ఉభయపక్షవీరులు కవచధారులయి సంధ్యాసమయంలో ఉన్న సూర్యుని ఉపాసించారు. పుటంపెట్టిన బంగారం వంటి కాంతితో భాస్కరుడు ఉదయించాడు. లోకాలు అన్నీ వెలుగులతో నిండాయి. మళ్ళీ యుద్ధం మొదలయింది. సూర్యోదయానికి పూర్వం ద్వంద్వయుద్ధం చేసినవారే సూర్యోదయం తరువాత కూడా పోరాడారు. రథాలు రథాలతో, ఏనుగులతో గుర్రాలు, పదాతులతో ఏనుగులు, గుర్రాలు పదాతులు తలపడ్డారు. వీరులు కలుస్తూ, దూరమవుతూ పోరి నేలగూలారు. వారు రాత్రి అంతా తీవ్రయుద్ధం చేసి, ఇపుడు ఎండవేడిమితో అలిసిపోయి, ఆకలి దప్పులకు శరీరాలు లోను కాగా చాలామంది మూర్ఛపోయారు. రాజా! శంఖాలు, భేరులు, మద్దెల ధ్వనులు ఏనుగుల గర్జనలు, ధనుష్టంకారాలు, కలిసిన పెద్ద ధ్వని ఆకాశం అంటినంతగా వర్ధిల్లింది. పరుగెత్తుతున్న పదాతులు, పడుతున్న బాణాలు

సకిలిస్తున్న గుర్రాలు, తిరుగుతున్న రథాలు, గర్జిస్తున్న వీరుల బాధతో అరుస్తున్న వారికేకలు అన్నీ కలిసి పెద్ద ధ్వని కలిగింది. అంతకంతకు పెద్దదయిన ధ్వని ఆకాశం అంటింది. నానావిధాలయిన ఆయుధాల దెబ్బలకు ఖండితులయి, బాధపడేవారి కేకలు అధికమయ్యాయి. నేల గూలుతున్న నేలగూలుస్తున్న, పదాతుల, గుర్రాల, రథాల, ఏనుగుల ఆర్తనాదాలు భూమిమీద జాలి గొలిపే విధంగా విన్పించాయి. రెండువైపులా ఉండే సైన్యాలకు ద్వంద్వయుద్ధం జరుగుతుంటే అందులో వీరులు ఆవేశంతో తమపక్షం వారు స్వపక్షీయులనే చంపేస్తున్నారు. శత్రువులు తమపక్షంవారిని తామే చంపుతున్నారు. శత్రుపక్షయోధులు తమవారితో పాటు శత్రువులను కూడా చంపేశారు. చాకిరేవుల్లో గుడ్డల మూటల గుట్టలు కనపడ్డట్టు కాలి బంటులు, ఏనుగుల మీద ఉండేవారు వదలివేసిన అస్త్రశస్త్రాల గుట్టలు కన్పించాయి. వీరులు చేతులెత్తి విసిరివేయగా ఒకదానికింకొకటి తగిలిన ఖడ్గాదుల ధ్వనులు గుడ్డలు ఉతికేటప్పటి ధ్వనిలాగా పెద్దగా విన్పించింది.

సగం విరిగిపోయిన ఒకవైపు పదును ఉండే, రెండు వైపులా పదును ఉండే ఖడ్గాలతో, తోమరాలతో, పరశ్వధాలతో చాలా దగ్గరగా జరిగే యుద్ధం కూడా చాలా దారుణంగా కన్పించింది. ఆ యుద్ధరంగంలో వీరులు పరలోకాన్ని చేరే రక్తనదిని ప్రవహింపజేశారు. ఆ నది ఏనుగులు గుఱ్ఱాల శరీరాలనుంచి పుట్టినది. నరదేహాలను ప్రవహింపజేస్తుంది. శస్త్రా లనే చేపలతో నిండినది, మాంసరక్తాలే దానిలో బురద. ఆర్తనాదాలే ప్రవాహధ్వని. జెండా, గుడ్డలు శస్త్రాలే నురుగుగా గలది ఆ నది. ఆ యుద్ధంలో ఏనుగులు గుర్రాలు రాత్రియుద్ధంలో మోహం పొందినవి. కొనప్రాణాలు గలవి. బాణాలు, శక్తి ఆయుధాలతో దెబ్బలతో బాధపడుతున్నవి కావటం వల్ల తమ శరీరాలను అన్నింటిని బిగబట్టుకొని నిలిచాయి. వీరుల తెగిపోయిన చేతులు, చిత్రవిచిత్రమయిన కవచాలు, అందమయిన కుండలాలు గల శిరస్సులు, చెల్లాచెదరుగా ఆటు ఇటు పడి ఉన్నాయి. యుద్ధసాధనాలు యుద్ధభూమిలో విలసిల్లాయి. ఆ ప్రదేశం అంతటా పచ్చిమాంసం తినే క్రూర జంతువులతో నిండిఉంది. కొన్ని మృతశరీరాలు, కొన్ని సగం చచ్చిన శరీరాలు, పడి ఉండటం, ఆ రణభూమిలో ఎక్కడా కూడా రథం పోవటానికి త్రోవే లేదు. రథచక్రాలు రక్తపుబురదలో ఇరుక్కుపోగా ఉత్తమకులంలో పుట్టి మంచి బలంగల్గి, ఏనుగుల వంటి గుర్రాలు బాణాలతో గాయపడి అలిసిపోయి, వణికిపోతూ బలం అంతా కూడగట్టుకొని అతికష్టంమీద రథాలను లాగుతున్నాయి. సైన్యం అంతటిలో ద్రోణార్జునులు తప్ప తక్కిన వారంతా వ్యాకులులు, భ్రాంతులు, భయపడినవారు, ఆతురులు అయినారు. ఆ సేనలకు అన్నింటికి ఆ ద్రోణార్జునులే దిక్కయినారు. వారే ఆర్తులకు ఆధారమయినారు. వారిద్దరినే ఆశ్రయించి మరణించారు. కౌరవపాండవుల మహాసైన్యం అంతా ఒకదాన్ని ఇంకొకటి

ఎదుర్కొని వ్యాకులతపొందింది. అప్పుడు ఏ సైన్యం ఎవరిదో ఏమీ తెలియలేదు. ఆ యుద్ధరంగం భయస్థులకు భయాన్ని పెంచే యమధర్మరాజు క్రీడాభూమిలాగా ఉంది.

రాజా! భూమండలం మీద ఉండే క్షత్రియ వంశీయుల మహత్తరనాశం ఏర్పడింది. సైన్యం మధ్యలో నిలిచిపోయి పెద్ద దుమ్ము కప్పివేయటంచేత ఆయుద్ధ రంగంలో కర్ణుని, ద్రోణుని, అర్జునుని, యుధిష్ఠిరుని, భీముని, నకుల సహదేవులను, ధృష్టద్యుమ్నుని, సాత్యకిని, దుఃశ్శాసనుని, అశ్వత్థామను, దుర్యోధనుని, శకునిని, కృపుని, శల్యుని కృతవర్మను తదితరులను మమ్ములను మేము, దిక్కులను చూడలేకపోయాం. అక్కడ దుమ్ము అనే మేఘం ఘోరంగా, భయంకరంగా గిరగిరా తిరిగి, నలువైపులా క్రమ్మివేయగా ఇంకొక రాత్రి వచ్చిందేమో అని అనుకున్నాం. ఆ ధూళిమేఘ వ్యాప్తివలన కౌరవులు గాని, పాంచాలురు గాని, పాండవులు గాని, దిక్కులుగాని, ఆకాశంగాని, భూమిగాని మిట్ట పల్లాలుగాని ఏమీ తెలియలేదు. ఆ యుద్ధంలో విజయాన్ని కోరే వీరులు చేతికి తగిలిన శత్రువులను, తమవారిని కూడా నేలగూల్చారు. గాలి వేగంగా వీచి ఎగుర గొట్టటం వల్ల, రక్తంతో తడవటం వల్ల నేలనుండి ఏర్పడిన ఆ దుమ్ము అంతా అణిగిపోయింది. ఆ యుద్ధరంగంలో రక్తంతో తడిసిపోయిన ఏనుగులు, గుర్రాలు, యోధులు, రథికులు కాలిబంటులు పారిజాతవనాలవలె విరాజిల్లారు.

తరువాత దుర్యోధనుడు, కర్ణుడు, ద్రోణుడు, దుఃశాసనుడు నలుగురు పాండవులతో నాలుగు రథాలమీద ఉండి తలపడ్డారు. దుర్యోధనుడు సోదరునితో కలిసి, నకుల సహదేవులను ఎదుర్కొన్నాడు. భీమునితో కర్ణుడు, ద్రోణునితో అర్జునుడు తలపడ్డారు. ఘోరమూ, మహదాశ్చర్యకరమూ, మానవాతీతమూ అయిన రథికశ్రేష్ఠుల ఉగ్రసంగ్రామాన్ని నలువైపులనుంచి అందరూ చూశారు. రథాల విచిత్రమయిన నడకలతో, విచిత్రమయిన రథాలతో సంకులమై, చిత్రయోధుల విచిత్రయుద్ధాన్ని తక్కిన రథికులు చూచారు. ఒకరినొకరు జయించాలనే కోరికగల ఆ వీరులు ప్రయత్న పూర్వకంగా పరాక్రమ తత్పరులయి వర్షాకాలంలో మేఘాలవలె బాణవర్షం కురిపించారు. సూర్యసమానమయిన రథాలపైన ఉన్న ఆ పురుషశ్రేష్ఠులు చంచలమయిన మెరుపులు గల శరత్కాల మేఘాల లాగా విరాజిల్లారు. మహారాజా! క్రోధసహనాలతో గూడినవారు, పోటీపడేవారు, మహాధనుష్కులు, ప్రయత్నశీలులు, ధనుర్ధారులు అయిన ఆ యోధులు మత్తగజశ్రేష్ఠాలలాగా ఒకరినొకరు ఎదుర్కొన్నారు. రాజా! కాలం రాకుండా దేహనాశం కాదు అనటం నిశ్చయం. ఆ యుద్ధంలో మహారథులు అందరూ నాశం కాలేదు గదా! ఆ సమయంలో యోధులు తెగిపోయిన చేతులు, కాళ్ళు, కుండలాలతో గూడిన తలలు, ధనుస్సులు, బాణాలు, ప్రాసలు, ఖడ్గాలు, బల్లేలు, పట్టిసాలు, నాలీకాలు, చిన్నబాణాలు, నఖరాలు, శక్తులు, తోమరాలు, వివిధాకారాలు

గలవి, స్వచ్ఛంగా ఉన్న ఇతర ఆయుధాలు విరిగిపోయిన విచిత్రరథాలు మృత గజాలు, అశ్వాలు, మనుష్యులు లేకుండా వాయువేగంతో గుర్రాలు ఇటు అటు లాగుతున్న సారథులు లేని రథాలు, అలంకృతాలయి అటు ఇటు పడి ఉన్నాయి. ఇతర రాజ చిహ్నాలు, కవచాలు నేలగూలిన ధ్వజాలు, గొడుగులు, ఆభరణాలు, వస్త్రాలు, సువాసనలు వెదజల్లే పూలమాలలు, హారాలు, కిరీటాలు తలపాగాలు, చిరుమువ్వల సమూహాలు, ఎదురురొమ్ముల మీద ఉన్న మణులు పొదిగిన హారాలు, చూడామణులు, చెల్లాచెదరుగా పడి ఉన్న ఆ యుద్ధరంగం నక్షత్రాలు గల ఆకాశం లాగా విరాజిల్లింది.

ఆ తరువాత క్రుద్ధుడై, అసహనం గల దుర్యోధనునికి, క్రుద్ధుడై, అసహనం గల నకులునితో యుద్ధం జరిగింది. మాద్రీపుత్రుడు వేల కొలది తీక్ష్ణ బాణాలు కురిపిస్తూ, నీకుమారునికి అపసవ్యంగా తిరిగాడు. అప్పుడు పెద్దధ్వని కలిగింది. మిక్కిలి కోపించిన శత్రువు యుద్ధంలో తనను కుడిగా చేసుకోవటం చూసి నీ పుత్రుడయిన దుర్యోధనుడు సహించలేదు. తానుకూడా ఆయన యుద్ధభూమిలో తనకు కుడివైపు వచ్చేటట్లు తిరిగాడు. అప్పుడు తేజస్వి అయిన నకులుడు విచిత్ర ప్రణాళికలు తెలిసినవాడవటం చేత నీ పుత్రుని ప్రతీకారాభిలాషను తెలుసుకొని అడ్డగించాడు. బాణసమూహంతో పీడిస్తూ, నకులుడు అన్నివిధాల దుర్యోధనుని నిలువరించి, యుద్ధ విముఖుని చేశాడు. ఆతని వీరకార్యాన్ని సైన్యాలు ప్రశంసించాయి. నకులుడు తమకు పూర్వం కలిగిన దుఃఖాలను నీ దురాలోచనను గుర్తుకు తెచ్చుకుని నీ పుత్రుని 'నిలు నిలు' అని అన్నాడు."

188. దుఃశాసన సహదేవుల, కర్ణభీముల, ద్రోణార్జునుల ఘోరయుద్ధం.

సంజయుడు చెప్పాడు – "అప్పుడు క్రుద్ధుడయిన దుశ్శాసనుడు తీవ్రమయిన రథవేగంతో భూమిని కంపింపజేస్తున్నట్లు సహదేవుని మీదికి వెళ్ళాడు. దుఃశాసనుడు తనమీదికి దూకుతుండగానే మాద్రీపుత్రుడు వేగంగా శిరస్త్రాణంతో గూడా సారథిశిరస్సును ఖండించాడు. అతి త్వరగా సహదేవుడు సారథి శిరస్సును ఖండించటం దుఃశాసనుడు గాని, ఇతర ఏ సైనికుడు వెంటనే తెలుసుకోలేకపోయారు. కళ్ళేలు బిగబట్టటం లేకపోయేసరికి గుర్రాలు తమ యిష్టం వచ్చినట్లు వెళ్ళుతుంటే దుఃశాసనుడు సారథి మరణించాడని తెలుసుకొన్నాడు. గుర్రాలు తోలటంలో నేర్పుగల రథికశ్రేష్ఠుడయిన ఆయన యుద్ధంలో కళ్ళేలను బిగబట్టి, చాలా తేలికగా విచిత్రంగా చక్కగా యుద్ధం చేశాడు. సారథి మరణించినా యుద్ధరంగంలో సంచరించటం చూసి, స్వపక్ష పరపక్షీయులు ఆయన పరాక్రమాన్ని మెచ్చుకొన్నారు. ఆ గుర్రాలను సహదేవుడు పదునయిన బాణాలతో ముంచేశాడు. బాణ

పీడితాలయి అవి చాలావేగంగా అటూ, ఇటూ పరుగుతీశాయి. గుర్రాల పగ్గాలు పట్టుకోవటంలో దృష్టి పెట్టిన ఆయన ధనుస్సు వదిలాడు. అలాగే ధనుస్సును ఉపయోగించటంలో దృష్టిపెట్టటం వల్ల పగ్గాలు వదిలేశాడు. ఇలాంటి లోపాలు కలగటం వల్ల సహదేవుడు ఆయనపై బాణాలను కురిపించాడు. నీ పుత్రుని రక్షించటానికని కర్ణుడు వారి మధ్యలోకి వచ్చాడు. అప్పుడు భీముడు తగు జాగ్రత్తతీసుకొని ఆకర్ణాంతం లాగివదిలిన మూడు బాణాలను కర్ణుని బాహువుల మీద, గుండెలమీద వేసి సింహనాదం చేశాడు. దుఃశాసన నకులుల మధ్యనుంచి కర్ణుడు కాలితో త్రొక్కిన పాములవలె వెనుదిరిగి, పదునయిన బాణాలు కురిపిస్తూ, భీముని నిలువరించాడు. అప్పుడు భీమకర్ణుల మధ్య భీకరయుద్ధం జరిగింది.

వారిద్దరు విక్రుతనయనాలతో ఒకరినొకరు చూస్తూ మదించిన వృషభాలవలె రంకెలు వేశారు. ఆవేశపూరితులయిన వారిద్దరు వేగంగా అన్యోన్యం ఎదుర్కొన్నారు. యుద్ధంలో చాలా నేర్పరులయిన వారిద్దరు చాలా దగ్గర కావటం వల్ల బాణాలు వేసే అవకాశం లేకపోవటం వల్ల గదాయుద్ధం జరిగింది. రాజా! గదతో భీమసేనుడు కర్ణుని రథపుకాడిని చాలా ముక్కలయ్యేటట్లు కొట్టాడు. అది చాలా ఆశ్చర్యం కలిగించింది. అపుడు పరాక్రమశాలి అయిన రాధేయుడు భీముడు విసరిన గదనే తిరిగి భీముని రథం మీదికి విసిరాడు. భీముడు ఇంకో గదను విసరి ఆ గదను ధ్వంసం చేశాడు. తరువాత భీముడు ఇంకొక పెద్ద గదను కర్ణుని మీదికి విసిరాడు. ఆ వస్తున్న గదను కర్ణుడు బాగా పదునుపెట్టబడిన మంచి ములుకులు గల బాణాలతో కొట్టగా, ఆ గద మళ్ళీ భీముని మీదకే వచ్చింది. కర్ణుని బాణాలతో దెబ్బతిన్న ఆ గద వెనుదిరిగి వచ్చి పడటంచేత భీముని జెండాకర్ర క్రింద పడింది. ఆ గద దెబ్బకు భీముని సారథి మూర్ఛపోయాడు. క్రోధపరవశు డయిన ఆయన కర్ణుని మీద ఎనిమిది బాణాలు వేశాడు. భీమసేనుడు నవ్వుతూ ఆ బాణాలతో కర్ణుని ధ్వజాన్ని, ధనుస్సును, అమ్ములపొదిని ధ్వంసం చేశాడు. అంతట కర్ణుడు బంగారు తొడుగుగల ఇంకో ధనుస్సు తీసుకొని భీముని నల్లని రంగుగల రథాశ్వాలను పార్శ్వ రక్షకులను సారథిని సంహరించాడు.

అలా రథం వ్యర్థంకాగా భీముడు పర్వత శిఖరం మీదికి సింహం దూకినట్లు ఎగిరి, నకులుని రథం ఎక్కాడు. అలాగే మహారథులు, యుద్ధరంగంలో ఆరితేరిన వీరులు, గురుశిష్యులు అయిన ద్రోణార్జునులు చిత్రంగా యుద్ధం చేశారు. త్వరగా బాణాలను అల్లెత్రాటితో సంధించటం, రథాలను తగినరీతిగా దగ్గరకు తేగలిగే యుద్ధరీతితో మానవుల కన్నులను, మనస్సులను పరవశం చేస్తూ పరాక్రమించారు. అంతకుముందు

చూడని విశిష్టమయిన ఆ గురుశిష్యుల యుద్ధం చూస్తూ, ఆ యోధులందరూ తాము యుద్ధం చేయటం మానేశారు. ఆ ఇద్దరు సైన్యమధ్యంలో విచిత్రంగా రథమార్గాలను నిర్దేశిస్తూ ఒకరినొకరు కుడివైపు చేసుకోవాలనుకున్నారు. ఆ యోధులంతా చాలా ఆశ్చర్యంతో వారి వీర విజృంభణం చూశారు. మాంసంకోసం ఆకాశంలో రెండు గ్రద్దలకు వలె ఆ ద్రోణార్జునులకు మహాయుద్ధం జరిగింది. కుంతీపుత్రుని జయించాలనే కోరికతో ద్రోణుడు చేసిన ప్రయత్నాల నన్నింటినీ అర్జునుడు నవ్వుతూనే వమ్ము చేశాడు. ద్రోణుడు అర్జునుని మించలేనప్పుడు దివ్యాస్త్రాలను ప్రయోగించాడు. ఐంద్రం, పాశుపతం, త్వష్టస్త్రం, వాయవ్యం, వారుణం అనేవి ద్రోణుని ధనుస్సు నుంచి వచ్చిన వెంటనే అర్జునుడు ధ్వంసం చేశాడు. అర్జునుడు ఆయన అస్త్రాలను అన్నింటినీ విధిపూర్వకంగా ధ్వంసంచేస్తుంటే ద్రోణుడు ఆయా పరమాస్త్రాలతో అర్జునుని ముంచేశాడు. ఆయన ప్రయోగించిన అస్త్రాల నన్నింటినీ అర్జునుడు వ్యర్థం చేశాడు. తాను వేసే దివ్యాస్త్రాలను కూడా అర్జునుడు శాస్త్రానుసారం వ్యర్థం చేస్తుంటే ఆచార్యుడు శిష్యుని మనస్సులోనే మెచ్చుకున్నాడు. భారతా! భూమండలం మీద ఉండే సమస్త శస్త్రవేత్తలను మించిపోయిన ఆ శిష్యునితో తనను శస్త్రవిద్యాచార్యులలో సర్వోత్తమునిగా ఆ గురువు భావించాడు. అంతమంది మహావీరుల మధ్యలో తనను అర్జునుడు ఇలా నిరోధిస్తుంటే సంతోషంతో అందరినీ ఆశ్చర్యపరుస్తూ, ప్రయత్న పూర్వకంగా ఆచార్యుడు శిష్యుని వారించాడు.

అప్పుడు అంతరిక్షంలో వేలకొలది దేవతలు, గంధర్వులు, ఋషులు, సిద్ధ సమూహాలు ఆ యుద్ధం చూడటానికి వచ్చి నిలిచారు. అప్సరసలతో నిండి, యక్షగంధర్వులతో దట్టంగా శోభాయమానమయిన ఆకాశం మేఘాలతో నిండినంత అందంగా ఉంది. నరేంద్రా! అక్కడ ద్రోణార్జునుల ప్రశంసలతో నిండి కనపడని వారి మాటలు పలుమారులు వినపడ్డాయి. గురుశిష్యులు అస్త్రప్రయోగం చేస్తుండగా పది దిక్కులను అవి ప్రకాశింపజేస్తుంటే ఆకాశంలోకి వచ్చిన సిద్ధులు, ఋషుల సమూహాలు ఇలా పలికాయి. "ఇది మనుష్యుల మధ్య జరిగేది గాని, అసురుల మధ్య జరిగేది గాని, రాక్షసులది గాని, దేవతలది గాని, గంధర్వులది గాని కానే కాదు. ఇది మహత్తరమయిన బ్రాహ్మయుద్ధం. ఇంత విచిత్రమయిన ఆశ్చర్యకరమయిన యుద్ధాన్ని ఇంతకుముందు మేము ఎన్నడూ వినలేదు, కనలేదు. ఒకప్పుడు అర్జునుని ఆచార్యుడు మించిపోతే ఇంకొకప్పుడు అర్జునుడు ఆచార్యుని మించిపోతున్నాడు. వీళ్ళిద్దరి మధ్య ఉండే తేడాను ఎవ్వరూ సరిగా చూడలేరు, చెప్పలేరు. రుద్రుడు తనను రెండు ఆకారాలు చేసుకొని తనతో తాను యుద్ధం చేస్తుంటే దాన్ని పోలికగా చేసుకోవచ్చు గాని ఇంకొకరితో పోల్చటానికి వీలుకాదు. **ద్రోణాచార్యునిలో జ్ఞానం పరిపూర్ణంగా ఉండగా అర్జుమనిలో జ్ఞాన యోగాలు రెండూ ఉన్నాయి.**

ఆచార్యునిలో శౌర్యం పూర్తిగా ఉండగా పాండవునిలో బలశౌర్యాలు రెండూ ఉన్నాయి. ఈ మహావీరులను యుద్ధంలో ఇతరులు ఎవ్వరూ నాశనం చేయలేరు. కాని వీరు తలచుకుంటే మాత్రం దేవతలతో సహా ఈ జగత్తునే ధ్వంసం చేయగలరు." అని ఆ నరశ్రేష్ఠులను ఇద్దరిని చూచి అంతర్హితమయిన ప్రాణులు, ప్రత్యక్షంగా ఉన్నవారు అన్ని రీతులా ప్రశంసిస్తూ పలికారు. అప్పుడు మహామేధావి అయిన ద్రోణుడు యుద్ధంలో అర్జునుని అంతర్ధానంలో ఉన్నవారిని కూడా తపింపజేస్తూ బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించాడు. అందువల్ల పర్వతవనవృక్షాలతో గూడిన భూమి సంచలించింది. గాలి భయంకరంగా వీచింది. సముద్రాలు క్షోభించాయి. ద్రోణుడు బ్రహ్మాస్త్రం వేయటానికి ఉద్యుక్తుడు కాగా కురుపాండవసేనలకు, సర్వప్రాణులకు మహాభయం కలిగింది. అప్పుడు పార్థుడు ఏమాత్రం తొట్రు పడకుండా బ్రహ్మాస్త్రంతోనే దాన్ని ఉపశమింపజేశాడు.

అంతటా అందరి భయం ఉపశమించింది. ఆ ద్రోణార్జునులలో ఎవ్వరూ పరాజయం పొందకపోవటంతో సామూహిక యుద్ధంతో ఆ యుద్ధాన్ని వ్యాప్తం చేశారు. నరనాథా ! ద్రోణ నరుల యుద్ధం సంకుల సమరం కావటంతో అక్కడ ఏం జరుగుతున్నదో తెలియలేదు.

ద్రోణుడు యుద్ధంలో అర్జునుని వదలి పాంచాలుర మీదికి వెళ్ళాడు. అర్జునుడు కూడా ద్రోణుని విడిచి కౌరవులను పారద్రోలాడు. రాజా! మహాయుద్ధంలో వారిరువురు బాణ సమూహాలతో యుద్ధభూమిని అంధకారమయం చేయటం వల్ల సమస్త జగత్తుకు భయం కలిగింది.

ఆకాశం అంతా బాణజాలంతో, మేఘాల సమూహంతో నిండినట్లు నిండిపోగా ఆకాశసంచారి ఎవ్వడు క్రిందికి దిగలేదు."

189. దుర్యోధన సాత్యకి సంవాదము. కర్ణభీముల ఘోరయుద్ధము. అర్జునుని విజృంభణము.

సంజయుడు చెప్పాడు - "మహారాజా! అలా, గజ, అశ్వ మానవుల నాశం జరుగుతుంటే దుఃశాసనుడు ధృష్టద్యుమ్ననితో యుద్ధం చేశాడు. బంగారు రథంమీద ఉన్న ధృష్టద్యుమ్నుడు దుఃశాసనుని బాణాల దెబ్బలు తిని, కోపంతో నీ పుత్రుని రథాశ్వాలను బాణాలతో ముంచెత్తాడు. మహారాజా! ధృష్టద్యుమ్నుని బాణాలతో ఒక్కక్షణంలో మునిగిపోయిన ఆయన రథం, జెండాతో, సారథితో కనిపించలేదు. పాంచాలుని బాణ సమూహంతో పీడితుడయిన దుఃశాసనుడు ఆయన ఎదుట నిలవలేకపోయాడు. ఆ ధృష్టద్యుమ్నుడు బాణాలతో దుఃశాసనుని యుద్ధవిముఖుని చేసి, వేలకొలది బాణాలు వేస్తూ ద్రోణునే

యుద్ధంలో ఎదిరించాడు. అప్పుడు వారి మధ్యకు కృతవర్మ, ఆయన సోదరులు ముగ్గురు వచ్చి ధృష్టద్యుమ్నుని చుట్టుముట్టారు. అగ్నివలె ద్రోణునికి ఎదురుగా వస్తున్న ఆయుష్మానను నకుల సహదేవులు రక్షిస్తూ వెనుక వెళ్ళారు. బలిష్ఠులు, మహారథులు అయిన వారందరూ మృత్యువును ఎదుట పెట్టుకొని యుద్ధం చేశారు. రాజా! నిర్మల మనస్కులు, స్వచ్ఛ ప్రవర్తనులు, స్వర్గాన్ని లక్ష్యం చేసుకొన్న ఆ మాన్యులు ఒకరినొకరు జయింపదలచి యుద్ధం చేశారు. నరేంద్రా! శుద్ధవంశ్యులు, పవిత్ర కర్ములు, మతిమంతులు అయినవారు, ఉత్తమగతిని కోరి ధర్మయుద్ధం చేశారు. వారిమధ్య అధర్మయుక్తమయినది గాని, అప్రశస్తమయినది గాని యుద్ధం అప్పుడు జరగలేదు. అందులో కర్ణి, నాలీకం, విషలిప్తమయిన బాణం, బస్తికం అనే మారణ వస్తువులను ఉపయోగించలేదు. సూచి గాని, కపిశం గాని, ఆవు ఎముకలతో, ఏనుగు ఎముకలతో చేసినవిగాని, బాణాగ్రంలో రెండు ములుకులు గలవి కాని, దుర్గంధపూర్ణాలు గాని, వంకరలు తిరిగినవిగాని వారు ఉపయోగించలేదు.* ఉభయపక్ష వీరులు ఉత్తమలోకాలను, కీర్తిని కోరి ఋజువయి, శుద్ధమయిన శస్త్రాలనే ధరించారు. అప్పుడు నీ పక్షంలోని నలుగురు వీరులకు ఆ ముగ్గురు పాండవవీరులకు సంకుల సమరం సాగింది.

రాజా! అస్త్రప్రయోగంలో వేగం గల ధృష్టద్యుమ్నుడు నకుల సహదేవులు నీ పక్షంలోని రాజశ్రేష్ఠులను వారించటం చూసి, ద్రోణుని మీదికి వెళ్ళాడు. అక్కడ

---

* 1. కర్ణి - బాణపుకొన సైకి కాక క్రిందికి వంగి ఉండి దానికి రెండు ముళ్ళు ఉండేది కర్ణి. అది శరీరంలో దిగబడి తేదాన్ని తీసేటప్పుడు పేగులను కూడా అది లాక్కొస్తుంది. కాబట్టి ఇది నింద్యము.

2. నాలీకం అనే బాణం చాలా చిన్నది. ఇది శరీరంలోకి పూర్తిగా పోతుంది. కాబట్టి దీన్ని బయటకు తీయటం చాలాకష్టం.

3. బాణపు కర్ర, పలక లాగా ఉండే ములికి మధ్యభాగం చాలా సన్నగా ఉంటుంది. దీన్ని బస్తికం అంటారు. దీన్ని శరీరంలో నుంచి లాగేటప్పుడు మధ్యలో విరిగిపోతుంది. బాణం ములికె లోపల ఉండిపోతుంది. బాణం కర్రబయటికి వస్తుంది. దీన్ని యుద్ధంలో ఉపయోగించరాదు.

4. సూచి అనే బాణంగూడా కర్ణివంటిదే దీనికి చాలా ముళ్ళు ఎక్కువగా ఉండటం ఒక్కటే తేడా.

5. కపిశాన్ని కొందరు సూచితో సమానం అనే భావిస్తారు. కొంతమంది కోతి ఎముకతో చేసే బాణాన్ని కపిశం అంటారు. కపిశం అనేది నల్లని ఇనుముతో చేస్తారని, అది తేలికగా తగిలినా శరీరంలో బాగా లోపలికి చొచ్చుకుపోతుంది. అని చాలామంది అభిప్రాయం. మేదినీ కోశానుసారం కపిశం అంటే నల్లనిది అనే అర్థం కూడా ఉంది.

6.7 ఆవు ఎముకతో చేసిన ఫలకం గలది 'గవాస్థిజం' ఏనుగు ఎముకతో చేసిన ఫలకం గలది గజాస్థిజం. విషలిప్త బాణంలాగే దీని ప్రభావం శరీరం మీద ఉంటుంది.

నిలువరించబడిన ఆ నలుగురు వీరులు నకుల సహదేవులను రెండు పర్వతాలను నాల్గుగు వైపుల నుంచి వీచే పెద్దగాలులలాగా చుట్టుముట్టారు. నకుల సహదేవులలో ఒక్కొక్కరు ఇద్దరు ఇద్దరు రథికులను ఎదుర్కొనగా ధృష్టద్యుమ్నుడు ద్రోణునివైపు వెళ్ళాడు. పాంచాల రాజపుత్రుడు ద్రోణుని మీదకు వెళ్ళటం, స్వపక్షవీరులు నలుగురు నకుల సహదేవుల నెదుర్కొనటం చూచిన దుర్యోధనుడు రక్తం త్రాగే బాణాలను కురిపిస్తూ వారి మధ్యలోకి వెళ్ళాడు. ఆ దుర్యోధనుని సాత్యకి మళ్ళీ ఎదుర్కొన్నాడు. దుర్యోధన సాత్యకులు నిర్భయంగా నవ్వుతూ సమీపంలోనుంచే యుద్ధానికి తలపడ్డారు. వారిద్దరు చిన్నప్పటి ప్రవర్తనను గుర్తుకు తెచ్చుకొంటూ ఒకరినొకరు చూస్తూ, మాటిమాటికి నవ్వుతూ సంతోషంతో ఎదుర్కొన్నారు. అప్పుడు దుర్యోధనుడు తన ప్రవర్తనను నిందించుకొంటూ తనకు ప్రియమిత్రుడయిన సాత్యకితో ఇలా అన్నాడు. 'మిత్రమా! కోపం, లోభం, మోహం, అమర్ష చాలా నీచమయినవి. క్షత్రియ కృత్యం నింద్యం. బొరసబలం, కండ బలం కూడా నింద్యమయిందే. శినివంశశ్రేష్ఠా! నీవు నాకు ప్రాణాలకంటే ఎక్కువ ఇష్టమయినవాడివి. నేను నీకూ అంతే. అయినా క్షాత్రధర్మాన్ననుసరించి నిన్ను నేను, నన్ను నీవు ఎదుర్కొంటున్నాం. చిన్నతనంలో మనం చేసిన పనులన్నీ నాకు గుర్తు వస్తున్నవి. ఇప్పుడు ఈ యుద్ధభూమిలో అవి అన్నీ శిధిలమయ్యాయి. సాత్వతవంశీయా! క్రోధలోభాల వల్ల ఇవ్వాళ మనకు కలిగింది యుద్ధమే గదా!' అలా పలుకుతున్న దుర్యోధనునితో పరమాస్త్రవేత్త అయిన సాత్యకి పదునయిన బాణాలను పైకెత్తి పట్టుకొని నవ్వుతూ ఇలా అన్నాడు. 'రాజపుత్రా! ఇది సభకాదు. గురువుగారి ఇల్లు కాదు. ఆకాలంలో మనం అందరం కలసి ఆడుకొన్నాం.' దుర్యోధనుడన్నాడు - 'శినివంశ శ్రేష్ఠా! మనకు బాల్యంలో గడిచిపోయిన ఆ ఆటలరోజులెక్కడ? మళ్ళీ ఈ యుద్ధం ఎక్కడ? కాల మహిమను అతిక్రమించలేం గదా! మనకు ధనం వల్లగాని, ధనకాంక్షవల్ల గాని ఏమి ప్రయోజనం ఉన్నది ? ధనలోభంతోనే మనం అందరమూ ఇక్కడికి వచ్చి యుద్ధం చేస్తున్నాం.' అలా పలుకుతున్న రాజాతో సాత్యకి ఇలా అన్నాడు.

'రాజా! క్షత్రియ ప్రవర్తనే ఇలాంటిది. పూజ్యులయిన గురువులతో కూడా యుద్ధం చేస్తారు. నీకు నేను ఇష్టుడనయితే త్వరగా నన్ను జయించు. ఆలస్యం చేయకు. భరతశ్రేష్ఠా! నీ మూలంగానేను ఉత్తమలోకాలను చేరుతాను. నీ శక్తిని, బలాన్ని నామీద చూపించు. మిత్రులకు కలిగే మహావ్యసనాన్ని నేను చూడగోరను." ఇలా స్పష్టంగా దుర్యోధనునికి సమాధానం చెప్పి, త్వరగా ముందుకు వచ్చాడు. తనమీద దయ చూపలేదు. రాజా! ఇలా తన పైకివస్తున్న సాత్యకిని నీకుమారుడు నిలువరించి ఆయన మీద బాణాలు

కురిపించాడు. గజసింహాలకు వలె దుర్యోధన సాత్యకులకు పరస్పరం ఘోరయుద్ధం జరిగింది. దుర్యోధనుడు సాత్యకిని పది బాణాలతో గాయపరిచాడు. సాత్యకి ఆయన మీద మొదట యాభై, తరువాత ముప్పై, ఆ తరువాత పది బాణాలు వేసి గాయపరిచాడు. రాజా! ఆ యుద్ధంలో నీ పుత్రుడు నవ్వుతూ సాత్యకిని ఆకర్ణాంతం లాగి వదిలిన పదునయిన ముప్పది బాణాలతో వేధించాడు. తరువాత ఆయన ఈయన ధనుస్సును క్షురప్రంతో రెండుగా నరికాడు. అప్పుడు సాత్యకి మరొక ధనుస్సును తీసుకొని వేగంగా చేతులను ఉపయోగించి, నీ కుమారుని మీద బాణసమూహాన్ని ప్రయోగించాడు. తనను చంపటానికని చాలావేగంగా మీదికి దూసుకు వస్తున్న బాణ సమూహాన్ని నానారీతులుగా దుర్యోధనుడు ముక్కలు చేశాడు. అది చూచి సైనికులు సింహనాదాలు చేశారు. బంగారు పుంఖాలు గలవి, రాతిమీద పదునుపెట్టినవి, బంగారు ములుకులు గలవి ఆకర్ణాంతం లాగివదిలిన డెబ్బది మూడు బాణాలను వేగంగా వేసి, పీడించాడు సాత్యకిని. అప్పుడు సాత్యకి బాణాలను సంధిస్తున్న దుర్యోధనుని, బాణాలను ఎక్కుపెట్టిన ధనుస్సును, సాత్యకి వేగంగా ముక్కలు చేసి, చాలా బాణాలువేసి దుర్యోధనుని గాయపరిచాడు. సాత్యకి బాణపీడితుడయిన దుర్యోధనుడు బాగా బాణాలు తగలటం వల్ల బాధపడుతూ లేచి రథం లోపలికి వెళ్ళాడు. నీ పుత్రుడు కొంతసేపటికి కోలుకొని రథంమీద బాణవర్షం కురిపిస్తూ సాత్యకిని ఎదిరించాడు. రాజా! అలాగే సాత్యకి దుర్యోధనుని రథం మీద బాణాలు ప్రయోగించాడు. ఆ యుద్ధం సంకులంగా సాగింది. ఆ యుద్ధంలో వేస్తున్న బాణాలు, దేహధారుల శరీరాలమీద పడుతుండటం పెద్ద కట్టెలగుట్టల మీద అగ్ని పడిమండుతుంటే కలిగే పెద్ద ధ్వనిలాంటి ధ్వని వినిపించింది. రెండు పక్షాలవారి వేల కొలది బాణాలతో భూమి నిండిపోయింది. అలాగే ఆకాశం కూడా స్వరూపం కన్పించలేదు. సాత్యకి దుర్యోధనుని మించిపోయాడు.

ఆది చూసి నీ కుమారుని రక్షించదలచి కర్ణుడు సాత్యకి దుర్యోధనుల మధ్యకు వచ్చాడు. భీముడు ఆ దృశ్యాన్ని ఉపేక్షించలేదు. అందువల్ల ఆయన త్వరగా అనేకబాణాలను వదలుతూ కర్ణుని ఎదుర్కొన్నాడు. కర్ణుడు నవ్వుతూ ఆయన బాణాలను ధ్వంసం చేసి ధనుస్సును, బాణాలను ఛేదించాడు. సూతుని బాణాలతో కొట్టాడు. అందుకు కోపించిన భీమసేనుడు గదను తీసుకొన్నాడు. దానితో శత్రువు ధ్వజాన్ని, ధనుస్సును, సూతుని కొట్టాడు. భీముడు కర్ణుని రథచక్రాన్ని ముక్కలు చేశాడు. కర్ణుడు విరిగిన చక్రం గల రథంమీద పర్వతశ్రేష్ఠంవలె కదలకుండా ఉన్నాడు. ఏకచక్రం గల సూర్యరథాన్ని ఏడుగుర్రాలు లాగినట్లు, కర్ణుని ఏకచక్ర రథాశ్వాలు చాలాసేపు రథం లాగాయి. దాన్ని సహించని

కర్ణుడు యుద్ధంలో నానావిధాలయిన బాణాల సమూహాలను ప్రయోగిస్తూ, భీమునితో యుద్ధం చేశాడు. మిక్కిలి కుపితుడయి భీముడు సూతపుత్రునితో యుద్ధం చేశాడు. ఆది అలా ఉండగా కుపితు డయిన ధర్మపుత్రుడు పాంచాలురలోని నరశ్రేష్ఠులతో, మత్స్యవంశీయ పురుషశ్రేష్ఠులతో ఇలా అన్నాడు.

"మనకు శిరస్సు, ప్రాణాలు మహారథులు అయిన పురుషశ్రేష్ఠులు కౌరవులతో పోరాడుతుండగా, మీరందరూ మొద్దులవలె నిర్జీవుల వలె నిలిచి ఉన్నారు ఎందుకు ? మన పక్షంవారయిన మహారథులు యుద్ధం చేసే చోటికి మీరు అందరూ క్షత్రియధర్మాన్ని అనుసరించి, సంకోచం విడిచి వెళ్ళండి. జయించి గాని, మరణించి గాని ఉత్తమగతిని పొందండి. జయిస్తే సమృద్ధిగా దక్షిణలిచ్చి అనేకయజ్ఞాలు చేయండి. యుద్ధంలో మరణిస్తే దేవతలయి సర్వసంపదలు గల ఉత్తమలోకాలకు వెళ్ళండి." ఈ రీతిగా యుధిష్ఠిర మహారాజు పురికొల్పగా మహారథులయిన వీరులు క్షత్రియధర్మాన్ని అనుసరించి యుద్ధం చేయదలచి త్వరగా ద్రోణుని వైపు వెళ్ళారు. పాంచాలురు ఒకవైపునుండి ద్రోణుని పదునయిన బాణాలు ప్రయోగించి, గాయపరిచారు. ఇంకొకవైపు భీముడు మొదలయిన వీరులు ఆయనను చుట్టుముట్టారు. పాండవులలో మహారథులు, కుటిలులు అయిన నకుల సహదేవులు భీముడు అనే ముగ్గురు 'అర్జునా! త్వరగా వచ్చి కౌరవులను ద్రోణునికి దూరంగా పారద్రోలు అందువల్ల రక్షకులు నశించి ఏకాకి అయిన ద్రోణుని పాంచాలురు హతమారుస్తారు.' అని పెద్దగా అరుస్తూ చెప్పారు. అది విని అర్జునుడు త్వరగా కౌరవులను పారద్రోలాడు. భారతా! ద్రోణుడు ధృష్టద్యుమ్నుడు ముందున్న పాంచాలులను ఎదుర్కొన్నాడు. అయిదవ రోజున ఆ వీరులు చాలా త్వరగా ఇతరులను మర్దించారు."

190. ద్రోణధృష్టద్యుమ్నుల యుద్ధము - సాత్యకి శౌర్య ప్రశంస.

"పూర్వకాలంలో కుపితుడయిన ఇంద్రుడు రాక్షసనాశం చేసినట్లుగా ద్రోణుడు పాంచాలురతో మహాయుద్ధం చేశాడు. మహారాజా! బలవంతులయిన శత్రువులు యుద్ధంలో ద్రోణాస్త్రాలతో తీవ్రంగా గాయపడుతూ కూడా ద్రోణునికి ఏమాత్రం భయపడలేదు. పాంచాలురు, సృంజయులు యుద్ధం చేస్తూ రణరంగంలో ద్రోణునే యుద్ధంలో ఎదుర్కొన్నారు. బాణవర్షంతో అంతటా కప్పివేయబడుతున్న పాంచాలురు గాయపడుతూ, భయంకరంగా కేకలుపెట్టారు. మహోత్ముడయిన ద్రోణుడు యుద్ధంలో పాంచాలురను వధిస్తుండగా ద్రోణాస్త్రాలు వ్యాపిస్తుండగా పాండవులకు భయం కలిగింది. యుద్ధంలో గుర్రాలు, పదాతులు, వీరులు ఎక్కువగా నాశనం కావటంచూసిన పాండవులు విజయం మీద ఆశ

వదులుకొన్నారు. "గ్రీష్మఋతువులో ప్రజ్వలించే అగ్ని ఎండిపోయిన అడవిని, ఎండుగడ్డిని కాల్చివేసినట్లు పరమాస్త్రవేత్త అయిన ద్రోణుడు మనలను అందరిని నాశనం చేస్తాడేమో. యుద్ధంలో ఈయనను ఏ వీరుడయినా తేరిపారజూడలేడు. ధర్మవేత్త అయిన అర్జునుడు కూడా ఈయనను ఎదిరించలేడు." అని వారు తమలో తాము అనుకొన్నారు. ద్రోణుని బాణాల దెబ్బలతో పీడితులయి భయపడిన పాండవులను చూచి వారికి మేలు చేయనిశ్చయించుకొన్న శ్రీకృష్ణుడు అర్జునునితో ఇలా అన్నాడు.

"అర్జునా! ధానుష్కులలో శ్రేష్ఠుడయిన ద్రోణుని చేతిలో ధనుస్సు ఉండగా ఇంద్రునితో గూడిన దేవతలు కూడా యుద్ధంలో ఆయనను జయించలేరు. ఆ ద్రోణుడు యుద్ధరంగంలో ఆయుధం క్రిందపడవేస్తే తప్ప ఎవరూ ఆయనను చంపలేరు. ఆయన మిమ్ములను అందరినీ యుద్ధంలో చంపకుండా ఉండాలంటే పాండవులారా! ధర్మాన్ని వదలి అయినా జయంకోసం మీరు యత్నించాలి. అశ్వత్థామ మరణించాడని తెలిస్తే ఈయన యుద్ధం చేయడని నా ఉద్దేశ్యం కాబట్టి యుద్ధంలో ఆయన మరణించాడు అని ఏ మానవుడయినా ఈయనకు చెప్పాలి'. అర్జునుడు ఇలా చేయటానికి ఇష్టపడలేదు. ఇతరులు అందరు అందుకు అంగీకరించారు. యుధిష్ఠిరుడు చాలా కష్టంమీద సరే అన్నాడు. అప్పుడు భీముడు తమ సైన్యంలోని అశ్వత్థామ అనే పేరుగల ఏనుగును గదతో కొట్టి చంపాడు. ఆ ఏనుగు చాలా ఘోరమయినది, శత్రునాశకమయినది, మాలవరాజయిన ఇంద్రవర్మది. దాన్ని చంపిన భీమసేనుడు సిగ్గుపడుతూ ద్రోణునికి ఎదురువెళ్ళి 'అశ్వత్థామ హతుడయినాడు' అని పెద్దగా అరిచి చెప్పాడు. అశ్వత్థామ అనే పేరుతో ప్రసిద్ధమయిన ఏనుగు చనిపోయింది. దాన్ని మనస్సులో పెట్టుకొని భీముడు అప్పుడు అబద్ధం చెప్పాడు. తనకు చాలా బాధాకరమయిన భీమసేనుని మాటను విని, ఇసుక నీటిలో మునిగిపోయినట్లు ద్రోణుని మనస్సుతో పాటు శరీరం గూడా దిగజారిపోయింది. తన కొడుకు బలం తెలిసిన వాడవటం వల్ల ఆ మాటను అబద్ధం అని సందేహించి, అతడు హతుడని విని కూడా ఆయన ధైర్యం వీడలేదు. తొణకలేదు. ద్రోణుడు తన పుత్రుని శత్రువులు ఎదుర్కొనలేరు అని నిశ్చయించుకొని, ఒక్కక్షణంలోనే ధైర్యం తెచ్చుకొన్నాడు. తనకు మృత్యువయిన ధృష్టద్యుమ్నుని చంపవలెనని ఎదురువెళ్ళి పదునయిన వేలబాణాలను ఆయన మీద కురిపించాడు. ఇరవై వేలమంది పాంచాల వీరశ్రేష్ఠులు యుద్ధంలో వీరవిహారం చేస్తున్న ఆయన మీద బాణాలు కురిపించారు. మానవేంద్రా! వర్షాకాలంలో మేఘాలు క్రమ్మిన సూర్యునివలె బాణాల సమూహంలో మునిగిపోయిన ఆ

మహారథుని మేము చూడలేకపోయాం. ద్రోణుడు పాంచాలుర ఆ బాణ సమూహాన్ని ధ్వంసం చేసి, కోపంతో పాంచాల వీరుల సంహారానికి బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించాడు.

అప్పుడు ద్రోణుడు శత్రుసైనికులను అందరిని సంహరిస్తూ, ప్రకాశించాడు. మహాయుద్ధంలో పాంచాలుర శిరస్సులను, పరిఘలవంటి ఆకారం గల్గి, బంగారు ఆభరణాలు ఉన్న వారి బాహువులను ఖండించి పడవేశాడు. యుద్ధంలో భారద్వాజుడు సంహరిస్తుంటే ఆ రాజులు పెద్దగాలి దెబ్బకు నేలగూలిన చెట్లవలె భూమిమీద చెల్లాచెదురుగా పడ్డారు. భారతా! నేలగూలుతున్న ఏనుగులు, గుర్రాల సమూహాలతో మాంసరక్తాలతో రొంపి అయిన భూమి అడుగుపెట్ట వీలులేనిది అయింది. పాంచాలుర ఇరవయివేల రథాలను ధ్వంసం చేసిన ద్రోణుడు యుద్ధంలో పాగలేని అగ్నిజ్వాల వలె మండుతూ ఉన్నాడు. భరద్వాజ తనయుడు వసుదానుని శిరస్సును శరీరం నుంచి బాణంతో ఖండించి వేశాడు. మళ్ళీ అయిదువందల మంది మత్స్యులను, ఆరువేలమంది సృంజయులను, పదివేల ఏనుగులను, పదివేల గుర్రాలను చంపాడు. సర్వక్షత్రియులను నాశనం చేయటానికి నిలిచి ఉన్న ద్రోణుని వద్దకు అగ్నిదేవుని ముందుంచుకొని మహర్షులు త్వరగా వచ్చారు. బ్రహ్మలోకానికి తీసుకొని వెళ్ళదలచి విశ్వామిత్రుడు, జమదగ్ని, భరద్వాజుడు, గౌతముడు, వశిష్ఠుడు, కశ్యపుడు అత్రి అక్కడికి వచ్చారు. వారితోపాటు సికతులు, పృశ్నులు, గర్గులు, సూర్యకిరణాలను త్రాగే వాలఖిల్యులు, భృగువంశీయులు, అంగిరసులు, సూక్ష్మరూపులయిన మహర్షులు వచ్చారు. యుద్ధంలో వెలుగుతున్న ఆయనతో వారు ఇలా అన్నారు.

"ద్రోణా! ఆయుధం క్రిందపడవేసి నీకోసం వచ్చిన మమ్ములను చూడు. ఇంతవరకు అధర్మంగా యుద్ధం చేశావు. నీకు మరణకాలం ఆసన్నం అయింది. అందువల్ల ఇంకమీద క్రూర తరమయిన పని చేయకు. వేదవేదాంగాలలో విద్వాంసుడివి, సత్యధర్మరతుడివి, విశేషించి బ్రాహ్మణుడివి అయిన నీకు ఈ పని తగదు. అమోఘమయిన బాణాలు గల ద్రోణా! ఆయుధాన్ని వదలు, సనాతన ధర్మమార్గంలో ఉండు. ఈమానవలోకంలో నీవు ఉండేకాలం పూర్తి అయింది. అస్త్రజ్ఞానంలేని జనాన్ని నీవు ఈలోకంలో బ్రహ్మాస్త్రంతో దగ్ధంచేశావు. బ్రాహ్మణా! ఇలాంటి ఘోరకృత్యం మంచిదికాదు. విప్రా! ద్రోణా! యుద్ధంలో ఆయుధాన్ని వదిలెయ్యి. ఇంక ఆలస్యం చేయకు. మళ్ళీ ఇంత పాపిష్ఠికర్మను ఇకముందు చేయవద్దు." అనేవారి మాటలను విన్నాడు. అంతకుముందు భీముని మాట విన్నాడు. ఎదురుగా ధృష్టద్యుమ్నుని చూసి, ఆయన యుద్ధంలో వికలమనస్కు డయ్యాడు. వ్యథను పొంది సందేహిస్తూ, తనకుమారుడు యుద్ధంలో మరణించాడా ? లేదా ? అని

కుంతీపుత్రుడయిన యుధిష్ఠిరుని అడిగాడు. యుధిష్ఠిరుడు ముల్లోకాల సంపద కోసమయినా ఏ పరిస్థితిలో కూడా అబద్ధం చెప్పడని గట్టి నమ్మకం ఆయనకుంది. అందువల్లనే ఆ విషయమై ద్విజశ్రేష్ఠుడయిన ఆయన ఇంకెవ్వరినీ అడగకుండా ఆయననే అడిగాడు. చిన్నప్పటి నుంచి యుధిష్ఠిరుని మీద ఆయనకు సత్యవాది అనే నమ్మకం ఉంది. అప్పుడు భూమిని పాండవ పక్షరహితంగా చేయదలచాడు ద్రోణుడని తెలుసుకొని గోవిందుడు వ్యథితుడయి ధర్మరాజుతో ఇలా అన్నాడు. "రాజా! ద్రోణుడు కోపపరవశుడయి ఇక ఒక్క అర రోజు యుద్ధం చేస్తే నీ సేన మొత్తం నాశనమవుతుంది. నిజం చెపుతున్నాను. కాబట్టి నీవు ఇప్పుడు మమ్ములను ద్రోణుని నుంచి రక్షించు. ఇప్పుడు సత్యానికంటె అబద్ధమే శ్రేష్ఠమయినది. జీవిత రక్షణకోసం అబద్ధం చెప్పాల్సి వస్తే చెప్పేవానికి అసత్యోక్తితో పాపం కలుగదు." వారిద్దరూ ఇలా మాట్లాడుకొంటూ ఉండగా భీముడు ఇలా అన్నాడు.

"మహారాజా! మహాత్ముడయిన ద్రోణుని వధోపాయం ఇది అని తెలిసి నేను మీ సేనలో సంచరించే మాళవరాజు ఇంద్రవర్మది అశ్వత్థామ అనే పేరుగల ఏనుగును (ఐరావతం అంత శక్తిగలది.) పరాక్రమించి సంహరించాను. ద్రోణాచార్యుని వద్దకు వెళ్ళి 'ద్విజోత్తమా! అశ్వత్థామ హతుడయినాడు. నీవు యుద్ధవిముఖుడివి కావలసింది!' అని చెప్పాను. కాని మానవశ్రేష్ఠుడయిన ఆయన నామాట నమ్మలేదు. అందువల్ల రాజా! నీవు మన జయం కోరే గోవిందుని మాట పాటించు. అశ్వత్థామ మరణించెనని ద్రోణునికి చెప్పవలసింది. రాజా! నీవు ఇలా చెబితే ఆ బ్రాహ్మణశ్రేష్ఠుడు యుద్ధం చేయడు. నరేంద్రా! ముల్లోకాలలో నీవు సత్యవచనుడవు అని ప్రసిద్ధిని పొందావు.' ఆయన తమ్ముని మాటలను విని, కృష్ణవాక్యాలతో ప్రేరణ పొంది ఆలా జరగవలసి ఉండటం వల్ల ఇలా చెప్పసాగాడు. అసత్య భయమగ్నుడు జయాసక్తుడయిన యుధిష్ఠిరుడు ఆ ద్రోణునితో 'అశ్వత్థామ హతుడు' అని పెద్దగా చెప్పి ఏనుగు హతమయింది' అని అస్పష్టంగా చెప్పాడు. అంతకుముందు ఆయన రథం భూమికంటే నాలుగు అంగుళాలు ఎత్తులో ఉండేది. ఇలా చెప్పేసరికి ఆయన రథాశ్వాలు నేలను తాకాయి. మహారథుడయిన ద్రోణుడు యుధిష్ఠిరుడు చెప్పిన ఆ మాటవిని పుత్రశోకసంతప్తుడయి జీవితంమీద ఆశ వదులుకొన్నాడు. కుమారుడు మరణించాడు అనేమాట విని, ఆయన ఋషి వాక్యం గుర్తుతెచ్చుకొని మహాత్ములగు పాండవులకు అపకారం చేశానని అనుకొన్నాడు. రాజా! ఆతడు వికలమనస్కుడు, ఉద్విగ్నుడు అయి ధృష్టద్యుమ్నుని చూసి వెనుకటివలె యుద్ధం చేయలేకపోయాడు.

191. ద్రోణధృష్టద్యుమ్నుల యుద్ధము. సాత్యకి పరాక్రమము.

సంజయుడు చెప్పాడు – "చాలా ఉద్వేగాన్ని పొంది, శోకవ్యాకుల మనస్కుడయిన ఆయనను చూసి, ధృష్టద్యుమ్నుడు ఆయన మీదికి దూకాడు. ద్రుపద మహారాజు ద్రోణ సంహారం గోరి మహాయజ్ఞం చేసి, అందులో బాగా జ్వలిస్తున్న అగ్నినుండి ధృష్టద్యుమ్నుని పొందాడు. ఆ పాంచాల పుత్రునికి ద్రోణుని వధించాలనే కోరిక కలిగింది. అతని వింటికి అల్లెత్రాడు ఉంది, ఆ విల్లు మేఘగర్జనం వలె గంభీరంగా ధ్వనించేది. ఎప్పుడూ క్షీణించనిది,, భయంకరమూ, విజయశీలమూ అయిన ఆ ధనుస్సును చేత తీసుకొని దానిలో విషంతో నిండిన పాములవలె భయంకరమయి, తీవ్రమయిన జ్వాలలతో గూడిన అగ్నివలె వెలుగుతున్న ఒక బాణం సంధించాడు. మండలాకారంగా ఉన్న ధనుస్సు అల్లెత్రాటిలో సంధించిన ఆ బాణరూపం శరత్కాలంలో పరివేషం గల సూర్యునివలె తేజరిల్లుతున్నది. ధృష్టద్యుమ్నుడు చేతబట్టి, అగ్నివలె ప్రజ్వలించే ఆ ధనుస్సును చూసి సైనికులు 'మాకు అంతకాలం సమీపించింది' అని అనుకొన్నారు. అతడు ఎక్కుపెట్టిన బాణాన్ని చూసి ప్రతాపవంతుడయిన ద్రోణుడు 'ఇప్పుడు ఈ శరీరానికి పోగాలం వచ్చింది' అని అనుకొన్నాడు. అప్పుడు ఆచార్యుడు దానిని అడ్డుకోవటానికి ప్రయత్నించాడు. రాజేంద్రా! ఆ మహాత్మునికి కావలసిన దివ్యాస్త్రాలు వెనుకటివలె స్ఫురణకు రాలేదు. నిరంతరం బాణప్రయోగం చేస్తున్న ఆయనకు నాలుగుపగళ్లు, ఒకరాత్రి గడిచినవి. ఆ రోజు పగలు మూడు జాములు గడువగా ఆయన బాణాలు అన్నీ అయిపోయాయి. ఈరీతిగా శరక్షయం కాగా పుత్రశోకపీడితుడయిన ఆయన వివిధ దివ్యాస్త్రాలు ప్రసన్నం కాకపోవటం వల్ల ఋషివాక్యాలు ప్రేరేపించటం వల్ల, శస్త్రాలను వదలివేయాలి అని అనుకొన్నాడు.

అందువల్ల తేజఃపరిపూర్ణుడయి ఉండి కూడా వెనుకటివలె యుద్ధం చేయలేదు. మళ్ళీ ఆయన దివ్యమయిన ఆంగిరసం అనే ధనుస్సును తీసికొని, బ్రహ్మాస్త్రంలాంటి బాణాలు తీసుకొని ధృష్టద్యుమ్నునితో యుద్ధం చేశాడు. ఆ తరువాత ఆయనను బాణవర్షంతో ముంచేశాడు. ద్రోణుడు బాగా కోపించి కుపితుడయిన ధృష్టద్యుమ్నుని బాగా గాయపరచాడు. ఆ ద్రోణుడు ఆయన వేసిన బాణాలను వందలముక్కలు చేశాడు. ధ్వజాన్ని, ధనుస్సును ఛేదించాడు. సారథిని సంహరించాడు. ధృష్టద్యుమ్నుడు నవ్వుతూ ఇంకో ధనుస్సును తీసుకొని, పదునయిన బాణంతో ఆయన వక్షఃస్థలం మీద కొట్టాడు. మహాధనుష్మంతుడయిన ద్రోణుడు యుద్ధంలో బాగా గాయపడి ఏ మాత్రం తొట్రుపాటు లేనివానివలె పదునయిన ములికి గల బాణంతో ఆయన ధనుస్సును మళ్ళీ ఖండించాడు. నరేంద్రా! ధృష్టద్యుమ్నుని గదా ఖడ్గాలను తప్ప, బాణాలను, ధనుస్సులను అన్నింటినీ చెనకవీలులేని ద్రోణుడు

ధ్వంసం చేశాడు. శత్రుతాపకుడు, క్రుద్ధు డయిన ఆయన క్రోధాకారు డయిన ధృష్టద్యుమ్నుని జీవితం అంతం చేసే తొమ్మిది పదునయిన బాణాలతో కొట్టాడు. అమేయమయిన ఆత్మబలం గల మహారథు డయిన ధృష్టద్యుమ్నుడు బ్రహ్మాస్త్రం సంధిస్తూ, తనరథాశ్వాలతో ఆయన రథాశ్వాలను కలిపేశాడు. వాయువేగం గల పావురాయిరంగు గల ఆ గుర్రాలు, ఎర్రరంగు గల ద్రోణుని గుర్రాలతో కలిసి చాలా అందంగా శోభించాయి. మహారాజా! రణరంగంలో కలిసిపోయిన ఆ గుర్రాలు వర్షాకాలంలో మెరుపులతో గూడి గర్జిస్తున్న మేఘాలవలె విరాజిల్లాయి. అనంతమయిన ఆత్మబలంగల ఆ బ్రాహ్మణుడు ధృష్టద్యుమ్నుని రథపు నొగలను, చక్రాలను, రథబంధాలను నాశనం చేశాడు. ఇలా ధనుస్సు విరిగిపోయింది. ధ్వజం, సారథి నశించగా ధృష్టద్యుమ్నుడు గొప్ప ఆపదనంది, గదను దాల్చాడు. తనపైన వేసిన ఆ గదను క్రుద్ధుడయిన ద్రోణుడు పదునయిన బాణాలతో విరుగగొట్టాడు. అలా తన గద వ్యర్థంకావటం చూచి ధృష్టద్యుమ్నుడు చంద్రాకారమయిన చిహ్నాలు గల్గి, సూర్యుని వలె ప్రకాశించే డాలును, నిర్మలమయిన ఖడ్గాన్ని తీసుకొన్నాడు. ఆ రీతిగా సిద్ధమయిన పాంచాల రాజకుమారుడు కాలంతీరిన మహాత్ము డయిన ఆచార్యశ్రేష్ఠుని సంహారమే ఉత్తమం అనుకొన్నాడు. అప్పుడు ఆయన ఖడ్గాన్ని, డాలును పట్టుకొని తనరథం నొగల మీదినుంచి స్వరథపుగద్దెమీద ఉన్న ఆచార్యుని మీదికి దూకాడు. మహారథుడయిన ధృష్టద్యుమ్నుడు ఆచార్యుని వక్షఃస్థలాన్ని ఛేదించాలనే దుష్కరకార్యం చేయదలచాడు.

ఆయన కాడిగట్టేపోలు మధ్యలో నొగల మీద, గుర్రాల పిరుదుల మీద ఉన్నాడు. ఆయన సాహసాన్ని సేనలు మెచ్చుకొన్నాయి. ఆయన నొగలమీద, గుర్రాల వీపుల మీద నిలచి ఉండటం వల్ల ద్రోణునికి ఆయనపై ఆయుధ ప్రయోగానికి అవకాశం లేకపోయింది. ఆది అచ్చెరువు గొలిపింది. యుద్ధంలో ద్రోణ ధృష్టద్యుమ్నులు ఒకరినొకరు ఆక్రమించే యత్నం మాంసం కోసం ఆకాశంలో తిరిగే డేగ ప్రయత్నంలాగా ఉంది. ద్రోణుడు కలిసి ఉన్న గుర్రాలలో అరుణాశ్వాలను వదలి పావురాయి రంగు గల ధృష్టద్యుమ్నుని గుర్రాలు అన్నింటిలో ఒక్కొక్క దానిని రథశక్తితో ఛేదించాడు. మానవేంద్రా! ధృష్టద్యుమ్నుని గుర్రాలు నేలగూలాయి. అరుణాశ్వాలు రథబంధం నుంచి విడివడ్డాయి. బ్రాహ్మణశ్రేష్ఠుడు తన రథాశ్వాలను చంపటం మహారథుడు, యుద్ధవీరులలో శ్రేష్ఠుడు, యజ్ఞసేనుని పుత్రుడయిన ధృష్టద్యుమ్నుడు సహించలేదు. ఖడ్గధారులలో శ్రేష్ఠ డయిన ఆయన ఖడ్గం తీసుకొని, గరుత్మంతుడు పాముమీదికి దూకినట్లు ద్రోణుని మీదికి దూకాడు. రాజా! భారద్వాజుని సంహరింపదలచిన ఆయనరూపం పూర్వం హిరణ్యకశిపుని సంహరించేటప్పటి విష్ణుదేవుని

ఆకారంలాగా ఉంది. కురువంశీయా! యుద్ధరంగంలో వివిధమార్గాలుగా ఉండే ఖడ్గ సంచాలనాల్లో ఇరవై యొక్క రీతులుగా ఆయన ఖడ్గం త్రిప్పాడు. ఆయన డాలు, కత్తి పట్టుకొని ఖడ్గాన్ని మండలకారంగా ఒక మారు, క్రిందికిపైకి ఇంకొకమారు, తనకునాలుగువైపులా వేరొకమారు, శత్రువుమీదికి దూకటం ఒకసారి, కత్తిమొనతో శత్రువుశరీరాన్ని తాకటం ఇంకొకసారి, వంచనతో శత్రువు అస్త్రాన్ని కొట్టటం వేరొకసారి, శత్రువుకు కుడిఎడమల ఖడ్గచాలనం ఒక తడవ, వెనక్కు తొలగటం ఇంకొక తడవ, పరస్పరం ఆహూత ప్రతిహూతాలు మరొక తడవ, తన ప్రత్యేకతను చూపటం ఒక మారు, తన విజ్ఞత చూపడం ఇంకొక తూరి, శత్రువు అంగప్రత్యంగాల మీద ఖడ్గాన్ని తాకించటం మరొకతూరి చేస్తూ తన ఖడ్గ విద్యానైపుణ్యాన్ని చూపాడు. ద్రోణుని అంతం చేయదలచి ఆయన విచిత్ర ఖడ్గచాలనాలను ప్రదర్శిస్తూ రణరంగంలో సంచరించాడు.

ఖడ్గం, డాలు చూసి యుద్ధరంగంలోని యోధులు, యుద్ధం చూడవచ్చిన దేవతలు ఆశ్చర్యమగ్ను లయ్యారు. అప్పుడు ఆ ద్విజుడు సమీపయుద్ధంలో ధృష్టద్యుమ్నుని నూరు చంద్రచిహ్నాలుగల డాలును, ఖడ్గాన్ని వేయి బాణాలు వేసి ధ్వంసం చేశాడు. చాలా దగ్గరగా ఉండే యోధుడు మీద ప్రయోగించటానికి వీలయినవి జానెడు పొడవుగల వైతస్తికాలు అనే బాణాలు ద్రోణుని వద్ద మాత్రమే ఉన్నవి. ఇతరులు ఎవ్వరిదగ్గరా అవిలేవు. భారతా! కృపాచార్యుడు, అర్జునుడు, అశ్వత్థామ, కర్ణుడు, ప్రద్యుమ్నుడు, సాత్యకి అభిమన్యుడు అనేవారి వద్ద మాత్రమే ఈ వైతస్తికాలు ఉన్నాయి. ఆ తరువాత ఆత్మజతుల్యుడయిన అంతేవాసిని చంపదలచిన ఆచార్యుడు దృఢమయి, పరమోత్తమయిన బాణాన్ని సంధించాడు. నీకుమారుడు, మహాత్ముడయిన కర్ణుడు చూస్తుండగానే సాత్యకి తీక్షణమయిన పదిబాణాలు వేసి ఆ బాణాన్ని ముక్కలు చేశాడు. ఆచార్యశ్రేష్ఠుని ఆక్రమణంలో ఉన్న ధృష్టద్యుమ్నుని ఈరీతిగా విముక్తుని చేశాడు. శత్రువుల అందరి దివ్యాస్త్రాలను ధ్వంసం చేస్తున్నవాడు, ద్రోణకర్ణకృపాచార్యుల మధ్యలో రథమార్గాలలో సంచరిస్తున్న సత్యవిక్రముడు, వృష్ణివంశీయుడు, చ్యుతిలేనివాడు అయిన సాత్యకిని మహాత్ములయిన కృష్ణార్జునులు చూసి 'బాగుంది, బాగుంది' అని మెచ్చుకొన్నారు. అంతట కృష్ణార్జునులు శత్రుసేనమీద దూకారు. అప్పుడు ధనంజయుడు కృష్ణునితో ఇలా అన్నాడు "కేశవా! సాత్యకి ఆచార్యుడు, ఇతర రధికశ్రేష్ఠుల మధ్య యుద్ధక్రీడ ఆడుతున్నాడు చూడు. శత్రునాశకుడయిన సాత్యకి నన్ను, నకుల సహదేవులను, భీమును, యుధిష్ఠిరుని పలుమారులు ఆనందింపజేస్తున్నాడు. వృష్ణివంశీయుల కీర్తిని పెంపొందించే ఈ సాత్యకి యుద్ధవిద్యానిపుణుడయినా,

అహంకరించకుండా యుద్ధంలో మహారథులతో ఆడుకొంటూ విహరిస్తున్నాడు. యుద్ధంలో అజేయుడయిన అతనిని చూచి సిద్ధులు, సైనికులు బాగు బాగు అని ఆశ్చర్యంతో అభినందిస్తున్నారు. ఆతని వీరకార్యాలు చూచి ఇరుపక్షీయులు ప్రశంసిస్తున్నారు."

192. ద్రోణుని బ్రహ్మలోకగమనము. ధృష్టద్యుమ్నుడు ఆయన శిరస్సును ఖండించుట.

సంజయుడు చెప్పాడు - "సాత్యకి వీర విజృంభణను చూసి, క్రుద్ధులయిన దుర్యోధనాదులు ఆయనను చుట్టుముట్టారు. ఆర్యా! కృపకర్ణులు, నీ పుత్రులు త్వరగా వచ్చి, సాత్యకిని పదునయిన బాణాలతో కొట్టారు. అప్పుడు యుధిష్ఠిరుడు నకుల సహదేవులు, భీముడు సాత్యకికి చుట్టూ నిలిచారు. కర్ణుడు, కృపాచార్యుడు దుర్యోధనాదులు బాణవర్షం కురిపిస్తూ, సాత్యకిని చుట్టుముట్టారు. రాజా! భయంకరరూపంగా ఏర్పడిన ఆ బాణవృష్టిని శినిపౌత్రుడు ఆ మహారథులతో యుద్ధం చేస్తూనే నివారించాడు. మహాత్ములయిన వారువేసిన దివ్యాస్త్రాల సమూహాన్ని ఆ మహాయుద్ధంలో దివ్యాస్త్రాలను శాస్త్రానుసారం ప్రయోగించి, వారించాడు. ఆ రాజసమూహం ఎదుర్కొనటంవల్ల యుద్ధం క్రూరంగా సాగింది. ప్రళయసమయంలో ప్రాణులను క్రోధంతో సంహరించే రుద్రుని క్రౌర్యంలాగా అది ఉన్నది. ఆ యుద్ధభూమిలో అక్కడక్కడ చేతుల, తలల, ధనుస్సుల, విరిగిన ఛత్రచామరాల గుట్టల సమూహాలు అపరిమితంగా కన్పించాయి. విరిగిపోయిన చక్రాలు, రథాలు, నేలగూలిన పెద్ద జెండాలు, గుర్రపురౌతులు, హతులయిన వీరులతో కదనరంగం నిండిపోయింది. కురుసత్తమా! బాణాలు తగలటం వల్ల అవయవాలు తెగిన యోధుల వివిధ చేష్టల దృశ్యాలు అక్కడ కన్పించాయి. దేవాసుర సంగ్రామంతో సమానమయిన మహాయుద్ధం ఆ రీతిగా జరుగుతుండగా యుధిష్ఠిరుడు క్షత్రియ వీరులతో "మహారథులారా! సర్వసంసిద్ధులయి ద్రోణుని మీదికి దూకండి. భరద్వాజ పుత్రునితో ధృష్టద్యుమ్నుడు పోరాడుతున్నాడు. యథాశక్తిగా ద్రోణవినాశానికి ప్రతిఘటిస్తున్నాడు. ఇవ్వాళ ఈ మహాయుద్ధంలో కన్పడే ఈయన రూపాలు చూస్తే క్రుద్ధుడయిన ధృష్టద్యుమ్నుడు ద్రోణుని సంహరిస్తాడని అనిపిస్తున్నది. అందువల్ల మీరు అందరూ కలిసి ద్రోణునితో యుద్ధం చేయండి." అన్నాడు. ఈ రీతిగా యుధిష్ఠిరుని ఆజ్ఞను తలదాల్చి, సృంజయులలోని మహారథులు ద్రోణుని చంపగోరి అందరూ కలిసి ఆయన మీదికి విరుచుకుపడ్డారు. ఆ విధంగా తనమీదికి దూకుతున్న వారిని (ద్రోణుడు మరణించ నిశ్చయించుకొని) వేగంగా ఎదుర్కొన్నాడు.

సత్యసంధుడయిన ఆయన అలా ఎదురు వెళ్ళుతుండగా భూమి కంపించింది. సైన్యాన్ని భయపెడుతూ, పిడుగుపాటులతో తీవ్రంగా గాలులు వీచాయి. సూర్యమండలంనుంచి బయలుదేరిన పెద్ద ఉల్క రెండు సేనలను వెలిగింపజేస్తూ రాబోతున్న గొప్ప ఆపదను సూచిస్తూ పడింది. ఆర్యా! భారద్వాజుని శస్త్రాలు ప్రజ్వలించాయి. రథాలు పెద్దగా ధ్వనిస్తున్నాయి. గుర్రాలు, కన్నీళ్ళు విడిచాయి. మహారథు డయిన ద్రోణుడు తేజస్సు తగ్గినట్లు కన్పించాడు. ఆయన ఎడమకన్ను, ఎడమ బుజము వణికాయి. ఎదురుగా ధృష్టద్యుమ్నుని చూసి, ఆయన వికలమనస్కు డయ్యాడు. బ్రహ్మవాదులయిన ఋషులు స్వర్గగమనాన్ని గూర్చి చెప్పిన మాటలు విన్పించాయి. చక్కగా యుద్ధం చేస్తూ ప్రాణాలు వదలటానికి ఆయన సిద్ధమయ్యాడు. అప్పుడు ద్రుపదసైన్యం నాలుగు దిక్కులనుండి ఆయనను కప్పివేసింది. ద్రోణుడు యుద్ధంలో క్షత్రియ సముదాయాన్ని దగ్ధం చేస్తూ సంచరించాడు. ఆయన ఇరవై వేలమంది క్షత్రియులను సంహరించి, పదునయిన బాణాలతో పదివేల ఏనుగులను సంహరించాడు. ఆయన యుద్ధభూమిలో పాగలేని అగ్నివలె జ్వలిస్తూ, సర్వసన్నద్ధుడయి ఉన్నాడు. సర్వక్షత్రియ నాశం కోసం బ్రహ్మాస్త్రాన్ని సంధించాడు. ఆయుధాలు అన్నీ ధ్వంసమయి బాగా విషాదం పొందిన ఆత్మవంతుడు, బలవంతుడయిన ధృష్టద్యుమ్నుని భీముడు త్వరగా సమీపించాడు. ఆయన ధృష్టద్యుమ్నుని తన రథం మీదికి ఎక్కించుకొని సమీపం నుంచి బాణాలు వేస్తూన్న ద్రోణుని చూసి, ధృష్టద్యుమ్నునితో ఇలా అన్నాడు. 'మనసైన్యంలో నీవు తప్ప ఇంక ఏవీరుడు ద్రోణునితో యుద్ధం చేయటానికి ఉత్సహించటం లేదు. ఆయనను వధించటానికి ముందు త్వరపడు. ఈ భారం అంతా నీమీదనే ఉంది.'

అలా భీముడు చెప్పగా ఆయన ఉత్సాహంతో ఆయుధ శ్రేష్ఠమయిన ధనుస్సును త్వరగా చేతదాల్చాడు. క్రోధపూర్ణుడయి, యుద్ధంలో వారించ వీలుగాని ఆచార్యద్రోణుని వారింపదలచి ధృష్టద్యుమ్నుడు బాణవర్షం కురిపించాడు. వారిద్దరు బ్రహ్మాస్త్రాదులయిన దివ్యాస్త్రాలను నానా విధాలుగా ప్రయోగించారు. మహారాజా! ధృష్టద్యుమ్నుడు ద్రోణుడు వేసిన అస్త్రాలను అన్నిటిని ఖండించి, మహాస్త్రాలతో ఆయనను కప్పివేశాడు. యుద్ధభూమిలో ద్రోణుని రక్షిస్తున్న వసాతులు, శిబి వంశీయులు, బాహ్లికులు, కౌరవులను కూడా ఆయన సంహరించాడు. రాజా! సూర్యుడు కిరణాలతో వలె, ధృష్టద్యుమ్నుడు దిక్కులను బాణాలతో అంతటా కప్పివేస్తూ విరాజిల్లాడు. ద్రోణుడు బాణాలతో ఆయన ధనుస్సును ఖండించి, ఆయన మర్మస్థానాలను గాయపరిచాడు. ధృష్టద్యుమ్నుడు చాలా ఎక్కువ వ్యథ పొందాడు. అప్పుడు దృఢక్రోధుడయిన భీముడు తనరథాన్ని ఆచార్య రథం దగ్గరకు తీసుకొనివచ్చి,

మెల్లగా ఆయనతో ఇలా అన్నాడు. "బాగా చదువుకొన్న బ్రాహ్మణులు తమకు శాస్త్రంవిధించిన కర్మకాండతో తృప్తిచెందక పరధర్మాన్ని ఆశ్రయించి, యుద్ధం చేయకుండా ఉంటే క్షత్రియజాతి నశించకుంటుంది. సర్వప్రాణులను హింసించకుండటమే చాలా గొప్ప ధర్మం అని చెపుతారు. దానికి మూలం బ్రాహ్మణుడు. మీరు వేదవేత్తలలో శ్రేష్ఠులు. బ్రాహ్మణా! భార్యాపుత్రులకు ధనం సంపాదించి ఇద్దామనే కోర్కెతో మీరు మూర్ఖులయిన చండాలులవలె అనేక మ్లేచ్ఛులను, ఇతర క్షత్రియులను సంహరించారు. మీరు మీ ఒక్కకొడుకు కోసం విపరీతమయిన పనిని చేపట్టి, ఈ పాప విద్యతో స్వధర్మాన్ని అనుసరించే క్షత్రియులను అనేకులను చంపి సిగ్గుపడకపోవటమేమిటి ? ఎవరికోసం మీరు ఆయుధం చేపట్టి ఎవరికోసం జీవిస్తున్నారో ఆతడు మీకు వెనకవైపు నేడు నేలగూలి ఉన్నాడని మీకు తెలియటం లేదు. ధర్మరాజు ఇంతకుముందు చెప్పినమాటను సందేహించతగదు." అని భీముడు చెప్పగా ధర్మాత్ముడయిన ద్రోణుడు ఆ ధనుస్సును వదలివేసి, ఇతరమయిన అన్ని అస్త్రాలను వదలివేయదలచి ఇలా చెప్పాడు.

'కర్ణా! కర్ణా! మహాధనుర్ధరా! కృపాచార్యా! దుర్యోధనా! ఇంక మీరు యుద్ధంలో విజయంకోసం ప్రయత్నించండి. అని మళ్ళీ మళ్ళీ చెపుతున్నాను. పాండవులనుంచి మీకు మేలు కలుగుగాక నేను శస్త్రాలను వదలివేస్తున్నాను.' అని చెప్పి ఆయన అశ్వత్థామను పేరుపెట్టి పిలిచాడు. యుద్ధరంగంలో శస్త్రం వదలి రథంమీద కూర్చుని సర్వప్రాణులకు అభయాన్ని ఇచ్చాడు. తరువాత యోగనిష్ఠుడు అయినాడు. ప్రతాపవంతుడయిన ధృష్టద్యుమ్నుడు ఆయనను దెబ్బతీయటానికి అవకాశం వచ్చిందని తెలుసుకొని, బాణంతో గూడా ఆ ఘోరధనుస్సును రథం మీద వదలి, ఖడ్గం చేతబట్టుకొని రథం మీదినుంచి దూకి, ద్రోణుని మీదికి వెళ్ళాడు. ద్రోణుడు ఆలా యోగస్థితిలోకి పోయి ధృష్టద్యుమ్నునికి వశం కావటం చూసి, మానవులు ఇతర ప్రాణులు హాహాకారాలు చేశారు. పెద్దగా హాహాకారాలు చేశారు. ఛీ ఛీ అన్నారు. ద్రోణుడుకూడా శస్త్రాలను వదలి పరమజ్ఞానంలో లీనమయినాడు. అలాగా చెప్పి ఆ మహాతపస్వి యోగనిష్ఠుడయి, జ్యోతిః స్వరూపుడయి, మానసికంగా, పురాణపురుషుడయిన విష్ణుదేవుని ధ్యానపరుడయినాడు. ఆయన ముఖం కొంచెంపైకెత్తి వక్షస్సును ముందుకు పెట్టి, స్థిరం చేసుకొన్నాడు. విశుద్ధమయిన సత్వంలో ఉండి కన్నులు మూసుకొని హృదయంలో దృఢంగా ధారణచేశాడు. దానితోపాటు ఓం అనే ఏకాక్షరాన్ని బ్రహ్మజపం చేస్తూ ఆ మహాతపస్వి ద్రోణాచార్యుడు ప్రణవార్థమయినవాడు, దేవదేవేశ్వరుడు వినాశరహితుడు, మహాప్రభువు, పరమాత్మను ధ్యానిస్తూ, ధ్యానిస్తూ, జ్యోతిః స్వరూపుడయి, మహాత్ములు గూడా పొందలేని బ్రహ్మలోకానికి వెళ్ళాడు. ఆయన అలా వెళ్ళగా మాకు

ఆకాశంలో ఇద్దరు సూర్యులు ఉన్నారా అని అనిపించింది. సూర్యసమానుడయిన ద్రోణభాస్కరుడు ఉదయించగా ఆకాశం అంతా తేజస్సులతో నిండింది. అది అంతా ఏకాగ్రం అయినట్లు అనిపించింది. రెప్పపాటు కాలంలో ఆ జ్యోతిఃపుజం అంతర్ధానమయింది. ద్రోణుడు బ్రహ్మలోకాన్ని చేరగా, ధృష్టద్యుమ్నుడు మోహితుడు కాగా, ఆనంద పరవశులయిన దేవతలు హర్షధ్వనులు చేశారు. యోగయుక్తుడయిన మహాత్ముడు, ద్రోణుడు పరమగతికి వెళ్ళుతుంటే నేను, అర్జునుడు, కృపాచార్యుడు, శ్రీకృష్ణుడు, ధర్మపుత్రుడు అనే అయిదుగురం మాత్రమే చూడగలిగాం. మహారాజా! యోగస్థితిలో ఉత్తమలోకాలకు వెళ్ళుతున్న మేధావి అయిన భారద్వాజుని మహిమను ఇతరులు ఎవ్వరూ చూడలేదు. ఆ బ్రహ్మలోకం మహత్తరం, దివ్యం, దేవరహస్యం, ఉత్కృష్టం, పరమగతి రూపం. ద్రోణాచార్యుడు యోగాన్ని ఆశ్రయించి, ఉత్తమ మహర్షులతో బ్రహ్మలోకానికి వెళ్ళాడు. అజ్ఞానులయిన మానవులు ఆ దృశ్యం చూడలేదు.

బాణపు దెబ్బలతో ఆయన శరీరం తీవ్రమయిన గాయాలపాలు అయింది. ఆయుధాలు అన్నీ వదిలేశాడు. ఆ శరీరంనుంచి రక్తం కారుతున్నది. సమస్త ప్రాణులు చీదరించుకొంటుండగా ధృష్టద్యుమ్నుడు ఆచార్య శరీరాన్ని పట్టుకొన్నాడు. ప్రాణంపోయి ఏమీ పలుకని ఆ ద్రోణ శిరస్సును పట్టుకొని, ఖడ్గంతో శిరస్సును ఖండించాడు. ద్రోణుడు పడిపోగా పార్షతుడు సంతోషపరవశుడయి యుద్ధభూమిలో ఖడ్గం త్రిప్పుతూ సింహనాదం చేశాడు. ఆ ద్రోణుడి శరీరం శ్యామలవర్ణం. ఆయన వయస్సు నాలుగు వందల ఏండ్లు, (80 × 5 = 400) ఆయన చెవుల దగ్గరనుంచి పైన శిరోజాలు తెల్లబడ్డాయి. అలాంటి ఆయన నికోసం యుద్ధంలో పదహారేండ్ల వాని వలె సంచరించాడు. 'ద్రుపదకుమారా! ఆచార్యుని సజీవంగానే తీసుకురా. చంపవద్దు' అని మహాబాహువయిన ధనంజయుడు చెప్పాడు. ఇతర సైనికులు గూడా 'చంపవద్దు, చంపవద్దు' అని కేకలు వేసి చెప్పారు. కరుణాళువయి అర్జునుడు అరుస్తూ ఆయన దగ్గరకు వస్తున్నాడు. అర్జునుడు, అక్కడి రాజులు అందరూ కేకలు పెట్టి వారిస్తుండగా ధృష్టద్యుమ్నుడు నరశ్రేష్ఠుడయిన ద్రోణుని రథాసనం మీద చంపాడు. తేరిపారజూడరాని ద్రోణుని శరీరం రక్తం ఓడుతూ రక్తకాంతిగల సూర్యుడు అస్తమిస్తున్నాడా అన్నట్లు రథంనుంచి భూమి మీద పడిపోయింది. ఈ రీతిగా హతుడయిన ఆయనను యుద్ధభూమిలో సైనికులు అందరూ చూశారు. రాజా! ధృష్టద్యుమ్నుడు ఆ భారద్వాజుని శిరస్సును నీ వారి ఎదుట విసిరివేశాడు. రాజా! ఆ ద్రోణుని శిరస్సును చూచిన నీ పక్షంవారు అన్నిదిక్కులకు పారిపోయారు. ద్రోణుడు ఆకాశానికి వెళ్ళి నక్షత్ర పథంలో ప్రవేశించాడు. సత్యవతీసుతుడు, మహర్షి అయిన వేదవ్యాసుని అనుగ్రహం

వల్ల ద్రోణుని మరణగతిని నేనే చూడగలిగాను. పొగలేకుండా మండుతూ పోతున్న ఉల్కనువలె ఆకాశాన్ని ఆక్రమించి, వెళ్ళుతున్న ఆ మహాతేజస్విని చూశాం.

ద్రోణుడు మరణించటం వల్ల నిరుత్సాహులయిన కౌరవులను మహా వేగం గల పాండవ సృంజయ వీరులు పారద్రోలారు. అందువల్ల మీ సైన్యం అంతా చెల్లాచెదరయింది. యుద్ధంలో నిశితమయిన బాణాలతో హతులయి కొందరు, మృతప్రాయులై ద్రోణుడు నేలగూలగానే నిర్జీవులు లాగా అయినారు. ఇలా ఇహంలో పరాజయం పాలయి నీ పక్షంవారు పర లోకంలో గూడా మహాభయం పొంది, రెండింటికి దూరమయి ధైర్యం కోల్పోయారు. మహారాజా! మీపక్షంలోని రాజులు ద్రోణుని శరీరాన్ని వెతికారు. కాని వేలకొలది శవాలతో నిండిన యుద్ధభూమిలో కనుక్కోలేకపోయారు. పాండవులు ఇహంలో జయాన్ని, పరంలో మహత్తర కీర్తిని పొంది బాణ శంఖధ్వనులను, పుష్కలంగా సింహనాదాలను చేశారు. అప్పుడు భీమసేన ధృష్టద్యుమ్నులు ఒకరినొకరు కౌగిలించుకొని సేనా మధ్యంలో నృత్యం చేశారు. అప్పుడు భీముడు ధృష్టద్యుమ్ననితో ఇలా అన్నాడు. 'పార్షతా! కర్ణదుర్యోధనులు యుద్ధంలో మరణించిన తరువాత మళ్ళీ నేను విజయివయిన నిన్ను కౌగిలించుకొంటాను.' అని చెప్పి భీముడు పరమానందమగ్నుడయి, జబ్బచరచి, ఆ ధ్వనితో భూమిని కంపింపజేశాడు. ఆ శబ్దానికి భయపడి నీ పక్షంవారు క్షత్రియధర్మాన్ని వదలి, పలాయన పరాయణులై యుద్ధరంగంనుంచి పారిపోయారు. నరేంద్రా! పాండవులు యుద్ధంలో శత్రునాశం కాగా జయం పొంది సంతోషించారు. అందువల్ల సుఖించారు."

193. కౌరవ సేనాపతుల పలాయనము.
అశ్వత్థామకు కృపాచార్యులు ద్రోణవధ వృత్తాంతము చెప్పుట.

"రాజా! ద్రోణుడు చనిపోతే, శత్రువుల శస్త్రాల దెబ్బలుతిని శ్రేష్ఠవీరులు చనిపోగా కౌరవులు శోకమగ్నులు అయి కకావికలయినారు. ఉత్కర్షను పొందిన శత్రువులను చూసి, మనవారు మాటిమాటికి వణికిపోతూ, కన్నీరు కారుస్తూ భీతులు, దీనులు అయ్యారు. మతిపోయి, ఉత్సాహహీనులయి, వైకల్యంతో పరాక్రమం కోల్పోయి, పెద్దగా ఆర్తధ్వనులు చేస్తూ, వారంతా నీ పుత్రుని చుట్టుముట్టారు. దుమ్ముకొట్టుకొని వణికిపోతూ, పదిదిక్కులు, చూస్తూ, కన్నీళ్ళు దిగమ్రింగుతూ పూర్వం హిరణ్యాక్షుడు చనిపోయినపుడు దైత్యులవలె దీనులు అయ్యారు. భయపడిన చిన్న జంతువుల వలె ఆ సైనికులు చుట్టుగల నీ పుత్రుడు అక్కడ నిలవలేక తొలగిపోయాడు. ఆకలి దప్పులతో గాసిచెందిన నీ యోధులు సూర్యతాపానికి సంతాపం చెందినట్లు అధికంగా వికలమనస్కు లయ్యారు. రాజా! సూర్యుడు

నేలమీద పడినట్లు, సముద్రం ఎండిపోయినట్లు, మేరుపర్వతం తల్లక్రిందులు అయినట్లు, ఇంద్రుడు పరాజయం పాలయినట్లు ద్రోణుడు నేలగూలటం, అసంభవం అని తలచి తట్టుకోలేని ఆ దృశ్యాన్ని చూసి, భయంతో కౌరవులు వణికిపోతూ పారిపోయారు.

గాంధారరాజు శకుని బంగారు రథం గల ద్రోణుడు హతుడయినాడని విని, భయపడి తనకంటే ఎక్కువ భీతులయిన రథికులతో గలిసి పారిపోయాడు. కర్ణుడు కూడా ధ్వజాలు పతాకలతో గూడి వేగంగా పారిపోతున్న తన మహాసేనతో పాటు భయపడి పారిపోయాడు. మద్రదేశాధిపతి అయిన శల్యుడు ఆ దృశ్యం చూస్తూ భయంతో రథాలు, ఏనుగులు, గుర్రాలతో గూడిన మహాసేనను ముందుంచుకొని, రణరంగం వీడిపోయాడు. ఉత్తమవీరులు అనేకులు మరణించగా అనేక పతాకలుగల సేనతో గూడిన కృపాచార్యుడు. "ఇది చాలా బాధాకరం" అంటూ త్వరగా అక్కడినుంచి వెళ్ళిపోయాడు. హతశేషమయిన భోజసేనతో కలింగులు, ఆరట్టకులు, బాహ్లికులతో గూడిన కృతవర్మ వేగవంతాలయిన గుర్రాలతో వెళ్ళిపోయాడు. రాజా! నేలగూలిన ద్రోణుని చూసి, భీతుడయి, వణుకుతూ, ఉలూకుడు పదాతిసైన్యంతో గలిసి పారిపోయాడు. చూడదగిన అందగాడు, యువకుడు, శూరలక్షణాలు కల దుఃశాసనుడు అధికంగా ఉద్వేగం పొంది, గజసైన్యంతో కలసి పారిపోయాడు. నేలగూలిన ద్రోణుని చూచి వృషసేనుడు పదివేల రథాలతో, మూడువేల ఏనుగులతో కలసి త్వరగా వెళ్ళాడు. మహారాజా! మహారథుడయిన దుర్యోధనుడు ఏనుగులు, గుర్రాలు, రథాలు, పదాతులు అనే చతురంగ సైన్యంతో గలసి, రణరంగం నుంచి వెళ్ళిపోయాడు. ద్రోణపతనాన్ని చూచి సుశర్మ అర్జునుడు సంహరించగా మిగిలిన సంశప్తక గణాలను తీసుకొని, పారిపోయాడు. బంగారు రథం గల ద్రోణుడు హతుడు కావటం చూసి మీపక్షవీరులు ఏనుగులను, రథాలను ఎక్కి, రౌతులు గుర్రాలను వదలి యుద్ధరంగంలో నుంచి నలుదిక్కులకు పరుగెత్తారు. కౌరవులలో కొందరు తండ్రులను, ఇంక కొందరు సోదరులను, మరికొందరు మేనమామలను, వేరొక కొందరు పుత్రులను, మరికొందరు మిత్రులను తొందరపెడుతూ పరుగులు తీశారు. కొందరు సైన్యాలను, మేనల్లుళ్ళను కొందరు, చుట్టాలను కొందరు తొందరపెడుతూ పది దిక్కులకూ పారిపోయారు. వారందరి జుట్టు చెల్లాచెదరయింది. వాళ్ళుపడుతూ లేస్తూ పారిపోతున్నారు. ఇద్దరు సైనికులు కలిసి గాని, ఒక దిక్కుకు గాని పారిపోవటం లేదు. ఈ సేన ఇంక లేదు అనే నమ్మకం గలగటం వల్ల వారికి ఉత్సాహం ఉడిగింది. దేవా! భరతశ్రేష్ఠా! మీవాళ్ళలో కొందరు కవచాలు వదిలివేసి పరుగులు తీశారు. ఆ సైనికులు ఒకరినొకరు కేకలు పెట్టి పిలుచుకొన్నారు. ఆ సైనికులు ఇతరులను 'నిలు, నిలు' అంటూ తాము మాత్రం

అక్కడ నిలువలేదు. బాగా అలంకరించిన రథాలు సూతులు మరణించగా ఆ రథాల గుర్రాలను నొగలనుంచి విడిపించి, వాటిని ఎక్కి, కాళ్ళతో పరిగెత్తమని పురికొల్పారు.

ఉత్సాహం నశించగా భయమే ఆకారం ధరించినట్లు ఉన్న సైన్యం పారిపోతుంటే వీటికి ఎదురీదుతున్న మొసలి వలె ద్రోణపుత్రు డయిన అశ్వత్థామ ఎదురుగా వచ్చాడు ఆ అశ్వత్థామకు శిఖండి మొదలయిన గణాలతో, ప్రభద్రకులతో, పాంచాలురతో, కేకయులత్ గూడిన పాంచాలురతో చాలా పెద్ద యుద్ధం జరిగింది. యుద్ధదుర్మదుడు, మదించిన ఏనుగు పరాక్రమం వంటి పరాక్రమం గల ఆయన పాండవుల సేనలను అనేక రీతులుగా సంహరించి, ఏదో విధంగా ఆ యుద్ధ సంకటం నుంచి బయటపడ్డాడు. ఇంతలోనే కౌరవసేన అంతా కూడా పారిపోతున్నది. వారందరూ పలాయనం మీదనే దృష్టిపెట్టాడు. అది చూచి అశ్వత్థామ దుర్యోధనుని వద్దకు చేరి ఇలా అన్నాడు. "భరతవంశీయా! ఈసేన అంతా నిలువెల్లా భయమై పారిపోతున్నదేమి ? పారిపోతున్న ఈ సేనను ఆపవేమి? నీవుకూడా వెనుకటిలాగా నెమ్మదిగా లేవు. కర్ణాదులు గూడా నిలువకుండా పారిపోతున్నారేమిటి ? ఇతర యుద్ధాలలో గూడా నీసేన ఈ రీతిగా పారిపోలేదు. మహాబాహూ! నీ సైన్యం అంతా క్షేమంగా ఉన్నదా ? రాజా! ఏ రథికశ్రేష్ఠుడు హతుడు కావటం వల్ల నీ సేనకు ఈ దుఃస్థితి కలిగిందో నాకు చెప్పవలసింది."

అశ్వత్థామ అన్న ఆ మాటలు విని పార్థివశ్రేష్ఠుడయిన దుర్యోధనుడు ఘోరమయిన ఆ దుర్వార్తను చెప్పలేకపోయాడు. పగిలిననౌకవలె శోక సముద్రంలో మునిగి, కన్నుల నీరునిండిన నీ పుత్రుడు రథంమీద ఉన్న అశ్వత్థామను చూశాడు. తరువాత సంకోచపడుతూ దుర్యోధనుడు కృపాచార్యునితో ఇలా అన్నాడు – "ఆచార్యా! నీకు మేలు కలుగుగాక. మన సైన్యం అంతా ఎందుకు పారిపోతున్నదో ఈయనకు వివరించు." అప్పుడు కృపాచార్యుడు మాటిమాటికి బాధపడుతూ ద్రోణవధ వృత్తాంతం అశ్వత్థామకు ఇలా చెప్పాడు. "వత్సా! భూమండలంలోనే శ్రేష్ఠ మహారథుడయిన ద్రోణుని ముందుంచుకొని, కేవలం పాంచాలురతోనే యుద్ధం చేశాం. అప్పుడు యుద్ధం మొదలుకాగా కౌరవులు, సోమకులు పరస్పరం గర్జిస్తూ ఆయుధాలతో దేహాలను నేలగూల్చారు. అలా యుద్ధం జరుగుతుండగా రణంలో కౌరవ వీరులు నశిస్తుండగా నీ తండ్రి ద్రోణుడు అస్త్రప్రయోగం చేశాడు. ద్రోణుడు బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించి, బాణాలతో వందలు వేలకొలది శత్రువులను సంహరించాడు. యముడు పురికొల్పగా పాండవ వీరులు, కేకయులు, మత్స్యదేశీయులు, సమధికంగా పాంచాలురు యుద్ధంలో ద్రోణుని పాలబడి నశించారు. ద్రోణుడు బ్రహ్మాస్త్ర ప్రయోగంతో వేయిమంది వీరశ్రేష్ఠులను, రెండువేల ఏనుగులను యమలోకానికి పంపాడు. శ్యామదేహుడు

నాలుగువందల ఏండ్లు నిండినవాడు, కర్ణపర్యంతం తెల్లబడ్డజుట్టు గల వాడు, వృద్ధుడయిన ద్రోణుడు పదహారేళ్ళ పడుచువానివలె యుద్ధభూమిలో సంచరించాడు. సైన్యాలు క్లేశపడుతుండగా, రాజులు మరణిస్తుండగా కోపపరవశులయిన పాంచాలులు యుద్ధవిముఖులు అయ్యారు. ఉత్సాహం ఉడిగి, వారు యుద్ధవిముఖులు కాగా దివ్యాస్త్ర సంపన్నుడయిన శత్రువిజేత ద్రోణుడు ఉదయించిన సూర్యునివలె ఉన్నాడు. బాణాలే కిరణాలై ప్రతాపవంతుడయిన మీ తండ్రి పాండవ సేనల మధ్యకు వెళ్ళి, మధ్యాహ్న మార్తాండునివలె శత్రువులకు తేరిపారజూడవీలుగాని వాడయినాడు. ప్రకాశించే సూర్యుని వంటి ద్రోణుడు దహిస్తుండటం వల్ల వారు దగ్ధ ప్రతాపులు, నిరుత్సాహులై మ్రాన్పడిపోయారు. బాణ పీడితులయిన వారిని చూసి, పాండవుల విజయం కోరే శ్రీకృష్ణుడు ఇలా అన్నాడు.

రథసమూహాల అధిపతులకు అధిపతి, శస్త్రధారులలో శ్రేష్ఠుడయిన ఈయనను యుద్ధంలో ఇంద్రుడు కూడా జయించలేడనగా నరుడేమి లెక్క ? కాబట్టి పాండవులారా! బంగారు రంగు గుర్రాలు గల ఈయన మిమ్ములను యుద్ధంలో చంపకుండా ఉండాలంటే మీరు ధర్మాన్ని వదలి విజయాన్ని కాపాడుకోండి. **అశ్వత్థామ హతుడయినాడు** అనేమాట వింటే ఈయన యుద్ధం చేయడని నా ఉద్దేశ్యం. కాబట్టి అశ్వత్థామ హతుడయినాడని ఎవరైనా ఈయనకు అబద్ధం చెప్పాలి.' అర్జునుడికి ఈ ఉపాయం నచ్చలేదు. తక్కిన వారు అందరికీ ఇది నచ్చింది. అతి కష్టం మీద యుధిష్ఠిరుడు అంగీకరించాడు. భీముడు కొంచెం బిడియపడుతూ 'అశ్వత్థామ హతుడయ్యాడు' అని చెప్పాడు. మీ నాన్న ఆ మాట నమ్మలేదు. పుత్రప్రేమ గల నీ తండ్రి అది విని, అనుమానంతో 'యుద్ధంలో నీవు హతుడివా? కావా' అని ధర్మరాజును అడిగాడు. అసత్య భయంలో మగ్నుడయినా, జయాసక్తుడయిన యుధిష్ఠిరుడు యుద్ధంలో భీమునిచే హతమయిన మాళవదేశీయుడయిన ఇంద్రవర్మ యొక్క కొండంత మహాగజాన్ని చూసి, ద్రోణుని సమీపించి, పెద్దగా ఇలా చెప్పాడు. ఆచార్యా! ఎవరికోసం నీవు ఆయుధం పట్టావో, ఎవరిని చూసి నీవు బ్రతుకుతున్నావో నీకు చాలా ప్రేమపాత్రుడయిన ఆ పుత్రుడు అశ్వత్థామ యుద్ధంలో నిహతుడయి అరణ్యంలో సింహ శిశువు వలె నేలబడియున్నాడు. అది అబద్ధం అని, దోషం అని తెలిసి కూడా ఆయన అస్పష్టంగా 'ఏనుగు హతమయింది' అని కూడా చెప్పాడు. యుద్ధంలో నీవు హతుడివయినావు అని విని, సంతాపంతో తపించి, దివ్యాస్త్రాల ప్రయోగాన్ని ఆపి, వెనకటిలాగా యుద్ధం చేయలేదు. చాలా ఉద్విగ్నుడు, శోకసంతప్తుడు, కొయ్యబారినట్లున్న ఆయనను చూసి, క్రూరకార్యం చేసే పాంచాల రాజపుత్రుడు ధృష్టద్యుమ్నుడు ఆయన మీదికి దూకాడు. లోకతత్త్వజ్ఞానంలో నిపుణుడయిన ఆయన తనకు నిర్ణీత మృత్యువయిన

ఆయువము చూసి, యుద్ధంలో దివ్యాస్త్రాలను వదలి, ప్రాయోపవేశం చేశాడు.

ఆ తరువాత ధృష్టద్యుమ్నుడు అందరూ 'వద్దు, వద్దు' అని అరుస్తుండగా ఎడమచేతితో ఆయన జుట్టుపట్టుకొని శిరస్సును ఖండించాడు. అన్నివైపుల నుండి అందరూ 'చంపవద్దు, చంపవద్దు' అని కేకలు పెట్టి చెప్పారు. అలాగే అర్జునుడు కూడా రథం దిగి ఆయనవైపు పరిగెత్తాడు. పెద్దగా అరుస్తూ ధర్మవేత్త అయిన అర్జునుడు చేయివైకెత్తి 'సజీవంగా ఆచార్యుని తీసుకురా చంపవద్దు' అని చెప్పాడు. ఆ రీతిగా నరశ్రేష్ఠా! కౌరవులు, అర్జునుడు నివారిస్తుండగానే క్రూరుడయిన ఆతడు నీ తండ్రిని చంపాడు. అప్పుడు భయకంపితులయి సైనికులు పారిపోయారు. మీ తండ్రి మరణంవల్ల మేముకూడా నిరుత్సాహపడ్డాం." సంజయుడు చెప్పాడు – "తన తండ్రి యుద్ధరంగంలో మరణించటం విని అశ్వత్థామ కాలితో త్రొక్కిన త్రాచువలె తీవ్రకోపపరవశుడయ్యాడు. ఆర్యా! అప్పుడు యుద్ధరంగంలో కోపావేశం చెందిన అశ్వత్థామ బాగా కట్టెలు వేస్తే అగ్ని ప్రజ్వలించినట్లు మండిపడ్డాడు. అరచేతితో అరచేతిని పిసుకుతూ, పండ్లను పటపటలాడిస్తూ, బుసకొట్టేపాములాగా నిట్టూర్పులు విడుస్తూ, కన్నులు ఎర్రజేశాడు."

194. సంజయుని ధృతరాష్ట్రుడు ప్రశ్నించుట.

ధృతరాష్ట్రుడు అడిగాడు – "సంజయా! బ్రాహ్మణుడు, వృద్ధుడు, తన తండ్రి అయిన ద్రోణుని ధృష్టద్యుమ్నుడు చంపాడు అని విని అశ్వత్థామ ఏమన్నాడు ? మానవం, వారుణం, ఆగ్నేయం, వీర్యవంతమయిన బ్రహ్మాస్త్రం, ఐంద్రాస్త్రం, నారాయణాస్త్రం నిత్యం తనయందు నిలుపుకొన్నవాడు, ధర్మాత్ముడు అయిన ఆచార్యుని యుద్ధంలో ధృష్టద్యుమ్నుడు అధర్మంగా చంపాడు అని విని, అశ్వత్థామ ఏమి అన్నాడు ? మహాత్ముడయిన పరశురాముని నుండి ధనుర్వేదం ఉపదేశం పొంది ఆయన సుగుణాలు కలగాలనే కోరికతో పుత్రునికి దివ్యాస్త్రాలను ఉపదేశించాడు. (ద్రోణుడు) తనకంటే తన పుత్రుడు ఒక్కడే ఉత్తమ గుణాలు గలవారిలో శ్రేష్ఠుడు కావాలని లోకంలో మానవులు కోరుకొంటారు. ఇతరు లెవరినీ ఏవిధంగానూ కోరుకోరు. మహాత్ములయిన ఆచార్యుల వద్దనే గొప్ప రహస్య విషయాలు ఉంటాయి. వాటిని కుమారునికి గాని, తనను అనుసరించే శిష్యునికి గాని వారు ఇస్తారు. సంజయా! అశ్వత్థామ తండ్రికి శిష్యుడయి ఆ ధనుర్విద్యను విశేష రహస్యాలతో గూడా ఉపదేశం పొందటం వల్ల యుద్ధంలో ద్రోణుని తరువాత ఆతడే మహావీరుడు.

అశ్వత్థామ శస్త్రవిద్యలో పరశురామునితో సమానుడు. యుద్ధంలో ఇంద్రసమానుడు.

బలంలో కార్తవీర్యార్జునునితో తుల్యుడు. తెలివితేటలలో బృహస్పతిసముడు. స్థిరత్వంలో పర్వత సమానుడు. యువకుడయిన ఆయన తేజస్సులో అగ్నితో సమానుడు. గాంభీర్యంలో సముద్రుని వంటివాడు. కోపంలో సర్పంవంటివాడు. ఆయన లోకంలో రథికులలో మొదటివాడు. దృఢధానుష్కుడు, శ్రమను జయించినవాడు. వేగంలో వాయు తుల్యుడు, యుద్ధంలో కుపితుడయిన యమునివంటివాడు. అశ్వత్థామ యుద్ధభూమిలో బాణాలు ప్రయోగిస్తుంటే భూమి చాలా వ్యథనందుతుంది. వీరుడు, ఆయన యుద్ధరంగంలో ఎప్పుడూ వ్యథజెందడు. ఆయన వేద విద్యాధ్యయనం పూర్తిగా చేసిన స్నాతకుడు. బ్రహ్మచర్యవ్రతం యథావిధిగా పూర్తిచేసిన స్నాతుడు. దశరథరాముని వలె మహోదధివలె, ఆయన ఎప్పుడూ క్షోభపడడు. ధర్మాత్ముడయిన ఆ ఆచార్యుని యుద్ధంలో ధృష్టద్యుమ్నుడు అధర్మంగా సంహరించటం విని, అశ్వత్థామ ఏమని అన్నాడు ? ద్రోణునికి ద్రుపదపుత్రుడు మృత్యువుగా సృష్టింపబడినట్లు ద్రోణుడు ధృష్టద్యుమ్నునికి మృత్యువుగా సృష్టించాడని నేను పూర్వం విన్నాను. నరహంతకుడు, పాపాత్ముడు, క్రూరకర్ముడు, ముందుచూపు లేనివాడయిన ఆ ధృష్టద్యుమ్నుడు ఆచార్యుని చంపాడని విని అశ్వత్థామ ఏమన్నాడు ?"

195. రోషముతో అశ్వత్థామ వారాయణాస్త్రమును ప్రయోగించుట.

సంజయుడు చెప్పాడు - "మానవశ్రేష్ఠా! పాపకర్ముడయిన ధృష్టద్యుమ్నుడు తన తండ్రిని వంచనతో చంపాడని విని, అశ్వత్థామ కన్నీటితో కోప పూరితుడయ్యాడు. రాజేంద్రా! ప్రళయకాలంలో ప్రాణులను హరింపగోరే యమధర్మరాజు వలె క్రుద్ధుడయిన అశ్వత్థామ శరీరం కాంతితో ప్రదీప్తమయి కన్పించింది. ఆయన కన్నీటితో నిండిన కన్నులను మాటిమాటికి తుడుచుకొంటూ, కోపంతో నిట్టూర్పులు విడిచి, దుర్యోధనునితో ఇలా అన్నాడు. ఆయుధం విడిచిన నాతండ్రిని క్షుద్రులు సంహరించారని, కపట ధర్మం ఆచరించే యుధిష్ఠిరుడు పాపపు పని చేశాడని నాకు తెలిసింది. ధర్మపుత్రుడు చేసిన క్రూరమూ, నీచమూ అయిన పనిని నేను విన్నాను. యుద్ధంలో ప్రవర్తించేవారికి జయమో, పరాజయమో తప్పక కలుగుతుంది. ఈ రెండింటిలో ఏదో ఒకటి జరుగుతుంది. రాజా! యుద్ధంలో వధించటం ప్రశంసించదగినదే. యుద్ధరంగంలో యుద్ధం చేస్తున్న వానికి న్యాయంగా కలిగే వధ ఎక్కువ దుఃఖకరంగాదు. ఈ యుద్ధ పరిణామాన్ని ద్విజులు గమనించారు. పురుషశ్రేష్ఠా! ఆ నాతండ్రి వీరలోకానికి వెళ్ళాడనటంలో సందేహం లేదు. అలా మరణించినవాని కోసం దుఃఖించనక్కర లేదు. కాని ధర్మంగా వ్యవహరిస్తుండగా, సర్వసైన్యాలు చూస్తుండగా ఆయన జుట్టు పట్టుకొన్నారనటం నా మర్మాలను ఛేదిస్తున్నది.

నావంటివాడు బ్రతికి ఉండగా నా తండ్రి జుట్టు పట్టుకొన్నారంటే ఇక సామాన్యులు, పుత్రవంతులు, పుత్రాభిలాషను ఎలా కలిగి ఉంటారు ? కామం వల్లగాని, కోపంవల్లగాని, సంతోషంతో గాని, అజ్ఞానం వల్లగాని, చిన్నతనం వల్లగాని అధర్మకార్యాలు చేస్తారు అవమానిస్తారు. నన్ను లెక్కచేయక క్రూరుడు, దుర్మార్గుడు అయిన ధృష్టద్యుమ్నుడు గొప్ప అధర్మకార్యం చేశాడు. ఇది నిశ్చయం. ధృష్టద్యుమ్నుడు ఈ పాపానికి తగిన అత్యంత ఘోరపరిణామాన్ని చూస్తాడు.

అబద్ధం చెప్పి, చేయగూడనిపని చేసి, వంచనతో నా తండ్రి అస్త్రసంన్యాసానికి కారణమయిన ఆ ధర్మరాజు రక్తాన్ని నేడు భూమి త్రాగుతుంది. కురురాజా! సత్యం మీద, నేను చేసిన యజ్ఞయాగాలమీద, వాపీకూప తటాకాది నిర్మాణాల మీద (ఇష్టాపూర్తుల మీద) ఒట్టుపెట్టి చెపుతున్నాను. పాంచాలురను అందరినీ చంపకుండా ఇంక నేను జీవించి ఉండను. పాంచాలురను చంపటానికి అన్ని ఉపాయాలతో ప్రయత్నిస్తాను. పాపపు పని చేసిన ధృష్టద్యుమ్నుని యుద్ధభూమిలో మృదుదారుణ కర్మలలో ఏదో ఒకటి చేసి చంపుతాను. కురువంశీయా! పాంచాలురను వధించి శాంతిస్తాను. మానవశ్రేష్ఠా! కలిగిన పుత్రులు ఇహలోక పరలోకాలలో కలిగే మహాభయం నుంచి రక్షిస్తారు. అనే ఆశతో జనులు పుత్రసంతతిని కోరుతారు. కొండంత శిష్యుడ నయిన పుత్రుడిని నేను బ్రతికి ఉండగానే దిక్కులేని వానికి, ఎలాంటి చుట్టాలు లేనివానికీ కలిగే దురవస్థ కలిగింది. ఇలాంటి కొడుకును కని, ద్రోణాచార్యుడు కేశగ్రహణం అనే ఘోరావమానం పొందాడు. నా దివ్యాస్త్రాలు, ఈ నా బాహువులు, నా పరాక్రమం – ఇవి అన్నీ నింద్యాలే అవుతాయి. భరతసత్తమా! పరలోకానికి వెళ్ళిన నా తండ్రి ఋణం తీర్చుకొనే రీతి ఇక నేను చేస్తాను. ఉత్తముడయిన వ్యక్తి ఎప్పుడూ ఆత్మస్తుతి చేసుకోకూడదు. తండ్రి వధను తట్టుకోలేక ఈ నాడు నా పౌరుషప్రశంస చేసుకొంటాను.

ప్రళయకాలం చేసినట్లు సర్వసైన్యాలను నాశనం చేస్తున్న నా పరాక్రమాన్ని, ఇవ్వాళ కృష్ణునితో కూడా పాండవులు చూతురుగాక. ఇవ్వాళ యుద్ధరంగంలో రథంమీద ఉన్న నన్ను దేవతలు గాని, గంధర్వులు గాని, అసురులు గాని, రాక్షసులుగాని మానవ శ్రేష్ఠులు గాని జయించలేరు. ఈ లోకంలో ఈనాడు నావలె, అర్జునుని వలె సర్వాస్త్రవేత్త ఇంకొకడు ఎక్కడా లేడు. సైన్యం మధ్యలో, నేను జ్వలిస్తున్న కిరణాల మధ్యలో సూర్యునివలె ఉండి దేవతలు సృష్టించిన అస్త్రాలను ప్రయోగిస్తాను. మహాయుద్ధంలో ఈనాడు నాధనుస్సు నుండి వెలవడిన బాణాలు తమ బలాన్ని ప్రదర్శిస్తూ పాండవుల పక్షం వారిని సమధికంగా మథిస్తాయి. రాజా! ఇవ్వాళ సర్వదిక్కులు వర్షధారలతో సంకులమయినట్లు తీక్ష్ణమయిన

బాణాలతో నిండిపోవటం మనవాళ్ళు చూస్తారు. పెద్దగాలి చెట్లను కూల్చివేసినట్లు భయంకర శర సమూహాలను సర్వదిక్కులా వెదజల్లుతూ, శత్రువులను కూలుస్తాను. ఇవ్వాళ నేను ప్రయోగించబోయే దివ్యాస్త్రాన్ని అర్జునుడు గాని, కృష్ణుడు గాని, భీముడు గాని, యుధిష్ఠిరుడు గాని, దుర్మార్గుడయిన ఈ ధృష్టద్యుమ్నుడు గాని, శిఖండి గాని, సాత్యకి గాని ఎరుగరు. ప్రయోగోపసంహారాలతో దాన్ని నేను మాత్రమే ఎరుగుదును. పూర్వం ఒకప్పుడు నా తండ్రి శ్రీమన్నారాయణుని యథావిధిగా నమస్కరించి వేదమంత్ర స్తుతి రూపమయిన ఉపహారం ఇచ్చాడు. భగవంతుడు స్వయంగా వచ్చి, ఆ స్తుతిని స్వీకరించి, నా తండ్రిని వరం కోరుకోమన్నాడు. ఆయన నారాయణాస్త్రాన్ని కోరాడు. దేవోత్తముడయిన భగవాను డప్పుడు మా తండ్రితో ఇలా అన్నాడు.

"ద్విజోత్తమా! ఇప్పుడు యుద్ధం చేయటంలో నీతో సమానుడు లేడు. ఈ నారాయణాస్త్రాన్ని తొందరపడి ఎప్పుడూ ప్రయోగించకూడదు. ఇది ప్రయోగిస్తే శత్రువును వధించకుండా వెనుదిరుగదు. ఏది ఎవరిని వధిస్తుందో తెలియటం కష్టం. వధించదగని వానిని గూడా వధిస్తుంది. కాబట్టి దీన్ని ప్రయోగించరాదు. శత్రుసంతాపకా! ద్రోణా! యుద్ధరంగంలో రథాన్నుంచి దిగటం, తన శస్త్రాస్త్రాలను వదిలేయటం, అభయం అర్థించటం, శత్రువును శరణందటం – అనేవి ఈ మహాస్త్రం శాంతించటానికి ఉపాయాలు. యుద్ధభూమిలో ఈ అస్త్రంతో చంపదగని వానిని బాధించేవాడు స్వయంగానే నానావిధాల పీడితుడవుతాడు." తరువాత నా తండ్రి దాన్ని గ్రహించాడు. దాన్ని నాకు నా తండ్రి ప్రసాదించాడు. అస్త్రదానానంతరం భగవంతుడు మా నాన్నతో ఇలా అన్నాడు. "నీవు సర్వవిధ శస్త్రవర్షాలను ఈ అస్త్రంతో అనేక రీతుల నాశనం చేయగలవు. యుద్ధరంగంలో దివ్యతేజస్సుతో వెలుగుతావు." అని చెప్పి ఆ భగవంతుడు దివ్యధామానికి వెళ్ళాడు. ఈ నారాయణాస్త్రాన్ని భగవంతునినుండి మా నాన్న సంపాదించాడు. దీన్ని నాకు ఇచ్చాడు. దీనితో నేను ఇంద్రుడు అసురులనువలె పాండవపాంచాల మత్స్యవీరులను యుద్ధరంగం నుంచి పారద్రోలుతాను.

భారతా! శత్రువులు విక్రమిస్తున్నా నేను ఎలా అనుకొంటే అలా బాణాలు శత్రువులమీద పడతాయి. యుద్ధంలో ఉండి నేను యథేచ్ఛగా రాళ్ళ వర్షం కురిపిస్తాను. ఇనుప ముక్కులు గల పక్షులతో శత్రుసేనలోని మహారథులను పారద్రోలుతాను. నేను నిస్సంశయంగా పదునయిన పరశ్వధాలు అనే ఆయుధాలను సృష్టిస్తాను. శత్రువులకు సంతాపం కలిగించే ఆ నేను నారాయణాస్త్రం ప్రయోగించి, పాండవులను పీడిస్తూ నా శత్రువులను అందరినీ నాశనం చేస్తాను. మిత్రులకు, బ్రాహ్మణులకు, గురువులకు ద్రోహం

చేసినవాడు, పరమ నింద్యుడు, నీచుడు. పాంచాల వంశానికి కళంకమయిన ధృష్టద్యుమ్నుని నేను బ్రతికి ఉండగా వదలిపెట్టను." ద్రోణపుత్రుని మాటలు విని, పారిపోయే సైన్యం వెనుదిరిగింది. అప్పుడు మనసైన్యంలోని పురుషశ్రేష్ఠులు శంఖాలను పూరించారు. సంతోషంతో వేలకొలది భేరులను, డిండిమాలను మ్రోగించారు. వాహనాల గిట్టల ఘాతుక్కుడులచే పీడింపబడి భూమి ధ్వనించింది. ఆసైన్య ధ్వని భూమ్యాకాశాలలో అంతటా ప్రతిధ్వనించింది. మేఘగర్జనలాంటి గర్జలు విన్న రథిక శ్రేష్ఠులయిన పాండవులు ఒక చోట చేరి రహస్యాలోచన చేయసాగారు. భారతా! అలా అని ద్రోణపుత్రుడు ఆచమనం చేసి, దివ్యమయిన ఆ నారాయణాస్త్రాన్ని వ్యక్తం చేశాడు."

196. శత్రుసేనల సింహనాదము విని యుధిష్ఠిరుడు అర్జునుని ప్రశ్నించుట, అర్జునుడు అశ్వత్థామ కోప ఫలితము చెప్పుట.

సంజయుడన్నాడు - "ప్రభూ! ఆ నారాయణాస్త్రం ప్రకటంకాగానే నీటి బిందువులతో కూడా గాలి వీచసాగింది. ఆకాశంలో మేఘాలు లేకుండానే మేఘ గర్జనలు వినిపించాయి. భూమి కంపించింది. మహాసముద్రం సంక్షోభించింది. సముద్రంలోకి వెళ్ళే నదులు వెనక్కు తిరిగి ప్రవహించాయి. పర్వత శిఖరాలు ముక్కలయి పడిపోయాయి. పాండవసేనకు అప్రదక్షిణంగా మృగాలు వెళ్ళాయి. అన్ని దిక్కులా అంధకారం అలముకొన్నది. సూర్యుడు మలినుడు అయ్యాడు. మాంసం తినే ప్రాణులు ఆనందంతో పరుగులు తీశాయి. నరేంద్రా! దేవతలు, దానవులు, గంధర్వులు భయకంపితులయ్యారు. వారందరు ఇప్పుడు ఏం చెయ్యాలి అని చర్చించుకోసాగారు. భయంకరము, ఘోర రూపము అయిన అశ్వత్థామ అస్త్రాన్ని చూచి రాజులందరూ వ్యథ చెందారు, భయపడ్డారు." ధృతరాష్ట్రుడు అడిగాడు "సంజయా! తండ్రి వధను తాళలేక తీవ్ర శోకంతో తపిస్తూ అశ్వత్థామ సైన్యాలను మళ్ళించగా కౌరవసేనలు మీదికి దూకుతుంటే ధృష్టద్యుమ్నుని రక్షణకోసం పాండవులు రహస్యాలోచన ఏం చేశారో చెప్పు."

సంజయుడు చెప్పాడు "యుధిష్ఠిరుడు అంతకు ముందే కౌరవసేనలు పారిపోవటం చూసి, ఇంతలోనే భయంకర గర్జనలు విని, అర్జునుని అడిగాడు. 'అర్జునా! ఇంద్రుడు వజ్రాయుధంతో మహాసురుడయిన వృత్రుని వధించినట్లు యుద్ధంలో ధృష్టద్యుమ్నుడు ద్రోణాచార్యుని సంహరించగా ఇంక జయం తమకు దక్కదని దీన మనస్కులయిన కౌరవులు ఆత్మరక్షణ కోసమని యుద్ధరంగంలోనుంచి పారిపోయారు గదా! పార్శ్వ రక్షకులు, సారథులు మరణించారు. జెండాలు, ధ్వజాలు, గొడుగులు నశించాయి. రథాల

నొగలు విరిగి చెల్లాచెదరు అయ్యాయి. ఆసనాలు విరిగిపోయాయి. రథాలకాడులు, ఇరుసులు, చక్రాలు భగ్నం అయ్యాయి. అలాంటి రథాలను తత్తరపడి గుర్రాలు లాక్కుపోతూ గిరగిరా తిరగసాగాయి. వాటివల్ల కూడా గాయపడిన అవి రాజుల రథాలను నాలుగు వైపులా లాక్కుపోతున్నాయి. కొంతమంది భయపడి తామే కాళ్ళతో గుర్రాలను తోలుతూ త్వరగా రథాలను నడిపారు. ఇంకా కొందరు విరిగిన రథాలను వదలి పారిపోయారు. కొంతమంది గుర్రాల మీద కూర్చుని ఉండగా ఆ జీను సగం ప్రక్కకు జారిపోయింది. ఆ స్థితిలో గుర్రాలు వారిని లాక్కుపోయాయి. మరికొంతమంది బాణపు దెబ్బలు తిని, తమ ఆసనాల మీది నుంచి జారి, ఏనుగుల మెడలు పట్టుకొన్నారు. ఆ స్థితిలో బాణపీడితాలయిన పారిపోతున్న ఏనుగులు వారిని ఆ పరిస్థితిలోనే తీసుకుపోయాయి. ఇంక కొందరి ఆయుధాలు, కవచాలు ధ్వంసమయినాయి. వారు వాహనాల మీదినుంచి క్రిందపడ్డారు. ఆ స్థితిలో రథచక్రాలు మీది నుంచిపోవటం వల్ల వారి శరీరాలు చిన్నాభిన్నాలయ్యాయి...

ఏనుగులు, గుర్రాలు త్రొక్కగా ఇంకా కొంతమంది నలిగిపోయారు. శత్రువులు నాన్నా ! కుమారా ! అని పిలుస్తూ భయంతో పారిపోయారు. మోహం వల్ల బలం, ఉత్సాహం నశించగా వారు ఒకరినొకరు తెలుసుకోలేకపోయారు. బాగా గాయపడిన కొడుకులను, తండ్రులను, మిత్రులను, సోదరులను రథాలమీద ఎక్కించి వారి కవచాలను విప్పి నీటితో గాయాలను కడిగారు. ద్రోణుడు చనిపోగా అలాంటి దుర్దశనందిన సైన్యాన్ని ఎవరు వెనక్కు తిప్పారో నీకు తెలిస్తే నాకు చెప్పు. గుర్రాల సకిలింతలు, ఏనుగుల ఘీంకారాలు, రథాల ఇరుసుల ధ్వనులు చాలా ఎక్కువగా వినపడుతున్నవి. కౌరవసేనా సముద్రంలో ఈ ధ్వనులు చాలా తీవ్రంగా వినిపిస్తున్నవి. మాటిమాటికి అవి వస్తూ మనవాళ్ళను వణికిస్తున్నవి. శరీరాలు గగుర్పొడిచేటట్లు భయంకరంగా వినిపిస్తున్న ఈ భయంకర ధ్వని ఇంద్రునితో గూడిన మూడులోకాలను మ్రింగివేస్తుందని నాకనిపిస్తున్నది. ఈ భయంకరమయిన ధ్వని వజ్రధారి అయిన ఇంద్రుని గర్జన అనుకొంటాను. ద్రోణుడు చనిపోతే ఇంద్రుడు వస్తున్నాడని స్పష్టమవుతున్నది. ధనంజయా! కౌరవసైన్యంలోనుంచి వస్తున్న మిక్కిలి భయంకరమయిన పెద్ద ధ్వని విని, రథికశ్రేష్ఠులు శరీరాలు గగుర్పొడిచి ఉద్విగ్నులయ్యారు. దేవేంద్రుని వలె పారిపోతున్న కౌరవసేనలను నిలిపి యుద్ధానికి యుద్ధరంగంలో వెనక్కు త్రిప్పుతున్న ఈ మహారథుడు ఎవరు ?" అర్జునుడు చెప్పాడు - "రాజా! శస్త్రత్యాగం చేసిన ద్రోణాచార్యుడు చనిపోగా కౌరవవీరులను గట్టిగా నిలబెట్టి సింహనాదం చేస్తున్నవాడు, తన బలపరాక్రమాలను ఆశ్రయం చేసుకొని భయంకర

కార్యం చేయటానికి కౌరవులచేత శంఖధ్వనులను చేయిస్తున్నవాడు ఎవరు అన్నది కూడా నీసందేహం? మహాబాహువు, మత్తగజ గమనం గలవాడు. లజ్జాశీలుడు, పరాక్రమంలో ఇంద్రవిష్ణుతుల్యుడు, కోపంలో యమునిలాగా ఉన్నవాడు, బుద్ధిలో బృహస్పతి సముడు, నీతిమంతుడు, మహారథుడు, భయంకర కార్యాలు చేసేవాడు.' కౌరవులకు అభయమిచ్చేవాడు అయిన ఆయనను గూర్చి చెపుతాను విను.

ఆ గర్జించేవాడు అశ్వత్థామ, ఆయన పుట్టినప్పుడు ద్రోణాచార్యుడు ఉత్తమోత్తములు, అర్హులు అయిన బ్రాహ్మణులకు ధనంతో పాటు వేయి ఆవులను దానం చేశాడు. పుట్టిన వెంటనే ఆయన ఇంద్రుని వాహనమయిన ఉచ్చైఃశ్రవం వలె సకిలించటం వల్ల, ముల్లోకాలతో కూడా భూమి కంపించింది. అది విని అశరీరవాణి అశ్వత్థామ అని ఆయనకు నామకరణం చేసింది. ఆ శూరుడే ఈనాడు గర్జిస్తున్నాడు. దిక్కులేని వానినిగా ద్రోణుని ధృష్టద్యుమ్నుడు క్రూరకర్మతో చంపాడు. ఆయనకు దిక్కయినవాడు ఇప్పుడు వచ్చాడు. నా గురువును ధృష్టద్యుమ్నుడు జుట్టుపట్టుకొని అవమానించాడు. ఆ తప్పును తన పౌరుషం ఎరిగిన అశ్వత్థామ ఎప్పటికీ క్షమించడు. ధర్మం తెలిసినా, నీవు రాజ్యలోభంతో అబద్ధం చెప్పి గురువును మోసం చేశావు. అనగా పెద్ద అధర్మం చేశావు. వాలివధ వల్ల రామునికి వలె ద్రోణుని పడగొట్టడం వల్ల చరాచరప్రాణులు గల ముల్లోకాల్లో నీ అపకీర్తి చిరకాలం నిలుస్తుంది. "యుధిష్ఠిరుడు సర్వధర్మాలు తెలిసినవాడు, నాకు శిష్యుడు. కాబట్టి ఇతడు నాతో అబద్ధం ఆడడు" అని ఆయన నిన్ను విశ్వసించాడు. కాని నీవు సత్యం అనే చొక్కా తొడుక్కుని నిజంగా అశ్వత్థామ అనే ఏనుగు హతం కాగా అశ్వత్థామ హతుడయ్యాడు అని ఆచార్యునికి అసత్యం చెప్పావు. అందువల్ల ఆయన శస్త్రాస్త్రాలు వదలి మమకారం వదలి అచేతనుడయినాడు.

రాజా! సహజంగా శక్తిశాలి అయినా ఆయన చాలా విహ్వలుడయ్యాడు. ఇదంతా నీవు చూశావు. ఆయన శోకపరవశుడు, పుత్రవత్సలుడు, యుద్ధ విముఖుడు అయ్యాడు. అలాంటి గురువును శాశ్వతమయిన ధర్మాన్ని విడిచి శస్త్రంచేత చంపించావు? శస్త్రాస్త్రాలు వదలివేసిన గురువును నీవు అధర్మంగా చంపించావు. ఆచార్యపుత్రు డయిన అశ్వత్థామ ధృష్టద్యుమ్నుని యమునికి గ్రాసం చేయబోతున్నాడు. నీకు శక్తి ఉంటే ఆయనను రక్షించు. ఇవ్వాళ మేము అందరం కలిసి కూడా, ధృష్టద్యుమ్నుని రక్షించలేము. అశ్వత్థామ అలౌకిక వ్యక్తి, సర్వప్రాణుల యందు మైత్రి చూపేవాడు. అలాంటివాడు తండ్రి జుట్టుపట్టుకోవటం అనే అవమానం పొందటం విని, యుద్ధంలో మనలను దహిస్తాడు. ఆచార్యుని ప్రాణరక్షణ కోరి, నేను కేకలు పెట్టి వారిస్తునా, శిష్యుడు స్వయంగా దురాని నాశనం చేసి గురువును

చంపాడు. మనకు ఇప్పటికి వయస్సులో చాలా భాగం గడిచింది. ఇంక స్వల్పం ఉన్నది. అందువల్లనే మన మనస్సు చెడిపోయింది. అందువల్లనే గొప్ప అధర్మం చేశాం. తండ్రి లాగానే మనలను ప్రేమించాడు, ధర్మానుసారం గూడా ఆయన మనకు పితృతుల్యుడే. అలాంటి గురువును స్వల్పకాలం అనుభవించే రాజ్యం కోసం చంపించాం. నరనాథా! ధృతరాష్ట్రుడు భీష్మద్రోణులసేవలో ఉండే తన పుత్రులతోపాటే ఈ రాజ్యాన్ని అంతా వారికి ఇచ్చాడు. మన శత్రువులు ఎల్లప్పుడు ఆచార్యుని గౌరవిస్తుండే వారు, వారివల్ల అలాంటి ఉత్తమ వృత్తిని పొందికూడా ఆచార్యుడు ఎల్లవేళలా తన పుత్రుని కంటే కూడా నన్నే ఆదరించేవాడు. ఆయన నన్ను నిన్ను చూస్తూనే ఆయుధం వదలి వేయగా హతుడయినాడు. యుద్ధంచేస్తున్న ఆయనను ఇంద్రుడు కూడా చంపలేడు. వృద్ధుడు, నిత్యోపకారి అయిన గురువుకు అయోగ్యులమయిన మనం రాజ్యం కోసం లోభ బుద్ధులమయి ద్రోహం చేశాం. ఆహా ! రాజ్య సుఖలోభంతో సాధువయిన ఈ ద్రోణుని చంపించాం. అయ్యో! చాలా దారుణమూ, పాప పూర్ణమూ అయిన పని మనం చేశాం గదా! **"అర్జునుడు నామీద గల ప్రేమతో అవసరమయితే కొడుకులను, సోదరులను తల్లిదండ్రులను, భార్యలను - సమస్తము నాకోసం వదలివేస్తాడు."** అని నా గురువు అనుకొనేవాడు. ప్రభూ! అలాంటి గురువును రాజ్యకాంక్షతో నేను ఇతరులు చంపుతుంటే ఉపేక్షించాను. రాజా! అందువల్ల తల క్రిందికికాగా నరకానికి పోతాను. బ్రాహ్మణుడు, వృద్ధుడు, ఆచార్యుడు, మహాముని, శస్త్రంవదలిన మహాత్ముడు అయిన ద్రోణుని రాజ్యం కోసం చంపించి నేను బ్రతికి ఉండటంకంటే మరణించటమే మేలు అనుకొంటాను."

197. భీముని రోష ప్రకటన, ధృష్టద్యుమ్నుడు స్వకృత్యముమ సమర్థించుట.

సంజయుడు చెప్పాడు "మహారాజా! అక్కడ ఉన్న మహారథులు అందరు అర్జునుని మాటలు విని, మౌనంగా ఉన్నారు. ఆయనకు అనుకూలంగా గాని వ్యతిరేకంగా గాని మాట్లాడలేదు. భీమసేనుడు కోపంతో అర్జునుని చీవాట్లు పెడుతున్నట్లు ఇలా అన్నాడు. "పార్థా! అరణ్యంలో ఉండే ముని, లేక ఏ ప్రాణిని దండించకపోవటం అనే కఠోర వ్రతాన్ని పాటించే బ్రాహ్మణుడు ధర్మోపదేశం చేస్తున్నట్లు ధర్మపన్నాలు వల్లిస్తున్నావు. సంకటస్థితినుంచి తనను ఇతరులను రక్షించేవాడు ? యుద్ధంలో శత్రువులను సంహరించటమే జీవిక గాగలవాడు, స్త్రీలను సజ్జనులను క్షమించేవాడు, క్షత్రియుడు. అతడే త్వరగా రాజ్యాన్ని, ధర్మాన్ని, కీర్తిని, సంపదను పొందుతాడు. ఆ నీవు సమస్త క్షత్రియగుణాలు

కలవాడివి, వంశోద్ధారకుడివి అయి ఉండి, మూర్ఖుడిలాగా మాట్లాడుతుండటం బాగాలేదు. నీ పరాక్రమం ఇంద్ర పరాక్రమం వంటిది. సముద్రం చెలియలి కట్టను దాటనట్లు నీవు ధర్మాన్ని అతిక్రమించవు. పదమూడు సంవత్సరాలు మనస్సులో కోపం దాచుకొని ధర్మాన్నే కాంక్షించే నిన్ను ఎవడు ఇప్పుడు తగురీతిగా ఆదరించడు ? నాయనా! నీ మనస్సు అదృష్టం వల్ల ఇవ్వాళ స్వధర్మాన్ని అనుసరిస్తున్నది. అదృష్టంవల్లనే నీ బుద్ధి సామ్యంగా ఉంటున్నది. ఇది సామాన్య విషయం కాదు. కాని ధర్మాన్ని పాటిస్తున్నా, శత్రువులు అధర్మంగా మన రాజ్యం అపహరించారు.

ద్రౌపదిని సభకీడ్చి అవమానించారు. మనకు తగని రీతిగా నారబట్టలను, చర్మాలను ధరింపజేసి, పదమూడేడులు అడవులపాలు చేశారు. ఉత్తమా! ఇలాంటి క్రోధాన్ని పెంచే సన్నివేశాలను ఓర్చుకొన్నాను. క్షత్రియ ధర్మ ప్రవృత్తితోనే ఇదంతా చేశాను. కాని ఇప్పుడు వాళ్ళు చేసిన నీచ కర్మలను, అపకారాలను, గుర్తు తెచ్చుకొని మన రాజ్యం అపహరించిన ఆ నీచులను, వారిని అనుసరించేవారిని నీతో కలిసి ఈనాడు సంహరిస్తాను. వెనక నీవు యుద్ధానికి వచ్చిన మనం యథాశక్తిగా శత్రువులను ప్రతిఘటిద్దాం అని చెప్పావు. కాని ఇప్పుడు మమ్ములను అసహ్యించుకొంటున్నావు. స్వధర్మాన్ని తెలుసుకోవాలని కూడా నీవు అనుకోవటం లేదు. నీవు ఇప్పుడు అసత్యవాది వయినావు. భయభీతులమయిన మమ్ములను, మాటలతో మా మర్మాలను ఛేదిస్తున్నావు. శత్రునాశకా! బాగా గాయపడిన వారిగాయాల్లో కారం చల్లినట్లు నీ పలుకుల ములుకులతో పీడితమయిన నా మనస్సును చీలుస్తున్నావు. మమ్ములను నిన్ను ఈ సమయంలో బాగా మెచ్చుకోవలసిన నీవు మెచ్చుకోవటం లేదు. ధార్మికుడి వయిన నీవు చేస్తున్న ఈ అధర్మాన్ని తెలుసుకోలేకపోతున్నావు. ధనంజయా! ఎదురుగా శ్రీకృష్ణుడు ఉండగా అశ్వత్థామను ప్రశంసిస్తున్నావు. అతడు నీలో పదహారో వంతు కూడా కాడు. నీ తప్పులను నీవే వెల్లడించుకొంటూ సిగ్గుపడాలి. భయంకరమయి, బంగారు మాలికలు గల్గి చాల బరువయిన ఈ గదతో కొట్టి కోపంతో భూమిని చీలుస్తాను, పర్వతాలను ముక్కలు చేస్తాను. ప్రభంజనం లాగా పర్వతాలంత ఎత్తున్న చెట్లను ధ్వంసం చేస్తాను. పార్థా! నన్ను ఎదిరించి యుద్ధానికి వచ్చే రాక్షస సమూహాలతో, అసురులతో, నాగులతో, మానవులతో కలసి వచ్చే ఇంద్ర సహితులయిన దేవతలను కూడా పారద్రోలుతాను. నరశ్రేష్ఠా! నేను ఇంతవాడిని, నీ సోదరుడను అని తెలిసి కూడా అశ్వత్థామకు భయపడటం నీకు తగదు. అర్జునా! సోదరులతో కూడా నీవు ఇలాగే ఉండు. నేను ఒక్కడినే గదాహస్తుడనై మహాయుద్ధంలో

ఈతనిని జయిస్తాను." పూర్వకాలంలో తీవ్రకోపంతో గర్జిస్తున్న నృసింహావతారుడయిన విష్ణుదేవునితో హిరణ్యకశిపుడు మాటాడినట్లు ధృష్టద్యుమ్నుడు, అర్జునునితో ఇలా అన్నాడు.

"అర్జునా! విద్వాంసులు యజ్ఞం చేయించటం, వేదం చెప్పటం, దానం, యజ్ఞం చేయటం, దానం పుచ్చుకోవటం, వేదాధ్యయనం అనేవి బ్రాహ్మణ కర్తవ్యాలుగా చెప్పారు. నేను చంపిన ద్రోణుడు ఈ కర్తవ్యాలలో దేనిలో ప్రతిష్ఠితుడు? ఎందుకు నన్ను నిందిస్తున్నావు. ద్రోణుడు స్వధర్మానికి దూరం అయినాడు. క్షత్రియధర్మాన్ని ఆశ్రయించాడు. ఆస్త్రాలతో మనలను అమానుషంగా చంపుతున్నాడు. చాలా నీచకార్యాలు చేశాడు. మాయను ప్రయోగిస్తున్న వానిని, తట్టుకొన వీలుగాని వానిని, బ్రాహ్మణుడ నని చెప్పుకొనే వానిని మాయగానే సంహరించటంలో అయుక్తం ఏముంది ? నేను ఆయనను అలా సంహరిస్తే అశ్వత్థామ కోపంతో భయంకరంగా గర్జిస్తున్నాడు. దానివల్ల నాకేం నష్టం ? ఇదేమీ ఆశ్చర్యమని నేను అనుకోవటం లేదు. అశ్వత్థామ కౌరవులను స్వయంగా రక్షించలేక యుద్ధం నెపంతో చంపింపజేస్తాడు. నీవు మహాధార్మికుడ వయి నన్ను గురుహంత అని నిందిస్తున్నావు. ద్రుపదపుత్రుడ నయిన నేను, ఆయన సంహారం కోసమే అగ్నికుండం నుంచి ఆవిర్భవించాను. ధనంజయా! యుద్ధరంగంలో కార్యాకార్యాలు సమంగాగల వానిని బ్రాహ్మణుడని గాని, క్షత్రియుడని గాని ఎలా చెప్పగలవు? పురుషశ్రేష్ఠా! అస్త్రజ్ఞానమే లేనివారిని కోపపరవశుడయి, బ్రహ్మాస్త్రాలతో చంపేవాడిని అన్ని ఉపాయాలు ప్రయోగించి ఎందుకు చంపగూడదు ? ధర్మార్థ తత్త్వాలు బాగా తెలిసిన అర్జునా ! స్వధర్మాన్ని వదలి పరధర్మాన్ని గ్రహించే విధర్మిని ధర్మజ్ఞులు విషతుల్యుడని చెపుతారు అని తెలిసికూడా నన్ను నిందిస్తావెందుకు ? ఘాతుకుడు, క్రూరు డయిన ఆయనను రథంమీదికి ఎక్కి చంపి, పడవేశాను. నిందకు తగని నన్ను అభినందించ వెందుకని ? పార్థా! ప్రళయకాల అగ్నివంటిది, ప్రజ్వలించే లౌకికాగ్నివంటిది, సూర్యునివంటిది, విషం వంటిదై, భయంకరమయిన ద్రోణశిరస్సును ఖండించాను. నన్ను మెచ్చుకోవెందుకు? ఆయన యుద్ధంలో నా బంధువులనే చంపాడు కాని ఇతరులను గాదు. ఆయన శిరస్సును ఛేదించినా నామనస్సు శాంతించలేదు. వెనక నీవు సైంధవుని శిరస్సును నిషాదదేశంలో పడ వేసినట్లు ఆ ద్రోణుని శిరస్సును నేను పడవేయలేదే అనే బాధ నా మనస్సును బాధిస్తున్నది. అర్జునా! శత్రువులను వధించకపోవటం అధర్మం అనేమాట వింటుంటాం. శత్రువును చంపటంగాని, శత్రువు చేతిలో మరణించటంగాని క్షత్రియ ధర్మంగదా! పాండవా! నీ తండ్రి మిత్రుడయిన భగదత్తుని నీవు చంపినట్లు, యుద్ధంలో నేను ధర్మానుసారమే శత్రువును చంపాను. యుద్ధంలో పితామహుని భీష్ముని పడగొట్టి ధర్మం అని అనుకొనే నీవు, పాపాత్ము డయిన శత్రువును చంపితే అది ధర్మం

అని ఎందుకు అనుకోవు ? మచ్చిక పడిన ఏనుగు తన మీద ఎక్కేవాళ్ళకు పడుకొని, తన శరీరాన్ని మెట్లుగా చేసినట్లు, మీతో సంబంధం కలిగిన తరువాత అవనతుడ నయిన నన్ను ఇలా అనటం తగదు. అర్జునా! నీ నోటి దురుసుతనాన్ని ద్రౌపది, ఉపపాండవుల ముఖం చూసి క్షమిస్తున్నాను గాని వేరే కారణం కాదు. మాకు ద్రోణాచార్యునితో వంశపరంపరగా వచ్చిన శత్రుత్వం సుప్రసిద్ధం. లోకానికి అంతకూ బాగా తెలిసిన ఈ విషయం మీకు తెలియదా పాండవులారా! అర్జునా! పాండవజ్యేష్ఠుడు అసత్యవాదీకాడు, నేను అధార్మికుడనూ కాను. శిష్యద్రోహి, పాపాత్ముడు, నిహతుడయ్యాడు. ఇంక యుద్ధం చేయి. విజయం నీదే."

198. సాత్యకి ధృష్టద్యుమ్నుల వాగ్యుద్ధము. కృష్ణాదులు అందరు కలిసి దానిని ఆపుట.

ధృతరాష్ట్రుడు అడిగాడు – "మహాత్ముడయిన ఆ ద్రోణుడు ఆరు అంగాలతో వేదాధ్యయనం చేశాడు. లజ్జాశీలుడయిన ఆయన యందు సాక్షాత్తుగా ధనుర్వేదం ప్రతిష్ఠితమయింది. ఆయన అనుగ్రహంతోనే దేవతలు కూడా సులభంగా చేయలేని అమానుషమయిన మహత్కార్యాలను నరశ్రేష్ఠులు సంగ్రామంలో చేస్తారు. అలాంటి మహానుభావుని తమందరి ఎదుటా పాపకార్యం చేసినవాడు, నీచుడు, క్రూరుడు, క్షుద్రుడు, గురుహంత అయిన ధృష్టద్యుమ్నుడు అలా నిందిస్తుంటే క్షత్రియులు కోప్పడలేదా? క్షత్రియజాతి, వారిక్రోధం నింద్యాలు. సంజయా! పాండవులు, భూమండలంమీద ఉన్న ధనుర్ధారులయిన రాజులు ద్రోణ నిందావచనాలు విని, ఏమన్నారో నాకు వివరించు."

సంజయుడు చెప్పాడు – "రాజా! క్రూరకర్మచేసిన ధృష్టద్యుమ్నుని మాటలు విని, అక్కడ ఉన్న రాజులంతా మౌనంగా ఉన్నారు. అర్జునుడు క్రీగంట కుటిలంగా ధృష్టద్యుమ్నుని చూసి, కన్నీటితో దీర్ఘంగా నిట్టూర్చి, ఛీఛీ! అన్నాడు. యుధిష్ఠిరుడు భీముడు, నకులసహదేవులు, శ్రీకృష్ణుడు, ఇంకా ఇతరులు సిగ్గుతో తలవంచుకొన్నారు. రాజా! అప్పుడు సాత్యకి ఇలా అన్నాడు. "అశుభ వచనాలు పలుకుతున్న నరాధముడు, పాపపురుషు డయిన వీనిని త్వరగా చంపేవాడు ఎవడూ ఇక్కడ లేడా? కుక్క మాంసం తినే చండాలుని బ్రాహ్మణులవలె, ఈ పాండవులందరూ దుష్కార్యం చేసిన నిన్ను తీవ్రంగా అసహ్యించుకొంటూ నిందిస్తున్నారు. పుణ్యపురుషులంతా నిందించే ఈ మహాపాపకార్యం చేయటమేకాక చక్కని ఈ సభలో ఆది గొప్పగా చెప్పటానికి సిగ్గుపడవేమి?

గురువును అధర్మంగా పడగొట్టలేదా? గురువును నిందిస్తున్న పాపాత్ముడవయిన నీ నాలుక నూరు చీలికలు కాదేమి? నీ శిరస్సు నూరు వ్రక్కలుకాదేమి? పాపకార్యం చేయటమే కాక ఉత్తమ వీరజనుల సభలో దాన్ని ప్రశంసిస్తున్న నీవు పాండవులకు, అంధక వృష్ణివంశీయులు అందరికీ నింద్యుడవే ! ఆలాంటి చేయగూడని పని చేసి గురువును ఆక్షేపిస్తున్న నీవు చంపదగినవాడివి. ఒక్కక్షణమయినా నీవు జీవించి ఉండటం వ్యర్థం. పురుషాధమా! ధర్మాత్ముడు, సజ్జనుడయిన గురువును జుట్టుపట్టుకొని సంహరించటాన్ని నీవు తప్ప ఇంక ధర్మాత్ముడయిన ఏ వ్యక్తి సమర్థిస్తాడు ? నీజ్ఞాతులలో పూర్వులు ఏడుతరాలవారు, తరువాత ఏడుతరాలవారు వంశ కళంకమయిన నీవు పుట్టటం వల్ల అపకీర్తిలో, నరకంలో మునిగిపోయారు.

నరశ్రేష్ఠుడయిన అర్జునుడు భీష్ముని చంపటాన్ని నీవూ అన్నావు. ఆ మహాత్ముడు స్వయంగానే తన పతనాన్ని నిర్ణయించుకొన్నాడు. పాపాలు చేసిన వారిలో ఘనుడయిన నీ సోదరుడు శిఖండియే ఆయనను చంపాడు. ఈ లోకంలో ద్రుపదపుత్రులకంటే పాపకార్యాలు చేసేవారు వేరొకరు లేరు. భీష్ముని సంహరించటానికి నీతండ్రియే ఆతనిని సృష్టించాడట గదా! ఆ మహాత్మునికి మృత్యువయిన ఆ శిఖండిని మీ నాన్నే రక్షించాడు. నీచులు, మిత్రులకు, గురువులకు ద్రోహం చేసిన పాంచాల వంశీయులు, ధర్మభ్రష్ట లయినారు. సోదరునితో గూడిన నీవల్ల నీ వంశీయులు అందరూ ఉత్తము లందరికి నింద్యులయ్యారు. ఇలాంటి మాటలు మళ్ళీ మాట్లాడితే వజ్రాయుధంతో సమానమయిన ఈ గదతో నీతల పగలగొడతాను. బ్రహ్మహత్య చేసిన నీ ముఖం చూసిన వారు ఆ పాప ప్రాయశ్చిత్తంగా సూర్యదర్శనం చేస్తారు. బ్రహ్మహత్య నీవు చేసిన మహాపాపం. దుష్కార్యం చేసిన ధృష్టద్యుమ్నా! నా ఎదుట, నా గురువు అర్జునుని, నాగురువుకు గురువయిన ద్రోణుని ఆక్షేపిస్తూ సిగ్గుపడ వేమి? నిలు, నిలు నా గదాఘాతాన్ని ఒక్కదాన్ని కాచుకో, నీవు కొట్టే గద దెబ్బలను అనేకం నేను సహిస్తాను."

ఈ రీతిగా సాత్యకి పరుషమయిన మాటలతో ఆక్షేపిస్తే ధృష్టద్యుమ్నుడు క్రోధావేశపూరితుడయి సాత్యకిని కోపంతో నవ్వుతూ ఇలా అన్నాడు. "సాత్యకీ ! నీ మాటలు బాగా వింటున్నా. నిన్ను క్షమిస్తున్నాను. అనార్యుడు, అయోగ్యుడయిన వాడు మంచివాడిని ఎప్పుడూ ఆక్షేపించాలనుకొంటాడు. లోకం క్షమాగుణాన్ని ప్రశంసిస్తుంది. పాపాత్ముడు క్షమార్హుడు కాడు. పాపాత్ముడు క్షమగల వానిని జయించినట్లు భావిస్తాడు. నీవు అల్పుడివి, నీచుడివి, పాపపుఆలోచనలు చేస్తావు. తలవెంట్రుక చివరినుంచి కాలిగోటి

చివరి దాకా పాపమగ్నుడివి కనుక నింద్యుడివి. అయినా నీవు ఇతరులను నిందింపజూస్తావు. చేతులు తెగిపోయి ప్రాయోపవేశం చేసిన భూరిశ్రవుని అందరూ వారిస్తున్నా చంపావు గదా! అంతకంటే పాపతరమయిన పని ఏముంది ? ముందుగానే నేను ద్రోణుని యుద్ధంలో దివ్యాస్త్రంతో మథించివేశాను. శస్త్రం వీడిన వానిని వధించాను. క్రూరాత్మా! అందులో పాపం ఏముంది ? సాత్యకీ! చేతులు తెగినవాడు, యుద్ధం చేయనివాడు, ప్రాయోపవేశం చేసి ముని అయినవానిని చంపినవాడు ఇతరులను ఎలా నిందిస్తాడు ? వీరుడయిన ఆ భూరిశ్రవుడు నిన్ను కాలితో తన్ని, భూమిమీద పడేసి లాగినప్పుడు పురుషశ్రేష్ఠుడి వయిన నీవు ఆయనను ఎందుకు చంపలేదు ? ముందు అర్జునుడు ఓడించిన ప్రతాపవంతుడయిన భూరిశ్రవుని అయోగ్యుడి వయిన నీవు చంపావు. ద్రోణుడు వేలకొలది బాణాలు ప్రయోగించి, పాండవ సేనను పారద్రోలిన ప్రతీచోటికి నేను వెళ్ళాను. అలాంటి నీవు స్వయంగా చండాలునివలె ఇలాంటి నీచకార్యం చేసి నింద్యుడివయి కూడా నన్ను పరుష వాక్యాలు ఎందుకు పలుకుతున్నావు ? వృష్ణివంశాధమా! ఇలాంటి పాపకర్మ చేసింది నీవే కాని నేను కాదు. పాపకర్మల పుట్ట అయిన నీవు ఇంక మాటాడకు. నోరుమూసుకుని ఉండు. ఇంకమీద నన్ను నీవు ఏమీ అనదగవు. ఇంక నీవు నన్ను ఏమయినా అనాలని అనుకోవటం చాలా నీచపుపని. అయినా నన్ను మళ్ళీ మూర్ఖతతో పరుషంగా ఏమయినా అంటే యుద్ధంలో నిన్ను యమనిలయానికి పంపుతాను.

మూర్ఖుడా! కేవలం ధర్మాన్నే పట్టుకొంటే జయింపవీలుగాదు. వాళ్ళు చేసిన అధర్మకార్యాలు చెపుతాను విను. సాత్యకీ! మొదటవారు అధర్మంతో యుధిష్ఠిరుని మోసం చేశారు. అధర్మంగానే ద్రౌపదిని అవమానించారు. మూర్ఖుడా! వాళ్ళు అధర్మంగానే పాండవుల సర్వస్వం అపహరించి, ద్రౌపదితో కూడా అడవులకు పాండవులను పంపారు. శత్రువులు అధర్మంగానే మద్రదేశాధీశుడైన శల్యుని తమ పక్షంలోకి లాక్కున్నారు. అలాగే అధర్మంగానే అభిమన్యుని చంపారు. భీష్ముని ఇంతకంటే అధర్మంగా చంపారు. ధర్మం బాగా తెలిసిన నీవు భూరిశ్రవుని అధర్మంగానే చంపావు గదా! సాత్యకీ! ఈ విధంగా ధర్మం తెలిసిన వారయినా జయాన్ని సంపాదించుకోవటానికి యుద్ధంలో శత్రువులూ, పాండవులూ కూడా అధర్మకార్యాలు చేశారు. ఉత్తమమయిన ఆ ధర్మం తెలియవీలుగానిది, అలాగే అధర్మంగూడా తెలియవీలుగానిది. కాబట్టి కౌరవులతో యుద్ధం చెయ్యి. వృథాగా యమ నిలయానికి పోకు."

ఇలాంటి పరుషమయిన, క్రూరమయిన మాటలు విన్న సాత్యకి ఏమాత్రం కదలకుండా నిశ్చలంగా ఉన్నాడు. ఈ మాటలు అన్నీ విని, సాత్యకి కోపంతో కన్నులు

ఎర్రబడగా రథంమీద ధనుస్సు ఉంచి, సర్పం బుసకొట్టినట్టు ఊర్పులు విడుస్తూ గద తీసుకొని, ధృష్టద్యుమ్నుని మీదకు దూకి "నిన్ను ఇంక పరుషంగా మాట్లాడను. వధార్హుడవయిన నిన్ను ఇప్పుడే చంపుతాను." అంటూ మహాబలుడు క్రోధ పూర్ణుడయి ధృష్టద్యుమ్నుని మీదికి యమునికే యముడై దూకుతున్న సాత్యకిని శ్రీకృష్ణుడు ప్రేరేపించగా మహాబలుడయిన భీమసేనుడు త్వరగా రథం మీదినుంచి దూకి, చేతులతో వారించాడు. క్రుద్ధుడయి దూకుతున్న సాత్యకిని భీముడు గట్టిగా పట్టుకొని ఆగలేక ఆయనతో పాటే ముందుకుపోయాడు. భీముడు తన కాళ్ళు రెండింటితో నేలను అదిమిపట్టి, నిలద్రొక్కుకొన్నాడు. బలిష్ఠులతో శ్రేష్ఠుడయిన సాత్యకిని ఆరవ అడుగులో బలంగా పట్టి, నిలిపివేశాడు. సహదేవుడు త్వరగా రథం మీదినుంచి దిగి, బలిష్ఠుడయిన భీముడు గట్టిగా పట్టుకొని ఉన్న సాత్యకితో మధురమయిన వాక్కులు ఇలా పలికాడు.

"మాకు అంధక వృష్ణులకంటె, పాంచాలురకంటె ఉత్తమమిత్రులు వేరే ఎవ్వరూ లేరు. అలాగే అంధక వృష్ణులకు ప్రత్యేకించి శ్రీకృష్ణునకు మమ్ములను మించిన మిత్రులులేరు. వృష్ణివంశీయా! పాంచాలులకు గూడా సముద్రాంతమయిన భూమి మీద వెదకి చూచినా పాండవ వృష్ణులను మించిన మిత్రులు లేరు. నీవు అనుకొన్నట్టుగానే మేము మీకు మిత్రులం, మీరు మాకు ఎలా మిత్రులో మీకు మేము అలాగే మిత్రులం. సర్వధర్మజ్ఞా! శినివంశశ్రేష్ఠా! మిత్రధర్మాన్ని గుర్తించి ధృష్టద్యుమ్నుని మీద వచ్చిన కోపం మాని, శాంతించు. ధృష్టద్యుమ్నుడు నిన్ను, నీవు ధృష్టద్యుమ్నుని పరస్పరం క్షమించుకోండి. మేము క్షమాపణనే కోరుతున్నాం. ఇప్పుడు శాంతిని మించింది ఇంకేముంటుంది ? మాన్యా! "ఈ రీతిగా సహదేవుడు సాత్యకిని శాంతింపజేయగా ధృష్టద్యుమ్నుడు మెత్తబడి నవ్వుతూ ఇలా అన్నాడు.

"భీమా! యుద్ధమదంతో విజృంభిస్తున్న ఈ సాత్యకిని వదలు, వదలు. మహాపర్వతాన్ని పెద్దగాలి లాగా నన్ను ఈయన చంపనియ్యి. ఈయన ఆవేశాన్ని యుద్ధాసక్తిని, జీవితాన్ని యుద్ధంలో పదునయిన బాణాలతో నశింపజేస్తాను. కాని ఇప్పుడు నేను ఏంచెయ్యగలను? ఇప్పుడు మహత్తరమయిన పాండవుల మహత్కార్యం వచ్చింది. ఇదిగో ఈ కౌరవులు మనమీదికి వస్తున్నారు. ఒకవేళ కౌరవులంతా మీదపడినా యుద్ధంలో అర్జునుడు వారిని అందరిని నిలువరించగలడు. ఇక్కడ నేను ఇతని శిరస్సును బాణాలతో నేలగూలుస్తాను,. ఇతడు యుద్ధంలో చేతులుతెగిన భూరిశ్రవునిగా నన్ను భావిస్తున్నాడు. ఈతనిని వదిలివేయి. నేను ఇతనిని గాని, ఇతడు నన్నుగాని ఇప్పుడు చంపాలి." ఇలా

ధృష్టద్యుమ్నుడు అనే మాటలను వింటున్న సాత్యకి పాము బుసకొట్టినట్లు శ్వాస వదులుతూ భీముని బాహువుల మధ్యలో ఉండి ఊగిపోతున్నాడు. ఆర్యా! బలవంతులు, బాహుబలంగల వారిద్దరు పోతరించి, వృషభాల్లాగా రంకెలు వేస్తుంటే శ్రీకృష్ణుడు, యుధిష్ఠిరుడు త్వరగా వారి మధ్యకు వచ్చి మహాప్రయత్నంతో వారిని చల్లబరిచారు. మహాధనుర్ధారులు కోపంతో బాగా ఎర్రబడిన కన్నులు గల వారిద్దరిని శాంతింపజేసి, ఆ క్షత్రియశ్రేష్ఠులు యుద్ధరంగంలో యుద్ధం చేయటానికి ఎదురుగా వస్తున్న శత్రువులను ఎదుర్కొన్నారు."

199. అశ్వత్థామ నారాయణాస్త్రప్రయోగము, దాని భీషణ విజృంభణము.

సంజయుడు చెప్పాడు – "అప్పుడు ద్రోణనందనుడు అశ్వత్థామ ప్రళయకాలంలో సర్వప్రాణి నాశానికి కాలం సృష్టించిన యమునివలె శత్రువులతో యుద్ధం చేశాడు. అశ్వత్థామ బాణాలతో శత్రువులను సంహరించి, శత్రువుల దేహా లనే మహాపర్వతాన్ని ఏర్పరిచాడు. దానికి ధ్వజాలు అనే చెట్లు, శస్త్రా లనే శిఖరాలు, మరణించిన ఏనుగు లనే గండ-శిలలు, గుర్రా లనే కింపురుషులు, ధనుస్సు లనే తీగెలు ఉన్నాయి. మాంసాశనాలయిన మృగా లనే పక్షులు, ప్రాణు లనే యక్షులు ఉన్నాయి. తరువాత ఆ నరశ్రేష్ఠుడు పెద్దగా సింహనాదం చేసి, పెద్దగొంతుతో నీ కుమారునికి తన ప్రతిజ్ఞను మళ్ళీ వినిపించాడు. దుర్యోధనా! యుధిష్ఠిరుడు ధర్మం అనే కంచుకాన్ని దాల్చి, యుద్ధం చేస్తున్న ఆచార్యుని శస్త్రం వదలమని చెప్పటంవల్ల ఆయన చూస్తుండగానే వాళ్ళ సైన్యాన్ని పారద్రోలుతాను. వాళ్ళను అందరినీ పారద్రోలి, నీచుడయిన ధృష్టద్యుమ్నుని సంహరిస్తాను. నన్ను ఎదిరించి, యుద్ధం చేస్తే వీరిని అందరినీ సంహరిస్తాను. నిజంగా నీకు మాట ఇస్తున్నాను. సైన్యాన్ని యుద్ధోన్ముఖం చెయ్యి." అది విన్న నీ పుత్రుడు మహత్తర సింహనాదం చేసి, సైన్యానికున్న భయాన్ని పోగొట్టి, సేనలను యుద్ధాభిముఖం చేశాడు. రాజా! అప్పుడు మళ్ళీ కౌరవపాండవ సేనలకు నిండుగా ఉన్న రెండు సముద్రాలకువలె సంగమం ఆరంభమయింది. అంతకుముందు భయపడినవారిని ప్రోత్సహించటం వల్ల కౌరవులు, ద్రోణమరణం వల్ల పాండవ పాంచాలురు అంతకుముందునుంచే ఉద్యుక్తులయినారు. నరనాథా ! పరమానంద పూర్ణులై తమముందు నిలిచి ఉన్నట్లు చూస్తున్న ఆవేశపూరితులయిన ఆ రెండు పక్షాలవారికి మహావేగం కలిగింది. పర్వతాన్ని పర్వతం, సముద్రాన్ని సముద్రం ఎదుర్కొని కొట్టుకొన్నట్లు కురుపాండవసేనల పోరు జరిగింది. అప్పుడు సంతోషపూర్ణులయిన కురుపాండవ సైనికులు వేలకొలది శంఖాలను పూరించారు. వేలకొలది యుద్ధభేరులను మ్రోగించారు. తీవ్రంగా

మథిస్తున్న సముద్రంలో మహా ఘోష కలిగినట్లు నీ సైన్యంలో పరమాద్భుతమయిన వీర ఘోష వినిపించింది.

అంతట అశ్వత్థామ పాండవ పాంచాల సేనలను ఉద్దేశించి, నారాయణాస్త్రాన్ని ప్రయోగించాడు. అప్పుడు పాండవసేనలను నాశనం చేస్తూ, నోళ్ళు తెరుచుకొని వెలుగుతున్న సర్పాలలాగా దీప్తాగ్రాలయిన బాణాలు వేలకొలది ఆవిర్భవించాయి. రాజా! ఆ మహాయుద్ధంలో ఒక్క క్షణంలో ఆ బాణాలు సూర్యకిరణాలలాగా వేగంగా దిక్కులను, ఆకాశాన్ని, సైన్యాలను కప్పివేశాయి. ఈ రీతిగానే నిర్మలమయిన ఆకాశంలో గ్రహాలు, నక్షత్రాలు లాగా ప్రజ్వలించే ఇనుప గుండ్లు కూడా ఆవిర్భవించాయి. నాలుగు చక్రాలు. రెండు చక్రాలు గల శతఘ్నులు (ఫిరంగులు), గదలు అసంఖ్యాకంగా వచ్చాయి. సూర్యకుండలాలు లాగా ప్రజ్వలించే పాడవయిన ములుకులు గల చక్రాలు వచ్చాయి. పురుషశ్రేష్ఠా! ఆ సమయంలో ఆకాశం అంతా శస్త్రాకారాలతో నిండి ఉండటం చూసి, పాండవ సృంజయసేనలు అధికంగా ఉద్వేగానికి లోనయ్యారు. జననాథా ! పాండవపక్షంలోని మహారథులు ఎంత తీవ్రంగా యుద్ధం చేశారో ఆ నారాయణాస్త్రం అంతగా పెంపొందింది. యుద్ధరంగంలో అంతటా ఆ నారాయణాస్త్రం అప్పుడు వధిస్తుంటే అగ్నితో దగ్ధులవుతున్నట్లు పరపక్షంవారు బాధలపాలయ్యారు. ప్రభూ! వేసవిలో ఎండు వెదుళ్ళను అగ్ని దహించినట్లు ఆ అస్త్రం పాండవసేనను దహించింది. ఆ అస్త్రం అన్నివైపులా వ్యాపించగా, దానివల్ల పాండవ సేన క్షీణిస్తుండగా, యుధిష్ఠిరునికి తీవ్రమయిన భయం కలిగింది. తన సైన్యం అచేతనమయి పారిపోవటం, అర్జునుడు మధ్యస్థుడులాగా ఉండటం చూసి, యుధిష్ఠిరుడు ఇలా అన్నాడు. "ధృష్టద్యుమ్నా! పాంచాల సేనతో పారిపో. సాత్యకీ! వృష్ణి సేనతో, అంధక సేనతో కలిసి మీ నివాసాలకు వెళ్ళండి. ధర్మాత్ముడయిన వాసుదేవుడు కూడా తనకు వీలయినది చేస్తాడు. లోకానికే మేలు కలిగేదాన్ని ఉపదేశించే ఈయన తనకు క్షేమంకరమయినది ఎందుకు చేయడు? ఇంక యుద్ధం చేయవద్దని సర్వసైన్యాలను నేను ఆజ్ఞాపిస్తున్నాను. నేను సోదరులతో కలిసి అగ్నిలో ప్రవేశిస్తాను. యుద్ధంలో పిరికివారు దాటలేని ద్రోణభీష్ములు అనే సముద్రాన్ని దాటి, అశ్వత్థామ అనే గుంటలో మునుగుతాను. నిరంతరం తన మేలును గోరే ద్రోణాచార్యుని నేను యుద్ధంలో నేలగూల్చాను. కాబట్టి అర్జునుని శుభాకాంక్ష త్వరగా పూర్తి అగుగాక. యుద్ధాలలో పెద్ద నేర్పులేని బాలుడయిన అభిమన్యుని క్రూరులయిన అనేకులు కలిసి యుద్ధంలో సంహరిస్తుండగా కాపాడలేకపోయాను. పుత్రసహితు డయిన ఆయన సభలోకి లాక్కొని వచ్చిన ద్రౌపది వేసిన ప్రశ్నకు సమాధానం ఇవ్వకుండా ఆమె

విషయంలో ఉపేక్షించాను. ఆ సమయంలో ఆమె మా దాస్యాన్ని నివారించింది.

ఆయన అర్జునుని వినాశం కోసం, యుద్ధంలో సైంధవుని కాపాడటం కోసం మహాప్రయత్నం చేసి తాను చేసిన ప్రతిజ్ఞను నిలబెట్టుకొన్నాడు. విజయంకోసం మేము అందరం ముందరికి వెళ్ళబోయాం. కాని ఆయన మమ్ములను వ్యూహద్వారంలోనే అడ్డుకొన్నాడు. వ్యూహంలోకి ప్రవేశించటానికి ప్రయత్నించిన విశాలమయిన మా సేనను కూడా ఆయన ఆపివేశాడు.

గుర్రాలు బాగా అలసిపోగా అర్జునుని చంపదలచి మీదికి దూకుతున్న దుర్యోధనునికి రక్షణకోసం సైంధవుని కాపాడటానికి ఆయనయే కవచం ఇచ్చాడు? బ్రహ్మాస్త్రవేత్త అయిన ఆయన నా జయంకోసం ప్రయత్నిస్తున్న పాంచాలురను సమూలంగా నేలగూల్చాడు. దుర్యోధనాదులు మమ్ములను అధర్మంగా రాజ్యంనుంచి వెళ్ళగొడుతుంటే మమ్ములను ఆయన శాంతింపజేయ ప్రయత్నించాడు గాని మా మేలుగోరి మా వెంట రాలేదు. ఆలా మామీద అపారమయిన ప్రేమను చూపించిన ఆయనను నేను చంపాను. అందుకని ఆయన కోసం బంధువుతో గూడా నేను మరణిస్తాను." ఇలా ధర్మరాజు చెపుతుండగా శ్రీకృష్ణుడు తొందరపడుతూ సైన్యాన్ని చేతులెత్తి వారిస్తూ ఇలా చెప్పాడు. "యోధులారా! త్వరగా మీ శస్త్రాస్త్రాలను క్రింద పడవేయండి. గుర్రాలు, ఏనుగులమీది నుంచి క్రిందికి దిగండి. పరమాత్మ అయిన నారాయణుడు ఈ అస్త్రాన్ని నివారించటానికి ఈ ఉపాయాన్నే నిశ్చయించాడు. ఏనుగులు, గుర్రాలు, రథాలమీది నుంచి అందరూ క్రిందికి దిగి, నేలమీదికి రండి. భూమిమీద నిరాయుధులుగా ఉన్న వారిని ఈ నారాయణాస్త్రం సంహరించదు. వీరులయిన మీరు అందరూ ఈ అస్త్రంతో ఎంత ఎక్కువ యుద్ధం చేస్తే కౌరవులు అంత బలవత్తరులు అవుతారు. వాహనా లన్నింటిని దిగి, అస్త్రాలను క్రిందపడవేసి, నమస్కరించే వారిని, దోసిలొగ్గే మానవులను ఈ అస్త్రం యుద్ధంలో సంహరించదు. ఎవరయినా మానసికంగానయినా దీనితో యుద్ధం చేస్తే పాతాళలోకంలో ఉన్నా వాళ్ళనందరిని ఈ అస్త్రం వధిస్తుంది." భారతా! శ్రీకృష్ణుని ఈ మాటలు విని, పరపక్షంలోని వారందరు శారీరకంగా, మానసికంగా తమ అస్త్రాలను వదలివేయ నిశ్చయించుకొన్నారు.

రాజా! ఈరీతిగా అస్త్రాదులను వదలివేయదలచిన వారిని చూసి భీమసేనుడు వారికి ఉత్సాహాన్ని హర్షాన్ని కలిగిస్తూ ఇలా అన్నాడు. "మన సైన్యంలో ఎవ్వరూ శస్త్రాలను వదలివేయవద్దు. అశ్వత్థామ వేసిన అస్త్రాన్ని నేను బాణాలు వేసి వారిస్తాను. సువర్ణమయమయిన బరువయిన ఈ పెద్ద గదతో నేను ద్రోణపుత్రాస్త్రాన్ని ముక్కలు ముక్కలు చేయటానికి కాలునివలె కొడతాను. సూర్యునితో సమానమయిన జ్యోతిః పుంజం లేనట్లే ఈ యుద్ధభూమిలో నావలె పరాక్రమవంతు డయిన వీరుడు ఇంకొకడు లేడు. ఐరావతం తొండంతో సమానమయిన

ఈ నాబాహువులను చూడండి. హిమవత్పర్వతాన్నయినా నేల గూల్చటానికి ఇవి సమర్థమయినవి. పదివేల ఏనుగులతో సమానమయిన బలం కలవాడిని ఈ లోకంలోని మానవులలో నేను ఒక్కడినే. దేవలోకంలో దేవతలలో ఇంద్రుడికి ఎలా పోటీ లేదో అలాగే నాకూ పోటీ లేదు. బాగా బలిసిన మూపులు గల నా బాహువుల బలం ప్రజ్వలిస్తూ, వెలుగుతున్న అశ్వత్థామ అస్త్రాన్ని నివారించటంలో ఎంత గొప్పదో చూడండి. నారాయణాస్త్రాన్ని ఎదుర్కొనగలవాడు లేకపోతే ఇవ్వాళ నేను దీన్ని కురుపాండవులు చూస్తుండగా ఎదుర్కొంటాను. అర్జునా! అర్జునా! బీభత్సా! గాండీవాన్ని క్రిందపడవేయకు. లేకపోతే నీకు చంద్రునికి లాగా కళంకం కలుగుతుంది. అది నీ నైర్మల్యాన్ని నాశనం చేస్తుంది." అర్జునుడు అన్నాడు "భీమా! నారాయణాస్త్రం, గోవులు, బ్రాహ్మణుల ఎదుట నా గాండీవం క్రిందపెట్టటం వ్రతం." ఇలా చెప్పగా భీముడు మేఘధ్వని గలిగి, సూర్యునివలె వెలిగే రథాన్ని ఎక్కి శత్రునాశకుడయిన అశ్వత్థామను ఎదుర్కొన్నాడు.

ఆ భీముడు భూమినంతా కంపింపచేస్తూ నీ సైన్యాన్ని భయపెడుతూ శంఖం పెద్దగా ఊదాడు. జబ్బలు చరిచాడు. ఆయన శంఖధ్వానాన్ని, జబ్బలు చరిచిన శబ్దాన్ని నీ సైనికులు విని, ఆయన చుట్టూ మూగి, బాణసమూహాలను కురిపించారు.

వేగవంతమయిన పరాక్రమం చూపే భీముడు క్షణమాత్రంలో అశ్వత్థామను సమీపించి, బాణ జాలం కురిపించాడు. అప్పుడు ద్రోణపుత్రుడు తనమీదికి దూకుతున్న భీముని నవ్వుతూ కొన్ని మాటలని, జ్వలించే ములుకులు గల్గి, అభిమంత్రితాలయిన బాణాలను ఆయన మీద కురిపించాడు. తీవ్రంగా జ్వలిస్తూ, నిప్పులు క్రక్కుతూ దీపిస్తున్న సర్పాలవంటి బాణాలు బంగారు నిప్పురవ్వల వలె ఆయనమీద పడ్డవి. రాజా! అప్పుడు యుద్ధరంగంలో భీమసేనుని శరీరం రాత్రిపూట మిణుగురు పురుగులు కప్పివేసిన పర్వతంలాగా కన్పించింది. మహారాజా! భీమసేనుడు అశ్వత్థామ అస్త్రం ఎదుట బాణాలు వేయసాగగా, అది గాలితోడు కాగా భగభగమండే అగ్నిలాగా ప్రచండవేగంగా పెంపొందసాగింది. భయంకరంగా ఆ అస్త్రం ప్రవృద్ధం అవుతుంటే చూసిన భీముడు తప్ప తక్కిన పాండవసైన్యాన్ని మహాభయం ఆవేశించింది. అప్పుడు వారు అందరూ శస్త్రాస్త్రాలను అన్నింటినీ వదలివేసి రథాలమీదినుంచి, ఏనుగులు, గుర్రాలమీదినుంచి క్రిందికి దిగారు. వాళ్ళంతా శస్త్రాలను క్రిందపారవేసి వాహనాల మీది నించి దిగగా మహత్తరమయిన ఆ అస్త్రశక్తి అంతా భీముని శిరస్సుమీద పడ్డది. అప్పుడు సమస్తభూతాలు, ప్రత్యేకించి పాండవులు తేజస్సుతో ఆవృతుడయిన భీముని చూసి, హాహాకారాలు చేశారు."

200. భీముని శ్రీకృష్ణుడు రథము మీది నుండి దించుట, నారాయణాస్త్రము ఉపశమించుట.

సంజయుడు చెప్పాడు "నారాయణాస్త్రం ఆక్రమించిన భీముని చూసి, అర్జునుడు ఆ తేజస్సును శాంతింపజేయటానికి వారుణాస్త్రంతో కప్పివేశాడు. అర్జునుని అస్త్రప్రయోగవేగం వలన, అస్త్రతేజస్సు కప్పివేయటం వలన భీముని వారుణాస్త్రం ఆవరించిందని ఎవ్వరూ గుర్తించలేదు. గుర్రాలు, సూతుడు, రథంతో కూడా భీముడు అశ్వత్థామ అస్త్రంతో చుట్టబడి అగ్నిలో అగ్నివేసినట్లు జ్వాలామాలికలతో తేరిపారజూడ వీలులేని వాడయ్యాడు. రాజా! తెల్లవారబోయేటప్పుడు గ్రహనక్షత్రాది జ్యోతిస్సులు అస్తమయపర్వతానికి చేరినట్లు అశ్వత్థామ బాణాలు భీముని రథంమీద వ్యాపించాయి. ఆ భీముడు, ఆయన రథం, గుర్రాలు, సూతుడు, అశ్వత్థామ ఆక్రమించగా బాణాగ్నిలో కన్పించలేదు. ప్రళయసమయంలో మహాగ్ని చరాచరజగత్తును అంతను దగ్ధంచేసి పరమాత్మ నోటిలోకి పోయినట్లు నారాయణాస్త్రం భీముని ఆవరించింది. సూర్యుని అగ్ని, అగ్నిని సూర్యుడు ప్రవేశించినట్లు ప్రవేశించిన ఆ తేజస్సులో భీముడు కన్పించలేదు. ఆ అస్త్రం ఆ రీతిగా భీమరథాన్ని ఆక్రమించటం, యుద్ధంలో ఎదురేలేని అశ్వత్థామ దాన్ని పెంపొందించటం, పాండవసైన్యం అంతా శస్త్రాస్త్రాలు వదలివేసి అచేతనంగా ఉండటం, పాండవ సేనలోని యుధిష్ఠిరాదులయిన మహారథులు విముఖులు కావటం చూసి, మహాతేజస్సులు, వీరులు అయిన కృష్ణార్జునులు త్వరగా రథంమీది నుంచి దూకి, భీముని వద్దకు పరుగెత్తారు.

తరువాత అశ్వత్థామ అస్త్రబలంతో కలిగిన ఆ మహాతేజస్సును బలిష్ఠులయిన వారు మాయతో ప్రవేశించారు. అప్పుడు శస్త్రాస్త్రాలు వీడి ఉండటం వల్ల, వారుణాస్త్రప్రయోగం వల్ల, కృష్ణార్జునుల సామర్థ్యం వల్ల, ఆ నారాయణాస్త్ర మహాగ్ని వారిని దహించలేదు. ఆ సమయంలో నరనారాయణులు నారాయణాస్త్రం ఉపశమించటానికి రథం మీదినుంచి భీముని, సమస్త శస్త్రాస్త్రాలను బలవంతంగా క్రిందికి లాగారు. అలా వారిద్దరూ బలవంతంగా లాగుతుంటే భీముడు చాలా పెద్దగా గర్జిస్తూనే ఉన్నాడు. అప్పుడు జయింప వీలుగాని అశ్వత్థామ నారాయణాస్త్రం పెంపొందుతూనే ఉంది. అప్పుడు కృష్ణుడు ఆయనతో 'భీమసేనా! ఏమిటిది ? ఇంతా మేము నివారిస్తున్నా యుద్ధం నుంచి విరమించవేమిటి ? ఈకౌరవులను యుద్ధంతో జయింప వీలయితే మేము, ఈ వీరశ్రేష్ఠులు యుద్ధం చేయక ఊరుకొంటామా? నీవాళ్ళమయిన మేము అందరం కూడా రథాలమీది నుంచి దిగాం కదా! కాబట్టి నీవు కూడా త్వరగా రథం మీదినుంచి తొలగు.' అని చెప్పి కృష్ణుడు పాములె బుసలు కొడుతూ కోపంతో కన్నులు ఎర్రబడిన భీముని రథం మీదినుంచి క్రిందికి వచ్చేటట్లు

చేశాడు. భీముడు రథంమీది నుంచి దిగి, ఆయుధాలు అన్నీ వదలివేస్తే శత్రుసంతాపకమయిన నారాయణాస్త్రం శాంతించింది. సహింపవీలుగాని మహాతేజోవంతమయిన ఆ అస్త్రం శాంతిస్తే దిక్కులు, విదిక్కులు అన్నీ నిర్మలం అయ్యాయి. మంగళకరంగా గాలులు వీచాయి. మృగాలు పక్షులు శాంతించాయి. దుర్జయమయిన అస్త్రం శాంతించగా వాహనాలు సంతుష్టాలయ్యాయి. భారతా! ఆ అస్త్రతేజస్సు అలా తొలగించగా చీకటి తొలగిన తరువాత ఉండే సూర్యునిలాగా భీముడు వెలిగాడు. హతశేషమయిన పాండవసైన్యం అస్త్రం శాంతించటం వల్ల నీ పుత్రుని సంహరించటానికి హర్షంతో సిద్ధమయి నిలిచింది.

మహారాజా! అస్త్రం అలా వ్యర్థం కాగా పాండవసైన్యం నిలద్రొక్కుకోగా దుర్యోధనుడు అశ్వత్థామతో ఇలా అన్నాడు. "అశ్వత్థామా! ఈ పాంచాల సైన్యం అంతా మళ్ళీ యుద్ధానికి సిద్ధమయింది. కాబట్టి మళ్ళీ నారాయణాస్త్రాన్ని ప్రయోగించు." ఆర్యా! నీ పుత్రుడు ఇలా చెప్పగానే అశ్వత్థామ నిట్టూరుస్తూ నీ పుత్రునితో ఇలా అన్నాడు. "రాజా! ఈ అస్త్రం ప్రయోగించిన తరువాత తిరిగిరాదు. మళ్ళీ దాన్ని ప్రయోగిస్తే ఆ ప్రయోగించిన వానినే నాశనం చేస్తుంది. సందేహం లేదు. ఈ అస్త్రానికి విరుగుడు వాసుదేవుడు ప్రయోగించాడు. అలా చేసి ఉండకపోతే రాజా! నిస్సందేహంగా సర్వశత్రు వధ జరిగి ఉండేది. ఓడిపోవటం గొప్పదా? మరణించటం గొప్పదా అంటే మరణమే శ్రేష్ఠంగాని ఓడటం గాదు. శత్రువులందరూ శస్త్రాలు వదలి శవాలులాగా అయినారు కాబట్టి మనం శత్రుజయం చేసినట్లే." దుర్యోధనుడు అడిగాడు - "అస్త్రవేత్తలలో శ్రేష్ఠుడవయిన ఆచార్యపుత్రా! నారాయణాస్త్రాన్ని రెండోసారి ప్రయోగించ వీలు కాకపోతే ఇతరాస్త్రాలతో గురుహంతకులను సంహరించు. దివ్యాస్త్రాలు అన్నీ మహాతేజస్వి అయిన శివునియందు, నీయందు నిలిచి ఉన్నాయి. నీవు తలుచుకొంటే కుపితుడయిన ఇంద్రుడు కూడా నీనుండి తప్పించుకొని పోలేడు."

ధృతరాష్ట్రుడు అడిగాడు - "ద్రోణాచార్యుడు వంచనతో హతుడయితే ఆ అస్త్రం వ్యర్థమయిపోతే దుర్యోధనుని మాటలు విని మళ్ళీ అశ్వత్థామ ఏం చేశాడు ? సైన్యాగ్రంలో నారాయణాస్త్రం నుంచి విముక్తులయి యుద్ధరంగంలో పోరాడటానికి వచ్చిన పాండవులను ఆయన చూచాడు గదా!" సంజయుడు చెప్పాడు "అశ్వత్థామ పితృమరణాన్ని తెలిసి, భయం వీడి, కోపంతో ధృష్టద్యుమ్నుని మీదికి దూకాడు. నరశ్రేష్ఠా! అలాగా ఎదుర్కొని ఇరవై అయిదు బాణాలు వేసి ధృష్టద్యుమ్నుని గాయపరిచాడు. మండుతున్న అగ్నిలా ఉన్న అశ్వత్థామను ధృష్టద్యుమ్నుడు మూడు ఆరు బాణాలు వేసి గాయపరిచాడు. పదుమపెట్టబడిన బాణాలతో సారథిని, పదునయిన నాలుగు బాణాలతో నాలుగు

గుర్రాలను కొట్టాడు. అశ్వత్థామను బాణాలతో కొట్టి, భూమిని వణికిస్తూ సర్వప్రాణుల ప్రాణాలను తీస్తున్నట్లుగా ధృష్టద్యుమ్నుడు పెద్దగా నవ్వాడు. రాజా! ధృష్టద్యుమ్నుడు 'చస్తేనే వెనుదిరగటం' అనుకొని అశ్వత్థామ మీదికే విజృంభించాడు. తరువాత ధృష్టద్యుమ్నుడు అశ్వత్థామ శిరస్సు మీద బాణవర్షం కురిపించాడు. అశ్వత్థామ తండ్రివధను గుర్తుచేసుకొని ధృష్టద్యుమ్నుని బాణాలతో కప్పివేశాడు. పది బాణాలతో కొట్టాడు. క్షురప్రాలు అనే రెండు బాణాలు వేసి, ఆయన ధ్వజాన్ని ముక్కలు చేసి, ఇతర బాణాలు వేసి, బాధించాడు. ద్రోణపుత్రుడు మహాయుద్ధంలో ధృష్టద్యుమ్నుని అశ్వసూత రథ రహితుని చేసి, క్రుద్ధుడయి, ఆయన అనుచరులను అందరినీ బాణాలు వేసి, పారద్రోలాడు. నరాధిపా! అప్పుడు పాంచాలసైన్యం భయభ్రాంతమై ఆర్తమయి పారిపోయింది.

ఒకరినొకరు ఆ సైనికులలో చూసుకోలేదు. యోధులు అందరు యుద్ధవిముఖులు కావటం, ధృష్టద్యుమ్నుడు పీడితుడు కావటం చూసి, సాత్యకి త్వరగా అశ్వత్థామ రథం మీదికి తన రథాన్ని పోనిచ్చాడు. సాత్యకి పదునయిన ఎనిమిది బాణాలు వేసి, అశ్వత్థామను బాధించాడు. క్రుద్ధుడయి, నానావిధాలుగా ఇరవయి బాణాలతో, సూతుని బాధించాడు. సన్నద్ధుడయి, చేయి తిరిగినవాడయి నాలుగు బాణాలతో నాలుగు గుర్రాలను, ధనుస్సును, ధ్వజాన్ని ఖండించాడు. దీని తరువాత గుర్రాలతో సహా ఆయన సువర్ణ భూషితమయిన రథాన్ని చిన్నాభిన్నం చేశాడు. యుద్ధభూమిలో ముప్పది బాణాలతో ఆయన ఎద బాగా గాయపరిచాడు. రాజా! ఈ రీతిగా అశ్వత్థామ బాణసమూహం చుట్టుముట్టగా ఏం చేయాలో తోచక నిలిచాడు. గురుపుత్రుడు ఈ స్థితిలో ఉండగా నీ పుత్రుడు కృపకర్ణాదులతో గూడి సాత్యకిని బాణాలతో చుట్టుముట్టాడు. దుర్యోధనుడు ఇరవై బాణాలతో, కృపాచార్యుడు ముప్పదితో, కృతవర్మ పదితో, కర్ణుడు ఏబదితో దుఃశాసనుడు నూరింటితో, వృషసేనుడు ఏడింటితో సాత్యకిని అంతటా నిశిత బాణాలతో వేగంగా కొట్టారు. అప్పుడు ఆ సాత్యకి ఆ మహారథులను అందరినీ ఒక్క క్షణంలో విరథులను, యుద్ధవిముఖులను చేశాడు. భరతశ్రేష్ఠా! అశ్వత్థామ ప్రాణం కుదుటపడగా దుఃఖార్తుడయి, మాటిమాటికి నిట్టూర్పులు విడుస్తూ చింతించాడు.

తరువాత ద్రోణపుత్రుడు ఇంకొక రథం ఎక్కి, వందలకొలది బాణాలను కురిపిస్తూ, సాత్యకిని వారించాడు. యుద్ధరంగంలో తనవైపు వస్తున్న అశ్వత్థామను చూసి, సాత్యకి మళ్ళీ ఆయనను విరథుని, విముఖుని చేశాడు. రాజా! అప్పుడు పాండవులు సాత్యకి పరాక్రమించటం చూసి, తీవ్రంగా శంఖాలను ఊదారు, సింహనాదాలు చేశారు. సాత్యకి ఆయనను విరథుని చేసి, వృషసేనుని మూడు వేలమంది మహారథులను

సంహరించాడు. కృపాచార్యుని పదిహేనువేల ఏనుగులను సంహరించాడు. శకుని యొక్క ఏబదివేల గుర్రాలను చంపాడు. అప్పుడు అశ్వత్థామ రథం ఎక్కి, సాత్యకిని సంహరించాలనే కోరికతో ఆయన వైపు వెళ్ళాడు. మళ్ళీ వచ్చిన ఆయనను చూసి, సాత్యకి క్రూరతరమయిన, పదునయిన బాణాలతో ఆయనను గాయపరిచాడు. కోపిష్ఠి అయిన అశ్వత్థామ సాత్యకివేసిన నానా విధబాణాలు బాగా తగిలి నవ్వుతూ ఇలా అన్నాడు. "సాత్యకీ! ఆచార్యుని చంపిన ధృష్టద్యుమ్నుని యందు నీకున్న పక్షపాతం నాకు బాగా తెలుసు. నాకు చిక్కిన ఆతనిని, నిన్ను రక్షించుకోలేవు. సాత్యకీ! ఒట్టుపెట్టి చెపుతున్నాను. పాంచాలురను అందరినీ సంహరించకుండా నేను శాంతిని పొందను. పాండవుల బలాన్ని, వృష్ణుల బలాన్ని అంతను కలిపి నిలిపినా సరే సోమకుల నందరినీ తప్పక చంపుతాను." ఈ విధంగా పలికి అశ్వత్థామ సాత్యకి మీద సూర్యకిరణంలాంటి ఉత్తమ తీక్ష్ణబాణాన్ని వదిలాడు. ఆయన వేసిన ఆ శ్రేష్ఠశరం సాత్యకిని ఛేదించి, భూమిని గూడా ఛేదించి, బుసకొట్టుతున్న పాములాగా ప్రవేశించింది. కవచం ఛిన్నాభిన్నం కాగా అంకుశం పోటులతో గాయపడిన ఏనుగువలె పెద్దపెద్ద గాయాలనుండి రక్తం కారుతుండగా రక్తసిక్తమయిన శరీరంతో సాత్యకి రథంమీద కూలబడ్డాడు. సూతుడు త్వరగా అశ్వత్థామ బారినుండి తప్పించి ఇంకొక రథం అవతలికి తమరథం పోనిచ్చాడు.

తరువాత మంచి పుంఖం, వంగిన ములుకు గల బాణంతో శత్రుతాపనుడయిన అశ్వత్థామ ధృష్టద్యుమ్నుని కనుబొమల మధ్య కొట్టాడు. ధృష్టద్యుమ్నుడు అంతకుముందే బాగా గాయపడినవాడు. మరల బాణపీడితుడయిన రథం మీదపడి, జెండా కర్రను ఊతగా పట్టుకొన్నాడు. సింహం చేతిలో దెబ్బతిన్న ఏనుగువలె ధృష్టద్యుమ్నుడు అశ్వత్థామ బాణపు దెబ్బతిన్నాడు. వెంటనే పాండవపక్షంలోని మహావీరులు అయిదుగురు చాలా వేగంగా అక్కడికివచ్చారు. అర్జునుడు, భీముడు, పౌరవుడయిన వృద్ధక్షత్రుడు, చేది దేశపు యువరాజు, మాలవ దేశీయుడయిన సుదర్శనుడు ఆ అయిదుగురూ ధనుస్సులను తీసుకొని ద్రోణ పుత్రుని అన్ని వైపులనుంచి చుట్టుముట్టారు. వారు ఇరవై ఆడుగులలో క్రుద్ధు డయిన గురుపుత్రుని చేరి తలా అయిదు బాణాలు అన్నిదిక్కుల నుండి సమానంగా వేశారు. ద్రోణనందనుడు సర్పాల్లాంటి ఇరవై అయిదు పదునయిన బాణాలతో ఒకేమారు ఆ వీరుల ఇరవై అయిదుబాణాలను నరికివేశాడు. అశ్వత్థామ పదునయిన ఏడు బాణాలతో పౌరవుడయిన వృద్ధక్షత్రుని, మాళవుడయిన సుదర్శనుని ఒక బాణంతో, అర్జునుని ఒక బాణంతో, భీముని ఆరు బాణాలతో కొట్టాడు.

రాజా! తరువాత ఆ మహారథులు అందరు బంగారు ఈకలుగల్గి, రాతిమీద

పదునుపెట్టబడిన బాణాలు ఒకేమారు వేసి, విడివిడిగా వేసి అశ్వత్థామను బాధించారు. చేది యువరాజు ఇరవై బాణాలతో, అర్జునుడు ఎనిమిది బాణాలతో అలాగే అందరూ కలిసి మూడేసి బాణాలతో గాయపరిచారు. తరువాత అశ్వత్థామ అర్జునుని ఆరింటితోను, కృష్ణుని పదింటితోను, భీముని ఐదింటితోను, చేది యువరాజును నాలుగింటితోను, మాళవ పౌరవులను రెండు రెండు బాణాలతోను కొట్టాడు. అశ్వత్థామ భీముని సారథిని ఆరుబాణాలతో గాయపరచాడు. ఆయన ధనుస్సును, జెండాను రెండింటితో కొట్టాడు. మళ్ళీ అర్జునుని బాణవర్షంతో వేధించి, ఘోరంగా సింహనాదం చేశాడు. బాగా పదునయి, మెరిసే మొనలు గల బాణాలను ముందు వెనక అశ్వత్థామ వేయగా ఘోరరూపాలయిన వాటితో భూమి, ఆకాశం, దిక్కులు, విదిక్కులు అన్నీ నిండిపోయాయి. అశ్వత్థామ తన రథానికి దగ్గరయిన సుదర్శనుని ఇంద్ర ధ్వజ సమానాలయిన రెండు చేతులను, శిరస్సును ఒకేమారు మూడు బాణాలు వేసి, ఛేదించాడు. ఆయన పౌరవుని రథశక్తితో గాయపరిచి, బాణాలతో ఆయన రథాన్ని నువ్వుగింజంత పొడిచేసి, మంచి గంధపు పూతగల ఆయన చేతులు నరికి, ఇంకొక బాణంతో శరీరంనుంచి శిరస్సు వేరయ్యేటట్లు ఖండించాడు. వేగవంతు డయిన అశ్వత్థామ కలువపూవుల మాలిక వంటి రంగుగల చేది యువరాజును ప్రజ్వలించే అగ్ని సమానమయిన బాణాలతో కొట్టి, గుర్రాలూ సూతునితో కూడా యముని కిచ్చాడు (చంపాడు). ఈ రీతిగా మాలవరాజును, వృద్ధక్షత్రుని, చేదియువరాజును తమ ఎదుటనే అశ్వత్థామ చంపటం చూసి భీముడు తీవ్ర కోపపరవశుడయ్యాడు.

ఆయన బాగా క్రుద్ధుడయి సర్పాల వంటి పదునయిన అనేక బాణాలతో అశ్వత్థామను కప్పివేశాడు. క్రోధరూపుడయిన అశ్వత్థామ పదునయిన బాణాలతో ఆ బాణవర్షాన్ని ధ్వంసం చేసి, భీముని గాయపరిచాడు. భీముడు క్షురప్రంతో ధనుస్సును ఖండించి, అశ్వత్థామను ఇంకో బాణంతో గాయపరిచాడు. ద్రోణపుత్రుడు విరిగిన ధనుస్సును వదలి ఇంకొక ధనుస్సు తీసుకొని బాణాలతో భీముని కొట్టాడు. అశ్వత్థామ భీములు బాగా వర్షించే మేఘాలవలె బాణ వర్షం కురిపించారు. బంగారు ఈకలు గల్గి, సానపెట్టిన, భీముని పేరుగల బాణాలు సూర్యుని మేఘసమూహంలాగా అశ్వత్థామను కప్పివేశాయి. అలాగే అశ్వత్థామ వేసిన వేలకొలది బాణాలు భీముని కప్పివేశాయి. ఈ రీతిగా అశ్వత్థామ బాణాలతో కప్పివేసినా, భీముడు ఏమాత్రం వ్యథ చెందలేదు. అది చాలా ఆశ్చర్యం అనిపించింది. అప్పుడు భీముడు యమదండ సమానాలయిన పది నారాచాలను ప్రయోగించాడు. ఆర్యా! ఆ బాణాలు అశ్వత్థామ మెడ ఎముకలను వేగంగా ఛేదించి, పుట్టలో పాములు దూరినట్లు దూరాయి. భీముడు తీవ్రంగా బాణాలతో కొట్టటంవల్ల

అశ్వత్థామ జెండా కర్ర మీదికి ఒరిగి కన్నులు మూసుకొన్నాడు. ఒక్కక్షణంలో తేరుకొన్న అశ్వత్థామ రక్తంతో తడిసి, కోపపూర్ణుడయి, భీముని రథంవైపు వేగంగా వెళ్ళాడు.

భారతా! ఆయన తీవ్ర తేజోవంతాలు, సర్పాలవంటి వంద బాణాలను ఆకర్ణాంతం లాగిన ధనుస్సునుంచి భీముని మీద వదిలాడు. యుద్ధంలో ప్రశంసనీయుడయిన భీముడు కూడా ఆయన పరాక్రమాన్ని లెక్కగొనక, ఉగ్రమయిన బాణ వర్షాలను త్వరగా సృష్టించి వదిలాడు. మహారాజా! అప్పుడు క్రుద్ధుడయిన అశ్వత్థామ భీముని ధనుస్సును ఖండించి, పదునయిన బాణాలతో ఆయన వక్షఃస్థలంలో కొట్టాడు. అంతట క్రుద్ధుడయిన భీముడు ఇంకో ధనుస్సు తీసుకుని, అయిదు పదునయిన బాణాలతో అశ్వత్థామను గాయపరిచాడు. కోపంతో కన్నులు ఎర్రబడిన వారు ఇద్దరు వర్షాకాలంలో రెండు మేఘాలవలె తీవ్రమయిన బాణవర్షాన్ని కురిపిస్తూ యుద్ధరంగంలో ఒకరినొకరు కప్పివేశారు. ఘోరమయిన కరతల శబ్దాలతో పరస్పరం భయపెట్టుతూ ఆవేశపూర్ణులయి, చేసిన దానికి బదులు తీర్చుకోవాలనే కోరికగల వారిద్దరు యుద్ధం చేశారు. శరత్కాలంలో నడినెత్తిమీదికి వచ్చి, ప్రకాశించే కిరణాలు గల సూర్యునివలె ఉన్న అశ్వత్థామ గొప్ప వింటిని లాగుతూ సమీపం నుంచి బాణాలు వేస్తున్న భీముని చూచాడు. ఆయన బాణాలు తీసుకోవటం, ధనుస్సులు ఎక్కుపెట్టటం, అల్లెత్రాడు లాగటం, బాణాలు విడవటంలో వ్యవధానాన్ని చూపరులు చూడలేకపోయారు. మహారాజా! బాణాలు వేస్తున్న అశ్వత్థామ మండలాకారమైన ధనుస్సు కొరవి వేగంగా త్రిప్పేటప్పుడు ఏర్పడే కాంతి చక్రంవలె అయింది. వందలు వేలుగా ఆయన ధనుస్సులో నించి విడిచిన బాణాలు ఆకాశంలో విశాలమయిన మిడతల దండులాగా కన్పించాయి. అశ్వత్థామ వదలిన సువర్ణభూషితాలయిన ఘోర బాణాలు నిరంతరంగా భీముని రథంమీద పడ్డాయి. భారతా! అక్కడ భీమసేనుని పరాక్రమం, బలం, శక్తి, ప్రభావం, ప్రయత్నం అద్భుతంగా కన్పించాయి. గ్రీష్మకాలం దాటిన తరువాత వర్షాకాలంలో మేఘాలనుంచి పుట్టి అంతటా పడుతున్న వానలాగా భీముడు అశ్వత్థామను వధింపదలచి బాణవర్షాన్ని కురిపించాడు. భీముని ధనుస్సును అల్లెత్రాటితో లాగుతుంటే అది మరొక ఇంద్ర ధనుస్సు లాగా విలసిల్లింది. ఆయన ధనుస్సునుండి వందలు, వేలకొలది బాణాలు యుద్ధంలో విలసిల్లే అశ్వత్థామను కప్పివేస్తూ వెలువడ్డాయి.

ఆర్యా! ఈ రీతిగా వారు బాణ సమూహాన్ని వదలుతుంటే, వాటి మధ్య గాలి కూడా దూరలేకపోయింది. మహారాజా! ఆ రీతిగా అశ్వత్థామ భీమవధను గోరి, బంగారంతో అలంకృతాలై, నూనెతో కడిగిన, చక్కని ములుకులు గల బాణాలను ప్రయోగించాడు. ఆ బాణాలను ఆకాశంలోనే భీముడు ఒక్కొక్కదాన్ని మూడు ముక్కలు చేస్తూ, అశ్వత్థామను

మించిపోయి 'నిలు, నిలు' అని అశ్వత్థామతో అన్నాడు. పాండునందనుడు ద్రోణ పుత్రుని వధింపదలచి భయంకరమయిన బాణ వర్షాలను మళ్ళీ కురిపించాడు. మహాస్త్రజ్ఞు డయిన అశ్వత్థామ అప్పుడు అస్త్రమాయతో ఆ బాణవర్షాన్ని నివారించి, భీముని ధనుస్సును ఖండించాడు. క్రుద్ధుడయిన ఆయన యుద్ధంలో భీముని అనేక బాణాలతో ఛేదించాడు. ధనుస్సు విరిగిపోగా, ఆయన చాలదారుణమయిన రథశక్తిని అశ్వత్థామ రథంమీదికి వేగంగా విసిరివేశాడు. పెద్ద ఉల్కలాగా వేగంగా తన మీద పడబోతున్న ఆ రథ శక్తిని అశ్వత్థామ కరనైపుణ్యం ప్రదర్శిస్తూ, పదునయిన బాణాలతో ఛేదించాడు. ఇంతలోనే భీముడు అందరినీ ఆశ్చర్యపరుస్తూ దృఢమయిన ధనుస్సును తీసుకొని, బాణాలతో అశ్వత్థామను కొట్టాడు. ద్రోణతనయుడు వంగిన ములుకు గల బాణంతో భీముని సారథి నుదురు చీల్చివేశాడు. బలిష్ఠుడయిన ద్రోణపుత్రుడు వేసిన బాణం బాగా తగిలి, భీముని సారథి గుర్రాలను, పగ్గాలను వదలి మూర్ఛపోయాడు. అప్పుడు సారథి మోహితు డయ్యాడు. రాజేంద్రా! విలుకాండ్రు అందరూ చూస్తుండగా భీమరథాశ్వాలు త్వరగా పరుగులు తీశాయి. యుద్ధరంగం నుంచి గుర్రాలు రథంలాక్కుపోగా వేగంగా తొలగిన భీముని చూసి, అశ్వత్థామ సంతోషంతో శంఖధ్వానం చేశాడు. అప్పుడు పాంచాలురు అందరూ భీముడూ, ధృష్టద్యుమ్నుని రథం వదలి భీతులయి దిక్కులకు పరుగులు తీశారు. చెల్లాచెదరయిన పాండవసేనను కల్లోలం చేస్తూ, బాణాలు కురిపిస్తూ, వేగంగా వెంబడించాడు. రాజా! యుద్ధంలో అశ్వత్థామ వధిస్తుండగా పాండవపక్షరాజులు ద్రోణపుత్ర భయంతో అన్ని దిక్కులకు పారిపోయారు."

201. అశ్వత్థామ ఆగ్నేయాస్త్రముతో ఒక అక్షౌహిణి పాండవ సేనను సంహరించుట. వ్యాసుడు శివశ్రీకృష్ణుల మహిమను చెప్పుట.

సంజయుడు చెప్పాడు "తమ సైన్యం అంతా భగ్నం కావటం చూసి, అర్జునుడు ద్రోణపుత్రుని జయింపగోరి, ఆ సేనను వారించాడు. రాజా! శ్రీకృష్ణార్జునులు ఎంత ప్రయత్నం చేసినా ఆ పాండుసైనికులు అక్కడ యుద్ధం చేయటానికి నిలువలేదు. అర్జునుడు ఒక్కడే సోమకుల స్వల్ప సమూహంతో, సోమకులతో, ఇతరులను కలుపుకొని కౌరవులను ఎదిరించటానికి తిరిగివచ్చాడు. తరువాత సవ్యసాచి అశ్వత్థామను సమీపించి, ఇలా అన్నాడు. "నీకున్న శక్తి, విజ్ఞానం, పరాక్రమం, పౌరుషం, కౌరవుల మీద ఉన్న ప్రేమ, మామీద ఉన్న ద్వేషం, నీకు సమృద్ధిగా ఉన్న తేజస్సు - ఇవి అన్నీ నామీద చూపించు. ఆ ద్రోణుని చంపిన ధృష్టద్యుమ్నుడే నీ పాగరు అణుస్తాడు. ధృష్టద్యుమ్నుని, కృష్ణునితో

గూడిన నన్ను ఎదుర్కొనుము. మదమెక్కిన నీ పొగరు ఇవ్వాళ యుద్ధంలో నాశనం చేస్తాను." ధృతరాష్ట్ర డిలా అడిగాడు. 'అశ్వత్థామ అంటే అర్జునునికి ప్రేమ ఉంది. ఇంతకుముందు ఎప్పుడూ అర్జునుడు ఇంత కఠినంగా మాట్లాడలేదు. మరి ఇప్పుడు ఎందుకని అర్జునుడు తన మిత్రుని తీవ్రంగా మాట్లాడాడు ?' సంజయుడు చెప్తున్నాడు. మహాప్రభూ! చేది యువరాజు హతుడు కావటం వల్లా, వృద్ధక్షత్రుడు, మాలవరాజు సుదర్శనుడు హతులు కావటం వల్లా, ధృష్టద్యుమ్నుడు, సాత్యకి, భీమసేనుడు పరాజితులు కావటం వల్లా, యుధిష్ఠిరుని వ్యంగ్య వచనాలు మర్మచ్ఛేదకాలు కావటం వల్లా, వెనుక కలిగిన బాధలు గుర్తువచ్చి ఆయన హృదయం గాయపడటం వల్లా, అర్జునునికి ఆచార్యపుత్రుని మీద కోపం మితిమీరింది. అందువల్ల ఆయన ఆచార్య తనయుని ఒక నీచవ్యక్తిని నిందించినట్లు తగని, అశ్లీలమయిన, అనిష్టమయిన, పరుషమయిన మాటలు అన్నాడు. వెంటనే అశ్వత్థామ కోపంతో నిఃశ్వసించాడు. అశ్వత్థామ అర్జునునిమీద, ప్రత్యేకించి శ్రీకృష్ణునిమీద చాలా కోపించాడు. ఆయన స్థిరంగా రథంమీద ఉండి, ఆచమనం చేసి, దేవతలు కూడా తట్టుకోలేని ఆగ్నేయాస్త్రాన్ని గ్రహించాడు. ఆచార్యపుత్రుడు కనిపించీ కనిపించని శత్రుసమూహాన్ని లక్ష్యం చేసుకొని, అన్నివిధాల కోపావేశంతో, పొగలేని అగ్నిలాగా ప్రజ్వలిస్తున్న ఆగ్నేయాస్త్రాన్ని అభిమంత్రించి, ప్రయోగించాడు.

అప్పుడు ఆకాశంలో భయంకరమయిన బాణ వర్షం ఏర్పడింది. అగ్నిజ్వాలలతో వ్యాప్తమయిన అది అర్జునుని మీదికే దూకింది. అప్పుడు ఆకాశంనుంచి ఉల్కలు పడ్డాయి. దిక్కులు కాంతి హీనమయ్యాయి. ఆ సైన్యాన్ని అంతను భయంకరమయిన చీకటి అలముకున్నది. రాక్షసులు, పిశాచాలు చాలా దగ్గరికి వచ్చి అరచాయి. వేడిగాడ్పులు వీచాయి. సూర్యుని వేడిమి క్షీణించింది. అన్ని దిక్కులలో కాకులు భయంకరంగా అరచాయి. ఆకాశంలో మేఘాలు రక్తం వర్షిస్తూ గర్జించాయి. పక్షులు, పశువులు, గోవులు అరిచాయి. ఉత్తమ తీవ్రపాలకులయిన సాధుపుంగవులు శాంతి హీనులయ్యారు. సర్వమహాభూతాలు గిరగిరా తిరిగినట్లయింది. సూర్యుడు గూడా తిరిగినట్లున్నాడు. తీవ్రజ్వరం వచ్చినట్లు మూడు లోకాలు తహ తహలాడాయి. భూమిమీద ఉండే నాగాలు ఆగ్నేయాస్త్రం తేజస్సుతో తపిస్తూ, భయంకరాగ్ని నుంచి తప్పించుకోవటానికి బుసకొడుతూ పైకి ఎగిరాయి. భరతవంశీయా! జలాశయాలు అన్నీ సలసల కాగటం వల్ల, నీటిలో పుట్టి, అందులో ఉండే ప్రాణులు ఏమాత్రం శాంతినందలేదు. గరుత్మంతునితో, వాయువుతో సమానమయిన వేగం గల బాణవర్షాలు చిన్నవి, పెద్దవి దిక్కుల నుంచి, విదిక్కుల నుంచి, ఆకాశాన్నుంచి, భూమినుంచి అంతటా పడసాగాయి. ద్రోణపుత్రుడు ప్రయోగించిన వజ్రాయుధ వేగంగల

ఆ బాణాలు తగిలి దగ్ధులవుతున్న శత్రువులు అగ్ని దగ్ధాలయిన చెట్లులాగా పడిపోయారు. ఆగ్నేయాస్త్రం జ్వాలలతో దగ్ధం అవుతూ, పెద్ద ఏనుగులు మేఘాలలాగా భయంకరంగా ఘీంకరిస్తూ నేలగూలాయి. నరనాథా! మరికొన్ని ఏనుగులు భయపడి, పూర్వం అడవిలో దావాగ్ని వ్యాపించినప్పుడు వలె నలుదిక్కులా సుడి తిరిగాయి. ఆర్యా! దావాగ్ని దగ్ధాలయిన చెట్లు పైభాగాల వలె గుర్రాల సమూహాలు, రథాల సమూహాలు కన్పించాయి. అక్కడక్కడ వేలకొలది రథసమూహాలు కాలిపడిపోయాయి. భారతా! ప్రళయకాలంలో సర్వప్రాణులను సంవర్తకమనే అగ్ని దహించినట్లు భయంతో ఉద్విగ్నమయిన ఆ పాండవసైన్యం దగ్ధం అయింది. ఆ మహాయుద్ధంలో దగ్ధం అవుతున్న పాండవసేనను చూసి, మీ పక్షంవారు ఆనందంతో సింహనాదాలు చేశారు. విజయ శోభితు లయిన మీవారు నానావిధాలయిన వేలకొలది యుద్ధవాద్యాలను సంతోషపరవశులయి, చాలా త్వరగా తీవ్రంగా మ్రోగించారు.

రాజా! ఆ మహాయుద్ధంలో ఒక అక్షౌహిణి సేన మొత్తమూ, అర్జునుడూ లోకం అంతా చీకటి కప్పుకొనగా కన్పించలేదు. క్రుద్ధుడయిన ద్రోణపుత్రుడు సృష్టించిన అస్త్రం లాంటి దాన్ని అంతకుముందు మేము వినలేదు, కనలేదు. మహారాజా! అప్పుడు అర్జునుడు సమస్తాస్త్రాల నాశనానికి బ్రహ్మదేవుడు సృష్టించిన బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించాడు. అప్పుడు ఒక్కక్షణంలో ఆ చీకటి అంతా తొలగింది. చల్లని గాలి వీచింది. దిక్కులు నిర్మలం అయ్యాయి. ఆగ్నేయాస్త్ర తేజస్సుతో పాండవుల ఒక అక్షౌహిణి సేన నామరూపాలు లేకుండా దగ్ధం కావటం మాకు అద్భుతంగా కన్పించింది. వీరులు, శ్రీకృష్ణార్జునులు అస్త్రవిముక్తులయి ఆకాశంలో చీకటిని పోగొట్టే చంద్ర సూర్యులవలె కన్పించారు. అప్పుడు అర్జునుడు, శ్రీకృష్ణుడు గాయపడకుండా ఉన్నారు. జెండాతో, జెండా కర్రతో, గుర్రాలతో, సానుకర్షంతో, ఉత్తమాయుధాలతో ఆగ్నేయాస్త్ర విముక్తమయి ఆ రథం భయంకరంగా ప్రకాశించింది. అంతట ఒక్కక్షణంలో హర్షపూర్ణులయిన పాండవ పక్షీయుల హర్షధ్వానాలు శంఖభేరీధ్వనులతో వినిపించాయి. అస్త్రప్రభావం వల్ల కృష్ణార్జునులు హతులయ్యారని ఉభయసేనలు అనుకొన్నాయి. అంతలో వారిద్దరు కలిసిరాగా చూచి సంతోషించాయి. చిన్న దెబ్బకూడా తగలని వారిద్దరూ హర్షపూర్ణులయి తమ శంఖాలను ఊదారు. పాండవులు సంతోషపూర్ణులు కావటం చూసి, మీవారు ఎక్కువగా వ్యధజెందారు. ఆ మహాత్ములు అస్త్రవిముక్తులు కావటం చూసి, అశ్వత్థామ చాలా బాధపడి 'ఇదేమిటి? ఇలా జరిగింది?' అని ఒక్క క్షణకాలం ఆలోచించాడు. రాజేంద్రా! ఇలా చింతించి దుఃఖ మగ్నుడయి అశ్వత్థామ సుదీర్ఘంగా, వేడిగా నిట్టూర్చి నిరుత్సాహపడ్డాడు. అప్పుడు అశ్వత్థామ ధనుస్సును వదలి, రథంమీదినుంచి దూకి 'ఛీఛీ! ఇదంతా మిథ్య' అని అంటూ యుద్ధరంగం నుంచి

పరుగెత్తాడు. ఆ తరువాత నల్లని మేఘం వంటి కాంతి గలవాడు, నిర్మలుడు, వేదాలకు నివాసమయినవాడు, వేదాలను విభజించిన వాడు, సరస్వతీ దేవికి నివాసమయిన వ్యాసమహర్షిని దర్శించాడు. కురువంశశ్రేష్ఠా! తన ఎదుట ఉన్న వ్యాసమహర్షిని చూసి, అశ్వత్థామ నమస్కరించి, చాలాదీనునిలా డగ్గుత్తికపడిన కంఠంతో ఇలా అన్నాడు. "మహర్షీ! ఇది మాయా? దైవేచ్ఛయా? ఇదేమిటి అర్థం కావటం లేదు. ఈ అస్త్రం మిథ్య ఎలాగయింది ? నా పొరపాటు ఏమిటి ? ఈ ఆగ్నేయాస్త్రంలో ఏమయిన విపరీతం జరిగిందా? సర్వలోకాలకు ఇది పరాభవమా? ఈ కృష్ణార్జునులు బ్రతికి బయట పడ్డారేమిటి? ఆహా! కాలాన్ని అతిక్రమించలేం గదా? నేను ప్రయోగించిన ఈ ఆగ్నేయాస్త్రాన్ని అసురులు గాని, గంధర్వులు గాని, పిశాచులు గాని, రాక్షసులు గాని, నాగులు గాని, యక్షులు గాని, పక్షులు గాని, మానవులు గాని ఏ రీతిగాను వ్యర్థం చేయలేరు. ఇది కేవలం ఒక్క అక్షౌహిణి సైన్యాన్ని మాత్రం చంపి, శాంతించింది. చాలా దారుణమయిన ఈ అస్త్రాన్ని నేను సర్వనాశకమని ప్రయోగించాను. మర్త్య ధర్ములయిన శ్రీకృష్ణార్జునులను ఇది ఎందుకు చంపలేదు? మహామునీ! నేనడిగిన దీనికి ఉన్నది ఉన్నట్లు చెప్పు. ఇదంతా యథార్థంగా వినదలచాను." వ్యాసమహర్షి ఇలా అన్నాడు - "వత్సా! ఆశ్చర్య పరవశుడవయి నీవు అడిగే దీనికి సమాధానం చెపుతాను. మనస్సును నిశ్చలం చేసుకొని విను.

శ్రీమన్నారాయణుడు మన పూర్వులకంటే పూర్వజుడు. ఆయనయే ఆదిదేవుడు, జగన్నాథుడు, లోకకర్త, స్వయంగా సర్వమూ చేయగలవాడు. సర్వలోకాలకు ఆద్యుడు. ఆది అంతం లేనివాడు. అచ్యుతుడు. వేదాలు, మునులు ఆయన తత్త్వాన్నే వ్యాఖ్యానిస్తాయి. కాబట్టి జగత్ప్రభువయిన ఆయనను మనస్సులో గూడా జయించశక్యం కాదు.

విశ్వకర్త అయిన ఆయన దేవకార్య సాధనకోసం ధర్మదేవత పుత్రుడుగా జన్మించాడు. మహాతేజస్వి, జ్వలిస్తున్న సూర్యునివంటి ఆయన హిమవంతం మీద ఉండి, తీవ్రమయిన తపస్సు చేశాడు. పద్మపత్రాక్షుడయిన ఆయన ఆరవై ఆరువేల సంవత్సరాలు వాయువునే ఆహారంగా తీసుకొంటూ, తన శరీరాన్ని శుష్కింపజేసుకొన్నాడు. మళ్ళీ ఆయన వెనక చేసిన దానికంటె రెండు రెట్లు ఎక్కువకాలం తపస్సుచేసి భూమ్యాకాశాల మధ్య భాగాన్ని తేజస్సుతో నింపాడు. ఆయన ఆ తపస్సుతో సాక్షాత్తుగా బ్రహ్మభూతుడు అయినాడు. అపుడు, విశ్వేశ్వరుడు, విశ్వానికి కారణం, జగత్పతి, ఓడింపవీలుగాని వాడు, సర్వదేవతాస్తుతుడు, అణువులకంటె అల్పతరమయిన అణువయినవాడు, పెద్దవాటికన్నిటికంటె పెద్దదయిన పరమేశ్వరుని దర్శించాడు. దుఃఖాన్ని దూరంచేసేవాడు కాబట్టి ఆయనను రుద్రు డంటారు. లోకపాలకులకందరికంటే శ్రేష్ఠుడు, పాపాలు పోగొట్టేవాడు. మంగళకరుడు,

జటాజూటధారి అందరికి చేతనదాయకుడు, చరాచర జగత్తుకు కారణమయినవాడు ఆయన. ఎవ్వరికీ నిరోధింప శక్యంకానివాడు. సులభంగా దర్శింపవీలుగానివాడు, దుష్టులను తీవ్రంగా కోపించేవాడు, విశాల హృదయుడు, సర్వక్లేశనాశకుడు, ఉత్తముల విషయంలో మిక్కిలి ఉదారహృదయుడు, దివ్యమయిన ధనుస్సు, అమ్ములపొదులను దాల్చినవాడు, బంగారు కవచం దాల్చినవాడు, అనంతమయిన బలపరాక్రమాలు గలవాడు. పినాకం అనే ధనుస్సును, వజ్రాన్ని చేతులలో ధరించిన వాడు. పరశువును, గదను పెద్ద ఖడ్గాన్ని దాల్చినవాడు, స్వచ్ఛమయిన వాడు, ముసలాయుధం గలవాడు, చంద్రశేఖరుడు, పులితోలు దాల్చినవాడు, పరిఘం దండం చేతులలో గలవాడు. ఆయన భుజాలకు చక్కని భుజకీర్తు లున్నవి, సర్పమే ఆయన జందెం, తన పార్షదులయిన భూతగణాలతో విరాజిల్లుతున్నాడు. ఆయన ఒక్కడే అద్వితీయుడు ఏకైక పరమాత్మ. సమస్త తపస్సులు ఒకే ఆకారం దాల్చినవాడు. అతి వృద్దులు ఆయనను ఉత్తమ వాక్కులతో స్తుతిస్తారు. జలం, దిక్కులు, ఆకాశం, భూమి, చంద్రసూర్యులు, వాయువు, అగ్ని, జగత్తును కొలిచేకాలం ఆయన స్వరూపం, ఆయన బ్రహ్మద్వేషుల నాశకుడు. మోక్షానికి హేతువు, దురాచారులయిన మానవులు ఆయనను దర్శించలేరు. **మనస్సు మంచి శోకపంతాపాలను అన్నివిధాలా దూరం చేసుకొన్న సదాచారులయిన ద్విజులు పాపనాశం జరిగిన తరువాత ఆయన దర్శనభాగ్యం పొందుతారు.** ఈ విశ్వం అంతా ఆయన స్వరూపమే. సాక్షాత్తుగా ధర్మదేవతయే. స్తుతించదగినవాడు. ఆ పరమేశ్వరుడే. ఆయన తపస్సు భక్తుల ప్రభావంతో అక్కడ ప్రత్యక్షమయ్యాడు. వాసుదేవుడు ఆ పరమేశ్వరుని దర్శించి మనస్సుతో, మాటలతో, శరీరంతో, అంతరాత్మతో ఆనందపులకితు డయ్యాడు. రుద్రాక్షమాలా విభూషితుడు, సర్వజ్యోతిస్సులకు ఉత్తమస్థానమయినవాడు, విశ్వవిధాతను దర్శించి నారాయణుడు నమస్కరించాడు. వరదాత, పార్వతీ దేవీ సహితుడు, సర్వాధిపుడు, అయిన ఆయన ఆమెతో క్రీడిస్తూ దర్శనం ఇచ్చాడు. జన్మరహితుడు, ఈశానుడు, అవ్యక్తుడు, కారణరూపుడు, స్వమహిమచ్యుతుడు కాని పరమాత్మను భూతగణాలు పరివేష్టించి ఉన్నాయి. శ్రీహరి నేలమీద మోకాళ్ళు ఆనించి, శిరస్సు మీద దోసిలి ఉంచి, భక్తిపూర్ణుడయి పద్మాక్షుడు, అంధక రాక్షసుని సంహరించిన విరూపాక్షు డయిన రుద్రునకు నమస్కరించి ఇలా స్తుతించాడు.

శ్రీనారాయణుడు అన్నాడు – "సర్వశ్రేష్ఠుడవయిన ఆది దేవా! నీ నుండియే ఆవిర్భవించినవారు, ఈ భూలోకాన్ని అధివహించి ఈ భువన రక్షకులయిన ప్రజాపతులు పూర్వం నీ సృష్టిని అంతను రక్షించారు. సురాసురులు నాగులు, రాక్షసులు, పిశాచాలు,

మానవులు, పక్షులు, గంధర్వులు, యక్షులు, విశ్వవ్యాప్తమయిన నానావిధ భూతసమూహాలు నీనుండియే జనించినట్లు మేము ఎరుగుదుము. ఇంద్రుడు, యముడు, వరుణుడు, కుబేరుడు, పితరులు, విశ్వకర్మ సుందరశిల్పకళల ఆవిర్భావం కూడా నీనుండియే కలిగింది. శబ్దం, ఆకాశం, స్పర్శ, వాయువు, రూపం, అగ్ని, రసం, జలం, గంధం, భూమి, కాలం, బ్రహ్మ, వేదం, బ్రాహ్మణులు, చరాచరాత్మకమయిన ఈ ప్రపంచం అంతా నీనుండియే ఆవిర్భవించింది. **నీటినుంచి జలబిందువులు వేరయి మళ్ళీ ఆ జలంతో కలిసిపోతాయి. అలాగే సమస్త ప్రాణులు జననమరణాలను పొంది, నీలోనే లీనం అవుతాయి.** అనే విషయాన్ని తెలుసుకున్న విద్వాంసుడు నీ సాయుజ్యం పొందుతాడు. అంతఃకరణంలో దివ్యాలు, అమృత స్వరూపమయిన రెండు పక్షులు (ఈశ్వరుడు, జీవుడు) నివసిస్తూంటాయి. సప్తధాతురూపాలయిన సప్త అశ్వత్థవృక్షాలు ఉన్నాయి. అవి వాటిని రక్షిస్తుంటాయి. వేదవాక్కులే ఆ వృక్షాల వివిధ శాఖలు, ఇంకా పది రకాల వస్తువులు (ఇంద్రియాలు) ఉన్నాయి. అవి పాంచ భౌతికమయిన శరీర నగరాన్ని ధరిస్తుంటాయి. ఇవి అన్నీ నీవు సృష్టించినవే. అయినా నీవు వీటన్నిటికంటే ఇతరుడవే. భూతం, వర్తమానం, భవిష్యత్తు అజేయమయిన కాలం – ఇవి అన్నీ నీ స్వరూపాలే. ఇక్కడ ఉన్న సమస్తలోకాలు నీనుంచి కలిగినవే. నేను మిమ్ములను సేవించే భక్తుడను, నన్ను నీవాడిని చేసుకో, కీడు చేసేవారిని రక్షించి నన్ను హింసించవద్దు. నీవు జీవాత్మకన్న అభిన్నుడవు అనే విషయాన్ని అనుభవంతో తెలుసుకొనేవారికి అందరికి ఆత్మవు అని తెలుసుకొన్న విద్వాంసుడు విశుద్ధ బ్రహ్మభావం పొందుతాడు. దేవశ్రేష్ఠా! నేను నిన్ను గౌరవిస్తూ ఈస్తోత్రం చేశాను. స్తుతికి అర్హుడ వయిన పరమాత్మను నిన్ను చాలా కాలంనుంచి అన్వేషిస్తున్నాను. సంస్తుతుడ వయిన నీవు మాయను దూరం చేసి నాకు కావలసిన దుర్లభవరాలను ప్రసాదించు."

వ్యాసుడు చెప్పాడు – "ద్రోణపుత్రా! నారాయణ ఋషి ఇలా స్తుతించగా అచింత్య స్వరూపుడు, పినాకధారి, నీలకంఠు డయిన శంకరుడు ఋషులు స్తోత్రం చేయగా యోగ్యుడు, దేవ శ్రేష్ఠుడయిన నారాయణ మహర్షికి వరాలనిచ్చాడు. శ్రీభగవానుడు అన్నాడు – "నారాయణమహర్షీ! నా అనుగ్రహంవల్ల నీవు మానవులు, దేవతలు, గంధర్వుల జాతుల వారిలో అనంతమయిన బలపరాక్రమ సంపన్నుడివి అవుతావు. దేవతలు, అసురులు, నాగులు, పిశాచాలు, గంధర్వులు, యక్షులు, రాక్షసులు, సువర్ణులు, ఉరగులు, సింహ వ్యాఘ్రాది పశుజాతులు నీ వేగాన్ని సహించలేరు. దేవతల్లో గూడా ఎవ్వరూ నిన్ను యుద్ధాల్లో జయించలేరు. నా అనుగ్రహంవల్ల, నిన్ను ఎవ్వడూ శస్త్రంతో గాని, వజ్రంతో గాని, అగ్నితో గాని, వాయువుతో గాని, తడిసినదానితో గాని, ఎండినదానితో గాని,

జంగమప్రాణితో గాని, స్థావరంతో గాని, బాధించలేరు. యుద్ధభూమిలోకి వెళితే నీవు నాకంటే కూడా అధికుడివి అవుతావు." ఈ విధంగా శ్రీహరి పూర్వం వరాలు పొందాడు. ఆ దేవుడే ఈయన అయి మాయతో జగత్తును మోహింపజేస్తూ సంచరిస్తున్నాడు నారాయణుని తపస్సు వలననే నరుడు అనే మహాముని జన్మించాడు. ఈ దేవునితో ఆయన సమానుడనీ, ఆ నరుడే ఈ అర్జునుడని తెలుసుకో. ఈ ఋషులు ఇద్దరు ముఖ్యదేవతలు, బ్రహ్మ, విష్ణువు, రుద్రులలో విష్ణురూపులు, మహత్తర తపస్సు చేసినవారు, వీరు ఇద్దరు ధర్మమర్యాదను కాపాడుతూ లోకరక్షణకోసం ప్రతియుగంలో అవతరిస్తుంటారు. మహామేధావీ! నీవుగూడా (నీ పూర్వజన్మలో) నారాయణ మహర్షివలె జ్ఞానివై ఆయన వలెనే సత్కార్యాలు, మహాతపస్సు చేసి' దాని ప్రభావంతో పూర్ణతేజస్సును, క్రోధాన్ని ధరించే రుద్రభక్తుడి వయినావు. సమస్త జగత్తును శివమయంగా భావించి, ఆ దేవుని ప్రసన్నుని చేసుకోవటానికి నీవు నానా విధాలయిన కఠోరనియమాలను పాటిస్తూ, నీ శరీరాన్ని శుష్కింపజేసుకొన్నావు. గౌరవప్రదా! నీవు పరమపురుషుడయిన శంకరుని ఉజ్వలమయిన ఉత్తమ విగ్రహాన్ని ఏర్పరచి, హోమజపాలతో పాటు నానావిధ నివేదనలతో ఆయనను ఆరాధించావు. గతజన్మలో నీవు అలా పూజించగా ఆయన సంతుష్టుడయినాడు. విద్వాంసుడా! నీ మనస్సులో ఉన్న అన్ని వరాలను సమృద్ధిగా ఇచ్చాడు. **జన్మం, కర్మం, యోగం అనేవి నీకు, వారికి పుష్కలంగా ఉన్నాయి. కాని ఆ నరనారాయణులు శివలింగ రూపంగా శంకరుని అర్చించగా నీవు ప్రతియుగంలో ప్రతిమగా అర్చించావు. పరమేశ్వరుడు సర్వస్వరూపుడని తెలుసుకొని ఆయనను లింగంలో పూజించేవాని యందు ఆత్మయోగం (ఆత్మ పరమాత్మతత్త్వజ్ఞానం) శాస్త్రయోగం (వేదాధ్యయనాదుల వల్ల కలిగే జ్ఞానం) సుస్థిరంగా ఉంటాయి.*** ఈరీతిగానే సర్వకర్త అయిన ఒక్క శంకరునే దేవతలు, సిద్ధులు, మహర్షులు పూజిస్తూ కావలసిన వాటిని కోరుతుంటారు. రుద్రభక్తు డయిన శ్రీకృష్ణుడు రుద్రుని నుండి సంభవించినవాడే. సనాతను డయిన శ్రీకృష్ణునే యజ్ఞాదులతో అర్చించాలి. **శివలింగాన్ని సర్వభూతాల ఉత్పత్తి స్థానం అని తెలుసుకొని అర్చించేవాని యందు పరమేశ్వరుడు అధిక వాత్సల్యం కలిగి ఉంటాడు.**** సంజయుడన్నాడు - వ్యాసమహర్షి మాటలు విన్న మహారథుడయిన అశ్వత్థామ శంకరునికి

---

* సర్వరూపం భవం జ్ఞాత్వా లింగే యోఽర్చయతి ప్రభుమ్ ।
ఆత్మయోగాశ్చ తస్మిన్వై శాస్త్రయోగాశ్చ శాశ్వతాః ॥ 93

**సర్వభూతభవం జ్ఞాత్వా లింగమర్చతి యః ప్రభో ।
తస్మిన్నభ్యధికాం ప్రీతిం కరోతి వృషభధ్వజః ॥ 96

నమస్కరించి, శ్రీకృష్ణుని మహత్తును అంగీకరించాడు. స్వాధీనమనస్కు డయిన ఆయన శరీరం పులకరించగా వ్యాస మహర్షికి నమస్కారంచేసి, సైన్యాన్ని చూసి, యుద్ధ విరమణ చేయించాడు. నరనాథా! పాండవసైన్యాలు యుద్ధవిరామం పాటించాయి. ద్రోణవధ వల్ల దీనులయిన కౌరవసేనలు గూడా యుద్ధం విరమించాయి. వేదపారగుడు, బ్రాహ్మణుడు అయిన ద్రోణుడు పాంచాలసేనను ఐదురోజులు యుద్ధంలో వధించి బ్రహ్మలోకానికి వెళ్ళాడు."

202. వ్యాసమహర్షి శివమహిను వర్ణించుట. ద్రోణపర్వశ్రవణ ఫలము.

ధృతరాష్ట్రుడు అడిగాడు – "సంజయా! అతి రథుడయిన ఆ ద్రోణుని ధృష్టద్యుమ్నుడు చంపిన తరువాత నావాళ్ళు, పాండవులు ఏం చేశారు ?" సంజయుడు చెప్పాడు – "ధృష్టద్యుమ్నుడు అతిరథుడయిన ద్రోణుని వధించగా కౌరవసేనలు కకావికలు అయ్యాయి. అర్జునుడు తనకు విజయ మిచ్చిన ఆ మహాశ్చర్యకర సన్నివేశాన్ని చూసి, అకస్మాత్తుగా అక్కడికి వచ్చిన వ్యాసమహర్షిని ఇలా ప్రశ్నించాడు. "మహర్షీ! నిర్మలాలై, శూరసంహారకాలయిన ఆయుధాలతో శత్రువులను సంహరించాను. అప్పుడు నాకు ముందు అగ్నివలె ప్రకాశిస్తున్న మహాపురుషుడు వెళ్ళడం చూచాను. మహామునీ! ప్రజ్వలిస్తున్న శూలాన్ని పైకెత్తి, ఆయన వెళ్ళిన దిక్కున ఉన్న నా శత్రువులు ధ్వంసం అయ్యేవారు. ఆయన నాశనం చేసిన నా శత్రువులను చూసి జనులు నేను చంపాను అని అనుకొనేవారు. ఆ ముందు సైన్యాలను ధ్వంసం చేస్తుండగా ఆయన వెనక నేను వెళ్ళాను. భగవానుడా! తేజస్సుతో సూర్యసమానుడు, శూలాయుధుడుగా నేను చూసిన ఆ పురుషోత్తముడెవరో నాకు తెలుపగోరుతాను. ఆయన పాదాలతో నేలను తాకలేదు. చేతిలో ఉన్న శూలాన్ని వదలలేదు. ఆయన తేజస్సుతో చేతదాల్చిన శూలంనుంచి వేలకొలది శూలాలు వెళ్ళిపడేవి." వ్యాసమహర్షి చెప్పాడు – "పార్థా! ఆయన ప్రజాపతులలో ప్రథముడయిన తేజోమయ పురుషుడు. అంతర్యామి, సర్వసమర్థుడు, భూలోకం, భువర్లోకం మొదలయిన భువనాలు అన్నీ ఆయన స్వరూపమే. దివ్యశరీరధారి, సర్వలోక నియామకుడు, వరదాత అయిన శంకరుని దర్శించావు. అభీష్టప్రదాత, సర్వభువనాధిపతి అయిన ఆ దేవుని శరణందు. ఆయన మహాదేవుడు, విశాలహృదయుడు, సర్వేశ్వరుడు, జటాధారి, ప్రభువు, ముక్కంటి, మహాభుజుడు, ఆయన శిరస్సు మీద శిఖ, శరీరం మీద వల్కలమూ ఉన్నాయి. మహాదేవుడు, సర్వపాపహారి, స్థిరమయినవాడు, వరదాత, లోకాధిపతి, జగత్తుకు ముఖ్యుడు, ఓటమి లేనివాడు, జగత్తుకు ప్రీతికలిగించేవాడు, సర్వేశ్వరుడు ఆయన. ఆయన జగత్తుకు ఉత్పత్తి

స్థానం. బీజం, జయశీలుడు. జగత్తుకు గతి ఆయనే. విశ్వమే ఆయనకు ఆత్మ - విశ్వాన్ని ఆయనే సృష్టిస్తాడు. విశ్వమే ఆయనరూపం. ఆయన మహాయశస్వి. జగత్తుకు ఆయన ప్రభువు, ప్రపంచంలోనే శ్రేష్ఠుడు, సమస్తకర్మలకు ఈశ్వరుడు, సుఖకారకుడు, స్వయంభువు, సర్వ ప్రాణులకు అధిపతి, భూత, భవిష్యత్ వర్తమానాలకు కారణం. యోగం, యోగేశ్వరుడు, సర్వలోకప్రభువులకు అధిపతి, అన్నిటికంటే శ్రేష్ఠుడు, జగత్తుకంటే గొప్పవాడు. శ్రేష్ఠతమమయిన పరమేష్ఠికూడా ఆయనయే. మూడులోకాలు సృజించేవాడు, ముల్లోకాలకు ఆశ్రయం అయినవాడు, శుద్ధాత్ముడు, భవుడు, భీముడు, చంద్రుడు సిగపూవుగా గలవాడు ఆయన. శాశ్వతుడు, భూమిని ధరించేవాడు, ప్రకాశన శీలుడు, సమస్త వాక్పతులకు అధిపతి, జయింపవీలుగానివాడు, జగత్పతి, జనన మరణాలకు ముసలితనానికి అతీతుడు. ఆయన జ్ఞానస్వరూపుడు, జ్ఞానం చేత పొందదగినవాడు, జ్ఞానంతో శ్రేష్ఠుడు. ఆయనను తెలుసుకోవటం అంతతేలిక కాదు. భక్తులకు దయతో మేలు చేసే వరాలను ఇచ్చేవాడు.

అర్జునా ! ఆయన పారిషదులు నానావిధాలయిన రూపాలతో విలసిల్లేవారు. మరుగుజ్జులు, జటాధారులు, బోడివారు, కురుచ మెడలు గలవారు, బానకడుపులవారు, పెద్ద శరీరంగలవారు, గొప్ప ఉత్సాహవంతులు. కొంతమంది పెద్ద చెవులుగలవారు. వారి ముఖాలు పాదాలు వికృతంగా ఉంటాయి. వేషాలు గూడా వికారంగా ఉంటాయి. మహాదేవుడు, మహేశ్వరుడు అయిన ఆయనను ఇలాంటివారు పూజిస్తుంటారు. ఆయనే పరమశివుడు. నీయందు అనుగ్రహంతో నీకుముందు వెళ్ళుతున్నాడు నాయనా! పార్థా! నిరంతరం గగుర్పాటు కలిగించే ఘోరమయిన ఆ మహాయుద్ధంలో మహాధానుష్కులు, యుద్ధకుశలులు అయిన ద్రోణకర్ణ కృపాచార్యులచే రక్షితమయిన ఆ సేనను గొప్పవిలుకాడు, అనేక రూపాలు గలవాడు, ప్రకాశశీలుడు అయిన మహేశ్వరుడు తప్ప ఇంకెవరు మనస్సుతో నయినా ధ్వంసం చేయగలడు ? ఆ పరమేశ్వరుడు ముందుండగా ఆయన ఎదుట ఎవరు నిలువగలరు? ముల్లోకాల్లో కూడా ఆయనతో సమానమయిన వ్యక్తి లేడు. క్రుద్ధుడయిన ఆయన వాసన తగిలినా శత్రువులు మూర్ఛపోయి, చాలా మంది నశించగా తక్కినవారు వణికిపోతారు. నేలమీద పడతారు. ఆయనకు నమస్కారం చేస్తూ, దేవతలు దేవలోకంలో ఉంటారు. ఈలోకంలో ఆయనకు నమస్కారం చేసేమానవులు స్వర్గాన్ని జయించినవారు అవుతారు. వరదాయకుడు, రుద్రుడు, ఉమాపతి, సర్వేశ్వరుడు అయిన శివదేవుని అనన్యభావంతో ఉపాసన చేసే భక్తులు ఇహలోకంలో సుఖపడి తరువాత పరమపదాన్ని చేరుతారు. కౌంతేయా! శాంతుడు, రుద్రుడు, నీలకంఠుడు, సూక్ష్మ స్వరూపుడు లేక

ప్రకాశవంతుడు, మహా తేజస్వి, జటాధారి, భయంకరుడు, పచ్చని కన్నులుగల వాడు, కుబేరుడికి కూడా వరదాయకుడయిన శంకరునికి నమస్కరించు. యమునికి అనుకూలుడు, ఆకాశమే కేశాలు అయినవాడు, సదాచార సంపన్నుడు, సుఖదాయకుడు, కోరదగినవాడు, పచ్చని కన్నులు కలవాడు, స్థాణువు, అంతర్యామి, గోధుమ రంగు గలకేశాలు గలవాడు, బోడి అయినవాడు, సన్ననివాడు, సంసారసాగరాన్నుంచి ఉద్ధరించేవాడు, సూర్యరూపుడు, ఉత్తమ తీర్థమయినవాడు, దేవదేవుడు, అతివేగవంతుడు ఆయన. అనేక రూపాలు గలవాడు, అందరికీ ప్రియమయినవాడు, వల్కలాది దివ్యాస్త్రప్రియుడు, తలపాగ దాల్చినవాడు, చక్కని ముఖం కలవాడు, వేయి కన్నులవాడు, వర్షప్రదాత. పర్వతంపై శయనించేవాడు, పరమశాంతుడు, నారచీర దాల్చేవాడు, బంగారు ఆభరణములు గల బాహువులు కలవాడు, దీప్తిమంతుడు, ఉగ్రుడు, దిక్కులకు అధిపతి. మేఘాలకు ప్రభువు, సర్వభూతపతికి నమస్కారం. వృక్షాలకు అధిపతికి, గోవుల ప్రభువుకు నమస్కారం. వృక్షాలు చుట్టివేసిన శరీరం గలవాడు, సేనాపతి, శరీర మధ్యంలో ఉండేవాడు, స్రువంచేతిలో దాల్చినవాడు, ప్రకాశనశీలుడు, ధనుస్సు దాల్చినవాడు, భార్గవరాము డయిన వానికి నమస్కారం. అనేకరూపాలు గలవాడు, ప్రపంచప్రభువు, ముంజె గడ్డితో చేసిన కౌపీనధారి, వేలశిరస్సులు, వేలకన్నులు, వేలబాహువులు, వేల పాదాలు గల శంకరునికి నమస్సులు.

కౌంతేయా! వరదాయకుడు, భువనాధిపతి, పార్వతీపతి, వికటనయనుడు, దక్షయజ్ఞ ధ్వంసకుడు, ప్రజాపతి, తమకంలేనివాడు, భూతాధిపతి, ఎలాంటి మార్పులేని శంకరుని శరణందుము. జటాజూటధారి, శ్రేష్ఠమయిన పరిభ్రమణం గలవాడు, శ్రేష్ఠనాభితో శోభితుడు, గొప్ప దర్పంగలవాడు, ధర్మస్వరూప వృషానికి అధిపతి, వృషధ్వజుడు, శ్రేష్ఠులకన్నాశ్రేష్ఠుడు, ధర్మాత్ములలో ఉదారుడు, ఎద్దుకన్నులవంటి పెద్ద కన్నులుగలవాడు, శ్రేష్ఠాయుధం గలవాడు, శ్రేష్ఠమయిన బాణం గలవాడు, ధర్మరూపుడు, ధర్మానికి అధిపతి అయిన భగవానుని నేను శరణందుతున్నాను. అనేక బ్రహ్మాండధారణం వల్ల పెద్ద కడుపు, పెద్ద శరీరం గలవాడు, వ్యాఘ్రచర్మాన్ని వస్త్రంగా దాల్చేవాడు. లోకాధిపతి, వరప్రదుడు, శిరోజ రహితుడు, బ్రాహ్మణ హితచింతకుడు, బ్రాహ్మణ ప్రియుడు, త్రిశూలం చేత దాల్చినవాడు, వరదాయకుడు, కత్తి డాలు దాల్చినవాడు, సర్వేశ్వరుడు, పినాకమనే ధనుస్సు గలవాడు, ఖడ్గధరుడు, లోకాధిపతి, ఈశ్వరుడు, నారచీరదాల్చినవాడు, అందరికీ శరణమయిన దేవుని శరణందుతున్నాను. కుబేర మిత్రుడై దేవశ్రేష్ఠుడయిన ఆయనకు నమస్కారం. శుభవస్త్రధారి, ఉత్తమవ్రతుడు, చక్కని ధనుస్సుగలవాడు, ధనుర్ధారి, ప్రకాశ స్వరూపుడు, ధనుస్సు అంటే ఇష్టమయినవాడు, విలుకాడు, ధన్వంతరి, ధనుఃస్వరూపుడు,

ధనుర్విద్యాచార్యుడు. అయిన నీకు నమస్కారం. భయంకరయుద్ధం గలవాడు, దేవశ్రేష్ఠుడయిన దేవునికి నమస్కారం. అనేక రూపాలు గలవానికి నమస్కారం. అనేక ధనుర్ధారికి నమస్కారం. స్థాణుస్వరూపునికి నమస్సులు. తపస్వి అయిన వానికి నమస్సులు. త్రిపుర నాశకునికి నమస్కారం. భగనేత్రధ్వంసకునికి నతులు, వనస్పతుల పతికి నమస్కారం. మానవపతికి నతులు. మాతృకల అధిపతికి, గణాల అధిపతికి నమస్సులు. గోవుల అధిపతికి, యజ్ఞపతికి నిత్యం నతులు. జలాధిపతికి, దేవాధిపతికి నిత్యం నమస్కారం, పూషదంతనాశకునికి, ముక్కంటికి, వరదాయకునకు, నీల కంరునికి, పచ్చనివానికి, సువర్ణ కేశునికి నమస్సులు.

పార్థా! మేధావి అయిన మహాదేవుడు చేసిన మహత్కార్యాలను నేను విన్నవాటిని, నాకు తెలిసినవాటిని నీకు చెపుతాను. ఆ మహేశ్వరుడు కోపిస్తే దేవతలు, అసురులు, గంధర్వులు, రాక్షసులు పాతాళంలో దాక్కున్నా సుఖంగా ఉండలేరు. పూర్వకాలంలో యజమాని అయిన దక్షుడు యథావిధిగా యజ్ఞం చేస్తుండగా కుపితుడయిన ఆయన నిర్దయు డయి దాన్ని ధ్వంసం చేశాడు. ఆయన విల్లుఎక్కుపెట్టి బాణంవేసి, తీవ్రంగా గర్జించాడు. మహేశ్వరుడు కుపితుడయి యజ్ఞం ధ్వంసం చేస్తే అప్పుడు దేవతలు ఎక్కడా ఏమాత్రం శాంతిని పొందలేదు. ఆయన వింటినారి మ్రోతకు సమస్తలోకాలూ అల్లకల్లోలం అయ్యాయి. ఆయనకు వశమయ్యాయి. సురాసురులు నేల మీద పడ్డారు. సర్వ జలాలు క్షోభించాయి. భూమి వణికింది. పర్వతాలు ముక్కలయ్యాయి. దిగ్గజాలు మూర్ఛిల్లాయి. ఆయన సూర్యునితో గూడా సమస్త జ్యోతిర్మండలాల వెలుగును నాశనం చేశాడు. గాఢాంధకారం క్రమ్ముకోగా లోకాలు కన్పించలేదు. భయభీతు లయిన మహర్షులు క్షోభిల్లారు. సర్వప్రాణులకు, తమకు సుఖాన్నికోరి వారు శాంతి కర్మలు చేశారు. శంకరుడు అట్టహాసం చేస్తూ పురోడాశాన్ని భక్షిస్తున్న పూష అనే దేవత మీదికి దూకి, ఆయన పండ్లు ఊడగొట్టాడు. అప్పుడు యజ్ఞశాలనుంచి బయటకు వచ్చిన దేవతలు వణికిపోతూ ఆయనకు నమస్కరించారు. మళ్ళీ ఆయన ఆ దేవతల మీదికి పదునయిన దీపించే బాణాలను సంధించాడు. ఆబాణాలు పాగలు క్రక్కుతూ, నిప్పురవ్వలు కురిపిస్తూ మెరుపులతో గూడిన మేఘాలలాగా ఉన్నాయి. అలా తీవ్రంగా ఉన్న ఆయన్ను చూసి, దేవతలు అందరూ నమస్కరించారు. అప్పుడు రుద్రునికి విశిష్టమయిన యజ్ఞభాగాన్ని కల్పించారు. రాజా! దేవతలు భయంతో ఆయనను శరణందారు. అతికోపం శాంతించగా ఆయన ఆ యజ్ఞాన్ని పూర్తిచేశాడు. అప్పుడు పారిపోయిన ఆ దేవతలు ఇప్పటికీ ఆయన అంటే భయపడుతుంటారు.

పూర్వకాలంలో బలవంతులయిన రాక్షసులకు ఇనుముతో, వెండితో, బంగారంతో నిర్మించిన మూడు మహాపురాలు ఉండేవి. వారిలో కమలాక్షునికి బంగారుపు పట్నం, తారకాక్షునికి వెండి నగరం, మూడోవాడయిన విద్యున్మాలికి ఇనుముతో నిర్మితమయిన పురం ఉండేవి. ఇంద్రుడు సర్వాయుధాలను ఉపయోగించినా ఆ నగరాలను ఛేదించలేకపోయాడు. అప్పుడు రాక్షస బాధితులయి దేవతలు అందరూ పరమేశ్వరుని శరణుపొందారు. ఇంద్రాదు లయిన దేవతలు అందరూ ఆ పరమశివునికి ఇలా విన్నవించారు. 'త్రిపురాల్లో ఉండే ఆ రాక్షసులకు బ్రహ్మదేవుడు వరాలు ఇచ్చాడు. ఆ వరాలతో మదించి, వారు లోకాన్ని తీవ్రంగా పీడిస్తున్నారు. దేవదేవేశా! ఆ దానవులను నీవు తప్ప మరెవ్వరూ సంహరించలేరు. మహాదేవా! ఆ దేవద్వేషులను సంహరించు. భువనాధిపా! రుద్రా! ఈ అసురులను సంహరిస్తే సమస్తయజ్ఞ కర్మలలో యజ్ఞసాధనాలయిన పశువులు రుద్రభాగాలు అవుతాయి.' ఆ హరుడు అందుకు అంగీకరించి, దేవతల మేలుకోరి గంధమాధనం, వింధ్యం, అనే రెండు పర్వతాలను రథానికి రెండు ప్రక్కల ఉండే ధ్వజాలుగా చేసుకొన్నాడు. సముద్రాలు, అడవులతో గూడిన భూమిని శంకరుడు రథం చేసుకున్నాడు. త్రిలోచనుడు శ్రేషుడు అనే సర్పరాజును రథానికి ఇరుసును చేశాడు. దేవదేవుడు, పినాకధనువయిన దేవుడు చంద్రసూర్యులను రధానికి రెండు చక్రాలను చేసుకొన్నాడు. త్ర్యంబకుడు ఏలాపత్రపుత్రుని, పుష్పదంతుని రథం ఇరుసుకు రెండు వైపులా ఉండే రెండు చీలలను చేశాడు. మలయపర్వతాన్ని యూపంచేశాడు. తక్షకుని ఇరుసుకు కట్టే త్రాటిని చేశాడు. ప్రతాపవంతుడయిన శర్వుడు ఇతర ప్రాణులను రథాశ్వాల మెడకు కట్టే త్రాళ్లను చేశాడు. చతురుడయిన మహేశ్వరుడు నాలుగు వేదాలను నాలుగు గుర్రాలుగా చేసుకొన్నాడు. లోకత్రయాధిపతి ఉపవేదాలను కళ్ళేలు చేశాడు. గాయత్రీ సావిత్రీ ఛందస్సులను పగ్గాలుచేశాడు. ఓంకారాన్ని కమిచీకర్రగాను, బ్రహ్మను సారథిగాను, మందర పర్వతాన్ని ధనుస్సుగాను, వాసుకిని అల్లెత్రాడుగాను, విష్ణువును ఉత్తమధనుస్సు గాను, అగ్నిని బాణపుములుకుగా, వాయువును దానికి ఈకలుగా, వైవస్వతుడయిన యముని, దానికి పుంఖంగా చేశాడు. మెరుపును ఆ బాణపు పదునయిన మొనను చేశాడు. మేరు పర్వతాన్ని ధ్వజంగా చేశాడు. యోధిశ్రేష్ముడు, అసురాంతకుడు, శోభావంతుడు, సాటిలేని పరాక్రమం గల శివుడు త్రిపురనాశనానికి సర్వదేవమయమయిన ఆ రథాన్ని ఎక్కాడు. పార్థా! ఆ సమయంలో సమస్తదేవతలు, తపోధనులయిన మహర్షులు స్తోత్రం చేస్తుండగా శంకరుడు సాటిలేనిదై, దివ్యమయిన మహేశ్వర రథాన్ని నిర్మించి, దానిమీద వేయి సంవత్సరాలు స్థిరంగా ఉన్నాడు. ఆ మూడుపురాలు అంతరిక్షంలో ఒకే సమయంలో ఏకమయినప్పుడు ఆయన మూడు

కణుపులు, మూడు ములుకులు గల బాణంతో వాటిని ఛేదించాడు. ఆ సమయంలో దానవులు త్రిపురాలను కానీ, విష్ణుసోములతో గూడి, కాలాగ్ని సహితమయిన ఆ బాణాన్ని గూడా చూడలేకపోయారు.

త్రిపురాలను దగ్ధం చేసే సమయంలో ఆయనను చూడటానికి ఉమాదేవి పంచశిఖుడయిన ఒక బాలకుని ఒడిలో ఉంచుకొని వెళ్ళింది. ఉమాదేవి 'ఈయన ఎవరు' అని ఇంద్రుని గూర్చి దేవతలను అడిగింది. ఈ ప్రశ్నవల్ల అసూయాగ్రస్తుడయిన ఇంద్రుడు వజ్రాయుధంతో కొట్టబోగా, క్రుద్ధుడయిన ఆయన హస్తాన్ని వజ్రాయుధంతో గూడా పరమేశ్వరుడు నవ్వుతూ త్వరగా స్తంభింపజేశాడు. భుజం కదలకపోవటంతో దేవతా సమూహంతో కూడా ఇంద్రుడు త్వరగా అవ్యయప్రభువయిన బ్రహ్మదేవుని వద్దకు వెళ్ళాడు. వారంతా ఆయనకు నమస్కరించి, దోసిళ్ళు ఒగ్గి "దేవా! పార్వతీదేవి ఒడిలో బాలరూపం దాల్చిన అద్భుత భూతం ఏమిటి మాకు తెలియలేదు. ఎలాంటి యుద్ధంచేయకుండానే బాలుడు ఇంద్రునితో కూడా మమ్ములను లీలగా ఓడించాడు. ఆయన ఎవరో తెలుసుకోవటానికి, నిన్ను అడగటానికి వచ్చాము." అన్నారు. బ్రహ్మవేత్తలలో శ్రేష్ఠుడయిన బ్రహ్మదేవుడు వారి ఆ మాటలు విని, పరమేశ్వరుని, అమితతేజస్వి అయిన ఆ బాలుని ధ్యానించాడు. బ్రహ్మదేవుడు ఇంద్రాదులయిన దేవతలతో ఇలా అన్నాడు. 'చరాచర జగత్తుకు ప్రభువయిన ఆయన శంకరుడు, ఆ మహేశ్వరుని కన్నా పరమశ్రేష్ఠమయినది వేరొకటి లేదు. పార్వతీదేవితో గూడా ఉన్న ఆ మహాతేజోవంతుడు మీరు చూసిన ఆ బాలుడు. పార్వతీదేవి కోసం శంకరుడే బాలరూపం దాల్చాడు. కాబట్టి నేనూ మీరూ ఆయనవద్దకు వెళ్దాం. ఈ బాలుడు సర్వలోకేశ్వరుడు, ప్రభువయిన శంకరుడే. బాలసూర్యసమకాంతి గల ఆ భువనాధిపతిని ప్రజాపతులతో కూడా దేవతలు తెలుసుకోలేకపోయారు. తరువాత బ్రహ్మ అక్కడికి వచ్చి పరమేశ్వరుని చూసి, ఈయన సర్వదేవోత్తముడు అని తెలుసుకొని ఆయనకు నమస్కారం చేశాడు. బ్రహ్మ అన్నాడు - దేవా! నీవు యజ్ఞ స్వరూపుడవు ఈ ప్రపంచానికంతకు గతి, దిక్కునీవే, నీవే భవుడవు, నీవే మహాదేవుడవు. నీవే పరమధామం, నీవే పరమపదం. ఈ చరాచరమయిన జగత్తును అంతను నీవే వ్యాపించి ఉన్నావు. త్రిలోకాధీశా ! లోకేశా ! జగత్పతీ ! నీకోపంతో బాధపడుతున్న ఇంద్రుని మీద దయ చూపవలసింది."

బ్రహ్మదేవుని మాటలు విని, సంప్రీతుడయిన మహేశ్వరుడు ప్రసన్నతతో అభిముఖుడయి అట్టహాసం చేశాడు. ఈ విధంగా దేవతలు పార్వతీ పరమేశ్వరులను ప్రసన్నులను చేసుకొన్నారు. అప్పుడు ఇంద్రుని చెయ్యి యథాస్థితికి వచ్చింది. దేవశ్రేష్ఠుడు,

దక్షయాగధ్వంసకుడు, వృషభధ్వజుడయిన శంకరుడు పత్నితో గూడా వారికి ప్రసన్నుడు అయినాడు. ఆయనే రుద్రుడు, ఆయనే శివుడు, ఆయనే అగ్ని, సర్వజ్ఞుడు, ఇంద్రుడు, వాయువు, అశ్వినీ దేవతలు, మెరుపులు, సమస్తము ఆ పరమశివుడే. ఆయనే భవుడు, ఆయనే మేఘుడు, సనాతను డయిన మహాదేవుడు ఆయనయే. ఆయనే చంద్రుడు, ఈశానుడు, సూర్యుడు, వరుణుడు. ఆయనేకాలం. ఆయనే అంతంచేసే మృత్యువు. ఆయనే యముడు, రేయింబవళ్ళు ఆయనే. మాసాలు, పక్షాలు, ఋతువులు, సంధ్యలు, సంవత్సరం ఆయనయే. ఆయనే ధాత, విధాత, విశ్వస్వరూపుడు, ప్రపంచం అనే పనిని చేసేవాడు. స్వయంగా శరీర హీను డయినా ఆయన సర్వదేవతల స్వరూపాలు ధరిస్తాడు. ఆయనను సర్వదేవతలు స్తుతిస్తారు. ఆ శంకరుడే ఒక రీతిగా, అనేక విధాలుగా, నూరు రకాల, వేయి రకాల స్వరూపం దాలుస్తాడు. ఇంకా బహురూపధారి అవుతాడు. ఆయనకు ఘోర అని, శివ అని రెండు రకాల శరీరాలు ఉన్నవనీ, ఆ శరీరాలే ఇంకా అనేక రీతులుగా ఉంటాయనీ వేదవేత్తలయిన బ్రాహ్మణులు ఎరుగుదురు. **ఆ శివుని ఘోర శరీరం అగ్ని, విష్ణువు, సూర్యుడు అవుతారు. ఆయన సౌమ్య శరీరం నీరు, తేజస్సు, చంద్రుడు అవుతారు.** అంగాలు, ఉపనిషత్తులతో గూడిన వేదాలు, పురాణాలు, అధ్యాత్మ శాస్త్ర సిద్ధాంతాలు, వాటిల్లో ఉండే పరమరహస్యాలు అన్నీ భగవంతుడయిన మహేశ్వరుడే. భగవంతుడు, జన్మాదిరహితుడు అయిన మహాదేవుడు ఇటువంటివాడు. పాండునందనా! వేయి ఏండ్లు నిరంతరం అవిరామంగా ఆయన గుణాలను చెప్పినా అన్నింటినీ చెప్పలేను. శరణాగతవత్సలు డయిన మహాదేవుడు శరణందినవారిని ప్రీతుడయి గ్రహపీడితులయిన వారిని, సర్వపాపాలతో గూడినవారిని విముక్తులను చేస్తాడు. **పంప్రీతుడయిన ఆయన ఆయువును, ఆరోగ్యాన్ని, ఐశ్వర్యాన్ని, ధనాన్ని, కోరికలను పుష్కలంగా ఇస్తాడు. కోపిస్తే అన్నింటినీ ఉపసంహరిస్తాడు.** ఇంద్రాదు లయిన సర్వదేవతలయందు ఆయన ఐశ్వర్యం ఉన్నదని చెపుతారు. లోకంలో మనుష్యుల మంగళామంగళకర్మల అన్నింటి ఫలితాలను ఆయన ఇస్తాడు. సర్వకామనలకు ఈశ్వరుడు కావటం వల్ల ఆయనను ఈశ్వరుడని అంటారు. మహాభూతాలకు కూడా ఈశ్వరుడు కావటం వల్ల ఆయన మహేశ్వరుడు. ఈ సమస్త జగత్తును అనేక రూపాలతో అనేక విధాలుగా వ్యాపించి, ఉంటాడు. ఈ మహాదేవుని ముఖమే సముద్రంలో బడబా ముఖం అనే పేరుతో ప్రఖ్యాతమయి జలరూపమయిన హవిస్సును త్రాగుతుంది. ఈ దేవుడే శ్మశానాలలో నిత్యమూ ఉంటాడు. అక్కడ ఈయనను జనులు వీరస్థానేశ్వరుడు అనే పేరుతో పూజిస్తారు. ఈయనకు దీప్తిమంతాలు, ఘోరాలు అయిన అనేక రూపాలు

ఉన్నాయి. లోకంలో మానవులు వీటిని గూర్చి చెపుతారు. పూజిస్తారు. లోకంలో ఈయనకు అర్థవంతమయిన అనేక నామాలు ఉన్నాయి. అవి ఆయన మహత్తును, సర్వవ్యాపకత్వాన్ని, చేసిన కర్మలను చెపుతాయి. యజుర్వేదం ఈయనను గూర్చి ఉత్తమమయిన శతరుద్రీయాన్ని చెప్పింది. అనంత రుద్రనామంతో ఈ మహాత్ముని ఉపస్థానం చెప్పారు. దేవతలకు సంబంధించిన మానవులకు సంబంధించిన, కామనలకు ఆదేవుడే విభుడు. సమస్త విశ్వాన్ని వ్యాపించి ఉన్నాడు. కాబట్టి ఆయనను ప్రభువు అంటారు. బ్రాహ్మణులు, మునులు ఈయనను జ్యేష్ఠుడు అని చెపుతారు. దేవతలలో ఈయనే మొదటివాడు. ఈయన ముఖాన్నుంచి అగ్ని ఆవిర్భవించాడు. ఈయన పశువులను (ప్రాణులను) అన్ని రకాలుగా పాలిస్తుంటాడు. వాటితో ఆడుకొంటుంటాడు. ఆ పశువులకు అధిపతి గావటం వల్ల ఆయన్ను పశుపతి అంటారు. బ్రహ్మచర్మంతో ఈయన లింగం కూడి ఉన్నది. ఈయన లోకాలను మహిమాన్వితాలను చేస్తాడు. కాబట్టి ఈయనను మహేశ్వరుడు అంటారు. ఋషులు, దేవతలు, గంధర్వులు, అప్సరసలు ఊర్ధ్వలోకస్థితమయిన శివలింగాన్ని పూజిస్తారు. ఆ విధంగా శివలింగ పూజవలన మహేశ్వరుడు సంతోషిస్తాడు. అందువల్ల సుఖితుడు, ప్రీతుడు, హర్షితుడు, శంకరుడు అవుతాడు. భూత భవిషద్వర్తమాన కాలాల్లో ఈయనకు స్థావర జంగమాలు అయిన అనేక రూపాలు ఉన్నాయి. అందువల్ల ఈయనను బహురూపుడు అన్నారు. ఆయనకు అన్నివైపులా నేత్రాలున్నా విలక్షణమయిన అగ్ని మయనేత్రం ఒకటి ఉంది. అది ఎల్లప్పుడూ క్రోధంతో ప్రజ్వలిస్తుంటుంది. సర్వలోకాలను ఆవేశించి ఉండటం వల్ల ఆయనకు సర్వః అనే నామం ఉంది. ఆయన రూపం నలుపు, ఎరుపు కలిగి ఉండటం వల్ల ఆయనను, ధూర్జటి అని అంటారు. విశ్వేదేవులు ఆయనలో ఉండటం వల్ల విశ్వరూపుడు అంటారు. సర్వలోకేశ్వరుడయిన ఈయన ద్యులోకం, జలం, భూమి అనే ముగ్గురు దేవులను స్వంతం చేసుకొంటాడు, రక్షిస్తాడు. అందువల్ల త్ర్యంబకుడు అని అంటారు. ఈయన మానవుల క్షేమంకోరి, అన్ని పనుల్లో అన్నిపదార్థాలను పెంపొందిస్తాడు. అందువల్ల ఈయనను శివుడు అంటారు. ఈయనకు వెయ్యి కన్నులో పదివేల కన్నులో ఉన్నాయి. లేక ఆయన ఒడలంతా కన్నులే. మహత్తరమయిన విశ్వాన్ని రక్షిస్తున్నాడు. అందువల్ల మహాదేవుడు అన్నారు. పూర్వకాలంలో మహారూపంలో ఉండటం వల్ల ప్రాణుల ఉత్పత్తి స్థితులకు కారణం కావటం వల్ల, ఆయనకు లింగమయ రూపం ఎల్లప్పుడు ఉండటం వల్ల ఆయనను స్థాణువు అన్నారు. సూర్యచంద్రుల లోకంలో ప్రకాశించే వెలుగులు కేశనామం, గలిగి ముక్కంటికి ఉండటం వల్ల వ్యోమకేశుడు అన్నారు. భూతకాలంలో వర్తమానంలో, భవిష్యత్కాలంలో సమస్తజగత్తు అంతా పరమేశ్వరుడే. అందువలన ఆయనను

భూతభవ్యభవోద్భవుడు అన్నారు. కపి శబ్దం శ్రేష్ఠవాచకం. ధర్మాన్ని వృషం అని అంటారు. అందువల్ల దేవదేవుడయిన ఆ భగవంతుని వృషాకపి అని చెపుతారు. బ్రహ్మను, ఇంద్రుని, వరుణుని, యముని, కుబేరుని అణచి, వారి ఐశ్వర్యాన్ని హరిస్తాడు. అందువల్ల ఆయనను హరుడు అని అంటారు. దేవు డయిన మహేశ్వరుడు మూసిన కన్నులనుండి బలవంతంగా నుదుట నేత్రాన్ని సృష్టించాడు. అందువల్ల ఆయనను త్ర్యక్షుడు అన్నారు. ఆయన శరీరాలలోని బేసి సంఖ్యగల పంచ ప్రాణాలలో ఉంటూనే ఎప్పుడూ సమభావంతో ఉంటాడు. విషమస్థితిలో ఉండే సమస్త శరీరధారులలో ఆయన ప్రాణవాయువు, అపానవాయువుగా ఉంటాడు. ఆ మహాదేవుని విగ్రహాన్ని, శివలింగాన్ని పూజించే వారిలో శివలింగ పూజకుడు గొప్ప సంపదను పొందుతాడు. శివశరీరంలో రెండు ఊరువులకు క్రింది భాగం అగ్ని స్వరూపం, పైభాగం శివరూపం, కొంతమంది ఆయన శరీరం మొత్తంలో సగభాగం అగ్నిరూపం అని, తక్కిన సగం సోమరూపం అని చెపుతారు. తేజోవంతం, మహత్తరం, ప్రకాశవంతం అయిన ఈయన సోమరూపం దేవతలది, ప్రకాశించే ఘోర శరీరం మానవులలో అగ్నిగా చెపుతారు. ఆయన శివ రూపం జగత్తును రక్షించటంకోసం బ్రహ్మచర్యాన్ని అవలంబించి ఉంటుంది. ఘోరతరమయిన రూపంతో పరమేశ్వరుడు సర్వజగత్తును సంహరిస్తాడు. ప్రతాపవంతుడయిన ఆ దేవుడు ప్రళయకాలంలో మిక్కిలి తీక్షణంగా ఉండి, ఉగ్రరూపందాల్చి సమస్తాన్ని దహిస్తాడు. ప్రాణుల మాంసాన్ని, రక్తాన్ని, మజ్జను ఆహారం చేసుకొంటాడు. ఈ రౌద్ర భావం వల్ల ఆయనను రుద్రుడు అంటారు.

పార్థా! సంగ్రామరంగంలో నీ శత్రువులను పినాకధారియై సంహరిస్తూ నీకు దర్శనం ఇచ్చిన ఆ దేవుడు ఈ మహాదేవుడే. వెనక నీవు సైంధవుని వధిస్తానని ప్రతిజ్ఞ చేయగా నీకు స్వప్నంలో పర్వత శిఖరం మీద శ్రీకృష్ణుడు ఈయనను దర్శింపజేశాడు. పూర్వం ఈయనే, నీకు పాశుపతాదులయిన అస్త్రాలను ఇచ్చాడు. వాటితోనే నీవు కాలకేయాదులయిన దానవులను సంహరించావు. ఆ శివుడే ఇప్పుడు యుద్ధరంగంలో నీకు ముందుగా నడుస్తున్నాడు. పార్థా! దేవదేవుడయిన పరమేశ్వరుని శతరుద్రీయాన్ని నీకు వ్యాఖ్యానం చేశాను. ఇది వేద సమానం, పవిత్రం, ధనప్రదం, కీర్తి సంపాదకం, ఆయుర్వృద్ధికరం. ఇది సర్వకార్యసాధకం. పుణ్యప్రదం, సమస్త కిల్బిషనాశకం, పాపాలు అన్నింటినీ పోగొడుతుంది. సర్వదుఃఖాలను భయాలను అపహరిస్తుంది. శంకరుని బ్రహ్మ, విష్ణువు, మహేశ్వరుడు, నిర్గుణ నిరాకారుడు అనే నాలుగు రకాల స్వరూపాన్ని ప్రతిపాదించే ఈ స్తోత్రాన్ని ఎల్లప్పుడు వినేవాడు సర్వశత్రువులను జయించి రుద్రలోకంలో ప్రతిష్ఠితు డవుతాడు. పరమేశ్వరుని ఈ చరితం యుద్ధరంగంలో విజయప్రదం. శతరుద్రీయాన్ని

ఎల్లప్పుడు ఉద్యుక్తుడయి పారాయణంచేసేవాడు, వినేవాడు, మానవులలో నిరంతరం పరమశివుని భక్తిభావంతో సేవించేవాడు ఆ త్రిలోచనుడు ప్రసన్నుడు కాగా ఉత్తమమయిన సమస్త కాంక్షితాలను పొందుతాడు. పార్థా! వెళ్ళు. యుద్ధం చెయ్యి, నీకు మంత్రిగా, రక్షకుడిగా శ్రీకృష్ణుడు ప్రక్కనే ఉన్నాడు గదా! నీకు పరాజయం లేదు." సంజయుడు చెప్పాడు - "శత్రునాశకా భరత వంశశ్రేష్ఠా! యుద్ధరంగంలో వ్యాసమహర్షి అర్జునునికి ఈ విధంగా చెప్పి వచ్చిన రీతిగానే వెళ్ళాడు. రాజా! మహాబలుడు, బ్రాహ్మణుడయిన ద్రోణాచార్యుడు ఐదురోజులు ఘోరయుద్ధం చేసి, హతుడయి బ్రహ్మలోకానికి వెళ్ళాడు. వేదాన్ని చక్కగా అధ్యయనం చేసినవానికి కలిగే ఫలమే ఈ పర్వాన్ని పఠించటం వల్ల కలుగుతుంది. భయరహితులయిన క్షత్రియులకు గొప్ప యశస్సు ఇందులో వర్ణితం అయింది. ఈ ద్రోణపర్వాన్ని ప్రతిదినం చదివినా, విన్నా చేసిన మహాపాపాల నుంచి, ఘోర కర్మలనుంచి ముక్తుడవుతాడు. ఈ పర్వాన్ని నిత్యం చదివినా, విన్నా, బ్రాహ్మణునికి యజ్ఞం చేసిన ఫలం కలుగుతుంది. క్షత్రియులకు, ఘోర యుద్ధంలో ఉత్తమకీర్తి కలుగుతుంది. మిగిలిన రెండు వర్ణాల వారికి పుత్రపౌత్రులు కలుగుతారు. కోరిన కోరికలు నెరవేరుతాయి."

ఇది ద్రోణపర్వం



భారతం ఎందుకు చదవాలి ?

1. మనం భారతీయులం కనుక. భారతీయులుగా మెలగాలంటే భారతీయులుగా మిగలాలంటే భారతం చదివి తీరాలి.
2. నీవు - నేను అనే భేదం విడిచి మనం అనే భావం పెరగాలంటే... భారతం చదివి తీరాలి.
3. మనల్ని మనం చక్కగా పరిపాలించుకోవాలంటే... భారతం చదివి తీరాలి.
4. ప్రపంచంలో మన ఉనికిని నిలుపుకోవాలంటే... భారతం చదివి తీరాలి.
5. ప్రజలంతా నా బంధువులు, మిత్రులు అనే భావం పెరగాలంటే... భారతం చదివి తీరాలి.
6. దేవ, ఋషి, పితృఋణాలతో పాటు మనుష్యఋణం తీర్చుకోవాలంటే... భారతం చదివి తీరాలి.
7. పాలించడమంటే చెప్పుకిందకు తొక్కడం కాదనీ రక్షించడమనీ తెలియాలంటే... భారతం చదివి తీరాలి.
8. బుద్ధిజీవి అయిన మానవుడు వయసులో ఉన్నపుడే భారతం చదివితే ఇరవైరవై సార్లు రెండూ అందుకోగలడు. కనుక ముందుగా యువతరం భారతం చదివి తీరాలి.
9. తీవ్రబుద్ధి మనిషి మనస్సును చీలుస్తుంది - సద్బుద్ధి మనుషుల మనస్సులను బుద్ధులను కలుపుతుంది. ఆ భావన కోసం... భారతం చదివి తీరాలి.